# వాల్మీకి రామాయణోపన్యాసములు

# బాలకాండ



\- శ్రీ నండూరి సుబ్రహ్మణ్య శర్మ

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆరోగ్యాది అనేక విషయాలు తెలుసుకోండి... ఫేస్‌బుక్

Like us to follow

@mohanpublications

ఆధ్యాత్మిక గ్రంథ నిలయం

మోహన్ పబ్లికేషన్స్

కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,

రాజమహేంద్రవరం - 533101.

Acc. NO- 712

# శ్రీమద్వాల్మీకి రామాయణోపన్యాసములు

## బా ల కాం డ

గ్రంథకర్త:

నందూరు సుబ్రహ్మణ్యశర్మ

ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాలశాఖవారి ధనసహాయముతో కూడా ముద్రించబడినది.

ఆత్మవిజ్ఞాన గ్రంథమాల
శివాలయంవీధి * సత్యనారాయణపురం
విజయవాడ-11.

# విషయసూచిక

పేజీ


| | |
|---|---|
| ఉపోద్ఘాతము | 1 |
| వాల్మీకి బోయకాదు | 7 |
| రామావతార కారణము | 12 |
| రావణాదులు తపము గావించుట | 18 |
| రావణుని గార్హస్థ్యము | 25 |
| రావణుని దినచర్య | 27 |
| సీతాపరిత్యాగము | 29 |
| రామావతార సమాప్తి | 51 |
| రాముని మహాప్రస్థానము | 56 |
| కుశలవజననము | 61 |
| రామరాజ్యమందలి ప్రత్యేకత | 63 |
| రామాయణ మహాకావ్య ప్రాదుర్భావము | 75 |
| రామాశ్వమేధము | 111 |
| రామజనన లీలావైభవము | 118 |
| నాటి సంఘము | 125 |
| మంత్రిమండలి | 129 |
| అశ్వమేధము | 138 |
| యజ్ఞములు – వాటి అవసరము | 139 |
| పుత్రకామేష్టి | 148 |
| పాయసవిభాగము | 151 |
| భగవంతుని ఆవిర్భావము | 152 |
| తాటకవధ | 187 |
| యాగరక్షణము | 192 |
| కళ్యాణ లీలావైభవము | 243 |
| సీతాకళ్యాణము | 253 |

ఓమ్

శ్రీ మహా గణాధిపతయే నమః

శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః

శ్రీ గురుభ్యో నమః.

# శ్రీ మద్వాల్మీకి రామాయణోపన్యాసములు

## బాలకాండము

శ్లో॥ వామేన సీతాం పరిగృహ్య బాహునా
వామాంకలగ్నాం దృశి ముద్రయాన్వితం
తత్వం కరేణోపదిశంతమద్వయం
హనూమతో దాశరథిం భజేహం॥

### ఉపోద్ఘాతము

ఆర్యమహాశయులారా !

ఈ అఖండ భారత మొక పుణ్యభూమి. ఈ క్షేత్రముననే భగవానుని అవతారము లనంతములై విలసిల్లినవి. ఈ అనంత భూభాగమునందీ ఖండము మూర్ధన్యమని వ్యాసభారతి నొక్కి వక్కాణించినది.

శ్లో॥ అహో బతైషాం కిమకారి శోభనం
ప్రసన్న ఏషాంస్విదుత స్వయం హరిః
యైర్జన్మలబ్ధం నృషు భారతాజరే
ముకుందసేవోపయికం స్పృహా హి నః॥

ఈ శ్లోకము దేవతలు చేసిన గానము. వారికీ భరత ఖండమున మానవ శరీరము ధరించవలెనని కోరిక కలుగుచున్నదట. ఎందుకో। ఎందుకేమున్నది ?

భగవానుడు దర్శన మిచ్చుట ఈ ఖండము నందతి సులభమట. ఏ తపములును లేకయే భగవత్తత్త్వము నందుకొనుటకు ఇతర ఖండము లెవ్వియును సహకరించవట.

నిజమునకు భగవాను లవతరించిన దీఖండముననే కదా? పోతనవాణి ఇది

ఉ. భారతవర్ష జంతువుల భాగ్యములేమని జెప్పవచ్చునీ
భారతవర్షమందు హరిపల్మరు బుట్టుచు జీవకోటికిన్
ధీరతతోడ తత్త్వముపదేశము సేయుచు జెల్మి సేయు చు
న్నారయ బాంధవాకృతి కృతార్థుల జేయుచునుండు నెంతయున్.

అవతార సహస్రము లందెన్నికగన్న పరిపూర్ణావతారములు రెండు. అవి రామకృష్ణావతారములు. ఈ రెండు అవతారములును మానవ సమాజమున కలసి మెలసి తిరిగిన అవతారములు

మానవాళితో సుఖదుఃఖముల పంచుకొని అనుభవించినట్లనుభవించి మానవు డీవిధముగ కృతార్థుడు కావలెనని ప్రతిపాదించి ప్రదర్శించిన అవతారములివి. మన మిప్పుడందుకొనబోవునది రామతత్త్వము. దర్శింప బోవునది అవతారమును. అవతారము సగుణము. తత్త్వము నిర్గుణము

పరమార్థమున రామకృష్ణావతారములు భిన్నములుకావు. ఆ రెండు అవతారములును మానవ సమాజమున ధర్మము నుద్ధరించి స్థాపించుటకే ఆవిర్భవించినవి. ఇందొకమూర్తి కౌసల్యా నందవర్ధనుడుకాగా రెండవమూర్తి దేవకీ నందనుడయ్యెను. మొదటి యవతారమున దశరథుని తండ్రి గావించుకొని తాను దాశరధియను పేరు నొంది పితృమూర్తికి యశము నందించగా రెండవ పూర్ణావతారమున వసుదేవుని తండ్రిగా గ్రహించి వాసుదేవుడను పేర వ్యవహరింపబడెను. కాని ఒక్క విషయము మనకిక్కడ చాల ముఖ్యము.

కథాభాగమున ఆ దశరథనందన వసుదేవనందను లిద్దరును వేర్వేరు కాలముల యందే అవతరించినను ఆ విగ్రహములు రెండును వేర్వేరు వేషభాషల కలిగి యున్నను ఆ యవతారముల రెంటికిని ఆత్మభేదము లేదు. ఇదియే భారతీయ సారస్వతము చెప్పు పరమ సిద్ధాంతము అంతియేకాదు. భగవానుని దివ్యమంగళ విగ్రహములు మానవ శరీరములై కన్పట్టియు అవి అప్రాకృత శరీరములుగాని ప్రాకృతములగు భౌతిక శరీరములు కావు. అవి చిన్మయములు. ఆనందఘనములు.

ప్రాకృత జీవుల భౌతిక శరీరములు కేవలముగ వారి వారి ప్రాక్తన కర్మా ధీనములు. అవతారమూర్తుల శరీరములు స్వసంకల్ప నిర్మితములు కావుననే అప్రాకృతములు. ఇదియే జీవేశ్వరులకుగల తారతమ్యము.

భారతీయ సంస్కార రహితులకు ఆ యవతారమూర్తులును ప్రాకృతము లయ్యే కన్పట్టవచ్చును. భారతీయ సారస్వతమువారి కట్లు విపరీతమై అర్థమైనదనియే బుద్ధిమంతులు భావించుట యుక్తము. వారిని నేను మేధావంతులుకారని అనను. వారి ప్రాకృత బుద్ధి వైభవమునకొక నమస్కారము గావించి, వారికికూడ భారతీ యత కల్పింపుమని భగవానుని ప్రార్థింతును అంతియే.

ఈ చరాచర ప్రాదుర్భావమును గురించి భౌతికవాదుల దృక్పథము వేరు. భారతీయ తత్వనిపుణుల దృక్పథము వేరు.

భౌతికవాదుల దృక్పథమున వేదవాఙ్మయము మానవ నిర్మితము. కావుననే వారు వేదములు ఆర్యులచే వ్రాయబడినవని, స్వయం భువములును, పరబ్రహ్మ ప్రతిపాదకములును అగు వేదములకు దేశ కాలముల కల్పింప పాటు పడుదురు. అదియే పాశ్చాత్య చరిత్రల మహాప్రసాదము.

రామకృష్ణాద్యవతారములు ప్రాకృతములేనను భౌతికవాదులు పూర్వ జన్మ పునర్జన్మల నొప్పుకొనరు. వారొకవేళ ఒప్పుకొన్నను వారిది సిద్ధాంతము కానేరదు. స్వవచన వ్యాఘాతమగును. ఒక విధముగ రాబోవు జన్మపరంపర లున్నవనుట మూఢ విశ్వాసమనియే వారి వాదము. వారికి భగవచ్చరిత్రలును, భగవత్తత్వమును వివరించుచు వివరణములును విష వృక్షములు. భారతీయ గ్రంథములు కల్పవృక్షములై ఆ పండితమ్మన్యుల కంటబడవు. అంతమాత్రమున వారు మనకు బంధువులు కాకపోరు. కారణమేమందురా? ప్రతిపక్షము లేకున్న సిద్ధాంతమునకు బలము చిక్కదు. జగద్గురువులగు శంకరులొక మాటను చెప్పినారు.

ఆక్షేపపూర్వికాహి పరిహారోక్తిః వివక్షితే అర్థే స్థూణానిఖనన్యాయేన దృఢాం బుద్ధిం ఉత్పాదయేత్॥ అని దీని అర్థమిది.

ఆక్షేప పూర్వకముగానే విషయ నిర్ణయమును చేయవలెనట అప్పుడే విషయ మును గ్రహింతమనుకొను వాని బుద్ధికి మెరుగు వచ్చునట. మెరుగు వచ్చుటకాదు

దృఢ బుద్ధి కలుగుననినారు. దీనికి స్థూణానిఖన న్యాయమని పేరు. స్తంభమును పాతి మరల మరల కదలించి చూచి ఆ స్తంభమును గట్టిపరచుచో అది గట్టిగ నిలుచునట. గమనించితిరా? భారతీయ గ్రంధ రచనా విధానమును? బలమగు ప్రతిపక్ష వాదమును వారే నిర్ధారించి, ఖండించి, స్వసిద్ధాంతమును చెప్పుట భారతీయ శాస్త్రముల పరిపాటి. కావున ప్రాకృత పండితులుకూడ మనకు ప్రతి పక్ష బంధువులు. ప్రస్తుత విషయమేమి ?

మన అవతారమూర్తుల అప్రాకృత చరిత్రలను విషయలోలురగు భౌతిక వాదులు నమ్ము చరిత్రలతో పోల్చి, తప్పు తూకముల తూచక, తత్వదర్శులగు భారతీయ మహర్షుల వైదిక విజ్ఞాన సంపత్తినే ఆధారముగాగొని మన కధలను తూచుకొని జిజ్ఞాసువులు బాగుపడుట ఇందు ముఖ్య విషయము.

ఇవి ధర్మమాస దివసములు. మనము చెప్పుకొనదలచినది రామచరితము. కాని నేడు నేనుపన్యసించునది అనేక రామాయణములలోని సంగ్రహ కథా కథనము కాదు. నే నుపన్యసింపబోవునది వాల్మీకిమహర్షి ప్రణీతమగు రామాయణ మహాకావ్యములోని కథా విశేషమొక్కటేనని మీరు నిశ్చయించుకొనుట చాల అవసరము.

నిజమున కెందరో మహర్షులు రామకథను తెలిపినారు. "అస్తునామ". నేను మాత్రము వాల్మీకినేయనుసరింతునుగాని అధ్యాత్మ, ఆనందరామాయణాది చరిత్రలకు ప్రాధాన్యత నివ్వను. అవి ఆర్షములు కావనికాదు. అవి కల్పాంతర కథలు కావచ్చును. వాల్మీకి ప్రణీతము మహాకావ్యము. కావ్య వాఙ్మయ సృష్టికి మొదలిదియే.

వాల్మీకి మహర్షికి ముందు కావ్య నిర్మాణము గావించిన వారెవ్వరును లేరు. ప్రతి కల్పాదియందును కావ్యవాఙ్మయ ప్రారంభమిట్లే జరుగుచుండును. ప్రతికల్పమునందును రామచరిత్రలు వచ్చుచుండును. కృష్ణ చరిత్రలును అంతియే. అవతారములన్నియు అంతియే.

సృష్టి అనాది. ఉదయ కల్పమున సృష్టి ప్రారంభమగును. క్షయకల్పమున లయమగును. ఉదయకల్ప క్షయ కల్పములు సృష్టికర్తయగు చతుర్ముఖునకు రాత్రింబవళ్లని వేదము చెప్పినది. ఎందరో చతుర్ముఖ బ్రహ్మలీ సృష్టి కార్యమును నెరవేర్చి తమ తరువాతవచ్చు సృష్టికర్తకు తమ రికార్డును అందించుచుందురు.

పూర్వసృష్టివలెనే తరువాత సృష్టియు జరుగును. "ధాతాయథా పూర్వమ కల్పయత్" అని యున్నది.

చతుర్ముఖునకు ఆయుర్దాయము పరిపూర్ణముకాగా వచ్చునది బ్రహ్మ ప్రళయము. ఈ సిద్ధాంతము భౌతికవాదు లందుకొనునదికాదు. ఇది సనాతన భారతీయ సిద్ధాంతము. గీతా శాస్త్రము చెప్పినదీ సిద్ధాంతమునే. రామాయణమును ఈ సిద్ధాంతమునే సిద్ధాంతీకరించును. వాల్మీకి మహర్షి చెప్పునది ఆయన స్వంతము కాదు. వేద విజ్ఞానమునే తన మధుర వాక్కులతో విస్తరించినారు. రామాయణము వేదోపబృంహణము.

ప్రస్తుత విషయము—

మన కల్పమునందలి మన ఆదికావ్యము వాల్మీకి మహర్షిచే ఇరువదినాలుగు వేల శ్లోకములతో విస్తరిల్లినవి.

మన మహాకావ్యము గాయత్రీ మహా మంత్రార్థ ప్రతిపాదకము. గాయత్రీ మంత్రము ఇరువదినాలుగక్షరముల మంత్రము, మన ఇరువదినాలుగు వేల శ్లోకములును ఆ యక్షర సంఖ్యనే అనుసరించినది.

గాయత్రీ మహామంత్రము ఛందోమయము, ప్రణవార్థ విస్తారము అది ఉపాసనా కాండమున ఉపాస్యము. జ్ఞాన కాండమున విమర్శనీయము. తత్త్వమస్యాది మహా వాక్యముల విస్తారము. వేదములయొక్క పూర్వోత్తర భాగద్వయము.

నేను మీకిప్పుడు ఇరువదినాలుగు వేల శ్లోకములను ప్రతిపదార్థముగ చెప్పుట లేదు. ప్రతి శ్లోకమును చదువుటలేదు. ఈ కావ్య మహార్ణవ మధ్యమున నాకు దొరికిన కొన్ని శ్లోకరత్నములనే మీ ముందుంచి రామ కథా మృతమును రుచి చూపింతును.

మన జీవితముల నుద్ధరించదలచిన లేక మన జీవితముల సరిదిద్దదలచిన కాక మనలను మానవత్వమునుండి దైవత్వమునకు పంపి, జనన మరణ ప్రవాహ పతిత సముద్ధరణమును చేయదలచిన వాల్మీకి మహర్షివారి విశాలహృదయమును మీకు తేటతెల్లముగ తెలుపుటే నా యుపన్యాసములకు లక్ష్యము.

కేవల కథా కథనమునకే స్థానము నిచ్చుట నా లక్ష్యముకాదు అయ్యును కథా వస్తువును నేను సంపూర్ణముగ వదలను. కథను వరుసగనే అనుసరింతును.

కథను చెప్పుచు కథాసారమును మీ ముందుంతును. వాల్మీకి కథకే స్థానమని చెప్పితినిగదా ?

నాగరికతా ప్రపంచము మానవ బుద్ధివికాసముచే క్రమాభివృద్ధి నొందినదను వారి వితండవాదములకు గురియై తమ ఆధ్యాత్మిక జీవితమును వ్యర్థము కావించు కొనువారికి కనువిప్పు కలిగించి, వారి సంశయములను విరుద్ధ తర్కమున లేక వేదశాస్త్ర విహిత తర్కమున తీర్చుటకే ఈ నా ముఖ్యమగు ప్రయత్నము.

పరమ పావనములగు భారతీయ పురాణేతిహాసముల యందలి చరిత్రలు చలనచిత్రములకు గురియై చూపరుల ముగ్ధ హృదయముల పరిణమింప జేయు చున్నవి. చిత్ర నిర్మాతల హృదయములు కేవల లక్ష్మీకటాక్షములకై ప్రాకు లాడగా ఆ నిర్మాతలకు కవితల నందించువారు మన చరిత్రలను పాశ్చాత్య చరిత్రలకు సరియగునట్లు తీర్చి దిద్దిగాని లేక సమాజ పరిణామ మిట్లుండిన బాగుండునని తమ తమ తాత్కాలిక హృదయ కల్పితముల గావించిగాని వ్రాయుట జరుగుచున్నది. నేటి చలనచిత్ర చరిత్రల కాధారములు యథార్థములగు ఇతిహాసములు కావు, ఇతిహాస కథలను మార్చి, కూర్చిన, చేర్పులతో సంస్కృత భాషానభిజ్ఞుల పాండితీ ప్రకర్షలు. ముందు ముందు మీకెన్నియో ఉదాహరణల విచ్చెదను. ప్రస్తుతమునందు మనకు ముఖ్యాతి ముఖ్యమగు చరిత్రనే మీ ముందుం చెదను. అది వాల్మీకి జీవిత చరిత్రము.

నేడు మన భారతీయ మహర్షుల పుట్టుకలను గురించి చాల అపప్రథలున్నవి. అవి భారతీయ చరిత్రలను అర్థము చేసికొనలేనివారి విజ్ఞానకోశములోనివి.

వాల్మీకిమహర్షి బోయజాతికి చెందినవారను అపప్రథ యొకటున్నది ముందుగ మీకు గ్రంథకర్త చరిత్రను చెప్పక గ్రంథ వైశిష్ట్యమును చెప్పుట కుద్యుక్తుడనగుచో గ్రంథమునందలి విషయ ప్రభావము మీయందు ప్రభావితము కాదు. కావున ముందుగ వాల్మీకి మహర్షివారి జీవితమును తీసికొందము.

## వాల్మీకి బోయకాదు

వాల్మీకి ఒక మహర్షి. అతడు ప్రచేతసుడను భృగు వంశీకుని పుత్రులలో పదియవ పుత్రుడు. ఈ మహర్షి ఎవడో మనకుత్తర కాండమున తెలియును తన వంశమును ఆ మహర్షి ఉత్తర కాండమున తెలుపుకొనినారు

సీతాకాంత వాల్మీకి మహర్షివారి ఆశ్రమముననే కుశలవులను ప్రసవించినది. ఆ కుశలవులను వెంటనిడుకొని, మహర్షి రామాశ్వమేధమునకు వచ్చి సీతారాములకు అనుసంధానము గావింప యత్నించినప్పుడు చెప్పిన మాట ఇది.

ప్రచేతసోహం దశమః పుత్రో రాఘవనందన
న స్మరామ్యనృతం వాక్యం ఇమౌ తు తవ పుత్రకౌ.

రామా ! నేను ప్రచేతసునకు పదియవ పుత్రుడను. అబద్ధమును ఆడువాడనుకాను. ఆడుటకాదు. నా మనసునందైన స్మరియింపను. ఇరుగో ఈ కుశలవులు నీ పుత్రులు అనినారు. అంతతో ఊరుకొనలేదు. నేనీ విషయము నందబద్ధ మాడుచో కొన్నివేల సంవత్సరములనుండి గావించిన నా తపము వ్యర్థము కాగలదు సీతను పరిగ్రహింపుమనినారు. ఇప్పుడేమి తేలినది ? వాల్మీకి ప్రచేతసుడను మహర్షి పుత్రుడని తేలినది. కావుననే ఆయనకు ప్రాచేతసుడని పేరు.

"వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా"

వేదము, రామాయణమను పేర ప్రాచేతసుని ముఖమునుండి వెలువడినదని మీరు చదువుదురు. అంతేకాదు వేదము రామాయణము. రాముడు వేదవేద్యుడు. వేదవేద్యుడే దశరథ పుత్రుడయ్యెననికూడ రామాయణ ప్రారంభమున మీరు చదువుదురు

"వేద వేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా.

ఈతడెంత తపస్వియోకూడ ఉత్తరకాండ యందున్నది. కొన్ని వేల సంవత్సరములాతడు తపస్సును చేసినాడు "బహువర్ష సహస్రాణి తపశ్చర్యా మయా కృతా" రామాయణమును వినుటకు ముందు మీరేమి తేల్చుకొనవలెను ? వాల్మీకి బోయవాడు కాదు. ఇతడు మహర్షి. అని తేల్చుకొని అతని కావ్యమును వినవలెను. మరి వాల్మీకియని పేరెట్లు వచ్చినది? అందునా? చెప్పెదను.

వాల్మీకి మహర్షివారి జన్మనామము "ఋక్షుడు" అతడు మహాతపస్వియై తపము గావించుచుండగా శరీరముపైన పుట్ట బట్టినది. తన స్థూల శరీరము నాతడు మరచినాడు. కాలముగడచినది కొన్ని వేల సంవత్సరముల దీర్ఘ కాలమది.

అప్పటికిని అతడు సమాధి నిష్ఠుడయ్యేయుండెను. ఆ మహనీయుని తపము పరిపక్వతనొందినది. వరుణదేవుడప్పుడాతని తపమునకు మెచ్చి వర్షధారల కురిపింపగా ఆ పుట్ట కరిగి దివ్యతేజో విరాజితుడగు మహర్షి బహిర్గతుడయ్యెను. అందుచే ఆతడు వల్మీక ప్రభవుడై వాల్మీకియను పేర పిలువబడెను. వాల్మీకి, భార్గవుడు, ప్రాచేతసుడు, అను పేర్లు అయనయందు సార్థకములైనవి. విష్ణుపురాణమిట్లు చెప్పినది.

"ఋక్షో భూద్భార్గవస్తస్మాద్వాల్మీకి ర్యోభిధీయతే".

మన రామాయణమున బ్రహ్మదేవుడు వాల్మీకిని సంబోధించుచుగూడ వల్మీక ప్రభవునిగ సంబోధించినాడు. ఇంత మాత్రమున ఆతడు ప్రచేతసుని పుత్రుడుకాడని చెప్పకూడదు. వాల్మీకి యను పేరు అపత్యార్థమునగాక సంబంధార్థముగ చెప్పవలసిన అర్థము. అటులైన ఋక్షుడను పేరు ప్రసిద్ధమై ఎందుకు లేదు? అందురా?

ప్రతిభచే సంపాదింపబడినపేరు నామకరణమునాటి పేరును మరుగు పరచును కాక బ్రహ్మగారు ఆతని తపస్సును గౌరవించుటకే అట్లు సంబోధించినారు. ఆమహర్షి నామమే ఆతనిని తపస్వియని చెప్పుచుండగా బోయజాతివాడనుట ఎట్లు కుదురును? అంతేకాదు. మహర్షిని కావ్యమును వ్రాయమని ప్రేరేపించుచు హే! బ్రహ్మన్! అని బ్రహ్మ సంబోధించెను.

మచ్ఛందాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ.

స. 2. శ్లో. 31

మరి వాల్మీకి బోయవాడను కధ ఎక్కడిది? సప్తమహర్షులను ఆ కిరాతునకు మర అని ఉపదేశించిరి గదా? ఆకధకు గతిఏమి? ఆకథను బట్టికూడ ఆతడు బోయకాడు. ప్రచేతసుని పుత్రుడే శాపగ్రస్తుడై బ్రాహ్మణ వంశమునందు జన్మించికూడ జాతిభ్రష్టుడయ్యెను. కిరాత జాతియందు కలసెను. అడవులలో దారులు కొట్టి జీవించుచుండెను. అంతలో శాపకాలము గడవగా నారదమహర్షి మిగిలిన ఆర్ద్రతతో వచ్చి మంత్రరాజమును తలక్రిందులు గావించి ఉపదేశించెను అంతతోఆతని పూర్వజన్మయందలి పుణ్యపుంజము కూడగా జాతిభ్రష్ట దేహమును కోల్పోయి బ్రహ్మర్షియయ్యెను. ఈప్రతీతి ననుసరించినను ఈతడు కిరాతుడై రామాయణమును వ్రాయలేదు. ఇప్పటికి గ్రంధకర్త ఎవ్వరో తెలిసినది మీకు. ఇక కధకు పోదము. కాని మీ

కిప్పుడు చెప్పబోవు కథాకథనమునందొక క్రొత్తబాటను త్రొక్కినాను. నిజమున కది క్రొత్తకాదు, రామాయణములోని కథాభాగమును ముందు వెనకలకు సర్దుట మాత్రమే.

రామాయణమును గురించిన విమర్శన గ్రంథము లెన్నియో యున్నవి. అందుకొన్ని ప్రత్యేకపాత్ర పరిశీలనలతో సాగినవి. మరికొన్ని రామాయణ కథంతయు మనశరీరము లోపలనే యున్నదని వేదాంతమునే చెప్పుచు కథకు స్థానమును తొలగించినవి. ఇంక కొన్ని సామాజిక జీవన విశేషములకే స్థానము నిచ్చినవి.

అసలు కథకు స్థానమేలేక రాముడనగా ఆత్మ, సీత యన బుద్ధి, అనుచో కవి నేను కథను చెప్పుచుంటినని చెప్పిన మాటకు అనర్థక్యము వచ్చును. పాత్రల ఆదర్శముండదు. బ్రహ్మ చెప్పిన "కురు రామ కథాం పుణ్యాం" అను మాట వ్యర్థమగును. కావున కథకు స్థానము నివ్వవలెను. కేవలము చరిత్రయే యగుచో పరమార్థము మృగ్యమగును. కావున నేను కథావిధానమును వరుసక్రమముననే నడపుచు ఈ కావ్యమెక్కడ ఏపాత్ర ముఖమున ధర్మార్థకామమోక్షములను, చతుర్విధపురుషార్థముల నుపదేశించినదో తెలుపుచు భారతీయ సంస్కృతిని తెలిపెదను. ఈ విషయమిట్లుండ ముందుగ మీకు రామాయణ కావ్యమునందున్న ఉత్తరకాండ కథను ప్రస్తావించి, రావణాదుల జననమును తెలిపి, కుశలవుల జననమునుచెప్పి, ఆ కుశలవులు గానము గావించిన బాలకాండ కథను ప్రారంభించెదను.

ఉత్తరకాండను అనుసరించియే షట్కాండలను అర్థము చేసుకొనుట అవసరము. వాల్మీకి అట్లే చేసినారు.

ఈనాటికీ యుపన్యాసమును ముగింతును. కాని రామాయణమును గురించి ఒక శ్లోకమును వినిపించి ముగింతును. నేనిప్పుడు మీకువినిపింపబోవు శ్లోకము రామాయణ మహాకావ్యసార సంగ్రహము వినుడు. జాగరూకులై వినుడు.

"శ్రీ రామాయణ మాదికావ్యమృషిణా వాల్మీకినా నిర్మితం
వేదాంతార్థవిశారదైరనుదినం స్తుత్యం సురైరర్చితం
శ్రోతౄణామఘనాశనం సురతరోస్తుల్యం తు ముక్తిప్రదం
యే శృణ్వంతి పఠంతి రామచరితం తే యాంతి విష్ణోః పదం.

ఈరామాయణ మాదికావ్యము. వాల్మీకి మహర్షి ప్రణీతము. వేదాంతార్థమును మననముగావించి కృతార్థులైనవారును కాదనువారునుగూడ ప్రతినిత్యమును పారాయణ మునుగావింపదగు గ్రంధము. దేవతలచే పూజింపబడు మహాకావ్యము. కావచ్చును. శ్రోతలకేమి లాభమట. శ్రోతౄణాం అఘనాశనం॥ పాపరాశిని నాశనము గావించుట దీనియొక్క ప్రత్యేకతయట. మన రామాయణ కల్పవృక్షము కోరిన కోర్కెల తీర్చునట. కాని ఇక్కడొక్క విశేషమున్నది. కల్పవృక్షము కోరిన కోర్కెల తీర్చునుగాని ముక్తి నివ్వజాలదు. కావున కల్పవృక్షమునకు సమానమై మోక్షమునివ్వదగు ప్రత్యేకత కలిగినది చూచితిరా! ఎవ్వరీ రామకథను విందురో, పఠింతురో వారందరకును విష్ణుస్థానము కరతలామలకము. శాశ్వతమగు వైకుంఠము కావచ్చును లేక సర్వవ్యాపకమగు అద్వైత భావము నొందవచ్చును.

ఈనాటి నా ప్రవచన సార సంగ్రహమిదియె.

ధర్మస్య జయోస్తు
అధర్మస్య నాశోస్తు
విశ్వస్య కల్యాణమస్తు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః॥

—: o :—

ఓమ్

# రెండవరోజు

ఆర్యమహాశయులారా !

నిన్న మన రామాయణోపన్యాసములయందు ఉపోద్ఘాతము నడచినది. ఇది మహర్షి ప్రణీతమగు గ్రంథమని తెలిపినాను. వాల్మీకి బోయజాతికి చెందినవాడు కాడని స్పష్టపరచినాను. నేడు భగవంతుని అవతార కారణమును చెప్పదలచినాను. కాని తానీ భూఖండమునందెందుకు అవతరించునో ఆయనయే చెప్పినాడు.

శ్లో॥ పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.

సాధు పరిత్రాణమున కాతడవతరించునట. దుష్టుల నాశముగావించుటకూడ ఆతని కార్యమేనట. మూడవది ధర్మసంస్థాపనయట. కాని ఈ మూడును వేర్వేరు కార్యములా? అనునది ప్రశ్న. అ మూడును వేర్వేరు కార్యములు కావు. శిష్టుల రక్షించుటకు దుష్టుల సంహరింపక తప్పదు. ఆ రెండు కార్యముల ఫలమే ధర్మ సంస్థాపనము. మరి ఇక్కడ శిష్టు లెవ్వరు? దుష్టు లెవ్వరు? ధర్మమేది? అను నవి ముఖ్యమగు ప్రశ్నలు. శిష్టులను పదము భగవంతుడు వాడిన సాధు పదమునకు పర్యాయ పదము. శిష్ట రక్షణ మన్నను సాధు పరిత్రాణ మన్నను ఒకే అర్థము. భగవంతుని దృక్పథమున ధర్మనిర్వాహకులు సాధువులు. వారి పరిత్రాణము ధర్మ పరిత్రాణము. మరి ధర్మమేది? ధర్మ స్వరూపము తేలిన గదా ? అతని అవతార ప్రయోజనము సమన్వయమగుట.

భారతీయ సిద్ధాంతమున వేద శాస్త్రములు నిర్ణయించునది ధర్మము. వేద శాస్త్రములు నిషేధించు కార్యము అధర్మము. ధర్మాధర్మములు సమాజ నిర్మితములు కావు. చాలామంది ఒప్పినది ధర్మముకాదు. కొందరు ఒప్పనిది అధర్మముకూడ కాదు. కావున ధర్మము సమాజ నిర్మితముకాదు. సమాజ నిష్ఠమును కాదు. కాకూడదు కూడ. వేద శాస్త్ర సమ్మతమై శిష్టులు ఒప్పినదై ధర్మముండవలెను. ఇట్టి ధర్మమును స్థాపించుటకే భగవంతుడు అవతరించును.

వేద శాస్త్రములు ముఖ్యములగు రెండు ధర్మములను మానవ సమాజమున కంతకును శాసించినవి. ఒకరి సొమ్మును వేరొకరు బలాత్కారముగ పరిగ్రహించుటను మొదటగ నిషేధించినది శాస్త్రము. అట్లే ఒకరి భార్యను వేరొకడు అనుభవింపచూచుటనుకూడ నిషేధించినది. సామాన్యముగ విచారించుచో ఈ రెండు దోషములును లేనివాడు మానవాకృతి యందున్న పరమేశ్వరుడేనని వర్ణించినదొక సూక్తి. ఇట్టి శాసనము మానవ సమాజమే తనతోటి మానవునకు తార్కికముగ చెప్పుచో మేధాశాలి యొకడు, స్త్రీ రత్నము అందరి సొత్తు గావున ప్రకృతి సౌందర్యమును ఒలికించు ఒక సుందరాంగి ఏ ఒక్కని సొత్తో అయియుండుట ధర్మమవి నేను ఒప్పను. అని అతడొక నవసమాజమును నిర్మించును. అతడు చెప్పునది తర్కము కాకపోవుటెట్లు ? అందము నందరును అనుభవించవలసినదే.

అట్లే భగవంతుడు సృష్టించిన లేక ప్రకృతి అందించిన భూభాగము నొక్కడే ఏల ఏలవలెను? సమాజమున కంతకును సమాన హక్కు కలదే ఈ భూభాగమని ఒకడు తర్కించును. ఇదియు తర్కము కాకపోదు. నిజముగ విచారించుచో తర్కమునకు సరిహద్దు లేదు. వేదశాస్త్రములే తర్కమునకు హద్దును ఏర్పరచినవి. ఇదియే భారతీయత. మనమిక ప్రకృతము ననుసరింతము. రామావతార కారణమును చెప్పెదను.

## రా మా వ తా ర కా ర ణ ము

సృష్టి క్రమము విస్తరించుటకు ప్రజాపతులు చాల ముఖ్యము. కశ్యప ప్రజాపతి, కర్దమ ప్రజాపతి మొదలగు వారీ భాగములోనివారె. వీరు బ్రహ్మమానస పుత్రులు. ఈ సంతతిలోనివాడే పులస్త్యుడను బ్రహ్మర్షికూడ. ఈతని తోడనే పౌలస్త్యవంశము ప్రారంభమైనది. ఈ పులస్త్యుని పుత్రుడు పౌలస్త్యుడు కావచ్చును. కాని ఈ పులస్త్యునకు విశ్రవసుడను మహర్షి తృణబిందువను రాజర్షి పుత్రికయందు జన్మించినాడు. ఈ విశ్రవసుని సంతతిలోనివారే మన రామాయణ మహాకావ్యమున రామునకు ప్రతివీరుడై నిలిచిన రావణాసురుడును, కుంభకర్ణాదులుకూడ. వీరి చరిత్రను ముందుగ మీకు సమగ్రముగ చెప్పెదను.

## రావణాదుల జననము

అది మేరుపర్వత ప్రాంత భాగమునందున్న తృణబిందువను రాజర్షి ఆశ్రమము. పులస్త్యుడు మహాముని యై ఇంద్రియముల నిగ్రహించి, వేదాధ్యయనము గావించుకొనుచు తపము గావించుకొనుచుండెను ఆ యాశ్రమమున. వసంతము మూర్తీభవించిన ఆశ్రమమది. కావున దేవకన్యలును గంధర్వకన్యలునుగూడ ఆశ్రమాభ్యంతరమున గానముల గావించుచు చరించుట సహజమైయుండ పులస్త్యునకు వారి సంచారము ప్రతిబంధకమైనది. ఆతని ఏకాగ్రతకు వారి చర్యలు ప్రతిబంధకములుకాగా ఏ స్త్రీ ఈ యాశ్రమమున నా కంటబడునో ఆ స్త్రీ గర్భవతి యగునని శపించినాడు. ఆ శాప విషయము నెరింగిన దేవకన్యకలు మొదలగువారు నాటి నుండియు ఆ యాశ్రమంబున ప్రవేశించుటలేదు.

దైవగతులు చిత్రములైనవి. సృష్టి రహస్యము లెవ్వరును తెలుసుకొనలేరు. తృణబిందువను రాజర్షి పుత్రికకు ఆ ముని శాపము సంగతి తెలియదు. దైవికముగ ఒకనాడు ఆ కన్యక పులస్త్యుని కంటబడినది. ఆ క్షణముననే ఆ కన్యకు గర్భ చిహ్నము లేర్పడినవి. ఆ కన్య తండ్రి కెదురుగ నిలుచుటకు సిగ్గుగొన్నను పితృమూర్తికి తెలియకుండ ఆమె ఎట్లు చరించును? అది జరుగని పని.

తండ్రి కంట బడినది. నిజవృత్తాంతము రాజర్షి తన తపః ప్రభావమున తెలుసుకొనినాడు.

ఆతడు వెంటనే తన కన్యకను వెంటనిడుకొని పులస్త్యుని ఆశ్రమమునకేగి ఆమునిచంద్రుని పూజించి తన కన్యకనిచ్చి పెండ్లిచేసినాడు. ఆమెరాజపుత్రికయైనను వినయవిధేయతలతో ఆమునికి సేవచేయగా ఆముని నీ గర్భమునందు సత్పుత్రుడు కలుగునని వరమిచ్చినాడు. మాతృపితృవంశముల నుద్ధరింపగల పుత్రుడు జన్మించినాడు తృణబిందుని పుత్రికకు. అతడే విశ్రవసుడు. పులస్త్యుడు వేదములను పఠించుచుండగా అధ్వని విని ఆ రాజకన్యక గర్భవతి యగుటచే ఆమెకు జనించిన ఈ పుత్రునకు విశ్రవసుడని పేరు వచ్చినది. ఈ విశ్రవసుడును మహాతపస్వియే. పులస్త్యునకు తీసిపోని తపమును గావించుచు ధర్మనిష్ఠుడై యుండెను.

భరద్వాజుడను మునిచంద్రుని పుత్రిక దేవవర్ణిని. భరద్వాజ మునీంద్రుడు తన పుత్రికయగు దేవవర్ణిని విశ్రవసునకిచ్చి వివాహము గావింపగా ఆమెయందు కుబేరుడు పుట్టెను. ఈకుబేరునకు వైశ్రవణుడనికూడ పేరు.

పౌలస్త్యవంశము ఇంతవరకిట్లు కొనసాగినది. కుబేరుడను వేయి సంవత్సరములు తపస్సునుచేసి చతుర్ముఖుని వలన వరముల సంపాదించినాడు. ఆవరప్రసాదముచే కుబేరుడు దిక్పాలకులయందొకడై ఉత్తరదిక్కున కధిపతియయ్యెను. అంతియేకాదు. బ్రహ్మదేవుడీతనికొక దివ్యవిమానమునుకూడ నిచ్చినాడు. దిక్పాలకత్వమును, ఈ విమానమునుగూడ కుబేరుని స్వార్జితములు. కాని బ్రహ్మ ఈతడెక్కడ నివసించవలెనో చెప్పలేదు. కుబేరునకిప్పుడు దిక్పాలకత్వము వచ్చినను, విహారమునకు విమానము దైవదత్తమై ప్రాప్తించినను రాజధానికి నగరము విర్ణయము కాలేదు.

కుబేరుడు తండ్రివద్ద కేగినాడు. తన తపఃప్రభావ సంపన్నత్వమును తెలిపినాడు. అంతతో విశ్రవసునకు చాల సంతోషము కలిగినది. తండ్రీ! నాకు సర్వకాలముల యందును సుఖప్రాప్తి కలుగునట్టి నివాసస్థానమును ప్రసాదింపుడని తండ్రిని కోరినాడు. అప్పుడు విశ్రవో బ్రహ్మదృష్ఠమున లంకానగరము సాక్షాత్కరించినది. ఆనగరమునే తన పుత్రునకు రాజధానిగ నిచ్చినాడు. ప్రస్తుతమున లంకానగరము కుబేరుని నివాసస్థానము.

ఈ విశాల విశ్వంభరావలయమున లంకాపురికొక ప్రత్యేకత యున్నది. లంకానగర మొకప్పుడు విశ్వకర్మనిర్మితమైన మహానగరము. ఈనగరమొక కాలమున దేవతల స్వాధీనమునందే యున్నను మరియొక కాలమున రాక్షసాక్రాంతమైనది. మరల శ్రీమహావిష్ణువు ఆరాక్షసుల జయించి దేవతలకు స్వాధీనము కావించినాడు. ప్రస్తుతమున కుబేరున కొసంగినకాలము దేవతలకు శ్రీమహావిష్ణువు స్వాధీనము గావించిన కాలము. ఇప్పుడా రాక్షసులెక్కడుండిరి. వారిప్పుడు పాతాళమునందుండినారు.

ఇక రావణుడు లంకేశ్వరుడెట్లయ్యెనో చెప్పెదను.

కాలమెప్పుడును ఒక్కతీరున నడవదు, అది చక్రము. ఆ చక్రభ్రమణమునకు ఆగుటయనునది లేదు. కాలము జీవుల కర్మఫలముల పరిపక్వము గావింపుచు తనతో వారినికూడ త్రిప్పుచుండును.

లక్ష్మికి నివాసస్థానమెక్కడను శాశ్వతమైలేదు. లక్ష్మికి పుట్టినిల్లు కమలము. ఆకమలమునందే ఉదయభానునితో కమలమున నిల్చి చూచువారలకు తన సౌభాగ్యమును ప్రకటించి, సూర్యుడస్తమించుట తడవుగా ఆకమలమునుండి వెడలిపోవును.

కుబేరుడు లంకానగరమును రాజధాని గావించుకొని, సూర్యతేజమున వెలుగొందు విమానమున వైహాయసగతుల గావించుచు కాలమును గడుపుచుండెను.

ఒకనాడు వైశ్రవణుడు తన తండ్రియగు విశ్రవసుని దర్శింప నిశ్చయించినాడు. తన తండ్రిని చూచుటకై విమానము నధిష్ఠించియే భూభాగమున కేతెంచుచున్న సమయమది.

పాతాళమున నివసించు రాక్షససమూహమంతకును నేటికి లంకపై అధికారము మనకు లేకున్నను ఏనాటికైన మనమీ లంకను ఆక్రమింపకపోమను ఒక నిశ్చయజ్ఞానము లేకపోలేదు. కాలమునకు కట్టుబడి పాతాళమున వసించు రాక్షసుల యందు సుమాలియొకడు. కుబేరుడు పయనించిననాడే అతడును ఈభూలోకమునకు పయనమగుట జరిగినది. ఇది కుబేరుని లంకాపుర సామ్రాజ్యపతన సమయమనక తప్పదు.

సుమాలి పుష్పకవిమానారూఢుడై ఆతని దేహకాంతి దివ్యతేజమున వెలుగుచుండగా కుబేరుడు పయనించుటను చూచినాడు. సుమాలి మనసొక్కమారు చలించినది. కుబేరుని శరీరకాంతి సుమాలిని ముగ్ధుని గావింపగా ఆతని శరీర కాంతిని ఇనుమడింపజేయు పుష్పకవిమాన మాతనిని మరింత చకితుని గావించినది. ఈతనికి ఇటువంటి దివ్యదేహమునందించిన తండ్రి ఎవరనిపించినది.

జీవగతి చాల చిత్రమైనది. భ్రాంతి మూలకమే జీవతత్త్వము. దేవతిర్యగాది శరీరముల ధరించి ఆయా శరీరముల వైశిష్ట్యములకు గురియై, ఆయా శరీరముల ధరించుచు లోకాలోకముల చరించుట జీవత్వము. పిపీలికాది బ్రహ్మ పర్యంతమును ఇంతియే.

సుమాలి ఈ విమానారూఢుడై వెళ్ళునట్టి పురుషుడొకడు మన రాక్షసజాతి యందుండిన బాగుగదా! అనుకొనినాడు.

జీవునకు దేహాభిమానము వంటిదే జాత్యభిమానముకూడ.

జాతిగరిమకు బీజము చాల ముఖ్యము. క్షేత్రమును అట్టిదే. కాని బీజమునకు ప్రాధాన్యత నివ్వక తప్పదు.

ప్రస్తుతమున కుబేరుని తండ్రి సుమాలి దృక్పథమున నిలిచినాడు. ఈ విశ్రవసుడే బీజప్రదాతయగుచో ఈ కుబేరునివంటివాడొకడు మన రాక్షసజాతికి అలం

కారమై రాగలడనుకొనినాడు. అనుకొనుటకాదు. నిశ్చయించుకొని కంకణమును కట్టుకొనినాడు. ఇక కావలసినది క్షేత్రము.

సుమాలికి కైకసియను పుత్రిక కలదు. క్షేత్రమునకు తన పుత్రికయే కలద నుకొనినాడు. కైకసిని విశ్రవసునకిచ్చి వివాహము గావింప నిశ్చయించినాడు. మరి కైకసి నొప్పింపవలెనుగదా? సుమాలి పాతాళమున కేగినాడు. పుత్రికను విశ్ర వసుని వలన సంతానము కనుటకు ఒప్పించినాడు.

అది విశ్రవసుని ఆశ్రమము. సూర్యుడస్తాద్రి కేగు సమయముకూడ. కావున అది సంధ్యాకాలము.

సాంధ్యకృత్యములు వైదికశాసనములు. ఈశాసనములోకకాలమున వెలువడి నవి కావు.

విశ్రవస మహర్షికి అప్పుడే సాంధ్యకృత్యము తీరినది.

దైవఘటనలతిచిత్రములైనవి. కర్మవిపాకము నెవ్వరును ఊహింపజాలరు. 'గహనాకర్మణో గతి:' అనినాడు భగవానులే.

ప్రతి వ్యక్తికిని తానొక మహోన్నత పదవి నధిష్ఠింపవలెనని యుండుట ప్రకృతి సిద్ధము. కాని ప్రతివారి కోరికయు ఫలించుట కేమికావలెనను నదియే వివాదాంశము. నేటి భౌతిక వాదు లిక్కడనే తమ బుద్ధి వైభవమును కోల్పోయియు కోల్పోవుటను గుర్తించుట లేదు.

సత్సంతానమును బడయుటకు ఒక నిర్మాణ కార్యక్రమమును భారతీయత నిర్ణయించినది. అది వేదోక్తము కావలెనన్నది. బీజమొక్కటియే మొలకకు ప్రధా నము కాదన్నది. క్షేత్రముకూడ ఒక వైలక్షణ్యము కలిగియుండవలెనన్నది. క్షేత్రము నందుంచదగు బీజా వాపనకొక కాలముకావలెనన్నది. (సుముహూర్తమని దానికే పేరు.) సత్సంతానమును. బడయుటకు క్షేత్ర పారిశుద్ధ్య మక్కరలేదనుకొనుట కంటె పామరత్వము వేరొకటి లేదు. సుమాలి కోరుకొన్న కోరిక ఎట్లు పరిణ మించినదో కథను వినుడు.

సుమాలి పుత్రికయగు కైకసికి సంధ్యాకాలమున కామ మంకురించినది. నిజమున కది సత్సంతానము నొందదలచినవా రనుభవింప దగిన కామానుభవ కాలమదికాదు. అది శాస్త్రము నిషేధించిన కాలము. ఆ కాలమున గర్భోత్పత్తి యగుచో పుట్టువారు రాక్షస ప్రకృతికలవారని శాస్త్రము ఘోషించినది.

కైకసి విశ్రవో బ్రహ్మ ఆశ్రమమున కేగినది. ఆ మహనీయుడప్పుడే సంధ్యను ముగించి అగ్నిని వ్రేల్చుటకై అగ్నిహోత్ర గృహమున ప్రవేశించినాడు. కైకసి సరాసరిగ వెళ్లి ఆ ముని ముంగట నిలిచినది. ఆ ప్రజాపతి పుత్రుడామెను చూచినాడు. తలవంచుకొని కాలిబొటన వ్రేలితో నేలను గీటుచు, విలాసవతియై తన ఎదుట నిలిచిన ఆ యౌవనవతిని పలకరించినాడు. ఆతడుదార హృదయుడయ్యే పలకరించినాడు. నీ వెవ్వతవు? నీ తండ్రి ఎవరు ? నీవే కార్యమును కోరి ఇచ్చటికి వచ్చితివి? అని-

కైకసి ఏమి చెప్పును? లజ్జావనత వదనయై, దోసిలి యొగ్గి సుమాలి నా తండ్రి పంపగా వచ్చితినన్నది. తన పేరు కైకసియని చెప్పినది. మిగిలిన విషయమును మహాత్ములగు మీకే వదలితినన్నది.

విశ్రవసు దొక్క క్షణకాలము ధ్యాన గతుడయ్యెను. రాబోవు కాలము వారికి కరతలా మలకము. వెంటనే కనులు తెరచి, "కళ్యాణి" దారుణమగు నీ సంధ్యా సమయమున పుత్రోత్పత్తికై నా కడకు వచ్చితివి. కావున నీ గర్భమున క్రూరులగు ఇద్దరు పుత్రులును ఒక పుత్రికయు కలుగునని చెప్పినాడు

ఏ తల్లి క్రూరులను కనుటకు సహించును? కైకసి ఖిన్నురాలైనది మరల శిరము వంచి, ధర్మాత్ముడగు పుత్రునికూడ అనుగ్రహింపుడని ప్రార్థించినది. ప్రజాపతి ఆమె కోర్కెను మన్నించి, తన వంశమునకు తగిన ధర్మాత్మునిగూడ అనుగ్రహించినాడు.

మొగమున మొలకనవ్వు చిగిర్చగా కైకసి తండ్రి గృహమున కేగినది. కొంతకాలము గడచినది. రావణకుంభకర్ణులును, శూర్పనఖయు కైకసి గర్భము నుండి వెలువడినారు. రావణుడు పది తలలతోడనే పుట్టినాడు. కుంభకర్ణుడు అతి దీర్ఘకాయుడు. అతని కాయము లోకోత్తరము శూర్పనఖ వికృత రూపిణియయ్యే జన్మించినది. వీరి జన్మములు మాతృ దోషముచే కలిగినవి. తరువాతివాడు విభీషణుడు. ఇతడు ధర్మాత్ముడు.

రావణకుంభకర్ణు లతిబలవంతులు. దుండగులు. లోకకంటకులు. కుంభకర్ణుడు మహాతామసి. మహర్షుల శరీరము లాతని కాహారము. ఇంతవరకు రావణకుంభకర్ణులకు పుట్టుకతోడ కలిగిన బలమేగాని వారి బలమునకొక ప్రత్యేకత కలుగలేదు. రావణుడిక మనకు కథానాయకుడు కావలెను.

సుమాలి కోరుకొన్న కుబేరునివంటి శరీరకాంతిగల వాడొకడు రాక్షసజాతి యందుత్పన్న మగుట జరిగినది. కాని అతని బలము లోకోత్తరము కావలెను

కుబేరు డొకనాడు పుష్పక విమానము నెక్కి తండ్రి ఆశ్రమమున కేగుచు కైకసికంట బడినాడు. వెంటనే కైకసి తన పుత్రులను పిలచి, కుబేరునిచూపి, కుబేరుని ఐశ్వర్యమువంటి ఐశ్వర్యమును మీరు మాత్రమెందుకు సంపాదింపలేరని పుత్రుల కుత్సాహమును కల్పించినది.

రావణుని బుద్ధి వైశద్యము చాల గొప్పది. అతడు తీవ్రవాదికూడ.

లోకము నందెవ్వరైనను ఎప్పుడైనను లోకోత్తరములగు బలపరాక్రమముల సంపాదింపవలెనన్న తపస్సు ఒక్కటే సాధనమని ఆనాటికే తెలియును

తపసా సాధ్యముకాని పనిలేదని భారతీయ సారస్వతము తేల్చి చెప్పినది. మోక్షమునకే తపస్సుకాదు. అభ్యుదయమును కల్పించునదికూడ తపస్సే నన్నది వేద వాఙ్మయము. వేదమున కామ్యకర్మ లెన్నియో యున్నవి.

రావణ కుంభకర్ణులు తల్లి యుద్బోధను అనుసరించినారు తపమున కేగినారు. విభీషణుడును వెళ్లినాడు.

## రావణాదులు తపము గావించుట

శ్రోతలారా :

రావణ, కుంభకర్ణ, విభీషణు లెంతకాలము తపము గావించిరో ఆ కాల మానమును మీ కిప్పుడు నేను వినిపించగా మీకాశ్చర్యము కలుగవచ్చును. మీరు విశ్వసించక పోవచ్చునుకూడ. యుగభేదముచే జీవుల శక్తి భేదముండుననునది భారతీయ శాస్త్రముల సిద్ధాంతము. రావణాదుల జననములు కృతయుగములోనివి. కావున వారి ప్రాణ శక్తులను మన మానముతో కొలుచుట యుక్తముకాదు. మన గ్రంథములు నేడు మన ఊహలకందని విషయముల నెన్నిటినో చెప్పును. అవి శ్రావ్య పాత్రములు. ఈ మాటను మీరెన్నడును మరువకూడదు. కథకు వత్తము-

రావణకుంభకర్ణులు తపస్సు గావించిన కాలము పదివేల సంవత్సరములు. విభీషణుడు తపస్సు గావించిన కాలము అయిదువేల సంవత్సరములు. చతుర్ముఖ బ్రహ్మనుగూర్చి వీరి తపస్సు సాగినది. వారి శరీరము గ్రీష్మ ఋతువునందు

పంచాగ్ని మధ్యమున గ్రుమ్మగినది. పంచాగ్నులన ఆకసమున ప్రచండ మార్తాండుడొక అగ్ని. నలుప్రక్కల నాలుగగ్నులు ప్రజ్వరిల్లగా ఆ వేడిమిని భరించి తపము గావించవలెను. అట్లే శీతాకాల వర్షాకాలములును గడచును. శీతాతపముల సహించి, ఆకలి దప్పులకోర్చి, వాయువును మాత్రమే ఆహారముగా గొని చేయు ఆ యుగ్ర రాక్షసుల తపము సత్యలోకాధిపతియగు చతుర్ముఖ బ్రహ్మను కదలించకుండునా? చతుర్ముఖుడు కదలినాడు. రావణ కుంభకర్ణుల వద్దకు వచ్చినాడు. రావణుని తప మొక ఘోరమగు తపము. రావణుడు ఒక వేయి సంవత్సరముల దీక్ష సమాప్తి కాగా తనకున్న పదితలలో ఒక తలను నరకి పూర్ణాహూతి గావించును. అట్లు తొమ్మిదివేల సంవత్సరములు గడచినవి. తొమ్మిది తలలు అగ్నికి ఆహూతియైనవి పదియవది యగు శిరము బ్రహ్మకర్పింప నిర్ణయించుకొనినాడు. అట్టి ఘట్టమున దేవతలందరును తన వెంటరాగా బ్రహ్మ సాక్షాత్కరించినాడు రావణుడెట్టి వరములకోరిన అట్టి వరములనివ్వ నిశ్చయించుకొని తన కర్ఘ్య పాద్యాదుల నొసగిస్తుతి గావించిన రావణుని వరముల కోరుకొమ్మనినాడు.

బ్రహ్మ సాక్షాత్కరించి రావణా! నీ తపమునకు మెచ్చితిని. వరమును కోరుకొమ్మని అనుజ్ఞ నివ్వగనే నాకు మరణ భయము లేకుండునట్లు వరమిమ్మని కోరినాడు

॥భగవన్ ప్రాణినాం నిత్యం నాన్యత్ర మరణాద్భయం
నాస్తి మృత్యుసమశ్శత్రురమరత్వమహం వృణే

చతుర్ముఖా! ప్రాణులకు మరణముకన్న భయహేతువు లేదు కావున మృత్యువు లేకుండునట్లు నాకు వరమిమ్మనెను. ఇట్టి వరమిచ్చుటకు బ్రహ్మకు అధికార మెక్కడిది? మరణమును తప్పించుకొనుట ఒకరిచ్చు వరముకాదు. కావున బ్రహ్మ చెప్పిన సమాధానమిది.

॥నాస్తి సర్వామరత్వం తే వరమన్యం వృణీష్వ మే.

రావణా! నీవు కోరిన వరము దుర్లభము. అది అసంభవముకూడ. వేరొక వరమును కోరుకొనుము అనినాడు

రావణు డాలోచించినాడు. లోకమున తనకంటె శత్రువు బలవంతుడగుచో తనను చంపును. తానందరికంటె బలవంతుడగుచో తనను చంపు వాడెవడు? అను బుద్ధి పొడమినది. అట్టి వరమునే కోరినాడు.

తాతా! దేవ దానవ యక్ష కిన్నర కింపురుషాది జాతులేవియును నన్ను జయింప సమర్థములు కాకుండునట్లు వరమిమ్ము అని కోరినాడు. బ్రహ్మ అట్లే వరమిచ్చినాడు. కాని రావణుని వరముల వరుసలో మనుజుని చేర్చలేదు

'తృణభూతా హి తే మన్యే ప్రాణినో మానుషాదయః.'

మనుజులు తృణప్రాయులు అని భావించుటచే మనుజులవలన భయము లేకుండునట్లు వరమడుగలేదు. ఇదియే భగవంతుని మాయా ప్రభావము.

మనుజుడెంత మేధావియైనను భగవంతుని మాయా విజృంభణను గుర్తెరుగ లేడనునది పరమ సిద్ధాంతము. "మమ మాయా దురత్యయా" అని గీతా సూక్తి.

బ్రహ్మ దగ్గర ఈ వరములను సంపాదించు సమయమున కాతడొక్క శిరము మాత్రమే కలిగియుండెను. మిగిలిన తొమ్మిది శిరములును బ్రహ్మకే సమర్పితము లయ్యెను గదా? చతుర్ముఖుడు రావణుని త్యాగమున కచ్చెరువంది తన కాహుతి గావించిన తొమ్మిది తలలనుగూడ మరల వర రూపమున సమర్పించినాడు. అంతతో అతడు మరల దశకంఠుడయ్యెను ఆదికాక బ్రహ్మగారు రావణునకు కామరూప ధరత్వమునుగూడ ప్రసాదించినారు. తరువాతివాడు విభీషణుడు. విభీషణుని వద్దకు వచ్చి రావణునివలెనే వరముల కోరుకొమ్మనినాడు. విభీషణుని లక్ష్యము వేరు. విభీషణుని వరమిది

'పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్.

తాతా! నేనెట్టి ఆపత్తు ననుభవించుచున్నను ఆకాలమునకూడ నాబుద్ధి ధర్మమునుండి చలించకుండునట్లు వరమిమ్మనినాడు.

ఆ వరముతోపాటు ప్రత్యేక శిక్షను పొందకయే బ్రహ్మాస్త్రము తనకు స్ఫురించునట్లుకూడ వరమడిగినాడు. అంతతో ఆగలేదు, ఆ రెండు వరములకంటె ఘనమగు మరియొక వరమునుకూడ కోరినాడు.

యా యా జాయతే బుద్ధిర్మే యేషు యే ష్వాశ్రమేష్విహ
సా సా భవతు ధర్మిష్ఠా తం తం ధర్మం చ పాలయే.

నాకు ఆశ్రమములు మారినను ధర్మబుద్ధి మారకూడదు. ఏ ఆశ్రమమునకు తగిన ధర్మమును ఆ యాశ్రమమునందు పరిపాలించునట్లుకూడ వరమిమ్మనినాడు, మనమొక విధముగ రావణునితో విభీషణుని తూచుచో రావణునికంటె విభీషణు

డెంతయో వెనుకబడినట్లగుపించును. తనకీ ప్రపంచము నందెదురులేని బలము నాతడు సంపాదించగా కన్నుల కగపడని ధర్మ బుద్ధిని విభీషణుడు కోరినాడు. విభీషణుని లక్ష్యమేమై యుండును? అతని లక్ష్యమిది.

'న హి ధర్మానురక్తానాం లోకే కించన దుర్లభం.'

ధర్మమునం దనురక్తికలవారికి దుర్లభమగునది ఈ లోకమునలేదట. ఇదియే భారతీయ గ్రంధములు చెప్పు నిజతత్వము. ఈ సిద్ధాంత ఫల మప్పుడే అబ్బినది విభీషణునకు.

బ్రహ్మగారు రాక్షస యోనియందు పుట్టియు ధర్మబుద్ధి కలిగినది గావున నీకు చిరంజీవిత్వముకూడ నిచ్చితినని అతని దగ్గరనుండి ప్రయాణమయ్యెను. ఇక మిగిలినవాడు కుంభకర్ణుడు. కుంభకర్ణుడన్న దేవతలకు చాల భయము. తపము గావించని కుంభకర్ణుడు ఋషులనే ఆహారముగ స్వీకరింపగా నేడాతడెట్టి వరమును కోరునోయని దేవతలు గజగజలాడి బ్రహ్మకు తమ భయమును విన్నవించుకొనినారు లోకకళ్యాణమునకై.

చతుర్ముఖునకు వరమివ్వక తప్పదు. కాని లోకకంటకులకు బలమును చేకూర్చుట తప్పు. బ్రహ్మకు నాలుగు తలలున్నవిగదా! బాగుగ ఆలోచించినాడు. సరస్వతి వైపునకు తన చూపును త్రిప్పినాడు. అంతియే అతడామెతో ఏమి చెప్పెనో ఎవ్వడెరుగును ? ప్రస్తుతమున సరస్వతి బ్రహ్మగారి ప్రక్కనలేదు. ఒక్క క్షణకాలమున కుంభకర్ణుని నాల్కపై నిలచినది. తనభర్తకంటె ముందుగనే ఆమె వెళ్లినది. ఆమె బ్రహ్మకు సహధర్మచారిణి. ఆమె వాగ్రూపిణి.

అంతలో బ్రహ్మ కుంభకర్ణుని కెదురుగ నిలిచినాడు కుంభకర్ణుని తపఃఫలమై. అతనిని కుంభకర్ణా! వరమును కోరుకొమ్మనినారు బ్రహ్మగారు.

వాగ్దేవి పలికించిన పలుకులనే ఎవ్వడైన పలుకును. పలుకవలసినదంతియే కావుననే ఆసరస్వతి పరావాగ్రూపమున ప్రేరకురాలై, వైఖరీ రూపమున బహిర్గతమగుటకు మహనీయులామె అనుగ్రహమును కోరుకొందురు

కుంభకర్ణుడు బ్రహ్మను వరము కోరినాడు. అతడు ఇంతకాలముగ తపస్సు చేసి ఏవరమును కోరదలచెనో ఆవరమునుకోరలేదు. అతడు కోరదలచినది నిర్దయ.

కోరినది నిద్దుర. ఆ నిద్రయు ఒకనాడు రెండు నాళ్లని కోరలేదు. అనేక సంవత్సరములుండునట్లు కోరినాడు.

'స్వప్తుం వర్షాణ్యనేకాని దేవ దేవ మమేప్సితం'

ఇక బ్రహ్మదేవు డాలసించలేదు. "తథాస్తు" అని తన అధికార ముద్రను వేసినాడు. కుంభకర్ణునకు వరమిచ్చినట్లయినది దేవతల కార్యము నెరవేరినది. పరిపాలకుల లోకతంత్రజ్ఞత ఇదియే.

కుంభకర్ణుడు మేల్కొనినగదా! ఋషుల భక్షించుట? ఇప్పుడా బాధ తప్పినది దేవతలకును ఋషులకును ఇతర భూతములకుకూడ.

సరస్వతి కుంభకర్ణుని విడిచిపెట్టినది. కుంభకర్ణునకు తెలివివచ్చినది. ఆతడిప్పుడేమి చేయగలడు? నాల్కకరచుకొని, ఇది దేవతల మోసమని గ్రహించినాడు.

దేవతల నిగ్రహాను గ్రహము లిట్లేయుండును. వారనుగ్రహించుచో మన బుద్ధులను క్రమమార్గము నందుండునట్లు ప్రేరేపింతురు. కాకున్న వంకరకు త్రిప్పుదురు.

కుంభకర్ణునకు పట్టిన అవస్థ అదియేగదా? మన కథా భాగమునకై కసిగన్న సంతానమునం దిద్దరు తపోబల సమన్వితులై లోకకంటకులుకాగా ఒకడు మహానుభావుడై భక్తాగ్రేసరుడయ్యెను.

రావణ కుంభకర్ణ విభీషణులు ముగ్గురును శ్లేష్మాతక వనమున నివాసము నేర్పరచుకొని సుఖజీవితమును గడపుచుండిరి.

"శ్లేష్మాతక వనం గత్వా తత్ర తే న్యవసన్ సుఖం"

మన మొక్కమారు పాతాళలోకమునకు పోదము.

లంకా సామ్రాజ్యమును కోల్పోయిన రాక్షస వర్గమంతయు అచ్చటనే యున్నది. రాక్షస జాతికి పురోగతిని కల్పింతమనుకొన్న సుమాలియు అక్కడనే యుండెను. ఇక రాక్షసజాతి సామ్రాజ్య పతాకము భూఖండమున ఎగురవలెను. ఆ కాలము వచ్చినది. దేవతలకిది కృష్ణపక్షము. రాక్షసులకిదియే శుక్లపక్షము ఒకరికి శుక్లపక్షము మరియొకరికి కృష్ణపక్షము సుఖదుఃఖములు జంటయై తిరుగుచుండుట జీవకోటి కంతకును సమానమను సిద్ధాంతమునకు పూర్వపక్షము లేదు.

సుమాలి కొందరు రాక్షసులతో భూలోకమునకు బయలుదేరినాడు. ఆతడొక ప్రత్యేకమగు లక్ష్యముతోడనే బయలుదేరినాడు. అతడిప్పుడు రావణునికి రాక్షస రాజ్యమున పట్టాభిషేకము చేయవలెను, అదియే ఆతని ప్రధాన లక్ష్యము.

ప్రహస్త, మారీచ, విరూపాక్ష, మహోదరులు సుమాలికి ముఖ్య సచివులు. వారితో కలసి బయలుదేరినాడు.

అది రావణ కుంభకర్ణ, విభీషణుల తపః ప్రభావ సంపన్నతతో తులదూగు శ్లేష్మాతక వన ప్రదేశము.

సుమాలికి రావణ కుంభకర్ణ విభీషణులు దౌహిత్రులు గదా? సుమాలి వారి ముగ్గుర తిలకించినాడు ఆ వనమునందు.

అ షడ్వర్గయందును రావణుడొక్కడే తన మనోరథమును తీర్పదగిన మనుమడు. దశగ్రీవుని గాఢాలింగనము గావించుకొని ఆతని ప్రతిభా ప్రభావముల నుగ్గడించినాడు.

రాజ్య తంత్రమున మిత్రభేద మొక సాధనము. సామదాన దండములకంటె ఇది సున్నితము.

సుమాలి ఇప్పుడు సాగించదలచినది మిత్రభేదము. కుబేరుడు రావణునకు జ్యేష్ఠ భ్రాతగదా? అతనిని ఎటులైన లంకనుండి గెంటివేయుటకు లంకకును రాక్షసులకును గల సంబంధమునంతను రావణున కెరింగించి కుబేరుని లంకనుండి వెళ్లగొట్టవలసినదిగా రావణుని ప్రేరేపించినాడు. రావణుడందుకు ఒప్పుకొనలేదు. సుమాలి ప్రయత్నము తాత్కాలికముగ వ్యర్థమైనది. అంతేకాదు రావణుని సమాధానము చాల ఘాటైౖ వినిపించినదికూడ.

'విత్తేశో గురురస్మాకం నార్హస్త్వం వక్తుమీదృశం'

కుబేరుడు మాకు గురువు. నీవు మాట్లాడదగిన మాటను మాట్లాడలేదని కూడ మందలించినాడు. సుమాలి తొణకలేదు. కాలమొకటి కలదని సుమాలికి తెలుసును, ప్రహస్తుడు చాల తెలివిగలిగిన వ్యక్తి. ఆతనిని రావణుని దగ్గరనే సలహాదారుగ ఉంచినాడు సుమాలి.

కాలము కొంత గడచినది ప్రహస్తునకు రావణునివద్ద చక్కని చనవు కలిగినది ఇప్పుడు ప్రహస్తుని కర్తవ్యము రావణునకుగల భ్రాతృప్రేమను తెంచుటయే. ఒకనాటికి ప్రహస్తుని కోరిక నెరవేరినది. రావణునకు లంకా రాజ్యముపై కాంక్ష కలిగినది. తమ సామ్రాజ్యమునే కుబేరుడు ఆక్రమించెనను భావము రావణునకు రూఢమై లంకనుండి తొలగుమని కుబేరుని కడకు ప్రహస్తునే దూతగా బంపినాడు.

విత్తేశుడు ఇది తనకు తండ్రి యిచ్చిన నగర రాజమని సమాధాన మిచ్చి, తండ్రి దగ్గర కేగి సోదరుని వృత్తాంతమును విన్నవించుకొనినాడు.

తండ్రి యాజ్ఞను శిరసావహించుటకే కుబేరుడు తండ్రి దగ్గర కేగినాడు. తల్లిదండ్రులైనను వినయ విధేయతలుగల పుత్రునకే హితమును చెప్పుదురు. విశ్రవసున కీవృత్తాంతము క్రొత్తగా తెలియుటకాదు. ఇంతకు ముందుగనే రావణుని తోటి సంభాషణ నడచినది. ఆతడు మూర్ఖుడైయుండెనని తండ్రి గ్రహించి, ఈ లంకను రావణునకే వప్పజెప్పుమని కుబేరునకు సలహానిచ్చినాడు. నాటి నుండి కుబేరునకు కైలాసము నివాసమైనది. (అదియే అలకాపురి)

రాక్షసులందరిచే రావణునకు లంకా రాజ్యమున పట్టాభిషేకము జరిగినది. రావణుడిప్పుడు రాక్షసరాజు. ఆతని రాజధాని లంకానగరము.

రావణున కింతవరకు వివాహము కాలేదు. శూర్పనఖకు మాత్రము విద్యుజ్జిహ్వుడను రాక్షసునితో పెండ్లియైనది.

ముద్రణ : కాపీలు : 1000

రాఘవేంద్ర ప్రింటింగ్ వర్క్సు,
వ్యాకరణంవారి వీధి, సత్యనారాయణపురం,
విజయవాడ — 11.

# రావణుని గార్హస్థ్యము

నిజమునకీ సృష్టి అంతయు కశ్యప ప్రజాపతి సంతతియే. కశ్యపున కిద్దరు భార్యలు. దితి, అదితి. దితి సంతతి రాక్షసులుకాగా అదితి సంతతి దేవతలుగా పేర్కొనబడినారు.

మయుడు దానవ శిల్పి. కశ్యప ప్రజాపతికి దితియందుత్పన్నమైనవాడు. మయునిపుత్రిక మండోదరి. మయునకు హేమయను అప్సరస స్త్రీ యందు కలిగిన దీమె దేవతలు ఈ హేమను మయునకివ్వగా ఈతడీమెయందు మాయావి దుందుభి యను ఇద్దరు పుత్రులను, ఈ కన్యకను కనినాడు ఒకానొక సమయమున హేమ ఈతనిని విడిచి వెళ్లిపోయినది. ఆ సమముయ నందీతడు ఆకన్యకామణిని తీసుకొని ఈ కన్యకను నేను ఎవ్వరికిత్తునాయని అరణ్యముల తిరుగుచుండెను.

భార్య దైవికమగు చుట్టము. రావణుడా సమయముననే వేటకు ఆ యరణ్యమున తిరుగుచుండెను. కన్యకామణితో కూడిన మయునిచూచి రావణుడు పలకరించినాడు. మయుడు తన వృత్తాంతమునుచెప్పి, ఈకన్యకనెవ్వనికైన భార్యను గావింప తిరుగుచుంటిననెను. రావణుడు కూడ తాను పౌలస్త్య వంశ ప్రభువననియు. విశ్రవసుని పుత్రుడననియు నాపేరు దశకంఠుడనియు తెలిపినాడు మయునకు.

మయుని ముఖమండలము వికసించినది. ఈతడు ఋషి పుత్రుడు కావున ఈతనికి నాకన్యనిచ్చెదననిదలచి తన అభిప్రాయమును రావణునకెరింగించినాడు. రావణుడు అడ్డుచెప్పలేదు. రావణుడు మండోదరిని పాణిగ్రహణము కావించుట జరిగినది. అప్పుడే రావణునకు మయుడు ఒక శక్తిబాణమును కూడ కానుకగ యిచ్చినాడు. అది అమోఘశక్తి. ఇది రావణుని గార్హస్థ్యము. ఈమెయందే ఇంద్రజిత్తు జనించినాడు.

కుంభకర్ణుని భార్యపేరు వజ్రజ్వాల. ఈమె వైరోచనుని కూతురు కూతురు విభీషణుని భార్యపేరు సరమ. ఆమె శైలూషుడను గంధర్వరాజునకు పుత్రిక. లంక రాజధానిగా రావణుని రాజ్యపాలనము అమోఘమై సాగుచున్నది. మిగిలిన రాక్షసు లందరును లంకకు చేరినారు. మరల లంకానగరము రాక్షసాక్రాంతమైనది. మన మొక్కమారు దేవలోకములవైపుకు తిరుగుదము.

కాలప్రభావమును మనము మరువకూడదు. "కాలఃకలయతామహం" అని నారు భగవానులు. అంతేకాదు "కాలోస్మిలోకక్షయకృత్ప్రవృద్ధః" అనికూడ తన మహోగ్రరూపమును కాలమనియే నిర్ణయించినారు.

కుంభకర్ణునకు లంకానగరమున సువిశాల సుందర భవనమొకటి ప్రత్యేకముగ శయనమందిరముగా అతడందేసుప్తావస్థనొంది యుండెను. కావున అతని వలన నిత్య లోకోపద్రవములేదు. విభీషణుడు పవిత్రమూర్తిగదా? దేవతల నాతదేమిచేయును? ప్రస్తుత మన కథానాయకుడు రావణుడొక్కడే.

రావణుని ప్రతాపము విజృంభించినది. దేవలోకముల వ్యాపించినది. నందనోద్యాన వనముల విహరింప జొచ్చినది. మహర్షుల ఆశ్రమముల నిత్యనివాసము గావించుకొన్నది. అతనిని అడ్డువారెవరు? దేవగంధర్వకిన్నరకింపురుషుల కాతని పరాక్రమము అడ్డుకొనదగినదై లేదు. ఋషులు ఆతని శాపదగ్ధుల గావింపజాలరు.

ఇంద్రుని వజ్రాయుధము అతనిపై ప్రసరింపదు. దిక్పాలుర బలము లాతనికి తృణప్రాయములు, కుబేరుని హితబోధ లాతనిని దౌష్ట్యమునుండి మరలింపలేకపోయినవి మరలింపలేకపోవుటకాదు. అవి ద్వేషకారణములుకాగా కుబేరుడు రావణునితో కయ్యమునకు దిగి పుష్పకవిమానమును కూడ కోల్పోవుట జరిగినది. పుష్పకవిమానమిప్పుడు రావణునికై వశమైనది ఇక దేవతులకు దిక్కెవ్వరు? దేవదేవుడే నాడును నేడును సాధుపుంగవులకు దిక్కని వేరుగ చెప్పవలయునా? దశకంఠుడు కేవలముగ దేవతలకును ఋషులకు మాత్రమే శత్రువగుటకాదు. ఆతడు లోకకంటకుడై రావణుడను పదమును సార్థకముగావించు కొనుచుండెను గూడ. నిజమునకాతనిపేరు దశకంఠుడేయైనను రావణుడను పదమేలోకమున వ్యాపించినది. అది ఈశ్వరుని వరప్రసాద నామధేయము. కావుననే ఆపేరు అంత ప్రసిద్ధికెక్కినది. ఇది ఆతని పౌరుషనామము.

అది ఎట్లు వచ్చినదందురేమో? ఆపేరు వచ్చినకథ ఇది.

దశకంఠుడు కుబేరుని వద్ద పుష్పకవిమానమును స్వాధీనముగావించుకొని పయనము సాగించుచుండగా ఒక పర్వతముకడ అతని విమానము నిలిచిపోయినది. కారణమాతనికి తెలియలేదు. మారీచాది మంత్రులకును అర్థముకాలేదు. అంతలో ఒక వికృతాకారుడువచ్చి ఇది పార్వతీ పరమేశ్వరులు క్రీడించుచున్న విహారస్థలము దీనిపైనుండి విమానము నడువ వీలుకాదని తెలిపినాడు. అంతలో రావణుని

కన్ను లెఱ్ఱబడినవి. ఎవడా ఈశ్వరుడని ధిక్కరించి, తనకడ్డమువచ్చిన ఆ పర్వతమును పెరికివైతునసుకొనినాడు. తన యిరువది బాహువులతో ఆపర్వత శిఖరాగ్రము లపట్టి అటునిటుకదల్చినాడు. ఆ కైలాసమున నివసించు ప్రమథగణములు మొదలగువారుగాక పార్వతియే భీతిల్లి నాధుని కౌగిలించుకొన్నది. అందుకు పరమేశ్వరు డలిగి తనకాలి బొటనవ్రేలితో ఆ పర్వతమును కొంచెము నొక్కగా మన కథానాయకుని చేతులాపర్వతము క్రింద ఇరుక్కొన్నవి. అంతతో రావణుడు పెద్ద రొద గావింపగా ఆ ధ్వనికి లోకములన్నియు తల్లడిల్లినవి. కాని రావణుడు విముక్తుడు కాలేదు. మారీచుడు మొదలుగాగల మంత్రులందరును శంకరునే వేడుకొమ్మని సలహానివ్వగా వేయిసంవత్సరములా కైలాసపతిని సామగానముల స్తోత్రము గావించినాడు. అంతతో ఈశ్వరుడు సంతసించి ఆ బంధమునుండి విముక్తుని గావించుటే గాక ముల్లోకముల తల్లడిల్లచేసిన ఆతని రావమునకు సంతసిల్లి నీకిక్కడనుండి రావణుడను పేరుప్రసిద్ధము కాగలదని వరమిచ్చినాడు. అంతేకాదు, ఆ సమయముననే రావణుడు ఈశ్వరుని వలన చంద్రహాసమను ఖడ్గము నొకదానిని వరముగ గ్రహించినాడు కూడ. ఇదియొక మహాశక్తి సంపన్నమగు ఖడ్గము. కాని ఈ ఖడ్గరాజమునెప్పుడు రావణుడవమానించునో అప్పుడాఖడ్గము పరమేశ్వరునే పొందును. ఇట్లని చెప్పియే ఇచ్చినాడు పరమేశ్వరుడు.

## రావణుని దినచర్య

రావణుని తపఃప్రభావ సంపన్నత్వము లోకోపద్రవ కారణమైనది. ఆతని దృక్పథమునందాతడు మృత్యువునకు భయపడవలసిన పనిలేదు. ఈ సృష్టిఖండమున దేవదానవ గంధర్వాదులకందరకును నేనే ఈశ్వరుడనని ఆతడు తలచినాడు. సతీలలామల తనులతా సౌందర్యము లేలోకములందున్నను ఆ సౌందర్యభాగము తనకే భోగ్యము కావలెనని ఆతని నిర్ణయమై రూపొందినది. సతీమణుల సతీత్వము నాతడు నిలువనిచ్చుటలేదు. రాజవంశముల పరిమార్చుటాతని కొక క్రీడా విశేషమైనది. నేను బలవంతుడనని నోటపలికిన ప్రతివీరునకును ప్రతివీరుడై నిలిచి ఆయారాజ్యములకై వశము గావించుకొనుచుండెను. ఆతని యుద్ధభేరులు మ్రోగని ప్రదేశములేదని చెప్పవచ్చును. సూర్యచంద్రమండలములేగాక ఆతడు ధిక్కరించని మండలము లెవ్వియునులేవు. ఒకప్పుడాతడు యమపురిపై దండెత్తినాడు. పాతాళమునకేగి వాసుకి నాతడు జయించినాడు. జయించుటేకాదు నాగలోకవాసినుల

నాతడు ఎత్తుకొనిరాగా శరణాగతులై తమ ప్రాణముల నిలుపుకొని నారాలోకవాసులు, అట్టివారే నివాతకవచులును కాలకేయాదులుగూడ. వేయేల? అతడొక దారుణ చక్ర వర్తియై దేవాది లోకముల గూడ పీడింపసాగినాడు. నిజమున కాతనికి స్వపక్షమను నదిలేదు. అతడు స్వపక్షపరపక్ష నిర్ధూమధాముడు. అట్టితరి లోకరక్షకు డెవ్వడు? భగవంతుడొక్కడే నాటి దుష్ట రాక్షస సంహారమునకే రాముని యవతారము వచ్చి నది. రామాయణము — ఆర్యద్రావిడుల చరిత్రాంశము కాదు. ఆతడు ఆదినారా యణుడు. విశుద్ధ సనాతన ధర్మ రక్షణ దీక్షాబద్ధ కంకణుడై అవతరించినాడు. మరి మన రామాయణ చరితము ఆర్య ద్రావిడజాతి విభాగమను వారికి సమాధానమే మందురా? ఆ చరిత్రకారులు పాశ్చాత్యమానస పుత్రులు. వారి కేకలకు సమాధానము మౌనమొక్కటే. మనమౌనము అసామర్థ్యముకాదు. ఒక కవి ఇట్లు చెప్పినాడు

"భద్రం కృతం కృతంమౌనం కోకిలై ర్జలదాగమే.
దర్దురాయత్ర వక్తార స్తత్రమౌనం హిశోభనం.

వర్షాకాలమున కప్పల బెకబెకలలో కోయల కూతలేమి వినబడును? అప్పు డవ్వి మౌనమును వహించి తమ నేర్పరితనమును ప్రకటించుకొన్నవట. మన మిప్పుడు చేయ తగినది వారితో పోరాడుటకాదు మనము తరించుట. ఆ చరిత్రలను వారికే వదలుదము. ముందుకు పోదము.

భగవంతుని అవతారములు లోకవిలక్షణములు. కర్మజీవుల పుట్టుకల వంటివి కావు. భగవంతుని జన్మకర్మలు దివ్యములు కావుననేమూఢుల కవ్వి అందరానివైనవి.

"అవజానంతిమాం మూఢామానుషీం తనుమాశ్రితం"

ఆ చరిత్రలును లోకవిలక్షణములే అయ్యును అవి ఒక విధముగ మనకాదర్శము లగుట భారతీయులలోని విశిష్టత.

రాముని అవతారము మన కాదర్శమగు అవతారము. కృష్ణావతారమును అట్టిదేయయ్యును కృష్ణావతారములోని కొన్ని విషయములు సర్వజన సామాన్యములు కావు. యోగి జనులకును అసాధ్యములే. తాను యోగీశ్వరేశ్వరుడనని తన బాల్య క్రీడలయందే చాటుకొన్న కృష్ణ చరిత్రాంశమును భాగవతము మన కందించినది. నిజమునకు రాముడును యోగీశ్వరేశ్వరుడే. అయ్యును రామావతారములోని అమా నుష చర్యలు అక్కడక్కడ చూపట్టినవేగాని బాల్య మాదిగ అడుగడుగునను చూప బడలేదు, సేతు బంధనము, జటాయు మోక్షము, మొదలగునవి అప్పుడప్పుడు

ఆతని అవతారమున గోచరించినవి. ఎక్కువ జీవితము సామాన్య మానవాదర్శమై నడచినది. బ్రహ్మ చైతన్యము నిగూఢమై విభూతుల నెక్కువ ప్రదర్శింపక మానవుగా చరింపదగు వర్ణాశ్రమాచార ధర్మములకును సత్య శౌచాది విధులకును స్థానమునిచ్చి అవతారమును చాలించినది. వాల్మీకి మహర్షి ఉపనిషత్ప్రతి పాద్య మగు రాముని వేద వేద్యత్వమును మొదటి ఆరు కాండలయందునుగాక ఉత్తర కాండయందు ప్రత్యేకించి చూపినారు. వాల్మీకి అట్లు చూపుటకాదు, ఆ యవతారమే అట్లు నడచినది. దానిని వాల్మీకి వివరించినారు కని చిత్రితములు మన ఇతిహాస ములనుట యుక్తముకాదు. భగవంతుని లీలావైభములనే మన ఆర్ష గ్రంధములు వచించినవి. రామావతారమున సీతను గర్భవతియై యున్న తరియే అతడు పరిత్య జించుట సామాన్య మానవులకు ధర్మోపదేశము గావించుటకే ననుటకంటె వేరే మున్నది? ఆ సీతాపరి త్యాగము సహృదయుల కర్ధమగు ఒక విచిత్రమగు ఘట్టము. సీతాపరి త్యాగమును పరిశీలింపుడు.

## సీతా పరిత్యాగము

రావణ సంహారమైనది. స్వర్గసీమ యందును భూలోకముననుగూడ దుండగుల బాధలు తొలగినవి. భూలోకవాసులు దేవతలకందించు హవిర్భాగములు దేవతల కందుచున్నవి. మహర్షుల జీవితములు ప్రశాంతములైనవి. దేశ సౌభాగ్యము విస్తరిల్లినది. పంటలు సకాలము లై పండగా దేశమున దుర్భిక్షములేదు.

ఒకనాటి ఘట్టము.

సీత గర్భవతి ఇప్పుడా సీతామాత కుశలవులకు మాత కావలెను

అది సాయంకాల సమయము. సీత తన ఆహ్నికకృత్యముల తీర్చుకొని రాముని సమీపించినది. అప్పటి సీతారాముల ఉనికి స్వర్గమున శచీదేవితో కూడిన దేవేంద్రుడే ఈతడను ఊహ పొడమినది. వాల్మీకి మహర్షికి అట్లే వర్ణించినారు.

॥త్రివిష్టపే సహస్రాక్ష ముపవిష్టం శచీయధా.

రాముడు రసజ్ఞుడు. శృంగారమూర్తి. నిజమున కాతడు రసస్వరూపుడు. సింగారించుకొన్న సీతాకాంత తన్ను సమీపించగా ఆమెను చూచి, ఆమె గర్భవతి యగుటచే ఆమెను నీకేమి కోర్కెలున్న ఆ కోర్కెల తీర్తుననినారు.

భారతీయ విజ్ఞానమున స్త్రీ రక్షణకొక ప్రత్యేకత యున్నది. ఆ భాగము లోనిదే గర్భవతుల గర్భ రక్షణముకూడ. గర్భవతుల ఆహార విహార వాంఛల తీర్చకున్నవారి గర్భము సురక్షితమును, సుసంపన్నమును కాదు. కావున రాముడు సీత కోర్కెల తీర్చుటకే సీత నడిగినాడు.

రాముడు కర్తవ్య పాలనం దప్రమత్తుడు. కర్తవ్యపాలన మన సాధారణ విశేష ధర్మముల తెలిసికొని వాటిని యథాతథముగ ఆచరింపగలుగుట. కర్తవ్య ధర్మ నిర్వహణను నిర్వహించుట ఎట్లో అడుగడ్గునను ప్రదర్శించినదే రామావ తారము. రాముడు కేవలముగ ధర్మవీరుడేకాదు. ఆతడు తత్వవేత్త. తత్వవేత్త యయ్యే రాజ్యమును పాలించినాడు. కావుననే అది ధర్మరాజ్యమైనది. భారతీయ చక్రవర్తులందరును అట్లు తత్వవేత్తలయ్యే పరిపాలనల కొనసాగించిరనుట ఊహా గానముకాదు. ప్రస్తుతమున సీత కోర్కెను తీర్చుటకే అడిగినాడు. అప్పుడామె కోరిన కోర్కెఇది.

శా॥ సారంగీ శిశుకోటి దప్పి పులి దీర్చన్ సింహ పోతశ్రమం
బారన్ దంతి కరాంబువుల్ నిగుడజేయన్ మించు భాగీరథీ
తీరారణ్యములన్ వసించు మునిపత్నీ శ్రేణితోడన్ ఫలా
హారంబుల్గొని యొక్కనాడు మెలగన్ ప్రాణేశ వాంఛించెదన్

మున్యాశ్రమములచూచి, ముని కాంతలతో కలసిమెలసి తిరిగి, వారందించు ఫలముల నాతిథ్యముగ గ్రహించుట ఆమె కోర్కెయట. రాముడట్లేయనినాడు.

అంతలో సీతతోటి ఏకాంత సంభాషణము ముగిసినది. రాముని దినచర్యలలో మిత్రగోష్ఠికూడ ఒక భాగము. ఆప్తమిత్రులతో కూడి ప్రతి నిత్యమును తన రాజ్యములోని నిగూఢ వార్తల వినుచుండవలెను రాజును ప్రత్యక్షముగ ప్రజలు విందింపజాలరు. కావున ప్రజలు తనను గురించి ఏమనుకొనుచుండిరో గూఢ చారులవలన తెలుసుకొనుచుండవలెను. "రాజానశ్చారచక్షుషాః" అన్నది నీతి శాస్త్రము. రాముడు సీతను విడిచి మిత్ర బృందము వసించు మిత్రగో మందిర మున కేగినాడు

అది మిత్ర గోష్ఠిగృహము. భద్రుడను వాడు రాముని గూఢచారి. ఆతడును ఒక విధముగ మిత్ర బృందములోని వాడయ్యె ఆ గోష్ఠిగృహమున కేతెంచినాడు

చిత్ర కథలను చెప్పు కథకులతోడను, నటవిట గాయకాది హాస్య చతురుల తోడను కొంతసేపు రాముడు కాలమును గడిపినాడు. తరువాతది భద్రునితోటి సంభాషణము ఇదియే సీతాపరిత్యాగ కథాంశమున ముఖ్యభాగము.

కాః కథానగరే భద్ర వర్తన్తే విషయేషుచ
మా మాశ్రితాని కాన్యాహుః పౌర జానపదాజనాః
కించ సీతాం సమాశ్రిత్య భరతం కింను లక్ష్మణం
కింను శత్రుఘ్న మాశ్రిత్య కైకేయీం కింను మాతరం.

రాముని ప్రశ్నలివ్వి.

భద్రా! నన్ను గురించి పట్టణవాసులుగాని పల్లె ప్రజలుగాని ఏమనుకొను చుండిరి? రాముని రాజ్యమున లోపము లేదనుకొను చుండిరా? నా చరిత్రయందే మైన కళంకముల నాపాదించుచుండిరా? అట్లే భరత శత్రుఘ్నులను గురించిగాని సీతను గురించిగాని, నా తల్లులగు కౌసల్యా సుమిత్ర కైకేయీలను గురించిగాని ఏమైన నిందల మోపుచుండిరా? నిజముగ ఏమనుకొనుచుండిరి? వింటిరా? ప్రశ్నలను రాము డిట్లెందు కడిగెనట?

॥శుభాశుభాని వాక్యాని యాన్యాహుః పురవాసినః
శ్రుత్వేదానీం శుభం కుర్యాం నకుర్యామశుభానిచ

ప్రజలనుకొను విషయముల తెలసికొని మంచి పనులను చేయుచు చెడ్డ పనులను మానుకొనుటకే నిన్ను అడిగితిననినారు, కాని ఒక్కమాట గట్టిగ చెప్పినారు.

॥కథయ స్వచవిస్రబ్ధో నిర్భయం విగతజ్వరః

చెప్పుటకు భయపడవద్దని ఆతనికి స్వేచ్ఛనుకూడ ఇచ్చినాడు. రామరాజ్యమున పాలకుని హృదయ మిట్లుండవలెను. తన్ను తాను పొగుడుకొనుటకాదు రామరాజ్యమున నాటి గూఢచారిశాఖ రాజును కూటద్రోహము మిత్రద్రోహ శాఖకాదు కావుననే భద్రుడున్న దానిని ఉన్నట్లుగ చెప్పినాడు

రావణుడు ఒడిలోనుంచుకొని ఎత్తుకొనిపోయిన సీతను ఏవగించుకొనక రావణుని సంహరించి ఇంటికి తెచ్చుకొనెను. అతడు ప్రవర్తించిన విధమును మన

మేల అనుసరింపరాదు? అని పల్లె ప్రజలలో సైతము చెప్పుకొనుచుండిరని చెప్పి వాడు భద్రుడు.

ఈ ఘట్టము సామాన్య ప్రజలలో వెర్రితలలు వేసినది. ఎవ్వడో ఒక రజకుడు నిందించుటతో సీతను రాముడు వదలెనని మన ఇతిహాస కథలనుగురించి సినిమా తెరలపైనను, నాటకరంగముల మీదను చూచి విమర్శించుట పరిపాటియైనది. కథకురండు. తరువాత ఏమైనది?.

రాముడు భద్రుడు చెప్పినమాట సత్యమేనా? అని మిగిలిన మిత్రులను కూడ రాముడు గట్టిగ అడిగినాడు. ఆ మిత్రులందరును తమతమ శిరముల వంచి, సాష్టాంగ వందనమాచరించి భద్రునిమాట సత్యమని ఏకగ్రీవముగ పలికినారు.

రాజునకు మిత్రగోష్ఠియన కాలక్షేపము చేయుటకుకాదు. అది ఒక విధమగు గూఢచారిశాఖయే.

ఆనాటికి రాముని మిత్రగోష్ఠి పరిసమాప్తమైనది. మిత్రులందరును వెళ్లినారు.

అతడొక ప్రత్యేక గృహాంతర్భాగమున ప్రవేశించినాడు. రాముడు తన కర్తవ్యమును నిశ్చయించుకొనినాడు అది సీతాపరిత్యాగము. అది ఎంతవరకు సమంజసమనునది పరిశీలించుటకూడ మనకు కర్తవ్యము కాకపోదు ప్రతివ్యక్తికిని రాముని జీవితమును వినునప్పుడిది యొక సమస్యయని చెప్పకతప్పదు అట్లుండుడు. సీతను పరిత్యాగము చేయుట నాతడు ఎట్లు నిశ్చయించెనో ముందు చెప్పెదను. అతడు తాను కూర్చున్న గృహద్వారమువైపుకు చూపును ప్రసరింపజేసినాడు. దౌవ్వారికుడు వెంటనే తన ఎదుట నిల్వగా భరతలక్ష్మణ శత్రుఘ్నుల పిలిచి రమ్మని ఆజ్ఞాపించినాడు. వారు అతివేగముగ కాలినడకలనే వచ్చుట జరిగినది. రామాజ్ఞచే వారు అన్నగారి అభ్యంతర గృహమున ప్రవేశించుట జరిగినది. రాము డప్పుడెట్లుండెను?

పరిపూర్ణపూర్ణిమా చంద్రమండలమువలె చూపరుల కానందము నొసంగు రాముని ముఖమండల మిప్పుడట్లులేదు. సగ్రహ చంద్రమండలమువలె నున్నది. వికసిత పుండరీకములవలె చూపరులకు చూడముచ్చటలై యున్న కన్నులు అశ్రు బిందువులతో నిండి వన్నెతగ్గి శోభగాంచుటలేదు కారణమేమియో సోదరుల కర్థము

కాలేదు. అయ్యును ఆ సోదరులు ముగ్గురును అన్నపాదములకు ప్రణమిల్లినారు. ఎదురనిలిచినారు. రామునకు దుఃఖమాగలేదు. సోదరులనొక్కమారు కౌగలించు కొనినాడు. తనచేతులతో వారిని బలాత్కారముగ కూర్చొనబెట్టినాడు. రాముడు గంభీరహృదయుడే కావచ్చును. సముద్రము చలింపదా? గద్గదభాషణుడయ్యె మాట్లాడినాడు. తత్వనిష్ఠుల హృదయము శిలయని మీరు భావింపకుడు. వారు దయామయులు. సర్వభూతహితులు. వారిహృదయము నవనీతము. ఇప్పుడు సీతను పరిత్యజించుటలో రాముని హృదయమేమి? మనమును సహృదయులమై భారతీయ ధర్మహృదయులమై పరిశీలింపవలెను.

రాముని హృదయమును పరిశీలింతము.

రామునకు సీతపై ద్వేషములేదు. సంశయమునులేదు. భద్రుని ముఖముగ వెలువడిన పలుకును అతడెట్లు స్వీకరించెను? ప్రజల హృదయముగనే స్వీకరించెను. ప్రజల హృదయములలో పరివర్తించిన సీతనే అతడు చూచినాడు. అందుకే భద్రుని అడిగినాడు కూడ.

మనమొక్కమారు వాల్మీకి మహర్షితో కలసి రాముని హృదయసీమకు పోదము. సీతకు వచ్చిన జనాపవాదము అతని మర్మముల భేదించినది. తానా విర్భవించిన ఇక్ష్వాకు వంశచరితము రాముని ఎదుట నిలిచినది. జనకుని వంశమును, ఇక్ష్వాకు వంశము ప్రక్కననే నిలిచినది. అంతేకాదు. నాడు లంకయందు అగ్నిదేవుడు దేవతలముందును, మహర్షులముందును తనచేతికందించిన సీతయు రామునకంతరంగమున సాక్షాత్కరించినది. ఆ దృశ్యము నాతడు మరువలేదు. మరి యిప్పుడు సీతనాతడెందుకు పరిత్యజించెనట? ఆతడు తన సోదరులతో పలికిన పలుకు మన హృదయమున ముద్రపడవలెను.

"అప్యహం జీవితం జహ్యాం యుష్మాన్ వా పురుషర్షభాః
అపవాద భయాద్భీతః కింపు నర్జనకాత్మజాం"

ఈ శ్లోకార్థమిది.

తన ప్రాణములనైనను వదలునట రాముడు. ఆత్మీయులగు సోదరులను కూడ వదలుటకు బాధపడడట. అపవాదభయము నన్నావరింపగా సీతను వదలుట లెక్క ఏమున్నది? అనినాడు. ఇప్పుడు రాముని హృదయమేమి? గమనింపుడు.

సీతాపరిత్యాగమున జనుల హృదయములందుకూడ సీత పరిశుద్ధ జీవితమును ముద్రవేయుటయే రాముని హృదయము.

తరువాతి శ్లోకములలో రాముడిట్లనినాడు సోదరులతో:
అకీర్తిర్యస్య గీయేత లోకే భూతస్య కస్యచిత్
పతత్యేవాధమాన్ లోకాన్యావచ్ఛబ్దః ప్రకీర్త్యతే.
కీర్త్యర్థం చ సమారంభస్సర్వేషాం సుమహాత్మనాం.

అపకీర్తి లోకమున ప్రచలితమగుచున్నంత వరకును పాపలోకములు తప్పవట బుద్ధిమంతులు కీర్తికొరకై పుణ్యచరిత్రులై జీవించవలెనట. ఇది రాముని జీవితలక్ష్యము. ఇది కీర్తికండూతికాదు. తన కర్తవ్యమును నెరవేర్చగా తనంత తానైవచ్చు కీర్తికాంత శాశ్వత లక్ష్మియని రాముని హృదయము. కఠోరచిత్తుడై సీతను అనుమానించి ఆమెను వదలలేదు. సీతాపరిత్యాగ సమయమున రాముని హృదయమును పరిశీలింపనివారికి రాముని పురుషోత్తమత్వమెట్లు అర్థమగును? సీతాపరిత్యాగవిషయమున రామునిని కేవల భౌతిక దృక్పథమున పరిశీలింపరాదు ధర్మరాజ్యమును చేయదలచిన రాజుయొక్క లక్ష్యమెట్లుండవలెనో భారతీయ రాజ్యాంగ విధానము చెప్పినది సనాతన భారతీయతనే అతడనుసరించినాడు. పరికింపుడు సీతను వదలుట కాతని హృదయము పరితపించినది. సీతనాతడు అనుమానించలేదు రాజునకు ముఖ్యకర్తవ్యము ప్రజాపాలనము. అదియే అతని ముఖ్యమగు తపస్సు. కావున లక్ష్మణునితో సీత తనను కోరిన ఆశ్రమవాసమును నెపముగా నీవు సీతను రథముపై నెక్కించుకొని వాల్మీకి మహర్షివారి ఆశ్రమ సమీపమున విజనస్థలమున వదలిరమ్మని అజ్ఞాపించినాడు. వాల్మీకి ఆశ్రమము గంగకు అవ్వలి ఒడ్డున.

ఆరుహ్య సీతామారోప్య విషయాంతే సముత్సృజ
గంగాయాస్తు పరేపారే వాల్మీకేస్తు మహాత్మనః
ఆశ్రమోదివ్యసంకాశః తమసాతీరమాశ్రితః
తత్ర తాం విజనే దేశే విసృజ్య రఘునందన.

అని ఎదురు మాటను చెప్పవద్దని శాసించినాడు సోదరులను- దండ కారణ్యముల కేలపంపలేదు?

భారతీయ చరిత్రలన్నియు మానవాతీతములను మానవ విషయములు కూడ నైయున్నవి. భారతీయ సామ్రాజ్యములలో మహర్షుల పవిత్ర జీవితములు అంతర్భూతములై తమ తాపసతేజములు సామ్రాజ్యములకు కవచములు కాగా భారతీయ తరూపొందినది.

గర్భవతియగు సీతకు ఎక్కడస్థానమును కల్పించవలెనో రామునకు తెలియని విషయముకాదు, వాల్మీకియను మహర్షిని రాముడెరుగును.

సీతారాములు చిత్రకూటాద్రికి వెళ్ళినప్పుడు వాల్మీకి ఆశ్రమము అక్కడనే యున్నది. వారికి వందనమునుకూడ అర్పించినారు సీతారాములు. ఇప్పుడు వాల్మీకి తమసానది ఒడ్డుననే ఆశ్రమమును కట్టుకొని యుండెను.

తన పుత్రులు వాల్మీకి శిష్యులగుటరాముడెరుగని సంగతికాదు. జాతకర్మాది సంస్కారములు మహర్షులే చేయుదురు క్షత్రియులకు, ఇంతదూరదృష్టి కలిగియే అతడు పంపెను. ఎప్పుడోకాదు రేపేపంపుమని ఆజ్ఞాపించినాడు.

కాని ఈవిషయమును సీతకేలచెప్పలేదు? సీతకుచెప్పిపంపినబాగుండెడిదికదా? అని మన ఊహ. రాముడీమాత్రము ఎరుగడా? ఎరుగును. సీతయందు గాఢానురాగము గల రాముడు, దండకారణ్యమున కన్నీరు మున్నీరుగా ఏడ్చిన రాముడు సీతకు ఈమాటను చెప్పిపంపకూడదా? అప్పుడువచ్చు ప్రతి బంధకముల నాతడూహించెను. సీతతో ముందుగ ఈమాటను చెప్పుచో ఆమెకు రాబోవుశోకవేగమెంత గొప్పదియో ఆతడూహించకపోలేదు. "రామస్య శోకేన సమాన శోకా" తాను తన కర్తవ్యపాలనముకై సీతను వదలుటకే శోకవ్యాకులుడుకాగా తనని వదలివెళ్ళు సీత ఎంత దుఃఖపడునో ఆతడూహింపడా? అంతఃపురమున సీత విలపించును. ఆమె విలాపము పరిజనులముఖముగ నగరమున వ్యాపించును. నగరవాసులు తానరణ్యమునకు పోవునప్పుడే అడ్డుతగలగా ఇప్పుడు సీతను తీసుకొని పోవురథమునకు అడ్డుగ నిలవరా? నిలిచినచో సీతను పంపుట ఎట్లుజరుగును? సీతను అంతఃపురముననే ఉంచినచో ఈనాడు కాదనిన ప్రజలే మరల రాముడు ఇదంతయు తంతునకై చేసెనని అనగలరు. సీత పవిత్రురాలని వారి హృదయముల నాటుకొనదు. కావున ఆతడు రహస్యముగనే సీతను పంపినాడు. ఒక్కమాట. నేను చెప్పబోవునది చాల ముఖ్యమగుమాట.

తాత్కాలికములగు ఆవేశములతో చలించు చిత్తవృత్తులుగల సామాన్యుల ఆదరవాక్యముల నాధారముగాగొని ఎన్నడును ధర్మమును నిశ్చయింపకూడదు.

ధర్మనిశ్చయమునకు శాస్త్రము ప్రమాణము కావలెను. రాముడరణ్యమునకు పోవునప్పు డెందరో వద్దనినారు. ఎందరో ఏమున్నది? కౌసల్యయు, లక్ష్మణుడును అడ్డుతగిలినారు. ఆ అడ్డుతగులుట యందేమున్నది. ధర్మములేదు రామునిపై ఆదర మున్నది, అంతియే, రాముడు ఆ ఆదరవాక్యముల లెక్కగొనలేదు. ధర్మమునకే స్థానమునిచ్చి పితృవాక్యపరిపాలనను గావించినారు. కావున రాముదేధర్మము. ధర్మమే రాముడు. రాజధర్మము నాధారముగా గొనియే అతడు ప్రతి కార్యమును చేయు చుండును, రాముడాచరించు ఏ కార్యమును గురించియు మనకు శంకఅక్కరలేదు. ప్రస్తుత సీతాపరిత్యాగము నందెంతయో కర్తవ్య పాలనము ఇమిడి యున్నదని నిశ్చయించుకొనియే అది నెరవేరునట్లూహించినాడు రాముడు కధకు పోదుము.

ఆ రాత్రి సోదరులతోడి సమాగమము ముగిసినది. తెల్లవారినది. శ్రీరామ చంద్రుని ఆజ్ఞాను సారముగ లక్ష్మణుడిక తన కార్యమును నిర్వర్తించ వలెను. లక్ష్మణుడు తన ప్రాతఃకాల కృత్యముల తీర్చుకొనినాడు. దీనవదనుడయ్యె ఆకృత్య ముల నెరవేర్చుకొనినాడు. ఇక రధము ఆయత్తము కావలెను. మృదుతరశయ్యా తలముతో కూడిన ప్రయాణరథము నాయత్తముగావింపుడని దీనుడయ్యె సుమంత్రుని ఆజ్ఞాపించినాడు. అదిరామాజ్ఞ. లక్ష్మణుడెట్లు తప్పింపగలడు? సీతాకాంత మందిర ద్వారదేశముకడ యాత్రారధమునిలిచినది. ఈ కబురు సీతకందినది. వదినగారికి రామునివరమును జ్ఞాపకముచేసి మునిపత్నులతోడి విందారగింప పయనమగుమనినాడు లక్ష్మణుడు

సీత సంతోషమున కంతేమున్నది?

మునిపత్నులకును, మునికన్యలకును అందింపదగిన ఆభరణముల నెన్నిటినో సిద్ధపరచుకొన్నది.

ఆమె మనసు ఆమెను పయనమునకు తొందరింపగా ఆ మనస్సునందొక భాగము ఆ పయనమును గూర్చి సందేహించుచున్నది. సీతాకాంత మనస్సు రెండు భాగములైనది. ఒక భాగము మునిపత్నుల గాంతుననిఉత్సహింపగా వేరొకభాగము ఏదియో విపత్తురానున్నదని సూచించుచున్నది.

సీత లక్ష్మణునితో ఇట్లన్నది.

"ఔత్సుక్యం పరమఃచాపి అధృతిశ్చ పరా మమ
శూన్యమేవ చ పశ్యామి పృధివీం పృధులోచన

లక్ష్మణా! నామనస్సు ధైర్యమును కోల్పోవునట్లున్నది. ఈభూమి అంతయు శూన్యమైనట్లగపడుచున్నది. ఆర్యపుత్రులు క్షేమముగనుండిరా? రాష్ట్రము సుభిక్షమై యుండెనా? మీతల్లులు క్షేమముగ నుండిరా? అని అడిగినది. లక్ష్మణుడేమనును? తల్లీ! అందరకును శివమే అనినాడు వందనపూర్వకముగ. సీత ప్రయాణముసాగినది. రథము గోమతీతీర ఆశ్రమమున ఆగినది. ఆరాత్రి అక్కడనే వారినివాసము.

తెల్లవారినది. మరల సీతాకాంతరథము నధిరోహించగా రథము సాగినది. అవి జవనాశ్వములు. మధ్యాహ్నకాలముననే గోమతీతీరమునుండి గంగానదీతీరమునకు చేరుకున్నదిసీతాకాంతరథము అక్కడ నిలిచినది.

మునీశ్వరుల ఆశ్రమములన్నియు గంగకు అవ్వలఒడ్డునందున్నవి. కావున లక్ష్మణుడు సీతను గంగానదిని దాటించవలెను. లక్ష్మణునకిది యొక పెద్దఘట్టము. గంగను దర్శించిన సంతోషము సీతకు పెల్లుబకగా లక్ష్మణునిఅంతరంగమున దుఃఖతరంగములు పెల్లుమీరినవి. లక్ష్మణునిముఖమండలము వన్నెతరిగినది కన్నులనీరు గ్రమ్మినది.గంగానదిని దాటించు నావికుని పిలుచుటకునోరు వచ్చుటలేదు.

సీతాకాంత చూపులు లక్ష్మణకుమారుని ముఖమండలముపై పడినవి. ఈతని ముఖమిట్లున్నదేమి? ఆమె ఊహింపలేకపోయినది. లక్ష్మణునిముఖము విన్ననై ఇట్లుండుట ఆమె ఎప్పుడును ఎరుగదు. గంగను దాటుటకామె లక్ష్మణుని తొందరపెట్టినది. ఆతొందర ఋషివాటికల కేగుటకు మాత్రమేకాదు. ఋషివాటికల కేగి వెంటనే రామునిదర్శింప వెళ్లదమనికూడ చెప్పినది. లక్ష్మణుని దుఃఖము మరింత పొంగిపొరలినది. అయ్యును కన్నీటి బిందువులు బయటకు రాలలేదు పడవకొరకు వేచియున్న సమయమది. కొద్దిసమయము గడచినది. ఆ గంగాతరంగములలో ఉయ్యేలలూగుచు నావవచ్చి నిలిచినది. గంగఒడ్డున. లక్ష్మణుని ఆజ్ఞచే మెత్తని పరుపులనమర్చియే నావికుడు ఆనావను తెచ్చినాడు సుమంత్రునిరథము ఇవ్వలి ఒడ్డుననే నిలిచినది. ఆ పడవనెక్కినవారు సీతాలక్ష్మణులిద్దరే.పడవఅవ్వలి ఒడ్డుకు చేరినది. వారాఒడ్డున దిగి కొంతదూరమున నడచివెళ్లినగాని మునుల పర్ణశాలలు రావు. లక్ష్మణుని అడుగులు ముందుకు సాగుటలేదు. అతని పయనమక్కడనే

నిలిచిపోయినది. కాని లక్ష్మణుని దుఃఖతరంగము లాతని హృదయక్షేత్రమున నిలువలేకపోయినవి. కన్నీటిధారలు వేవేగ బయటకు పయనించినవి. పెదవులు కదల సమర్థములు కాలేదు. అట్లొక రెండుగడియల కాలము గడచినది. లక్ష్మణునకు పెదవివిప్పక తప్పలేదు. తానొక దుఃఖభాగుడై నిలచి, సీతామతల్లి పాదములపై చూపులు నిలిపి గద్గదకంఠమున పెదవుల కదల్చినాడు. ఏమని? నేనొక దుఃఖభాగుడనని. సీత ఊహింపరాని ఘట్టమిది ఆమె ఊహాప్రపంచము తనపైకి తిరుగలేదు. లక్ష్మణుడిట్లు దుఃఖభాగుడగుటకు కారణములు కానరాలేదు

కావి అంతలో లక్ష్మణుని భావచిత్రమై నడచినది. లక్ష్మణుడు తనకేల మృత్యువు రాలేదని చింతించి విలంపిచినాడు. లోకనిందితమగు ఈ కార్యమును నే నెట్లా చరింతునని తన్నుతాను నిందించుకొనినాడు. అమ్మా! నాతప్పు సైరింపుమని వేడుకొనచు దోసిలి యొగ్గినాడు. దోసిలియొగ్గుటకాదు. భూమియందు కూలబడినాడు. వెక్కి వెక్కి ఏడ్వసాగినాడు. అప్పుడు సీత లక్ష్మణుని ఇట్లడిగినది.

ఇక్కడే కంకంటివారి పద్యసరళిని వినిపింతును.

ఉ॥ అన్న యనేక దీనదశలానినవేళల సైనసీవుము
న్నెన్నడు నింతవంత వహియింపవు ధైర్యముడింపేలనే
డిన్నెగులొంది కుందెద వహీనగుణాంబుధివంచు నీగుణం
బెన్నుదు రంద రెవ్వరికి నెగ్గుదలంచితి వుగ్గడింపవే

చ॥ పరసతులెల్ల దల్లులుగ భావనసేయుదు వెల్లవేళలన్
బొంకనమన్న హాలాహల భంగిగ జూతువు బొంకవెన్నడున్
బరుషము లాడవెవ్వరిని బ్రాహ్మణభక్తియు రామసేవయున్
దిరమగు నీకుదంఁడ్రి జననిందిత కృత్యము లెవ్వి యియ్యెడన్

శ్రీరాముడెన్నియో ఆపదలనొందిన సంఘటనలు లేకపోలేదు. ఇప్పుడేల ఇట్లు దుఃఖభాగుడవైతివి? నీవెవ్వరికైన ఎగ్గుదలచితివా? లక్ష్మణా! నీవట్టివాడవు కాదు. ఇట్లేల కుందుచుంటివి? అని ప్రశ్నించినది.

అంతతో సీతహృదయము ఆగలేదు. లక్ష్మణుని సుగుణ సంపదంతయు ఆమెకు సాక్షాత్కరించగా ఆతని సద్గుణములన్నిటిని ఒకమాలగ గ్రుచ్చి, ఇట్టి నీకు దుఃఖభాగిత్వమా? అని గ్రుచ్చిగ్రుచ్చి అడిగినది, లక్ష్మణా! పరసతులు నీకు

మాతృమూర్తులు. పరధనము విషము. నీనాల్క ఎన్నడును అబద్ధమాడదు. కతి నోక్తులులేవు. రామసేవయు బ్రాహ్మణభక్తియు నీ జీవిత లక్ష్యములు. నీ జీవితమింత నిష్కల్మషమైయుండ నీవిట్లు దుఃఖభాగుడవగుటకు కారణమేమి? అని తన అనుగ్రహపూరిత సుభాషితముల లక్ష్మణుని చెప్పుమన్నది. అ చెప్పు మనుటలోకూడ ఏమియునుదాచక చెప్పుమని ఆజ్ఞాపించినది. రాముదేదియో ఈతనిని శపించి యుండవచ్చుననుకొన్నది. ఒకవిధముగ రాముదేమైన ఆపదనొందెనేమోయనికూడ భావించినది. రామాజ్ఞను లక్ష్మణుడిక దాచుటయెట్లు? లక్ష్మణుడు వంచినతలను ఎత్తలేదు. నేలపై కూలబడియే కన్నీటికాల్వల తడిసియే రామాజ్ఞను తెలిపినాడు. ఇదియొక విచిత్రమగు ఘట్టము. లక్ష్మణుని ముఖమునుండి వెలువడిన రామాజ్ఞ ఎంత సున్నితమై సీతకు వినిపింపబడినదో పరికింపుడు.

లక్ష్మణునిలోని సౌలభ్యమును గమనింపుడు. సీతకు రాముని అజ్ఞను ఎట్లు చెప్పవలెననునది పెద్ద ప్రశ్నయైనది. దానిని చక్కగ పరిష్కరించినాడు. ముందు రాముడు దారుణమగు పౌరుల అపవాదమును భరించలేక పోవుటను వ్యక్తపరచినాడు. తరువాత రాముడు సీతను వదులుట కెంత బాధపడెనో చెప్పినాడు. రామాజ్ఞను తెలుపుట ఇంత మెలకువతో తెలిపినాడు.

"శృత్వాపరిషదో మధ్యే హ్యాపవాదం సుదారుణం
పురేజనపదేచైవ త్వత్కృతే జనకాత్మజే.

జనకనందినీ ! అని సంబోధించి నీపైన వచ్చిన అపవాదము రహస్యముగ తెలియుటకాదు. పరిన్మధ్యమున వెల్లడియైనదనినాడు. ఆ యపవాదము నగరమధ్యను మాత్రమే వినబడుటకాదు. రాష్ట్రములందును, పల్లెల యందునుగూడ వినవచ్చుటచే ఆ యపవాదము విన్నరాముడు బాధపడినాడని విశదపరచినాడు. "రామస్సంతప్త హృదయః" అని. దారుణమగు ఆ యపవాదమును తొలగించుట ఆ మహనీయుని కర్తవ్యము కాగానిన్నీ ప్రదేశమున విడిచిపెట్టవలసి వచ్చినదని తెలిపినాడు

తరువాత సీత అనుకొనదగిన ప్రశ్నను తానేవేసుకొనినాడు. నీపైనను మారుమాట చెప్పలేదా? చెప్పినచో ఇట్లు రాదేమో! అనుకొన కుండుటకై "మాం నియోజ్య గృహంగతః" లక్ష్మణా! నీవు సీతను గంగాతీరమున వదలి రమ్మని ఆజ్ఞాపించి, నానోట మాట రాకుండగనే అతడు గృహాంతర్భాగమున కేగినాడని చెప్పినాడు.

పరిషన్మధ్యమునందు విన్న మాటల నన్నిటిని చెప్పతగినవి కావనిచెప్పి రామాజ్ఞకు తల ఒగ్గవలసి వచ్చినదని బాధపడినాడు.

తరువాత అతని పలుకులెట్టివి? తరువాత వినిపింపదగిన పలుకులు అమె నిర్దోషత్వమును, రాముని హృదయ తాపమును చూపినవి.

॥సా త్వం త్యక్తా నృపతినా నిర్దోషా మమ సన్నిధౌ
పౌరాపవాద భీతేన గ్రాహ్యం దేవి న తే వ్యథా.

సీత నిర్దోషియని రాముని తలపునకు తనను సాక్షిగ నిర్ణయించినాడు. "మమసన్నిధౌ" అని. రామునికి పౌరాపవాద మెంత భీతిని కలిగించినదో స్పష్ట పరచినాడు "పౌరాపవాదభీతేన" అని. కాని రాముని ఈ కృత్యము దారుణమని అతడేమనును? తల్లీ! దేవి! నీవు మాత్రము రాముని వేరుగ భావించవద్దని రాముని హృదయమును వ్యాఖ్యానించినాడు. అంతేకాదు రాముడు మూర్ఖుడై గర్భవతివైన నిన్ను ఈకాననమున వదలెననుకొనకుమని రాముని వివేకమును చక్కగతెలిపినాడు. రాముడు నన్నీ ఆశ్రమ ప్రాంతముననే వదులుమని ఆజ్ఞాపింపగా నేనిక్కడ వదలి నాడను. అంతేగాక నీవును ఈ కోర్కెను కోరితివి గదా? అని ఆమె కోర్కెను జ్ఞప్తికి తెచ్చి, అమె కోరిక రామున్న భవిష్యత్తు ననుసరించినట్లు ఆమెకు స్ఫురింప జేసి జరుగనున్నదిదియని తత్వబోధను గావించినాడు శ్లోకమిది.

ఆశ్రమాంతేషు చ మయా త్యక్తవ్యా త్వంభవిష్యసి.
రాజ్ఞశ్శాసనమాజ్ఞాయ తథైవకిలదౌహృదం.

అంతతో ఊరుకొనక. ఈ యాశ్రమము లెవ్వరివో చెప్పి ఊరడించినాడు. ఇవి బ్రహ్మర్షుల ఆశ్రమములు. తల్లీ! అని వాతావరణము నీకు శాంతిని కల్పించు నట్టిదని తన వాక్యముచే ప్రశాంతతను కల్పించి, సామూహిక వాతావరణమునేగాక ప్రత్యేకతకూడ ఇక్కడ కలదని ఆశ్వాసించినాడు. ఏమా ప్రత్యేకత?

ఈ యాశ్రమము వాల్మీకి మునిచంద్రుల ఆశ్రమము. ఈ మునివర్యులు మా తండ్రియగు దశరథునకు ఆప్తమిత్రులు. వీరి రక్షణముననే నీ వుందువు. వీరి పాదచ్ఛాయ తల్లీ నీకెంతయు శాంతిసుఖములను కల్పింపగలదనినాడు.

సఖాపరమకో విప్రో వాల్మీకిస్సుమహాయశాః
పాదచ్ఛాయాముపాగమ్య సుఖమస్య మహాత్మనః

ఈ శ్లోకమును వింటిరిగదా? ఇది చాల గంభీరమగు శ్లోకము. ఈ శ్లోకమున వాల్మీకి మహర్షిని దశరథునకు సఖుడనక, సఖాపరమకః అని వాడినాడు. ఇతడు మాకు అత్యంత ఆప్తుడనినాడు. అనగా నీకిది స్వగృహమని సూచించినాడు. నీ భవిష్యజ్జీవితము నెరిగినవారని "మహాత్మనః" అను పదమును వాడినాడు. అంతే కాదు, ఇది నీకును రామధ్యానము గావించుకొనదగు ఆశ్రమమనికూడ సూచించినాడు. రామ వియోగమును దుఃఖముగా గొనక రామధ్యాన పరాయణవు కమ్మని నదుపదేశము నిచ్చినాడు. ఈ శ్లోకమును కూడ వినుడు.

॥పతివ్రతాత్వమాస్థాయ రామం కృత్వా సదా హృది
శ్రేయస్తే పరమం దేవి తథా కృత్వా భవిష్యతి.

పాతివ్రత్యమను కర్మయోగమును ఆచరించుచు, హృదయమున రామపాదారవిందముల ధ్యానింపుచు ఆధ్యానయోగమందించు జ్ఞానఫలమును పొందుమని దేవీః నీకీ సన్నివేశము శ్రేయమును కూర్చుననినాడు. శ్రేయమనమోక్షము. ఇచ్చట రామ వియోగము ధ్యాననిష్ఠకు ఉద్దీపకమని తెలిపినాడు.

ఈ ఘట్టమున మీకు కంకంటివారి మధుర ఫణితి పద్యమునొక దానివి వినిపింతును.

మ జననీ నీవుమహాపతివ్రతవు నీసౌశీల్యమిల్లాంద్రకె
ల్లనుమేల్బంతి రఘూద్వహాంఘ్రియుగళీ లగ్నాత్మవై యుండుమీ
యనినేనెవ్వడ విన్నవింప బఠిబాయంజేసి విన్నొంటిడిం
చినపాపాత్ముడ నూరికేగుమను చుణ సెల్విచ్చెదే నావుడున్.

ఇక్కడికి లక్ష్మణుని ఘట్టము ముగిసినది. మనమొక్కమారు సీత వద్దకు వత్తము. ఆమెయమోఘ వాక్యసరణి భారతనారీమణుల జీవితలక్ష్య సౌభాగ్యసౌధరాజమునకు సోపానము.

లక్ష్మణుని వాక్యముల విన్నసీత దుఃఖపరవశయై నేలపై వ్రాలినది. ఒక రెండు ఘడియల కాలమామెకు స్మృతిలేదనియే చెప్పవలెను. భరింపరాని వేడి

మాటలువిన్న ఆ యిల్లాలి హృదయ స్పందన నెవ్వడు లెక్కించగలడు? అట్లు ముహూర్తకాలము గడవగా ఆమె బాహ్యేంద్రియ వ్యాపారము కలదైనది. కాని కన్నీటి కాలువలు మాత్రము కట్టుబడలేదు. జాలువారు ఆమె కన్నీటిధారలు చెక్కిళులపైనుండి దిగజారి ఆమె వక్షస్థలమును తడపగా పైటచెంగున కన్నీరును అద్దుకొనుచు లేచినది. తనలో తానేమియోతలచుకొనుచున్నది. ఆ తలపులకు కాబోలు తలను పంకించుకొనుచున్నది. ఏవేవియో భావతరంగము లాసాధ్వీమణి హృదయమున కదల బారగా మ్రుక్కున వ్రేలిడుకొని కొంతవడికి ఆ భావనల నాపుకొని లక్ష్మణునకు కొన్ని సందేశములందించినది.

ఇప్పుడు సీతాకాంత శోకరసమున మునిగి లక్ష్మణునితో పలుకు పలుకులు తాత్కాలికములుకావు. అవి సార్వకాలికములగు దివ్య సందేశములు.

లక్ష్మణా! ఈ నా శరీరము చతుర్ముఖునిచేదుఃఖానుభవము కొరకే సృష్టించబడినది. దుఃఖమునకేది పూర్ణరూపమో అదియే నేటినాజీవితము. పూర్వజన్మమునందేపాపమును చేయకున్నచో ఈ దుఃఖఫలము నాకెక్కడినుండి వచ్చును? నా ప్రాక్తన జీవితము నందేదాంపత్యము విడదీయబడినదో అని విలపిల్లినది.

మామికేయం తనుర్నూనం సృష్టా దుఃఖాయ లక్ష్మణ
ధాత్రా యస్యాస్తథామేద్య దుఃఖమూర్తిః ప్రదృశ్యతే
కిం ను పాపం కృతం పూర్వం కో వా దారైర్వియోజితః

ఈ సీత విలాపములోని సిద్ధాంత సూక్తులు ఒక కాలములోని వెట్లగును?ప్రతి జీవునకును సంబంధించిన కర్మఫలస్వరూపనిరూపణలీ వాక్యములు. అది యట్లుండనిండు. నేటి సీతాకాంత దుఃఖభాగిత్వము నెవ్వరు వర్ణింపగలరు? సీత జీవితమునందిది రెండవ ఘట్టము. తొలిఘట్టము దండకారణ్యము నందలి రామవియోగము. అది రాముని మరల చూతునన్న ఆశాబంధము కల జీవితము. ఈనాటి దదికాదు. అంతియే కాదు. తన్నెవ్వరైన నీపతినిన్నెందుకిట్లు విడిచిపెట్టెను? అని ప్రశ్నించినచో సమాధానమిచ్చుటకు పెదవి కదపరాని ఘట్టముకూడ. కావుననే సీత ఈ మాటలను లక్ష్మణునితో మొరబెట్టుకొని, నేనీ గంగాజలముల తను త్యాగమేల చేయగూడదు? అనికూడ విలపించినది.

కాని ఆమె ఆపని చేయలేదు. అది చేయదగిన పని కాదని ఒక ధర్మసూత్రము ఆమెను అడ్డుకొన్నది. ఏమాసూత్రము? స్త్రీని పెండ్లియాడుట వంశ

మును నిలువుకొనుటకేననునది భారతీయ ధర్మ సూత్రము. గర్భవతియగు తాను తను త్యాగమును చేయుట వంశాం కురమును భేదించుటయని ఆమె ధర్మ సంస్కారము ఆ తల్లిని అడ్డుకొన్నది. ఆమె జగన్మాత, ఆదర్శజీవి. లక్ష్మణునితో ఆమె అన్నమాట ఇది.

॥త్యజేయం రాజవంశస్తు భర్తుర్యే పరిహాస్యతే.

కర్తవ్యపాలన మనఇదియే. వేదశాస్త్రములు విధించిన విధులు కర్తవ్యములు. వాటిని పాలించుట కర్తవ్య పాలనము. ఇంతియేకాదు. రాముని పత్నీత్యాగము కళంకము కాదని ఈమె నిరూపించినదికూడ. కావుననే లక్ష్మణుని కన్నీటి ధారలను ధర్మ సూత్రములతో తుడిచి, పతిదేవునకు కొన్ని విన్నపముల విన్నవించుకొనుచు లక్ష్మణుని చేతికి వినతి పత్రము నందించి పంపినది.

దుఃఖభాగినియైయున్న తన్నుజూచి కాలుకదల్పలేని లక్ష్మణుని సౌమిత్రిః రాజాజ్ఞను పాలింపుము అది నీకర్తవ్యము. దానినెట్లు తప్పించుకొనగలవుః అని నేను చెప్పుకొన్ని మాటలను వినుమని వినిపించినది.

యథాజ్ఞాం కురు సౌమిత్రే త్యజమాం దుఃఖభాగినీం
విదేశే స్థీయతాం రాజ్ఞశ్శృణుచేదం వచోమమ.

ఆమె వినిపించిన మాటలివ్వి.

మొదటి మాటగా తన అత్తలకందరకును తారతమ్యము లేకుండ తన అంజలి బంధము నర్పించమన్నది.

రామునకు తన కుశల వార్తను తెలపమన్నది. ఆ వెంటనే వీరందరికి తన ప్రణామముగా పాదములకు మ్రొక్కమన్నది. ఆ మాటలలో మాటగా మరల లక్ష్మణుని నీ స్వధర్మమును వీడవద్దని బోధించినది.

శ్వశ్రూణామవిశేషేణ ప్రాంజలి ప్రగ్రహేణచ
శిరసా వంద్య చరణౌ కుశలం బ్రూహి పార్థివం
శిరసాభినతో బ్రూయాత్సర్వాసామేవ లక్ష్మణ'
వక్తవ్యశ్చాపి నృపతిర్ధర్మేషు సుసమాహితః

ఇక రామునితో చెప్పుమన్నమాటలెవ్వియో మీరు సావధానులై వినుడు. రాముడు తిన కభిముఖుడై ఉన్నటులగనే రాముని సంబోధించినది. రాఘవా! అని. ఆ సంబోధనలోని అభిప్రాయమేమి? తనభర్తకు ఆతనివంశప్రతిష్ఠను స్మృతికితెచ్చినది. తరువాత సీత ఎంత పారిశుద్ధ్యతగల వ్యక్తియో నీవు సంపూర్ణముగ ఎరుగుదువన్నది. తన పారిశుద్ధ్యమేగాక నీయందుగల భక్తిప్రపత్తులెట్టివో నీకు తెలియనిది కావన్నది. కేవలముగ భక్తిప్రపత్తులతో మెలగుటయే గాక నీహితమునే ఎల్లప్పుడును కోరుదాసనని నీవెరుగని విషయము కాదన్నది. ఈ భావములుగల శ్లోకమును గూడ వినుడు.

జానాసి చ యథాశుద్ధా సీతా తత్త్వేన రాఘవ
భక్త్యా చ పరయా యుక్తా హితా చ తవ నిత్యశః

తరువాతి విషయమేమి? తన్ను పరిత్యజించుటను గురించి తనకేమి యభిప్రాయము కలదో తెలుపవలెను. చక్కగ తెలిపినది. రామునితో సాక్షాత్తుగమాట్లాడినట్లె చెప్పినది.

ఆమె యమృత సూక్తులను వినుడు.

అహం త్యక్తా త్వయా వీర ప్రజావాదస్య భీరుణా
యచ్చ తే వచనీయం స్యాదపవాద సముత్థితం
మయాపి పరిహర్తవ్యం త్వం హి మే పరమాగతిః

నీవునన్నిట్లు వదులుటకు కారణము నీకు నాయందుగల శంక కాదన్నది. నాపవిత్రతను గూర్చి నీకు శంకలేదన్నది. లోకులు అజ్ఞానముచే నాపవిత్రతను గుర్తెరుగక నా శీలమును శంకించగా లోకాపవాదమును భరింపని నీ హృదయము కదలబారుచేనన్నిట్లు ఏకాకినిగావించుటకు కారణమని నేను గ్రహించితినన్నది. అట్టి లోకాపవాదమును తొలగించుకొను బాధ్యత రాజువగు నీ కొక్కనికేగాక రాజపత్నినగు నాకును కలదన్నది. "మయాపి పరిహర్తవ్యం" కలదు కాదు. విధియని విధి వాక్యమును వాడినది కర్తవ్యమను పదముచేత. అంతమాత్రముననే ఆమెతృప్తురాలుకాలేదు చివ్వరిలో తన శరణాగతిని తెలిపినది. "త్వంహి మే పరమాగతిః" అని

తరువాతి సందేశమేమి?

తనకెదురుగా నిలుపుకున్న రాముని పరోక్షముగా వించి, మరల లక్ష్మణుని సంబోధించినది.

లక్ష్మణా! ధర్మమునుండి మనసును చెదరనివ్వని ఆ రామునకిట్లు చెప్పమన్నది.

యథా భ్రాతృషు వర్తేథా స్తథా పౌరేషు నిత్యదా.

నీ సోదరులందెట్లుందువో పౌరుల యందును అట్లేవర్తింపుమని తన హిత వాక్యమును వినిపించినది. తరువాత ఇది పరమధర్మము కావున వర్ణించుట కలవిగాని కల్పవృక్షమీ ధర్మాను సరణమన్నది.

ఆ ప్రమాణవాక్యమును వినుడు.

"పరమో హ్యేషధర్మస్త్యాదేషా కీర్తిరనుత్తమా"

తరువాత? పౌర జానపదులయందు రామునకుగల అత్యంత ప్రీతిని మరొక మాటతో కూడ తెలిపినది. ఏమది?

యత్తు పౌరజనం మాం చ ధర్మేణ సమవాప్నుయా.

పురజనులను నన్నును సమానముగనే చూచు నీ ధర్మబుద్ధికి కొరత ఎక్కడ? అని తనను విడనాడుటలో గల రాముని ప్రత్యేక ధర్మమును ప్రకటించినది. అంతతో ఆమె ఆగలేదు. నేను నీ అర్ధాంగినేనని మరొక్కమాటతో తెలుపుకొన్నది. గమనింపుడు.

॥అహం తు నానుశోచామి స్వశరీరం నరర్షభ
యథాపవాదం పౌరాణాం తథైవ రఘునందన.

రఘునందనా రామా! నీవేవిధముగ పౌరుల అపవాదమును ఓర్వజాలక నన్ను ఎడబాసితివో అట్లే లోకనిందకు ఓర్వక నాదేహమునైన వదలుకొందు నన్నది. ఈమాటతో మనకేమి తేలినది? రామునకు సీతపైగల ప్రేమ ఎంతదో సీతయే తన ముఖముగ చెప్పి లోకాపవాదభీతినాకును నీతో సమానమైన దేనని తన బాధ్యతను హృదయపూర్వకముగ చెప్పినది. తరవాతది తన వ్యక్తిగతమగు సందేశముగాక, స్త్రీ జాతికంతకును అర్హమగు స్వభావమును ధర్మమును ప్రకటించినది.

॥పతిర్హి దైవతం నార్యాః పతిర్బంధుః పతిర్గురుః
ప్రాణైరపి ప్రియం తస్మాద్భర్తుః కార్యవిశేషతః

స్త్రీలకు దైవతము భర్తయట. అతడే బంధువట. గురువుకూడ. అతడేయట. కావున ప్రాణముల నర్పించియు అతని కార్యమును నెరవేర్చదగు బాధ్యత స్త్రీకి కలదట. అంతతో సీత సంభాషణ పూర్తియైనది. ఇప్పుడు సీతాపరిత్యాగఘట్టము నేటి మహిళామండలికి ఎట్లు అర్థముకావలెను? రాముని హృదయము కఠినమనిగాని లేక నాటి పురుషుల స్వేచ్ఛ అట్లుఉన్నదనిగాని, కాక రామునికి విశాలదృష్టి ఈ భాగమున లేదనిగాని అర్థముకాకూడదు. భారతీయ చక్రవర్తుల చరిత్రలకిది కీర్తిపతాకమని అర్థముకావలెను

ముందుకు పోదము తరువాత కథఏమి?

లక్ష్మణుడు అయోధ్యకు తిరుగుమొగము పట్టినాడు. ఓర్వజాలని దుఃఖము నదీనమనస్కుడయ్యె వదినగారికి సాగిలబడి వందనమాచరించినాడు. ఆమె మాటలకు బదులేమిచెప్పును? ఆ జగన్మాతకు ప్రదక్షిణము గావించి, బిగ్గరగ ఏడ్చుచునే అవ్వలిగట్టుకు చేర్చదగు పడవనెక్కినాడు. పడవ అవ్వలిఒడ్డునకు చేరినది. లక్ష్మణుని శోకభారమట్లేయున్నది. అట్లే రథమును గూడ అధిరోహించినాడు. కాని అతని దృష్టులు సీతనుండి మరలలేదు.

దిక్కులేనిదానివలె క్రిందబడి పొరలుచున్న ఆ దుఃఖభాగిని నుండి అతని చూపులెట్లుమరలును? సీతాకాంత ఈనాడు అనుభవించు హృదయ విదారక దృశ్యమును చూడలేక చూచుచునే అతడు తన రథపయనమును సాగించినాడు.

అంతకంతకు దూరమై కంటిచూపుకు అందని సౌమిత్రిరథమును, సౌమిత్రినిగూడ చూడజాలక దుఃఖకాతరయై వనమయూరమువలె క్రేంకరించుచు ఏడ్వసాగినది. సీతాకాంత "కాలాయతస్మైనమః"

సీతను విడిచిన ప్రదేశము మహారణ్యముకాదు. తమ విశుద్ధాంతః కరణలయందు కరుణారసమును పరిపూర్ణముగ నింపుకొనియున్న తాపసవర్యుల పవిత్ర ఆశ్రమ భూమియది.

వాల్మీకిమహర్షి ఆశ్రమమక్కడికి అత్యంతసామీప్యము. ముని బాలకులక్కడ తిరుగాడుచునే యుందురు. రోదనముచేయు సీతాకాంత రోదనధ్వని ఆ మునిబాలకుల చెవిని పడినది. ఆ మునిబాలకులు వెంటనే ఆశ్రమాభ్యంతరమునకు పరుగిడినారు. వారాసీతకాంతను ఎవ్వతెయో ఒకస్త్రీయని తలచలేదు. ఈమె యొక మహాత్ముని ఇల్లాలనియే వారూహించినారు. ఈమె మహాలక్ష్మియని ఆమె ముఖమండల

మునకెలుగొందు దివ్యతేజము వారి దృష్టికి రాకపోలేదు. ఆబాలకులందరును మహా తపస్వియు బుద్ధిశాలియునగు వాల్మీకి మునివర్యుల పాదములకు మ్రొక్కి మునివర్యా: హేభగవన్ గంగానదీ తీరమునందెవ్వతెయో ఒక నారీమణి దుఃఖకాతరయై వెక్కి-వెక్కి ఏడ్చుచున్నది. ఆమె స్వర్గసీమనుండి జారిపడినదేమో? నిజమునకా వధూటి ఆయబల అట్టిదుఃఖమున కర్హురాలుగాదు. అయ్యును దిక్కు-లేనిదానివలె దుఃఖించుచున్నది. ఆమె మానవకాంతయని మాకు తోచదనిచెప్పి, ఆమెనుకాపాడుమని అర్థించినారు ఆ మాటలను విన్న మహర్షి చివాలునలేవలేదు. ఆ మహనీయుడు తన దీర్ఘదృష్టిని ప్రసరించినారు. మహర్షుల అంతఃకరణలు ఈనాటి దూరదర్శన యంత్రములనుట నమ్మరాని సత్యముకాదు. నమ్మనివారు భారతీయులుకారు.

మహర్షి దృక్పథమున మహాలక్ష్మి యవతార స్వరూపిణియగు సీతాకాంత సాక్షాత్క-రించినది. ఒక్క- క్షణమాత్రననే ఆసనము నుండి లేచినారు మహర్షి. నిజమునకు శిష్యులనాతడు రమ్మనలేదు. అంత సమయమెక్క-డిది? శిష్యులందరా గురువర్యులవెంట నంటినారు. పాదచారియయ్యె ఆ విదేహరాజ పుత్రికను దర్శించి ఆమె దరిజేరినారు మహర్షి.

ఆమె రాముని ఇల్లాలు. దుఃఖభారాక్రాంత. విదేహరాజ పుత్రిక. దశరథుని కోడలు. ఆమెను ఏమని పలకరించవలెనో ఎట్లు ఆదరించి తన పర్ణ కుటీరమునకు తోడ్కొ-ని పోవలయునో వాల్మీకి ఎరుగని వాఙ్మయముకాదు. దశరథుడాయనకు ఆప్త మిత్రుడుగదా? తనకును ఈమె కోడలని యే భావించుట కా మహర్షికి స్థానము లేకపోలేదు. ఆమెను నీ ఇక్క-డికేల వచ్చితివమ్మా ? అని ప్రశ్నించవలసిన అవసరమేమున్నది? తన మధురవాగ్గుంభనలతో ఆమె మనఃక్లేశమునంతను తుడిచినారు మహర్షి. నేను నీ చరిత్రనంతను నాదివ్య చక్షుస్సుతో చూచితినని చెప్పినారు. నీ విశుద్ధత్వము నేనెరుగుదుననినారు. ఆమెకుగల పావనత్వమును తన మధుర వాక్కు-లతో ప్రసంగించి, నాఆశ్రమమునకు సమీపముననే గల మునికాంతల పర్ణ కుటీరముల నీవు వసింపవచ్చునని ఆదరముగబలికి, వారును భూతభవిష్యద్వర్త మానముల నెరుగగదగు తాపసకాంతలని సీతకు ధైర్యమును చెప్పినారు. ఈమాట యందొక భావము మునికి లేకపోలేదు. ఈతాపస కాంతలు నీ పూర్వచరిత్రను పశ్నింపరని ద్యోతకము కావించినారు. అంతే కాదు. సీతకు వారెట్లు రక్షణ కల్పింతురో గూడ ఒకచక్క-ని ఉపమానమును వాడినారు.

"తాస్త్వాం వత్సే యథావత్సాం పాలయిష్యతి నిత్యశః" వత్సే! అని సంబోధించి అవుదూడను పాలించునట్లు నిన్ను వారు పాలింతురని, అర్ఘ్యమందించి నీ స్వగృహ ముగ భావించుకొమ్మని ఆహ్వానించినారు.

శ్రోతలారా ! మీరీ కథాభాగమునందేమి తెలిసికొంటిరి? భారతీయ మహర్షుల నేమని అర్థము చేసికొంటిరి? ఆనాడు కారుణ్యసంఘములు వేరుగ యుండెనను కొంటిరా? వాటికొరకై ధన సంచయములు నిధులైయుండెనను కొంటిరా? పాశ్చాత్య దేశములు మీ దృష్టినుండి తొలగుచో భారతీయ భాగ్యలక్ష్మి మీ కన్నుల ఎదుట నిలువగలదు. నాటి తాపసకాంతలు రాజకాంతలకు పురుడు పోయదగిన సేవకు రాండ్రు. గమనింపుడు. కథకురండు.

సీతా కాంత ఆ మహర్షి పాదములకు వందనమాచరించి, దోసిలి యొగ్గి ఆ బ్రహ్మణ్యుని వెంటనంటినది.

సీతను వెంట నిడుకొనివచ్చు వాల్మీకిముని చంద్రుల చూచిన మునికాంతలు ఆ మునికి ఎదురైరాగా ఆ మునికాంతలకు సీతను ఎరుకపరచి, వప్పగించి, ఆమెను చూచదవలసిన విధమునంతను వారికి చక్కగ చెప్పినారు. వారికి చక్కగ చెప్పుట యననేమి?

"స్నుషా దశరథస్యైషా జనక స్య సుతా సతీ
అపాపా పతినాత్యక్తా పరిపాల్యా మయా సదా.

వారు ఈమె చరిత్రను ప్రశ్నించకుండగనే ఆమె పాతివ్రత్యమును గురించి ఈమెను పాలించు బాధ్యత నాదియని మీరీమెను పరమ స్నేహమున పాలింపుడని నారు. పరమస్నేహమననేమి? ఆత్మ ప్రేమగ చూడుడనినారు. ఈమెను చూచుట యందు నా వాక్యగౌరవ మొక్కటేకాక మీ కీమె ప్రత్యేకముగ పూజ్యురాలనినారు ఈమె కేవలముగ రాజపుత్రికకాదని ధ్వనించి, జగన్మాతయని సూచించినారు.

ఇమాం భవంతః పశ్యంతు స్నేహేన పరమేణ హి
గౌరవాన్మమ వాక్యాచ్చ పూజ్యావోస్తు విశేషతః.

సీతకు ముని పత్నులతో ఆశ్రమ ప్రవేశమైనది. వాల్మీకిమహర్షియు తన ఆశ్రమమున ప్రవేశించినారు. మనమొక్క మారు లక్ష్మణుని వద్దకు వత్తము.

సుమంత్రుడు నడపగా లక్ష్మణుని రథముసాగినది. సీతనుండి ఆతని చూపులు మరల లేదు. ఆమె పర్ణకుటీరమున ప్రవేశించుట నాతడు చూచుచునే యుండెను. ఆ మహాభాగుని దుఃఖమాగుటలేదు. రెట్టించినదికూడ. రాముని హృదయము ఇంత కఠినమా? అనిపించినది.

సీత రాజాంతఃపురమున ప్రసవించదగు మహారాణి. నేడామె మాతృమూర్తి యగుటకు పర్ణకుటీరము నిలయమైనది. ఈఘట్టమును తలచిన లక్ష్మణునకు రాముని మార్దవమెట్లు కన్పట్టును? అంతలో లక్ష్మణుడత్యంత దుఃఖభాగు డయ్యెననుట యందాశ్చర్యములేదు. మరియొకరి ఓదార్పునగాని దుఃఖము వెనుకకు మరలదు. ఇది ప్రకృతి స్వభావము. ఇప్పుడు లక్ష్మణుని వద్దనున్నవాడు సుమంత్రుడు.

మన రామాయణ మహాకావ్యమున సుమంత్రుడొక మహోత్కృష్టమగు పాత్ర. సుమంత్రుడు దశరథునకు ఆప్తమంత్రి. రామకథా రహస్యమాతడెరుగనిది కాదు. రాముడవతరించుటకు ముందు చరిత్రనంతను అతడే దశరథునకెరింగించి నాడు. అంతేకాదు. రాముని అవతారసమాప్తియు అతడెరుగును మనకిప్పుడు రాముని అవతార సమాప్తి కథా భాగము చాల ముఖ్యము. సుమంత్రుడు లక్ష్మణుని దుఃఖో పశమనమునకై రాముని అవతార సమాప్తి కథను చెప్పినాడీఘట్టమున. వినుడు.

ఒకనాటి ఘట్టము

అది వశిష్ఠమునీంద్రుని ఆశ్రమము. దుర్వాసమునీంద్రులేతెంచినారు వశిష్ఠుని ఆశ్రమమునకు. అవి చాతుర్మాస్యదినములగుటచే ఆ వ్రతదీక్షను వశిష్ఠాశ్రమమున నెరవేర్పవచ్చినారు దుర్వాసులు. అప్పటికి ఇక్ష్వాకు వంశమున శ్రీరాముడవతరించి నాడు. అతడు సాక్షాన్నారాయణుడే అయ్యును నాటికి దశరథ నందనుడ య్యేయుండెను.

చాతుర్మాస్యదివసములు గడచుచున్నవి. దశరథేశ్వరుడు ఆ రోజులలోననే వశిష్ఠుని దర్శింప వచ్చినాడు. రాజర్షియగు దశరథుడు ఆ మునివర్యులకు పాదాభి వందనములగావింపగా. వారును రాజర్షిని సత్కరించినారు. పరస్పరసంభాషణలు కొంతసేపు జరిగినవి. తరువాతి ఘట్టము.

దశరథుడు తన పుత్రుల భావిజీవితమును దుర్వాసమునీంద్రుల వలన వినదలచినాడు. ఇట్లు ప్రశ్నించినాడు.

మునిచంద్రా ! ఈ భూమిపై నా వంశమెంత కాలముండును? రాముడెంత కాలము జీవించును? మిగిలిన పుత్రులెంతకాలము అయుర్దాయము కలవారగుదురు? ఈ ప్రశ్నలకు దూర్వాసుడిచ్చిన సమాధానము మనకు చాల ముఖ్యము.

దుర్వాసులు దశరధునకు రాముడు సాక్షాన్నారాయణుడని మొదటగ తెలిపి, అతడిప్పుడు భూమిపై పుట్టుటకు కారణమును తెలిపినాడు.

రాముడవతరించుటకు ముందు కథా ఘట్టమిది. నేను చెప్పునది ఉత్తర కాండ కథా భాగమని మీరు మరువకుడు.

సృష్టిఖండమున దేవతలకును రాక్షసులకును యుద్ధము జరుగుట క్రొత్త కాదు. ఒకనాడు దేవతలచే రాక్షసులు పరాభవింపబడి తాము బ్రతుకుటకు భృగు మహర్షివారి భార్యను మమ్ము రక్షింపుమని శరణు వేడినారు. అప్పుడామె ఆరాక్షసులను తనలో దాచినది.

దుర్మార్గులకు ఆశ్రయ మిచ్చిన వారికి ప్రమాదము రాకుండుటెట్లు? దేవతలీ సంగతిని విష్ణుమూర్తికి తెలుపగా ఆతడు తన సుదర్శన చక్రముచే భృగు మహర్షివారి భార్య కంఠమును నరికి, ఆమె గర్భగోళమున దాగిన రాక్షసులను పరిమార్చినారు. పరిపాలకుని కర్తవ్యమునాతడు నెరవేర్చినాడు. భృగు వంశీకులు చాల కోపిష్ఠులు. భృగుమహర్షి వెంటనే శ్రీమహావిష్ణువును శపించినాడు. ఏమని?

యస్మాదవధ్యాం మే భార్యాం అవధీః క్రోధమూర్ఛితః
తస్మాత్వం మానుషే లోకే జనిష్యసి జనార్ధన
తత్ర పత్నీ వియోగంత్వం ప్రాప్స్యసే బహువార్షికం.

జనార్దనా! స్త్రీయని శంకించక నా భార్యను వధించితివి కావున నీవు మనుష్య లోకమున జన్మించి చాల సంవత్సరములు భార్యావియోగము నొందుదువుగాకఅని. అట్లు శాపగ్రస్తుడగు మహావిష్ణువే మనరాముడు.

దశరధా! ఆ విష్ణువు నీకు పుత్రుడై జన్మించినాడు. అతనికి చాలకాలము భార్యా వియోగము కలుగును. ఈ అయోధ్యయందాతడు పదకొండువేల సంవత్సరములుండును. ఆ తరువాత రాముడు చేయు అశ్వమేధాదిక్రతు ఫలములతో బ్రహ్మలోకమున కేగును. అతడనేక రాజవంశములనీలోపలనే స్థాపించును. నీ పుత్రుడగు రామునకు కుశలవులను ఇద్దరు పుత్రులు కలుగుదురు. కాని ఆ పుత్రులు నీ నగర

మున జన్మింపరు అని చెప్పివారు. ఇక్కడ మనము ముఖ్యముగ గ్రహించదగిన దీవిషయమే.

"అన్యత్ర న త్వయోధ్యాయాం సత్యమేతన్న సంశయః

అయ్యాను వారీ అయోధ్యకు పట్టాభిషిక్తులై ఇక్ష్వాకు రాజ్యమును పరిపాలింతురు. లక్ష్మణ, భరత, శత్రుఘ్నులును సుఖముగ నుందురు అని చెప్పినారు.

ఇక్కడ మీరు భగవంతునకు శాపమా? అనుకొనకుడు.

భగవంతుడు సృష్టించునప్పుడు కర్తయగును ఆకర్తవ్యము నాతడేకల్పించుకొనును. మాయ ఆతని స్వాధీనమునందుండును. జీవుల సమష్టి ప్రారబ్ధ ఫలము ననుసరించి సృష్టికి ఆతడు ప్రారంభకు డగుచుండును. స్థితిలయములు కూడ అంతియే. మీకిప్పుడు రాముడు తన అవతారమును చాలించిన కథను కూడ తెలుపుదును. అది విన్నతరువాతనే రామచరిత్ర మీకు అర్థమగును. అదియు సుమంత్రునిచే లక్ష్మణునకు చెప్పబడిన కథయే. అవతారము జననలీల కాగా నిర్యాణమును నిర్యాణలీలయేగాని వేరుకాదు. సామాన్యముగ రామావతారమును వినినంతమంది రామావతార సమాప్తి ఎట్లయ్యెనో ఎరుగరు. రాముని అవతార సమాప్తి తెలియుట చాల అవసరము.

## రామావతార సమాప్తి

రామావతారము కృష్ణావతారమువలె సమాప్తి జరుగలేదు. కృష్ణనిర్యాణము వంటిది రామనిర్యాణము కాదు. రాముని అవతార సమాప్తి యందొక ప్రత్యేకత యున్నది. రాముని రాజ్యము పదకొండు వేల సంవత్సరములు నడచినది. అవతార కాలము ముగిసినది. ఒకనాటి ఘట్టము.

అది రాముని పేరోలగము. ఎవ్వడో ఒక తపస్వి రామదర్శనమునకేతెంచినాడు. ఆ ముని పుంగవుని రాకను రామునకెరింగించినాడు లక్ష్మణుడు. లక్ష్మణుని ముఖముగనే ఆతపస్వి లోపలికి వచ్చుటకు రామాజ్ఞమైనది. రామచంద్రుడర్ఘ్య పాద్యాదివిధులచే ఆమునిపుంగవునర్చించి సుఖాసీనుని గావించి, తామెవ్వరో! తమ రాకకు కారణమేమియో తెలవిండని ఆ మునిని ప్రార్థించగా ఆతడన్నమాట ఇది.

రామా! నేనొక సందేశము నందింప బ్రహ్మలోకము నుండి ఏతెంచితిని. మనమిద్దరమును మాటాడునప్పుడెవ్వఙును మనల దర్శింపరాదు. మన మాటలు

ఎవ్వరి చెవ్వునను పడరాదు. అట్లెవ్వడైన మనము మాట్లాడుకొనునప్పుడు మన కంట బడినను, మన మాటల విన్నను అతడు వధార్హుడు కావలెను. ఇది నా కోరిక అనినాడు. ఆ మునిచంద్రుని పలుకులకు సమ్మతించినాడు రామచంద్రుడు. వారిద్దరును రహస్యగృహమున ప్రవేశించినారు కాని ద్వారదేశము నందెవ్వరినైన నిలబెట్టవలెను గదా? లక్ష్మణునే పిలచి శ్రీరామచంద్రుడు ఈ విషయమును తెలిపి ఆతనినే ద్వారదేశమున నిలిపినాడు. లక్ష్మణుడు వీరి సంభాషణ పూర్తియగునంత వరకును ఎవ్వరిని లోపలకు రానివ్వకూడదు. వచ్చుచో మరణశిక్షయే. అది లక్ష్మణునకు భూలోకమున సమాప్తకాలము.

ఉ॥ వాయువశంబులై యెగసి వారిధరంబులు మింటగూడుచుం
బాయుచునుండు కైవడి ప్రపంచము సర్వము కాలతంత్రమై
పాయుచు గూడుచుండు నొక భంగిచరింపదు కాల మన్నియుం
జేయుచు నుండు కాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్.

ఆ వచ్చిన మునికినిరామునకును సంభాషణ ప్రారంభమైనది. నిజమునకా వచ్చినది మునికాదు. ఆతడు యముడు. కాలపురుషునిచే బ్రహ్మగారు రామునకు నీవు భూమియందుండు కాలము పూర్తియైనది మనవైకుంఠమున కేతెంచుమని ప్రార్థనాపూర్వకముగ కబురు పంపినాడు. బ్రహ్మదేవుడు పంపిన సందేశమును వినిపించునపుడు యముడుశ్రీరామునకు చెప్పిన మాటలివ్వి.

"మహార్ణవే శయానోప్సు మాం త్వం పూర్వమజీజనః

రామచంద్రా! ప్రపంచ మంతయు జలమయమైయుండ నీ నాభికమలమునుండి నన్ను సృజించితివి. ఆ తరువాత అనంతుని సృష్టించితివి. ఆ సమయముననే మధుకైటభులు నీచే సంహరింపబడినారు. నేనిప్పుడు చేయు సృష్టికార్యము నీ ఆజ్ఞాపాలనము. మహాప్రభో! నీవు సనాతన బ్రహ్మవే అయ్యును. విష్ణుత్వమునొంది దేవతలకు సాయము చేయుచుందువు

ఆ నీవు రావణవధకై భూమిపై అవతరించితివి. మహనీయా! తాము భూమిపైవసించదగుకాలముపరిపూర్ణమైనది. కావున తమ కోరిక ననుసరించి వైకుంఠమునకేతెంతురో భూలోకమున వసింతురో తెలుప ప్రార్థితుడ నని చెప్పుటకునన్ను పంపినాడు రామచంద్రా! అనినాడా మహర్షి లేక అకాలుడు. అప్పుడు రాముడేమని కాలునకు సమాధానమిచ్చెను?

"త్రయాణామపి లోకానాం కార్యార్థం మమ సంభవః
భద్రం తేస్తు గమిష్యామి యత ఏవాహమాగతః

ముల్లోకముల రక్షించుటకే నాజన్మ గావున నాకార్యము పూర్తియగుటచే బ్రహ్మ ఆహ్వానము ననుసరింతునని సమాధానమిచ్చెను.

ఇప్పుడు రాముడెవ్వడని గుర్తించుదురో ఆ సమస్యను శ్రోతలకే వదలెదను. ఒక్కమారు ద్వారదేశమునకు వత్తము. లోపల రాముని సంభాషణ జరుగుచుండగనే దుర్వాసమహర్షివారు రామదర్శనమునకే తెంచినారు. ద్వారము లక్ష్మణ పాలితమై యున్నది. తనరాకను శీఘ్రముగ తెలుపుమని లక్ష్మణుని ముని తొందర పెట్టినారు. ఇప్పుడు లక్ష్మణుని కర్తవ్యమేమి? రామాజ్ఞను తెలిపి ఒక్క ముహూర్త కాలము ఆగుమనినాడు. మునివర్యులకు అడ్డుచెప్పక తప్పలేదు.

దుర్వాసులు అతితీవ్ర స్వరూపులు. అంతలో కన్నులనెర్రజేసి శపింతుననినారు. తాను లోపలికి పోవుచో తన శిరము ఖండించబడునని లక్ష్మణునకు తెలియును. కాని అది తనకు మాత్రమే పరిమితమగును మహర్షి శపించుచో వంశమేమియగునోయని విచారించినాడు సౌమిత్రి. లోనికి వెళ్ళినాడు. అదియే లక్ష్మణుని నేటి అపరాధము. దుర్వాసుడు లోపలికి వెళ్ళిన కార్యము పెద్దదికాదు. భోజనము కోరినాడు. అంతతో ఆ కథ ముగిసినది. కాలుడు వెళ్ళినాడు. మన మొక్కమారు రాముని దర్బారునకు వత్తము.

నాడు ఆక్షణమున రాముడు దుఃఖార్తుడై సింహాసనమున కూర్చుండెను. కారణమేమి? లక్ష్మణుని శిరమును ఛేదింపవలెను. తాను రాజు. తాను సోదర భావమున లక్ష్మణుని చూడకూడదు లక్ష్మణుడు మాత్రము దీనముఖుడైలేడు శిక్షకు సిద్ధుడై యుండెను. శిక్షను కోరెనుకూడ. ఇదియే భారతీయత. రాజు మంత్రి పురోహితులతో చర్చింపక శిక్షనివ్వరాదు. రాముడు మంత్రి పురోహితుల రావించినాడు. వృత్తాంతము నెరింగించినాడు. వశిష్ఠుని సమాధానమిది.

"నాస్య స్నేహేన కాకుత్స్థ ప్రతిజ్ఞాం హాతు మర్హసి.

రామా! స్నేహబుద్ధితో ప్రతిజ్ఞను వదలవద్దని తెలిపినారు. రాముడు దండనీతి శాస్త్రమున పారంగతుడు. కావున లక్ష్మణుని శిరచ్ఛేదము గావింపక ఆతనిని త్యాగము చేసినాడు. ఇదియుమరణదండనలోని భాగమే.

లక్ష్మణుడు అయోధ్యను వదలినాడు. అతడు యోగమున సమాధినిష్ఠుడైకూర్చొ నగా దేవేంద్రుడు స్వర్గమునకు తోడ్కొని పోవుట జరిగినది. దేవతలందరును సంతసించినారు ఈతడు విష్ణువుయొక్క చతుర్థాంశమని

"తతో విష్ణోశ్చతుర్భాగమాగతం సురసత్తమాః
దృష్ట్వా ప్రముదితాస్సర్వేపూజయన్ ఋషిభిస్సహ.

ఇక రాముడయోధ్యను వదలవలెను దీనినికూడ గమనింపుడు. రామునకు లక్ష్మణుని వియోగదుఃఖము భరింపరానిది. వశిష్ఠ మునీంద్రు లాతని శోకమును మాన్పినారు. తరువాతి కథఇది,

రాముని పేరోలగము మంత్రి సామంతపురోహితులతోనిండినది. రాముని ఊహా ప్రపంచమున భరతుని రాజుగావింపవలెనని యున్నది. ప్రజలకును మంత్రి పురోహితులకునుగూడ తన ఊహను తెలిపినారు. పట్టాభిషేక సంభారముల సమకూర్ప నాజ్ఞాపించినాడు. ప్రజలనుద్దేశించి, నేమను లక్ష్మణుదేగిన త్రోవకు వెళ్ల నిశ్చయించుకొంటినని ప్రజలకు తెలిపినాడు. దీనుడై తెలుపుటకాదు. ముక్తకంఠమున పలికినాడు. ఇదియొక విచిత్రమగు సన్నివేశము. ప్రజానీకము యొక్క ముఖకమలములు వాడినవి. భరతుడు ఆ సభాస్థలియందే మూర్ఛిల్లినాడు. కొద్దికాలము గడచినది. భరతుడు తెలివినొందినాడు. భరతుడు రాజ్యమునేల స్వీకరించును? సత్యధర్మముల సాక్ష్యముగ రాజ్యము నాకు వద్దని శోకవేగమున పలుకుచు, కుశలవులకే పట్టాభిషేకమని నిర్ణయించినాడు. అట్లే జరిగినది. దక్షిణ కోసలమునకు కుశుడును, ఉత్తరకోసలమునకు లవుడును రాజులైరి. ఇప్పుడు శత్రుఘ్నుడున్న రాజ్యమునకు దూతల పంపినాడు. అది అట్లుండనిండు.

రామరాజ్యమున నాటిప్రజలు ఏమైరి? అనునది ఒక విచిత్రమగు ఘట్టము. నాటిప్రజలు రామునితో ఏమైన విన్నవించుకొనవలెనన్న నిర్భయముగనే విన్నవించుకొనెడివారు. కాని నేడు నిశ్చయులై మాటాడలేకపోయిరి. ఈ సన్నివేశ మట్టిది. వశిష్ఠమునీంద్రులు ప్రజల భావమును తెలిసికొని, ప్రత్యేకముగ రాముని ప్రజల కోర్కెలను తీర్పుమని ఆజ్ఞాపించినారు. మునీంద్రుని ఆజ్ఞ రామునకు శిరోధార్యము ప్రజలకు సావకాశము నిచ్చినాడు రాముడు.

ఆనాడు రాజొక్కడే ప్రజలకు ప్రాణమైలేడు. మంత్రి పురోహితులును అట్లే యుండిరి. ప్రజల విన్నపమిది. వారివిన్నపము ఏకగ్రీవము.

। గచ్ఛంతమను గచ్ఛామో యత్ర రామ గమిష్యసి.
సపుత్ర దారాః కాకుత్స్థ సమాగచ్ఛామ సత్పథం.

రామా! నీతోడనే దారాపుత్రాదులతో కలసి మేమందరమును వచ్చుటకు సిద్ధము గావున మమ్ము అనుగ్రహింపుమని కోరినారు. రాముడొప్పుకొనినాడు. ఇక మిగిలినది కుశలవుల పట్టాభిషేకము. అది చక్కగ జరిగినది. శత్రుఘ్నుని దగ్గరకు పోదము.

అయోధ్యనుండి దూతలు మధురానగరమునకు వెళ్లినారు. అదియే శత్రుఘ్నుడు పరిపాలించు రాజ్యము. రాముని వృత్తాంతము శత్రుఘ్నునకు తెలిసినది. శత్రుఘ్నునకిద్దరు కొడుకులు సుబాహువు, శత్రుఘాతి అనువారు. వారిద్దరకాతడు రాజ్యాభిషేకము గావించి అయోధ్యకేతెంచినాడు అప్పుడే అయోధ్యనుండి రాముని పయనము జరుగుచున్నది మంత్రిపురోహిత సామంత ప్రకృతులతోకూడ.

కృష్ణనిర్యాణమువంటిది రామావతారసమాప్తి కాదని చెప్పినాను. కృష్ణావతారమునందతడు ఏకాకియై తను త్యాగమును గావింపగా రామావతారమున ప్రజలనందర తనతో గొనిపోయి వారందరకును మోక్షమిచ్చినారు. శ్రీకృష్ణుడు రాజపీఠము నలంకరించి రాజ్యమునేలలేదు. రాముడు రాజై క్షత్రియ ధర్మమును పాలించినాడు. శ్రీకృష్ణుడు వర్ణాశ్రమ ధర్మములను ధర్మజుని ముఖముగా పరిపాలింప రాముడు తానే రాజై పరిపాలించినాడు. వర్ణాశ్రమ ధర్మముల ధ్వంసము చేయుట రామరాజ్యముకాదు. వైదిక ధర్మమును పాలించుట అవతారమునకు ప్రయోజనము. రాముడిప్పుడు అయోధ్యను ఎట్లు వదలెనో జాగరూకులై వినుడు. వినుటకాదు- ఈ దృశ్యమును దర్శింపుడు.

రాముడవతారము చాలించుట వానరులందరకును తెలిసినది. విభీషణునకు తెలిసినది లంకాపురినుండి విభీషణుడును, కిష్కింధనుండి వానరులందరును వచ్చినారు. మీరు వానరులందరును దేవగంధర్వాంశలతో వచ్చిన వారను మాటను మనసునందుంచుకొనుట మన రామాయణ శ్రవణమునకు చాల అవసరము. వారును రామునితో పయనమునకే వచ్చినారు

తాము వచ్చిన కారణమును రామునకు తెలిపినారు. అందు విభీషణునకు మాత్రము రాముడు తనతో వచ్చుటకు అనుజ్ఞనివ్వలేదు. అతడు చిరంజీవి. కావున విభీషణుడు సూర్యచంద్రులున్నంతవరకును, తన కథ ప్రపంచము ప్రపంచమునందు

వినబడుచున్నంతవరకును లంకయందేయుండి, ఇక్ష్వాకు కులదైవతమగు జగన్నాథుని సేవింపుమని ఆజ్ఞాపించినారు.

॥ ఆరాధయ జగన్నాథ మిక్ష్వాకుకుల దైవతం
ఆరాధనీయ మనిశం సర్వైర్దేవైస్సవాసవైః

విభీషణా! భగవంతుని సేవించుకొనుచు, దేవతలతోటి సఖ్యము కలిగి గార్హస్థ్య జీవితమును గడపుమనినారు, వానరులకో? వారందరకును తనతో వచ్చుటకు అనుజ్ఞనిచ్చినారు వారందరి కోర్కెననుసరించి.

హనుమంతుడేమయ్యెను?

అతడొక విచిత్రమగువ్యక్తి. అతడు ప్రపన్నుడు. ఏ కోర్కెలును ఆతనికి లేవు. వారందరు నీతోవత్తుము మేమని కోరగా ఆతడుమాత్రము మౌనమును వహించి, దోసిలియొగ్గి రాముని ముఖమునచూపుల నిలిపినాడు. అంతియే. ఆ సమయమునందాతడు భృంగరాజమై రామునిపై చూపు నిలిపినాడు. హనుమంతునకు రామాజ్ఞ ఇది.

॥ మత్కథాః ప్రచరిష్యంతి యావల్లోకే హరీశ్వర
తావద్రమస్వ సుప్రీతో మద్వాక్యమను పాలయన్

నా కథ ఎంతదనుకలోకమున వాడబడుచుండునో అంతదనుక ఆత్మారాముడవై చరింపుమని ఆజ్ఞాపించెను. తరువాతవాడు జాంబవంతుడు. ఆతడు కలియుగ ప్రారంభమువరకును భూమియందుండవలెను. అట్లే ఆజ్ఞనొసంగిన నాడతనికి. అంతతో ఆ రోజు గడచినది. ఉదయమైనది. రాముని పయనము సాగినది

# రాముని మహాప్రస్థానము

## అవతార సమాప్తి

శ్రీ రామచంద్రులు ప్రతి నిత్యమును చేయు అగ్నిహోత్రమును బ్రాహ్మణ బృందము వెంటరాగా వశిష్ఠమునీంద్రులు చేతనిడుకొని ముందు నడచినారు. అట్లే వాజపేయ యాగమునకు సంబంధించిన గొడుగులును ముందుగనే పంప బడినవి. వేదోక్తములగు క్రియలన్నియు వశిష్ఠునిచే జరుప బడినవి.

రాముడు సూక్ష్మవస్త్రముల ధరించినాడు. ఆతని చేతివ్రేళ్లకు ధర్భల లంకృతము లైనవి. మౌనమును పాటించినాడు. ఆతడెవ్వరితోడను మాటాడడు. మనస్సును బ్రహ్మభావమున లీనముగావించి ప్రణవజపమును చేయుచు, మార్గ సౌఖ్యమును విచారించకయే గృహము నుండి బయలుదేరినాడు. అప్పుడా రాఘవేశ్వరుని దివ్యతేజము వేయి సూర్యుల ప్రకాశమున వెలుగొందగా ఆయన మహాప్రస్థానము సాగినది. అప్పుడు చూచు వారలకు రాముడిట్లగ పడినాడు. శ్రీరామునకు కుడిప్రక్కన పద్మహస్తయై శ్రీదేవి యున్నది.ఎడమ ప్రక్క హ్రీదేవినిలచినది. ఆయనకు ముందు క్షాత్రతేజమున వెలుగొందు బాణాసనములు పురుషాకృతుల నొందిపయనించినవి. వేదమాతయగు గాయత్రియు, ఓంకార వషట్కారములును రామునను సరించినవి మహర్షులును ఆతని వెంటవెళ్ళినారు. వీరి పయనము ప్రారంభముకాగాఅప్పుడే స్వర్గద్వారము తెరువబడినది. అంతః పురస్త్రీలు బాలవృద్ధులను వివశ లేక అందరును భరత శత్రుఘ్నులననుసరించి, దాసదాసీ జనులతో గూడ రాముని వెంబడించినారు. పశు పక్షివర్గము కూడ జంటలై విశుద్ధాంతః కరణులతో రామునను సరించినవి ఆ సమూహము నందెవ్వరును దీనులులేరు. దుఃఖ భాగులులేరు. ఇదంతయు అయోధ్యానగరములోని బృందమే కాదు. పల్లె ప్రజలును అట్లే రాముని అనుసరించినారు. వారందరను అట్లు రామునను సరించగా వారందర నేమని చెప్పవచ్చుననగా రాముని దివ్యతేజః పుంజమే కిరణ సహస్రములై అట్లు బయలు వెడలుచున్నదనవచ్చును. ఇంత ఎందుకు? రాముడు పయనించు నప్పుడు గాలిపీల్చువి ఒక్కవ్యక్తియు, చక్షుర్గోచరము కానివస్తువులును, చక్షుర్గోచరములగు వస్తువులును కూడ ఆ అయోధ్యయందు మిగలలేదట.

> యాని పశ్యంతి కాకుత్స్థం స్థావరాణి చరాణి చ
> సర్వాణి స్వర్గగమనే హ్యనుజగ్ముర్హి తాన్యపి.
> నోచ్ఛ్వసత్తదయోధ్యాయాం సు సూక్ష్మమపి దృశ్యతే.

అట్లాపయనము రామునకెంత దూరము సాగినది? ఒకటిన్నర యోజన దూరము సాగినది. పశ్చిమ వాహినియగు సరయూనది అంతలో రామునకెదురై వచ్చినది. ఆ నదిని వెంబడించినారు రామచంద్రులు. ప్రజలును ఆతనిని అనుసరించుట జరిగినది. రాముడు పయనమైన ఆ పవిత్రదేశమునందా దృశ్యమొక్క ముహూర్త

మాత్రము గడచినది. అప్పుడు కోటాన కోట్లదేవతా విమానములు గుంపులైరాగా బ్రహ్మయు ఆ ప్రదేశమునకేతెంచగా అందరి తేజము నొక్కటై అంతరిక్షము నందొక వెలుగైనది.

సుగంధశీతల పవనములు మందంమందలై వీచినవి. వేల్పులు కురిపించిన పూలవాన దట్టమై కురిసినది. గంధర్వగానములు చెలరేగినవి. అచ్చరమిన్నల నాట్యములు మారుమ్రోగినవి. అప్పుడా సంఘముతో కలసి శ్రీరామచంద్రుడు సరయూనదియందడుగిడినారు. ఆ క్షణమున సత్యలోకాధిపతియగు బ్రహ్మదేవుని మహోన్నత కంఠధ్వానము రాముని ఆహ్వానించినది. ఆశ్లోకములను వినిపింతును.

భ్రాతృభిస్సహ దేవాభైః ప్రవిశస్వ స్వకాం తనుం
వైష్ణవీం తాం మహాతేజో యద్వాకాశం సనా తనం
త్వ మంచింత్యం మహద్భూ తమక్షయ్యం చాజరం తథా
యా మిచ్ఛసి మహాతేజస్తాం తనుం ప్రవిశ స్వయం.

ఈ శ్లోకముల అర్థమిది. రామా! నీవు సర్వవ్యాపకమగు సనాతన బ్రహ్మవు ఆ నీవే విష్ణుతేజమున వెలుగొందుచుంటివి. ఆ రెండుస్వరూపములును నీ వొనక్క రుడవే గాన నీవే తేజమున లీనము కాదలచితివో ఆ తేజమున లీనము కమ్మని నాడు. రాముడు సోదరసహితముగ ఆ శరీరము తోడనే మహాజ్ఞానియై విష్ణువు యొక్క దివ్యతేజమున ప్రవేశించినాడు. ఆ తేజము దేవతలచే పూజింపబడినది. అంత బ్రహ్మతో తన భక్తులకు తగిన పుణ్యలోకముల నిమ్మనగా ఎవరెవరికి ఏయే లోకములర్హములో వారివారి కాలోకముల నిచ్చినారు బ్రహ్మగారు. సుగ్రీవుని తేజము సూర్యబింబమున కలసినది. దేవతలందరును తమతమ తనువుల కలసి నారు. నాటి ప్రజలందరును కృతకృత్యులై పుణ్యలోకమున కేగినారు.

శ్రోతలారా!

మీరు రాముని మహాప్రస్థానమును వింటిరిగదా! ఇప్పుడు రాముడెవ్వడని మీరూహించవలెను? రాముడు సామాన్య మానవుడేనను కొనవలెనా? లేక వేద వేద్యమగు అఖండ బ్రహ్మతత్వ మనుకొనవలెనా?

పాశ్చాత్య వాఙ్మయ రసపానమున మత్తిల్లి భారతీయ వాఙ్మయము అర్థము కాక వికృత శబ్దజాలముతో వెర్రివెర్రి కేకలువేయు కృత్రిమ విమర్శకుల విమర్శ

లకు లోనుగాక, వేదవేద్యమగు రామబ్రహ్మము భారతీయ క్షేత్రమునందవతరించి, వర్ణాశ్రమాచార వ్యవస్థచే కలుగు దేశాభ్యుదయమును తెలిపి, స్థాపించవచ్చినదని గ్రహించి కృతార్థులుకండు. రాముని మహాప్రస్థానము క్షత్రియజాతి అనుసరించ దగు విధానము. వైదికమగు ఆ విధానమునే అనుసరించినది రామావతారము.

రామాయణము మానవజాతి వికాసమునొందని నాటి పాతకాలపు చరిత్ర యనియు కవిచే కల్పింపబడిన నాయకుడు రాముడనియు తలచి ఆ పాపమును సంపాదించు కొనకుడు.

మనమిప్పుడు కథాభాగమునందెక్కడుంటిమి?

సీతాపరిత్యాగ కథయందుంటిమి. ఆభాగమున లక్ష్మణుడు సీతను వాల్మీకి ఆశ్రమముదగ్గర వదలి వచ్చునప్పుడు మధ్యమార్గమున సుమంత్రుని వలన లక్ష్మణుడు రాముని పూర్వవృత్తాంతమును వినుచున్న ఘట్టము నందుంటిమి. రాముని బ్రహ్మలోక పయనము లక్ష్మణునకు సుమంత్రుడు చెప్పి సీతను గురించిన దుఃఖము నుపశమింపజేసినాడు. మీకు నేను దీనినెందుకు చెప్పితి ననగా రాముడు పరబ్రహ్మయేగాని మానవమాత్రుడేకాదు. మానవధర్మమును స్థాపింపవచ్చిన అవతారము అని చెప్పుటకే ఈ కథను చెప్పినాను. ఇప్పుడు నేను చెప్పు ఉత్తరకాండ కథంతయు రామావతార పరమార్థమును తెలుపుటకే గదా? ఇంతవరకు మీకు రాముని లోకోత్తరతత్వమును తెలిపినాను. మీకు మరొక్క విషయము తెలుపవలసియున్నది. అదిచాల ముఖ్యమగు విషయము. అది కుశ లవుల జననము. దీనివి ముందుగా మీకెందుకు చెప్పుచుంటిననగా కుశలవులు రాముని సభాస్థలియందు రామునిముంగట రామాయణ కావ్యమునుగానము గావించు టతో రామచరితము ప్రారంభమైనది. కావున కుశలవులను మీముందించి రామ కథను తరువాత ప్రారంభింతును.

సీతను వాల్మీకిమహర్షివారి ఆశ్రమ సమీపమున వదలిన లక్ష్మణార్యుడు రథాధిరూఢుడై సుమంత్రుడు రథమును తోలగా, సీతాకాంతను గురించిన శోక వేగము తన్నాక్రమింపగా సుమంత్రునిచే సీతారాముల పూర్వచరిత్రను మాత్రమే గాక రాబోవు అవతారసమాప్తి చరిత్రనుగూడ విని శోకమును వదలెనాడు.

అది సీతను వదలిన తరువాతిరోజు మధ్యాహ్నసమయము. మొదటిరోజు రాత్రి లక్ష్మణసుమంత్రులకు గోమతీతీరమున గడచినది రామచరితమును సుమంత్రుడు చెప్పగా లక్ష్మణుడు విని శోకరహితుడై అయోధ్యకు చేరినాడు.

లక్ష్మణునిరథము రాజద్వారముకడ నిలిచినది లక్ష్మణుడు రథమును దిగినాడు. రామ పాదారవిందముల దర్శింప రామునివద్దకేగినాడు. లక్ష్మణార్యుని ముఖమున సంతోషములేదు. అప్పుడు రాముడు మాత్రమెట్లుండును? గృహస్థ జీవితమున భార్యనువదలి తానొక్కడై గృహమున వసించుట అంధకారమున వసించుట యనకతప్పదు. ఇది సామాన్యగృహస్థుల విషయము. సీతారాముల సంగతి చెప్పెడిదేమున్నది?

లక్ష్మణుడు తన కన్నీటనే రాముని కాళ్లు కడిగి దేవరవారి ఆజ్ఞను శిరసావహించి వచ్చితినని తెలిపినాడు. రాముని దుఃఖమాగలేదు దుఃఖనివృత్తికి మార్గము తత్వబోధ ఒక్కటియే. తత్వము రాముదెరుగనిదికాదు. అయ్యును ఆ సూక్తులు ఆప్తమిత్రుల ముఖముగ వెలువడుట ఎట్టివారికిని అవసరము. లక్ష్మణుడు రామునిచూచి అన్నా! నీవంటివారిట్లు దుఃఖింపరు- సంయోగము వియోగముతో కూడినదేనని ఓదార్చినాడు. లక్ష్మణుని బోధలోని సారాంశమిది.

॥ తస్మాత్పుత్రేషు దారేషు మిత్రేషు చ ధనేషు చ
నాతిప్రసంగః కర్తవ్యో విప్రయోగో హితైర్ధృవః

అంతతో రాముని మనస్సు శాంతినొందినది. మహనీయుల మానసికబాధలు తాత్కాలికములు. శరత్కాల మేఘములవలె నామమాత్రములు.

మనము ముందుకు పోదము

రాముడంతతో సీతా విరహక్లేశమును వదలినాడు. రాజకార్యము ప్రవేశించినాడు. ఒక విధముగ రాముడు గావించిన రావణ సంహారముచే భూభాగమున దుండగుల బాధలు చాల భాగము తొలగినను నిశ్శేషము కాలేదు.

మధుపురము కూడ భూభాగములోనిదే. కృతయుగముననే ఆ పట్టణము మధువను రక్కసునిచే నిర్మితమైనది. మధురక్కసుడు చాల ధర్మాత్ముడు. భక్తశేఖరుడు కూడ. శివప్రసాదముచే అమోఘశక్తి సంపన్నమగు శూలము నొకదాని సంపాదించి నిష్కంటక సామ్రాజ్యము నేలినాడు మధువు.

మధురక్కసుని పుత్రుడు లవణాసురుడు. ఈతడు మధువునకు కుంభీనసి యందు జన్మించినాడు. లవణుడు లోకకంటకుడు. మధువు సంపాదించుకొన్న శివ శూలము వంశపారంపర్యముగ నుండునట్లే ఆతడు సంపాదించుటచే తండ్రిశూలము లవణునకు గూడ దక్కినది. కాని ఈయమోఘశక్తి విశిష్టమగు శూలము ఏనాడు నీవు దేవబ్రాహ్మణ శత్రువువు అగుదువో ఆనాడు శూలము నాదగ్గరకే వచ్చునని చెప్పి మధువున కిచ్చినాడు ఈశ్వరుడు. ఆ శూలము నాధారముగాగొని లవణా సురుడు దేవబ్రాహ్మణుల పీడించుచుండగా ఆ పుర వాసులగు బ్రాహ్మణులుచ్యవన మహర్షిని వెంటనిడుకొని రామునకు తమ బాధల విన్నవించుకొనినారు. అంతలో రామచంద్రులు ఆ లవణాసురుని చంపుటకై శత్రుఘ్నుని నియమించి ఆమోఘమగు బాణమును కూడ తమ్మునకిచ్చి, లవణాసురునిచేత శూలములేని సమయము చూచి యుద్ధమున కాహ్వానింపుమని సలహానిచ్చి, ఆమధునగరమునకు శత్రుఘ్నుని రాజుగ కూడచేసి, ఆతనిని ససైన్యముగ పంపినాడు. శతఘ్నుడు తానా పట్టణమునకు రాజగుటకు ఒప్పుకున్నను రామాజ్ఞను మీరక రాజై లవణాసురుని సంహరించి ఆతడా నగరమును పాలించుచుండెను.

మనమొక్కమారు సీతాకాంత దగ్గరకు వత్తము.

సీతాకాంత గర్భవతియై వాల్మీకి ఆశ్రమమున విడువబడి పండ్రెండుసంవత్స రములు గడచినవి. ఇంతవరకు సీతావృత్తాంతము రాముడెరుగడు. లక్ష్మణునకును తెలియదు. భరతునకు మాత్రమేమి తెలియును? ఆమె ఏమైనదని వారెవ్వరును విచారించినవారు కారు. అదియే చిత్రము కాని శత్రుఘ్నుడు లవణాసురుని సంహ రింపబోవునప్పుడు వాల్మీకి మహర్షి ఆశ్రమమున ఒకరాత్రి నిలచియే వెళ్లెను. నాడే సీతాకాంత ప్రసవించి ఇద్దరు బిడ్డల కనినది. ఆ వార్తనుకూడ ఆతడయోధ్యకు తెలుపలేదు. కావుననేసీతవృత్తాంతమునెవ్వరును పట్టించుకొనలేదనియే చెప్పవలెను. మనము తెలిసికొందము.

## కుశలవ జననము

సీతామతల్లి వాల్మీకి ఆశ్రమముననే మునికాంతలాకాంతమణికి పురుడు పోయగా ఒకనాటిరాత్రి కవలబిడ్డలకన్నది. రాజాంతఃపురములవసించుపురంధ్రీమణు లకుసైతము పురుడు పోయదగిననాగరికత ఆనాటి మునిపత్నులకుఉండియుండెనా?

అని సందేహింపకుడు. భారతదేశమున నాగరికత అనాదిసిద్ధమని తెలిసికొనుడు. కాని భౌతికనాగరికతకే ప్రధానమని భావింపదు భారతదేశము. సీత ప్రసవించిననాటి విషయమును గమనింపుడు.

సీత ప్రసవించినదని మునిబాలకులు వాల్మీకికి తెలుపుటతోడనే ఆ మహర్షి శిశురక్షాకరములగు మంత్రములను పఠించుటకు సీత ఉన్న ప్రసవగృహమునకు వేగముగ వెళ్లినారు. బాలచంద్రప్రతీకాశులగు అ పుత్రులచూచి, రామునకు ప్రతిబింబ భూతములగు ఆ దివ్యతేజములకు వేదోక్తమంత్రరక్షణను కల్పించినారు. ఆ రక్షణ ఇట్లు జరిగినది.

పిడికిలినిండ దర్భలపట్టుకొనినారు. ఆ దర్భల చివళ్లను మంత్రపఠనతో మంత్రించినారు. అట్లే ఆ దర్భల మొదళ్లను కూడ అభిమంత్రించినారు. (అనగా దర్భలను కోసుకొని వచ్చినప్పటి మొదళ్లని అర్థము) ఆ దర్భలను అక్కడఉన్న వృద్ధస్త్రీలకిచ్చి, ఆ దర్భలకొనలతో ఒక బాలకునిపైన నీళ్ళను చల్లమనినారు. అకుశాగ్రములచే నీళ్లుచల్లబడిన పిల్లవానికి కుశుడని పేరిడినారు. మొదళ్లచే నీటిని మార్జన చేసిన శిశువునకు లవుడని నామకరణమునుచేసినాడు. ఆ వృద్ధస్త్రీలు అట్లు చేయగా రాముని బిడ్డలు కుశలవులను పేరబరగినారు.

వాల్మీకి మహర్షివారి ఆశ్రమముననే అ కుశలవులకు పంద్రెండు సంవత్సరములు గడచినవి. జాతకర్మనామకరణ అన్నప్రాశనాది బాల్యసంస్కారములను, చౌల ఉపనయనసంస్కారములను గూడ ఆ రాచ బిడ్డలకు మహర్షియే చేసినారు

భారతదేశమున జాతిజన్మసిద్ధము. ఆత్మశరీరమును పరిగ్రహించుటతో జాతి వచ్చును. జాతిజన్మనుబట్టియే. శిలలయందు రత్నజాతిశిలలనిర్ణయము పుట్టుకతో వచ్చునదిగాని పుట్టినరాతికి రత్నమని పేరుపెట్టదు రత్నశాస్త్రము సంకరజాతి కూడా రెండు జాతుల సాంకర్యముకలిసి పుట్టగా సంకరజాతి యను పేరు వచ్చును. ...న జాతి జన్మసిద్ధము.సహజగుణముఆత్మయందుండును. ఆత్మశరీరమును ధరిం... . ఆ శరీరముయొక్క పుట్టుకనుబట్టిజాతి నిర్ణయమగును. బ్రాహ్మణ, క్షత్రియ ...శ్య శూద్రజాతులజాతి విభాగమును గీతాశాస్త్రముగాని ఏభారతీయశాస్త్రము గాని ...న్మను అనగా పుటుకను బట్టియే నిర్ణయించినవి. కావున క్షత్రియ జాతికిచేయదగు సంస్కారములనే కుశలవులకు చేసెను.

భారతీయ శాస్త్రములననుసరించి, గర్భము మొదలు పదకొండవ సంవత్స రమున క్షత్రియునకు ఉపనయన సంస్కారమును గావించి వేదములనుచెప్పవలెను. అట్లేమహర్షివారు కుశలవులకు వేదవేదాంగములనన్నింటిని చెప్పినారు. అందునిష్ణా తులగావించినారు. తాను నిర్మించిన రామాయణ కావ్యమును గూడ వారిచే పఠింప జేసినారు. ఆ కావ్యనిర్మాణము మొదలగు విషయములను తరువాత చెప్పెదను" కుశలవులును, సీతయు ఇంతవరకు వాల్మీకిమహర్షివారి ఆశ్రమముననే యుండిరి. మనమిప్పుడు అయోధ్యకు పోవుదము. రాముని సందర్శింతము. ఎందుకందురా?

రామరాజ్యము లోని ఒక ప్రత్యేకచరిత్రను మనము విమర్శించుకొనవలసి యున్నది.

## రామరాజ్య మందలి ప్రత్యేకత

రామరాజ్యము త్రేతాయుగమునాటి చరిత్రయేకావచ్చును. అయ్యును నాటి రామరాజ్యము నేడుకావలెనని కోరుకొనుట ఎట్టిదో ఆ కథాభాగమును మనమీనాడు వినుటకూడ అట్టిదే. అందును మేము చేయదలచినది రామరాజ్యమేననువారు రామా యణములోని కథాంశమును సమగ్రముగను సవిమర్శకముగను వినితీరవలెను. వినుడు. రామరాజ్యమున జరిగిన ఒకనాటి సన్నివేశము.

శ్రీరామచంద్రుడు ఒకనాటి ప్రాతఃకాలమున తన రాజద్వారమునందొక దృశ్యమును చూచినాడు.

వృద్ధబ్రాహ్మణుడొకడు అయిదువేల సంవత్సరముల వయస్సుకలిగిన ఒక బాలకుని శవమును ముందిడుకొని రొమ్ములబాదుకొనుచు ఏడ్చుచుండెను. ఆబ్రాహ్మ ణుడు శోకించుచు అన్నమాటలివ్వి.

అప్రాప్తయౌవనం బాలం పంచవర్ష సహస్రకం
అకాలే కాలమాపన్నం దుఃఖాయ మమ పుత్రకం
న స్మరామ్యనృతం తూక్తం న చ హింసాం స్మరామ్యహం
రామస్య దుష్కృతం కించిన్మహదస్తి న సంశయః.

అయిదువేల సంవత్సరములు మాత్రమే కలిగి, యౌవనము రాకయే, కాలము గాని కాలముననే నాపుత్రుడు మరణించినాడు. నేనిట్టి శోకము ననుభవింపదగు పాపమును చేయలేదు. నేనెన్నడును అబద్ధమాడలేదు. ఆడుటకాదు స్మరింపనుకూడ స్మరింపలేదు. హింసనుకూడచేసి ఎరుగను. మనసునందైన ఎవ్వరినిహింసింపబూన

సంకల్పించి ఎరుగను. నేనీ అకాలమృతుడగు బాలుని గూర్చి దుఃఖింపవలసి వచ్చినది. ఈ పాపము నాదికాదు, ఇట్టిపాపఫలము నేటి పరిపాలకుడగు రామునిదేగాని వేరెవ్వనిదికాదు అని ఏడ్చుచుండెను. రాముడాఏడ్పువినబడినది. ఆ బ్రాహ్మణుని చూచినాడు. ఆతని హృదయము కరగినది. రాముడాబ్రాహ్మణుని దగ్గరకేగినాడు. అంతలో ఆ బ్రాహ్మణుడు రాముని అడ్డగించి రామా! నేనీబాలుని నీకడకు ఎందుకు తెచ్చితినని కొంటివో నా పుత్రుని బ్రతికింతువను నమ్మకముచే నీకడకు వచ్చినాను. నీవీబాలుని బ్రతికించకపోతివో నేనును నాభార్యయు నీగుమ్మముముందుగానే ప్రాణముల విడుతుము. నీవాబ్రహ్మహత్యనుసంపాదించుకొని, నీవునునీతమ్ములునుసుఖముగ నుందురుగాక అని రామునిగూర్చి కఠినముగమాట్లాడినాడు. ఇట్టి నాబాలుని అకాల మరణమునకు నీ అధర్మపరిపాలనమే కారణమని నొక్కివక్కాణించినాడు

॥రాజదోషైర్విపద్యంతే ప్రజాహ్యావిధి పాలితాః
అసద్వృత్తే తు నృపతా వకాలే మ్రియతే జనః

ఇప్పుడు రాముని కర్తవ్యమేమి? రాముడప్పుడేమిచేసెనో చెప్పెదను. సహృదయులై వినుడు. రాముడీదోషము తనదేనని నిర్ణయించుకొనినాడు. కాని ఆ దోషమేమియో ఆతడెరుగడు. కావున వెంటనే అతీంద్రియ జ్ఞాన సంపన్నులైన వశిష్ఠ వామదేవ నారదాది మునీంద్రులను ఆహ్వానించినాడు. మంత్రి పురోహితులతో ఒక పరిషత్తును ఏర్పరచినాడు. నిజమునకిది తనదోషమేనా? అగుచో ఆ దోషమేమి? అని ఆ సభాస్థలియందే ఆ మునివర్యుల సవినయముగ అడిగినాడు. ఆ బ్రాహ్మణబాలుని మృతినితెలిపి అందుకు సమాధానమిచ్చినవారునారదులు. నారదునిసమాధానసారమును మీకుచెప్పెదను. తరువాత కథాసారమును గూర్చిన విమర్శను చెప్పెదను. సారమిది. కృత, త్రేతా, ద్వాపర, కలియుగములలోని ముఖ్యధర్మములను నారదులు రామునకు ముందుగ తెలిపినారు. అందుకృతయుగ విశేషమిట్లుచెప్పినారు.

కృతయుగమున బ్రాహ్మణులు మాత్రమే తపస్వులైయుండిరి. ఇతరులెవ్వరును అనగా మిగిలిన మూడు వర్ణములును తపస్సుచేయలేదట.

॥పురా కృతయుగే రామ బ్రాహ్మణా వై తపస్వినః
అ బ్రాహ్మణ స్తదా రాజన్ న తపస్వీ కథంచన

ఆ యుగమున ప్రత్యేకమగువిశేషమొకటికూడ కదలట. ఏమది? ఎవ్వరును మృత్యువు కలవారు కాలేదట. "అమృత్యవస్తదాసర్వే" అని చెప్పినారు. అంత

మాత్రమేకాదటః జజ్ఞిరే దీర్ఘదర్శినః" వారందరును అనగా ఆ యుగములలోని మిగిలిన మూడువర్ణములుకూడ దీర్ఘదర్శులైకూడ యుండిరట. ఇది కృతయుగము లోని విశేషమట. తరువాతది త్రేతాయుగము. ఈ యుగమున రాజులు కూడ తపస్వులైరట. కావున ఈ యుగమున బ్రాహ్మణ క్షత్రియు లిర్వురును సమాన బలము కలవారైరట. అంతతో బ్రాహ్మణ క్షత్రియ జాతులకు తారతమ్యము కన బడక శిష్టులగువారు వర్ణాశ్రమ ధర్మవ్యవస్థ నేర్పరచిరట.

"అపశ్యంతస్తుతే సర్వే విశేషమధికం తతః
స్థాపనం చక్రిరే తత్ర చాతుర్వర్ణ్యస్య నమ్మతం.

అంత త్రేతాయుగము గడవగా ద్వాపరము వచ్చినదట. ఈ ద్వాపరమున వైశ్యులు తపస్వులైరట. అంతతో ధర్మమునందు రెండుపాదములు లుప్తముగాగా అధర్మము తనరెండు పాదములను మోపినదట. కావుననే ద్వాపరమను పేరువచ్చిన దట. ఈ మూడు యుగములందును శూద్రులు మాత్రము తపస్వులు కాలేదట. వారి వర్ణధర్మమునే వారు అవలంబించియుండిరట. కలియుగమునమాత్రము శూద్రులే తపస్వులగుదురట.

"భవిష్యచ్ఛూద్రయోన్యాం వై తపశ్చర్యా కలౌ యుగే.

ప్రస్తుతమున రామా! నీ రాజ్యమునందు నాల్గవయుగమున నడవదగుశూద్రుల తపము సాగుచున్నది. కావున అకాలముననే ఈ బ్రాహ్మణబాలకుడు మృతినొంది నాడని చెప్పినారునారదులు. అంతతో ఊరుకొనలేదు. నీవిప్పుడా దోషమును తీసి వేయుచో ఈబ్రాహ్మణబాలుడు బ్రతుకునని చెప్పినారు.

తరువాతేమి జరిగినది?

రాముని ముఖమండలము వికసించినది. ఆక్షణముననే లక్ష్మణుని పిలిచి, లక్ష్మణా! మన రాజద్వారము కడనున్న బ్రాహ్మణుని ఆదరించి, ఆ బ్రాహ్మణ బాలుని మృత కళేబరమును సుగంధతైలమునందుంచుమని ఆజ్ఞాపించినాడు. ఆత డట్లే చేసినాడు.

ఇక రాముడు శూద్రుడెక్కడ తపస్సు చేయుచుండెనని భూఖండమున వెతుకవలెను. ఒక్క క్షణకాలము పుష్పక విమానమును స్మరించగా ఆ క్షణము ననే పుష్పక విమానము రామునికి అభిముఖమైనది ఆకాశ మధ్యభాగమున.

శ్రీరామచంద్రులు పుష్పకము నధిరోహించినారు మహర్షులకు వందన మాచరించి. పుష్పక విమానము కదలినది. అది ముందుగ ఉత్తరదిశగా పయనించినది. ఆదిశ వినిర్మలమయ్యేయున్నది. కావున తూర్పు మొగమైనది. అదియు స్వచ్ఛమైయున్నది. ఆ రెండు దిశలును వినిర్మలములైయుండ ఆ విమానమును రాముడు దక్షిణదిశకు మళ్లించినాడు.

దక్షిణదిక్కున శైవలమను పర్వతమొకటున్నది. దానికి ఉత్తర భాగమున నేసరస్సుకూడ కలదు. ఆ సరస్తీరమునందొక మహర్షి రాముని కంటబడినాడు. ఆతడు తన శరీరమును భూమ్యాకాశములమధ్య నిలిపి, శిరమును క్రిందకుంచి, పాదములు ఆకాశమును చూచుచుండగా అతడు తపమును గావించుచుండెను. విమాన మాప్రదేశమున నిలిచినది. ధనుర్బాణములను, ఖడ్గతూణీరములను ధరించిన మన శ్రీరామచంద్రు డక్కడ దిగినాడు. ఆ విమానరాజమునుండి రాముడా తపస్వితో మాట్లాడిన విధానమిది.

॥ కస్యాం యోన్యాం తపోవృద్ధ వర్తసే దృఢ విక్రమ.
కౌతుహలాత్వాం పృచ్ఛామి రామోధాశరథిర్హ్యహం

సువ్రతా! అత్యంత పరాక్రమశాలివై తపోవృద్ధుడవై తపము గావించు నీవు ధన్యుడవు. నీవేకులమునకు సంధందించినవాడవు? నేను దశరథుని పుత్రుడను రాముడను పేరుగలవాడను. తరువాతి ప్రశ్నలు ఇవ్వి?

॥ కోర్థో మనీషితస్తుభ్యం స్వర్గలాభః పరోధవా
పరాశ్రయో యదర్థం త్వం తపస్యసిసుదుష్కరం
బ్రాహ్మణోవాసి భద్రం తే క్షత్రియోవాసి దుర్జయః
వైశ్యస్తృతీయవర్ణోవా శూద్రోవా సత్యవాగ్భవ
తపసోహ్యమృతం నిత్యం సత్యం హ్యమృత మాశ్రితం.

నీ వే లాభమునుకోరి ఈ తపమును చేయుచుంటివి? స్వర్గము కావలెనా? లేక వేరేమైన కోర్కెకలిగి చేయుచుంటివా?

నిజమునకు నీవు బ్రాహ్మణుడవా? క్షత్రియుడవా? వైశ్యుడవా? శూద్రుడవా? నిజము చెప్పుము. తపస్సుకంటె సత్యము గొప్పది. కావున నిజము చెప్పుము. అని అడిగి ఊరుకొనినాడు.

రాముడడిగిన ప్రశ్నలకు శంబూకముని చెప్పిన సమాధానమిది.

॥ శూద్రయోన్యాం ప్రసూతోస్మి శంబూకో నామ నామతః
దేవత్వం ప్రార్థయే రామ సశరీరో మహాయశః
నమిధ్యాహం వదే రామ దేవలోక జగీషయా
శూద్రం మాం విద్ధి కాకుత్స్థ తప ఉగ్రం సమాస్థితం

కీర్తివంతుడవగు ఓ రామా! నేను అబద్ధమాడు వాడనుకాను, దేవలోకమును జయించుటకై ఈ ఉగ్రమగు తపమును చేయుచుంటిని. నేను శూద్రుడను నాపేరు శంబూకుడు. అని చెప్పినాడు.

ఈ సమాధానమును విన్న రాముడేమిచేసెను? ఆ సమాధానము ఆతని ముఖమునుండి వెలువడినది తడవుగా తన నిశితఖడ్గధారల ఆ శంబూకముని శిరమును ఛేదించెను. అప్పుడే దేవతలు రామునిపై పుష్పవర్షముల కురిపించి, రామున కెదురుగ నిలిచి, రాముని ప్రశంసించినారు. ఏమని?

రామా! నీ అనుగ్రహముచే మా స్వర్గము శూద్రునిచే ఆక్రమింపబడలేదు కావున నీవేమైన వరమును కోరుకొమ్ము అనినారు.

రాముడేమివరమును కోరెను? ఏ బ్రాహ్మణబాలుని మృతి కారణముగ తానీ కృత్యమును నెరవేర్చెనో ఆ బాలుని బ్రతికింపుమని దేవతల కోరినాడు. దేవత లన్నమాట ఇది. రామా! నీవా శూద్రుని కంఠమును తెగవేయుట తడవుగా ఆ బ్రాహ్మణబాలుడు బ్రతికినాడు. అందుకు మా వరమక్కరలేదనినారు. అంతతో ఆ కార్యక్రమము ముగిసినది. తరువాత రాముడు ఆ దేవతలతో కలసి అగస్త్యాశ్రమమున కేగి ఆ యగస్త్య మునీంద్రులు తనను సాక్షాన్నారాయణుని గ స్తుతించి గౌరవించగా అక్కడనుండి అయోధ్య కేగినాడు. అగస్త్యులు రామునితో పలికిన పలుకిది.

త్వం హి నారాయణశ్శ్రీమాం స్త్వయి సర్వం ప్రతిష్ఠితం
త్వం ప్రభుస్సర్వ భూతానా పురుష స్త్వ సనాతనః

శ్రోతలారా! మీరు సమగ్రముగ శంబూకుని వధను గురించిన కథా ప్రవంమును వినినారు. ఇక మీరు వినదగినది ఈ కథను గురించిన విమర్శనాంశము. ఈ విమర్శనను నా మిత్రునకును నాకును ఒకనాడు జరిగిన సంభాషణ రూపమున చెప్పెదను.

మా మిత్రుని ప్రశ్న ఇది.

మిత్రు=శాస్త్రిగారు! రామాయణకాలంలో రామునిప రిపాలనా విధానం చాలా ఘోరంగా జరిగినదని నా ఊహ. కారణమేముందురా? అనాడు బ్రాహ్మణజాతికి రాముడు వశుడై మిగిలిన వర్ణములను పైకి రానివ్వలేదని, కులతత్వము ఆనాడు చాలకలదని, కులతత్వము గడ్డకట్టినది రామాయణమునందని ఉత్తరరామాయణము లోని శంబూకవధ స్పష్టము చేయుచున్నది. మీరు రామాయణోపన్యాసకులు కావున మీ అభిప్రాయమును అడుగుచున్నాను. మీరు కోపించకుండ నాకు సమాధానమిచ్చుటకు నా మనవి అనినాడు.

నా మిత్రుని గురించి నా మొదటిప్రశ్నలివ్వి.

మిత్రమా! మీరు రామాయణమునందున్న శంబూకవధ కథాఘట్టమునంతను సమగ్రముగ చదివితిరా? అందును పరిశీలనాత్మకముగ చదివితిరా? చదివి అ కథను మీరునమ్మితిరా?

మిత్రు = మీప్రశ్నలు నాకుచిత్రముగయున్నవి. రామాయణకథను నమ్మినప్పుడు ఈ కథను నేనేలనమ్మను? కథను నమ్మియే మిమ్ములప్రశ్నించినాను. ఆ కథయందు నమ్మరానివిషయమేమున్నది?

నేను-శంబూకుని చంపగాబ్రాహ్మణబాలుడు బ్రతికెనని ఆ కథయందున్నది ఎక్కడనో ఒక పర్వతప్రాంతమునతపస్సుచేసికొను శూద్రకమునిని చంపినవెంటనే బ్రాహ్మణబాలుడు బ్రతికెనను విషయమొకటి ఈ కథయందలి వింతవిషయము. అంతకంటె మొదటిది ఒకడెవ్వడో స్వర్గమును కోరి తపముగావించుకొనుట కారణముగా ఆ బ్రాహ్మణబాలుడు చచ్చుట. ఈ రెండుకారణములుగల ఈ కథా భాగమును మీరే యాధారమున నమ్మితిరో చెప్పుటనాకోరిక. మనము స్నేహభావమున మాట్లాడుకొనుచుంటిమనియే మీరు భావింపుడు నేనును అట్లేభావింతును. మనఇద్దరి సంభాషణము లోకమునకు కనువిప్పు కాగలదు.

మిత్రు – నేనొక పుస్తకమును చదువునప్పుడు పరిశీలనాత్మకముగనే చదువుదును. అట్లే ఈ చరిత్రనుకూడ చదివినాను. సత్యాన్వేషణకై అన్వేషించుస్వభావము గల నాబుద్ధియే నాకు ఆధారమని నాబుద్ధినే నమ్మి చదివినాను

నేను – మరి పరిశీలనాత్మకమగు మీబుద్ధి ఈ కథను ఎట్లునమ్మినది? ఈ కథను నమ్మకున్నచో ఈ కథయే నమ్మరాని కథయనవలెను గాని రామరాజ్యమున

రాముడు ఒక వర్గము వైపునకు మొగ్గుచు మిగిలినవారిని అణగద్రొక్కినవి ఎట్లక టిరి? రామునకు వర్గవైషమ్యమున్నదని మీబుద్ధి ఎట్లునిర్ణయించినది? అదియునుగాం మీబుద్ధి సత్యమును అన్వేషించుటకై వెతుకులాడు నంటిరికదా? అసలు సత్యమిది యని మీరు నిర్ణయించుకొని సత్యాన్వేషణ గావింతురా? సత్యమేదియో మీకునిర్ధారణ కాకుండగనే మీరు సత్యమునకై వెతుకుదురా? ఒకవేళ సత్యమిట్లుండి యుండునని మీబుద్ధి నిర్ణయించుచో వేరొకరి బుద్ధి మరి యొక దానిని సత్యమని నమ్మచో వారిది సత్యమా? మీది సత్యమా? ఎవరిది వారికే సత్యమగుచో అదిసత్య మగునా? సూర్యోదయ సమయము ఇదమిత్థమను నిర్ణయము లేక ఎవరి గడియారము ఎవరి నిద్రమేల్కొనుట వారికే సత్యమని అనవచ్చునా? బంగారు మిట్లుండునను ఒకత్రికాల సత్యనిర్ణయము లేక ఎవరికివారే ఎవరిబుద్ధివారికే నిర్ణయించుట బంగార మునకు లక్షణమగునా? ఒకవిధముగ సత్యనిర్ణయమును గావించునది బుద్ధియే అగుచో బుద్ధిలేని మానవుడే లేడు. గదా! అప్పుడిద్దరు మానవులును, లేక అందరు మానవులును సమానమగు సత్యమును కనుగొని ఇది సత్యమని చెప్పవలెనుగదా ? అట్లు చెప్పుచుండిరా? ఏమందురు? ఒకవేళ మీరిప్పుడు రామాయణ కథ కల్పితమని మీ సత్యబుద్ధి మీకు చెప్పుచో రామాయణమే కల్పితమగుచో రాముడెక్కడుండును? రాముని వర్ణవైషమ్యము మీకెట్లుఋజువగును? ప్రాచీనగ్రంథములన్నియుకల్పితము లేనని మీరు నమ్మెదరా? మేముగొప్పవారమనుకొన్న మేము పండితులమనుకొన్న నేటివారు చెప్పుసత్యములు కల్పితములేననవలెనా? అన్నచోవీరి గ్రంథములురాబోవు వారికి వ్యర్థములగునుగదా? కావుకావు. వైజ్ఞానికులకు నేటివారి గ్రంథములు మార్గ దర్శకములందురా? సత్యమేదియో నిర్ణయముకానివారి వెతుకులాట మాఊరును వెతుకొనుటకై ప్రయాణముచేయుచుంటిని మాష్టరుగారు! మాఊరి టికెట్టుఇవ్వండి అనునట్లుండును. ఏమందురు?

మిత్రు — మీరు నాకు సమాధానమును చెప్పదలచిన విధానము నాకుచాల నచ్చినది. బంగారమిట్లుండునని త్రికాలసత్యమునాధారముగాగొని ఇదిబంగారమగునా? కాదా? అనిపరిశీలించుట పరిశీలనగాని, బంగారముయొక్క స్వరూపమును నాబుద్ధికి గోచరముకాకుండగనే బంగారము కొరకై వెతకుట పరిశీలనకాదనియు, ఆ పరిశీలనా విధానము పరిశీలన అను పదమునకు అర్థము కాదనియు నాకిప్పుడుకనువిప్పైనది. ఇంతవరకు భారతీయగ్రంథములు తర్కబద్ధములు కావనుకొంటిని. హేతువాదుల సంఘము తెలివికలదికాబోలు ననుకొంటిని. వారిహేతువాదము మరిమనిషిని పెండ్లి

యాడుటవంటిదని నాకు తేలినది. సత్యమునెట్లు తెలుసుకొనవలెను? అనే విషయమును మీరే చెప్పండి.

నేను— వేదశాస్త్రములు చెప్పునది సత్యము. శాస్త్రముచెప్పినదానిని తర్కించుకొని తర్కయుతముగ తెలిసికొనవలెను, నమ్మినదానిని తర్కించనలెను గాని తర్కమునకు కుదిరినదానినేనమ్ముట భారతీయ విజ్ఞానమునుచెప్పు గ్రంధములందు కుదరదు. రామాయణము వేదములోని విషయమును విస్తరించి చెప్పిన గ్రంధము. కావున వేదములనాధారముగాగొనియే అందలి విషయములను నిర్ణయించుకొన వలెను. వర్ణాశ్రమధర్మములు ఒకరిచేసినకవిత్వములుగావు. వర్ణాశ్రమవిభాగము లేక ఏ భారతీయశాస్త్రమునులేదు తర్కించరానివిషయమును నమ్మవలెను. తర్కించదగు విషయమును తర్కించవలెను. మనతాత పేరును చెప్పిన దానిని నమ్మవలెను. తాతను మనమెరుగము. అయ్యను తాతలేక తండ్రిరాడు. తండ్రిలేకమనమురాము. కావున తాతయను వాడొకడుండెనని తర్కించవచ్చును.

మిత్రు— ప్రస్తుత కధాంశమున తర్కమును చెప్పుడు

నేను— ముందు మనకధ యందు రాముని పాత్రను తీసుకొందము.

రాజద్వారముకడ శవము నుంచుకొని ఏడ్చు బ్రాహ్మణుడు నాపుత్రుడు చచ్చుటకు నీవుకారణమనగనే రాముడు తనతప్పును ఒప్పుకొనినాడు. పరిపాలకుని దోషముచే ఇట్టి ఫలమునంభవించునని రాముడు తనతప్పును ఒప్పుకొనునా?

బ్రాహ్మణుడు గుండెపైచెయివేసుకొని నేను నిర్దోషినని చెప్పుటను రాముడు ఖండించలేడు.చిన్నపిల్లవాడుకూడతనతప్పును తప్పించుకొనుటకు యత్నించును.అది యట్లుండ కృతయుగమునాటి ధర్మములను నారదుడు చెప్పుటను పరిశీలించుచో వర్ణధర్మమొక్కటే సర్వధర్మములకు మూలమనితేలినది.

స్వధర్మమను పదమునకు వేదములు చెప్పినదానిని వర్ణములనుసరించుట అని అర్ధము. వర్ణములు మధ్యకాలమున వచ్చినవనుట యుక్తిహీనము రామాయణ కాలముననే శూద్రాదివర్ణములున్నట్లు శంబుకవధను ఒప్పుకొన్నవారు ఒప్పుకొన్నట్లెగదా? రామాయణకాలమునకంటె ముందునుండియే వర్ణములున్నట్లు రామాయణాది గ్రంధములు చెప్పుచున్నవి. కావున వర్ణవిభాగము సృష్ట్యాదినుండియు వచ్చినదిగాని ఇటీవల వచ్చినదికాదు. ఈ విషయములు నీ మనసున నాటినగాని భారతీయ గ్రంధములు సమన్వయించవు. జాతకభాగము, వాస్తుభాగములు కూడ

వర్ణములననుసరించియే యున్నవి. ఇక శంబుకుని వద్దకు వత్తము. శంబుకుడేమనెను? "శూద్రయోన్యాం ప్రసూతోస్మి" అనినాడు. నేను శూద్రయోనియందే జన్మించినానుఅనెను ఇంకేమనెను? నేనబద్ధమాడువాడను కాననెను. జాతి పుట్టుకతో వచ్చినట్లు ఒప్పుకొన్నట్లేగదా? అంతేకాదు శంబుకుడు స్వర్గమున్నట్లు చెప్పినాడు. దేవలోకమును జయించుటకు తపస్సు చేయుచుంటిననినాడు. కంటికి కనబడని స్వర్గమును శంబుకుడు నమ్మెను. దేవలోకమున్నదని నమ్మెను. అవి తర్కమున తేలునవికావు, నమ్మియేగదా? తపముచేసెను? మరి శంబుకుని తపస్సును ఒప్పుకొన్నప్పుడు శంబుకుడు నమ్మిన స్వర్గమును ఒప్పుకొనక తప్పదు. స్వర్గమున్నదని చెప్పినవి వేదములుగాని చూచినవారుగారు. కావున శంబుకుడు వేదశాస్త్రములను, స్వర్గాదికములను, వర్ణములను ఒప్పుకొన్నట్లు తర్కమున ఋజువగుచున్నది. అట్టి శంబుకుడు వేదశాసనమును ధిక్కరించి తపమునకు ప్రారంభించెను. స్వర్గలోకమును కోరువారు చేయదగినది జ్యోతిష్టోమయాగము. అది బ్రాహ్మణునకే విహితము. శూద్రునికాయాగము వేదవిహితముకాదు దేవలోకమును ఈ శరీరముతో జయించుటకాతడు ప్రయత్నించెను. దేవలోకముల నాక్రమించి, దేవతాస్త్రీలను కూడ చెరబట్టినందులకు రావణాదులను వధించిన రాముడు శంబుకునెట్లు క్షమించును? అది యట్లుంచుము రాముడు శంబుకునితో నేను దాశరథిని అనిచెప్పెను గదా? అప్పుడు శంబుకుడు పరిపాలకున కివ్వవలసిన గౌరవమిచ్చెనా? అతడట్లె యుండి మాటాడెను. అహంకారపూరితుడై యుండుట తాపసలక్షణముకాదు శాంతశమాది గుణములుకలిగి తపమును చేయవలెను. కావున శంబూకుడు జ్ఞాని కాదు. భక్తుడునుకాదు. నిష్కామకర్మయోగికాదు. స్వార్థపరుడై శాసనోల్లంఘనమును చేసిన నేరస్థుడు. రాముని పరిపాలనము వర్ణధర్మములపై ఆధారపడియుండగా ఆ పరిపాలనా విధానమును ధిక్కరించిన నేరస్థుడు కావున రాముడు నేరస్థుడగు శంబూకుని వధించెనుగాని శూద్రజాతినెక్కడ అణగద్రొక్కెను? జాతిని పరిమార్చలేదు. రాముడు న్యాయాధికారిస్థానమునందుండెను. న్యాయాధికారి చిత్తము మెత్తనయ్యేయుండుటగాని కఠినమైయుండుటగాని తప్పు. ఒకవైద్యుడు రోగిపైకఠినమయ్యేయుండునుగాని ప్రేమకలిగియే ఆరోగిబాధపడు వ్రణమును కోసివేయును. కోసివేయునప్పుడాతడు కఠినుడు. కోయుటకుముందు అతడు దయార్ద్ర హృదయుడు పరిపాలకుడు, లేకన్యాయాధికారి అట్టివాడేననక తప్పదు. అట్టివానినే న్యాయాధికారి అనవలెను. కావునరాముడు శంబుకుని వధించుట తప్పుకాదు. అనుగ్రహముకూడ ఎట్లందురా?

తపస్సునకు ఫలము భగవత్సాక్షాత్కారము. సాక్షాన్నారాయణుడు తనుగా వచ్చి, దర్శనమిచ్చి, తనచేతితో ఆతని వధించినాడు. అంతకంటె తపస్వికికావలసిన దేమున్నది? నేడు శంబూకవధను ఆధారముగా రాముడు శూద్రజాతినణగ ద్రొక్కెనుననువారికి శంబూకుడను వాడొకడుండెనని చెప్పుటకు రామాయణము ప్రమాణమైనది. రాముని నిందించుటకు రాముడుండెను. కాని వర్ణవిభాగము ప్రాచీనమనుటకు రామాయణము ప్రమాణము కాలేదు.

ఇట్టి విమర్శకుల నేమనవలెను?

మిత్రు=ఆ సంగతినటుండనిండు. మన శంబూకవధ కథాఘట్టమున త్రేతా యుగమున రాజులుకూడ తపస్వులై బ్రాహ్మణులతో సమానముకాగా శిష్టులగు కొందరు వర్ణాశ్రమ వ్యవస్థను గావించిరని యున్నదిగదా? వర్ణాశ్రమ వ్యవస్థ కల్పితత్వ మెందుకుకాదు?

నేను=దాని అర్థమదిగాదు. కృతయుగమున వర్ణాశ్రమ ధర్మముల నెవ్వ రును విడవకయుండగా త్రేతాయుగమున ఒకవిధముగ వ్యవస్థచేయవలసి వచ్చినదని అర్థముకావుననే నారదులు వర్ణించుచు

। తస్మిన్ యుగే ప్రజ్వలితే బ్రహ్మభూతే త్వనావృతే

అమృత్యవస్తదా సర్వే జజ్ఞరే దీర్ఘదర్శినః॥

అని వర్ణించినారు. అనగానేమి?

ఆవరణరహితమగు బ్రాహ్మణజాతి బ్రహ్మీభూతమై జ్వలించుచుండగా నాడు అకాలమృత్యువులను మాటయేలేదట. ఆ యుగమునందలి ప్రజలందరును భవిష్య త్కాల జ్ఞానసంపన్నులై యుండిరట.

బ్రాహ్మణులు తపస్వులుకాగా క్షత్రియజాతి పరిపాలనా రూపధర్మమునే నిర్వహించినది. వైశ్యులు దానశీలురై తమ వర్ణధర్మమును లోపింపచేయలేదు. శూద్రులు సేవాతత్పరులై వారి ధర్మమును వారు వీడలేదు. ఎవరిధర్మములు వారికి కామధేనువుకాగా అకాల మృత్యువులు రాలేదుసరిగదా? నాడందరును బ్రహ్మజ్ఞాన సంపన్నులైయుండిరి. 'అనావృతే' 'బ్రహ్మభూతే' అను పదమును జాగరూకులై విమర్శింపుడు. బ్రాహ్మణులతో తపోతేజము వారివరకే పరిమితము కాలేదు. కావున "సర్వే అమృత్యవః, సర్వేదీర్ఘదర్శినః" అని వర్ణించబడినది.

రాజులు తపస్సువైపుకు మొగ్గగా పరిపాలనాకాలము లుప్తమగును. అట్లే అందరును.

అంతేగాని కృతయుగమున వర్ణాశ్రమాచారములు లేవనియు త్రేతాయుగమున శిష్టులు కల్పించిరనియు అర్థముకాదు.

మిత్రు – కృతయుగమున జీవనవిధాన మెట్లుండెడిదందురు?

నేను = ఆయుగమున ధర్మము నాలుగుపాదములై నడవగా హింసారూపమగు వ్యవసాయ మక్కరలేకయే పంటలుపండి అహింస పరిపూర్ణరూపమై వెలసినది. వర్ణాశ్రమ దర్మపరిపాలనముచేత అజ్ఞానము అవరింపక ఆత్మప్రకాశము స్వచ్ఛమై వెలిగినది.

మిత్రు = బాగున్నది నేను తెలవుతీసికొందును.

శ్రోతలారా! ముందు కథకు పోదము. రాముని ధర్మసామ్రాజ్య మిట్లు నడచుచున్నది. అంతలో రామునకొక సంకల్పము కలిగెనది. ఏమాసంకల్పము?

రాజసూయాయాగము చేయవలెనని. దానిని సోదరులు మాన్పించినారు. కారణమేమనగా మీకు శత్రువులులేరు. నిష్కంటక రాజ్యము మీది. కావున అశ్వమేధయాగమును చేయుడని సలహానిచ్చినారు. రామచంద్రులు సమ్మతించినారు.

ఈ అశ్వమేధయాగముననే వాల్మీకిమహర్షిగారు రచించిన రామాయణ మహాకావ్యమును రామునిపుత్రులగు కుశలవులు గానముచేయుట జరిగినది. మనము కుశలవుల ముఖముగ రామాయణకథను వినుటకు ముందు మహర్షి వారి కావ్య నిర్మాణ వృత్తాంతమును తెలిసికొందము, ఆ తరువాత రాముని అశ్వమేథయాగ మంటపమునకు వత్తము. అక్కడనుండి రామలీలావైభవమును మీకు శ్రవణమును చేయింతును. చెప్పి నేనును, విని, మీరును తరింపవచ్చును.

ఈనాటికీయుపన్యాసమును ముగింతును. ఒక్కమారు రాఘవేశ్వరుని వర్ణించుకొనుచు ముగింతము.

శ్లో॥ దురితతిమిరచంద్రో దుష్టకంజాత చంద్ర
స్స్వరకువలయ చంద్రసూర్య వంశాబ్ధి చంద్రః
స్వజన నివహచంద్ర శ్శత్రు రాజీవచంద్రః
ప్రణతకుముదచంద్రః పాతుమాం రామచంద్రః

జీవులమగు మనము కావించు పాపములను చీకట్లను పొగొట్టుటకు పూర్ణచంద్రుడట. దుష్టులను పద్మములను ముకుళింపజేయుటకు చంద్రుడట చంద్రుదుదయించగా పద్మములు ముకుళించునుగదా! దేవతలను కలువలను వికసింపజేయు చంద్రుడట. సూర్యవంశసముద్రము నుప్పొంగజేయు చంద్రమండలమట. అంతే కాదు తన భక్తజనులకు చంద్రుడుకూడ. శత్రువులను రాజీవములకు చంద్రుడు. తనకు చేతులుజోడించిన భక్తశేఖరులను కలువలకు చంద్రుడు ఆ రామచంద్రుడు. ఈ శ్లోకములోని పర్యవసానమేమి? అతని స్వరూపము శత్రుమిత్రదుష్ట రాక్షసాదు లందరకును తాపనివారకమేగాని తాపకమెవ్వరికిని కాదని ఈ శ్లోకసారము.

ధర్మస్య జయోస్తు

అధర్మస్య నాశోస్తు

విశ్వస్య కళ్యాణమస్తుః

ఓం శాంతి శ్శాంతి శాంతిః

# మూడవ రోజు

# రామాయణ మహాకావ్య ప్రాదుర్భావము

శ్లో॥ శృంగారం క్షితినందినీ విహరణే వీరం ధనుర్భంజనే
కారుణ్యం బలిభోజనే౽ద్భుత రసంసింధౌ గిరిస్థాపనే
హాస్యం శూర్పణఖాముఖే భయవహే బీభత్స మన్యాముఖే
రౌద్రంరావణమర్దనే మునిజనే శాంతం వపుఃపాతునః.

ఆర్యమహాశయులారా ! నవరసాత్మిక ఆత్మారాముని శాంతమూర్తి మనల రక్షించుగాక.

మన రామాయణోపన్యాసముల యందిది మూడవరోజు. రాముడఖండ బ్రహ్మ చైతన్యమను మాటను మన మెన్నడును మరువకూడదు ఎన్నడునుకాదు. ఏ క్షణమునను మరువకూడదు. సీతాకాంత ఆ బ్రహ్మ చైతన్యమునం దంతర్భూతమైయున్న మాయాశక్తియేనను ఉపనిషత్సిద్ధాంతము మన అంతః కరణమునయందు మరుగు పడకూడదు. రాముడు పరబ్రహ్మ. సీత పరబ్రహ్మ మహిషి. వేదార్థము మన మహాకావ్యము. ఏ రోజున కారోజు కథోపన్యాసమే మకుటముతోడనే ప్రారంభమగుట మన సిద్ధాంతము. ఆ పరబ్రహ్మతత్వ ప్రతిపాదకమే మన రామాయణ మహాకావ్యము. ఆ మహాకావ్య ప్రాదుర్భావ ఘట్టమును రామాశ్వమేధ యాగశాలా ప్రవేశమును నేటి యుపన్యాస ఘట్టములు.

మనమిప్పుడు వాల్మీకి మహర్షివారి ఆశ్రమమున ప్రవేశింతము. వారి కావ్య నిర్మాణ విధానమును గమనింతము.

భారత క్షేత్రమునందు ప్రవహించు పవిత్ర వాహినులలో పరమ పవిత్రమై విలసిల్లినదే తమసా నది. ఆ నది గంగాస్రవంతి కెంతయో దూరమునలేదు. విష్ణు పాదోద్భవయగు గంగానదిని అనుకొనియే యున్నది. ఆ తమసా నది సమీపముననే వాల్మీకి మహర్షివారి ఆశ్రమము.

నారదమునీంద్రులు బ్రహ్మ మానస పుత్రులు దేవర్షి. రహస్యాతి రహస్యమగు భగవత్తత్వము కరతలామలకముకాగా దృశ్య ప్రపంచమునంతను బ్రహ్మమయముగ చూచుచును భుజస్కంధమున వీణాదండము నిడుకొని, పవిత్ర తీర్థముల తీర్థీకృతముల గావించుచు, పరమ భాగవతోత్తములై, భగవత్తత్వము నెరుంగ

గోరు జిజ్ఞాసువులకు కల్పభూరుహమై, తన హరి గీత రసవసుధాధారల యోగీంద్రుల చిత్తవృత్తులు సొక్కుచుండ అతడెల్లప్పుడును ముల్లోకముల తిరుగాడుచుండును.

అది ప్రాతఃకాలము.

అది నాడు వాల్మీకి మునిచంద్రుల దివ్య తపః ప్రభావ సంపన్నత్వ ఫల పరిపాక క్షణముగూడ. నిజమున కానాడు మునిచంద్రుల కొక్కరికే పుణ్య పరిపాక కాలముకాదు. దానిని జనన మరణ ప్రవాహ పతితులై దరిగానని మానవాళి యొక్క పుణ్య మంతయు ఒక్కచోపోగై పక్వత నొందిన దివసమనుట యుక్తము.

వాల్మీకి మునిచంద్రుల కానాడు నారదుల దర్శన మబ్బినది. అది నాడు వాల్మీకి మహర్షి సంకల్పించగా జరిగిన ఘట్టముకాదు. కర్మఫల పరిపాక ఘట్టము లట్లేయుండును. ఆ ఫలభోక్త ఆ ఫలమును గురించి ఊహించని కాలముననే ఆ ఫలములు తమంత తామైవచ్చి ఫలభోక్తకు ఎదురనిలచును.

ఈనాడు వాల్మీకి మహర్షి ఆశ్రమమున కెందుకు వచ్చిరో నారద మహర్షి. ఎవ్వరెరుగుదురు? కాని ఏదియో యొక మహత్కార్యమును సంకల్పించక అట్టి వారికి పదచలనము కలుగదు.

నారదుల దర్శన మబ్బుట తడవుగా వాల్మీకి మహర్షి, మునిచంద్రుల పాదములపై జాగిలబడి ఆనందాశ్రువుల కాళ్లు కడిగియు ప్రత్యేకములగు అర్ఘ్య పాద్యాది విధుల నర్చించినారు.

వాల్మీకి మహర్షి అందించిన అర్ఘ్య పాద్యాది విధుల నందుకొనినారు నారదులు. పూజ్యపాదులు కూర్చుండ మనకయే ఎట్లు కూర్చుండును? వాల్మీకి? నారదుని అనుజ్ఞతో వాల్మీకియు సుఖా సీనులగుట జరిగినది. తరువాతదే మన కథా కార్యక్రమము.

వాల్మీకి మునిచంద్రుల అంతః కరణమున సీతాకాంత సాధు చరిత్రము పరివర్తన చెందుచున్న కాలమది. రాముడాత్మారాముడని వాల్మీకికి తెలియును. సీత మహాలక్ష్మియనియు అతడెరుగని విషయముకాదు. అయ్యును, ఇద్దరు బిడ్డలతో లోకాపవాదమునకై రాముని విరహక్లేశము ననుభవించుచు, తన ఆశ్రమమున కాపురముండగా ఆ సాధ్వీమణి చరిత మా మహర్షి హృదయసీమ నుండి ఎట్లు తొలగును? నిజమునకీ రాముడెవ్వడు? ఈ సీత చరితమేమి? ఆ కరుణామయుని

హృదయము నందిది యొక తీరని పరితాపము. ఆ మహర్షి ఇప్పుడొక జిజ్ఞాసువు. ఈ సీతను రామునితో కలుపుదునా? ఎట్లు కలుపవలెను? కలియునా? ఈ రాచబిడ్డలకీ అశ్రమవాస మెంతకాలము? అని కొట్టు మిట్టాడుచున్న ఈ సమయముననే నారద సందర్శనమైనది. అయోధ్యయందు రాజసింహాసనము నలంకరించియున్న రాముని తెలుసుకొనదగిన సమయమిదియే. తాను తలచిన పెన్నిధియేనా? ఈ జానకీ రాముడు? అటులైన ఇంత కాఠిన్య మెక్కడిది? బ్రహ్మ పదార్థము నందింత కాఠిన్యముండునా? అది మధురాతి మధురము గదా? అది రసమయముగదా? ఆ బ్రహ్మయే ఈ రాముడా? గురువుల నడుగక ఈ సందేహము తీరదు. ఇది భౌతిక జ్ఞానముకాదు. ఇది ఇంద్రియా తీతమగు తత్వవివేకము. తత్వవిదుల నిగూఢాత్మల దాగియుండు అనర్ఘ రత్నము. కావుననే గీతాచార్యులు.

తత్వజిజ్ఞాసువుల కీయుప దేశము నందించినారు.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః.

తత్వదర్శులైన మహనీయుల పాదపద్మములకు ప్రణమిల్లకవారి కరుణా రసపూరిత వాగ్వైఖరి బహిర్గతమగునట్లు తమ ముదితాంతరంగ సంశయములవారి చెవినివేయక వారి ఆత్మ గుహాంతరమున వెలుగొందు విశుద్ధ జ్ఞానరత్నము జిజ్ఞాసువులకెట్లు దొరకును? దొరకదు.

తత్వజిజ్ఞాసువులారా! రాముడెవ్వడో తెలియవలెనన్న తత్వదర్శులు మాత్రమేకాక వేదవిహిత శాస్త్రజ్ఞాన సంపన్నులగువారి పాదములకు ప్రణమిల్లుడు. వారిని ప్రశ్నింపుడు. వారాలసించిరని విసుగు చెందకుడు. మీ సేవా భాగ్యమును వారి కర్పింపుడు వారు తప్పక మీకు ఉపదేశామృతము నొసంగి, బిగువై ముడి బడియున్న మీ హృదయ గ్రంథిని అతి సుకుమారముగ వారు విడదీయుదురు. అని నారు.

వాల్మీకి మహామునుల అశ్రమమునందీ నాటి సన్నివేశమిదియే.

వేద వేద్యులైనిగూఢముగ దాగి, చరిత్ర కందుచున్న ఈ సీతారాముల గురించి నిర్మథితాంతః కరణుడైన వాల్మీకి నారదమునీంద్రుని నేవియో కొన్ని ప్రశ్నల నడగదలచినాడు. ఆ ప్రశ్నలకు ముందుగనున్న మొదటి శ్లోకమే మన రామాయణ మహాకావ్యమునకు ప్రారంభ ఘట్టము. ప్రారంభ శ్లోకము భారతీయ తత్వజిజ్ఞాసువులలంకరించదగిన ఆదిపీఠము.

ఆ శ్లోకమిది :

॥తపస్స్వాధ్యాయనిరతం తపస్వీ వాగ్విదాం వరం
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్.
ముందీ శ్లోక తాత్పర్యమును వినుడు.

తపస్సంపన్నుడును వేదాధ్యయన తత్పరుడును వాగ్విదులలో శ్రేష్ఠుడును అగు నారదమహర్షిని తపోనిష్ఠుడగు వాల్మీకి ప్రశ్నించెనట. ఇది శ్లోక తాత్పర్యము కాని ఈ శ్లోకమును గురించి ఈ తాత్పర్యమును మాత్రము తెలుసుకొనుటచాలదు. ఈ శ్లోకమును గురించి మనము చాల తెలుసుకొనవలసియున్నది. ఈ శ్లోకమును గురించి ముందుగ మీకొక విషయమును చెప్పెదను. నేను చెప్పబోవు విషయము ఈనాడు చాల అవసరము. ఈ శ్లోకమున వాల్మీకి నారదుని ప్రశ్నించెననియున్నది. ఈ శ్లోకము వాల్మీకి కృతమే అగుచో వాల్మీకి నారదుని ప్రశ్నించెను అని ఎందు కుండును? నేను నారదుని అడిగితిని అని ఉండవలెను గదా? కావున వేరొక వ్యక్తి రచించిన శ్లోకమువలెనున్నదీ శ్లోకమని సందేహమును ఈనాటి విమర్శకులు లేవదీయవచ్చును. మహాభారతమునందీ విమర్శ పుట్టి భారతకర్త ఒక్కడు కాదని నవీన విమర్శకులు విమర్శించినారు. మన ఆర్ష గ్రంథములను గురించి నేటి విమర్శకుల విమర్శనా పద్ధతిలోని లోపమును మీకు చెప్పెదను. ఇది చాల అవసర మగు విషయము. నిజముగ విమర్శకు కావలసిన పద్ధతి ఇది. మొదటిది శబ్దార్థ పరిశీలనము. రెండవది గ్రంథ సమన్వయము. మూడవది ప్రమాణ వ్యవహారము. అనగా ఏ ప్రమాణముచే ఈ విషయమును పరిశీలించవలెననునది. ఆ తరువాత పూర్వోత్తరములందున్న విరోధ పరిహారము. అప్పుడు సందర్భశుద్ధి. వీటితోపాటు శాస్త్ర మర్యాదల ననుసరించుట. ఇవి విమర్శకున కుండదగు ముఖ్యాంశములు. నేడిది లోపించినది. నేటి విమర్శకుల పద్ధతి ఇది. మొదటి దోషము ఉన్న గ్రంథ మును ఉన్నట్లుగ ప్రకటింపకుండుట. స్పష్టముగనున్న విషయమును కప్పి బుచ్చి, దానికి విరుద్ధముగా నుండునట్లు కల్పించి చెప్పుట. గ్రంథములకు వారికి తోచి నట్లర్థము చెప్పుట. అనగా గ్రంథమునకు ఏక వాక్యత కుదర్చకుండ అర్థముల నెక్కడికక్కడే చెప్పుట. పూర్వోత్తర విరోధములను లక్ష్య పెట్టకపోవుట. శబ్ద మర్యాదను అసలు వారి దగ్గరకే రానివ్వకుండుట. అనగా శబ్ద మర్యాదను పాటించ పోవుట. ఇది నేటి విమర్శకులకు చాల ముఖ్య విషయము ఆర్ష గ్రంథములను పరిశీలించునప్పుడు వారి శైలి ఎట్లు నడచునో ముందు తెలియవలెను ఆర్ష గ్రంథ

ములలో గ్రంథకర్త తన వృత్తాంత శ్లోకములను తానే రచించుచు అవి పరులుప దేశించినట్లు చెప్పును. దీనికి మీకొక్క ఉదాహరణ నిచ్చెదను భారత మిట్లు నడచినది. అది యట్లుండ మనస్మృతియందు మనువు ఋషులచే అడగబడి ఇట్లు చెప్పెనని యున్నది.

॥స తైః పృష్టస్తథా సమ్యగమితౌజా మహాత్మభిః
ప్రత్యువాచార్చ్య తాన్ సర్వాన్ మహర్షీన్ శ్రూయతామితి.

ఇచ్చట మనువు తన వృత్తాంతమును పరులు చెప్పినట్లే చెప్పెను. తన ఘనతను చెప్పెను. నిజమునకిక్కడ "అహం పృష్టః బ్రవీమి" అని ఉండవలెను. అడగబడిన నేను చెప్పుచున్నాను అని ఉండవలెను. అట్లు లేదు. "సపృష్టః ప్రత్యువాచ" అని ఉన్నది. అతడు అడుగబడి పలికెను అని ఉన్నది. ఈ ఘట్టమున ఈ స్మృతికి వ్యాఖ్యానము వ్రాసిన కుల్లూకభట్టు ఈ విషయమును పూర్వపక్షముగ గ్రహించి.

॥ప్రాయేణాచార్యాణామియంశైలీ యత్స్వాభి ప్రాయదుపి పరోపదేశ మివవర్ణయంతి అనినారు. అనగానేమి? ఆచార్యులగు వారిట్లే వ్రాయుదురు అనినాడు. దీనికి చాల ఉదాహరణల చూపినాడు. జైమిని సూత్రములను, వ్యాస సూత్రములను కూడ ఉదహరించినాడు. కావున మీరు నేటి విమర్శకుల దృష్టిలోని దోషముల గ్రహించి పూర్వ వ్యాఖ్యాతల ననుసరించి, శాస్త్ర మర్యాదను పాటించి మన రామాయణమును గ్రహించుట చాల అవసరము. ఈ విషయమును నేను మాటి మాటికిని చెప్పుచుంటినని విసుగు చెందకుడు. ఇప్పుడు నేను చెప్పు ప్రాచీన సంప్రదాయములు ప్రవాహమునకు ఎదురీతవలె కన్పట్టవచ్చును. శాశ్వతము లివియే ఈ శ్లోకము వాల్మీకి ప్రణీతమే. ఇక ఆ శ్లోక ప్రభావమును వినుడు.

రామాయణ కావ్యము నందలి "తపస్స్వాధ్యాయనిరత"మను ప్రథమశ్లోకము తపశ్శబ్దముతో ప్రారంభమైనది. ఈశబ్దమునందలి త,ప, అను రెండుక్షరములే సృష్ట్యాదియందు చతుర్ముఖునకు వినబడినవర్ణములు. బ్రహ్మ ఈరెండు వర్ణముల కూడికచేత వచ్చిన అర్థమునుగ్రహించి తపించి సృష్టిచేసినాడు. అదియట్లుండ తపశ్శబ్దముపర-బ్రాహ్మవాచకము. కాక తపశ్శబ్దమునకు వేదములను అర్థముకలదు. అంతేకాక గాయత్రీచందము చంధస్సులకుతల్లి. గాయత్రీమంత్రము నందలిప్రథమాక్షరము తకారము. అట్టి ప్రథమాక్షరముతో ప్రారంభించి, గాయత్రీచంధస్సునందలి

ఇరువదినాల్గు అక్షరములతో ఇరువదినాలుగువేల శ్లోకములు రచించుట జరిగినది. కావున తకారమును ప్రథమముగ వాడినారు మహర్షి. తపశ్శబ్దము పరబ్రహ్మవాచకమని చెప్పితినిగదా? ఈ అర్థమును నేను కల్పించితిననుకొనకుడు. తపసా బ్రహ్మ విజిజ్ఞాసస్వ "తపో బ్రహ్మేతి" అని తైత్తిరీయోపనిషత్తు చెప్పినది. తపశ్శబ్దము" తప ఆలోచనే అను ధాతువునుండి వచ్చినది. వరుణుని పుత్రుడు ఆలోచనామృతమనే పరిగ్రహించి కృతకృతుడయ్యెను. అదియట్లుండ ఈ తపశ్శబ్దము స్వాధ్యాయశబ్దముతో కలసియున్నది. తపశ్చ స్వాధ్యాయశ్చ "తపస్స్వాధ్యాయౌ". ఈ సమాస పదమునకొక ప్రత్యేకత లేకపోలేదు. ఇక్కడ ఆలోచన యన ఆత్మాన్వేషణము. ఆ యన్వేషణమున కాధారము వేదము. శాస్త్రాధారములేక ఆత్మానుసంధానములేదు. వాల్మీకి ఈ సమాసముచేత చెప్పినదేమనగా ఈ గ్రంథము ప్రతిపాదించునది పరబ్రహ్మతత్వమునే ఆ తత్వము వేదముల నాధారముగా గొనియె జరుగవలెను గాని వేరొక విధముగ తర్కమునకు సాధ్యముకాదు అని స్పష్టపరచినారు. కావుననే శంకరులు శాస్త్రయోనిత్వాత్" అను సూత్రము దగ్గర యథోక్తం ఋగ్వేదాది శాస్త్రం ప్రమాణం అస్య బ్రహ్మణః యథావత్స్వ రూపాధిగమే" అనినారు. ఇంతవరకు తపశ్శబ్ద ప్రయోగమును గురించి మీకు చెప్పినాను. ఈ శ్లోకమికదేమని వివరించోనో చెప్పెదను.

ఈ శ్లోకమున వాల్మీకి నారదుల వర్ణనమున్నది. వాల్మీకి నారదుని అడిగెను అని ఉన్నది. వాల్మీకి నారదుల వర్ణనను ముందుమీకు చెప్పెదను.

నారదునకు మూడు విశేషణములును, వాల్మీకికి ఒక్క విశేషణమును వాడబడినది. నారదమునీంద్రుల విశేషణములలో మొదటిది తపస్స్వాధ్యాయనిరతః అనునది తపస్స్వాధ్యాయములు రెండును ఆ మహనీయుని వదలిలేవు. ఆయన రూపముతో ఆ రెండును వ్యక్తములై యున్నవనవచ్చును. కావుననే "నిరతః అని వాడబడినది. గురువు శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠుడు కావలెను. అంతేకాదు "వాగ్విదాంవరః" అనునది రెండవ విశేషణము. వాక్ అన వేదము. "వాక్ వేదః అనాదినిధనా హ్యేషావా వాగుత్సృష్టాస్వయంభువా" అట్టివేదమునెరిగిన వారిని వేదవిదులందురు. ఆ వేదవిదులలో అనగా ఆ వేదరహస్యముల నెరిగిన మహర్షులెందరు కలరో ఆ మంత్రద్రష్టలందరిలో అగ్రగణ్యులట నారదమునీంద్రులు. వాగ్విదులలో అనునప్పుడు షష్ఠీవిభక్తి వాడబడినది. "నిర్ధారణేషష్ఠీ" బ్రహ్మవిద్వరిష్ఠులని అర్థము. మూడవది మునిపుంగవః అను విశేషణము. మునియనమననశీలుడని భావము. ఇట్టి నారదులు అసలు నారదశబ్దమున కర్థమేమి? పరమాత్మ విషయికమగు జ్ఞానమును బోధించు

వాడు కావున నారదుడని పేరు వచ్చినదాయనకు. లేక నారమన అజ్ఞానము. అజ్ఞానమును పోగొట్టువాడు గాన నారదుడనికూడ నారద పదము బోధించును. (నరస్య సంబంధి నారం అజ్ఞానం తద్యతిఖండయతీత నారదః) అంతియేకాని కలహమును పెట్టువాడుకాడు. కలహాశనుడన కలహము ఆశనముగా గలవాడు. కలహమునకు ఆధారములగు అహం మమతలను తనజ్ఞానాగ్నియను జఠరాగ్నిలో హోమముచేసుకొనువాడని అర్ధము. ఇంతవరకు అ శ్లోకమునందలినారదునివర్ణనము చేయబడినది. రామతత్వము నెరుగవలెనన్న నారదునివంటి గురువర్యుల పాదోప సంగ్రహణము అవసరమని మన రామాయణకావ్యములోని మొదటి శ్లోకముచెప్పినది.

మరి శిష్యుడెట్లుండ వలెనట. ?

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః

కృతేన తద్విజ్ఞానార్థం సగురమేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం"

సాధకుడగు ఆత్మజిజ్ఞాసువునకు ముఖ్యముగ కావలసినది వైరాగ్యము ఐహికాముష్మిక సుఖములుకర్మలవలన కలుగునవి.అవి అనిత్యములనిముందు నిర్ణయ మగునో కర్మలచేత కలుగని బ్రహ్మజ్ఞాన సంపదకై గురువు నాశ్రయించవలెను. వారివద్దకు సమిత్పాణియై వినయ విధేయతలతో సమీపించవలెను. చేతనొకసమిధను పట్టుకొనుట వినయసూచకము. నిర్వేదము కలుగనిదే ఆత్మజ్ఞానము కలుగదు. వైరాగ్యముదయించక ఆశాబంధము తెగదు. ఇదిశిష్యునిఅర్హత. కావున శ్రోత్రియం బ్రహ్మనిష్ఠం" అన్నగురు విశిష్టతను, శిష్యలక్షణమును కూడ ఈ శ్లోకమున వర్ణిత మగుట మనము గుర్తెరుగ వలసినముఖ్యవిషయము.

గురువర్యుల వద్దకు పోయి ఏమిచేయవలెను? తనసంశయమును గురువులకు తెలుపవలెను కావుననే వాల్మీకి నారదుని అడిగినాడని శ్లోకము తెలిపినది. అందును "పరివ్రచ్ఛ"అను క్రియచాల చక్కని విషయమును బోధించినది. ఆ"పరి" అను, ఉపసర్గవాల్మీకికిగలపూర్ణజిజ్ఞాసనువెలువరించినది. శిష్యుడగువాడు తనసంశయమును పూర్ణముగ తీర్చుకొనునంతవరకును గురువులనడిగి తెలుసుకొనుటను ఆ ఉపసర్గ చెప్పుచున్నది. "పరిప్రశ్న"అను పదముకూడ అట్టిదే. వశిష్ఠమునీంద్రుని రాముడు ప్రశ్నించుట, అర్జునుడు కృష్ణుని ప్రశ్నించుట, పరీక్షిత్తు శుకుని ప్రశ్నించుట

వాల్మీకి నారదుని ప్రశ్నించుట అనునవన్నియు ఒకే ఒకకోవకు చెందినవిగావి వేరు కాదు. వాశిష్ఠమున శ్రీరామచంద్రులు వశిష్ఠునకిడిన సమాధానమును వినిపింతును.

॥ అహో అహం గతశ్చిత్వం భవద్వాక్యార్థభావనాత్

శాంతం జగజ్జాల మిద మగ్రస్థమపి నాథ మే

రాముని ఈ సమాధానము నిర్వాణప్రకరణములోనిది.

గురువర్యుల వాక్యబోధను విని ఆనంద రసనిమగ్నుడై గురువర్యా! మీ వాక్యామృతపానమున నేను చిదేకరస పూర్ణాత్మజ్ఞానమును పొందితిని. దీనికి గురు తేమందురా? ఈ జగజ్జాలము నాముందుండియు నాకు భాసించుటలేదు. అనిచక్కని ఉదాహరణ ఇచ్చినారు రఘువీరులు.

॥ పరామంతః ప్రయాతోస్మి పరమాత్మని నిర్వృతిం

దీర్ఘావగ్రహాంత ప్తం వృష్ట్యేవ వసుధాతలం

ఎంతోకాలము భూఖండము వర్షాభావముచే తపించగా వర్షించుటతోడనే ఆ జీవకోటి పొందు ఆనందమును నేను పొందితిననినారు. ఇట్టి సమాధానము ఇవ్వ దగిన సమయము వచ్చువరకును గురువర్యులవద్ద సంశయము తీర్చుకొనుటయే పరిప్రశ్న యనబడును. అర్జునుడేమనెనును? "స్థితోస్మిగతసందేహః" అనినాడు. పరీక్షిత్తు ఏమనెను? మరణభయమును వదలితిననెను. ముందుకుపోదుము.

నారదమునీంద్రులకు ప్రణమిల్లి వాల్మీకిమహర్షి అడిగిన ప్రశ్న ఇది. నేను కొన్ని గుణములుగ పురుషుని గురించి తెలుసుకొనదలచితిని. తాము అన్నిలోకముల చరింతురుగదా? ఈభూలోకమునందిప్పుడునేను వర్ణింపబోవు గుణములుగల పూరుషుదెవ్వడైన కలడేమో చెప్పుమనినాడు. ఆతడడిగిన పురుషునకుండదగు గుణము లివ్వియట. వీర్యము, ధర్మజ్ఞత, కృతజ్ఞత, సత్యవాక్కు, వ్రతదీక్ష, పరిశుద్ధ చరిత్రము సర్వభూతహితము, విద్వత్తు, పరిపూర్ణసామర్థ్యము, చూడముచ్చటైయుండు మూర్తిత్వము, మనోనిగ్రహము, క్రోధజయము, ఉట్టిపడు సౌందర్యము, అసూయారాహిత్యము, ఆతడు యుద్ధరంగమున నిలవగా దేవతలకుసైతము భయమును గొలుపదగు రోషకషాయిత ముఖమండలమును కలిగి ఈ గుణములు పరిపూర్ణము లై యున్న పురుషుని చెప్పుడనినాడు.

శ్లోకములివ్వి.

॥ కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్
దర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః
॥ చారిత్రేణ చ కోయుక్త స్సర్వభూతేషు కో హితః
విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైక ప్రియదర్శనః
ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోనసూయకః
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే
ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే
మహర్షే త్వం సమర్థోసి జ్ఞాతుమేవం విధం నరం.

ఇంతవరకు మీరు గుణవర్ణనకు సంబంధించిన శ్లోకములను "కోన్వస్మిన్" అను శ్లోకము మొదలు "జాతరోషస్యసంయుగే" అను శ్లోకమువరకు వింటిరి. ఇంత వరకు మీరు వినిన శ్లోకములు నాలుగు. అందు తపస్స్వాధ్యాయ నిరతం అను మొదటిశ్లోకము గురుశిష్యస్వరూపమును వర్ణించినదని చెప్పినాను. మిగిలిన మూడు శ్లోకములను అతడిడగెడు పురుషునకుండదగు గుణసముదాయ వర్ణనము. అయిదవ శ్లోకము గురువును శిష్యుడు ప్రశ్నించదగు విధానము. ఇదిచాల ముఖ్యము. ఈనాడు దేశమున లోపించినదిదియే.

ఎవ్వరైన ప్రశ్నించినప్పుడు ఆ ప్రశ్నకు రెండు రూపములున్నవి. అవ్వల వానికెంతతెలియునో చూతమనిగాని, లేక అతనిని ప్రశ్నించి ఓడింతమనిగాని తలచి ప్రశ్నించుట ఒకవిధము. దీనిని జగీషు ప్రశ్నయందురు. కాక తానొక విషయమును తెలుసుకొనగోరి అడుగుప్రశ్న. దీనికి జిజ్ఞాసు ప్రశ్నయనిపేరు. ఒకవిషయమును తెలుసుకొనుటగూడ రెండు విధములు. ఒకటి సామాన్యముగ తెలుసుకొందమని అడుగుట. ఎట్లైనను సంపూర్ణముగ తెలుసుకొనవలెనను ఉత్కంఠచ్ఛ గలిగిప్రశ్నించుట ఇప్పుడు వాల్మీకిమహర్షి నారదుని ప్రశ్నించిన ప్రశ్నవిధానమేమిః అనునది మనకు కావలసిన ప్రశ్న.

వాల్మీకి నారదుని ప్రశ్నించిన ప్రశ్న విజగీషు ప్రశ్నకాదు. జిజ్ఞాసుప్రశ్నయే. ఎట్లు? వినుడు.

హే మహర్షే: అని సంబోధించి, నాకోర్కెను తీర్పమీరు సమర్థులని గురువుల సర్వజ్ఞత్వమును ప్రకటించి ప్రశ్నించుట మొదటివిషయము. గురువులు మీరే

విషయమును చెప్పుడని శాసనపూర్వకముగ అడుగక "అహం శ్రోతుం ఇచ్ఛామి" నేను వినకోరుచున్నాను. తమ అనుగ్రహమేమి? అనుటరెండవవిషయము. అందును ఏదో సామాన్యముగ అడుగుచుంటిననుకొందురేయో? మహానుభావా! నేను సంపూర్ణజిజ్ఞాసువునై అడుగుచుంటినని తెలుపుకొనుట మూడవవిషయము "పరం కౌతూహలంహిమే. అని తన ఉత్కంఠను తెలిపినాడు. నేనడిగినట్టి పురుషుని తెలుపవలెనన్న అనితరసాధ్యము మునీంద్రా. తామొక్కరేసమర్థులు. అని పూర్ణ జిజ్ఞాసువై ప్రశ్నించినాడు. హేమహర్షేయని సంబోధించుటలో సామాన్యమగు ఋషి పదమే జ్ఞానార్థకముకాగా, మహర్షి పదమెంతదోచూడుడు. "మహాంశ్చాసావృషిశ్చ హర్షి:" పరిపూర్ణమగు తత్వమును తెలుసుకొనదలచిన నాకు సామాన్యులెవ్వరు చెప్పగలరు? బ్రహ్మపుత్రులగు మీరే ఎవంవిధ పురుషుని ఎరుగుదురని తన ఉత్కం ఠను స్పష్టపరచినాడు. "మేకౌతూహలం పరంహి" నా కుతూహలము ఇంత ఉత్కటమైయుండ తాము చెప్పకుండుట ఎట్లు? అని నారదుని ముందుకు ప్రోత్స హించినాడు. "హి" అని వాడుటతో.

ఇక్కడికి మనకేమి తెలసినది. తపస్వులగు నారదవాల్మీకుల సన్నివేశము మహామహిమాన్వితమగు భగవత్తత్వమును ప్రకటించు సన్నివేశమని తెలసినది ఇది సామాన్య మానవచరిత్రను ప్రకటించు గ్రంధముకాదని తెలియవలసిన విష యము తెలసినది.

ఇక మనము నారదమునీంద్రుల సమాధానము కడకేగుదము.
మీ చూపునొక్కమారు నారదమునీంద్రులవైపుకు త్రిప్పుడు.

శ్రుత్వా చైతత్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః
శ్రూయతా మితిచామంత్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్.

ఈ శ్లోకమునందింత మాత్రమేనా? మనకు తెలియదగినది? కాదు. నారద మునీంద్రులొక విచిత్రమగు వ్యక్తి. లోకమునందేమహర్షియు ఈయనవలె ఎప్పు డును చరించువారు లేరు. ఆయనను త్రిలోకసంచారి యనవచ్చును. లేక అన్ని లోకములకు కలసివచ్చునట్లు లోకసంచారియన్న ఇంకను బాగుండెడిది. కాని ఆయననిక్కడ వర్ణించుటలో సంచారమును చెప్పక త్రిలోకజ్ఞః అని వాడబడినది. ముల్లోకముల నెరిగినవాడని అర్ధము. పరిమితములేక అపరిమితమై అనేక కోటి బ్రహ్మాండములతోకూడిన ఈ సృష్టికి పరిమితమును కల్పించి, అందును చరించుట

యనక తెలుసుకొనువాడని చెప్పుటలోని భావమేమైయుండును? ఏదియోయొక మహోన్నత భావములేక ఈ విశేషము వాడబడియుండునా? భారతీయ వాఙ్మయమునకొక ప్రత్యేకత యున్నదని అందరును ఒప్పుకొనుమాటయే. ఆ గొప్పతనమెక్కడున్నది? అనునదే ఈనాటి విజ్ఞులెరుగని విషయము. మనము భాషా విజ్ఞానమువైపుకు తిరుగుచో ఏకాక్షర నిఘంటువు ఈ భాషకొక ప్రత్యేకతను కల్పించినదనక తప్పదు. అంతేకాదు. మహత్తరమగు విషయమునంతను కొన్ని అక్షరములయందిమిడ్చి సూత్రములనేర్పరుచుటకీభాష తప్ప మరి ఏ భాషయున్నది? వ్యాకరణశాస్త్రమునుఆంధ్రమున సూత్రీకరించవలసివచ్చుచో కౌముదిలోని సంస్కృతవ్యాకరణసూత్రమువలె అల్పాక్షరములతో నిర్మితమగుట అసంభవము. అట్లే సృష్టినంతను మూడు అను సంఖ్యయందిమిడ్చి చెప్పుట భారతీయ తత్వశాస్త్రముయొక్క ప్రత్యేకత. సత్వగుణ, రజోగుణ, తమోగుణములలో సృష్టిఅంతయు అంతర్భూతమన్నది గీతాశాస్త్రము. అట్లే మూడులోకములను మూడువర్ణములతో చెప్పినది తైత్తిరీయోపనిషత్తు. భూః భువః సువః అనువ్యాహృతులతో మూడులోకముల నొక్కచోచేర్చి ఉపాసించుటను చెప్పినది. అంతకంటెను మరియొక విశేషమేమన ఒకేవర్ణమునందీ ప్రపంచమంతయు ఉన్నదన్నది తత్వశాస్త్రము, అనగా ఉపనిషద్వాణి. ఓమితీదగ్ంసర్వం"అని. ఇదంతయు బాహ్యప్రపంచ వర్ణనముకాగా మాండూక్యము నీలోననే మూడు అవస్థలలో ఈ కల్పితప్రపంచము తిరుగుచున్నది. నీవును ఆ మూడు అవస్థలలోననే చరించుచుంటివిగాని నీవువేరుగ ఎక్కడుంటివి? అన్నది శాస్త్రములకెల్ల మూర్ధన్యమగు వేదాంతము లోకములన దృశ్యప్రపంచము. ఈ దృశ్యము ఆత్మయందే కల్పితము. అ విద్యాకల్పితమును అధిష్ఠానమనగు ఆత్మకంటె వేరుగా చూడని మహనీయుడుకావున ఆయ వస్థాత్రయముయొక్క నిజస్వరూపమును గుర్తెరిగిన ప్రోడయని త్రిలోకజ్ఞః అనుపదము వాడబడినదీశ్లోకమున. అంతేకాదు నారదశబ్దముకూడ జ్ఞానస్వరూప వాచకమగుటచే ఆతడవస్థాత్రవసాక్షియై ఆనందఘనమై వాల్మీకి వాక్యసరణిని వినినాడు. కావుననే "ప్రహృష్టః" ఆనందాతిరేకమున మునిగి సర్వశాస్త్రములను ఆయనముందు నిలవగా ఏకైకమగు సచ్చిదానంద బ్రహ్మమై రాముడై అవతరించుటను అర్థించిన వాల్మీకినిచూచి ప్రహృష్టుడై జాగరూకుడవై వినుము చెప్పెదనని "శ్రూయతాం" హెచ్చరించి తనపెదవిని విప్పియు అతడెవ్వడో ముందుగచెప్పక నీవడిగినట్టి పురుషులు బహుమంధియుండుట దుర్లభమని పలికినాడు.

బహవో దుర్లభాశ్చైవ యే త్వయా కీ_ర్తితా గుణాః

బ్రహ్మవస్తువును నిషేధ ముఖముగ చెప్పినారు. ఎందరోలేరు. అసలు లేక పోలేదు. అది శూన్యముకాదు. అది ఒకేవస్తువు. అని అయ్యను చెప్పెదననితలచి.

మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యు_క్తశ్శ్రూయతాం నరః

హేమునే అని వాల్మీకినిసంబోధించినారు. మననశీలుడా! అనినారు.

"అహంబుధ్వావక్ష్యామి" అనినారు. నేను తెలిసికొని నీకు చెప్పెదను శ్రూయతాం; వినుదువుగాక అనినారు. తాను తెలుసుకొనెడిదేమి? ఆతడేమి గు_ర్తెరిగి చెప్పదలచెనో? మనమేమి ఎరుగుదుము? బ్రహ్మతనకు పూర్వము చెప్పిన శత కోటి ప్రవి_స్తర రామాయణమును స్ఫురణకు తెచ్చుకొనుటకై కాలవిళంబమును కోరునేమో? లేక భగవద్గుణాను కీ_ర్తనమును వాల్మీకివలన వినగా అంతఃకరణ సంద్రమున ఆనందముప్పొంగగా ఆమధురానుభూతిని అనుభవించుచు చెప్పలేక ఆనెనేమో ఎందుకనేనో అనెను. కాని తరువాత ఏమిచెప్పెను?

ఇక్ష్వాకువంశప్రభవో రామోనామ జనైశ్రుతః

ఇక్ష్వాకువంశప్రభవుడగు రాముడొక్కడే అట్టిపురుషుడని రామచరిత్ర నంతను అనగా ఏడుకాండలకథను వాల్మీకికిచెప్పి. ఆ కథను పఠించుటవలన గలుగు ఫలమును చెప్పినారు. ఫలమేమిటియట?

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సమ్మితం
యఃపఠేద్రామచరితం సర్వపాపైః ప్రముచ్యతే

ఈ రామచరిత్ర మహాపవిత్రమైనదట. పాపసంచయమును రూపుమాప గలదట. వేదసమ్మితమట. పుణ్యఫలమునిచ్చునట. ఈ చరిత్రను ఈపాపము ఆపాపమను మాటలేక ఎట్టిపాపములనుండియైన తొలగించునట. ఇదియట రామ చరిత్ర. నారదులు చెప్పినారు, ఇట్టిరామకథను ఎవ్వరిముఖముగ వినవలెనో ఎట్ల ర్థముగావించుకొనవలెనో మీరే యూహించుకొనుడు. ఈ రామాయణము నాలుగు వర్ణములవారును పఠింపగా ఆయావర్ణములవారికి ఏయేఫలములు నివ్వవలెనో ఆ ఫలములనిచ్చునననినారు,

పఠ్యర్ ద్విజో వాగృషభత్వమీయాత్
స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్
జనశ్చ శూద్రోపి మహత్వమీయాత్

అఫలము లెవ్వి? బ్రాహ్మణుడు పఠించుచో అతడు వాగింద్రియశక్తి కలవాడగును సామాన్యనుగు సామ్రాజ్యలక్ష్మిగల క్షత్రియుడు ఈ రామాయణమును నిత్యపఠనము గావించుచో చక్రవర్తిత్వము అతనికి ప్రాప్తమగును. వైశ్యుడు పఠించుచో ధనవంతుడు కాగలడు. శూద్రులు పఠించుచో మహత్వము కలవాడగును. అనగా సంపూర్ణ గౌరవము మొదలగు సద్గుణములు కలవాడగునట.

కావున మన రామాయణ మహాకావ్యమును మనము సామాన్యమగు చరిత్ర గ్రంథమని తలచుట కంటె ఆత్మహత్య మరియొకటి లేదు.

మన గ్రంథములకు పఠనమువలన కలుగు పుణ్యము ప్రత్యేకమగువిషయము. ఈ విషయమును శ్రుతిస్మృతీతిహాస పురాణములకే పరిమితము. ముందుకుపోదము.

నారదమహర్షి సంక్షేపముగ రామకధనంతను విశదపరచినారు. ఆ రామకథా సంగ్రహము మన రామాయణమున నూరు శ్లోకములతో నున్నది. దీనికే బాల రామాయణమని పేరు. మన రామాయణ కావ్యమునందిది మొదటి సర్గ. తరువాత నారదమునీంద్రుల చరిత్ర ఏమి?

తరువాత నారదులు వాల్మీకిముని ప్రవరునిచే పూజింపబడి ఆకాశగమనమున దేవలోకమున కేగినారు. ఈ విషయము రెండవసర్గమున రెండు శ్లోకములతో వర్ణించబడినది. అ శ్లోకముల వినిపించి ఆ శ్లోకములందలి కొన్ని విశేషముల తెలిపెదను.

॥ నారదస్య తు తద్వాక్యం శ్రుత్వా వాక్యవిశారద ః
పూజాయమాస ధర్మాత్మా సహశిష్యో మహామునిః .
యధావత్పూజితస్తేన దేవర్షిర్నారదస్తదా
అ పృష్ట్వైవాభ్యను జ్ఞాత స్సజగామ విహాయసమ్

ఈ శ్లోకములను వింటిరిగదా?

నిజమున కివిశ్లోకమాత్రములేకావు. శోకాపనోదన మహావాక్యార్థవివరణరత్న దీపములు. కవిశబ్ద నిర్వచన నిర్వాహకము లీ శ్లోకములే. రామకథా గానమును చేయ దగు అర్హత వాల్మీకికి కలిగినదని నిర్వచించిన శ్లోకములివ్వి. నారదుని పరిపూర్ణాత్మ బోధామృతమును కడుపార త్రావినారు వాల్మీకియని ఈశ్లోకముననే మనము గుర్తింపవలెను.

ఈశ్లోకములకు తాత్పర్యమును చెప్పి ఆతరువాత ఈశ్లోకముల యొక్క ప్రాముఖ్యతను వివరింతును.

వాక్య విశారదుడును ధర్మాత్ముడును మహామునియునగు వాల్మీకి నారదుని యొక్క వాక్యమునువిని ఆ మహనీయునివాక్య శ్రవణానంతరమున తన శిష్యులతో కలసి నారదుని పూజించెనట. ఇది మొదటిశ్లోకము రెండవశ్లోకమున ఆవాల్మీకి పూజలందుకొన్న దేవర్షియగు నారదులు ఇకనేను వెళ్లివచ్చెదనని వాల్మీకికి చెప్పి శిష్యుని ఒప్పుదలతో ఆకాశగమనమున దేవలోకమున కేగెనని యున్నది. ఇదితాత్ప ర్యము.

ఈ శ్లోకములను సామాన్యముగ వినుచో మనకేమి తెలియును? వాల్మీకికి రామకథను చెప్పి ఆయన అందించిన సత్కారమునందుకొని నారదులు వెళ్ళెనని తెలును. ఇంతమాత్రముగనే గ్రహించి మనమవ్వలకేగుచో ఈ శ్లోకములందలి నిగూఢభావము మనకార్థము కాదు. కావున ఈ శ్లోకము లందలి పదవార్థక్యము లగ్రహింతము. మొదటి శ్లోకమున వాక్యవిశారదుడగు వాల్మీకి నారదుని వాక్యమును వినెననియున్నది. నిజమునకు వాల్మీకికి నారదులు ఒక్కవాక్యమునే చెప్పెనా? కథాంతర్భాగము నందెన్నియో వాక్యములున్నవిగదా? వాల్మీకివివాక్యవిశారదుడనుట లోని అర్థమేమి? అంతేకాదు వాల్మీకికి ధర్మాత్ముడను విశేషణము కూడవాడబడినది. ఈ పదములలోని ప్రత్యేకతనుమనము గమనింపకముందుకుపోరాదు గమనింపుడు. ఇక్కడ కథాంతర్భాగము నందలి వాక్యములన్నియు కలసి ఒకవాక్యమైనది. ఆ ఏక వాక్యతను గ్రహించెను. కనుకనే వాల్మీకివాక్యవిశారదుడు ధర్మాత్ముడును అయ్యెను. అదెట్లుఛాందోగ్యములోని మహావాక్యము వంటిదే రామకథంతయూ చెప్పుటకే

ఇక్కడ వాక్యము శ్రుత్వా అని ఉన్నది. గురువర్యులు బోధించిన తత్వమసి మహా వాక్యార్ధ వివరణమును గ్రహించి వాల్మీకి వాక్య విశారదుడయ్యెను. కావుననే ఆతడు ధర్మాత్ముడయ్యెను.

ధర్మము రెండు విధములు. ప్రవృత్తి నివృత్తి అని. ప్రవృత్తి ధర్మమన మానవ దేహమున పరిపూర్ణ విషయ సుఖములనందించి, దేవలోకములయందు కూడ పుణ్యఫలానుభవమును కల్పింపదగు కర్మకాండము. నివృత్తి ధర్మ మన దేశకాలములచే పరిమితముగాక అవస్థా భేదములులేక అఖండాద్వితీయ బ్రహ్మానందానుభవమును కల్పించు జ్ఞానకాండము. దీనికి సర్వోత్తమ ధర్మమనికూడ పేరు. నివృత్తి ధర్మమున పరిపూర్ణుడైనగాని ధర్మాత్ముడను పదము సంపూర్ణ సార్ధక్యము నొందదు. కావుననే వాల్మీకి ఈ రెండు ధర్మములకును రాముడే అధిష్ఠానమని చెప్పిన గురువర్యుల వాక్యసారమును గ్రహించి ధర్మాత్ముడయ్యెను. అంతేకాదు ఆతడు మహామునికూడ నయ్యెను. అనగానేమి? నారదమునీంద్రుని పరిపూర్ణాత్మ భావమును తానందుకొని ఆత్మారాముని మననమును గావించెనని ఆ మహామునియను పదము బోధించినది. ఇక్కడ సర్వవేదేతిహాస పురాణములను తాను విన్న రామునియందే పర్యసించినవని వాల్మీకికి దృఢమైనది. ఇదియే కాదగు సమన్వయము. నారదులు సనత్కుమారుని వలనను, చతుర్ముఖ బ్రహ్మవలనను విన్న, అనుభవించిన సమన్వయ మిదిమే. భాగవతమున వ్యాసులు బ్రహ్మ నారద సంవాదమున వర్ణించిన వర్ణనా విశేషమును కూడ మీకిక్కడ వినిపించెదను.

భాగవతమున నారదులు చతుర్ముఖుని సర్వజగదధిష్ఠానమేదియని ప్రశ్నించగా ఆతని ప్రశ్నకు సమాధానము నిట్లొసంగినాడు.

॥ద్రవ్యం కర్మ చ కాలశ్చ స్వభావో జీవ ఏవ చ
వాసుదేవాత్పరో బ్రహ్మన్నత్వన్యోర్థోస్తి తత్వతః.

పరిపూర్ణమగు పరబ్రహ్మ తత్వమొక్కటె ఈ జగదధిష్ఠానమని వక్కాణించినారు. అది వాసుదేవుడను పేర బరగినదనినాడు. ఆ వాసుదేవుడే ఈ జగత్తని తేల్చి అదెట్లు కుదురును? అని ప్రశ్నించగా కారణమునకంటె కార్య మెప్పుడును వేరైయుండదనునది సిద్ధాంతము. మనమిప్పుడీ జగత్కార్యమును పరిశీలింపుచో

జీవేశ్వర భేదము స్పష్టమై కన్పట్టుచున్నది. జీవుల జన్మలకు నిమిత్తము కర్మయ్యే నని కూడ వేదశాస్త్రము లుద్ఘోషించుచున్నవి. పంచమహాభూతములును జీవులకర్మయు, ఆ కర్మను క్షోభింపజేసి అనగా పాకము గావించి సృష్టికి సహాయకారియగు నది కాలమును. ఆ ద్రవ్యకర్మ కాలాదికము లందించు ఫలమును అనుభవించు భోక్త అనగా నేనీ సుఖదుఃఖములను భవించుచుంటినను భావము కలిగిన జీవచైతన్యము. ఇన్ని కనబడుచుండగా ఈ భేద సృష్టిలేదు అని చెప్పుట ఎట్లు కుదురును? అను నది సందేహము. అ సందేహమును తీర్చుటకే ఈ శ్లోకమున చతుర్ముఖుడు, "నత్వన్యోర్థోస్తితత్వతః" అని వాడినారు. విచారించుచో కారణమునకంటె కార్యము వేరై లేదునాయనా అనినారు. నామరూపాత్మికములగు ఘట శరావాదులు మృత్తిక కంటె వేరుకాదు. అవి నామమాత్రములు మృత్తికయే సత్యము. అధిష్ఠానము సత్యము. కావున భేద స్వరూపవర్ణనను గావించిన వేదములకుగాని ఇతిహాస పురాణములకుగాని భేదరూపమగు వస్తు జాతమునందు తాత్పర్యము లేదు.

నారాయణపరా వేదా దేవా నారాయణాంగజాః
నారాయణ పరా లోకా నారాయణ పరా మఖాః
నారాయణపరో యోగో నారాయణ పరం తపః
నారాయణపరం జ్ఞానం నారాయణపరాగతిః.

అని చక్కగ వ్యాఖ్యానించినారు. వ్యాసులీ భాగవతము నందెట్లు నిర్వచించెనో వేదము యందును అట్లె స్పష్టపరచినారు. సమస్త వేదములును నారాయణుడే. దేవతలందరును అతని మాయాకార్యమే. లోకములన్నియు అతనికంటె లేవు. ధ్యానయోగమును అతనియందే సమన్వయము. అనినారు.

మనమిక ప్రకృతమునకు వత్తము.

వాల్మీకి మహర్షి తన శిష్యులతో కలసి నారదుని యథావిధిగ పూజించినారు. శిష్యప్రశిష్యుల పూజలనందుకొన్న నారదులు ఆకాశమార్గముగ దేవలోకమును చేరుకొనినారు. ఇంతవరకు మనము గ్రహించిన విషయములేమి? వేద వేద్యమగు రామతత్త్వము తపోనిష్ఠా గరిష్ఠు లందించిన పరమానుగ్రహముగాని సామాన్య మానవచరిత్రముగాదని మనకు నిర్ణయమైనది. ఇక మనము తెలుసుకొనవలసినదేమి? నారదుని వలన తెలిసికొనిన ఆ రామతత్త్వమును కావ్యరూపమున అతడెందుకు వెలువరించవలసి వచ్చినదో ఎట్లు ఆ ఆదికవి కావ్యవైభవమును మనకందించెనో

తెలుసుకొనవలసియున్నది. నారదులు వెళ్లిన తరువాత కథా భాగమిట్లు నడచినది
నారదమునీంద్రులతోటి సంభాషణము వాల్మీకికి సమాప్తమగుసరికి ప్రాతః
కాలము దాటినది. మధ్యాహ్నకాలము ఆసన్నమైనది.

భారతీయ సంప్రదాయము ననుసరించి శిష్టులగువారు తమ మాధ్యాహ్నిక కృత్యముల దీర్చుకొన మరల స్నానము చేయవలెను. సామాన్యముగ గృహస్థులకు రెండు పర్యాయములు స్నానవిధి కాగా వానప్రస్థులగు మహర్షులకును సన్యాసుల కును త్రిషవణస్నానము విధివిహితము. అనగా మూడువేళలయందును స్నాన మాచరించియే ఆయా కాలకృత్యములను తీర్చుకొనవలెను.

వాల్మీకిమహర్షికి మాధ్యాహ్నిక కాలకృత్యములతీర్చుకొనదగు సమయమాసన్న మైనది మహర్షి స్నానమునకై బయలుదేరినారు. భరద్వాజుడను ఋషి ఆయనకు ముఖ్య శిష్యుడు .ఆతడును గురువర్యులవెంట నంటినాడు. గురువర్యుల కమండలము భరద్వాజుని చేతి కలంకారమైనది. స్నానమైన తరువాత ధరించదగు గురువర్యుల వస్త్రములును భరద్వాజుని చేతియందే యున్నవి.

అది తమసా నదీతీరము. గంగా స్రవంతి కది అత్యంత సామీప్యము. నేడు వాల్మీకి పయనము విష్ణుపాదోద్భవయగు గంగకు అభిముఖముకాలేదు. నేడా పవిత్ర పాదులు శిష్యునితో గూడ ఆ తమసా నదీతీరముననే నిలిచినారు. వయ్యారమై పారు ఆ పవిత్ర వాహిని పైననే మహర్షి చూపులును నిలిచినవి. భావికాలగతు లతిచిత్రములు. ఆ పవిత్ర వాహినిలోని వినిర్మల తోయము లామునివర్యుల హృదయము నాకర్షించినది. అవి అతి స్వచ్ఛములు. ఆ విశుద్ధజలము లందెక్కడను ఆ మునికి బురద కనుబడలేదు. ఆహా! ఈ నదీజలము లెంత నిర్మలములై యున్నవి? కలుష రహితములగు ఈ పవిత్ర నదీ తోయములు సత్పురుషుల హృదయములవలె దోషదూషితము కాకయున్నవే! అన్న భావమా మునివర్యుల హృదయ సీమయందు మొలకెత్తినది. మొలకెత్తుట కాదు. ఆ క్షణముననే చిగురు టాకులనీని పత్ర పుష్పఫల భరితమైనది. ఆ మహర్షి విశుద్ధాంతః కరణమునందుద యించిన భావమా మహర్షి హృదయమున నిలువలేదు. స్నాన మాడవచ్చిన ఆతని స్నాన మెక్కడికి పోయినదో! శిష్యునివైపు తిరిగి, తాత, ఈ పవిత్ర నదీ తోయ ముల తిలకించితివా? అని అవిశుద్ధ జలములసత్పురుషుల నిర్మల హృదయములకు పోల్చి చెప్పినారు.

॥అకర్దమమిదం తీర్థం భరద్వాజ నిశామయ
రమణీయం ప్రసన్నాంబు సన్మనుష్యమనో యథా.

మీరు వాల్మీకి రామాయణమున వినదగినది కథాభాగ మొక్కటే కాదు. ఆ కథాంతర్భాగములై వెలువడు ఉపమాన రత్నములనుకూడ సహృదయులై అందు కొనినగాని ఈ కావ్య శ్రవణఫలము మీకు దక్కదు.

ఈ నదీ తోయముల రామణీయకత నెట్లు పోల్చిరో చూచితిరా? ఇవి సత్పురుషుల హృదయములవలె నిర్మలములై యున్నవట. ఈ ఉపమానములోని ప్రత్యేకత ఏమి?

మానవ సమాజ మంతయు ఒక్కటే అయ్యును మన సత్త్వములు వేర్వేరై యుండుసనుటను ఎవ్వరును కాదనజాలరు. అందుకు కారణమును ప్రతిపాదింప సమర్థము కాదుకూడ భౌతికవాదము. భాగవతమున సృష్టి విధానము వర్ణించబడి యున్నది. ఆ సృష్టి విధానమును మీకిక్కడ చెప్పుట చాల అవసరము. సృష్టి రెండు విధములు. స్త్రీ పురుష సంబంధము కలిగిన సృష్టి యొకటి. మనోమయ సృష్టి యొకటి. సృష్ట్యాదియందు చతుర్ముఖుని సృష్టులు కొన్నియున్నవి. ఆ సృష్టులలో మొట్టమొదటి సృష్టియందు అవిద్య సృజింపబడినది. అది అయిదు విధములుగ సృష్టింపబడినది. అనగా ఆ అవిద్య అయిదు భాగములు (1) తమస్సు. (2) మోహము. (3) మహామోహము. (4) తామిస్రము. (5) అంధతామిస్రము. తమస్సు ఏమిచేయుననగా తన నిజస్వరూపమును మరగు పరచును. చీకటి ఏమి చేయును? ఉన్న పదార్థమును కనబడకుండ జేయును. అదియే తమస్సు. మోహమన భ్రాంతి. అసత్యమును సత్యమను కొనుట. నిజమునకు మన అయిదు అడుగుల శరీరము ఆత్మకాదు. ఆ శరీరము నేనేనని వ్యవహరించుట మన నిత్యానుభవములోనిది మహామోహమన విషయ సుఖములయందిష్టము. తామిస్రమన ఆ విషయ భోగములు లభింపకపోవుటచేత కలుగు క్రోధము. అంధతా మిస్రమన మరణము, ఇట్టి విభాగములతో కూడిన అవిద్య ఎవ్వరి మనస్సులను ఆవరించియున్నదో వారి మనస్సు వినిర్మలమై యుండదు ఈ అవిద్యావరణము లేనివారు సత్పురుషులు రాగ ద్వేషములకు తావుండదు. సత్పురుషుల హృదయమున లేక సత్ అన పరబ్రహ్మ. అసత్ అన బ్రహ్మకానిది. అట్టి పరబ్రహ్మను సంధానమున నిమగ్నులగువారు సత్పురుషులు. అట్టి సత్పురుషులయందు రాగద్వేషములనుమలినమెట్లుండును? కావున వారి అంతఃకరణమువలె ఈ నదీజలము స్వచ్ఛమైనదనినారు.

ఒక్కమాట. ఈ నదీజలములకే ఆసత్పురుషుల హృదయములనేలపోల్చ లేదు? నదీనదములెంత పవిత్రవాహినులై ప్రవహించినను నదీగర్భమున బురద యుండుట సహజము. వర్షాకాలమున నదీజలము బురదతో కూడకతప్పదు. మానవ సమాజము నందలి సత్పురుషులట్లుకాదు. సత్పురుషుల వినిర్మల హృదయములు సార్వకాలికములు. వారి హృదయములకు వర్షాకాలము లేదు. సృష్టిఖండమున జీవుల నందరి నావరించియున్న ప్రకృతి గుణములు ఆ సత్పురుషుల నావరించి యుండవు. ప్రతి జీవుని అంతఃకరణము నందును అసూయా రాగద్వేషములు చోటుచేసికొని స్థిరనివాసముల నేర్పరచుకొనగా సత్పురుషుల హృదయాంతరాళ ముల వాటికి ప్రవేశము లేకపోవుట వారి ప్రత్యేకత ఆ సత్పురుషుల హృదయా కాశము సంగరహితమును విశ్వవ్యాప్తమునుకూడ. కావుననే వారు సర్వ భూతము లకును శరణాగత రక్షకులయ్యెదురు. వారికి సర్వభూత హితులని పేరు. అట్టివారి అంతఃకరణముననే సద్రూపమగు బ్రహ్మచైతన్యము భాసించును. ఆ సత్పురుష పదములోని సత్పదమునకు సార్థక్యమదియే. సద్రూపమగు పరబ్రహ్మము నిర్దోషము. కావుననే వారి హృదయములుకూడ దోష రహితములై నిర్మలములై బ్రహ్మాకారత నొందియుండును. కావున వాల్మీకి మహర్షి నదీ తోయములను సత్పురుషుల మనస్సులకు పోల్చినారు. ముందుకు రండు ఆ సమయమున సీతా సాధ్వి ఆయన హృదయము స్పందించినదేమో తరువాతి కథకు రండు. వాల్మీకి మహర్షి భరద్వాజునితో వత్సా! నీ చేతనున్న కమండలము నిక్కడబెట్టి, స్నానము చేయదగు నా వల్కలముల నిట్లిమ్ము. ఈ పవిత్ర నదీ తోయములందే స్నాన మాచరింతును. నీవును ఇంచే స్నాన మాచరింతువుగాక యని చెప్పి శిష్యుడు తన చేతనున్న వల్కలములను తన కందివ్వగా ఆ వల్కలముల ధరించి స్నానమాడ వలసిన ఆ తపస్వి నదీ జలములందడుగిడలేదు.

అ నదీజలములవలెనే ఆ తమసా నదీతీరమునందలి వనరామణీయకము ఆ మహర్షివారి చిత్తము నాకర్షించినది. ఆ వనసీమలోని రామణీయకత నట్లే చూడసాగినారు. అక్కడనే తిరుగాడినారు. ఇదియే దైవ చిత్రము. కాకున్న బాహ్యదృశ్యమా యంతర్ముఖుని ఆకర్షించుటేమి? దీనికొక ప్రత్యేకత లేకపోలేదు.

అంతర్ముఖులు అంతర్ముఖులయ్యే ఉన్నచో సంసార సముద్రమునబడి దరిగానని మన బోంట్లనుద్ధరించదగువాణి మనకెక్కడ లభించును? శంకరులు శంకరులయ్యే ఉన్నచో అద్వైతవాణి బహిర్గత మెట్లయ్యెడిది? భగవంతుడు

గోవింద భగవత్పాదులవలె సమాధినిష్ఠుడై ఒకచోట యుండి ప్రచారకుడుకూడ కాగలడు. మతాచార్యులందరి రూపములును భగవద్రూపములే.

ప్రస్తుతమున వాల్మీకిమహర్షివారి అంతర్ముఖ దృష్టి బహిర్గతమై స్నాన మాడక ఆ వనసీమ యందలి రామణీయకతపైకి ప్రసరించినది. అట్లాతడు ఆ వనరామణీయకతనే చూచుచుండెను. అప్పుడా మహర్షివారి ఇంద్రియ సముదాయము ఆ బ్రహ్మణ్యుని స్వాధీనము తప్పియున్నదని మాత్రము మీరూహించకుడు. అప్పుడును ఆతడు నియతేంద్రియుడే అదియొక తపస్సు కావచ్చును. కావుననే,

॥స శిష్యహస్తాదాదాయ వల్కలం నియతేంద్రియః
విచచార హ పశ్యం స్తత్సర్వతో విపులం వనం.

అనియున్నది. అంతలో ఆ మహర్షి కంటనొక విచిత్రమగు దృశ్యము ప్రత్యక్షమై నిలిచినది. అదొక పక్షి మిథునము. ఆ పక్షులకు క్రౌంచ పక్షులని పేరు. ఆ జంట విడివడి దేనికదియై ఆ వనమున తిరుగుటలేదు. ఆ రెండును ఒక్కటై ఒక్కచో కూడి రాగబంధమున బంధింపబడి, తెగని ఆ రాగబంధము శృంగార రసాస్వాదనకి పులుగుల జంట ప్రతీకమని చెప్పుచున్నదోయన క్రీకేకారవములతో ఒకదాని నొకటి పలకరించుకొనుచు కామసుఖము ననుభవించుచున్నవి.

ఇప్పుడు మహర్షి దృష్టి ఎక్కడ నిలిచియున్నది? వనరామణీయకత నుండి దొలగినది. ఆ పక్షి ద్వందమనుభవించు రాగ గరిమపై నిలచినది, ఇంకను తన స్నానముపై పుకు తిరుగలేదు. ఇందేదియో ప్రత్యేకమగు భగవత్సంకల్ప ముండి యుండవచ్చును. కాకున్న ఆ దివ్యజ్ఞాన సంపన్నుని అంతఃకరణ మీ విషయసుఖానుభవము నొందుచున్న ఈ పులుగుల జంటపై ఏలనిలుమను? ఋషి హృదయకుహరమున వెలుగొందు అంతర్యామి ఏదియో యొక మహత్తర కార్యము నీ మహర్షిచే చేయింపనెంచినాడు. కావుననే ఇప్పుడు వాల్మీకి కంటికింపై మనస్సును ఆకర్షించిన ఆ దృశ్యమునకు విరుద్ధమగు వేరొక దృశ్యమును కూడ వాల్మీకికి సాక్షాత్కరింప జేసినాడు ఏమది?

రతిక్రీడా విలాసముల నానందించు ఆ పక్షి మిథునమునకు వెనుక భాగము నందొక కిరాతుని వాల్మీకి దర్శించినారు. ఆ కిరాతుడు వైరనిలయుడు. క్రోధ దేవత కాతని అంతఃకరణమునివాస స్థానము. అతడొక వేటకాడు. దయారహితుడు. వేటకాండ్రకు దయ ఎక్కడిది? ఆ పక్షి మిథునమనుభవించు ఆనందము నాతడు

చూచి సహించుట జరుగలేదు. నిజమునకా కిరాతుడు ఆ పక్షి ద్వంద్వమునందలి పురుష పక్షికి మృత్యువయ్యే వచ్చినాడు. మృత్యువునకు దేశకాలములు లేవు. కామ క్రీడావిలాసములలో తన్ను తాను మరచియున్న ఆ పురుషపక్షి రానున్న మృత్యువు నెట్లూహించగలదు? సామాన్యముగ జీవు లెవ్వరును మృత్యువును స్మరింపరు. మృత్యు వెప్పుడును తన కర్తవ్యము నందేమరపాటును కలిగియుండదు. ఇదియే సృష్టిలోని చిత్ర విచిత్రమగు కళాఖండము. ప్రస్తుత మన కథాభాగమున ఆ పక్షి మిధునము వెనుక నిలిచియున్న కిరాతుని చేతనొక విల్లుకూడ యున్నది. వాల్మీకి చూచుచుండగనే ఆక్రూర హృదయుడు దయారహితుడై రతి క్రీడాకలాపముల ఆనందించు పురుష పక్షిని ఒకే ఒక దెబ్బకు గురిగావించి నేల గూల్చినాడు.

నిజమునకిది దయామయుగుడగు ఋషిసత్తముడుచూచి భరించగల దృశ్యము కాదు ఋషుల హృదయము నవనీతపు ముద్దలు. ఆ పురుషపక్షి నేల కూలినది. రక్తసిక్తమగు శరీరముతో తన నెత్తురుతో తడిసిన నేలపై కొరిగి విలవిలలాడుచు కొట్టుకొను ఆ పురుషపక్షి నొక్కదానినే మహర్షి దర్శించుటకాదు. భర్త మరణ వేదనను భరించలేక భార్య విలపించు దీనాలాపములకూడ ఆ మహర్షి వినవలసి వచ్చినది. వాల్మీకి జీవితము నందది యొక వినూత్నమగు ఘట్టము. ఇదివరకెన్న డును వనసీమయందాతడిట్టి ఘట్టము నీవిధముగ దర్శింపలేదు. వాల్మీకిహృదయ సీమ యంతయు శోకమయమై కరుణరస ప్రవాహమునకు నిలయమైనది అంతలో ఆ కిరాతకునిపై క్రోధముద్దీప్తమైనది. మునివర్యుల ముఖకమల మెర్రబారినది. ఆ సమయమునందా మహర్షి సత్తము నీప్రపంచమును గుర్తెరిగిలేదు. ఆ కరుణా మయుని హృదయంతరాళమున ఆతని అంతఃకరణము పక్షి మిధునమునకు కలిగిన ఆ పత్తునే స్మరించుచు తదాకార కారితమైనది. ఆ హంతకునిపై క్రోధమును అచ్చటనే చోటు చేసుకొన్నది. అప్పుడా మహర్షి ముఖకమలము నుండి శాపరూప మగు శ్లోకమొక్కటి వెలువడినది. అది శ్లోకమని అతడు భావించి పలుకలేదు. ఆ కిరాతకుని శపించి అతనిపై తనకు వచ్చిన క్రోధమును శమింపచేసుకొనదలచిన శాపవాక్య మిది. ఏమా వాక్యము?

శ్లో॥ మా నిషాద ప్రతిష్ఠాం త్వమగమ శ్శాశ్వతీస్సమాః
యత్క్రౌంచ మిధునాదేకమవధీః కామమోహితం.

ఈ శ్లోకతాత్పర్య మిది.

ఓ కిరాతుడా! మన్మథ విలాసములతో అతి మనోహరముగ విహరించు ఈ క్రౌంచ మిథునమునందొక మగపిట్టను నీపొట్టన పెట్టుకొంటివా? నీ ఆయుర్భాగ్యము తొలగిపోవుగాక. నీ కీర్తి ప్రతిష్ఠలును ఆ చంద్రతారకములై శాశ్వతములు కాక పోవుగాక. అని దీని సామాన్యార్థముచే వచ్చు తాత్పర్యము.

కాని మీకిక్కడ నేనొక్కమాటను చెప్పెదను. దానిని మీరు పెడచెవినిపెట్ట వద్దు. ఏమది? వాల్మీకి మహర్షివారు మాధ్యాహ్నిక కృత్యమునకై బయలు వెడలి నది మొదలు ఈ నిషాదుని శపించిన శాపవాక్యమును పలుకు వరకును దైవ ప్రేరితమై నడచినదనియే మీరు భావించవలెను.

భారతీయుల మహద్భాగ్యమే నేటి వాల్మీకి మహర్షివారి కన్నులకు అగ పడిన ఈ దృశ్యము. వాల్మీకి మహర్షి మనకందించదగు రామాయణ మహాకావ్య సంపదకీ మానిషాద శ్లోకము మూలధనము. వాల్మీకి రచించబోవు రామాయణ మహాకావ్యములోని నాయక ప్రతి నాయకు లిద్దరును వాల్మీకికి దర్శన మిచ్చుట జరిగినది. మన రామాయణ కావ్యమున నాయక ప్రతి నాయకు లెవ్వరు? రామ రావణులు. రాముడు లక్ష్మీనారాయణుడు కాగా రావణుడా పరమపురుషుని బాణము నకు గురియైన ప్రతివీరుడు. వారిద్దరి సాక్షాత్కారమే ఈ కాలమున వాల్మీకికి దృగ్గోచరమైన దృశ్యభాగమును ఆతని ముఖమునుండి వెడలివచ్చిన శ్లోకరాజము గూడ. ఆ బ్రహ్మణ్యునకు కిరాతరూపమున దర్శనమిచ్చిన ధనుర్ధారి సాక్షాన్నారా యణుడు లచ్చి మగడు. ఆ పక్షి మిధునము రావణ మండోదరీలు. రావణ సంహా రమును గావించి ధర్మసంస్థాపనను గావించిన లక్ష్మీనారాయణుని ప్రశంసయే ఈ వాల్మీకి ముఖమునుండి వెలువడి వచ్చిన వాణి. ఆ శ్లోకములోని పరమార్థమగు అర్థభావము లివ్వి.

(హేమానిషాద! యస్మాత్కారణాత్ క్రౌంచమిధునాత్ కామమోహితం ఏకం అవధీః తస్మాత్కారణాత్ శాశ్వతీస్సమాః త్వం ప్రతిష్ఠాం ఆగమః)

వాల్మీకి ముఖమునుండి వెలువడివచ్చిన శ్లోకమున మానిషాదయను పద మొకటియున్నది. ఆపదమునకు పద విభాగమును చెప్పుచో "మా" అను పద మొకటి "నిషాద" అనుపద మొకటియు కాగలవు. కలుపుచో అది ఒక్కటే పదముకూడ అగును.

అర్థము మారును. నిషాదపదమును ప్రత్యేకించుచో ఓ కిరాతకుడా ! అను సంబోధనవచ్చును. ఈ అర్థము కిరాతుని వరకే పరిమితమగును "మా నిషాద" యను పదము శ్రీ మహావిష్ణువును బోధించి ఓ రాముడా ! అను సంబోధనార్థము నిచ్చును. క్రౌంచమిధునాత్ అనుపదముపై అర్థము ననుసరించి రావణ మండోదరీ లను చెప్పును. మానిషాదయను పదము శ్రీ మహావిష్ణువునెట్లు చెప్పుననగా "మా" యన లక్ష్మి. ఆమెయందు రమించువాడుగాన లక్ష్మీపతి. లక్ష్మియే సీత. విష్ణువే రాముడు. లక్ష్మీనారాయణులే సీతారాములుగా అవతరించిరిగాన రామాయణార్థ మంతయు ఈ శ్లోకము నందిమిడి మంగళశ్లోకమైనది. తరువాత కథకుపోదము.

వాల్మీకి వైపుకు తిరుగుదము.

శాపవాక్యము తన నోటినుండి వెడలుట తడవుగా ఆ మునీంద్రుని మనస్సం తయు తనశాప వాక్యమువైపుకు తిరిగినది. ఈ శ్లోకమునకు తనకుగల సంబంధ మేమియో మహర్షికి అర్థముకాలేదు. ఇది కేవలమగు శాపవాక్యముకాదు. ఛందో బద్ధమగు శ్లోకము. ఈ శ్లోకము చందోబద్ధమగుటయే కాదు, వేదములయందుప వేదమగు గాంధర్వముకూడయై వీణపై మీటుట కనుగుణ్యముగ నున్నదనికూడ ఆప్రాజ్ఞుడు గ్రహించినాడు ఆ శ్లోకము నింకను విచారించుచో ఆ మహర్షికా శ్లోకాంతర్భాగమున ఋగ్వేద యజుర్వేద సామవేదములు స్ఫురించుటేకాక ఆ వేదా ర్థముల తెలియజెప్పు పంచాశద్వర్ణరూపిణియగు పరాశక్తికూడ ఆ శ్లోకము నధిష్టించి నట్లనిపించినది గాబోలు. ఆ శ్లోకార్థముల భావించి భావించి తనలోపల కలిగిన ఆశ్చర్యభావములను తన శిష్యునకు వెలుబుచ్చినారు మహర్షి.

"చింతయన్ స మహాప్రాజ్ఞశ్చకారమతిమాన్ మతిం
శిష్యంచైవాబ్రవీద్వాక్యమిదం స ముని పుంగవః
పాద బద్ధోక్షర సమస్తంత్రీలయ సమన్వితః
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా.

శిష్యుడేమి చేసెను ? గురువర్యులందించిన శ్లోక శ్లోకార్థ భావనలను చక్కగ ధారణగావించినాడు. గురువుల కింతకంటె కావలసినదేమున్నది ? వాల్మీకి శిష్యుని కృత్యమునకు ఆనందించినారు. తస్యతుష్టోఽభవద్గురుః

ఇక్కడికి తమసా నదీతీరమునందలి ఘట్టము ముగిసినది. ఇక మునివర్యుల స్నానముకావలెను. ఒక్క మాట.

భారతీయ సిద్ధాంతమున స్నానమున కొక ప్రత్యేకత యున్నది. అది పూతము కావలెను. మంత్రపఠనము సూక్ష్మశరీరమును శుద్ధిగావించగా మృత్తిక(మట్టి) స్థూలశరీరమును శుద్ధచేయును. ఈ నాటి నాగరికులకర్థము కాకపోవచ్చును. నిజమునకు మట్టియందున్న ఉత్కృష్టగుణము ఈనాటి సబ్బుల యందెక్కడున్నది?

మాధ్యాహ్నిక స్నానమునకు కావలసిన సామాగ్రిని వ్యాసస్మృతి ఇట్లు వర్ణించినది.

తతోమధ్యాహ్నసమయే స్నానార్థం మృదమాహరేత్
పుష్పాక్షతాన్ కుశతిలాన్ గోమయం గంధమేవ చ.

మృత్తికపుష్పములు, ధర్భలు. గంధము, గోమయము, తిలలు మొదలైనవి కావలెనట. ఈ పదార్థములను వాడుటకూడ వర్ణింపబడినది. ప్రస్తుతమున భారతీయ సంప్రదాయమిట్టిదని చెప్పుటకు మాత్రమే చెప్పినాను. మనకిక్కడ మనకథావస్తువు ముఖ్యముగదా!

నేను చెప్పినట్లు వాల్మీకియు శిష్యుడును యథాశాస్త్రముగ స్నానమాచరించినారు.

సోఽభిషేకం తతః కృత్వా తీర్థే తస్మిర్ యథావిధి

వస్త్రధారణయైనది మునివర్యులకు: వారిగమనము ఆశ్రమాభిముఖమైనది. పూర్ణకలశమును చేతనిడుకొన్న భరద్వాజుడు గురువర్యుల అడుగుజాడల నడువగా వాల్మీకిమహర్షి ఆశ్రమమున ప్రవేశించినారు.

అది వాల్మీకి ఆశ్రమము. ఇక మన రామాయణ మహాకావ్య నిర్మాణము జరుగవలెను. వాల్మీకి మహర్షి శిష్యునితో ఆశ్రమమున ప్రవేశించి దేవ పూజాదికముల నిర్వర్తించుకొనినారు. శిష్యులందరును తనను చుట్టి యుండగా ఆసనమున సుఖాసీనులయ్యెను. ఏవేవియో ఇతిహాస కథావిశేషముల శిష్యుల కందించుచు కూర్చొండెనుగాని మానిషాదశ్లోక మెక్కడికిపోవును? ఆయనమనసునందదియే మననమగుచుండెను. వద్దన్నను ఆ శ్లోకమే వచ్చుచుండెను. ఇదియే ధ్యానము.

ఉపవిష్టః కథాశ్చాన్యా చకార ధ్యానమాస్థితః

ఒక్కమారు మనము సత్యలోకమున కేగుదము. సృష్టికర్తయగు చతుర్ముఖునకు మన భూలోకమునకు రావలసిన అవసరము వచ్చినది. రామకథా ప్రచారము భూలోకము నందవసరమని చతుర్ముఖుని నిర్ణయము. అది వాల్మీకి ముఖముగనే జరుగవలెనని ఆతడెప్పుడో నిర్ణయించుకొనినాడు. ఆ చతుర్ముఖుని కార్యక్రమము కొంత నెరవేరినది. తన ఇల్లాలినెప్పుడో వాల్మీకి వద్దకు పంపినాడు. ఆమె ఇప్పుడు వాల్మీకి అంతఃకరణమున భావనా రూపమున వెలుగొందుచుండగా ఆభావనా విధానమేదియో తెలియక కొట్టుమిట్టాడుచున్న వాల్మీకికి తన అర్ధాంగియగు భారతి రాకను తెలియజెప్పుటకై అతడే స్వయముగ బయలుదేరినాడు. నిజమునకు వాల్మీకిముఖము నుండి వెలువడిన మానిషాదశ్లోకము ఆ వాగ్దేవియే.

పితామహుడు తనతో ఎందరో దేవతలు పయనము కాగా తాను స్వయముగ వాల్మీకి ఆశ్రమమున కేతెంచినాడు సృష్టికర్త యయ్యును.

ఆ జగామ తతో బ్రహ్మా లోకకర్తా స్వయంప్రభుః

వాల్మీకి మునిచంద్రుల కీనాటి ఘట్టములన్నియు చిత్రవిచిత్రములయ్యే నడచినవి. మొదటిది ఊహింపని నారదా గమనము. రెండవది ఆ మహనీయుని తోటి సంభాషణము. మూడవది క్రౌంచ మిథున దర్శనము. నాల్గవది కరుణ రసప్రాదుర్భావము. అయిదవది ప్రస్తుత చతుర్ముఖుని ఆగమనము. దేవతలతో గూడిన సత్యలోకాధిపతి ఆగమనము ఒక్కమాటుగ ఆతనిని విస్మితుని గావించినది. ఒక్కక్షణమైన ఆలసింపకయే బ్రహ్మను చూచుట తడవుగా ఆసనమునుండి లేచినాడు. ఇక్కడొక ప్రత్యేకమగు ధర్మమున్నది.

ఊర్ధ్వం ప్రాణాహ్యుత్క్రమంతి యూనః స్థవిర ఆగతే
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాః ప్రతిపద్యతే.

పెద్దల సందర్శనమగుట తోడనే మన ప్రాణములు తటాలునపైకి పయనించునట. వెంటనే లేచివారికి ఆసనార్ఘ్యములనిచ్చి వందన సమర్పణ గావించగా అవి స్వస్థానమును చేరుకొనునట. కావుననే బ్రహ్మను దర్శించగనే వెంటనే లేచి పాద్యాది అర్ఘ్యవిధుల పూజించి ప్రణతుడై దోసిలి యొగ్గి కుశల ప్రశ్నలు గావించినాడు బ్రహ్మగారును వాల్మీకి అందించిన ఆసనముదందు పవిష్టుడై వేరొక ఆసనముపైన వాల్మీకిని కూర్చుండ నియోగించినాడు.

మనభారతక్షేత్రమునందలి వాల్మీకి ఆశ్రమ మానాడు సత్యలోకమై విలసిల్లిన దనుట అతిశయోక్తి కాదు. కథకు రండు. మన వాల్మీకి స్థితి యేమి? వాల్మీకి స్థితియా? చతుర్ముఖుని అతడు పూజించెను. పలకరించెను. కాని వాల్మీకి హృదయమున మాత్రము శ్లోక ధ్యానమే నిలచియుండెను. శ్లోక ధ్యానమే కాదు. క్రౌంచ పక్షుల దర్శనమును, కిరాతకుని క్రూరకృత్యమును తన యందుదయించిన కరుణ రసమును, దాని నాధారముగా గొనివచ్చిన శాపవాక్యమును అతని హృదయమును వికలము నొందుచునే యుండెను. అతడు శోక పరాయణుడయ్యె బ్రహ్మగారి కభిముఖుడై కూర్చొనెను.

శోచన్నేవ ముహుః క్రౌంచీ ముపశ్లోక మిమం పునః
జగావంతర్గతమనా భూత్వా శోకపరాయణః

బ్రహ్మ ఎట్లు కూర్చొనెను? చిరునగవు చిందులాడగా వికసిత ముఖమండలముతో కూర్చొనెను. తాను పంపిన భారతియే ఈ నవభారతిని పలికించినదని వాల్మీకికి తెలియక పోవుటకే అతని చిరునగవు. ఇక వాల్మీకి సందేహమును తీర్చదలచినాడు. చతురతతో హే "బ్రహ్మన్" అని సంబోధించినాడు వాల్మీకిని నీ ముఖమునుండి వెలువడినది శాపవాక్యము కాదని స్పష్టపరచినాడు. నీవు పలికినది పలుకుకాదు. అది రమణీయార్థ ప్రతిపాదకమగు శ్లోకము. నా అనుమతితోడనే సరస్వతి నీ జిహ్వాగ్రమున నిలిచి పలికించిన పలుకుగాని వేరొకటి కాదని నిర్ణయించినాడు. ఋషిసత్తమా! తరువాతి కార్యక్రమమును నీకు వివరించుచుంటిననె నారద ముఖముగ నీవు విన్న రామ చరిత్రనంతను ఇతివృత్తముగా కావించి కావ్యరూపమున ప్రకటించుమనినాడు. వాల్మీకికి నారదులు చెప్పిన సంగ్రహ చరిత్రను విస్తరించిన గాని మానవ జాతి ఉద్ధరింపబడదని ఆ పితామహుడు తలచెనేమో ధర్మాత్ముడును ధీశాలియు లోకోత్తరగుణ సంపన్నుడును ధీరుడు నగు నాయకుని కావ్యనాయకుని గావింపక కావ్యము సుసంపన్నముకాదు గావున అట్టి లోకోత్తర గుణసంపన్నునే నారదులు నీకందించినారు గావున దానిని యథాతథముగ ఆ గురు ప్రసాదమును లోకమునకు పంచి కృతార్థుడవు కమ్మనినాడు. ఇక్కడ మీకొక్కమాటను చెప్పెదను. అంత మాత్రముగ చెప్పి బ్రహ్మగారు ఊరుకొనలేదు. కావ్యాలాపములు పరమార్థ ప్రదములు కావను న్యాయము (కావ్యాలాపాశ్చ వర్జయేత్) బ్రహ్మ ఎరుగనిది కాదు. కావుననే ఆసందర్భమున వాల్మీకికి వరప్రదానము గావించి మరీ వెళ్ళినాడు ఆ వరము లెవ్వియో మీకు వినిపించుట చాలా ముఖ్యము.

రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్య ధీమతః
రామస్య సహసౌమిత్రేః రాక్షసానాం చ సర్వశః
వైదేహ్యాశ్చైవ యద్వృత్తం ప్రకాశం యది వా రహః
తచ్చాప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి
న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి.

నేను చెప్పబోవు విషయమును మీరు జాగరూకులై వినుడు.

ఈ కావ్యమున ముఖ్యాతి ముఖ్యములగు పాత్రలు నాయకా నాయికలగు సీతారాములే అయ్యును వారితోగూడ రావణాది రాక్షస బృందము లేకపోలేదు భరత లక్ష్మణ శత్రుఘ్నులును సీతారాములతో కలిసి మెలసియే యుండిరి. స్త్రీపురుష పాత్రలనేకములై తిర్యగ్జంతువులు గూడ ఈ కావ్యమున ప్రధానపాత్రలై విలసిల్లినవి. కావున ఈ కావ్యము మహాసముద్రము. ఇట్టి మహాసముద్రమును మధించి కవిసత్యములను చెప్పవలెను. ఆ సత్యములు త్రికాల సత్యములు కావలెను. తాత్కాలిక ప్రియములు కారాదు త్రికాల సత్యమును చెప్పదగు కవికి భ్రమ ప్రమాదరహిత బుద్ధియున్ననే అట్టి సత్యమును కవి అందించగలడు లోకమునకు. అందును ఈ కావ్యమున సీతారాముల భావ ప్రపంచ మతి గంభీరము గదా? అట్టి సీతారాముల విశుద్ధాంతఃకరణముల భాసించు రహస్యాతి రహస్య సంకల్పములుకూడ ఈకావ్యకర్తకు సాక్షాత్కరించినగాని ఈకావ్యము మహాకావ్యముకాదు. వేదవేద్యుడగు రాముని గుర్తెరుగుట వేదరహస్యముల గుర్తెరుగుట సీత హృదయమును ఆతల్లి హృదయసీమలోనికేగి తెలిసికొనుటయన్నను వేద సీమంతిని అంతర్హృదయమును తెలుసుకొనుటయే కావుననే వేదగర్భుడు లోకహితమునుకోరి రామాయణకావ్యమును వాల్మీకిచేరచింపచేయుటకు ప్రత్యేకములగు వరముల నిచ్చినాడు. ఆయాపాత్రల ఇతి వృత్తములనువర్ణనములనుగూడ సరహస్యములుగ నీకుతెలియగలవనినాడు. అంతే కాదు. నీవాక్కుఅసత్యమై ఈకావ్యమున ప్రసరించదనిఅమోఘమగువరమునిచ్చినాడు. అట్టివరప్రసాద లబ్ధమగు నీమహాకావ్యమును వాల్మీకికి చతుర్ముఖుడొసంగిన వరము లనుదృష్టి యందుంచుకొనక భావుకుల మనుకొనువారి కావ్యమును పరిశీలించుచో ఆ పరిశీలకులకు దొరకునది కావ్యామృతరస మెట్లు కాగలదు? బ్రహ్మ వాక్యములను వరములను మనసునందుంచు పాఠకులకు మాత్రము లభించునది అమృతభాండ మనక తప్పదు. అంతేకాదు. ఈ కావ్యము తాత్కాలిక ప్రకాముకాక శాశ్వతకర్తికీ

నందుకొనవలెను. కావున మునివర! నీ కావ్యము ఆచంద్ర తారకమై, నదీనదము లును, పర్వతశ్రేణులును, ఎంతకాలమీ భూమి యందుండునో అంతకాలము దనుక నీకీర్తి పతాక యిక్కడ నిలువగలదని కూడ చెప్పి తరువాతి కాలమునందును నీతో కూడ బ్రహ్మలోకమున కేతెంచునని రామాయణ కావ్య నిర్మాణ ఫలశ్రుతి వినిపించి బ్రహ్మగారు అంతర్ధానమగుట జరిగినది. వాల్మీకి మహర్షికదియొక ఆశ్చర్యకరమగు దృశ్యమైనది. అంతలో వాల్మీకిముని పుంగవుల ఆశ్రమాభ్యంతరమున "మానిషాద" యను శ్లోకము వారిశిష్యుల ముక్తకంఠములనుండి వెలువడి ఎకకంఠమై ప్రతిధ్వనించి నది. వారా శ్లోకమూరక ఒక్కమారుగ పఠించుటగాదు. ప్రతి ఒక్కరును ఆ శ్లోకార్థమును భావన చేయుదురు. ఆ భావ సౌందర్యముల కాశ్చర్యము నొందుదురు. మరల మరల ఆశ్లోకమును పఠింతురు. ఆయా సమయములందు వారికా శ్లోకము లోని నిగూఢభావములేవియో స్ఫురించగా ఆనందాతిరేకమున ఆశ్లోకమును గానము చేయుదురు. ఈవిధముగ ఒకరు మరియొకరితో ఆశ్లోక భావములను చెప్పుకొనుచు ఆశ్లోకార్థచింతనము గావించుటతో వాల్మీకిముఖమునుండి క్రౌంచపక్షి ద్వంద్వమును చూచినప్పుడు వెలువడిన ఆశ్లోక మిప్పుడు మరల శ్లోకత్వమొందినది శిష్యుల అనుసరణతో.

మనమొక్కమారు వాల్మీకియొద్దకుకు వత్తము. అతడిప్పుడు ఒకనాటివాల్మీకి మహర్షి మాత్రమేకాడు. ఆతడిప్పుడు వేదార్థమునులేక వేదవేద్యుని వ్యాఖ్యానించి ఆ నిగూఢవేదసారమును మన శ్రవణపుటములను దోసిళ్ళనింపి మనచేత రామరసపాన మునుచేయుటకై బద్ధకంకణుడై కూర్చొన్న మహాకవియయ్యెను. అతడిప్పుడు కావ్య వాఙ్మయ విధాతయయ్యెను. కావున రామాయణ మహాకావ్యసృష్టి అంతయు స్థూల రూపము నొందుటకు పూర్వమే ఆకవి పుంగవుని అంతఃకరణ యందు స్పష్టమైనది. సృష్టి విధానమదియే. మొదటిది మానసిక సృష్టి. తరువాతది బాహ్యసృష్టి.

అతడీ కావ్యమునెట్లు నిర్మించవలెనో ఆ విధి విధానము నంతను తనమనసున స్మరించినాడు. వేదసీమంతిని తనలో అంతర్భూతములైయున్న ఛందస్సుల నన్నిటిని అతని ఎదుట నిలిపినది. సార్థకములై వర్తిల్లు పదజాలము నంతను తాను వరించిన ఆ కవి పుంగవుని స్వాధీనము కావించినది. ఆపద పదార్థ భావములు ఒయ్యారములై ఈ కవి శ్రేష్ఠుని జిహ్వాగ్ర రంగస్థలమున నిలుపుటకు కావ్యవాణి సాలంకారయై అతనిముందు నిలిచినది. అఘహననీయుని ప్రజ్ఞాశక్తి పూర్ణరూపమున

ఆమునివర్యునకు దర్శనమిచ్చినది. కావుననే మహర్షి కావ్యమునంతను ఈ సంపద తోడనే నింపుదుననుకొనినాడు. "కృత్స్నం రామాయణం కావ్యం ఈదృశైః కరవాణ్యహం" అని నిశ్చయించుకొని అట్లే రామాయణ కావ్యసూక్ష్మ సృష్టిని గావించినాడా ప్రాచేతసుడు.

ముందు మీకిక్కడ కవియను పదమును వేదమెట్లు నిర్వచించినదో చెప్పి ముందుకుపోదును.

వేదము నందొకచోట భగవంతుని ఉత్కృష్ట స్వరూపముల వర్ణించుచు కవి యనువానిని కూడ భగవంతుని ఉత్కృష్ట స్వరూపునిగ వర్ణింపబడినది.

"బ్రహ్మాదేవానాం పదవీః కవీనాం."

దేవతలయందు చతుర్ముఖ బ్రహ్మ భగవంతుని స్వరూపము. కవులలో ఎవడు వ్యాకరణ సిద్ధములైన పదములను గుర్తెరిగి ప్రయోగింపగలడో అతడు శ్రేష్ఠుడని వర్ణించినది.

దేవానాం అగ్నీంద్రాదీనాం మధ్యే చతుర్ముఖోభూత్వా పరమేశ్వరః నియామకత్వేన అవతిష్ఠతే కవీనాం కావ్యనాటకాదికర్తౄణాం పురుషాణాం మధ్యేపదవీత్వేన అవతిష్ఠతే వ్యాకరణ నిష్పన్నఃసుశబ్ద విశేషఃపదం తద్వేతి గచ్ఛతీతిపదవీః శబ్ద సామర్థ్యాభిజ్ఞః వ్యాసవాల్మీక్యాది రూపః ఇత్యర్థః విద్యారణ్యము.

వ్యాకరణశాస్త్ర నిష్పన్నమైన శబ్దశక్తిని ఎరిగిన వ్యాసవాల్మీకాది మహర్షుల వంటివాడు కవియట.

ఇక్కడ శబ్దము నెరుగక ఆదియన అభ్యంత ప్రయత్నమునుగూడ తెలియగల శక్తి. బయటకు వెలువడు శబ్దమునకు ముందు ఆ శబ్దమునకు కొన్ని సూక్ష్మ రూపములున్నవి. పరాపశ్యంతీ మధ్యమ వైఖరీ వాక్కులని వాక్కు నాలుగు విధములు. అందు పరాపశ్యంతీ వాక్కులతి సూక్ష్మములు ఆ సూక్ష్మాతి సూక్ష్మ శబ్దముల దర్శింపదగు సామర్థ్యము తపసాశక్యమగునదిగాని భౌతిక శక్తియుక్తము కాదు. అట్టివారు వ్యాసవాల్మీకాదులు. అట్లే "ఋషిర్విప్రాణాం" అన్నది బ్రాహ్మణులలో ఋషి గొప్పవాడట. ఋషియని ఎవరిననవలెను? (ఋషిః—అనుష్ఠానసామర్థ్యే అతీంద్రియ వస్తుద్రష్టా) తపశ్శక్తిచే అతీంద్రియ వస్తువును చూడగలగవలెనట. అతీంద్రియవస్తువన ఆత్మయని భావము. అనగా జ్ఞాననిష్ఠుడు గొప్పవాడు. ఇప్పుడు

మనము వాల్మీకి వద్దకు వత్తము. ఇతడు ఋషి. సృష్టియందు ఋషిసృష్టి మానవ సృష్టి వంటిదికాదు. ఋషియైన కవి. ఇప్పుడా వాల్మీకి కావించిన రామాయణ కావ్య సూక్ష్మసృష్టిని చెప్పెదను. ఇక్కడ సూక్ష్మసృష్టి యననేమి? మనస్సునందీ కావ్యమందలి చరిత్రనంతను దర్శించుట. అతడిట్లు దర్శించినాడు.

వాల్మీకి మహర్షినే నీకావ్యమును నిర్మింతుననుకొన్న వెంటనే ఆశ్రమాంత ర్భాగమునందొక ఏకాంత ప్రదేశమున ప్రాచీనాగ్రములగు దర్భలపరచి, ఆ దర్భా సనము నందాసీనుడయ్యెను. కమండలోదకములచే కరతలములను మంత్రపూతముల గావించుకొనెను. దోసిలి యొగ్గెను. ఇంతవరకిది బాహ్యకృత్యము. తరువాతది మానసిక కృత్యము. మునిచంద్రుల అంతఃకరణము ధర్మబద్ధమై నారదమునీంద్రులు వచించిన రామకథ యందంతర్లీనమైనది బాహ్య ప్రపంచమును వీడినది. అంతర్ముఖ మైనది బాహ్యేంద్రియములచే చూడరాని దానిని చూడ సమర్థమైనది.

నిజమునకు సీతారాముల ముఖమండలములలోని మందహాసములుగాని, వారివారి గమనచాతుర్యములుగాని, వారి వాగ్గుంభనలుగాని హృదయ పరివర్తనలు గాని సాక్షాత్కరింప చేసుకొన్నగదా? వాటిని విస్తరించి మనకు వ్యక్తపరచ గలుగుట. అట్లు సీతారాముల దర్శించు భాగ్యమా మునిపుంగవునకు కలిగినది. బ్రహ్మవర ప్రసాదమున.

> ''హసితం భాషితం చైవ గతిర్వా యచ్చ చేష్టితం
> తత్సర్వం ధర్మవీర్యేణ యథావత్సం ప్రపశ్యతి.

రామాదులు వనగమనాదికముల నాతడు చూడగలుగుట మొదలగు విషయ ములన్నియు కావ్యస్తుతి మాత్రములని మాత్రము మీరు తలచకుడు.

భారతీయ గ్రంథములు ప్రపంచ వ్యవహారమును మాత్రమే చూడదగు జీవు లకు కథా మాత్రముగ గోచరించునట్లును ఆధ్యాత్మిక దృక్పథమేగల మేధావులకు వారి చూపును అంతర్ముఖము గావించి కృతార్థుల గావించుటకును అనుకూలములై యున్నవి. కావున మన రామాయణ కావ్యము కథావస్తువుతోడనే ముగియక పరమార్థతత్వమును గూడ బోధించును. మీకిప్పుడు మన రామాయణములోని కథా భాగమునందలి పాత్రలు జీవులమగు మనలోని గుణ సముదాయముగనే మనమెట్లు అర్థము చేసుకొనవలయునో గూడ ఒక విధముగ సమన్వయించి చెప్పెదను.

ఈ శ్రీ మద్రామాయణమును అన్వయించుట మూడు విధములు. ఒకటి ధర్మము [లేక] కర్మపరము. రెండు ఉపాసనము (లేక) భక్తి. మూడు జ్ఞానము (లేక) జీవబ్రహ్మైక్యము. అందు మొట్టమొదటిది ధర్మరూపకర్మయే. కారణమేమి? వాల్మీకి మహర్షి నారదుని ప్రశ్నించుటలోనే "ధర్మజ్ఞః" అని ప్రశ్నించుటచే ధర్మమునే ఈ గ్రంధము వ్యాఖ్యానించిన దనవలెను. యస్మిన్నచలతే ధర్మః యోధర్మంః నాతివర్తతే" అని రాముని వర్ణనము. అంతేకాదు. రాక్షసులు రామాయణమును వర్ణించునప్పుడు కూడ రాముని ధర్మ స్వరూపునిగ వర్ణించుట జరిగినది. తరువాతది భక్తి. అది నిష్కామ ధర్మాచరణ ఫలము వైదిక ధర్మము నవలంబించని వారికి చిత్తశుద్ధి కలుగదని మతాచార్యులందరును చెప్పిన సిద్ధాంతమే. వేదోక్త ధర్మకర్మాచరణమున మతాచార్యుల కెవ్వరికిని అభిప్రాయ భేదములేదు. రామానుజ మధ్వవల్లభాచార్యాది మత ప్రచారకులెవ్వరును మన్వాదిస్మృతికర్తలనుగాని, ఆపస్తంబాది సూత్రకర్తలనుగాని, పాణిన్యాది శాస్త్రకర్తలనుగాని అతిక్రమించరు. కావున వైదిక ధర్మముల నాచరించుటలో శివవిష్ణ్వాది భేదములు లేవు. గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత" అను విధి శాస్త్రమును శంకర రామానుజ మధ్వాద్యాచార్యులందరును అనువర్తించిరి. కావున రామాయణము ధర్మమును స్థాపించిన దనుటయే ముఖ్య సూత్రము. రాముడే "విద్ధిమాం ఋషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితం" అని తన స్వరూపమును తానే స్వైకతో చెప్పినారు. కాని ధర్మము ధర్మము అని అందరును వాడుదురు. శాస్త్రములును ఆపదమును వాడినది" ధర్మమను పదమునకు నిర్వచనమేమి? భారతీయ శాస్త్రములు మాత్రమే ధర్మశబ్దమును నిర్వచించినవి ధర్మమన అలౌకికమగు శ్రేయస్సాధనము "చోదనా లక్షణోర్థోధర్మః" అనిజైమిని సూత్రము. ఆపస్తంబులు ధర్మమును నిర్వచించుచు, యత్త్వార్యాః క్రియామాణం ప్రశంసంతి సధర్మః "యద్గర్హంతి సో ధర్మః" అనగా పూజ్యులు ప్రశంసించినది ధర్మము. వారు గర్హించినది అధర్మము. పూజ్యులన ఎవరు ? పూజ్యులన వేద శాస్త్రముల నాధారముగా గొన్న సదాచారవంతులని భావము. మనుష్య మాత్రులుగ పరిగణింపబడు సంఘ బాహుళ్యము నిర్ణయించినది ధర్మము కాదు. తరువాతది ఉపాసనము (లేక) భక్తి.

భక్తి సిద్ధాంతమున భగవంతు డొక్కడే పురుషుడు. మిగిలిన జీవనికాయమంతయు స్త్రీ ప్రాయము. కావున ఈ కావ్యమందు రాముడు పరమాత్మ. సీత

Acc No. 762
294.592 Ra. 30 ... SLB

జీవుడు. జీవుడెప్పుడైనను భగవంతుని ఆశ్రయించి యుండుపరకును అతడుఆపదలకు గురికాడు. పాపకర్మఫలము ఒక కాలమున పక్వము కాగా జీవుడు దుర్బుద్ధియై మాయామయమైన ప్రకృతి పదార్థమునందు ఆసక్తి కలవాడగును. అప్పుడాతనికి భగవద్వియోగము కలుగును. అతడు భగవంతునకు దూరముకాగా వెంటనేప్రకృతి బంధముల చిక్కుకొనును మనకథాంశమున సీతయనుజీవుడు రాముడనుభగవంతుని ఆశ్రయించియు బంగారపు లేడిని చూచి మోహమునొంది భగవంతుడగు రాముని కోల్పోయెను. లంకయను దేహమున బంధింపబడెను. ఒకవిధమగు అంతరార్థమున లంకయే దేహము అందురావణ కుంభకర్ణులు అహంకార మమకారములు. ఏకాక్షి మొదలగు రాక్షస స్త్రీలు ఇంద్రియములు. ఆ ఇంద్రియములు బాధించు బాధలగుర్తెరిగిన వివేకి ఆ బాధల తప్పింప భగవంతుని వేడుకొనును. వేడుకొనుటగాదు, విలపించును. అదియే సీతా విలాపము. జీవుని దుఃఖమును విన్న భగవంతుడు కరిగిన మనస్సుతో తానును బాధపడును. అదియే రాముని సీతా వియోగమునందలి రాముని శోకము. ఆ తరువాత ఆ జీవుని ఉద్ధరించుటకు గురువులను జీవున కందించును ఏ మతమునందైనను ఆచార్యునకొక ప్రత్యేకత యున్నది. భక్తిశాస్త్రమును ప్రధానము గావించుకొన్న ద్వైతాచార్యులును అద్వైతాచార్యులగు శంకరులును గురుకటాక్షము లేక జీవునకు మోక్షము రాదనినారు. ప్రస్తుతము కథాంశమునహనుమంతుని ఆచార్యునిగ గ్రహించుచూ అతడు రామ ముద్రికయను తారకమంత్రమును సీత కందించి (జీవునకు) భగవంతునితో మరల జీవుని ఐక్యము గావింప యత్నించినాడు. భగవంతుడు జీవుని పరీక్షించక సంపూర్ణముగ పరిగ్రహింపడు. అదియే సీత అగ్ని ప్రవేశము.

ఇది రామాయణములోని అంతరార్థము. ఇట్లే భారత భాగవతాది గ్రంథములను అన్వయించుకొనవచ్చును. గ్రంథ సమన్వయము (లేక) కథాభాగముయొక్క అంతరార్థము కర్తయొక్క అర్హతపైన ఆధారపడియుండును. విద్యావంతులగుకొందరకు అనాదిసిద్ధములై వచ్చు విష వాసనాబీజములు మొలకెత్తి వారి అంతఃకరణ క్షేత్రమున విషవృక్షములై పెరిగి అదొక అరణ్యమై విషయ మృగములకు నివాసములు కావచ్చును. వారికి పరమార్థ గ్రంథములు పరమార్థములు కాజాలవు. వారిని మనము నిందింపరాదు. నిందించవద్దు కంటక వృక్షములుకూడ భగవంతుని సృష్టిలోనివే మధురపదార్థమునందు చేదును ఆరోపించుకొను జ్వరార్తులనుచూచి మన హృదయము జాలి నొందవలెను. ద్వేషముచేతనైనను తననామమును స్మరిం

చిన జీవులనుగూడ భగవంతుడు పునీతుల గావించును. తనపై దుమ్మును పోయుద మనుకొన్నవానికిగూడ సూర్యుడు వెలుతురునిచ్చును. మనముమాత్రము అవిషవృక్షములనీడను ఆశ్రయించరాదు. ద్వేషపూరితులగువారి విమర్శలకు మీరు గురికాకుడు. కులమతద్వేషములు వద్దని చెప్పుచున్నట్లు కనబడుచు భారతీయ పవిత్రగ్రంథములను కలుషీకృతముల గావించువారి జోలికి వెళ్ళుట మంచిదికాదని జిజ్ఞాసువులకు చెప్పుటే నాలక్ష్యము. ఇకమనము ప్రకృతము ననుసరింతము. వాల్మీకి రామాయణ కావ్యము ఇట్లు నిర్మితమైనది.

ఇరువదినాలుగువేల శ్లోకములతో అయిదువందల సర్గలతో ఏడుకాండలుగ విభక్తమైనది. ఏడవది ఉత్తరకాండము. ఈశ్లోక సంఖ్యయందును సర్గల గణమునందును కొద్ది వ్యత్యాసములున్నవి. అవి మొదట అనుకొన్నదానికంటె కవి తరువాత పెంచియుండవచ్చును. లేదా కొన్ని కాలాంతరమగుటచే తగ్గియుండవచ్చును. ఏదిఏమైనను ఇప్పుడు నేను వాటిపరిశీలనను ప్రధానము గావించుటలేదు.

కవి అందించు సత్యవస్తు సందర్శనము నా అభిమతము. కావ్య సంపద చేకూర్చు లేక కావ్యసంపదవలన చేకూరు ఆత్మానందము ననుభవించుటకు కావలసినది సహృదయత్వము. నిజమునకు కవిత్వముయొక్క లక్ష్యమేమి? అది భౌతిక తత్వము నందించుటే కవికి లక్ష్యముకాదు. కవి తన పదజాలమునంతమాత్రముననే వినియోగించుచో అతడు కవియనుకాడు. కవిత్వ మాధ్యాత్మిక తత్వముననెక్కువ సన్నిహితమయ్యేయుండవలెను. ఐహికమును కేవలముగ విసర్జించుటయని నా మాటకు అర్థముకాదు. జీవుని ఆముష్మిక సుఖప్రాప్తికి (లేక) ఆత్మానందానుభూతికి కారణమగునట్లు ఐహికజీవితమునెట్లు మలచవలెనో నిర్దేశించుట భారతీయ శాస్త్రముల పరమలక్ష్యము. కర్మభక్తిజ్ఞానమార్గములయందు దేని నవలంబించినను మానవుడు ధర్మబద్ధమును ధర్మబద్ధమగు నైతిక జీవితమును గడుపుటకవకాశము కలదు. కవిచేయు కావ్యనిర్మాణమందుకొరకే కావలయును కావ్యం యశసేర్థకృతే వ్యవహార విదేశివేతరక్షయే సద్యః పదనిర్వృతియె అనునవి అలంకారికులు చెప్పిన మాట. అందలి సద్యఃపరనిర్వృతియే వాల్మీకి కవితయందు మనకుకావలసినది. మిగిలినవన్నియు ఛాయాగంధములవలె సంప్రాప్తములు కాగలవు. ఇక్కడ మీకు భాగవతములో ఒకసూక్తిని వినిపింతును.

"న యద్వచశ్చిత్రపదం హరేర్యశో
జగత్పవిత్రం ప్రగృణీత కర్హిచిత్

తద్వాయసం తీర్థమశంతి మానసా
న యత్రహంసా విరమంత్యుశిక్షయాః

నిత్యసుఖానుభూతిని కల్పించు భగవద్విషయక వర్ణనలులేని కవిత్వము కాకులు జలకమాడు మురికిగుంటవంటిది. ఆగుంటదగ్గరకు హంసలురావు. పరమాత్మలోని దివ్యసౌందర్యమును తిలకించువారు హంసలవంటివారు. అట్టి సహృదయులకు ఆహ్లాదజనకము కాదగునదే కావ్యము. భారతీయ సాహిత్యమునకు ఫలమిదియే. సంగీతసాహిత్యములు సరస్వతికి కుచద్వంద్వము. అందొకటి ఆపాతమధురము.

రెండవది ఆలోచనా మృతము. సంగీతములోని శ్రవణానందము శిశువునకు కూడ కలుగగా కవి అందించు ఆనందము భావునకే అందుట ఇందలి ప్రత్యేకత. పదజాలమును కూర్చి గేయముల నల్లి కవియను పేరు నందవచ్చునేమో? అతడు మహా కవి కాజాలడు. జడ పదార్థము నందంతర్భూతమైయున్న ఆత్మను దర్శించువాడు మహాకవి. దర్శింప చేయువాడు మహాకవి. మహాకవి దర్శింపచేయు ఆత్మను దర్శించువాడు మహాకవి భావకుడు దర్శింపచేయు ఆత్మను దర్శింప గలుగువాడు భావుకుడు సహృదయుడు. ఆత్మానందము నందించు కవితకు కేవల కార్య కారణముల నిరూపించు తర్కమొక్కటియే ఉపకరణము కాదు. మీకు నేనిక్కడ వాల్మీకి కవితలోని చమత్కారము నొకదానిని చెప్పెదను. అతడు వర్షఋతువును వర్ణించినాడు.

నవ మాసధృతం గర్భం భాస్కరస్య గభస్తిభిః
పీత్వా రసం సముద్రాణాం ద్యౌః ప్రసూతే రసాయనం

సముద్రములోని జలము సూర్య కిరణముల వేడిమిచే ఆవిరిగామారి అంతరిక్షమున మేఘ రూపమును దాల్చును. అదియే శీతల వాయువుల స్పర్శచేత మరల నీరుగా మారి భూమిమీద పడును. పదార్థవిజ్ఞానవేత్త ఈవిషయమును ప్రతిపాదించవచ్చును. ఆ విషయమునే వాల్మీకి సూర్యకిరణములచే అంతరిక్షము గర్భవతియైనదని చెప్పి, సముద్రోదకముల పీల్చిన అంతరిక్షము తొమ్మిది మాసములుగా మోసి రసాయనమును ప్రసవించినదనినాడు. ఇందలి చమత్కారమేమి? ఉప్పు నీటిని త్రాగి, మంచినీటిని అందించినదీ అంతరిక్షమని మేఘుని ఔదార్యమును ప్రకటించినాడు. అంతేకాదు కిరణములతో అందుకొన్న నీటికంటె వేయి మడుగుల నీటిని

ఇచ్చినది లోకమునకని భావుకుని చిత్తమును కదిలించుచు పదార్థ విజ్ఞానమును చెప్పినాడు. మరొక్క మాట నేటి నాగరికులు పదార్థ విజ్ఞానము మా సొమ్మని వాపోవుట అల్పజ్ఞత. వేద పురుషుడు అందించని పదార్థ విజ్ఞానమొక టున్నదా ?

"యాభిరాదిత్య స్తపతి రశ్మిభిస్తాభిః పర్జన్యోవర్షతి" అన్న మంత్రములోనిదే పదార్థ విజ్ఞానము

ఈ విషయమునే అలంకారికులు చెప్పినారు.

దృష్టపూర్వా అపిహ్యర్థాః కావ్యే రసపరిగ్రహాత్
సర్వే నవఇవాభాన్తి మధుమాస ఇవ ద్రుమాః

మన మెరిగిన వస్తువులే కావ్యగృహమున ప్రవేశించి నూత్న శోభతో వెలుగొందుట ఎట్లు? చెట్లయందున్న సహజ వికాసము యొక్క శక్తి వసంతము రాగా ఆ ఋతు ప్రభావముచే వ్యక్తమై శోభ గాంచినట్లట. ఈ ఉపమానములోని అందమేమి? సహజముగనే వస్తువు నందున్న సౌందర్యభాగము కవి భావనా విశేషముచే కవిత్వమున ప్రస్ఫుటమై సహృదయుల అంతంకరణముల రసముగ వ్యక్తము కాగలదని భావము. కావున కవి భావుకునకు ప్రదర్శించు రామణీయక మెక్కడిది? వస్తువునందు లేనిదికాదు. ఉన్న దృశ్యమునే రమణీయార్థ ప్రతిపాదక శబ్ద రచనచే అనగా తన వాణిచే సహృదయుల హృదయ క్షేత్రమున రసమును ప్రవహింపజేయును. రసమన పరబ్రహ్మయే. రసానందము నొసంగి బ్రహ్మ సాక్షాత్కారము కల్పించుటకే ప్రకృతినే కవి ఆధారముగా గొనును. వేద పురుషుడను కవి తన కవితా సౌందర్యమున జడ ప్రపంచమును మరపించినాడు. అతడే వాల్మీకి ఋగ్వేదములో ఛందోబద్ధము. అందనేక రూపకాలంకారము లున్నవి. పర్యవసాన మేమన మన మిప్పుడు రామాయణమును ఈనాటి భౌతికవాదులు లెక్కపెట్టు రీతిని వదలి ఆత్మానుభూతికి స్థానమునిచ్చి, వాల్మీకి మధురవాణిని గ్రహింతము మరొక్క విశేషమును గూడ ఈ కావ్యము నందున్నది. సంగీత సాహిత్యములు రెండును సరస్వతికి కుచద్వంద్వమంటినిగదా? ఆరెంటి యందొకటైన లేదు మన కావ్యము పాఠ్యేగేయేచమధురమై యున్నది. రామాయణ కావ్య వనిత సర్వాంగ సుందరియై విలసిల్లినది. నవరస భరితయై సరస్వతి తన విలాసములచే వాల్మీకిని వరించినది.

ఇక ఈ రామాయణము ప్రచారము కావలెను. అంతేకాదు. ఈ కావ్యము నకు నాయికా నాయకులగు సీతారాము లిద్దరును మన కధా భాగము నందీనాడు విడివడి యుండిరి గదా? సీత తన ఆశ్రమము నందుండెను. రాము డయోధ్య యందుండెను. ఇప్పుడా యిద్దర నొక్కచో కూర్చవలెను. సీతమ్మ తల్లికి వచ్చిన లోకాపవాదమును తుడిచి ఆ సతీమ తల్లి మహా చరిత్రను అయోధ్యా నగర వాసులకు తెలుపవలెను. వాల్మీకి హృదయము నందిది యొక ప్రత్యేక కార్యమీనాడనక తప్పదు. అందుకై తన మధుర కావ్యమును ముక్త కంఠములతో మధురగానమును గావింప సమర్థులగు గాయకులును, పండిత ప్రకాండులు గూడనైన శిష్యులు కావలెను. ఆ మహా కావ్యము అయిదు వందల సర్గలతో ఏడు కాండములుగ విభజింపబడి భూత భవిష్యత్కధా భాగము వర్ణించబడినది ఇంత గ్రంథమును వాచో విధేయముగ కంఠస్థము గావింప సమర్థులు కావలెను. తన ఆది కావ్యమును ఆచంద్రతారక మగునట్లు అనుగ్రహించిన చతుర్ముఖుని వాక్యము సత్యమగునట్లు సత్య స్వరూపుడగు రామచంద్రుని సభాస్థలి యందు వినిపింప ధైర్యవంతులు కావలెను. తన కావ్యము నిప్పుడు పఠింపవారు సామాన్యమగు పండితులు కాదు. వేద వేదాంగములందు సుప్రతిష్ఠితులై యుండవలెను. ఇట్టి వారెవరు? అనునది ఆ కవి ఋషభుని చింత

"చింతయామాస కోన్వేతత్ ప్రయుంజీయాదితి ప్రభుః

అదృష్టమును కార్యరూపము నొందినగాని మనము కనుగొనజాలము. నేడు మహర్షికి కలిగిన చింతను తొలగించి తీర్చిదిద్దే ఇద్దరు శిష్యులు మహర్షి వారి పాద ద్వంద్వములపై వ్రాలినారు. వారు సీత పుత్రులు. రాముని ప్రతిబింబములు. కవల బిడ్డలు సుందర సుకుమారతను కాంతుల వెదజల్లు రాజపుత్రులు. అయ్యును వారు మునిబాలురయ్యే యుండిరి. వారి కంఠస్వరములు గానసంపదకునిలయములు. వారు ఇంతకు ముందుగనే వేద వేదాంగముల నిష్ణాతులైన విద్వద్వర్యులు. ధర్మ మూర్తులు గ్రహణ ధారణశక్తులు. పూర్ణరూపము ధరించి నిలుచుటకు వారు ప్రతీకలు.

వాల్మీకి మహర్షి వారికి రామ కథను అందించి మహా భాగ్యమును కల్పింప బ్రహ్మనారదుల ముందిడుకొని భాగ్యదేవత ఎట్లు సాక్షాత్కరించినదో నేడును ఆ భాగ్య దేవత కుశలవులను వాల్మీకి మహర్షి వారికి శిష్యుల గావించినది. నిజమున కీనాడు వాల్మీకి మహర్షి ఆశ్రమమున ఆ మునివర్యుల వరించిన భాగ్యదేవత ముని

వర్ణ్యుల దొక్కరిదేనని మాత్రము మీరు తలచకుడు. భారతీయు లందరి భాగ్య దేవతయని మీరు భావించుట యుక్తము. కాదు. కాదు. ఖండ ఖండాంతరముల వసించియు ధర్మ సంస్కారముగల మానవాళి యదృష్టమని తలచుట నిజమగు ఔదార్యము (లేక) విజ్ఞత.

ఈ కావ్యమునకు రామాయణమనియే గాక పౌలస్త్య వధ అనియు సీతా చరితమనియుకూడ పేర్లు నిడినారు ఈ కావ్య ఫలము రావణవధ గావున పౌలస్త్య వధయని పెట్టెను. సీత చరిత్రయని ఏల అనెను? ఇంటి బయట యజమానుని పేరునునిచ్చి, ఈ యిల్లంతయు ఇల్లాలిదేనని నారు కావచ్చును. సీత లేకున్న రాము నకు చరిత్ర ఎక్కడిది? చరిత్ర అంతయు ప్రకృతిదే. రాముడు నిర్వికారుడు. కావున ఇది రామాయణము, సీతాయణము కూడ. ఇట్టి మహా కావ్యమును కుశలవు లకు వారు చదివిన చతుర్వేదములలోని రహస్యార్థముల విస్తరించి రామాయణ కావ్యమును పఠింప చేసినారు వాల్మీకి. కావున ఇది వేదోప బృంహణము. ఈ రామాయణము రాముని అశ్వమేధ యాగమున రామచంద్రుని సభాస్థలియందే కుశలవులచే గానము చేయబడినది. మనమిక కథలో ప్రవేశించుటకై రాముని అశ్వమేధ క్రతు మంటపమున కేగుదము.

## రామాశ్వమేధము

రాజులకు రాజసూయ మనునది ఒకమహాయాగము.రెండవది అశ్వమేధము. రాజసూయమన తనకు సార్వభౌమ పదవిని స్థాపించుకొనుట. భూ ఖండమున కంతకును అతడే చక్రవర్తి. చతుస్సముద్ర ముద్రితమగు ధరామండల మంతయు తన గొడుగునీడనే నిలుచునట్లు భూమండలము నందెందరు రాజులు కలరో అందర జయించి వారందించు కప్పములతో ఆ యాగమును నిర్వర్తించ వలయును. ఆ యాగము శత్రురాజుల దునుమాడుటతో ప్రారంభమై ఘోర సంగ్రామరంగము నిర్మాణమగుట ఫలముగా సమాప్తమగును. అశ్వమేధము అట్టిదికాదు. క్షత్రియుల కిది కీర్తిపతాకమును ప్రతిష్ఠించు మహాయాగము. దీనిచే బ్రహ్మహత్యాది పాపములు కూడ తొలగుననునది వైదిక సిద్ధాంతము. (తరతితరతి బ్రహ్మహత్యాం యోఽశ్వ మేధేనయజతే).

శ్రీరామచంద్రులు సీతాపరిత్యాగము గావించిన తరువాత రాజసూయము చేతునని సంకల్పించగా లక్ష్మణ భరతులు నీసామ్రాజ్యమున శత్రుబాధ నీకు లేదు కావున రాజసూయమును చేయవద్దని నివారించి అశ్వమేధ యాగమును చేయుట కుద్బోధించినారు. రాముడు సమ్మతించినాడు అశ్వమేధమును చేయుటకు.

భారతీయ ధర్మశాస్త్రములు భార్యాసమేతుడు కాని వానికి వేదోక్త కర్మల నాచరించుట కధికారము నివ్వలేదు కాని ఆ ధర్మశాస్త్రములతి సూక్ష్మములు. రామునకు సీతదగ్గరలేదు. అతడీ యాగమునెట్లు చేయవలెను? రాజులు వేరొక పత్నిని పరిగ్రహించవచ్చును. అయ్యును రాముడట్లు చేయలేదు సువర్ణ విగ్రహముగ సీతను నిర్మింపజేసి ఆ యాగమును నిర్వర్తింపదలచినారు. ధర్మశాస్త్రము లీ ప్రక్రియను నిషేధించవు. కావున వశిష్ఠాదులొప్పుకొనినారు.

అది గోమతీ నదీతీరము నందలి నైమిశారణ్యము. అదియే శ్రీరామ చంద్రులు అశ్వమేధయాగము నిర్వర్తించు ప్రదేశము ఋత్విక్పురోహిత మంత్రి వర్గములన్నియు, నా నా దేశాగత రాజబృందములకును మహర్షి సత్తములకును ఆ యాగమును చూడవచ్చు సామాన్య ప్రజానీకమునకు గూడ వసతుల కల్పింపగా, రాజవీధుల తోడను, సౌధరాజములతోడను పర్ణకుటీరముల తోడను ఆ యరణ్యము రాజధానివలె భాసించినది. కిష్కింధా నగరమునుంచి, సుగ్రీవుడు అంగదజాంబవంతాది వానర వర్గములతో విచ్చేసినాడు విభీషణుడును లంకానగర సామ్రాజ్యము నుండి మంత్రివర్గముతోకూడ వచ్చుట జరిగినది. వేదవేదాంగము లాయాగశాలల మూర్తీభవించగా రామాశ్వమేధము అపూర్వ రమణీయకమై వైభవోపేతముగ నడచుచున్నది.

వాల్మీకి మహర్షివారిచే రచింపబడిన రామాయణ మహాకావ్యమును మనము వినవలసినదిక్కడనే

రామాశ్వమేధమునకు విచ్చేసిన మహర్షి బృందము తమతమ శిష్యగణముతో కూడిరాగా వాల్మీకి మహర్షియు కుశలవుల వెంటనిడుకొని ఆ గోమతీ తీరనైమిశారణ్యయాగ దేశమున కేగినారు.

వాల్మీకి మహర్షి వారికి రాముడందించు పాద్యార్ఘ్యములుకాక మహర్షిగణ మంతయు అర్ఘ్యపాద్యాది విధుల పూజించుట జరిగినది. కుశలవులతో మహర్షి తన ప్రత్యేక పర్ణకుటీరమున ప్రవేశించినారు.

ఇక శ్రీరామచంద్రుని శ్రవణ పుటముల రామాయణ కావ్యగానము వినబడవలెను

తరువాత మహర్షి తన కర్తవ్యము నూహించినారు. రామునకు తన మహాకావ్యమును శ్రవణము చేయించవలెను. నిజమున కీకావ్యమును పఠించు వారీకావ్యనాయకుని పుత్రులే. అయ్యును ఆ నాయకుని దృక్పథమున వారు గాయకులయ్యే నిలువవలెను. రాముడు తన చరిత్రను తాను విస్మితుడై వినవలెను. అతదేకాంతమున వినుటకాదు. తీర్చిదిద్దిన రాజసభా మంటపమున సింహాసనాసీనుడై ముగ్ధమోహన మూర్తులగు గాయకులెవ్వరని అ గాయకుల రూపములకు ముగ్ధుడై వారెవ్వరో తెలియని అజ్ఞాతానంద రసనిమగ్నుడై తన కావ్యమును వినవలెను. అందును తన శిష్యుల నాతడు ఆదరమునపిలచి అరుడై సభామంటపమున నిలుపవలెను. ఆసభామంటపము సామాన్య ప్రజానీకముతో కూడియుండుటకాదు. అది ఆర్షవిద్వన్మణి సభామంటపము కావలెను ఆ మంటప మధ్యమున తన శిష్యులు గాయకులై కావ్యగానమును చేయవలెను. ఇది ఆమహర్షు లూహించుకొన్న కర్తవ్యము.

ఇక ఆ ఆదికవి తన ఊహాప్రపంచమును సత్యప్రపంచము నెట్లు చేసెనో చూతము.

శిష్యులగు కుశలవుల పిలచినారు. ఆ కుశలవుల కిట్లాజ్ఞాపించినారు

శిష్యులారా! రేపటినుండి మీరు నేర్చుకొన్న మహాకావ్యమునందలి శ్లోకములను మీచేత నిడుకొన్న వీణాతంత్రుల మేళవించి రాజవీధుల గానము చేయవలెను. రాజవీధులందేకాదు. రాజగృహములందుకూడ పాడవలెను. బ్రాహ్మణుల గృహములందును మీరు వినిపింపవలసినదే. అంతమాత్రమున కాక రామచంద్రుని భవన ద్వారముననిలచి మీమధుర గానమును అతని వీనులవిందు గావించవలెను అంతతో చాలదు. యాగమంటపముల కేగవలెను. అందున్న ఋత్విక్కులకు నా కావ్యసుధను మీ మధుర కంఠధ్వనులతో పంచవలెను. పట్టణము లోపలి భాగమునకు మాత్రము మీరు ప్రవేశింపకూడదు. ప్రతి యాగమంటపమునకును మీరు పోవలసినదే.

మీరు అన్నాదికముల భుజింపరాదు. కంద మూలకములగు పరిపక్వ ఫలములను మాత్రమే భుజింపవలెను. ఆకలి తీర్చుకొనుటకయ్యే ఆ ఫలహారమును గ్రహింపవలెను. కారణ మేమందురా? ఇట్టి భోజనము మీకు అలసటను కలుగ

నివ్వదు. కాని ఒక్క విషయమును మీరు మరువకూడదు. రామనపాల్కుడు మీ పఠనమును వినగోరి మిమ్ముల పిలిపించుచో ఋషిసత్తములతో కూడియున్న ఆ రాముని సభయందు ఈ రామాయణ చరిత్రను గానము చేయుడు. ఆ రాజు మీకు అందించు ధనమును మాత్రము స్వీకరించకుడు. ఆశ్రమ వాసులమగు మా కెందుకీ ధనమని సమాధానము నొసంగుడు. మిమ్ముల నెవ్వరైన మీరెవరి పుత్రులని అడుగుచో మేము వాల్మీకి మహర్షి శిష్యులమని సమాధానమును చెప్పుడు. మీరు రోజున కిరువది సర్గలు చొప్పున పఠింపుడు. ఇవి మీకు రేపటినుండి చేయదగు కర్తవ్యం. కుశలవుల కప్పుడు గలిగిన యుత్సాహమునకు మేరలేదు. కాని వారికీ రాత్రి గడవ వలెను. గుర్వాజ్ఞా పరిపాలన కారాత్రి గడచుట వారికి దుర్లభమైనది. సూర్యుదస్త్రాద్రి కేగగా కుశలవులా రాత్రిని గడిపినారు.

## కుశలవుల సభా ప్రవేశము

అది ప్రాతఃకాలము. ఋషి గణముల సాంధ్యకృత్యములు నెరవేరినవి. కుశలవులు తమ ప్రాతఃకాల కృత్యముల తీర్చుకొని గురుపాదములకు వందన మాచరించినారు. గాన సరస్వతీ నిలయములగు వీణలు వారి భుజ స్కంధము లందలం కృతములైనవి. ఆగాయకులు గురువుల ఆజ్ఞను పాలింప బయలుదేరినారు.

అది ఋత్విక్కు లుచ్చై స్వరముల దేవతల నాహ్వానించు యాగ మంటప ములు. మన కుశలవులా యాగ మంటపములందు కూడ పఠింపవలెను గదా? ఆ కార్య మధ్యమున వీరెట్లు ప్రారంభింతురు? యజ్ఞ నిర్వహణ కాలములందంతర్భాగ ములై విశ్రాంతి కాలము లుండకపోవు. ఆ కాలముల నెరిగియే మన బాలకులా యాగ మంటపముల ప్రవేశించుట జరిగినది. వారి మధుర గాన ధ్వని తరంగములు ఆ గోమతీ తీర రాజ మార్గములయందు గాక చత్వర స్థానములందును, వేర్వేరు ప్రసిద్ధ స్థలములయందును, యాగముల యందును గూడ వ్యాపించగా ఆ గాయక శిఖామణులను శ్రీరాముడు దర్శించుట జరిగినది వారి గాన మాధుర్యమునకు రాముని హృదయము కరిగినది. వారు వీణలపై మీటుచు, కథాగానమును చేయుటను తాను ప్రత్యేకముగ పరిషన్మధ్యమున వినదలచినాడు.

అది యొక మహోన్నత పరిషత్సమాగమము. అందొక్కచో గాయకులు. ఒకచో శబ్ద శాస్త్ర కోవిదులు. వేరొకచో న్యాయశాస్త్ర నిపుణులు. మరొక్కచో మీమాంసాశాస్త్ర పారంగతులు. ఇంకొకచో ఛందశ్శాస్త్రజ్ఞులు. అక్కడక్కడ నాటిక కళా నిపుణులును కావ్యశాస్త్ర పారంగతులును కూడ ఆసనముల నలంకరించినారు. వేయేల చతుష్షష్టి కళా ప్రపంచమంతయు నాడు ఆ రాజసభ నలంకరించినదనుట చాలని మాట. పరావా గ్రూపిణియగు మహా సరస్వతి బహు రూపముల రూపొంది రామ సభా మంటపమున వసించినదనుట చివరి మాట.

ఆ పరిషన్మధ్యముననే రామచంద్రుని సింహాసనము. ఆ బ్రహ్మాణ్యుని సింహాసనము ననుసరించియే భరత లక్ష్మణ శత్రుఘ్నుల సింహాసనములును కూర్చబడి యున్నవి. రాముడు తన సింహాసనము నధిష్ఠించగా రామాజ్ఞచే అతని సోదరులును సభ నలంకరించినారు. ఇక సభకు రావలసిన వారు కుశలవులే. వారిట్లు ప్రవేశించినారు,

"ఉపాగతౌ మిళిత పరస్పరోపమౌ
బహుశ్రుతౌ శ్రుతి మధుర స్వరాన్వితౌ
విచక్షణౌ వివిధ నరేంద్ర లక్షణౌ
కుశీలవౌకుశలవ నామధారిణౌ"

వారొక సుకుమార సుందర విగ్రహముల జంట. వేద వేదాంగముల యొక్క పూర్ణ విజ్ఞాన మంతయు కవలబిడ్డలై అవతరించి, నేడీ సభకు వేంచేసినది. ఆ యిద్దరి కంఠ స్వరములును మధురములే. అది యట్లుండ రాజ లక్షణ లక్షిత ములై యున్నవి ఆమూర్తులు రెండును. వారు కుశలవులను పేరుగల కుశీలవులు (గాయకులు)

పరిషత్తు నిస్తరంగ సముద్రమువలె నున్నది. ఆ శాంత పరిషన్మధ్యమున ఆ గాయకులకు రామాజ్ఞయైనది ఆలపింపుడని, అట్లే తన సోదరులను గూడ వీరి మధుర గానమున కృతార్థులు కండని రాము డాజ్ఞాపించినాడు, కుశలవుల కరాంగుళులు వీణాతంత్రుల నలంకరించినవి. లయతాళ బద్ధములగు వారికంఠ స్వరములతో కావ్యశ్లోకముల నాలపింప ప్రారంభించినారు. మంత్రతార మధ్యమస్వరములు ఆ గాయక శిఖామణులకు కైవశములు. ఆ కావ్యమునందలి శృంగారహాస్య కరుణా

రసములను, వీర అద్భుత రసములను కూడ అత్యద్భుతముగ ప్రదర్శించుట యందగ్రగణ్యములైన ఆ శ్లోకములు శ్రోతల నాయారస నిష్ఠుల గావింపగా ఆ సభ యందున్న రసజ్ఞ శేఖరుల హృదయములు ద్రవించి వెల్లువలై పారుచుండె ననుట చిత్రమగు మాట కాదు. ఆ సభాస్థలి నలంకరించి యున్న రాజ శేఖరుల కిరీటము లందలి దివ్యమణులు అచేతనములయ్యును వారి గానములకు కరిగి పోవగా వారి హృదయములు ద్రవించినవనుట చిత్రమగు మాట ఎట్లగును ? ఆ కుశలవుల పలుకులు అరవిచ్చిన విరజాజుల వలె సౌరభముల గ్రుమ్మరింపగా కొందరు గాయకులు వారి స్వర మాధుర్యమునకు తల లూపినారు. కాగా, కొందరు వారి శ్రుతి పక్వములగు తాళగతులకు ముగ్ధులుకాగా భళిభళీ యనిపించిన నాటి సభ యందు కొన్ని శ్లోకములనే పాడినారు. అది రామునకు తమ ప్రతిభను, లేక అచరితములోని మహత్వమును రుచి చూపినట్లయినది. రాముడు నాడు తన సింహాసనము మెల్లగ దిగి వచ్చినాడు సభా మధ్యమునకు. ఎందుకు? ఆ బిడ్డల కౌగలించుకొనుటకు. అప్పటికి మధ్యాహ్న కాలమైనది. పదునెనిమిదివేల బంగారు నాణెములను తెచ్చి, ఈ కుమారులను సత్కరింపుమని శ్రీరామచంద్రుడు లక్ష్మణునకు ఆజ్ఞ ఇచ్చినాడు. లక్ష్మణుడు అట్లే రెండు పళ్ళెములతో ఆ నాణెముల నుంచి తేగా కుశలవులా ద్రవ్యము నెట్లు పరిగ్రహింప గలరు? గురువులు ఆ బాలుర కిచ్చిన ఆజ్ఞానుసారముగ వనవాసులకీ నాణెము లెందుకని సహేతుకముగ చెప్పి, మీరు వినదలచితిరేని కార్యాంతర నిమగ్నులు గాక సావకాశముగ వినుచో మేము సంపూర్ణముగ వినిపింతుమనినారు.

నాటితో ఆ సభ సంపూర్ణమైనది. సంపూర్ణమగు రామాయణ కథాగానమును ప్రతి నిత్యము చేయుడు కుమారులారా। అని రాముడా కుమారుల కోరినాడు. తన కథ తనకే ఆశ్చర్యము గొలిపినది.

ఈ కుమారు లెవ్వరో రాము డెరుగడు. వారి సుకుమార సుందరగాత్రములు రాముని ఆకర్షించలేక పోలేదు. వారి రాజ లక్షణము లొక వంకను, వారి తాపస వేషము లింకొక వంకను పరస్పర విలక్షణములై యుండుటను రాముడు గమనించక పోలేదు. అయ్యును ఈ బాలురు తన ప్రతిబింబములని రామునకు తోచలేదు. ఆశ్చర్యమునకు మాత్రమే రాముని అంతఃకరణమున తావు దొరికినది. రాముడంతటి

ఇంగితజ్ఞుడయ్యును, వీరు రాచబిడ్డలా? తపోమూర్తుల కవలబిడ్డలా? లేక వీరు గాయకులేనా? అను నిశ్చయజ్ఞానము రామునకు కలుగలేదు.

అహౌమునీ పార్థివ లక్షణౌన్వితౌ
కుశీలకాచైవమహాతపస్వినౌ
మమాపి తద్భూతికరం ప్రవక్ష్యతే
మహానుభావం చరితం నిబోధిత

ఇది యొక మహత్తరమగు చరిత్ర సోదరులారా వినుడని మాత్రము సోదరులకు చెప్పి, పాడుడని ఆ బిడ్డల కోరినాడు. ఇందలి అంతరార్థ మేమి?

భగవంతుడు తన గుణ గానమును విని తరింపుడని జీవులకు తెలిపినాడు

"మహానుభావం చరితం నిబోధిత" అని

రేపు కథా ప్రారంభము

ఓం శాంతిశ్శాంతి శ్శాంతిః

ఓ మ్

# నాల్గవరోజు

రామం కోమల నీలనీరదనిభం నీలాలకాలంకృతం
కట్యాం శోభిత కింకిణీ ఝుణఝుణధ్వానై రుపేతం శిశుం
కంఠాలంకృతరక్ష నిర్మలనఖం కంజాక్షమజ్జచ్ఛవిం
భాస్వంతం మకుటాంగదాది వివిధా కల్పైస్సదాహంభజే.

## రామజననలీలా వైభవము

ఆర్యమహాశయులారా !

నేటికి మూడుపన్యాసములు నడచినవి. నేడు నాల్గవరోజు. నేటి నుండి పూర్వరామాయణ కథాప్రారంభమును చేయమొదలిడినారు కుశలవులు. ఒక్కమారు మన మీరామకథను వినుటకు కూరుచున్న ప్రదేశమును మనోమయ నేత్రమున దర్శింతము.

అది అయోధ్యానగరము. సరయూనదీ తీరము. రాఘవేశ్వరులు గావించు అశ్వమేధయాగ మంటపము. ఆ మంటప మధ్యముననే రామకథా శ్రవణము జరుగుచున్నది. వక్తలు కుశలవులు. శ్రోతలు మహర్షులేగాక మహారాజ శేఖరులును పౌరులును గూడ. మనమును అచ్చటనే వసింతము. కాని ఈ మహాకావ్యమును శ్రవణము చేయవలసిన పద్ధతి యొకటున్నది. ఏమది? "శ్రోతవ్య మనసూయయా?" అసూయా మాత్సర్యములు మాత్రము మనల తొంగిచూడకూడదు. అప్పుడే మనకావ్య కథానాయకుడగు రాముడు మనల తొంగిచూచును. తొంగి చూచుటకాదు. మనపై పరిపూర్ణ కటాక్షముల బరపును. సీతామతల్లి కడుపు చలవయే కుశలవులు. వారిగ్గాన వైశిష్ట్యమును చెవుల పండుగలు గాగా, వాల్మీకి మధురభావములు ఆత్మానంద సంజనకములు కాగలవు కుశలవులు కథాప్రారంభము నిట్లు గావించినారు.

సర్వాపూర్వమియం యేషామాసీత్ కృత్స్నా వసుంధరా
ప్రజాపతి ముపాదాయ నృపాణాం జయశాలినాం
యేషాం స సగరోనామ సాగరో యేన ఖానితః
షష్టిః పుత్రసహస్రాణి యం యాంతం పర్యవారయన్
ఇక్ష్వాకూణామిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనాం
మహదుత్పన్న మాఖ్యానం రామాయణ మితిశ్రుతం.

ఈ రామాయణ కథా ప్రాదుర్భావ మెక్కడ జరిగినదో దానిని తెలియ జేయుటతో కుశలవులు కథను ప్రారంభించినారు. ఈకావ్య లక్షణమిది.

ఈ రామాయణ కథ ఇక్ష్వాకు వంశమునం దుత్పన్నమైనదట. ఈ వంశమీ భూఖండమునందుగల రాజవంశములకెల్ల శిరోభూషణమట. ఈవంశమున కంతకును మకుటమై వెలసి ఒక మహానుభావుని పేరు సగర చక్రవర్తియట. ఈ భూఖండము నంతను చుట్టియున్న మహాసాగర మంతయు వారి వంశీకులచేతనే త్రవ్వబడి ఇంత విస్తారమైయున్నదట. వారు సగర చక్రవర్తి పుత్రులట. ఆ పుత్రుల సంఖ్య అరువది వేలట. ఈ ఇక్ష్వాకు వంశీకు లందెవ్వరును అనామకులు లేరట. ఈ వంశము సృష్ట్యాదినుండియు ఈ వసుధాతలమున తమ జయపతాకములు నెగురవేయు రాజ పుత్రులతో నలరాలినదట. ఈ వంశమునకు మొదటివాడు మనువను చక్రవర్తి యట. ఆ మహోన్నత వంశమునందుత్పన్నమైనదట ఈ చరిత్ర.

ఇక్కడ మీకొక ముఖ్యమగు విషయము చెప్పవలసియున్నది. మన రామ చరిత్రకు ఆధారభూతమగు రాజవంశము మనమీనాడు అనుకొను పరిమిత భూఖండమునకు సంబంధించినది కాదనునది చాల ముఖ్యమగు విషయము "ఆసీత్కృత్స్నా వసుంధరా" అనినారు వాల్మీకి. అనగానేమి? సప్తద్వీపములతో నవఖండమండితమై యున్న భూఖండ మంతయు భారతీయ ధర్మసామ్రాజ్య పతాకము క్రిందనే పరిపాలింపబడినదని వాల్మీకి నిర్ణయము. వాల్మీకి చరిత్రకారుడు కాడని మీరు తలచకుడు. పురాణములలోని కథలు చరిత్రలు కావనుకొను వారీనాడు చాలమంది కలరు హిందూమత సముద్ధరణము కావించుట యందాదర బుద్ధికలవారికి కూడ ఈ యభిప్రాయమున్నది.

ఒకానొక వ్యక్తి ఉపన్యాస పీఠమున హిందూమత పతనమును గురించి ఒక చరిత్రను చెప్పి, నేను మీకిప్పుడు చెప్పినది పురాణకథ అనుకొందురేమో ఇది

చరిత్రఅని అవి గ్రుద్దిచెప్పినాడు. ఆవక్తయొక్క హృదయ మేమి? పురాణముల లోని కథలు పుక్కిడి కథలనియు చరిత్రలు నమ్మదగినవనియు ఆ చరిత్రను నేను చెప్పుచుంటిననియు పురాణమును చెప్పుటలేదని ఆయన హృదయము.

పురాణ కథలను కల్పితములుగ ఒప్పుకొని చరిత్రలను ప్రత్యేకించి నమ్మ దగినవని చెప్పుచు హిందూమతము చాల గొప్పదని చెప్పుట స్వవచన వ్యాఘాత మని ఆవక్తకు తెలియలేదు. స్వవచన వ్యాఘాతమనగా తాను చెప్పిన విషయము తను నిర్ణయించు విషయమునకే వ్యాఘాతమగుట. మతోద్ధరణము కావించుటకు పూనుకొను వారికీ విషయము చాలమందికి తెలియుటలేదు. పర్యవసానమున మన రామాయణము భారతీయుల చరిత్రగాని పుక్కిడి పురాణముకాదు. ఒక కాలమున భారతీయ చక్రవర్తుల ధర్మపతాకము క్రిందనేనేటి పాశ్చాత్యఖండములును కలవని, "కృత్స్నావసుంధరా" అను పదముచే మన చరిత్రకారుడు వాల్మీకి చెప్పినారు. కథకువత్తము.

సగరపుత్రుల కథను చెప్పెదను.

ప్రతివంశమునందును ఒక్కొక్కడు యుగపురుషుడై ప్రఖ్యాతి నొందు చుండును.

సూర్యవంశమున ఇక్ష్వాకువు తరువాత ప్రఖ్యాత పురుషుడు సగర చక్రవర్తి. ఈతనిని కవి పేర్కొనుట యందొక ప్రత్యేకత యున్నది.

ఇక్ష్వాకువునుండి పండ్రెండవ తరమువాడు అసితుడను రాజు. అతని చేతి నుండి ఇక్ష్వాకు సామ్రాజ్యము హైహయుల చేతికి చిక్కినది.

అప్పుడాతడు వారిని జయించలేక భృగుతుండమున వసించి బ్రతికినాడు. ఆ అసితునకు భార్యలిద్దరు. నాటికి ఆతడు సంతానవంతుడుకాలేదు కావున అతని భార్యలిద్దరి యందొక భార్య భృగుమహర్షి అనుగ్రహంబును సంపాదించి గర్భవతి కాగా సవతి ఆమెకు విషము విచ్చినది. తరువాత ఆమె మరల హిమవంతమున కేగి చ్యవన మహర్షి అనుగ్రహముచే పుత్రుని ప్రసవించినది. విషముతోకూడ పుట్టుటచే ఆతనికి సగరుడని పేరు వచ్చినది. అతడే వంశమున ప్రసిద్ధుడై ఇక్ష్వాకు సామ్రాజ్యలక్ష్మికై భవము నమలవించుచేగాక అతడు కన్న అరువదివేలమంది

పుత్రులచే భూమిని చుట్టియున్న సముద్రముఏర్పడి సాగరము పేరునందినది. అట్టి ప్రసిద్ధవంశమునందీ రామాయణ ముత్పన్నమైనదని కథా ప్రారంభమునుచేసినారు మహాకవి. తరువాతది అయోధ్యాపుర వర్ణనము.

సనాతన భారతీయ సంస్కృతిని ప్రతిబింబింపజేయు నీ అయోధ్యాపుర వర్ణను మీరు ఏకాగ్రచిత్తులై వినవలెను.

మానవ సమాజము క్రమ వికాసము నొందినదను సిద్ధాంత జాఢ్యము ఈ అయోధ్యాపుర వర్ణనను వినుచో తప్పక ఈనాటి నాగరికుల మనోమయశరీరము నుండి వైదొలగునని నా విశ్వాసము. అంతేకాదు. భగవదవతార యోగ్య మగు ప్రదేశము ఎట్లుండెనో గూడ మనకు నిర్ణయము కాగలదు. కాని ఒక్క ప్రశ్న మీ కుదయించవచ్చును. ఆతడు సకల జగదంతర్యామి. భేదభావములు లేని అత్యుదాతడు. ఆతడేల తన యవతారమునకు ప్రత్యేకస్థలముల నిర్ణయించు కొనవలెను? భగవంతుడగు వాడే దేశమునందైనను అవతరించవచ్చును. ఏతల్లి యుదరమునుండియైనను రావచ్చును అని ఇది సరియగు ప్రశ్న కాదు.

ఏ కర్మాగారమును స్థాపించవలెనన్నను ఆ కర్మాగార స్థాపనకొక ప్రత్యేక ప్రదేశము కావలెను. ఉత్పత్తిచేయబోవు ద్రవ్యమునకు ముడిపదార్థములు బహుళ ముగా దొరకు స్థలము దానికి నిర్మాణార్హ మగు భూమి కాగలదు. అట్టిదే ధర్మ సంస్థాపనకై అవతరించదలచిన భగవానుని జన్మభూమికూడ.

## అయోధ్యాపుర వర్ణనము

కోసల సామ్రాజ్యము ధనధాన్యములకు నిలయము. సరయూనదీమతల్లి ఆ సామ్రాజ్యము నానియే ప్రవహించుచుండెను. కావుననే అది కొరతలేని సామ్రాజ్యమై సుఖసంతోషముల కాలవాలమైనది. అందు నివసించు ప్రజల కందరకును ప్రస్తుతమగు మన అయోధ్యానగరము. ఆ సామ్రాజ్యమునకు రాజధాని ఆ నగరము సృష్ట్యాదియందే మనువు తాను నిర్మించుకొన్న మహానగరము. ఈ మనువు క్రీస్తు పూర్వమెన్నవ శతాబ్దములోనివాడని మీరు నన్ను ప్రశ్నింపకుడు. మనము భారతీయుల మని మరువకుడు. క్రీస్తుశకమునకును మన మీనాడు చదువుకొను

పాశ్చాత్య చరిత్రలకును మన రామాయణమునకు సంబంధములేదు. మనమిప్పుడు చెప్పుకొను రామాయణ కథా ప్రాదుర్భావ మెప్పటిదో మీకు చెప్పెదను.

కృత త్రేతా ద్వాపర కలియుగములను నాలుగు యుగములును కలసి, ఒక మహాయుగమగును. డెబ్బదియొక్క మహాయుగము లొక మన్వంతరమగును. అట్టి మన్వంతరములలో మనకిప్పుడు నడచుచున్నది ఏడవదగు వైవస్వతమన్వంతరము. ఈమన్వంతరమున జరుగు మహాయుగములలో ఇరువది నాల్గవ త్రేతా యుగమున రామావతారమును రావణ సంహారమును వాల్మీకి రామాయణ రచనయు జరిగినవి. ప్రస్తుతమగు నిది ఇరువది ఎనిమిదవ మహాయుగము. ఆ యిరువది నాల్గవ మహాయుగములోని త్రేతకును మనకును మధ్య మూడు మహాయుగములును మరికొన్ని యుగములును గడచినవి. నాటి నగర నిర్మాణమును గురించి మనమిప్పుడు చెప్పుకొనుచున్నాము.

ఆ నగరమధ్యమునందలి రాచబాట లతివిశాలములు. అవిసువిభక్తములై తీర్చిదిద్దినట్లుండును. "సువిభక్త మహా పథాః"

అట్లుండుటకే ఆ రాజమార్గముల కిరుప్రక్కలయందును శాఖోపశాఖల విస్తృతములై యుండు వృక్షరాజములు స్థాపింపబడి, ఆ రాచబాటల నడచువారికా వృక్ష పంక్తి తమ శీతలచ్ఛాయల చల్లదనమును చేకూర్చుచు తాము రాల్చు కుసుమ సహస్రములచే నడచువారికి సద్వాసనల కూడ నందించ సమర్థములై యుండెను. ఇట్లుపయోగపడుటచే ఆ చెట్లను అనాడు నాటినారు. అంతేకాదు. మార్గ మధ్యమున గాలికి రేగి వచ్చు దుమ్ము నడచువారికి బాధ కల్పింపకుండుటకై ఆ వీధులన్నియు ప్రతినిత్యమును జలసేచనమున తడపబడుచుండునట "జలసిక్తేన నిత్యశః"

భారతీయులకు నాగరికత క్రొత్తదికాదు. ప్రాచ్యభారతీయ చక్రవర్తుల రాజధానులు తన్నివాసులకు ఆరోగ్యభాగ్య నిలయములై యుండుటేగాక శత్రువుల కభేద్యములగునట్లే ఆ నగరములు నిర్మింపబడినవి. అయోధ్యానగరమున యంత్రములు వర్ణింపబడినవి. పాలకుల కుండదగు వనతులెన్నియో వర్ణింపబడినవి- ఆ యంత్రములకు ప్రత్యేకములగు నామ నిర్వచనలు లేకపోయినను యంత్ర విశేషములన్నియు కలసివచ్చునట్లు వర్ణించినాడు మహర్షి. "సర్వయంత్రాయుధవతీం" అని.

పట్టణమునకుండు ప్రవేశ ద్వారములు తోరణాలంకృతంబులగుటేగాక వాటి కుండదగు కవాటములు (తలుపులు) అతిబలవంతములై యుండెనట. ఆ నగరము యొక్క కోట గుమ్మములు ఎత్తయి యుండుటేగాక ఆ గుమ్మములపై అనేక యంత్రములుగూడ అమర్చబడి యుండుట ఆ నగరమున కొక ప్రత్యేకతయట. కోటగురుజులపై అమర్చబడిన యంత్రములు ఆ నగరముపైకి దాడివెడలివచ్చు శత్రువుల తరిమివేయుటకుగాను అమర్చబడియుండును అవిగాక భయంకర మారణాయుధములును వర్ణింపబడినవి. అంతేకాదు శిల్పుల కది నివాసమట. "ఉపేతాం సర్వశిల్పిభిః"

ఇట్లే నాటి రాజ్య విధానములలోని కొన్ని విశేషములను చెప్పెదను.

నాటి రాజ్యాంగములోని వారే వందిమాగధులును సూతులును గూడ. సూతులన రథసారథులు. వందులన్నను సూతులన్నను ఒక్కటియే. సూతులు రథసారథ్యమును చేయుటే గాక రాజులకు వారి పూర్వుల చరిత్రలలోని ఔన్నత్యమును తెలుపుచు వారికి వీరోత్సాహముల కల్పించుచుందురు. సూతజాతి ఒక ప్రత్యేకమగు జాతి. సూత మాగధులను పదములలోని సూత పదము శౌనకాది మహర్షులకు పురాణ ప్రవచనము గావించు సూత మహర్షికి వాడబడినను అతడీ సూత జాతికి చెందినవాడు కాడు. ఆ మహర్షికి వాడిన పదము జాతి వాచకము కాదు. గుణ వాచకము. సౌత పదము బిరుదము. అతడు వ్యాస మహర్షికి శిష్యుడు. రోమహర్షణునకు పుత్రుడు. రోమహర్షణుడు అగ్నికుండమునుండి ఆవిర్భవించగా సూత జాతి బ్రాహ్మణ స్త్రీయందు క్షత్రియున కుత్పన్నమైనది. ఈవిషయము ప్రసక్తానుప్రసక్తము. అది యట్లుండనిండు. ప్రకృతమునకు వత్తము. మన ప్రస్తుత కథాంశము నగర వర్ణనము. అయోధ్యా నగరమున శతఘ్ని యంత్రము లనేకము లుండెనట. ప్రాకారోపరి భాగముల నలంకృతములైయున్న పతాకములు పత్తనమున కలంకారము చేకూర్చగా అందున్న యంత్రములు ఆ నగరమునకు సర్వ కాలములందును రక్షకము లైనవట

అట్లే నగర మధ్యమున నానా దేశముల నుండి వచ్చిన వర్తక సంఘములు క్రయ విక్రయముల జరుపుటచే అది యొక వ్యాపార కేంద్రమై ఆ నగరము మహా లక్ష్మికి నివాసమైనదట. అంతేకాదు. అందు నర్తకీ సంఘము లున్నవి. రాజులు విహరించు ఉద్యాన వనములే గాక సాధారణములై ప్రజలు విశ్రాంతి

నొందదగు విహార స్థలములును అందు కలవు. కాన ఆ నగరమున చక్కని తియ్యమామిడి తోపులు కలవట. ఉద్యానా(మ్రవణో పేతాం" అని వర్ణించినారు మహర్షి.

ఇక ఆ నగరాంతర్భాగము నందలి శోభా విశేషముల వినుడు.

లోపలి భాగమున కట్టబడిన యిండ్లు ఒకదాని కొకటి వ్యత్యాసములై లేవు. అవన్నియు ఎత్తు పల్లముల కాక సమతలముననే ఇండ్లన్నియు నిర్మింపబడియున్న వని వర్ణింపబడినది. కావుననే ఆ నగరము చూచు వారలకు చూడముచ్చటయై కన్పట్టుచున్నది. ప్రతి కుటుంబమును పుత్రపౌత్ర సంతతితో కలకల లాడుచుండెనే గాని, ఈ సంతతి నంతను నేనెట్లు పోషింతునాయన్న బాధలతో ఏ కుటుంబమును లేదని వర్ణించినారు. ఆ నగరము నందలి నీటి వసతి ఎట్లుండెనో తెలియునా ?" ఇక్షుకాండ రసోదకాం" అని వర్ణితమైనది. చెరుకురసము వలె యున్నదట వారు త్రాగు నీరు. ఈ ఉపమానములోని విశేషమేమి ? మధుర రసము త్రాగుటకు హృద్యమే గాక శరీరమునకు తాప నివారకమును పోషక పదార్థముకూడ కాగలదు. అందుకై ఆ ఉపమానము వాడబడినది. నగరములోని భాగ్య భోగముల చెప్పుటకు కవి ఒక చక్కని ఉపమానమును వాడినారు.

విమానమివ సిద్ధానాం తపసాధిగతం దివి

తపస్సుచే సంపాదించుకొన్న సిద్ధుల విమానమువలె నున్నదట ఆ నగర రాజము. సిద్ధులన దేవతలలోని ఒక తెగ. వారు తమ తపో విశేషముచే ఏసంకల్పముల సంకల్పింతురో ఆ సంకల్ప ఫలములను ఆ క్షణముననే వారనుభవించుదురు. వారి వివాహములు విమానములయందు జరుగుచుండును. అట్టి వారి విమానమువలె యున్నదట ఈ నగరము. అనగా నేమి? అచ్చటి ప్రజ అందరును తపస్సిద్ధుల వలె పుణ్య సంచయములు కలిగి దురదృష్టవంతులు గాక తిండికిలేని దరిద్రులు గాక పరిపూర్ణ భాగ్యమున విరాజిల్లు చుండిరని ఒక్క మాటతో చెప్పినారు. ఇట్లెన్నియో విశేషముల వర్ణించినారు. భారతీయ నాగరికతను చెప్పుటకు కొన్నిటిని చెప్పినాను. ఇట్టి నగరమును స్వర్గమును దేవేంద్రుని వలె దశరథుడు పాలించుచుండెనట. అతడు మనువునకు తీసిపోడట. మనువు వలెనే పాలించు చుండెనట.

యథా మనుర్మహాతేజా లోకస్య పరిరక్షితా
తథా దశరథో రాజా వసతి జగదపాలయత్

దశరథుని అర్హతలను గూడ విడిగనే వర్ణించినారు మహర్షి.

అతడు రాజకు లైక భూషణుడు. వేద వేదాంతార్థముల నెరిగిన శ్రోత. దీర్ఘ దర్శి. విద్వజ్జన సంసేవ్యుడు. పౌర జానపదుల కాతడు ఆప్తమిత్రుడు. అతిరథుడు. వేదోక్తములగు అధ్వరములచే అగ్నిభట్టారకుని ఎడతెగక ఆరాధించుపుణ్యమూర్తి. నిజమునకు చెప్పవలెనన్న అతడు మహర్షులతో పోలిన రాజర్షి. ఇంద్రియ వర్గ మును తన చేతి యందుంచుకొన్న ధీరుడు. రాజనీతి కుశలుడై పరాక్రమమున తీసిపోక ప్రజల అత్యాదరము నందుకొనుచు రాజ శబ్దమును సార్థకము చేసుకొన్న మహారాజితడు. (ప్రజల రంజింప చేయువాడు రాజు).

మహాశయులారా! పాలకున కుండదగు అర్హతలను సంగ్రహముగ వింటిరి గదా? నాటి పాలకు డట్లుండ రామరాజ్యము వచ్చుటకు ముందే, అయోధ్యా నగ రము నందలి ప్రజ లెట్లుండిరో వారి యర్హత లెట్టివో కూడ చెప్పెద వినుడు.

## నాటి సంఘము

మానవ సమాజమున అశాంతిని రేకొల్పునది. అసంతృప్తి, లోభత్వమనను గుణములు. ఈ రెండు గుణములును మూర్తివంతములై తాముండు దేశమును నిత్య నివాసము గావించుకొనగా ఆ దేశమున శాంతిభద్రత లెక్కడివి? లోభిత్వ మను గుణము మానవునియందుగల సుగుణ సంపదనంతను హరించునట్టిగుణము. "లోభశ్చేదగుణేనకిం" అనినాడు భర్తృహరి. లోభత్వమన తనకున్న దానితో తృప్తినొందక ఎదుటి వారి ద్రవ్యమును ఏ యుపాయము చేతనైనను కొల్లగొని నిల్వచేయుట. లోభత్వము పెరగగా అధర్మము పెరుగును అంతతో ఆయురారో గ్యము తరుగును. రోగములు వృద్ధి నొందును. మానవ సమాజమున సంతోష జీవితములకు కరువు వచ్చును. కావుననే వాల్మీకి అయోధ్యా నగర వాసుల శాంత జీవితముల వర్ణించుచు నాటి సంఘ వ్యవస్థ ఎట్లుండెనో వర్ణించినారు

నరాస్తుష్టా ధనైః స్వైస్వైరలుబ్ధా స్సత్యవాదినః

ఆ నగరమునందలి జనులందరును వారి వారికిగల సంపదలతో తృప్తి నొందువారేనట. లుబ్ధులెవ్వరును లేరట. అందరును సత్యవాదులేనట అంతే కాదట. ఆ నగరవాసుల గృహములన్నియు తమతమ నిత్యజీవితావసర వస్తు

సంచయముచే నిండిన భాండాగారములతో కూడియున్నవేగాని నిరాశా నిస్పృహలకు నిలయములై లేవట.

నాల్ప సన్నిచయః కశ్చిదాసీత్తస్మిన్ పురోత్తమే.

మరొక భాగ్యముకూడ ఆ నగరమున కలదట. ఏమది?

ద్రష్టుం శక్యమయోధ్యాయాం నావిద్వాన్ న చ నాస్తికః.

అయోధ్యయందు విద్యాగంధము లేనివారుగాని నాస్తికులుగాని లేరట. లేరు కాదు. ఒక్కడును లేడట. కావుననే రాజభక్తి లేని పౌరుడు కూడ ఆ రాష్ట్రమున లేడు. "నాపి రాజన్య భక్తిమాన్" నాస్తికత పెరిగినకొలదిని ఆయుర్భాగ్యము కూడ లోపించును. అయోధ్యయందు 'దీర్ఘాయుషో నరాస్సర్వే" అందరును దీర్ఘాయుర్దాయము కలవారేగాని అల్పాయుష్కులు లేరట. కారణ మేమియట? దేశ సౌభాగ్యమునకు భౌతికవాదులు చెప్పు కారణములను వాల్మీకి చెప్పలేదు. సనాతన భారతీయ ధర్మసూత్రములను పాటించుటయే ఆయురారోగ్యైశ్వర్యవంతులై సంతోష జీవితములను గడుపుటకు కారణమనినారు.

దీర్ఘాయుషో నరాస్సర్వే సత్యం ధర్మం చ సంశ్రితాః<br>
సర్వే నరాశ్చ నార్యశ్చ ధర్మశీలా స్సుసంయతాః.

అన్ని వర్ణములయందలి స్త్రీ పురుషులును ధర్మశీలముల కొరత లేనివారట ఇప్పుడు వాల్మీకి వర్ణించిన వర్ణనకు ఆధారమేమి? వేదములే ఆధారము.

(అనాభోగాః పరం మృత్యుం. పాపాస్సంయంతి సర్వదా. అభోగాస్త్వేవ సంయంతి. యత్ర పుణ్యకృతో జనాః)

పాపులు భోగముల ననుభవింపకయే చత్తురు. పుణ్యులే భోగానుభవపర్యంతము బ్రతుకుదురు.

ఇంతవరకు మనకే మర్థమైనది? రామాయణ కాలమునాటి నాగరికతయే భారతీయ నాగరికతయని అర్థమైనది

మరి రామాయణము నాటికి వర్ణవ్యవస్థ యుండెనా? ఉన్నచో ఎట్లుండేది? వర్ణవ్యవస్థయే భారతీయత భారతీయ శాస్త్రములన్నియు వర్ణవ్యవస్థను ఆధారముగా చేసికొనియే యున్నవి. జ్యోతిశాస్త్రమున గ్రహములు బ్రాహ్మణాది జాతులు

కలసియున్నవి. వాస్తు ప్రశ్నశాస్త్రములును వర్ణవ్యవస్థలో కలిసియే యున్నవి. శకునశాస్త్రమంతియే.

"ఏకోదండధరో విప్రః సాక్షాత్కాలో నసంశయః:
ఏకోదండధరశ్శూద్రః సాక్షాద్విష్ణుర్న సంశయః"

కర్రను చేత పుచ్చుకొన్న బ్రాహ్మణుడు ఒక్కడును ప్రయాణీకున కెదురగుచో అతడే యమధర్మరాజట. అట్టి ఆకృతితో శూద్రుడు ఒక్కడే ఎదురగుచో అతడే శ్రీమహావిష్ణువట. కారణ మేమియట? ఎవరు చెప్పగలరు? శాస్త్ర విషయములు కేవలముగ బుద్ధిచే తర్కించుటవీలుకాదు. మన స్వబుద్ధిచేత తర్కించుటకు సాధ్యముకానిదే శాస్త్రము. మనకంతె ముందున్నది శాస్త్రము.

భారతదేశమునందలి వర్ణవ్యవస్థ భారతీయులలోని (లేక) సమాజములోని ఐక్యతకు భంగము కావించినదని అధునాతన మేధావులు అభిప్రాయము. కాని ఆ వర్ణవ్యవస్థయే ఐక్యతకు కారణమని వారెరుగరు. సమాజములోని అనైక్యతకు కారణం మానవునియందు పెరిగిన లోభత్వమును దురాశయు నను గుణములని ఆ మేధావులు గ్రహించుట చాల యుక్తము.

ఒకే ఒక వస్తువునకై నియమములేకుండ అందరును ఎగబడుట కలహములకు కారణము. కాంతా కనకముల రెంటింటిని అదుపునందుంచలేని దుష్టుల సమాజము క్రోధమును ప్రధానము గావించుకొనును

నిజమునకు భారతీయ సూత్రముల విచారించుచో మన దేహము కొన్ని అవయవములతో కూడియుండుట ఎట్టిదో దేశముకూడ వర్ణవ్యవస్థతో కూడి ఒక్కొక్కరు ఒక్కొక్క కార్యాచరణమున నియమితులై యుండుట అట్టిదే ననిపించును.

మన శరీరమునందలి కాలుచేతులు మొదలగు కర్మేంద్రియముల తీసుకొందము. చేతులు గొప్పవై కాళ్లు గొప్పవి కావనుటను ఎవ్వరైన ఒప్పుకొందురా? శరీరమంతయు కాళ్ళపైననే ఆధారపడి యున్నది. కాళ్ళు లేకున్న మన మెక్కడికిని కదలలేము. కాళ్ళు ప్రధానములుకాని చేతులు ప్రధానము కావన్నచో వస్తువును గ్రహించుశక్తి కాళ్ళకు లేదుగదా? చేతులు శరీరము నిలుపుటకు ఆధారములు కాలేవు, కాళ్లు వస్తువులు గ్రహించుటకు సమర్థములుకావు. కళ్ళు లేకున్న కాళ్ళ ఆట కట్టును. కాళ్ళు చేతులు లేకున్న కళ్ళేమిచేయును? నోరు

లేకున్న కాళ్ళకును చేతులకును బలమును చేకూర్చు అన్నము నెట్లు తిందుము? కాళ్ళు తిరిగితిరిగి ధాన్యమును తెచ్చును. చేతులు అన్నమును వండును. తినున దెవ్వరు? నోరు. నోరు బిగిసిన అంతయు బిగిసినట్లే. ముక్కు లేకున్న ప్రాణ వాయు సంచారమెట్లు నడచును? అసలు ప్రాణము లేకున్న అవయవములకు ప్రయోజనమేమున్నది? అట్లే వర్ణములలో కూడ ఎక్కువ తక్కువలు లేవు. ఏ అవయవము ఏ కార్యమును చక్కపెట్టగలదో, ఆ అవయవము ఆ కార్యమును సాధించునప్పుడు ఆ అవయవము ప్రధాన గౌరవము నొందుచున్నది. ఆ సమ యమునందా అవయమును గౌరవించుట మిగిలిన అవయవములను అవమానిం చుట కాదు.

అట్లే ప్రతివర్ణమును ఒక్కొక్క పనిని సాధించినప్పుడు ఆయాకార్యముల యందా యావర్ణమును స్తుతించినవి శాస్త్రములు. అంతియేగాని ఏ ఒక్క వర్ణము నకును ప్రత్యేకతనిచ్చి గౌరవించలేదు. నేడు కుల మత విభేదములు పోవలెనను నినాదములలో నిలిచియున్నవి అవియే ననుట అనుభవ సాక్ష్యము నిర్ణయించును. మన శరీరము వ్యష్టి, దేశము సమిష్టి. దేశము భగవంతుని శరీరము. మన శరీ రము యందలి ఇంద్రియములు ఆత్మను ఆధారముగ చేసికొని నిలిచియున్నవి దేశము భగవంతుని ఆధీనము నందున్నది. భగవంతుడన మన మూహింపరాని ఒక అపూర్వమగు పరిపూర్ణమగు శక్తి. మనమూహింపరాని శక్తి మానవుని యందొకటి కలదనుట కెవ్వరును కాదనరు. కావను వారున్నను వారు ఋజువు చేయజాలరు. దేవుని చూపింతురా? అందురు కొందరు. వారు బల్బులేకయే విద్యు త్తును చూపుదురా? పోనిండు. మానవులోని బుద్ధిని కన్నులకు చూపుదురా? కాదు. సూర్యమండల పరిమాణమును కొలబద్దతో కొలిచి నిర్ణయింతురా? అట్లె అందరి కన్నులకును దేవుడగుపడడు. మనస్సను నేత్రమున కాతడు కనబడును అదియు అతనిని చూడ శక్తిగల మనస్సునకే గోచరించును. రూపమును కన్నులే చూడగలవు. ఆ కన్నులైనను పొరలేకయున్ననే చూడగలవు. మనస్సుకూడ మలినము లేనిదైననే భగవంతుని ఆకృతిని చూడగలదు. భగవంతుని రూపము చాల సూక్ష్మము. సూక్ష్మపదార్థమునకు యంత్ర సహాయమెట్లు అవసరమో సూక్ష్మాతి సూక్ష్మమగు భగవచ్ఛక్తిని గ్రహించుటకు, లేక చూచుటకు మనో నేత్రము తపస్సనుయంత్ర సహాయముతో చూడగలదు. వేదములు చెప్పినట్లు వర్ణవ్యవస్థలోని ప్రత్యేకతను కూడ అసూయాగ్రస్తులు తెలుసుకొనజాలరు.

ద్వేషము సత్యమును తెలిసుకొనజాలదు. అయోధ్యయందలి నాటి వర్ణవ్యవస్థ గ్రహమండలములవలె ఒకదాని నొకటి అనుసరించి నాటి భారతీయ రాజ్యాంగమునకు శోభను గూర్చినవి. దీనినే వాల్మీకి చూపినారు. ఒక్క ప్రశ్నను మీపైనుంచి ముందుకుపోదును. ఎవ్వరైనను ఒకరి కాలు తగిలిన అదరిపడుదురు. చేయి తగిలిన కోపింతురు. కారణమేమి। అవి రెండును అవయవములే.

దీనికి సమాధానమును మీకే వదలితిని.

## మంత్రి మండలి

ఇక నాటి మంత్రిమండలి ఎట్లుండెనో చెప్పెదను. జాగరూకులై వినుడు. దశరథునకున్న ముఖ్యమంత్రులు ఎనమండుగురు. "అష్టౌబభూవుః". ఆ ఎనమండుగురి పేర్లు ఇవ్వి.

ధృష్టి, జయంతుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మంత్రిపాలుడు, సుమంత్రుడు ననువారు. వీరికి ఉపమంత్రులు కూడ కలరు. కాని మంత్రిపదవిని అధిష్టించదగువారికి కొన్ని అర్హతలు కలిగియుండవలెను. ఆ అర్హతలను కూడ మహర్షి వర్ణించినారు.

"మంత్రజ్ఞాశ్చ ఇంగితజ్ఞాశ్చ నిత్యం ప్రియహితే రతాః
విద్యా వినీతా హ్రీమంతః కుశలా నియతేంద్రియాః
శ్రీమంతశ్చ మహాత్మానః శాస్త్రజ్ఞా దృఢ విక్రమాః
కీర్తిమంతః ప్రణిహితా యథా వచనకారిణః
క్రోధాత్కామార్థహేతోర్వా నబ్రూయు రనృతంవచః.

అసలు మంత్రులని వారి కెందుకు పేరు పెట్టినది వాఙ్మయము॥

మంత్రి యన ఆలోచన. మానసిక ప్రజ్ఞ. అట్టి ప్రజ్ఞ కలవాడే ఆ స్థానమునకు అర్హుడు. కావున వారికి మొదటి అర్హత మంత్రజ్ఞతయే. "మంత్రజ్ఞాః" అనినాడు. ఇంగితజ్ఞత యన రూపురేఖల ననుసరించి హృదయమును కనిపెట్టదగిన ప్రజ్ఞావిశేషము. అట్టి ప్రజ్ఞ కలవారు దశరథుని మంత్రులు. అట్టివారై రాజునందు అనగా దేశమునందు ప్రీతికలవారును హితము కోరువారును కూడ

అయి యుండిరట. ప్రీతి కలిగియుండుట వేరు. హితము కోరిన ప్రీతివేరు. తేడా ఏమిటియట? ఒక పిల్లవానియందున్న ప్రీతితో వానికి మధుర పదార్థమును వానికి తిన్నంత పెట్టుదుము. కాని ఆ ప్రీతియందు హితము అనగా వారికి ఉండదగు ఆరోగ్యమును చూచుటలేదు. ఆరోగ్యమును చూచుచో అతడు తిన్నంత పెట్టము. పెట్టదగినంత పెట్టుదుము.

మంత్రుల కుండదగు అర్హతలలో మరొక్క ముఖ్యార్హతను గూడ వాల్మీకి వర్ణించినారు. ఏమది? "విద్య"

న్యాయశాస్త్ర ధర్మశాస్త్రముల నెరుగనివారికి మంత్రిపదవి నధిష్ఠించు అర్హత ఆనాడు లేదు. ఆ విద్యకు అలంకారములు వినయ విధేయతలు. విద్యలేక కేవల వినయ విధేయతలు జాలవు. కావున "విద్యా వినీతాః" అనినారు. అంతేకాదు. హ్రీమంతులు కూడ ఎవరేమనుకొన్నను సిగ్గువిడిచి వర్తించుచుండిగాక, లజ్జయను దానిని పాటించుట యవసరమట. ఈ గుణములున్నను కార్య కౌశలము లేకయుండుట మంత్రి పదవికి కళంక మనక తప్పదు. కాని ఎన్ని ఆత్మ గుణములనైన మంటకలుపునది ఇంద్రియ నిగ్రహము లేకపోవుట. దశరథుని మంత్రి సత్తములు నియతేంద్రియులట. "కుశలా నియతేంద్రియాః" ఇంతియేనా? వారికున్న గుణవిశేషములు, ముఖ్యములగునవి మరికొన్ని యున్నవి. అందొకటి శ్రీమంతులయి యుండియే మంత్రులగుట. మంత్రిపదవి నలంకరించి శ్రీమంతులగుట కాదు. ఒక్కమాట శ్రీమంతులై పెట్టుబడిదారులుగాక వారు విశాల హృదయులయి బీదసాదల కనిపెట్టువారటకూడ. శ్రీమంతశ్చ మహాత్మానః" అని వర్ణించినారు. అంతియేనా?కాదు. "యథా వచనకారిణః" చెప్పినమాటను చేయుదురట. అనగానేమి? రాజాజ్ఞను మీఱరు. ఇట్టి గుణములు కలిగియున్ననే మంత్రి పదవి నధిష్ఠించుట కర్హులని భారతీయ సంస్కృతి నిర్ణయించినది. ఇంకెన్నియో అర్హతలను చెప్పినది మన రామాయణము మంత్రుల విషయమే. అందొక్క విశేషమును చెప్పి వీరి విషయమును ముగించెదను.

ప్రాప్తకాలం తు తే దండం ధారయేయు స్సుతేష్వపి.

సమయము వచ్చినప్పుడు కొడుకులనైన శిక్షించుటకు వెనుదీయరట. కామక్రోధములు వారిని అలద్దమాడించవట.

క్రోధాత్కా మార్థహేతోర్వా న బ్రూయు రనృతంవచః.

వీరి విషయ మిక చాలును. వీరి తరువాత వారు ఋత్విక్పురోహితులు. వారికి కొన్ని లక్షణములు వర్ణింపబడినవి.

కథకు పోదము.

మనకీ నాటి కథాభాగము రామ జననము గదా! భగవానులిక మన భరత ఖండమున కాలిడుటకుముందు మాతృగర్భమునందెట్లు ప్రవేశించెనో గమనింతము.

దశరథేశ్వరుని సామ్రాజ్య మట్లు సాగుచుండగా ధర్మసామ్రాజ్య నిష్ణాతు డగు ఆరాజ సత్తమునకు, కౌసల్యా సుమిత్ర కైకయీలను మువ్వురు భార్యల యందును వంశ ప్రతిష్ఠాపకమగు సంతతి కలుగలేదు. ఇక్కడ మీకొక్క విషయ మును చెప్పవలెను. మహర్షి ఆ రాజునకు సంతానము లేదని చెప్పక. నాసీద్వంశకర స్సుతః" అనెను అనగా వంశ ప్రతిష్ఠాపకుడగు పుత్రుడు పుట్టలేదనినారు. పుత్రు నకీ విశేషణమును వాడుటలోని విశేషమేమి? ప్రత్యేకత లేకపోలేదు.

సనాతన భారతీయ సిద్ధాంతమున స్త్రీ పురుష కామ భోగమున సంతానము కలుగుటయా? లేక సంతానము కొరకు భార్యాభర్తల కామానుభవమా? అను ప్రశ్న యొకటున్నది.

భౌతికవాదుల దృష్టియందు స్త్రీ పురుష సమ్మేళనము సంతతిని దృష్టి యందుంచుకొని జరుగదు. ఒకవేళ సంతతిని దృష్టి యందుంచుకొన్నను, ఆ సంతతి యొక్క ప్రయోజనము వంశ ప్రతిష్టాపనలు కాదు. భారతీయుల దృష్టి అది కాదు. వంశ ప్రతిష్ఠాపనమను ఒక మహా క్రియ నుద్దేశించియే స్త్రీ పురుష సమాగమము భారతీయ సిద్ధాంతమన వేద సిద్ధాంతము. వేదమిట్లు శాసించినది.

"ఆచార్యాయ ప్రియంధనమాహృత్య ప్రజా తంతుం మువ్యత్సేత్సీః"

ఓ మానవుడా! నీవు విద్య నభ్యసింపుము. తరువాత గురువర్యుల తృప్తి నొందింపుము. అంతతో నీ కర్తవ్యము పూర్తియైనదని తలచకుము. నీ వంశమను తంతువు (దారము) తెగకూడదు. పుత్రుని పొందుము అన్నది. ఎందుకుపుత్రుడు? పితృ దేవతల ఋణమును తీర్చుటకు. ఈ సిద్ధాంతము పాశ్చాత్యులకు లేదు. వారి దృష్టి వైదికము కాదు. మరియొక విశేష మున్నది. అట్టి సంతతి కలుగుటకే వివాహ వ్యవస్థ వచ్చినది మనకు. అంతేకాదు. సంతతి కలగనిచో దైవిక

ప్రతిబంధకములను నీ ప్రయత్నముచే తొలగించుకొనుమని కూడ వేదము కామ్య కర్మలను చెప్పినది.

అదియే పుత్ర కామేష్టి. మన కథా భాగమున వంశ ప్రతిష్ఠాపకుడగు పుత్రుడు కలుగలేదని చింతించిన దశరథేశ్వరుడేమి చేసెను? తనకు సంతతికలుగుటకు అడ్డు వచ్చిన దైవిక ప్రతిబంధకమును తొలగించుకొనినాడు. కాని ఇప్పుడు దశరథుడు నిశ్చయించుకొనినది అశ్వమేధయాగము. ఆ యాగము తన అభీష్టమును నెరవేర్చునని అతడు అభిప్రాయపడినాడు. రాజగువాడు తను సంకల్పించి నిశ్చయించుకొన్న కార్యమును మంత్రులతో సమాలోచన గావించుట ధర్మము.

సుమంత్రుడు దశరథేశ్వరుని ఎనమండుగురు ముఖ్యమంత్రులలో నొక ముఖ్యమంత్రి. అతడు సార్థకనాముడు. ముందుగ అతనిని రావించినాడు. మిగిలిన వారినికూడ పిలిపించినాడు. అది కేవలము మంత్రులతో ఆలోచించిచేయు కార్యమే కాదు. కావున సుమంత్రుని బంపి తన కుల గురువులను, పురోహితులను కూడ శీఘ్రముగ తోడ్కొని రమ్మని పంపినాడు.

ఇక్ష్వాకువులకు సుయజ్ఞ, వామదేవ జాబాలి కాశ్యపులను వారు గురువులు వశిష్ఠ మునీంద్రులు పురోహితులు. సుమంత్రుని ఆహ్వానము నందుకొన్న ఆ వేద విదు లందరును మరి కొందరు బ్రాహ్మణోత్తములతో కూడి దశరథేశ్వరుని కడ కేతెంచినారు. దశరథేశ్వరుని మందిరము నందీ నాడిది యొక మహోత్కృష్టమగు సన్నివేశము. మహారాజు వచ్చిన ఆ బ్రాహ్మణోత్తములకును సుయజ్ఞ వాసుదేవాది గురువర్యులకును వశిష్ట మునీంద్రులకును సత్కారమాన పూజాదుల నందించినారు. శాంత తేజమున విరాజిల్లినది నాడా సభాస్థలి. ఇక దశరథేశ్వరుడు వారి నెందుకు ఆహ్వానించెనో వారికి తెలుపవలెను. తెలిపినాడు ఏమని ?

"మమ లాప్య మానస్య పుత్రార్థం నాస్తి వై సుఖం
తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ.

మహనీయులారా! ఇంతవరకును పుత్రగాత్ర పరిష్వంగ సుఖమునకు నోచుకొనని నాకు పుత్రప్రాప్తికై అశ్వమేధ యాగము చేయవలెనని బుద్ధి ఉదయించినది. అది మహాక్రతువు గదా? కావున ఆ క్రతువును సశాస్త్రీయముగను నిర్విఘ్నముగను పరిపూర్ణము గావించుటకు మీ అనుగ్రహమును కోరుచుంటినని సవినయముగ తెలిపినారు ఆ మహర్షులకు.

ఒక్క మారుగ మంత్రి మండలి ముఖ మండలములు వికసించినవి. మహర్షులును మంతస్మిత వదనార విందములతో సంతోషము పెల్లుమీరగదశరథుని వాక్యమును పూజించి సాధువాదమును పలికినారు. అంతియేకాదు. ఆ క్షణముననే వశిష్ఠాది మహర్షులు ఆ యజ్ఞ సంబారముల సంగ్రహించుటకును, యజ్ఞీయమగు అశ్వమును దేశముపైకి పంపుటకును కూడ ప్రోత్సహించినారు. ఇక దశరథునకు కావలసినదే మున్నది? తాను సంకల్పించిన ఈ మహా కార్యము నెరవేరినట్లుగనే సంతసించినాడు. ఈ మహర్షుల వాక్యముల పాలింపుడని మంత్రులకు అజ్ఞలను కూడ అందించినాడు. ఋషులు తమ స్వస్థానముల కేగినారు. ఇప్పుడు దశరథుని హృదయము సంతోషమున నిండి పూర్ణకలశమైనది. కాని దశరథేశ్వరుని ఆ ఉత్సాహమును పంచుకొనదగిన వారు మరి కొందరుండిరి గదా ? వారెవ్వరు ? ఆయన అర్ధాంగులు. కౌసల్యా సుమిత్ర కైకేయిలు. కావున వెంటనే ఆ మహా రాజు రాణీవాసముల కేగి తన ముప్వరు భార్యలకును కూడ ఈ కార్య నిశ్చయమును తెలిపినాడు. దశరథుని నోట ఈ మాటను విన్న ఆ కాంతామణులను మన మెట్లు చూచి వర్ణించుదుము? మన కవిపుంగవులా రాజవనితల ముఖపద్మముల తిలకించినారు.

ముఖపద్మాన్యశోభంత పద్మానీవ హిమాత్యయే

మంచు పట్టు కాలమున సరోవరముల యందలి తామర కమలములయందలి శోభ మంచుచే కప్పబడియుండి. సూర్యుని రాకచే ఆ మంచు విడిపోవగా ఆపద్మము లెట్లు శోభించునో వీరి ముఖ పద్మములట్లు శోభించినవట. ఇందలి విశేషమేమి ?

స్త్రీలకు సంతానము కలుగనంతవరకును వారి జీవితమునకు వన్నెలేదు. వారి జీవితమునకు వన్నెదిద్దునది వారు మాతృమూర్తులగుటయే. అంతవరకును వారి జీవితము ఆవరణ సహితము. నేడు ఆ రాజవనితల ఆవరణము తొలగినది. రాబోవు పుత్రసంతతి సూర్యతేజమువలె ప్రకాశమానమగు దివ్యతేజము. కావున ఈ ఉపమానమును వాడినారు మహర్షి అంతేకాదు. వారి హృదయము పుండరీకములు వికసింపగా అందు అంతర్యామి తేజము వెలుగొందునని కూడ సూచించినారు. ఇట్లే కావ్యమునందలి యుపమానములందంతర్భితములగు భావముల ప్రకటింపవలసి వచ్చుచో నా వాఙ్మయము చాలదు. వాల్మీకి మహర్షివారి భావసముద్ర

తరంగములు దేశకాల పరిమితములు కావు. ముందుకుపోదము. ఇంతతో ఆలోచనా కార్యక్రమము ముగిసినది దశరథునిది. తరువాతి కథాభాగమేమి?

దశరథునకు కలుగదగు సంతానమునకు రాజు సంకల్పించిన అశ్వమేధ యాగము చాలదు. ఆ యాగము తరువాత పుత్రకామేష్టి కావలెను. ఆ సంగతి దశరథునకు తెలియదు. ఆ పుత్రకామేష్టిని చేయించదగువాడు ఋష్యశృంగమహర్షి. ఆయనను తీసుకొనివచ్చినగాని ఆ కార్యము నెరవేరదు. రోమపాదుని పుత్రిక యగు శాంత ఆ మహర్షికి భార్య. వారిద్దరిని అయోధ్యకు తీసుకొని వచ్చియే అశ్వమేధమును ప్రారంభించవలెను. ఈ విషయము సుమంత్రునకు తెలియును. ఆతడి కెట్లు తెలియును? దశరథుని ఋత్విక్కులవలన ఆతడొకప్పుడు వినినాడు, ఆ ఋత్విక్కులొకప్పుడు సనత్కుమార మహర్షివలన వినినారు. అనగానేమి? రామావతారమునకు ముందుగనే రాబోవు విషయమును సనత్కుమారులు వామదేవాది మహర్షులకు తెలుపగా ఆ మహర్షులు మంత్రిసత్తమునకు తెలుపుట జరిగినది. మన పురాణ కథ లిట్లే యుండును. రాబోవు చరిత్రలను ముందుగనే మన మహర్షులు ప్రసంగించుచుందురు. వారు త్రికాల జ్ఞానసంపన్ను లనుమాటను మీరు మరువకూడదు. సుమంత్రుడిప్పుడు అశ్వమేధయాగమునకు ముందు ఆచరింపదగు కర్తవ్యమును తెలిపినారు దశరథునకు.

దశరథేశ్వరా! అంగదేశమును పరిపాలించు రోమపాదుడు నీకు ఆప్త మిత్రుడు. ఆతడు నీకు బంధువుకూడ. ఇప్పుడు నీవాతని రాజ్యమున వసించు ఋష్యశృంగమహర్షిని ఆయన భార్యయగు శాంతతోకూడ నీ గృహమునకు తోడ్కొనివచ్చి నీవు నీ అశ్వమేధయాగమును ప్రారంభించవలెను. కారణ మేమందువా? నీవు పుత్రకామేష్టి జేసినగాని నీకు సంతతి కలుగదు. ఆ ఇష్టిని నెరవేర్చదగు మహనీయుడు విభాండక మహర్షి వారి పుత్రుడగు ఋష్యశృంగుడే. కావున వారిద్దర తోడ్కొనివచ్చి నీవు పుత్రసంతతిని బడయుము. రాజా! ఇప్పుడు నేను నీకు చెప్పిన విషయము. ఒకప్పుడు సనత్కుమార మహర్షి బ్రహ్మసభ యందు విన్న ఈ విషయమును, మన వామదేవాదులకు తెలపగా, నేనా విషయ మును ఇప్పుడు నీకు చెప్పినాను అనినాడు. ఈ సంగతిని చెప్పి విభాండక మహర్షి పుత్రుడగు ఋష్యశృంగుని చరిత్రను చెప్పి, ఆతడెందుకు రోమపాదుని రాజ్యమునకు తీసికొనిరాబడెనో కూడ చెప్పినాడు. ఆ కథను కూడ మీకు సంగ్ర హముగ తెలిపెదను.

ఋష్యశృంగుడు విభాండకమహర్షి పుత్రుడు. ఆతడు చక్కని బ్రహ్మ చర్యదీక్షతో వేదాధ్యయనమును గావించిన తేజస్వి. రోమపాదుని రాజ్యమున కాతడు వచ్చునంతవరకును నగరమున వసించు స్త్రీలనుగాని, పురుషులనుగాని ఆత డెరుగడు. స్త్రీ పురుషులనేకాదు నాగరికములును గ్రామ్యములు నగు జంతు వులను కూడ ఆత డెరుగడు. వన్యమృగములను, వనవాసులనే ఆతడెరుగును. ఆతని జన్మ అరణ్యముననే. పెరిగినదికూడ అచ్చటనే. కావున ఆతడు నాగరికము లగు జంతువులనైన ఎరుగడు.

"న తేన జన్మప్రభృతి దృష్టపూర్వం తపస్వినా

స్త్రీ వా పుమాన్వా యచ్చాన్యత్సరం నగర రాష్ట్రిజం.

ఇక ఆతడెందుకు రోమపాదుని రాజ్యమునకు వచ్చెనో గృహస్థు ఎట్లయ్యెనో చెప్పెదను.

రోమపాదుడు పరిపాలించు సమయముననే అంగదేశమున వర్షములులేక దుర్భిక్షము తలయెత్తి విజృంభించినది.

దాని విజృంభణము కొన్ని సంవత్సరములు సాగినవి. దేశమునందట్టి ధారుణములగు సంఘటనలు వచ్చుట రాజుయొక్క దోషమేనని శాస్త్ర సిద్ధాంతము. మరి అప్పుడు రాజు ఏమిచేయవలెను? శాంతికర్మల నాచరించి? ఆ దుర్భిక్షమును తొలగించి ప్రజల రక్షించవలెను.

రోమపాదుడు విద్యావృద్ధులగు పండితుల రావించి తన రాజ్యమునందలి అనావృష్టిదోషము పోవునట్టి శాంతికర్మను తెలుపుడని ప్రార్థించినారు. శాంతికర్మ యన్నను ప్రాయశ్చిత్తమన్నను ఒక్కటియే. ఆ పరిషత్తునందలి విద్వాంసులు విభండుని ఆశ్రమమునందున్న ఋష్యశృంగుని ఎట్లయిన రావించి, ఆతనికి నీ పుత్రికయగు శాంతనిచ్చి వివాహము చేయుచో నీ దేశమున సువృష్టి కలిగి దుర్భి క్షము తొలగునని చెప్పగా ఆ రోమపాదుడు మంత్రి పురోహితుల బంప నిశ్చ యించుకొనినాడు. ఆతనివద్దకు వారా కార్యమునకు ఒప్పక, వేరొక ఉపాయాంత రము నాలోచించినారు. ఆశ్రమవాసులు నగరముల కెందుకు వత్తురు? వ్యామో హితులగుచో వత్తురు. కావున వారికి వ్యామోహమును కల్పించి ఋష్యశృంగుని ఇచ్చటకు తీసుకురావలెను. వ్యామోహమునకు మొదలు స్త్రీ సాంగత్యము. అందును వారస్త్రీలతోటి పొత్తు. కావున ఋష్యశృంగుని రప్పించుటకు వేశ్యల పంపుదమని

నిర్ణయించుకొనినారు. కాని ఋషుల జీవితమును పాడుచేయుటగదా? ఇది యొక దోషము కాదా? కాదు. ధర్మము లతి సూక్ష్మములు. ఈ ఘట్టమున అట్టి దోషము రాదని పెద్దలు నిరూపించగా విభండకుని ఆశ్రమమునకు వేశ్యాంగనల పంప నిశ్చయమైనది. కాని వారా మహర్షి తపమును భంగపరచకుండ ఆతని రాకను దేశ సౌభాగ్యమునకు వినియోగించునట్లే నియోగింపబడినారు.

అది విభండకుని ఆశ్రమము. ఆయాశ్రమ సమీపముననే నాడు అంగదేశపు వారకాంతల నివాసముకూడ. ఋష్యశృంగుడు వారి నివాసస్థానముకు రావలెను.

దైవము చాల చిత్రమైనది. అట్లే జరిగినది. ఋష్యశృంగు డెన్నడును తన తండ్రి ఆశ్రమముకు దాటి వెళ్ళని వ్యక్తి. నేడీ వారకాంతలు వసించియున్న ప్రదేశమున కేతెంచినాడు. ఆ వేశ్యాంగన లాతని దృక్పథమున పడినారు. వీరు వారస్త్రీలని ఆతడే మెరుగును? వారీతని గుర్తించినారు. కాని వారి చిత్ర విచిత్ర వేషములు ముని కుమారునకు ఆశ్చర్యమును గలిగించక పోలేదు. అంతలో వారి మధుర గానములు కూడ ఋష్యశృంగుని చెవిని బడినవి, కాని ముని వారి నేమని పలకరించును? వారే ఈ బ్రహ్మచారిని పలకరించినారు. వారి పలకరింపుల కాతడు సమాధాన మివ్వకుండా ఊరుకొను బుద్ధి పుట్టలేదు. వారిని గూడ తాపసులనియే ఋష్యశృంగుడు భావించుటచే తాపసులురా! అని సంబోధించి, తన ఆశ్రమమునకు వారి నాహ్వానించినాడు. అంగ దేశమున కది భాగ్యోదయ కాలము. ఆవార కాంతలకు ఋష్యశృంగుని అర్ఘ్యపాదము లందినవి. అతడిచ్చిన పూజల నందుకొనినారు ఆ రమణీమణులు. కాని వారి చిత్తములు భయకంపితములై లేకపోలేదు విభండకుడు వచ్చుచో వారు శాపదగ్ధులు కాకతప్పదు. అది వారికి తెలియని విషయము కాదు. ఇక వారు వచ్చిన కార్యము నెరవేరవలెను.

ఏ మానవు నైనను ప్రకృతికి వప్పచెప్పునవి ఇంద్రియ వర్గము. కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మము అనునవి జ్ఞానేంద్రియములు. అవి కోరుకొను సుఖములే మనకీ సంసారము. పురుషుని ఆశ్రయించిన ఈ ఇంద్రియ వర్గము స్త్రీల నుండి సుఖమును కోరగా, స్త్రీ పురుషుని వలన సుఖము నభిలషించును. ప్రకృతమున ఋష్యశృంగుని తమ కైవశము గావించుకొనుటకై ఆ అంగనలు అతనికి కొన్ని మధుర పదార్థముల నొసంగినారు. కౌగలించినారు. ఋష్యశృంగుడు వారిచ్చిన లడ్డులను తినగా, తామిప్పు డొక వ్రతమాచరించు చుంటిమనియు వేగముగ

తమ ఆశ్రమములకు పోవలయునని చెప్పి, విభండకుడు వచ్చు లోపలనే వారు ఆ యాశ్రమమును వదలి స్వస్థానమునకు చేరుకొనినారు.

ఋష్యశృంగుని చిత్తము స్థిమితమై లేదు. అతని ఇంద్రియ వర్గము తాను తాపసులనుకొన్న వారకాంతల వద్దకు పరుగులెత్తుటచే అతడు వారున్న ప్రదేశమున కేగినాడు. వారి కోర్కె ఫలించినది. ఆ ఋషిసత్తమునకు వారకాంత లెదురేగి "ఏహ్యాశ్రమ పదం సౌమ్య" రమ్ము రమ్ము మహర్షీ! అని స్వాగత వచనాలతో తమ ఆశ్రమాభ్యంతరమునకు గొంపోవగా తిరిగి తన తండ్రి ఆశ్రమమున కాతడు వెళ్ళలేక నిలిచినా డక్కడనే. అదియే మాయా ప్రభావము'' అఘటన ఘటనా పటీయసీమాయా'' కాని ఇక్కడ ఒక్క విశేష మున్నది. ఋష్యశృంగుడు కామార్తుడై బ్రహ్మ చర్యమును కోల్పోయెనా? కాదు కాదు. అతని బ్రహ్మచర్యమును భంగము చేయుటకై వారకాంతలు రాలేదు. ఆ మహనీయుని తాపస తేజమును వాడు వాడుకొనుటకై తమపై అనురాగము కలుగునట్లు మాత్రమే చేసినారు. తానెప్పుడును చూడని ఒక క్రొత్త వస్తువును చూచుచో ఆ వస్తువును చూడవలెనని కలుగు అనురాగము వంటిది కలగెనే గాని అంతకంటె వేరుకాదు. కావున ఆయన బ్రహ్మచర్యమునకు భంగము కలుగలేదు వారకాంతలాతనిని అంగ దేశమునకు గొంపోయినారు.

వారకాంతలతో గూడి ఋష్యశృంగుడు అంగ దేశమున కాలిడగా ఆ ఋషివర్యునితో గూడ వరుణ దేవుడును అంగ రాజ్యమున అడుగిడినాడు. అంగరాజ్యమును సస్యశ్యామలమగునట్లు వర్షములు కురవగా రోమపాదుడు శాంత నిచ్చి వివాహమును చేసినాడు. ఋష్యశృంగుడు గృహస్థయ్యెను. మనమిప్పుడు రామ జనన మను కథా భాగమునందెక్క డుంటిమి? దశరథుడు శాంతా ఋష్యశృంగులను తీసుకొని వచ్చి, అశ్వమేధమును ప్రారంభించవలెను. సుమంత్రుడు చెప్పిన చొప్పున దశరథుడు తన ముప్పురు భార్యలతో రోమపాదుని రాజ్యమున కేగి, ఆతని మెప్పువడసి నా ఋష్యశృంగుని శాంతతో కూడ అయోధ్యకు తోడ్కొని వచ్చినాడు తరువాతది అశ్వమేధము, పుత్రకామేష్టి అను కథా భాగము.

ఇక్కడ మీకొక్క విషయము చెప్పవలసి యున్నది.

శాంత దశరథుని పుత్రికయే రోమపాదునకు దత్తత ఇవ్వబడినదని ఒక ప్రతీతి యున్నది. ఇది వాల్మీకమున స్పష్టముగలేదు. "సంఖ్యం సంబంధకంచైవ" అని దశరథునకు రోమపాదునకు గల విశేషమును మాత్రము వాల్మీకి వర్ణించినారు. మనకిప్పుడా విషయము అప్రస్తుతము. శాంతాఋష్యశృంగుల రాక దశరథుని పుత్రకామేష్టికి అవసరము వచ్చినారు. ప్రకృతమున ఇదియే వారి స్వగృహము. ముందుకు పోదము.

## అశ్వమేధమం

అది వంతము. యజ్ఞ ప్రారంభమున కిదియే ముఖ్యమగు ఋతువు. దశరథేశ్వరుడు సంతానవంతుడగుటకే గదా ఋష్యశృంగుని తోడ్కొని వచ్చినాడు. కావున ఈ ఋతువునందే ఆతడు యజ్ఞ ప్రారంభమును చేయదలచినాడు. ఋష్యశృంగుని అనుమతి మొదటిది. దశరథుడు ఋష్యశృంగుని పాదములపై వ్రాలినాడు. తన వంశ విచ్ఛేదము కాకుండ కాపాడుమని ఋష్యశృంగుని ఋత్విక్కుగ వరించి ప్రార్థించినాడు. ఆతని అనుమతియైనది.అశ్వమేధము మొదటిది.ఈయాగమునుచేయు రాజు తన నామాంకితమగు పట్టను ఆ గుఱ్ఱమునకు ముఖమున కట్టి, దానిని దేశమునకు వదల వలెను ఆ యశ్వము ఎటుపోయిన అచే దాని రక్షకులు వెంట వెళ్ళవలెను. అది ఎవ్వరికీని పట్టుబడకూడదు. దానిని పట్టుకొన్న వారితో యుద్ధము చేసియైన దానిని విడిపించవలెను. ఆ గుఱ్ఱమును దేశముపైకి విడుచునప్పుడే ఋత్విగ్వరణము చేసి, విధి విధానముగ వదలవలెను. దశరథుడు అత్రి వశిష్ఠాది మహర్షుల రావించి, ఋత్విగ్వరణల నిచ్చి వారి ఆశీస్సుల నందుకొని అశ్వమును వదలినాడు. ఆ యశ్వము సంవత్సర కాలము సంచరించి ఇంటికి వచ్చును అంత కాలమును నిరీక్షించవలెను.

కాల చక్రము నిలువదు. మొదటి వసంతము గడిచినది. రెండవ వసంతము రానే వచ్చినది, యజ్ఞాశ్వమును తిరిగి వచ్చినది. సంవత్సరము నిండినది. ఇక యజ్ఞము ప్రారంభము కావలెను. ముందు మీకు ఈ యజ్ఞములనుగురించి కొంత చెప్పవలసి యున్నది. జాగరూకులై వినుడు. భారతీయ విజ్ఞాన శరీరమునందీ విషయము ముఖ్య ప్రాణము.

# యజ్ఞములు - వాటి అవసరము

నేడు గీతాశాస్త్రము అందరకును పరిచయమగు శాస్త్రము. ఆ శాస్త్రమొక మాటను చెప్పినది.

"సహయజ్ఞాః ప్రజాస్సృష్ట్వా పురో వాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వం ఏషవోస్త్విష్టకామధుక్.

ఎప్పుడో బ్రహ్మగారు చెప్పినారట, ఏమని? ఎవరికి? యజ్ఞములనే కామ ధేను వొకటి యున్నది. మీకేమేమి కోరికలు గలిగినను ఈ యజ్ఞములనే కామ ధేనువును అడగండి. మీ కోర్కెలు సఫలము కాగలవని మనకే చెప్పెనట. కాన కామధేనువవలె కోర్కెల దీర్చు నా యజ్ఞము లెట్లుండునో మనకు వాటి స్వరూప మెట్లు తెలియవలెనట? ఆ యజ్ఞముల స్వరూప స్వభావములను తెలుపునవి స్వయంభువములగు వేదములేనట. "కర్మబ్రహ్మోద్భవం విద్ధి" అని చెప్పినది గీతా శాస్త్రమే. అస్తునామ, మన కా యజ్ఞము లేరూపమున సాయము చేయును? ఆ యజ్ఞముల వలన వర్షములు కురియును. ఆ వర్షములవలన పంటలు పండి అన్నము వచ్చును, ఆ అన్నమువలననే సృష్టి జరుగును అని చెప్పినది గీతా శాస్త్రము. కాని ఆ యజ్ఞములందు వేదము పశువిశసనమును చెప్పినది. అనగా ఆ యజ్ఞము మీరు చేయునపుడు ఆ యజ్ఞఫలము నందించువారు దేవతలు. ఆ దేవ తల నుద్దేశించి హోమము చేయదగిన పశువుల యొక్క వపను హోమము చేయుచో మీరు హోమము చేయు ఆ ద్రవ్యమును దేవతలందుకొందురు. వారు మీ కోర్కెలను దీర్తురు. (వపయన పశువు లోపలి భాగమునందుండు మాంస విశేషము) అని వేదములు యజ్ఞస్వరూపములను చెప్పినవి. పర్యవసానముగ దేవలోక మనుష్య లోకముల కొక సంబంధమును చెప్పినవి. గీతాశాస్త్రమును వేదములుకూడ. కాని ఆ యజ్ఞములనుబట్టి పశునిర్దేశములుండును. కాని యజ్ఞమునకు పనికివచ్చు పశువునకు కొన్ని లక్షణములను వర్ణించినవి వేదశాస్త్రములు. ఒక్క పశువునకేకాదు. ఆ యాగమును చేయు కర్తను గూడ నిర్ణయించినవి. మన మీ లోకమున పశువుల మాంసమును అగ్నిలో వ్రేల్చుటయా? ఈ పదార్థము దేవతల కందుటయా? ఆ దేవతలు మనకు వర్షముల కురిపించుటయా? అందుకు వేద మంత్రములు సాధనములా? అసలు దేవలోకము లెక్కడ యున్నవట్టు, మనకును దేవలోకములకును దూరమెంతయట? హోమము చేయు ద్రవ్యము ఇక్కడనే

అగ్నిదగ్ధముకాగా ఆ ద్రవ్యము దేవతలకు చేరుటయా? ఇది మానవుడూహించు ఊహాప్రపంచమున కేమైన దగ్గరకాగలదా? అను సంశయము కేవల భౌతికవాదు లకు కలుగవచ్చును. ఈ విషయము కేవలమగు మానవబుద్ధిచే ఊహించు విష యము కాదు. మానవమాత్ర ఊహాసంజనితములు కాని విషయములను చెప్పుటకే వేదశాస్త్రములుగాని మన మూహింపదగిన వాటిని చెప్పుటకు వేదము లెందుకు? అర్జును డూహించలేని విషయమును తెలిపినదియే గీతాశాస్త్రము. మన కంటికి కనబడని ఒక విషయమును, మన కంటికి కనబడుదానిని ఆధారముగా గొని నిరూ పించునది తర్కశాస్త్రము. కార్యకారణ నిరూపణములతో ఆ శాస్త్రము నడచును. అనుమాన ప్రమాణము ఆ శాస్త్రమునకు ముఖ్యము. ప్రత్యక్షముగా గాని, ఊహకుగాని అందని దానిని చెప్పునది వేదము. ఆ వేదము చెప్పినది కనుక సత్యము. దీనికే శబ్దప్రమాణ మని పేరు. ఈ శబ్ద ప్రమాణము మాకు ప్రమాణ మని ఒప్పుకొన్న వారికొరకే గీతాశాస్త్రము. ఒక చిన్న ప్రశ్నను ఈ శబ్ద ప్రమా ణము ప్రమాణమును కాదన్నవారిని అడుగుదును. మీ తండ్రి ఇతడు అని తల్లి చెప్పగా నమ్ముటయేగతిగాని ఈతడే నా తండ్రి యనుటకు తర్కమేమున్నది? తండ్రి లేక పుత్రుడు రాడన్నది మాత్రము తర్కసిద్ధము. ఇతడే నీ తండ్రి యను నిర్ణయము విశ్వాసముపైననే ఆధారము. విశ్వసింపదగు వాక్యము శబ్దప్రమాణము కాక చరిత్రల గతియేమి? నమ్ముటకాదా? నెపోలియ నను ఈనాటివారు చూచిరా? వారినిండ్లు ఊహించు టెట్లు? కావున వేదములు మనము చేయు హోమములవలన ఆ హోమము చేయుటకు ఉచ్చరించు శబ్దము ఒక విధముగ నీవూహింపరానిశక్తి కలిగి, ఈ హోమద్రవ్యమును దేవతల కందించి, ఆ దేవతల ద్వారా వర్షములను మన కందించును. దేవలోకములకీ పదార్థమును తీసుకొనిపోవుటకు ఆ పదార్థ మును రూపాంతరము నొందించును దానికి అపూర్వమని పేరు.

మఱియొక ప్రశ్న.

వేదము చెప్పిన ఈ యజ్ఞములయందు పశుహింస ఉన్నదిగదా? ఇట్లు పశువుల హింసించుట మానవతయేనా? అహింసా సిద్ధాంతమును చెప్పక హింసను బోధించిన వేదములు ఎట్లు గ్రాహ్యములు? అనునది కూడ ప్రశ్నయే, కావుననే బుద్ధుడు హింసాపూర్వక వేదకర్మ కాదని అహింస స్థాపించినాడు అనువారును కలరు.

వారిని నే నడుగుచున్నాను

హింసయన ప్రాణిపీడనము, ప్రాణుల బాధించుట. ప్రాణులవలన మానవులను పశుపక్ష్యాదులేకాదు చెట్లుకూడ ప్రాణము కలిగియే యుండును. మనకు పండు పంటలు ప్రాణములేక ఎదుగవు. మనము త్రాగు నీటియం దనేక సూక్ష్మ జంతువులున్నవి. భూమియం దనేక ప్రాణులు మనకు కనబడకుండగనే చరించును. ఇందు దేనిని పీడించి చంపినను హింసయనుటలో సందేహము లేదు. బుద్ధుడు అన్నమును తినుమనెనా? వద్దనెనా? అన్నము దున్నకరాదు. దున్నునపుడు కొన్ని జంతువులు చావక తప్పదు. దేశముపైకి శత్రువులు దండెత్తి వచ్చుచో దేశరక్షణకై యుద్ధము చేయుటయా? మానుటయా చేయుచో హింస యగును. చేయకున్న ముప్పు వచ్చును. బుద్ధుని సిద్ధాంతమున పుణ్యపాపములను నవి ఉన్నవా? ఉన్నచో వాటి రూపమేమి? వాటిని నిర్ణయించున దెవరు? కావున బుద్ధుడు చెప్పిన అహింసకు ఒక రూపము లేదు. వైదికమతమున అహింసను వేదము చెప్పినది. హింసనుకూడ వేదము నిషేధించినది. "మాహింస్యాత్సర్వ భూతాని" అన్నది వేదమే. అగ్నీషోమీయం పశుమా లభేత" అగ్నీష్టోమమను యాగమునందు పశువును ఆలభన చేయుము అని చెప్పినదియు వేదమే. అనగా యజ్ఞమునందు చేయు పశుహింస హింస కాదన్నది. దేవతల నుద్దేశించి చేయుటచే అందు రాగము లేదన్నది. నీకొరకై చేయు హింస పాపకృత్యమన్నది. యుద్ధమునందు సైనికుడు తుపాకిని పేల్చి శత్రువును చంపుచో అది నేరముకాదు. ఆ సైనికుడే తన స్వంతముకై ఇష్టుడు కాని వానిని పేల్చి చంపుచో నేరమన్నది రాజ్యాంగము. సంతానమునకై పెండ్లిచేసికొన్న భార్యయందలి కామానుభవము నింద్యముకాదు. ఇతర స్త్రీయందు కామానుభవము నేరము. నేరస్థులను రాజశాసనము ననుసరించి ఉరితీయుడని సేవకులకు న్యాయస్థానాధికారి ఆజ్ఞ యిచ్చుచో ఆతడు నేరస్థుడు కాడు. ఆతడే న్యాయస్థానమున కాక వేరొకచో కూర్చుని ఎవరినైన ఉరితీయించుచో నేరస్థుడన్నది రాజశాసనము కావున వేదమతము హింసాహింసల చక్కగా పరిశీలించి ఏ హింసా కృత్యము ప్రజారక్షకమో ఆ హింస అహింస. ఏ అహింస దేశమునకు ఉపద్రవమును కలిగించునో ఆ అహింస హింస యేనన్నది. హింసచేయని వాడు లేడు ఇజ్జగమున. హింసకు ఎడగలిగి ఏగవలయునన్నది. భారత యుద్ధము ఈ సిద్ధాంతము పైననే జరిగినది. కావున వేదము విధించిన విధి కనుక యజ్ఞము నందలి పశు

హింస కాదు. పాపము రాదు. స్వర్గము కూడ వచ్చును. ఆ పశువునకు కూడ స్వర్గము కల్గించినది వేదము. ఇక్కడ మరొక్క విషయమును చెప్పెదను.

యజ్ఞములు రెండు విధములు. బాహ్యములు ఆంతరములునని. నేను చెప్పినది బాహ్య యజ్ఞమును గురించిన విషయము. రెండవది మానసిక యజ్ఞము. ఈ యజ్ఞమునకు వెలుపలి ప్రపంచముతో పనిలేదు. దేశ కాలములతో పనిలేదు. కర్త యొక్క శరీరావయవములతో పనిలేదు. కర్త యొక్క మనోమయ శరీరము తోడనే ఈ యజ్ఞము నడచును. ఈ యజ్ఞము నందుండదగు పశువులును, ఋత్విక్కులును, భార్యయు, అగ్ని హోత్ర వేదికలును, దర్భలు, సమిధలు, హవిస్సు, నేయి మొదలగున వన్నియు మనస్సు చేతనే అంతఃకరణమున కల్పితములై భావనా మాత్రము లగును. కాని బాహ్యమగు యజ్ఞమే ఇందు భావింపబడవలెనన్న బాహ్యమున ఆచరింపదగిన వాటిని ఆచరించిన గాని మనస్సు నిలువదు. కావున ముందు బాహ్య యజ్ఞమును చేసి ఆ పుణ్య ఫలముచేత భావనారూప యజ్ఞమును నిర్వర్తింప వలెను. దీనికి నిష్కామకర్మ యనిపేరు. ఇంతవరకు వేదములందు వర్ణితములైన బాహ్యకర్మ భాగములోని హింసాభాగము హింసా రూపమును తాల్పదనియు, అది పాపహేతువు కాదనియు కర్తయొక్క లక్ష్యము ననుసరించి భావము ననుసరించి పుణ్య పాప ఫలములు పుట్టుననియు మీకు తెలిపినాను. ఇక కథా ప్రపంచమున ప్రవేశింతము.

మనము దశరథుని అశ్వమేధయాగ ఘట్టము నందుంటిమి. ఈ యాగమునకు ప్రతి కళ యందును ఆరితేరిన విద్వాంసులు కావలెను. ఆ యాగమున రాజు ందరను సత్కరించవలెను. ఎవ్వరిని గూడ నిరాదరముగ చూడరాదు. అన్ని ర్ణములకును భూరిగ అన్నదానము చేయవలెను. దేశ దేశములకు ఆహ్వానముల ంపి రాజుల రప్పించవలెను. విద్వాంసులను గూడ అంతియే. ఆయాగ పట్టణమున చేయరాదు. దశరథుడు తన యాగము చక్కగ నెరవేర్పుడని వశిష్ఠునిఅర్థించినాడు. ఆ మహర్షియు తన పరిపూర్ణ కరుణా కటాక్షముల రాజుపై బరపి తల యూపినారు. యాగమిక ప్రారంభము కావలెను.

యాగశాలలు సరయూ నదికి ఉత్తర దిగ్భాగమున శాస్త్రానుబంధములై గణిత శాస్త్రజ్ఞుల సాయముతో నిర్మితములైనవి. అట్లే ఆ యాగమునకు కావలసిన ఉపకరణము లన్నియు ఆ యా వస్తువుల తయారుచేయు నిపుణుల చేతనే యథా

శాస్త్రీయములుగ తయారుకాబడి వచ్చినవి. కుమ్మరులు ఇటికలను ఆ యాగమునకు పనికివచ్చునట్లు తయారు చేసినారు. వడ్రంగులు స్రుక్కు-స్రువము, చమసపాత్ర మొదలగు హోమము చేయు పరికరములను అందించినారు. బావుల త్రవ్వువారు దిగుడు బావుల తీర్చిదిద్దినారు. ఆ యాగ మంటపముల ననుసరించి అనేక భవనములు నిర్మితములైనవి. అవి నాలుగు వర్ణముల వారికిని ప్రత్యేక ప్రత్యేకములై పంక్తులు తీరియున్నవి. రాజ భవనములు ప్రత్యేకములై నిర్మింపబడినవి. ఋత్విగ్వర్యు లందరును తమ తమ శిష్య గణములతో విచ్చేసినారు. నట నర్తక సంఘములు వచ్చినవి. సంగీత కళాభిజ్ఞు లేతెంచినారు. చిత్ర లేఖకులు వచ్చినారు. పాకశాస్త్ర నిపుణు లేతెంచినారు. సువాసన గల గుబాళించు సుగంధ ద్రవ్యముల తయారు చేయువారు ద్రవ్య సంచయముల నందించినారు.

ఇందు జనక చక్రవర్తికిని కేకయ రాజునకును సుమంత్రునిచే ప్రత్యేకాహ్వానము నంపగా వారును విచ్చేసినారు. అట్లే ప్రాచీన సింధు, సౌవీర, సౌరాష్ట్ర దాక్షిణ్యాది రాజన్యు లందరును దశరధుని ఆహ్వానముల నందుకొని తమ తమ మిత్ర బృందములతో వచ్చినారు. గ్రామసీమల నుండియు అన్ని వర్ణముల వారును సకుటుంబములుగనే వచ్చుట జరిగినది. అందరకును ప్రత్యేక ప్రత్యేకములగు వసతులు లేకపోలేదు. ఇక దశరధుడు యాగశాలల ప్రవేశింపవలెను. కౌసల్యా సుమిత్ర కైకేయిలతో ఋత్విగ్వర్యులతో కలిసి, ఋష్యశృంగుని ముందిడుకొని యాగప్రదేశము నలంకరించినారు.

ఈ అశ్వమేధయాగము నందలి అశ్వమును గూర్చి మీకు కొంత విషయము చెప్పవలసి యున్నది. ప్రజాపతి యొక్క దక్షిణ నేత్రము జారి క్రిందపడగా ఆ నేత్రమే అశ్వమైనదట. కావున ఈ అశ్వము ప్రజాపతియే,

ఇది వేదములోని కథ. ఈ అశ్వమేధ యాగమునకు ప్రారంభ కాలము వసంతము. అశ్వమును చైత్ర ప్రారంభమున వదలుదురు. అది రక్షకుల తోడను కొందరు ఋత్విక్కుల తోడను తిరిగి పదకొండు మాసములు దాటగా నగరమునకు చేరి రధకార గృహమున బంధింపబడును. పండ్రెండవ మాసమున యాగశాలలు నిర్మింపబడును. అనగా ఫాల్గుణ మాసమున. ఆ మాసముననే అమావాస్యయందు యాగశాలా ప్రవేశము జరుగును. ఈ యాగమున అశ్వము ప్రధానమగు పశువు. ఇతర పశువులు కూడ అంగభూతములై యుండును యాగ నిర్వహణకు

ప్రధానములగు పాత్రలు ఋత్విక్కులు. యాగమును బట్టి ఋత్విక్కులు చాల మంది యుందురు. అందు ప్రధానులగు వారు నలుగురు. అధ్వర్యుడు, ఆగ్నీధ్రుడు హోత, బ్రహ్మ అనువారు. వీరుగాక ఉద్గాత, సుబ్రహ్మణ్యుడు, మైత్రావరుణుడు, ప్రస్తోత మొదలుగా గల వారుందురు. అందు అధ్వర్యుడు ప్రధాన పాత్రయై దేవతలకు హవిర్భాగములనందించును. ఆగ్నీధ్రుడు అధ్వర్యుడువీరు హవిర్భాగము నందించుచుండును. తాము దయతో స్వీకరింపుడని దేవతల చెవి కింపుగ పలికి తెలియజేయును అధ్వర్యుని కోరికపై తరువాత హోత అనుమతించును. హోత అనుమతించగా అధ్వర్యుడు హోమము చేయును. ఈ సంభాషణము వారిష్టము వచ్చినట్లు చేయకూడదు. అధ్వర్యుడు "ఆశ్రావయ" అని హవిస్సును చేత నిడు కొని పలుకును. ఆగ్నీధ్రుడు "అస్తుశ్రౌషత్" అని చెప్పును. ఇవి వేదములో పదములే. ఆ పదములనే ఉచ్చరించవలెను గాని వేరు వర్ణముల నుచ్చరింపకూడదు ఆశ్రావయ అనగా ఓ ఆగ్నీధ్రా! నేను హవిర్భాగము నిచ్చుచుంటినని ఆ దేవతకు తెలుపుము తప్పక తీసుకొనుడని ఆ దేవతకు ప్రీతిని కల్పింపుము అని అర్థము.

("హే ఆగ్నీధ్ర యక్ష్యమాణా దేవతాం ప్రతితుభ్యమిదం దీయత ఇత్యాఖ్య ముఖ్యేన ఆశ్రావయ") ఈ విషయమునే ఆగ్నీధ్రుడు అట్లేనని అంగీకరించి తెలుపును. అస్తుశ్రౌషత్ అని. అస్తు అనురెండక్షరములతో అట్లేనని అధ్వర్యునకు సమాధాన మిచ్చి, శ్రౌషత్ అని దేవతలకు తెలుపును ఇట్టి సంభాషణలతో నడచును యజ్ఞము. ఆ కర్మను వేదము చెప్పిన విధముగనే నడపవలెను కల్పసూత్రము ఆ యజ్ఞ విధానమును చెప్పును మీమాంసాశాస్త్రము వేద కార్యములను సమన్వయించును. వాటి ననుసరించియే ఋత్విక్కులు చేయించవలెను.

"కర్మ కుర్మన్తి విధివత్యాజకా వేదపారగాః
యథావిధి యథాన్యాయం పరిక్రామంతి శాస్త్రతః
ఇది యాగ మంటపములోని విషయము.

ఈ కర్మకాండయందు కొన్ని దోషములు సంభవించుట కలదు. అందుకు గాను ప్రాయశ్చిత్తకాండను కూడ చెప్పినది వేదము. ఆ దోషములు కొన్ని ప్రమాదమువలన కలుగగా కొన్ని అజ్ఞానమువలన కలుగును. మరికొన్ని సామర్థ్యము వలన కలుగును.

దేవతలకు హవిర్భాగముల నిచ్చునప్పుడుగాని ప్రయోగవిధుల వదుపు నప్పుడుగాని ఉచ్చరించు మంత్రములందు స్వర వర్ణ పర్యాసములు వచ్చుట

ఋత్విక్కుల అసామర్థ్యము. అట్లే దేవతలకు హవిర్భాగముల నిచ్చునప్పుడు ఆ హవిస్సులు జారి క్రిందపడుట ప్రమాదమువలన వచ్చుదోషము. అంతేగాక ఒక మంత్రమునకు బదులు మరొక మంత్రమును ఉచ్చరించుట తడబాటు- ఇట్టిదోషము లేదియును కలుగకుండ దశరథుని అశ్వమేధము నడచుచున్నదని వాల్మీకి వర్ణించినాడు.

"నచాహుత మభూ త్తత్ర స్ఖలితం వాపి కించన

మరొక్కమాట. ఇందు శబ్దోచ్చారణ చాల ప్రధానము. అందును వేద మంత్రములు అనుదాత్త ఉదాత్త స్వరితాది స్వరములతోకూడి, ఆ స్వరములకు ప్రత్యేక ప్రత్యేక అర్థములతో కూడియున్నవి. స్వరలోపము మంత్రమునకు కలుగుచో అర్థము మారి వేరొక అర్థము వచ్చును. స్వరవిపర్యాసము కలిగియే దేవేంద్రుని జయించుటకై పుట్టించిన వృత్రాసురుడు ఆతని చేతిలో చచ్చినాడు

ప్రస్తుతమగు దశరథుని అశ్వమేధమున ఋత్విక్కులందరును తడబాటు లేక శిక్షాక్షర సమన్వితములగు వర్ణోచ్చారణలతోడనే హవిస్సుల నందించగా దేవతలా హవిస్సు లందుకొనుట జరుగుచున్నది. అయ్యును ఆ యాగమున ఉపద్రష్టలు లేకపోలేదు. ఉపద్రష్టలన ప్రత్యేక క్రియా పరిశీలకులు, అ యాగ మంటపమున కలంకారమును గూర్చు మహా విద్వాంసులెందరో సదస్యులై, ప్రతి ఒక్క విద్వాంసుడును నూరుమంది శిష్యులతో కూడి ఆ సభకొక ప్రత్యేకతను కల్పించినారు. మరొక ప్రత్యేకత ఏమన అంపరి ఋత్విక్కులు ఆకలిదప్పులకు వశమైన వారు కాకపోవుట నాటి ప్రత్యేకత. సదస్యులందరును ద్రష్టకై కాలమును గడుపుట కాదు, కర్మకాలమున కాక విశ్రాంతి కాలమందు వారు కర్మ మీమాంసల చేయుచు వైదిక సరస్వతిని ఆరాధించుచుండిరి. మన మొక్కమారు మారు దశరథేశ్వరు డందించు నాటి అదిధి పూజా సత్కారముల కడ కేగుదుము. అంతకుముందు పాకశాలల దగ్గరకు పోదము.

ప్రతి పాకశాలయందును అన్నకూటములు పర్వతములవలె కన్పట్టుచున్న వే గాని పరిమితములగు పాత్రలయందు మాత్రమే పూర్ణములై లేవు. పాకశాలలకు సంఖ్యలేదు భుజించువారికి సంఖ్య కలదా? అది అసంఖ్యాక జనసమూహము. ఆ సముదాయమునంకతకును తీర్చిదిద్దినట్లు భోజనపసతులు కల్పించుట ఆ

రాజన్యుని ప్రత్యేకత యనకతప్పదు. ప్రతిపక్షమునకును వారికి వారికి తగినట్లు భోజన వసతులు కల్పింపబడినవి- అందెందరో తాపసు లుండిరి. వారి కందదగునవి కందమూలములు. వండిన వంటకములు వారు భుజింపరు. బ్రాహ్మణులెందరో గృహస్థులై వైశ్వదేవాది విధుల నిర్వర్తించు శిష్టులందుండిరి. వారికి సంస్కృతములగు అన్నములే అందుచున్నవి. (వైశ్వదేవమన ప్రతినిత్యమును దేవి యజ్ఞ పితృయజ్ఞ భూతయజ్ఞ మనుష్యయజ్ఞముల నిర్వర్తించి, అన్నదోషమును భుజించుట) రాజాన్నములను ఆ శిష్టులగు బ్రాహ్మణులు భుజింపరు. శూద్రులెందరో ఆ యాగమును చూడవచ్చిరి. ఆకలిబాధల కోర్వజాలనివారికి తగు కాలములయందే భోజనవసతులు కూర్చబడినవి. వీరందరిట్లుండ వ్యాధిగ్రస్తులును ఆ యాగము చూడరాగా వారికి ప్రత్యేకములగు పథ్యాహారము లందుచున్నవి. మరి ఆ యాగమునకు సన్యాసులురాలేదా? వచ్చినారు. సన్యాసులకును యోగులకును సాత్వికాహారములు ప్రత్యేకములై నవిగాని జనసమూహమునసే వారిని కలుపలేదు. ఈ విషయమంతయు వాల్మీకి వర్ణనయే. ఈ వర్ణనయందు మనము గ్రహించవలసినదేమి? నాడు ఏ జాతికిని తక్కువతనము నివ్వలేదని స్పష్టముకాగా నేడు ధనవంతులకు అందరకును సుఖభోజనముల వారివారి ఇచ్ఛవచ్చినట్లు కూర్చొనుచు బీదల యన్నదానమునకు పప్పుచారుమెతుకుల వేయుచు అసమానతను తొలగించుట మా లక్ష్యమనుటలో ఎంత సత్యమున్నదో మీరే యూహించుకొనుడు.

ఈ ఘట్టమున ఆ యజ్ఞవాటమునందు వండి వడ్డించువారి నొక్కమాటు మీ కన్నుల ఎదుటనుంచుట నాకు ముఖ్యము కాకపోదు.

అచ్చట వడ్డనల చేయువారు మకిలి గుడ్డలు కట్టుకొని చూచుటకు రోత పుట్టించువారు కారట. అలంకృతులగువారే వడ్డించుచుండిరట. అందును కొందరు ముఖ్యులు కాగా వారి ననుసరించి మరి కొందరు వడ్డనల సలుపుచుండిరటు. వారును చక్కని దుస్తుల ధరించి మణికుండలముల ధరించి చూపరుల నాకర్షించుచు వడ్డనల గావించుచుండిరట.

ఉపాసతే చ తానన్యే సుమృష్ట మణి కుండలాః

ఇట్లు వాల్మీకి మహర్షి ఏ ఒక్క చిన్న విషయమును కూడ వదలక భారతీయ శాస్త్ర విధులలోని ప్రత్యేకతను చాటుచు కావ్యశిల్పమును తన మధుర వాఙ్మయమున చదువరులకు కన్నుల ఎదుట నుంచినారు. వైదిక విజ్ఞానము కలవారా

యాగమును కంటితో చూతురు. మీకు హింసాహింసల గూర్చి ముందుగనే చెప్పినాను.

శాస్త్రమును ప్రమాణముగ గ్రహించిననే ఈ యజ్ఞీయ విశేషములు సమన్వయములగును గాని కేవల హేతువాదమును చేయు వితండవాదులకు సమాధానము లేదు. కన్నులు లేకున్న రూపమును చూసజాలము. జ్వరార్తునకు పంచదారలోని తీపిని తెలుపజాలము. వేదములను నమ్మనివారికి యజ్ఞఫలములనుగూర్చి ఎట్లు చెప్పగలము। అయ్యును చెప్పుచున్నాను జిజ్ఞాసువులకు. విధిపూర్వకమగు హింసకు అహింస యనిపేరు. కావున వేదవిహిత యజ్ఞము పశుహింసయనిపించుకొనదు. ముందుకు పోదము.

అశ్వమేధము విధివిహితముగ నెరవేరినది.

యజ్ఞఫలమును సంపూర్ణముగ అందచేయునది దక్షిణ. దశరథనరేంద్రుడు యజ్ఞము సమాప్తము కాగా ఋత్విక్కులకు నాలుగు దిక్కులను దక్షిణగా నిచ్చినాడు. అనగా తన సామ్రాజ్యమునంతను ఋత్విక్కులచేత బెట్టినాడు. నాలుగు దిక్కులను నలుగురకు సమర్పించినాడు. చాలమంది ఋత్విక్కులున్నను ప్రధానులగు నలుగురకును సమర్పించినాడు. ఈ దిక్కులకు మీరే ప్రభువులని ధారాదత్తము గావించినాడు. ప్రస్తుతమున రాజునకేమి మిగిలినది? మరల అతనికి రాజ్య మెక్కడిది? అనునవి ప్రశ్నలు.

నాటి ఆ బ్రాహ్మణులు భౌతిక ధనమును ఆశించిన ఋత్విక్కులుగారు. కమండలములు వారి హస్తములకు భూషణములు, భూమండలములు కావు. దర్భాసనములు వారికి సుఖాసనములు,

ధర్మ పరిపాలకుడగు రాజునకు సహాయకు లయ్యేనాడు బ్రాహ్మణు లుండిరి గానిరాజ్యాధికారముల వారు ఆశించలేదు. మరి వచ్చిన లేక ఇచ్చిన రాజ్యమును వారేమి చేసిరి ?

> "న భూమ్యా కార్యమస్మాకం న శక్తాస్మ పాలనే
> రతాః స్వాధ్యాయకరణే వయం నిత్యం హి భూమిప
> నిష్క్రియం కించిదేవేహ ప్రయచ్ఛతు భవానితి

బ్రాహ్మణులకు రాజ్యము లెందుకు? మేమి రాజ్యమును పాలింప సమర్థులము కాము గనుక వేదాధ్యయన తత్పరులమగు మాకు ఆ భూమికి వచ్చు

మూల్యము నిమ్మని అడిగినారు. కాదేని మణిరత్న సువర్ణములలో దేని నైన యిమ్మని సమాధానమిచ్చి భూమిని వదలుకొనినారు. దశరధుడు వారి కోర్కెను నెరవేర్చగా అశ్వమేధము సమాప్తమైనది. ఒక్క మాట. ఈ అశ్వమేధ క్రతు విధానమును మీకు సంగ్రహముగ చెప్పినాను. దీనివలన కలిగిన ఫలమేమి? దశరధునకు పుత్రప్రాప్తి ప్రతిబంధకము తొలగినది. తరువాతది పుత్రకామేష్టి యాగము.

## పుత్ర కామేష్టి

పుత్రకామేష్టి యాగము ఋష్యశృంగుని ప్రత్యేక కార్యక్రమము. అతడా విధానమునందు సిద్ధహస్తుడు. ఆ పుత్రకామేష్టి అధర్వణ వేదములోనిది "అధర్వ శిరసి ప్రోక్తం" అని వున్నది. దశరధుడు ఋష్యశృంగుని ప్రార్థించినాడు. ఆ మహర్షి వచ్చినది అందుకేగదా ?

దశరధునకు పుత్ర ప్రాప్తికాలము సమీపించినది. ఋష్యశృంగునిచే వేది కాంతర్భాగమున అగ్నిమండలము వెలుగొందినది. పుత్రకామేష్టి యాగమునందలి మంత్రరాజములు మహర్షి ముఖముగ వెలువడి ఆ యాగమునకు అధిష్ఠాన దేవతల నందరును వారి వారి స్థానముల నుండి కదలించినవి. అదియే శబ్ద శక్తి.

ఏ శబ్దమైనను ఉచ్చరించువాని అర్హత ననుసరించియే అది రూపొందదగు శక్తి కలదగును. అనధికారు లుచ్చరించు శబ్దము ఫలవంతము కానేరదు. అధికారి యగు వాడు నిన్ను శిక్షించితినన్న పదము నుచ్చరించగా ఆ పదము శిక్షా స్వరూప మును సృష్టించును. అనధికారి నిన్ను శిక్షించితినని ఎదిరి వానిని అనుచో అది ఫలవంతము కాదు.

కధకు వస్తము

అది దశరధేశ్వరుని పుత్రకామేష్టి యాగమంటపము. వైకుంఠమునుండి శ్రీ మహావిష్ణు వేతెంచినారు. సత్యలోకము నుంచి చతుర్ముఖ బ్రహ్మయు, ఇంద్ర లోకము నుండి దేవతలతో కూడి ఇంద్రుడును వచ్చుట జరిగినది. వీరి కూడిక ఇది రెండవసారి. లోక కంటకుడగు రావణుని సంహరించుట ఎట్లు? అను సమస్య పరిష్కారమునకే నేటి సమాగమము కూడ. ఇంతకు పూర్వమొకప్పుడు శ్రీమహా

విష్ణువును ఆశ్రయించుటయు ఆతడు రావణుని వధింతునని దేవతల కభయ మిచ్చు టయు జరిగినది. అయ్యేను ఇది మహా విష్ణువు దశరథునకు పుత్రుడై పుట్టు సమయము కావున మరల ఆతని శరణు పొంద దేవత లందరు సబ్రహ్మతో కలసి వచ్చినారు. శంఖచక్రగదాపాణి యగు నారాయణునకు బ్రహ్మ ముఖముగ రావణుని బాధల చెప్పి మొరబెట్టుకొనినారు. ఆతని వధించుటకు మనుష్య శరీరధారివి కమ్మని వారే ఉపాయము చెప్పినారు. చెప్పుట కాదు. కోరినారు. నిజమునకు భగవంతునకు జన్మలేదు. మాతా పితరులును లేరు. ఆతడు శరీరధారియగుట నామమాత్రమే. అదియు జీవుల కోరిక ననుసరించియే. తన్నాశ్రయించిన వారి శరణాగతి ఫలమే భగవానుని అవతారము.

శ్రీ మహావిష్ణువు రావణుని సంహరింపదగునది మానవ శరీర మొక్కటే గావున తాను దశరథునకు పుత్రుడనై పుట్టుదుననియు, నాతోగూడ మీరందరును వానర శరీరధారులై భూమిపై అవతరింపుడనియు దేవతల కాజ్ఞ యిచ్చి శ్రీ మహావిష్ణువు అంతర్ధాన మయ్యెను. బ్రహ్మయు దేవతలును అంతర్ధానమైరి. అంతటితో నాటి రహస్య సమాలోచన సభ ముగిసినది దేవతలకు. ఆ విష్ణు తేజము అంతర్ధానమై ఎక్కడ కేగినది? దశరథుని పుత్రుడ నగుదునని స్మరించినది ఆ విష్ణు తేజము.

మనమిక దశరథుని కొరకై ఋష్యశృంగుడు గావించు పుత్రకామేష్టి హోమగుండమును దర్శింతుము.

దశరథేశ్వరుడు పుత్రార్థియై ఋష్యశృంగ మహర్షి వారు గావించు హోమానలముపై దృష్టుల బంపి ఏకాగ్రచిత్తమున కూర్చొనినారు. యజ్ఞ వేదిక యందలి అగ్నిమండలము ఋష్యశృంగు డందించు ఆహూతులను తన నాలుకల సాచి అందుకొనుచున్నది. ఆ యజ్ఞ భూమి నుండి శ్రీ మహావిష్ణువు అంతర్ధానమగుట తడవుగా విష్ణుతేజము మహర్షి వారుచ్చరించు మంత్ర వర్ణముల రూపమునొంది ఆ అగ్ని మండలమున ప్రవేశించినది.

మన చూపుల నొక్కమారు ఆ అగ్ని మండలము వైపుకు త్రిప్పుదము. దశరథు డక్కడనే యుండెను గదా! ఆ దశరథుని చూపులతో మన చూపులను కూడ కలుపుదము. ఆ అగ్ని మండలము నుండి ఒక మహాపురుషుడావిర్భవించి

దశరథునకు సాక్షాత్కరించినాడు అతడు ప్రాజాపత్య పురుషుడు. అనగా యజ్ఞ పురుషుడు. అదియే అంతర్ధాన మొందిన విష్ణు తేజము. రూపము మారినది.

ప్రాజాపత్య పురుషుని ఆయప్రాకృత దేహము కృష్ణవర్ణముననే భాసించినను ఆతని ముఖ మండలము మాత్రము రక్త వర్ణమున భాసించినది. అతడు ధరించిన వస్త్రమును రక్త వర్ణముననే వెలుగొందుచున్నది. ఆతడు దుందుభిధ్వానమును గావించుచు వెడలి వచ్చినాడు. ఆతని గమన వేగ మప్పుడెట్లుండెను? అతి దర్పాన్వితమగు శార్దూలము ననుకరించుచుండెను. ఆతని దేహ కాంతులు చూడరానివై యుండెను. ఆ యప్రాకృత దేహమునుండి వెలువడి వచ్చు కాంతి పుంజమును సూర్యాగ్ని మండలము వలెనున్న దనుటకు సందేహ మేమున్నది? ఆ మండలములు రెండును ఒక్క చోటనే సాక్షాత్కరించినట్లున్నది ఆతని దేహకాంతి. ఆతని కంఠసీమ కలంకారములై ఆతని విశాల వక్షస్థలమున వెలుగొందు దివ్య మణి విభూషణావళులు అద్భుతములై కన్పట్టగా నిక్కపొడిచియున్న ఆ మహనీయుని శరీరమునందలి వెంట్రుకలు సింహ కేసరముల ననుకరించి దట్టములై శిరోజములతో కలసి చూపరుల కాశ్చర్యము గొలుపుచున్నవి. ఆ విగ్రహమును దర్శించగనే ఇది యొక పర్వతరాజమనిపించి భయము కలుగవచ్చును కూడ అట్లా తడొక్క మహా పురుషుడై సాక్షాత్కరించుట కాదు, ఆ యజ్ఞ పురుషుని చేతులందొక విచిత్రమగు పెద్ద పాయసపాత్ర కూడ యున్నది. అది జాంబూనద సౌవర్ణ వినిర్మితము. కాని ఆ పాత్రపై ఒక మూత కూడ పెట్టబడి యున్నది. అది రజితముచేత నిర్మితమైనది. ఆపాత్రలోపల నున్నది దేవనిర్మితమగు పరమాన్నము.

ఆ పరమాన్నము నా మహాపురుషుడు దశరథున కందించుటకై ఏతెంచినాడు. కావున దశరథుని సంబోధించి, తానెవ్వరో తెలుపుకొనినాడు.

ప్రాజాపత్యంనరం విద్ధి మా మిహాభ్యాగతం నృప.

రాజా! నన్ను ప్రాజాపత్యపురుషునిగా నెరుగుమనినాడు. దశరథుని సంతోషమునకు సీమ ఎక్కడిది? తలవంచి దోసిలియొగ్గి ఆ పురుషుని ఆజ్ఞను కోరినాడు. ఆ పురుషుడు చెప్పినదిది.

ఇదం తు నృపశార్దూల పాయసం దేవనిర్మితం
ప్రజాకరం గృహాణ త్వం ధన్యమారోగ్య వర్ధనం
భార్యాణామనురూపాణాం మశ్నీతేతి ప్రయచ్ఛ వై
తాసు త్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప.

మహారాజా! ఇదిగో ఇది దేవ వినిర్మిత పరమాన్నము ఇది పుత్రప్రదము. దీనిని పరిగ్రహించి నీ భార్యలకు భక్షింపుమని ఇమ్ము. నీ పట్టమహిషులయందు నీవు తప్పక పుత్రుల బడయుదువని చెప్పి. ఆ పురుషు డంతర్ధానమునొందెను. మహారాజు ఆ దివ్యపురుషునకు ప్రదక్షిణ మాచరించి, ఆ పరమపురుషు డందించిన ఆ పాయసపాత్రను చేతనందుకొని దరిద్రున కిచ్చిన పెన్నిధిచందమున సంత సించి, ఆ హిరణ్మయ పాత్రను చేత నిడుకొని అంతిపురమునకు పయనమయ్యెను. యజ్ఞపురుష డంతర్ధానమయ్యెను.

అది దశరథుని అంతఃపురము. కౌసల్యా సుమిత్ర కైకేయీలు ముప్వు రును అచ్చటనే యుండిరి సంతోషస్వాంతుడైన దశరథు డాయంతఃపురమున కేగగా ఆ సువిశాలభవనమున కొక నూతనత్వము వచ్చినదీనాడు. అది శరత్కాల చంద్ర చంద్రికలతో వెలుగొందు సువిశాలాకాశము వలె వెలుతురై యుండగా అందున్న ముప్వురు భార్యలకును అతడు దేవపాయసము నందించినాడు. ఆ విధాన మిది.

## పాయస విభాగము

కౌసల్యాయై నరపతిః పాయసార్థం దదౌ తదా
అర్థాదర్థం తదౌ చాపి సుమిత్రాయై నరాధిపః
కైకేయ్యైచావ శిష్టార్థం దదౌ పుత్రార్థ కారణాత్
ఏవం తా సాం దదౌరాజా భార్యాణాం పాయసం పృథక్.

మొట్టమొదట ఆ పాయస పాత్రలోని సగభాగమును కౌసల్య చేతనుంచి నాడు. మిగిలిన సగములోని సగభాగమును సుమిత్రకు పంచినాడు. ఆ మిగిలిన సగభాగమును చేత నిడుకొని కైకేయి వద్ద కేగినాడు. నిజమున కా సగమును కైకేయి చేతికందించవలెను. కాని అట్లందించలేదు. ఆమెకు తన చేతిలో నున్న దానిలో సగభాగమునే ఇచ్చెను. ఆ మిగిలిన దెవ్వరి కివ్వదలచినాడు? ఆ కైకేయి కిచ్చిన తరువాత ఏదియో ఆలోచించెనట. "అనుచింత్య" అని వ్రాసినాడు వాల్మీకి. మరల ఆ సగభాగమును సుమిత్ర వద్దకు తెచ్చి సుమిత్ర కిచ్చెను. రెండు పర్యా యములుగా సుమిత్రకు పాయసము నందించినాడు. ఈ సందర్భమున కొన్ని చోట్ల దశరథుడు ముగ్గురు భార్యలకు స్వయముగా పంచలేదనియు, కౌసల్య,

కైకేయీలకు ఇద్దరికే అందివ్వగా వారిద్దరును చేరి సుమిత్రకు వారి భాగములనుండి పంచిరనియు ఉన్నది. కాని వాల్మీకము ననుసరించి పాయస విభాగ మింతియే. ముందుకు పోదము.

యజ్ఞము సమాప్తమైనది. ఋత్విక్కులు మొదలగు వారందరుమ తమ తమ స్థానముల కేగినారు. మన కథాభాగమున దశరథుని అంతఃపురమునకు వత్తము.

## భగవంతుని ఆవిర్భావము

భగవానుని దివ్యతేజము నాలుగు భాగములైనది. భగవంతుని తేజము నాలుగు భాగము లగుట ఏమిటి? భగవంతుని తేజము నాలుగుముక్కలగునా। దాని అర్థమదికాదు. అతడు నేనిట్లగుదునని సంకల్పించును. అతని సంకల్పమాత్రమే ఈ సృష్టియంతయు. "ఇచ్ఛామాత్రం ప్రభోస్సృష్టిః" అతడు నేనీ రూపముల నొందుదునని భావించును. అంతియే. నిజమున కాతనికి జన్మకర్మలు లేకున్నను భక్తులకొరకే అతని అవతారములు.

భగవానుని అఖండతేజము కౌసల్యా సుమిత్ర కైకేయీల హృదయ క్షేత్రముల పుత్రులగుటకు ప్రకాశింప మొదలై సంవత్సరకాలమైనది.

వసంతమున యజ్ఞము ప్రారంభముగదా? మరల వసంతము వచ్చినది. భగవానులు ఈ అఖండ భారతక్షేత్రమున తన చరణ కమలముల నుంచదగు కాల మాసన్నమైనది

అది చైత్రమాసము. శుక్లపక్షము. నాడు నవమి తిధి. పునర్వసు నక్షత్రము. గ్రహరాజగు సూర్యుడు మేషరాశియం దుచ్చస్థుడైయుండెను. చంద్రుడు తనకు స్వక్షేత్రమగు కర్కాటకమునందే యుండెను. బృహస్పతియు ఉచ్చస్థుడై ఆ చంద్రునితో కూడి యుండెను. శుక్రుడు మీనరాశి నధిష్ఠించెను. అది ఆతనికి ఉచ్ఛరాశి. శనియు ఉచ్ఛస్థుడై తులయందుండెను. అంగారకుడు మకరము నందుండెను. అది అతనికి ఉచ్ఛరాశి. ఈ విధముగ అయిదు గ్రహము లుచ్ఛయందుండెను.

అది మధ్యాహ్నకాలము. వసంతము కాలపురుషునకు ముఖమండలము పండ్రెండుగంటల కాలము విజయముహూర్తము. ఒకప్పుడు భగవానులు అదితి గర్భమునుండి వెలువడినది ఈ పండ్రెండుగంటలకాలముననే. కావుననే నాటి నుండియు ఆ సమయమునకు విజయముహూర్తమని పేరు వచ్చినది. ఈ ముహూర్తముననే నేడును భగవత్తేజము కౌసల్యా గర్భము నుండి వెలువడ సంకల్పించినది.

కౌసల్యా మహారాణి నేడు ఈ శుభసమయమున సర్వలక్షణసంపన్నమగు భగవత్తేజమును ప్రసవించి మాతృమూర్తియైనది. నిజమున కీతడు శ్రీమహావిష్ణువే శంఖచక్రముల చేత ధరించిలేడు అంతియే.

ప్రోద్యమానే జగన్నాథం సర్వలోకనమస్కృతం.
కౌసల్యా జనయద్రామం సర్వలక్షణా సంయుతాం.

కాని ఆమె అట్లు రాముని కని ఎట్లు భాసించినది? వాల్మీకమహర్షి ఆమె నిట్లు వర్ణించినారు.

కౌసల్యా శుశుభే తేన పుత్రేణామిత తేజసా
యథావరేణ దేవానామదితిర్వజ్రపాణినా.

ఆమె దేవేంద్రుని తల్లియగు అదితి వలె ప్రకాశించినదట ఇక్కడ కౌసల్యకును అదితికి ఉపమించి రాముని వజ్రపాణియని వాడినారు మహర్షి. కారణాలేమిటి? నాటి అదితియే నేటి కౌసల్య రాక్షస సంహారమునకై అవతరించిన రాముడు వజ్రపాణి దేవేంద్రు డెట్లు వృత్రాసురుడు మొదలగు రాక్షసుల సంహరించెనో రాముడట్లే రావణ సంహారము గావించి పరిపాలకుడు కాగలడని సూచించినారు. దశరథుడు కశ్యప ప్రజాపతియేనని తెలపినారు. నేడు కౌసల్య వీరమాతయైనది. అంతేగాక "అమిత తేజసాపుత్రేణ" అని వర్ణించి ఈ తేజము ఇంద్రాదులకు తేజము నొసంగు తేజమనియు అట్టి మహాతేజము దేశ కాలపరిమితములకు తన ఇచ్ఛచే పరిమితమై పుత్రత్వము నంగీకరించెననియు తెలిపినారు. మరి వజ్రాయుధమును చేతబట్టుకొని ఉదయించెనా? కాదు. కథా భాగమున వజ్రరేఖా విలసితమగు సుందర సుకుమార హస్తముతో ఉదయించెనని భావము. అంతేకాదు. అమిత తేజసా అనుటచేత సూర్యవంశము నందుద్భవించిన ఈతడు

సూర్యునకు సూర్యుడు సుమా। అని మనలను మేల్కొల్పినారు మహర్షి. తరువాత కథా భాగమున కేగుదము.

పునర్వసు తరువాతది పుష్యమీ నక్షత్రము. రాము డవతరించిన రెండవ రోజు తెల్లవారుజాము. నాడు సూర్యోదయమునకు ముందుగ ఉదయించు రాశి మీనరాశి ఆ రాశియందే కైకేయి భరతుని ప్రసవించినది. ఈతని నక్షత్రము మాత్రము పుష్యమి నక్షత్రము కావున చంద్రుడు కర్కటకమునందే యుండెను. భరతుడు రాముని తరువాతి వాడే అయ్యును గ్రహము లేవియును మారలేదు. లగ్నము మారినది. కర్కటకలగ్నము రామునిదికాగా మీనలగ్నము భరతునిదైనది. ఈతడీ గురు రాశియందు జననమంది వినిర్మలచిత్తు డయ్యెను. "మీనలగ్నే ప్రసన్నధీః" అనినారు వాల్మీకి.

రాముని యవతారమునకు కారణభూతమైన పాయసములోని నాల్గవ భాగమున ఈతడవతరించినాడు. అనగా రామునిలోని నాల్గవ భాగము లేక సాక్షాన్నారాయణునిలోని ఎనిమిదవ భాగమున జన్మించినాడు.

"సాక్షాద్విష్ణోశ్చతుర్భాగః" అని యున్నది.

సాక్షాద్విష్ణోః— వైకుంఠవాసినః చతుర్థాంశః చతురస్య అంశః అష్టమభాగ ఇత్యర్థః" తనిశ్లోకీ

చతుర్భాగః చతుర్న్యూనోభాగః చతుర్భాగః పాయసార్థస్య చతుర్థాంశ న్యూనోభాగః" తిలక వ్యాఖ్య

ఇక్కడ సాక్షాత్"అను పదమునకు రాముని వెంటనే అనుఅర్థము సూచించబడు చున్నదనియు లేక విష్ణువులోని గుణ సౌందర్యములు సూచించబడుచున్నవనియు వ్యాఖ్యాతలు సూచించినారు.

ముందుకు పోదము. ఎక్కడికి పోదము? సుమిత్రా మహారాణీ మందిరమున కేగుదము. ఆమె ఇద్దరు బిడ్డల నొక్కమారుగ ప్రసవించినది. ఆ బిడ్డలే లక్ష్మణ శత్రుఘ్నులు. వారు పుట్టిన నక్షత్రము ఆశ్లేషా నక్షత్రము. తిధి మాత్రము దశమి తిధియే. కైకేయి భరతుని సూర్యోదయమునకు ముందు ప్రసవించగా సుమిత్ర మధ్యాహ్న కాలమున కర్కటక లగ్నమునందే ఈ ముద్దుబిడ్డల నిద్దర ప్రసవించినది. భరతునకును లక్ష్మణ శత్రుఘ్నులకును గ్రహ సంపదయందే మాత్రమును మార్పులేదు.

ఈ లక్ష్మణ శత్రుఘ్నులు పాయసములోని భాగముల ననుసరించుట యందొక ప్రత్యేకత యున్నది. వీరి పుట్టుకలు పాయస విభాగముల మాత్రమే అనుసరింపక ప్రాశనల కూడ యనుసరించి కల్గినవి.

రూపాయలోని సగ భాగము కౌసల్య కందినది. నాల్గవ భాగము సుమిత్ర కందినది. కాని సుమిత్ర వెంటనే భుజించలేదు. కైకేయికి భాగము పంచుట పూర్తియగు వరకును ఆమె అట్లే యూరకుండెను కైకేయికి బేడ వంతు వచ్చినది. ఆమె భుజించినది. దశరథుని చేతిలోని పాయసము అంతతో పూర్తికాలేదు. ఇంకను మిగిల్చినాడు. కారణమేమి? కైకకంటె సుమిత్ర పెద్దది. ధర్మమును ఆలోచించి మిగిలిన భాగమును మరల సుమిత్రకు ఇచ్చెను "అనుచింత్య సుమిత్రాయై పునరేవమహీపతిః" అప్పుడు సుమిత్ర భుజించినది. కావున లక్ష్మణుడు నాల్గవ యంశము కాగా శత్రుఘ్నుడు ఎనిమిదవ అంశమున జన్మించుట జరిగినది. భాగముల రెండింటిని ఒక్క మారుగ భక్షించుటచే కవలలుగ జన్మించినారు.

కాని ఒక్క మాట.

కౌసల్యా కైకేయీలకే దశరథుని పాయస మందగా వారిద్దరును సుమిత్రకు ఇచ్చుట జరిగినదని ఇతర గ్రంథముల యందున్నను వాల్మీకమునందు మాత్రము అట్లు లేదు. కథకు వర్తము.

ఈ భూ ఖండమున భగవాను డవతరించినాడు. కాని ఈ యవతారము కేవలమగు భూ ఖండమునకు మాత్రమే సంబంధించినది కాదు. దేవ లోకమున కూడ ఇది యుత్సవ దినమనక తప్పదు. రావణుడు భూలోకమునకే కంటకుడు కాడు. దేవ లోకమునకు కూడ కంటకుడే. గావున రాము డవతరించగనే దేవ దుందుభులు మ్రోగినవి. ఆకసము నుండి పుష్ప వర్షము కురిసినది. అచ్చరమిన్నలు నాట్య మాడినారు. యక్షకిన్నర కింపురుషగణంబుయొక్క గానములు చెలరేగినవి.

"జగుః కలం చ గంధర్వా ననృతుశ్చాప్సరోగణాః
దేవ దుందభయోనేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్యుతా"

ఇక అయోధ్యను దర్శింతము.

ఆనాడు ఇంటింట నొక ప్రత్యేకమగు మహోత్సవము విలసిల్లగా రాజ మార్గము లన్నియు క్రిక్కిరిసినవి. నటవర్తక సంఘములతో సూత వందిమాగధ

గణముల కోలాహల ధ్వనులు ఆ నగరమున పెల్లుమీరగా పుత్రోదయ మహోత్స వము దశరథేశ్వరుని అంతఃకరణమున ఆనందసంద్రమై ఉప్పొంగగా సూతమాగధ వంది బృందమున కాతడిచ్చు ధనముమగాని బ్రాహ్మణ బృందమున కాతడందించు గోదానముల గాని ఎవ్వరు లెక్కింపగలరు ? వాల్మీకి మహర్షియే వేనకు వేలుగా ఇచ్చెననినారు.

"ధనాని సహస్రశః" అని వాడినారు. తరువాత కథ ఏమి?

వాల్మీకి మహర్షి భాగవతమున కృష్ణావతారమునందు బాల్య క్రీడల వర్ణించి నట్లు రామావతారమునందు బాల్య క్రీడావర్ణనను గావించలేదు.

"అతీత్యైకాదశాహం తునామ కర్మ తథా కరోత్"

పదకొండవ రోజు గడవగా దశరథుడు నామకరణ కర్మను గావించెనని నారు. నిజమున కిది పదమూడవ రోజు. ఎందువల్ల ననగా క్షత్రియులకు జాతా శౌచము పండ్రెండు రోజులు కావున పండ్రెండు రోజులు దాటెననియే ఈ శ్లోక మున కర్థము.

ఇంతవరకు జనన లీలా వైభవము ముగిసినది. జరుపవలసినది నామ కరణము.

అఖండ బ్రహ్మచైతన్యము నామ రూపాత్మకముకాదు. కాకపోదు. ఉపాస కుల కాధారమదియే. కావుననే కౌసల్య ఒడిలోనికి శ్యామసుందర విగ్రహమై శిశురూపమున సాక్షాత్కరించినది ఆ బ్రహ్మచైతన్యము.

వశిష్ఠ మునీంద్రులు ఆ యప్రాకృత శిశువునకు నామకరణము గావించినారు రాముడని.

ఇది యొక మధురమగు నామము. ఉపనిషత్సరస్వతి పలికిన నామము.

రమంతే యోగినోఽనంతే నిత్యానందే చిదాత్మని
ఇతి రామపదేనాసౌ పరంబ్రహ్మాభిధీయతే.

ఆనందఘనము, సద్రూపచిద్రూపమున వెలుగొందు ఆత్మయందే యోగులు రమించగా ఆ అఖండాత్మయే రామపదమున వ్యవహరించినదని, ఆ నామమునే వశిష్ఠ మునీంద్రులు పలికినారు. నిజమున కిది రెండక్షరముల పేరు. నోరూరెడు పేరు. భక్తశేఖరులకిది అమృతప్రాశనవలె నుండు నామము. ఈనామమే శివుడు పార్వతికి

యుపదేశించిన నామము కాశీక్షేత్రమున తను త్యాగముచేయు పుణ్యజీవుల దక్షిణ కర్ణమున (కుడిచెవి) ఈ తారకనామమునే విశ్వేశుడుపదేశించునట. నామమునకును నామికిని అభేదము. రామనామము ఆత్మారామునికి వాచకము. అంతేకాదు రెండు వర్ణములతో గూడిన ఈ నామము నెవ్వరైన జపించుచో మొదటివర్ణము అగ్నిబీజమగుటచే అ బీజము నుచ్చరించువారి అంతఃకరణమున వ్యాపించియున్న పాపపుంజమునంతను, దూదిగుట్టను దగ్ధము గావించు నిప్పుకవ్వవలె దగ్ధము గావించును తరువాత వర్ణము మవర్ణము అది చంద్రబీజము. అమృతకిరణుని అమృతకిరణప్రసారము పండువెన్నెలనీని తాపనివారణ గావించునట్లు ఆ మకారము ఉచ్చరించిన వారికి తాపత్రయ నివారకము కాగలదు. నిజమునకీ రాముడను వాడెవ్వ డైనను నేడీతడు దాశరథి. కౌసల్యానందవర్ధనుడు.

ఈ ఘట్టమున మీకు సప్తమహర్షులలో ఒక మహర్షి బోధించిన మనః ప్రబోధ గీతమును వినిపించెదను.

కర్ణా! కర్ణయ వైదేహీ వర వర్ణనీయ గుణ చరితం
నయనా లోకయ నళినయ ముఖ సుందరేందు బింబం
మస్తక! సంస్తుత మహిమానం నమ కస్తూరీ నికరాకారం
హరిమర్చ్చయ హస్తయుగ అవనీ పాలన మినకులరత్నం
భో! చేతః శ్రీరామంభజశరణం శ్రీరఘురామం భజశరణం.

ఓ! శ్రోత్రమా! నిత్యసత్యమై వెలుగొందు అ సీతాపతి వర్ణనీయ గుణ సంపదను వినుము. ఓ నేత్రమా! వికసిత పుండరీకములవలె ఆకర్ణాంత నేత్ర యుగళమున భాసిల్లుచు చంద్రమండలము వలె ఆహ్లాదమును గూర్చు శ్రీరామ చంద్రుని ముఖమండలమును దర్శించుము. శిరమా! మహామహిమాన్వితుడై అందరిచేతను స్తుతించబడుచు కస్తూరికా వర్ణ విలసితు రామచంద్రునికి వందన మాచరింపుము హస్తయుగళమా! ఇనకుల రత్నమగు ఆ రామభూపాలుని అర్చిం పుము, మనసా శ్రీరాముని సేవింపుము, అతనిని శరణుపొందుము. పొందుము. పొందుము. ఆ రఘురాముని శరణు పొందుము.

వింటిరా! ఈ గీతమును!

త్యాగయ్య కన్నులారగాంచి, మనసార ప్రేమించి, నోరూరపలికి, ముక్త

కంఠమున గానము గావించి తాను కృతార్థుడై అందర తరింపజేసిన దీ దాశరథి చరితమునసే. ఈ కౌశల్యా నందనుని గుణవర్ణమునసే. ఈ ఆత్మారాముని సేవించియే. ముందుకు పోదము,

వశిష్ఠమునీంద్రు లానవనీరదశ్యాముని కి నామకరణమును గావించి, కైకేయ్యానందవర్థనునకు భరతుడని పేరిడినారు, అది వారివంశము నందొకరి పేరు గానవచ్చును. లేక రాబోవు కథ ననుసరించి రాజ్యభార మీతనిపై కొంత కాల ముండునని గుర్తెరిగి పెట్టవచ్చును. తరువాతి వారు సుమిత్రా నందవర్ధనులు. అందొకడు భగవద్భక్తుడు, రాముని వదలి యుండడు. వేరొకడు భాగవత సేవకుడు. భరతుని వదలి యుండడు. వారిద్దరును లక్ష్మణ శత్రుఘ్నులు. ఆ శత్రుఘ్నుని నామము సార్థకముగనే ముని పలికినారు. "శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నః" ఈతడు నిత్యశత్రువులగు అరిషడ్వర్గములను జయించిన వాడని. ఈ విధముగ.

బ్రహ్మర్షివర్యులగు వశిష్ఠులు ఆ నలుగురు పుత్రులకును నాలుగు పేర్లనిడినారు.

జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకేయీ సుతం
సౌమిత్రిం లక్ష్మణమితి శత్రుఘ్నమపరం తథా.

తరువాత బ్రాహ్మణ భోజనమునేగాక పౌర జానపదుల భోజనాదులచే తృప్తిని గావించగా ఆ నామకరణ మహోత్సవము ముగిసినది. తరువాత చరిత్ర ఏమి?

తేషాం జన్మక్రియాదీని సర్వ కర్మాణ్య కారయత్.

ఇక్కడ మీకొక్క విశేషము చెప్పవలసియున్నది. ఆ పుత్రులకు జాతకర్మ మొదలు అన్నికర్మల నాచరించెనని వాడినారు మహర్షి. అనగానేమి? అన్నప్రాశన చౌలోపనయనాది సంస్కారములని అర్థము. "జన్మక్రియాదీని సర్వ కర్మాణి"

భరతఖండమునందు పుట్టిన ప్రతిఒక్క మానవునకును శరీర సంబంధమగు సంస్కారములున్నవి. అందు స్త్రీ పురుషభేదములేదు. నాలుగు వర్ణములకును ఉన్నవి. సంస్కారమన మాలిన్యమును పోగొట్టుట. ఏ వస్తువైనను పరిశుద్ధము కావలెనన్న సంస్కార మవసరము. మణికి సంస్కారము సానబెట్టుట. సాన

బెట్టని మణి ప్రకాశింపనేరదు. అనగా దానికున్న సహజప్రకాశము కప్పబడి యుండగా దాని సహజ ప్రకాశమును ఆవరించి యున్నదానిని తొలగించుటకే సంస్కార మనిపేరు. తరుగుల్మలతాదులును సంస్కారములేక అభివృద్ధి నొందవు. సున్నము గొట్టక ఇల్లు శోభించదు. వృక్షదోహదమును గావింపక తరులతాదులు పుష్పించి ఫలించవు. పంట చక్కగ పండవలెనన్న పొలమును దున్ని నాటవలెను.

ఈ చరాచరసృష్టి ఖండమునం దేపదార్థమునకైన సంస్కారము అవసరము. అట్లే అనేక జన్మార్జితములగు మలిన వాసనలచే మలినుడై జన్మించిన మానవ శరీరధారియగు జీవుడు శరీర సంస్కారములేక తన నిజస్వరూపమును గుర్తించు టెట్లు? లేక ఈ సంసార దుఃఖమునుండి తరించు టెట్లు? కావున భారతీయులు మోక్షపురుషార్థమును ప్రధానము గాలించుకొన్న వారగుటచే మాతృగర్భమున ప్రవేశించుట మొదలు మరల ఈ శరీరమును వదలు వరకును కొన్ని శాస్త్రీయ సంస్కారముల గావింతురు. ఆ సంస్కారములు కేవల శారీరకములుగావు. మనోమయములు. అనగా చిత్త సంస్కారమును కల్పించునవి. సంస్క్రియతే-జ్ఞానయోగ్యతా మాపద్యతే పురుషస్య చిత్తమనే నేతి సంస్కారఃజీవుని చిత్తమునకు ఆత్మజ్ఞానయోగ్యతను సంపాదించునుగాన దీనికి సంస్కార మనిపేరు. ఈ సంస్కారములు ముఖ్యముగ పదహారు.

గర్భాధాన సీమంత పుంసవన జాతకర్మ నామకరణ అన్నప్రాశన చౌల ఉపనయన, ఆగ్నేయవ్రత ప్రాజాపత్యవ్రత సౌమ్యవ్రత వైశ్వదేవవ్రత గోదాన వ్రత, స్నాతక వివాహ, పితృమేధములు.

ఈ సంస్కారములయందు ఎనిమిది సంస్కారములు బీజదోషనివారణకును గర్భశుద్ధికొరకును ఏర్పరుపబడినవి. ఈ విషయమునే మనువు చెప్పినాడు.

గార్భైర్హోమైర్జాతకర్మ చౌల మౌంజీ నిబంధనైః,
బైజకం గార్భికంచైనో ద్విజానా మపమృజ్యతే.

రాముడు అవతారమే అయినను అతడు క్షత్రియ జాతికి సంబంధించిన శరీరమును ధరించినాడు గావున ఈ సంస్కారము లన్నియు ఆ నలుగురు పుత్రులకును జరిగినట్లు వాల్మీకి వర్ణించినారు.

కాక ఉపనయన సంస్కారము వేదపఠనాధికారము నొసంగును. రాముడు వేదవిద్యావిశారదుడు. ఆనాటి విద్యావిధానము వేదపురాణ ఇతిహాస పఠనములు. ధనుర్వేదము ఉపవేదము. ఇది క్షత్రియునకు ప్రధానమగు వేదము.

వాల్మీకి మహర్షి జాత కర్మాది ఉపనయనాంత కర్మకాండను చెప్పి, వారి విద్యాభ్యాసమును వర్ణించినారు. వారి విద్యాభ్యాస కాలాదులను, ప్రదేశములను వర్ణించలేదు. ఆ నలుగురి పుత్రులలో రాముని ప్రత్యేకతను చెప్పి, ఆ పిల్ల లందరును వేద విద్యా విశారదులై జ్ఞాన సంపన్నులైనారని వర్ణించినారు. వారవతార పురుషులగుటచే వారి విద్యాభ్యాస కాల పరిమితిని చెప్పలేదు. క్షత్రియునకు పదకొండవ ఏట ఉపనయన సంస్కారమును శాస్త్రము విధించినది. అక్కడ నుండి వారు ఒక్క సంవత్సర కాలముననే సమస్త వేద వేదాంగ పారగులైనారని తెలిపినారు. విశ్వామిత్రుడు వచ్చునప్పటికి రామునకు పండ్రెండవ సంవత్సరము. ఈ లోపల వారి విద్యా పారంగతత్వము వర్ణింపబడినది.

"సర్వే వేదవిదశ్శూరాః సర్వే లోక హితే రతాః
సర్వే జ్ఞానోపసంపన్నా సర్వే సముదితా గుణైః

అందరును అనగా ఆ నలుగురు పుత్రులును వేదవిదులేనట. శూరులేనట. అందరును లోక హితమునకే వారి జీవితమని తలచిన శిఖామణులట. సమస్త విజ్ఞానములు వారికి కలవట. ఈ శాస్త్ర మాశాస్త్రమని గాక సమస్త శాస్త్రముల పారంగతత్వము నొందిరట, కాని వారి యందొక ప్రత్యేకత కలదట. (గుణ సముదాయము) సర్వ సద్గుణ సముదాయమువారి సొమ్మట. ఆత్మ గుణములులేని విద్యావంతుల విద్య వ్యర్థము. రాక్షసులు విద్యావంతులు కాకపోలేదు "మణినాభూషిత స్సర్పః కిమసౌనభయంకర" మణిచేత అలంకృతమగు సర్పము భయంకరము కలదైనది. దాని మణికాంతి ఎవరికిని ఉపయోగము లేదు. లోక కంటకమగు ఐశ్వర్యము కలదైనది. నేటి దౌర్భాగ్యము విద్యయన భౌతికశాస్త్ర పరిశీలనమేనని తలచుట. పారిమార్థిక జ్ఞానము సదాచారాను వర్తనము విద్యా ఫలములని గుర్తెరుగక పోవుట.

ఒక్క ప్రశ్న.

"సర్వే వేద విదశ్శూరాః" అని వారి విద్యార్హతను ఒక్క పదముతో చెప్పినారు మహర్షి. ప్రత్యేకములగు విద్యా శాఖల వర్ణింపలేదు. కారణమేమి ? విజ్ఞాన సర్వస్వము వేదరాశి. అందరును వేద విదులగుటచే వారు నేర్వని విద్యయే లేదని

స్పష్టపరిచినారు. వారు విద్యల నేర్చుటకాదు. పఠించుట మాత్రముతో వారు పండితులు కాలేదు. వారు వేద రహస్యములు తెలుసుకొన్న కోవిదులని ఆ ఒక్క విశేషణముతో తెలిపినారు. పరిపాలకుడగు క్షత్రియునకు విద్యార్హతతో సరిదూగు మరియొక అర్హత ఏమి యుండవలెనో తెలియునా? విద్యా శూరత్వము క్షత్రియునకు చాలదు. ఒక్కొక్క జాతికి ఒక్కొక్క శూరత్వ ముండవలెనునది భారతీయ సిద్ధాంతము. నాలుగు వర్ణములను పూజింపవలసి వచ్చినప్పుడు అగ్రతాంబూలమునకు జ్యేష్ఠత్వ మున్నది. అందు బల జ్యేష్ఠత్వము క్షత్రియునకు ప్రధానము. విద్యా వృద్ధత్వము బ్రాహ్మణునకు ప్రధానము. ధన జ్యేష్ఠత్వము వైశ్యునకు ప్రధానము. వయో జ్యేష్ఠత్వము శూద్రునకు ప్రధానము. కావున క్షత్రియుడు శారీరకముగ కూడ శూరుడు కావలెను. వాల్మీకి సర్వేవేదవిదః అన్న తరువాత "శూరాః" అని కూడా వర్ణించినారు. పరిపాలనా దక్షత్వము కలవాడు రాము డొక్కడే కాదు. వారు నలుగురు దక్షులే ననినారు. "సర్వే" అను పదముచేత. కాని వారి విద్యాజ్ఞానములను పరాక్రమమును వారు దేనికి వినియోగించు స్వభావము కలవారు? స్వార్థపరులగుచో వారనుభవింపదగు విషయ సుఖములకే ఆ రెండు శక్తులను వాడుదురు. రావణు డట్టివాడే, కావున లోక కంటకు డయ్యెను. అట్టి లోక కంటక కంటకుల పరిమార్చుటకే వీరి జననము. ఈ విషయమును చెప్పుటకే సర్వే లోక హితే రతాః" అని చెప్పినారు. స్వార్థము లేకుండ పరార్థమునకే నా జీవితమని అనుకొను వారెట్టి వారై యుండవలెను. జ్ఞాన సంపన్నులు కావలెను, "సర్వే జ్ఞానోప సంపన్నాది" అను విశేషణమును వాడినారు. ఇంక మిగిలిన ఉత్తమ గుణము లున్నవా? అను ప్రశ్నకు సమాధానముగ వారి పుట్టుకతోడనే ఉత్తమ గుణములు కలిగి యుండిరని "సర్వే సముదితాగుణైః" అని వర్ణించినారు. పర్యవసానమేమి? ఉత్తమ సంస్కారులకే విద్య ఉత్తమ సంస్కారము నొసంగును గాని దుష్ట సంస్కారము కల వారివి విద్య బాగు చేయదు విద్య మెరుగు వినక వంటిది. బంగారము యొక్క సహజ కాంతిని వినక బయలుపెట్టును. విద్య జలముల వంటిది. నీళ్ళు తుమ్మ మొక్కను మామిడిమొక్కను కూడ వృద్ధి నొందించును.

ప్రకృతము ననుసరింతము.

అట్లు విద్యార్థి దశ యందలి ఆ పుత్రుల ప్రత్యేకతనుకూడ మహర్షి చక్కగ వర్ణించినారు. రాముని పరాక్రమము అమోఘము- అతని పరాక్రమము సత్య

పరాక్రమమట. అట్లు ఆ నలుగురి పుత్రులలో రాముని ప్రత్యేకించి "తేషాంకేతురివజ్యేష్ఠః" అనినారు. రాముడా నలుగురిలో జండావలె యుండెనట రాముడు తండ్రికి అత్యంత ప్రీతికరుడట. ఇష్టస్సర్వలోకస్య. సమస్తలోకమునకట" అదెట్లు కుదురును? చంద్రమండలము వలెనట. ఆ చంద్ర మండల మెట్టిదట? వినిర్మలమగు చంద్రుడట. "శశాంక ఇవ. నిర్మలః" వర్షాకాల చంద్రుడు కాక శరచ్చంద్ర మండలమని భావము. రాక్షసుల కాతడు అయిష్టుడుకాడా? వారును అతని అహ్లాదకత్వమును అనుభవింపక తప్పదు. అది యట్లుండ "బభూవభూయో భూతానాం స్వయంభూరివ సమ్మతః" బ్రహ్మదేవుని వలె ఆతడందరికిని సమ్మతు డేనట. అందరికిని అన అన్ని భూతములకట. పశు పక్ష్యాదులకు గూడ. బ్రహ్మ అందరకును అన్నము నొసంగునట్లే ఈతడును కూడనట. కవి ఈ ఉపమానము వాడుటలో స్వయంభువగు చతుర్ముఖునకు పోల్చి, ఈతని పుట్టుకకు శుక్ల శోణిత ములు కారణములు కావనియు, అతడు సంకల్పమాత్ర ప్రభవుడనియు స్పష్ట పరచినారు. ఇదియే వాల్మీకిలోని ప్రత్యేకత. మరొక్క ప్రత్యేకతను గమనింతము. క్షత్రియ విద్యార్థులకు ప్రధానమగు శాస్త్రమేమి? ధనుర్వేదము. కావుననే రాముని వర్ణించుచు

> గజస్కంధే ఆశ్వపృష్ఠే చ రథచర్యాసు సమ్మతః
> ధనుర్వేదే చ నిరతః" అనినారు.

రథగజతురగ రథ శ్రేష్ఠములతో ఆ కాలమును పరిపూర్ణముగ వ్యర్థపుచ్చక ఆయా యుద్ధముల విశారదుడై ధనుర్వేదమునందు నిరతుడయ్యెనట. ఇది రాముని ప్రత్యేకతయట. అయ్యును ఆతడు పితృశుశ్రూషా పరాయణుడై యుండుట ఆ పై ముగ్గురికంటె ప్రత్యేకత యనినారు.

నిజమునకు రాముడు ఒకే ఒకడయ్యును ఆతడు నాలుగుమూర్తులతో వెలుగొందుచుండెననునది చరిత్రాంశము. ఆ నాలుగు భాగములును రెండు జంటలుగ యుండెనని వాల్మీకి మహర్షి ప్రత్యేకించి వారి వారి ప్రత్యేక స్నేహసంబంధమును మధురాతి మధురముగ వర్ణించినారు. వినుడు.

రామలక్ష్మణు లొకజంట. భరత శత్రుఘ్ను లొకజంట. రామలక్ష్మణులెట్టి జంటయో వినుడు.

బాల్యాత్ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మి వర్ధనః
రామస్య లోకరామస్య భ్రాతుర్జ్యేష్ఠస్య నిత్యశః
సర్వప్రియకర స్తస్య రామస్యాపి శరీరతః
లక్ష్మణో లక్ష్మి సంపన్నో బహిఃప్రాణ ఇవాపరః.

మీరిప్పుడు వినిన శ్లోకములు రామలక్ష్మణులకు గల సంబంధవర్ణనము. దశరథేశ్వరుని నలుగురు బిడ్డలలో రామ లక్ష్మణు లొక జంటయనిగదా. చిన్ననాటి నుండియు లోకాభిరాముడగు రామునితో నిరవధికము నిత్యమునగు మైత్రి కలిగి యుండెనట లక్ష్మణునకు. పుట్టిననాటి నుండియు అతడట్టివాడేనట. "బాల్యాత్ప్రభృతి" అనినారు. అల్లరిచేయు కాలము నందుగూడ అన్నగారితో కలహించి ఎరుగడు కాబోలు। అన్నగారను గౌరవము, భక్తి లక్ష్మణునకు పుట్టుకతోనే కలిగినది. సహజముగనే అతని హృదయము (స్నిగ్ధము) స్నేహాయుతము. కావుననే లక్ష్మివర్ధనుడయ్యెనని లక్ష్మణుని వర్ణించినారు మహర్షి. అంతేకాదట. లక్ష్మణుడు రామునకు బహిఃప్రాణమట. అనగానేమి? రాముని శరీరము నందంతర్గతమగు ప్రాణవాయువు రాముని శరీరము నెట్లు రక్షించుచుండెనో లక్ష్మణుడు రాముని అట్లు వెంటనంటి సేవించుచుండెనట. రాముని శరీర సంరక్షణము లక్ష్మణుని బాధ్యత యని చెప్పుటకు రాముడు నిద్రపోవునప్పుడుకూడ లక్ష్మణుడాతని అనుసరించియే యుండెనుగాని విడిచిలేడను నంతటి సంబంధమును వర్ణించినారు. అంతేకాక రాముని యందలి అతని ప్రీతి తన శరీరమునకంటె మిక్కుటమని లక్ష్మణుని సేవాలక్ష్యమును వర్ణించి ఉపాస్యదైవమునం దుండదగు దాస్యభక్తిని మనకు ప్రబోధించినారు మహర్షి. ఉపాస్యదైవము నందుండ తగినది ఆత్మానురాగము. లక్ష్మణునకు రామునియందు గల ప్రేమ ఆత్మప్రేమ. అతని మనోవాక్కాయములు రామునకే సమర్పితములైనవి. ఇదియే లక్ష్మణునకు గల లక్ష్మిసంపన్నత్వము. ఇక్కడ సోదర ప్రేమ యనునది సామాన్యము.

ఇక రామునకు లక్ష్మణునిపైగల ప్రేమానుబంధ మెట్టిదో పరికింతము.

"న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః"
మృష్టమన్నము పానీత మశ్నాతి న చ తం వినా

వాల్మీకి వర్ణన మిక్కడ ఒక చిత్రముగ నడచినది. దశరథ నందనుడగు రాము డిక్కడ పురుషోత్తముడయ్యెను. వైకుంఠ మా మహర్షికి స్మృతికి వచ్చినది

లేకున్న పురుషోత్తమ పదము నేలవాడును? లక్ష్మణకుమారుడు లేకపోవుచో ఆతడు నిద్రయే పోవడట. నిజమునకు లక్ష్మణుడు వైకుంఠమున మెత్తని పక్క. లక్ష్మణుడు శేషాంశ. రాముడు శేషశాయి. ఇక్కడ తన బాహ్యప్రాణము. అట్టి లక్ష్మణుడు లేకున్న నిద్ర ఎట్లు పట్టును? నిద్రవంటిదే ఆహారము కూడనట. తన కత్యంత ప్రీతికరమగు సరసాన్నమును తన దగ్గరకు తెచ్చినను లక్ష్మణుడు లేని సమయమున ఆహారమును కూడ ముట్టడట.

ఆ రామ లక్ష్మణుల చిన్ననాటి హృదయములు మహర్షి కెట్లు తెలియునో? మహర్షి తన హృదయమున రామలక్ష్మణుల రాజాంతఃపురనివాసమును చూడకయే రామాయణమును వ్రాసెనా "హసితం భాషితం చైవ గతిర్యాయచ్చ చేష్టితం" తత్సర్వం ధర్మవీర్యేణ యథావత్సం ప్రపశ్యతి. వాల్మీకి తన ధర్మ వీర్యమున జరిగిన కథనంతను యథాతథముగ తిలకించియే వ్రాసెననుమాట మన ఉపన్యాసము లలోని మొదటిమాట. ఇది కవి సామాన్య ఊహాప్రపంచము కాదనుమాటను మీరు మరువవద్దు. ఇక భరత శత్రుఘ్నుల మాటఏమి? వారిద్దరు వీరిద్దరివలెనే యుండిరట.

"భరతస్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః"

శత్రుఘ్నుడు లక్ష్మణుని తమ్ముడే గదా। ఆతడు భరతునియం దిట్లే యుండెనట.

మన కీనాటి యుపన్యాసమునకు ప్రారంభమెక్కడ? రామ జనన మను శీర్షికతో ప్రారంభమై రాముని బాల్యజీవితముతో అంతమైనది. నేటి యుపన్యాస మున భారతీయ సనాతన సిద్ధాంతము శ్రుతిస్మృతి ప్రమాణాధీన మనియు, వేదములు విధించిన యజ్ఞమునందలి పశుహింస హింస కాదనియు, రాముడు పరంధాముడే ననియు, ఇట్లెన్నియో సనాతన ధర్మానుసరణములగు విషయములు చర్చించబడి నవి. ఈనాటి యుపన్యాస మింతతో ముగిసినది. రేపు విశ్వామిత్ర యాగరక్షణ మను కథతో ప్రారంభము కాగలదు మన ఉపన్యాసము.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

శ్రీరామ జయ రామ జయ జయ రామ.

శ్లో॥ శత్రుచ్ఛేదైకమంత్రం సరస ముపనిషద్వాక్య సంపూజ్యమంత్రం
సంసారోత్తారమంత్రం సముచిత సమయే సంగనిర్యాణ మంత్రం
సర్వైశ్వర్యమంత్రం వ్యసన భుజగ సందష్ట సంత్రాణ మంత్రం
జహ్వే। శ్రీరామ మంత్ర జప జప సఫలం జన్మసాఫల్య మంత్రం.

# ధర్మరక్షణ లీల

ఆర్య మహాశయులారా।

మన రామాయణ మహాకావ్యములోని ధర్మార్థ కామ మోక్షములనెడి చతుర్విధ పురుషార్థములను కథాకథన పూర్వకముగ ప్రవచనము గావించుట కిది అయిదవ రోజు.

నిన్న భగవానుని జననలీలా వైభవ ఘట్టము ముగిసినది. నేడు ధర్మరక్షణ లీలా వైభవ ఘట్టము.

కథా ఘట్టమున మన మిప్పు డెక్కడుంటిమో చెప్పెదను.

దశరథేశ్వరుడు సాక్షాన్నారాయణుని పుత్రులనుగా బడసి ఆ నారాయణుని దివ్యతేజము తనగృహమున వెలుగొందగా అతడు దేవతలతోగూడిన చతుర్ముఖుని వలె విలసిల్లినాడు.

పితా దశరథో హృష్టో బ్రహ్మలోకాధిపో యథా.

ఇంతవరకు పుత్రసంతతిని గురించిన చింతతీరి, వారు విద్యాధికులగుటకు అతడు మురిసినాడు. కాని వారు నవవధువులతో కూడి వివాహవేదికాంతర్భాగమున ఆసీనులుకాగా చూడ సంకల్ప ముదయించినది. అది సంకల్ప మాత్రమై ఆయన మనసునందే నిలవలేదు. మునిపుంగవుడగు వశిష్ఠునితోడను మంత్రిసత్తముల తోడను బంధువర్గమునుకూడకూర్చి ఒక సమావేశము నాత డేర్పాటు గావించుకొని ఆలోచించినాడు

అథ రాజా దశరథ స్తేషాం దారక్రియాం ప్రతి
చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయ స్సబాంధవః

కావ్యమునం దిదియొక విచిత్ర మగు ఘట్టము.

పుత్రికకు వలె పుత్రుని వివాహమును గురించి చింతించు టెందుకు? అందును రామునకు వయసు మీరినదా? అయ్యును వారు మహారాజులు. గాంధర్వ వివాహము (స్వయంవరము) వారికి నిషేధములు కావు. అది యట్లుండ, సోపాధ్యాయ మంత్రివర్గముతో విచారించు టెందుకు?

ఈ శ్లోకమున దశరథుడు తన పుత్రుల వివాహమును గురించి చింతించెనని యుండక రాజున కొక విశేషము వాడబడినది. కాక దారక్రియను గురించి అని యున్నది. రాజునకు వాడిన విశేషణమేమి?

ధర్మాత్మా అని వాడినాడు. రాజా అనునదికూడ విశేషణమే. ఈ విషయములను మనము విచారింతము.

భారతీయ సిద్ధాంతమున వివాహమొక సంస్కారము. ఆ వ్యవస్థ ననుసరించియే మానవసమాజము పొందదగు అభ్యుదయ నిశ్శ్రేయసములుండునని వేద సిద్ధాంతము. కావున దశరథుడు తన బిడ్డల పెండ్లిని గురించి దారక్రియాపదమును వాడినాడు. అట్టి దారక్రియను గురించి దశరథుడు విచారింపదగు ధర్మచింత ఏమి? ఇక్కడ ఉపాధ్యాయులతో పనియేమున్నది? బంధువులెందుకు?

దశరథుడు వృద్ధుడయ్యెను. తానిప్పు డేలుచున్న ధర్మసామ్రాజ్యమునకు రాజు కాదగినవాడు రాముడు. అతడు విద్యాపారంగతుడై యుండెను. మిగిలిన పుత్రులును వీరశిఖామణులై రాముని అనుసరించుచుండిరి. రఘువంశపావనులగు తన పుత్రులకు తగిన వధూమణుల నందించు మరియొక రాజవంశమేది? తగిన రాజవంశములనుండియే తన పుత్రులకు పట్టమహిషులు కావలెను గాని సామాన్య రాజ వనితలు గ్రహనీయురాండ్రుకాదు. అట్టివారు అనగా నా పుత్రులకు తగినవారు నాకు లభింతురా? అనునదియే దశరథుని చింత. ఇక ఉపాధ్యాయ మంత్రి బాంధవు లెందుకందురా? అమాత్యవర్గముతో ఆలోచనలు సలుపక రాజు ఏ కార్యమును చేయరాదు. కావున మంత్రుల యవసరమని వర్ణింపబడినది

నేటికిని మన వివాహ కార్యమునందొక అలవాటున్నది. కన్యావరణములవి ఇత్తురు. అవి వరునకు కన్యను వెతకదగు సుహృత్తులను పంపుటను ప్రకటించు నామమాత్ర చిహ్నములు. ఇద్దరికుగాని నలుగురినుగాని కన్యాదాత దగ్గరకు పంపుదురు. నిజమున కిది తంతు కాదు. సూత్రకారుడు చెప్పిన విధి సూత్రముననుసరించిన క్రియయే. ప్రస్తుత ఆ దశరథేశ్వరుని ఆలోచనా విధానము కూడ ఈ

విధి సూత్రము ననుసరించినదే. సూ. సుహృదస్సమవేతాన్ మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్. వాల్మీకి రామాయణమునందలి కథాభాగమంతయు భారతీయ వైదిక సిద్ధాంతసరణికి వ్యాఖ్యాన మనుట యుక్తము. ముందుకు పోదము.

దశరథేశ్వరుని సమాలోచన యట్లు జరుగుచునేయున్నది. ఆ మందిర ద్వారము కడ కొందరు దౌవారకులు వేవేగ వచ్చి రాజదర్శన కాంక్షులై నిలిచి నారు. వారికి రాజదర్శన మబ్బినది. వారు వచ్చినది విశ్వామిత్ర మహర్షి వారి రాకను విన్నవించుటకే. తటబడు మాటలతో వినయవిధేయతలకు కొరత రాక యుండ ఆ మహాముని రాకను విన్నవించినారు. దశరథుని సంభ్రమాశ్చర్యము లకు మేరలేదు. సింహాసనము నుండి వేవేగ లేచినాడు. మంత్రి పురోహితులతో విశ్వామిత్రునకు ఎదురేగినాడు సింహద్వారము కడకు. తన పురోహితులగు వశిష్ఠ మునీంద్రునిచే విశ్వామిత్రమహర్షికి పాదార్ఘ్యముల నిప్పించగా విశ్వామిత్రులును రాజు తన కందింపజేసిన పాద్యాది విధుల నందుకొని, రాజును క్షేమవార్త లడగినారు.

మహారాజా। రాష్ట్రజను లందరు క్షేమమేనా? పురజనులు కుశలమా। ధనా గారములు పూర్ణములై యున్నవా? శత్రురాజుల జయించగా జయలక్ష్మి నీ పాణి గ్రహణము జేసెనా? దైవకర్మలగు యజ్ఞయాగాదులును, నైమిత్తికాది పితృకర్మ లును నీచేత నడపబడుచున్నవా। అను మొదలుగా గల ప్రశ్నల రాజుతో సలిపి, వశిష్ఠమునీంద్రుని గూడ కుశలప్రశ్నల గావించుట గాక, రాజును వెంటనంటి వచ్చిన ఇతర మహర్షులను గూడ ప్రత్యేక ప్రత్యేకముగ పలకరించినారు.

రాజద్వారముకడ జరుగదగిన పూజాదికమంతయు పరిపూర్ణము కాగా వారం దరును రాజగృహమున ప్రవేశించినారు. అందున్న ప్రత్యేక ప్రత్యేక ఆసనములు మహర్షులతో నిండినవి. వారి అనుజ్ఞతో మహారాజును సింహాసనము నలంకరించి నాడు

విశ్వామిత్రుని రాక దశరథేశ్వరుని సంతోష సముద్రము నుప్పొంగించినది. శరీరమున పులకాంకురములు మొలకెత్తినవి. నిజమునకు విశ్వామిత్రుని రాకవలన కలిగిన దశరథుని ఆనందమునకు మేరలేకపోయినను మహారాజు తన ఆనందమును విశ్వామిత్రునకు కొన్ని మాటలతో విన్నవించుకొనినాడు.

మరణభయముగల మర్త్యునకు అమృతభాండము చేతికందగా కలిగెడి ఆనందము తనకిప్పుడు కలిగినదని విన్నవించుకొనినాడు. అంతతో రాజునకు తృప్తి కలుగలేదు. వానలు కురియకయే, బీజములను మొలకెత్తక, బీటువారి, ఎండియున్న భూభాగమున సస్యశ్యామలము గావించు వర్షధారలు ధారాపాతములై పడగా ఆయా భూస్వాములకు కలుగు ఆనందము తనలో పొంగిపొరలినదని చెప్పుకొనినాడు. ఈ ఉపమానముకూడ రాజునకు తృప్తినివ్వలేదు.

ఋషివర్యా! తమ రాక పుత్రసంతతిని బడయక తపించు గృహస్థునకు తన ధర్మపత్నియందు పితృదేవతల నుద్ధరించు పుత్రోదయము కలుగగా ఆ పుత్రోదయమునకు మురిసి తబ్బిబ్బులై ఆనందించు గృహస్థు ఆనందము నేడు మీ దర్శన భాగ్యమందగా కలిగినదని మరొక్కమాటుగ విన్నవించుకొని, అంతతో ఊరుకొనక నష్టద్రవ్య లాభమును గూడ ఉపమించి తన అనందాతిరేకమును మునిచంద్రులకు తెలుపుకొనినాడు. అంతతో ఆ మహారాజుయొక్క అంతఃకరణమున పొంగి పొరలిన ఆనందరస తరంగములు వెనుకకు మరలగా చివ్వరి తరంగము, తన యింట కలసివచ్చు వివాహాది మంగళకార్యముల తలచిన గృహస్థును పోల్చుకొని ఆ భావతరంగమునుకూడ ఆ మహాముని చెవున కంపు గూర్చగా రాజువారి రాకకు కారణ మరయ కోరినాడు.

అప్పుడా రాజవర్యుని వినయ సంపదతో గూడిన వాక్య సరణి ఇది.

"మునివర్యా! మీకిదే నా స్వాగతము.

తాము ఏ ప్రయోజనము నుద్దేశించి తమ పవిత్ర పాదముల నా గృహము నందుంచిరో తెలియజేయ ప్రార్థించుచున్నాడ. తమరే కోర్కెను కోరినను దానిని తప్పక నెరవేర్ప సిద్ధమై యుంటినని వెనుదీయని వరము వలె పలికినాడు.

నిజమునకు ఉదార హృదయుల కివ్వరానిదెద్ది? అందును పాత్రుడై వచ్చిన ఆ ముని ఏమి కోరినను ఆ కోర్కెను తీర్చుటకే దశరథుని అంతఃకరణము ముందుకు వచ్చి నిలిచినది. దాతృత్వ మొకరి సొమ్ము కాదు. అది జన్మాంతర పూర్వ పుణ్య విభవము. ప్రియవక్తృత్వము కూడ అట్టిదే. అందును వచ్చిన వాని పాత్రతను తెలుసుకొనుట దాతలోని ప్రత్యేకత యనక తప్పదు. విశ్వామిత్ర మహర్షిలోని అసామాన్య ప్రతిభను వెల్లడించి ఏమిచ్చుటకైన సిద్ధపడితివని విరాఘాటముగా, ధారాళ వాగ్వైఖరితో తెలిపినాడు.

"పూర్వం రాజర్షిశబ్దేన తపసా ద్యోతితప్రభః
బ్రహ్మర్షిత్వ మనుప్రాప్తః పూజ్యోసి బహుధామయా

అని రాజర్షి బ్రహ్మర్షియైన తమ ప్రతిభా విశేషము అగణ్యము మునీంద్రా। మీ కివ్వరానిదే మున్నది ?

కార్యస్య న విమర్శం చ గంతుమర్హాసి కౌశిక

ఈ కార్య మా కార్యమని కూడ విమర్శించుకొని వెనుదీయక ఎట్టి కార్యము కావలసి వచ్చినను అడుగుమని కొరతలేని దాతయై పలికినాడు చక్రవర్తి.

శ్రోతలారా ।

తన కోర్కెను తీర్చుకొనుటకై దాత గృహమున కేతెంచిన గ్రహీతకు దాత పలుకు లిట్టివి కాగా ఆ వచ్చిన వాని హృదయ మెట్లుండును? అందును దశరథుని పలుకుల చందము చేవుల కింపు గూర్చుట గాక హృదయమును కద లించిన గుణ విశిష్టత్వము కూడ కలిగియుండుటచే విశ్వామిత్రుని ముఖ మండల మున ఆనందము మందహాస రూపమున సాక్షాత్కరించినది. ఒడలు పులకరించినది విశ్వామిత్రుని సంతోషము ముఖమున కన్పట్టుట కాదు. వాక్కున బహిర్గతమైనది.

ముందు రాజుయొక్క నైసర్గిక దాతృ స్వభావమును ప్రశంసించినారు. ఆ తరువాత రఘువంశ మర్యాదను కొనియాడినారు. అంతతో ఊరుకొనక వశిష్ఠ మునీంద్రుని ప్రత్యేకించినారు. నేటి దశరథుని దాతృత్వమునకు కారణములనుగా. అనగా నేమి? జన్మసిద్ధమగు దాతృత్వము దశరథుని స్వభావము ఇది కర్తయొక్క పూర్వ పుణ్య విభవము. తరువాతది. అతడు పుట్టినచోటు. అతని సహజ గుణము నకు దోహదము కలిగించునది జన్మస్థలము. ఆ తరువాతది ఆతనిని నడుపునట్టి గురుస్థానము. ఈ స్థానము కర్త యొక్క స్వభావమునకు వన్నెదిద్దునట్టి స్థానము. భారతీయ సిద్ధాంతము నందాణిముత్యముల వంటి సూత్రములీ మూడును.

"సదృశం రాజశార్దూల తద్వైతద్భువి నాన్యథా
మహావంశప్రసూతస్య వశిష్ఠవ్యపదేశినః

ఇక్కడ విశ్వామిత్రుడు వశిష్ఠ మునీంద్రుని ప్రత్యేకించుట యందొక ప్రత్యే కత కూడ యున్నది. ఈ కార్యమున వశిష్ఠుని సాయమనవసరము. లోగడ తమ

కిద్దరకును గల వైరుధ్యమున కిక్కడ తావుండ గూడదనునదే విశ్వామిత్రుని హృదయము. ఈ కార్యము తన స్వార్థముకాదు. స్వార్థము నిమిత్తమాత్రము. లోక కళ్యాణమిందు ప్రధానము. ఈ ప్రశంసల తరువాత రాజుకు "భవ సత్య ప్రతిశ్రవాః అని తెలిపినాడు. నీ మాటను నిలుపుకొందువుగాకయని తాను కోరుకొనుటకు అంగీకారమును తెలిపినాడు తాను వచ్చిన కార్యక్రమ మిదియని రాజునకు తెలిపినాడు ఈ విధముగ.

రాజేంద్రా !

నేనొక వ్రతదీక్షయందు దీక్షితుడనై ఒక యజ్ఞమును తలపెట్టినాను. ఆ యజ్ఞమునకు ఇద్దరు రాక్షసులు నా వ్రతదీక్షా కాలము గడవకుండగనే నా యజ్ఞమునకు విఘ్నమును కల్పించుచుండిరి. వారిద్దరి పేర్ల నడుగుదువా? వారిపేర్లు మారీచ సుబాహువులు. వారి బలము అసామాన్యము. వారిద్దరు నాహోమగుండములయందు రక్తమాంసముల వైచి విఘ్నమును కల్పించుచుండిరి.

రాజా! నేను వారిని శపించి దగ్ధము గావింప సమర్థుడనే అయ్యును నా క్రోధాగ్నిచే వారిని దగ్ధము గావింప నిష్టము లేకపోవుటచే వారిని నేను శపింప లేదు. ప్రస్తుతమున నేను కోరుకొనున దేమందువా? నీ జ్యేష్ఠ పుత్రుని నాకిమ్మని అడుగుటకై వచ్చితినవినాడు. ఆ యడిగిన విధమిది. ఈ ఘట్టమున వాల్మీకి శ్లోకములనే వినిపింతును.

స్వపుత్రం రాజశార్దూల రామం సత్యపరాక్రమం
కాకపక్షధరం శూరం జ్యేష్ఠం మే దాతుమర్హసి

హే! రాజ శార్దూల! సత్య పరాక్రముడును శూరుడునై ముడికిరాక ముచ్చటైన కన్పట్టు కేశ సమూహముతో నొప్పారు నీ జ్యేష్ఠపుత్రుని నాకిమ్మని అడిగినాడు రాముని నా కిమ్మని అడుగుట యందిది మొదటి శ్లోకము. ఈ శ్లోకమునందలి పద సార్థక్యమును పరికింపుడు.

హే రాజశార్దూల! అని సంబోధించుటలో ఇంతవర కెవ్వరును పొందని పుత్ర సంపద నీకు కలిగినదని అతని భాగ్య గరిమను ప్రస్తుతించినాడు. నా భాగ్య గరిమ ఏమందువా? సత్య పరాక్రముడు నీకు పుత్రుడై పుట్టుట నీ భాగ్య గరిమ యని రామునకు సత్య పరాక్రమ విశేషణమును వాడినాడు. సత్య పరాక్రముడన నేమి? అస్తమించని పరాక్రమము కలవాడని అర్థము. అస్తమించక పోవుటయన

త్రికాలములయందు సత్యమై వేరొక దానిచేత బాధితము కానిదని భావము. అట్టి దేది. అట్టి పరాక్రమము భగవానునిదే. కావున ఆ విశేషణమును వాడి, రాముని యందు బాలుడను బుద్ధిని తొలగించినాడు. కాకపక్ష ధరుడైనను ఈ లోక విలక్షణు డని తెలిపినాడు "శూరం" అనుటతో. ఇట్టి లోక విలక్షణుడగు నీ జ్యేష్ఠ పుత్రుని నాచేత బెట్టుమని దశరథుని దాతను గావించి తాను ప్రతిగ్రహీతయై మాట్లాడినాడు. నా వెంట పంపుమనలేదు. నాకిమ్మని అడిగినాడు. ఇది నా కివ్వదగిన సొత్తు అని నాడు. ఇది సత్పదార్థమని రాముని తలచి లోలోన మురిసినాడు. రాముడు దశరథున కత్యంత ప్రీతికరమగు పుత్ర రత్నము. ఆ రత్నమును తనచేత బెట్టుమని అడిగి నాడు. ఎందుకు? రాక్షసుల పరిమార్చుటకు. ఇప్పుడు ఈ దశరథుని హృదయ మెట్లుండును ? ఏమియో ఇంతవరకు బయటపడలేదు.

వెంటనే విశ్వామిత్రుడు మరియొక మాటను చెప్పినాడు.

> "శక్తో హ్యేష మయా గుప్తో దివ్యేన స్వేన తేజసా
> రాక్షసా యే వికర్తార స్తేషామపి వినాశనే

రాజా! నీ పుత్రుడు సమర్థుడు కాడని నీవు భావించుచుంటివేమో! రాక్షసుల సంహరించుటలో సహజముగనే సమర్థుడు కారణ మేమందువా? రాముని తేజము దివ్యతేజము. అది యట్లుండ నాచే సురక్షితుడు కూడ గదా! ఇంక అతని కేమి భయము? ఈ మాటలోని గూఢ భావమేమి? నీ పుత్రుడగు రాముడు నీవలె జన్మించిన వాడు కాదు. దివ్య తేజో విరాజమానుడగు యజ్ఞ పురుష డిచ్చిన దివ్య పాయస ప్రభావమున జన్మించిన వాడు అని జ్ఞాపకము చేయుటకై "దివ్యేన స్వేన తేజసా" అనినాడు. శుక్ల శోణిత సంబంధము గలది కాదు ఈతని శరీరము. కావున వయః పరిమితిని లెక్కచూడవద్దని రాముని యవతారమును ధ్వనించినాడు. అంతేకాక నేను తపస్సంపన్నుడనని నీ వెరుగుదువు గదా! నా తపః ప్రభావమాతనికి రక్షకము కూడ కాగా నీకు భయ మక్కరలేదని పుత్రునిగనే రాముని భావించిన దశరథుని మేల్కొలిపినాడు దశరథుడేమైన కదలెనా? దశరథుని వలన సమాధానము రాలేదు. అందుకని రాజున కాశను కల్పించినారు. ఏమని ?

> శ్రేయశ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః
> త్రయాణామపి లోకానాం యేన ఖ్యాతిం గమిష్యతి.

రాజా! నీ పుత్రు డిప్పుడు నా స్వాధీనమగుచో అతనికి నేను చేకూర్చదగు శ్రేయస్సు (లాభము) ఈ రూపము ఆ రూపమనక బహు రూపములై లోకము

నందే రాజపుత్రునకును రాని కీర్తి ప్రతిష్ఠల చేకూర్చదగునదై యుండగలదు. అని రాజపుత్రుడు ఎంత కాలమునకో సంపాదించదగు దానిని నేనిప్పుడే నీ పుత్రునకు కల్పింతునని దశరథుని పైకెక్కించినాడు. అప్పటికిని దశరథుని నాడి ముని కందలేదు. అంతలో ముని ఆ రాక్షసుల దుర్బలమును కూడ చెప్పి చూతమను కొనినాడు.

న చ తౌ రామమాసాద్య శక్తౌ స్థాతుం కథంచన
న చ తౌ రాఘవాదన్యో హంతు ముత్సహతే పుమాన్

దశరథేశ్వరా! ఆ మారీచ సుబాహువులు రాముని ముందు నిలిచి యుద్ధము చేయ సమర్థులు కారు. నీ పుత్రున కెట్టి భయమును లేదు. ఆ యిద్దరు రాక్షసులును రాముని చేతనే చావవలయును గాని ఇతరులచే చచ్చువారు కాదు. రాజశ్రేష్ఠా! నిజమునకు వారు బల గర్వితులేయైనను కాల పాశమున కిప్పుడు వారు బద్ధులు. నీవు నీ పుత్రుని యందున్న పుత్ర స్నేహమును వీడి లోకైక వీరుడగు రాముని పంపుమని నొక్కి వక్కాణించినాడు. నొక్కి వక్కాణించుట కాదు.

అహం తే ప్రతిజానామి హతౌ తౌ విద్ధి రాక్షసౌ

నీ కిప్పుడు నేను ప్రతిన చేయుచున్నాను దశరథా! రాక్షసులు చచ్చిరనియే తలపుమని బల్ల గ్రుద్ది చెప్పి, దశరథుని హృదయ దౌర్బల్యమును త్రోసివేయ ప్రయత్నించినాడు. కాని దశరథుని పుత్ర వాత్సల్య దౌర్బల్యము వదలలేదు అది అంత తేలికైన విషయము కాదు. ఈ జగద్భ్రాంతి ఎన్ని జన్మల నుండియో అనగా ఎంత కాలము నుండియో వచ్చినది. ఆ నారిమాయ యాసుప్తః జీవః అని నారు గౌడపాదులు. ఇది నిద్ర. దీనినుండి మేల్కొనుట సామాన్యము కాదు. నేను, నాది యను మోహము సామాన్యము కాదు. "అ ఘటన ఘటనా పటీయసీ మాయా"

విశ్వామిత్ర మహర్షి రాముని నిజ స్వరూపమును దశరథునకు చెప్పి, కేవల మీతడు నా పుత్రుడను భావమును తొలగింపదలచి స్పష్టముగ రాముని తత్వమును వర్ణించినాడు.

"అహం వేద్మి మహాత్మానం రామం సత్య పరాక్రమం
వశిష్ఠోపి మహాతేజా యేచేమే తపసి స్థితాః

దశరథా! రాముని యథార్థ స్వరూపము నీకు తెలియనే తెలియలేదు. నీవు

ఆతని నెరగుటకు సమర్థుడవు కావు. ఆతని స్వరూపము నెరిగిన వారిలో నీవు చేరలేదు. వారెవరందువేమో? నేనెరుగుదును. మీ గురువర్యులును పురోహితులునగు వశిష్ఠుడున్ను, ఈనీ సభాస్థలి నలంకరించియున్న మహర్షి గణమున్ను ఎరుగుదురు. వీరందరును ఆతని ఎవ్వడని ఎరుగుదురందువేమో. ఆతడు సర్వ వ్యాపకమగు బ్రహ్మ తేజమే అవయవముల అందమొంది యుండెను. గాని ఈతడు దశరథ నందనుడు కాడని మే మెరుగుదుము. కావున నా మాటనునమ్మి రాక్షస సంహారము నకై రాముని పంపుమనినాడు.

శ్రోతలారా!

ఇక్కడ విశ్వామిత్రుడు రాముని నీ వెరుగవని స్పష్టముగ చెప్పుట సాహసమా? అని అనుకొనకుడు. దశరథుడు నిజమునకు కేవలమగు అజ్ఞాని కాడు. భగవంతుని పుత్ర రత్నముగ బొందిన పుణ్యాత్ముడు గదా ఆతడు? రాముని పరమాత్మయని ఏల ఎరుగడు? అనునది ప్రశ్నయే. ఇక్కడ మనము గ్రహింపవలసిన ముఖ్యాంశము కొంతయున్నది. జాగరూకులై వినుడు.

రాముని తత్వము కేవల ధర్మశాస్త్ర కర్మ శాస్త్రములను మాత్రమే ఆధారముగ తీసుకొన్నచో అర్థము కాదు కేవల గార్హస్థ్య జీవితము ఉపనిషద్వేద్యమగు బ్రహ్మ తత్వమును గుర్తెరుగ సమర్థమైనది కాదు. గార్హస్థ్య జీవితమును వదలి తత్వాన్వేషణకయ్యే తమ జీవితములను అంకితము గావించి జితేంద్రియులైన మహా మునులకే ఆ ఉపనిషదర్థమగు రామతత్వము మోహము నొందించు నట్టిది కాగా కేవలము పుత్రుల బడయగోరి పుత్రకామేష్టిని మాత్రమే గావించిన దశరథునకు ఆ రామబ్రహ్మము బ్రహ్మమై భాసించుట కవకాశము కలుగలేదని విశ్వామిత్రుడు గుర్తెరిగియే వశిష్ఠ మునీంద్రుని కూడ సాక్ష్యము నిచ్చినాడు. అంతతో కూడ చాలకీతని ఒప్పించుటకని తపోనిష్ఠాగరిష్ఠుల నందర సాక్ష్యమిచ్చినాడు. వారిలోని వాడనే నేనని తన స్వరూపమును ఆదర్శముగ ఇచ్చినాడు. ఏమది ? నేనును నీవలె రాజునై యుండి భగవత్తత్వము నెరుగక, ధనుర్వేదము యొక్క అవ్వలి ఒడ్డును కూడ దర్శించియు తృప్తి నొందక, పరమ ప్రేమ రూపమై, సర్వ జగదధిష్ఠానమై, వెలుగొందు బ్రహ్మతత్వము నందుకొన్న గాని, నా జన్మ సార్థకము కాదని గుర్తెరిగి, కొన్ని వేల సంవత్సరములు జపధారి నగుటచే బ్రహర్షి నైతిని. కావుననే నీ రాముని యోగుల హృదయ పుండరీకముల ధ్యేయమై ఒప్పారు. స్వయం జ్యోతిగను, జ్ఞానుల దృక్పథమున గోచరించు సచ్చిదానంద- స్వరూపము

గను భక్తులకు గోచరించు భక్తి రసామృత సింధువుగను తెలుసుకొంటినని దశరథుని ఒప్పించుటకై రాముని మహాత్మ్యమిగ నే నెరుగుదునని స్పష్టముగ పలికినాడు. అంతియే. అది సాహసము కాదు. అహంకారము కాదు. ఎట్లయిన రాముని ఇక్కడ నుండి కదిలించవలెను. విశ్వామిత్రుని యుద్బోధము దశరథుని హృదయము నంటలేదు. దశరథుడు సమాధానము నివ్వలేదు.

ఇక విశ్వామిత్రుడేమిచేయవలెను? చివ్వరి కాతడు నీ మంత్రులను గూడ ఆలోచింపుమని చెప్పి తనకిక సమయములేదు గావున నాకు పదిరోజులే ఈ యజ్ఞ దీక్షయని తనకు కల కాల వ్యవధిని కూడ తెలిపి మౌనము వహించినాడు.

మన మొక్కమారు దశరథుని వైపుకు మరలుదము.

విశ్వామిత్రుని రాక యధార్థముగ దశరథునకు మహోత్సాహమును కలిగించినది ఆ ముని ఏ మడిగినదానినే ఇత్తమనిపించినది. ఇట్టి పాత్రుని కివ్వరానిదేముందని భావించినాడు. కాని వర మడిగిన ఈ క్షణమున విశ్వామిత్రుని రాక ప్రాణగొడ్డమైనది. ఒక్కరెండుగడియల కాలమైనను చూడకుండయుండలేని ఆత్మప్రియమగు పుత్రరత్నమును మునివెంట పంపవలసి వచ్చినది. పంపుట కిష్టము లేదు. రాక్షసానీకముతోటి యుద్ధము నేర్వని రాముని పంపుటెట్లు? ఆ మాయా యుద్ధవిశారదులనా నా ముద్దుల బిడ్డడు వధించుట? అన్న ఆలోచనా తరంగములు ఒకదానివెంట మరియొకటి దశరథుని వెంటనంటినవి. ముని వచనములు హృదయవిదారకములైనవి. చిత్తస్థైర్యము నాతడు కోల్పోయినాడు. నోటమాట వచ్చుటలేదు. విశ్వామిత్రున కివ్వదగు సమాధానము నాతడు ఇవ్వ సమర్థుడు కాలేదు. ఒళ్ళు వణకినది. మూర్ఛితుడు మాత్రము కాలేదు. మూర్ఛవలెయైనది ఆ రాజున కొక్కక్షణ మాత్రము. రాజాసనమునుండి కూడ చలించినది శరీరము. అయ్యును కొంతవడికి చిత్తమొక విధముగ నిలిచినది. తన పుత్రరత్నము నివ్వకుండ మునికి చెప్పదగు సమాధానము లాతనికి తోచినవి కొన్ని. కాని తాము దేనిని కోరిన దాని నిత్తునన్న వాగ్దానము ఒకవిధముగ అడ్డమురాగా అతడా సమాధానము నివ్వలేకపోయెను.

అతడు రాజుగదా। కావున మెత్తని మాటలతోడనే విశ్వామిత్రుని ఆగ్రహమునకు గురికాకుండ తాను చేయదలచని కార్యమును చేయ వీలుకాదని పరోక్షం

చెప్పకయే చెప్పవలెను. ఆ పలుకులు ముని హృదయమును కరగించవలెను. అందును అవి సహేతుకములు కావలెను. అట్లే చెప్పినాడు దశరథుడు.

ఊనషోడశ వర్షో మే రామో రాజీవలోచనః
న యుద్ధ యోగ్యతామస్య పశ్యామి సహ రాక్షసైః

దశరథు డిప్పుడేమి చెప్పవలెను? రామునకు రాక్షసులతోటి యుద్ధముచేయ దగు అర్హతలేదని విశ్వామిత్రునకు చెప్పవలెను. అందు కాతడు ముందుగ రాముని బాల్యమును, ముగ్ధమోహన సౌందర్యమును ముని ముందుంచినాడు వయస్సును చెప్పుచు, మునివర్యా! నా బిడ్డకింకను పదియారు వత్సరముల ప్రాయమైనను లేదని "మే రామః ఊనషోడశవర్షః" అనినాడు. కావున రాక్షసులతోటి యుద్ధముచేయు యోగ్యత రామున కెక్కడిది? మునివర్యా! అని రాముని పంపించుట కిష్టము లేకపోవుటను చల్లగ చక్కని కారణముతో ప్రతిపాదించినాడు. తరువాత అతడు రాముని పసితనమును రాక్షస యుద్ధమున కెందుకు అర్హత లేనిదో చెప్పదలచినాడు. అదెట్లు చెప్పవలెను? దానిని చాల చమత్కారముగను భావగర్భితముగను చెప్పదలచినాడు. అందుకుగాను రాముని కన్నుల సోయగమును వర్ణించుటతో నిజమే పాప మీ పసిబిడ్డ ఏమి చేయగలడు? అని మునికి తోచునట్లు చెప్పినాడు. మునివర్యా! రాక్షసులు నిశాచరులు. రాత్రికాలమున కూడ వారు చరింతురు. ఒకవేళ రాముడు పగటికాలమున రాముడు నేర్చిన ధనుర్విద్యాకౌశలముతోడ పోరాడినను రాత్రికాలమున రాక్షసులకాతడేమి జవాబు చెప్పగలడు? అతడు సాయంకాలమగునప్పటికే శయ్యాతలమును అధిరోహించు స్వభావము గలవాడని నర్మగర్భముగ చెప్పినాడు. ఎట్లందురా? "రామో రాజీవలోచనః" నా రాముడు తామరలవంటి నేత్రములు గలవాడు అనినాడు. అనగా తామరలు ఎట్లు ఉదయ కాలమున వికసించి, అస్తమయమునకు ముడుచుకొనుచో రాముని కన్నులు పగలు వికసిత పుండరీకములవలె నుండి ప్రొద్దుగ్రుంకునప్పటికే నిద్రకెదురు చూచు చుండునుకూడ. అతడేమి రాక్షసులతోటి పోరాటమునకు పనికివచ్చును మునిచంద్రా? అనినాడు. ఇంతవరకు తన అయిష్టమును సరాసరిగ చెప్పలేదు మరి నా కార్యమేమి నెరవేర్చితివి? నెరవేర్తునంటివిగదా? అను ప్రశ్నకు విశ్వామిత్రునికి నిరాశను కల్పించుట రాజమర్యాదకాదు. అందుకని ఒకఅక్షౌహిణీ సైన్యముతో కూడి నేను వత్తునని తాను ముందు నిలిచి విశ్వామిత్రునకు కార్యము నెరవేరుటను కలిగించెడి ధైర్యమును పురిగొలిపినాడు.

ఇయ మక్షౌహిణీ పూర్ణా యస్యాహం పతి రీశ్వరః
అనయా సంవృతో గత్వా యోద్ధాహం తై ర్నిశాచరైః

కాని ముని ముఖమున సంతోషము నాతడు చూడలేదు. తనకును ఆ రాక్షసుల జయింతునన్న నమ్మకము గట్టిగలేదు. అందుకని కొంచెము సావకాశము నుంచుకొనినాడు. మునీంద్రా! నా ప్రాణముల నర్పించి ఆ రక్కసులతో పోరాదుదునవినాడు. కాదు

"యావత్ప్రాణాన్ ధరిష్యామి తావద్యోత్స్యే నిశాచరైః"

ఎంతవరకు నా ఒడలియందు ప్రాణములుండునో అంతవరకు అని లోపలి భావము. ఏదియైనను నీ వ్రతమునకు విఘ్నము కలుగదని గట్టిగ పలికినాడు.

నిర్విఘ్నా వ్రతచర్యాసా భవిష్యతి సురక్షితా.

ఇదియే నీ సమాధానమా? అను ప్రశ్నను రానివ్వలేదు. ముని ముఖము నండి. మరల మార్చినాడు తన భాషను. నిజమున కాతడు మార్చుటకాదు. రామ వియోగము నాతడు భరించలేనితనమును; విశ్వామిత్రుడేమి కోపించునో యను భయమును దశరథుని సంభాషింపచేయుచున్నవి. కావుననే తాను వత్తునన్న మాటనే విలువక మరల రాముని సామర్థ్యమును చెప్పి, అయ్యును రాముని పంపుము, నేను చూచుకొందుననే అని విశ్వామిత్రుడు జవాబు చెప్పుటకు చోటివ్వక, మునికి జాలి కలుగునట్లు —

విప్రయుక్తో హి రామేణ ముహూర్తమపి నోత్సవో.

రాముని వదలి రెండు ఘడియల కాలముకూడ నేను నిలువజాలను. ముని చంద్రా! ఒకవేళ నీవు రామునే పంపమనుచో నన్నును తీసుకొనిపొమ్ము చతురంగ బలములతో వత్తును. అరువదివేల సంవత్సరములకు అతివృద్ధాప్యమున కొనకగన్న ఈ సంతానమునందు అత్యంతప్రియుడగు ఈ రాము నెట్లు పంపుదును? అని విశ్వామిత్రునకు ఆశాలతను త్రెంచకయే ఇంతవరకు మాట్లాడి, అంతలో రాక్షసులను గురించి తెలుసుకొను కుతూహలమును బయటపెట్టి విశ్వామిత్రుని మాట్లాడించినాడు, ఆ ముని విరామకు తావివ్వలేదు. కావున విశ్వామిత్రుడు మారీచ సుబాహువుల రావణుని చేతిక్రిందివారని తెలిపి వారి చరిత్రను కొంత చెప్పినారు.

దశరథుని గుండె జల్లుమన్నది. ససైన్యముగ వెళ్ళి తానే జయించలేనను కొన్న ఆతడు రాము నెట్లు పంపును? చివరకు బయటపెట్టక తప్పలేదు. సవినయ

ముగ దోసిలియొగ్గి రాజునన్న అభిమానమును వదలి, తలవంచి, నన్ననుగ్రహింప వేడుచుంటినని తాను వచ్చుటలేదనియు రాముని పంపజాలననియు చెప్పినాడు.

కథమప్యమరప్రఖ్యం సంగ్రామాణా మకోవిదం
బాలం మే తనయం బ్రహ్మన్ నైవ దాస్యామి పుత్రకం

ఇప్పుడు విశ్వామిత్రునకు తేలినదేమి? రాముని మీకివ్వ · ననునదియే. ఒక్క మారా ముని వద్దకు వత్తము.

స్వభావము నెవ్వరు దాటగలరు? "స్వభావ వస్తు ప్రవర్తతే" అనినారు గీతాచార్యులు. విశ్వామిత్ర మహర్షిలోని బ్రహ్మత్వ మెచ్చటికి పోయినదో ఆతని శాంతిని లేక ఓరిమిని అవ్వలకు నెట్టివైచి కోపవేగము నేనుంటినని ఆ క్షణము ననే ఇవ్వల కేతెంచినది. దశరధుని మృషావాక్యము నాతడు సహించలేకపోయెను. ఆ మహర్షి ముఖ మండల మెర్రబారెను. పెదవు లదరెను. ఇప్పుడాతడు ముని కాడు. దశరధుని జాలి గొలుపు మాట లాతనికి జాలిని కలిగించలేదు. ఒక్క క్షణ కాలమున అతడు అగ్ని మండలమయ్యెను. అదియు సామాన్యమగు వెలుగులతో కూడిన మండలము కాదు. యజ్ఞశాలయందు ఋత్విక్కులు హోమము చేయుటకై ప్రజ్వలింపజేసి, ఆ జ్వాలల మధ్యమునం దాజ్యమును హోమము చేయగా నాల్కల తెరచి ఆ హోమాగ్ని ఆజ్యాహుతుల నందుకొను నప్పుదెట్లుండునో అట్లువెలుగుచు ఆ మహర్షి ముఖ మండలమున క్రోధాగ్ని చెలరేగినదట. వాల్మీకి వర్ణన ఇది.

"ఇతి నరపతిజల్పనాద్విజేంద్రం కుశికసుతం
సుమహాన్ వివేశ మన్యుః
సుహుత ఇవ మఖేగ్నిరాజ్యసిక్తస్సమభవ
దుజ్జ్వలితో మహర్షి వహ్నిః

ఇందు మనము గమనింపదగిన విశేషములు కొన్ని యున్నవి. మహర్షి క్రోధమును పొగతో కూడిన అగ్నికి పోల్చలేదు. మనము వంటలు వండుకొను లౌకికాగ్నికి పోల్చలేదు. యజ్ఞవేదిక యందు ఆజ్యాహుతినందుకొను జ్వలితాగ్నికి పోల్చినాడు. దాని భావమేమి? యజ్ఞాధికారిలోని పవిత్రతను చెప్పి, యజ్ఞకుండము లోని అగ్నియొక్క పవిత్రతను చెప్పి, మహర్షి యొక్క క్రోధము లోకోపకారక

మనియు, అది అజ్ఞానావృతమగు క్రోధము కాదనియు చెప్పినారు. అంతేకాదు. "మహర్షి వహ్నిః" మహర్షి యొక్క శ్రేష్ఠత్వమును అగ్నిపదముతో చెప్పినారు.

ఇదియే ఆర్షకావ్యసరణి. కథకు రండు.

విశ్వామిత్రుని క్రోధ వేగమునకు భూమి కదలబారగా దశరథా! నీ బంధువులతో నీవే సుఖము ననుభవింపుమని, ఆసనమునుండి తటాలుననలేచినాడు విశ్వామిత్ర మహర్షి. ఆ సమయమున భూమండలము కదలబారుట కాదు. దేవతలకే భయము కలిగినదట. "వివేశచ భయం సురాన్" కారణమేమి? ఆతడీ రఘువంశము నేమని శపించునోయని. అట్లేమియు జరుగలేదు.

దేశ భద్రతామంతలియే నాటి మహర్షి సంఘము. విశ్వామిత్రుని ప్రతిభా ప్రభావములను రాముని అవతార రహస్యమును గుర్తెరిగిన వశిష్ఠ మునీంద్రులు విశ్వామిత్రుని రిక్త హస్తములతో పంపునా ? దశరథేశ్వరున కసత్య దోష మును రానిత్తురా? విశ్వామిత్రునితో రాముడు పయనమగుట ఎంత అవసరమో వశిష్ఠు లెరుగని విషయము కాదు.

వశిష్ఠులు దశరథుని వంకకు తిరిగినారు.

రాజేంద్రా! రఘు వంశీకులకా ఇట్టి కళంకము. నీవు రాముని విశ్వామిత్రునితో పంపి నీ సత్యవ్రతమును నిలబెట్టుకొనుము. రామునకు అస్త్ర సంపద లేక పోవుట నేటి పయనమునకు లోపము కాదు.

రాజేంద్రా! రాముడు అమృతభాండము. విశ్వామిత్ర మహర్షి అగ్నిమండలము. స్వర్గ లోకము నందలి అమృతభాండమును అగ్ని జ్వాలలు సురక్షితములు గావించునట్లు నీ రాముని విశ్వామిత్రులు రక్షింతురు. నీకు భయమక్కరలేదు పంపుము.

"గుప్తం కుశికపుత్రేణ జ్వలనేనామృతం యథా

ఇక్కడ స్వర్గమునందున్న అమృత భాండమును, దానిని చుట్టియున్న అగ్నిమండలమును శ్రీరామచంద్ర విశ్వామిత్రులకు పోల్చుటయందు విశేషమేమి?

అమృత భాండమునకు నాశములేదు. నాశరహితమగు పరబ్రహ్మయే రాముడు. అమృత ప్రాశనమును గావించిన వారికే చావులేదు గదా? రామునకు నాశమేమి యుండును? ఆ రామబ్రహ్మమును ఆధారముగా గొని రాక్షసానీకమును

నాశము గావింప వచ్చినదీ తాపసాగ్ని రామునికంటె భిన్నము కాదు. చూపరులకా రెండును భిన్నములై యున్నట్లు కనుపించును. అంతియే. ఆ రెండు తేజములును ఏకాకారములై మారీచ సుబాహు ప్రముఖ రాక్షసమండలమును ధ్వంసము గావింప వలసి యుండగా నీవిప్పుడు రాముని పంపననుట యుక్తము కాదని రాముని నిజ తత్త్వమును దశరధునకు ఆఉపమానములతో బోధించినారు గురువర్యులు. అంతతో ఆగలేదు. విశ్వామిత్రునిలోని మరియొక లోకోత్తరమగు ప్రతిభను కూడ చెప్పినారు దశరధునకు.

ఏషోస్త్రాన్ వివిధాన్ వేత్తి త్రైలోక్యే సచరాచరే
న దేవా న ఋషయః కేచిన్నాసురా న చ రాక్షసాః
గంధర్వయక్షప్రవరాః సకిన్నర మహోరగాః
అపూర్వాణాం చ జననే శక్తో భూయస్సధర్మవిత్

దశరధేశ్వరా! విశ్వామిత్రుడన ఏమనుకొనుచుంటివో? ఈతడు విగ్రహము నొందిన ధర్మము. "ఏషవిగ్రహవాన్ధర్మః కాక ఈతడెరిగినన్ని అస్త్రములను దేవదానవ కిన్నరకిం పురుషాదులు కూడ ఎరుగరు. ప్రాచీనములగు అస్త్రములనే ఆతడెరుగుట కాదు. నూతనములగు అస్త్రములను కూడ సృష్టించగలడు అనినాడు.

మన మిప్పుడేమి గ్రహించవలెను ?

పూర్వకాలపు మహర్షులు సామాన్య మానవ సమాజమునకు పనికివచ్చు వైజ్ఞానిక పరిశీలన గావింపక ముక్కు మూసుకొని కూర్చొని నారమనుకొనువారు కూడ నేడు కలరు. వారి కిది సమాధానము.

నేడు పరమాణు విజ్ఞాన కేంద్రము లెట్లో అట్లే నాటి అస్త్రములు కూడ ఇంతకంటె ఎక్కుడు కూడ. అస్త్రమన శబ్దశక్తిని సూక్ష్మీకరించి వినియోగించుట. వర్ణ సమామ్నాయమును కూర్చుటలో కొన్ని ప్రత్యేక శక్తులుపుట్టును. ఒక్కొక్క విధమగు దివ్యశక్తి ఒక్కొక్క దేవత యందుండగా లేక ఒక్కొక్క వర్ణము నందుండగా ఆ శక్తులను తన యందు కూర్చుకొని సత్య సంకల్పత్వమును సాధించుకొనుట అస్త్రములు సృష్టించుట.

కావున నాడు విశ్వామిత్రుడు రాక్షసులు సంపాదించిన శక్తులకంటె గొప్ప శక్తులను సమీకరించి యుండుటచే రామునకు భయములేదని చెప్పినారు వశిష్ఠులు.

దశరధునకు నిద్ర విడినది. రాముని పంపుటకాతడు నిర్ణయించుకొనినాడు. ఆప్తులయుపదేశములిట్లే సుహృద్భావము కలవారి ఎడల పనిచేయును.

నిజమునకు విశ్వామిత్రుడు దశరధుని కోరినది రామునిమాత్రమే. ఇప్పుడు దశరధుడు రామలక్ష్మణుల నిద్దర రమ్మని లోపలి కాహ్వానము నంపినాడు. రాముని ఒంటరిగ బంపుట కాతడు ఎందుకు సమ్మతింపలేదని అడుగకుడు. రామలక్ష్మణులు జంటవిడివడి యుండరు. కావున దశరధుని అంతరాత్మ అట్లే ప్రేరేపింపబడినది. రాముని గురించిన కార్యకలాపమంతయు లక్ష్మణునకు వర్తించుటయనియే భావింపవలెను.

అంతఃపురమునుండి శ్రీరామచంద్రుడు లక్ష్మణునితోకూడ మాతృమూర్తియగు కౌసల్య ఆశీస్సుల నందుకొని దశరధేశ్వరుని వద్దకు వచ్చినాడు. పితృపాదుల ఆశీస్సులందినవి. గురువర్యులను ఆశీస్సుల నందించినారు. కౌసల్యా దశరథ వశిష్ఠ మునీంద్రుల ఆశీస్సులను కవచమున ధరించి, చేత ధనుర్బాణముల ధరించిన రామచంద్రుని తండ్రి శిరమును మూర్కొని విశ్వామిత్రులచేత బెట్టినారు, లక్ష్మణుని కూడ కలిపియే ఇచ్చెనను దానిని వాల్మీకి మనకే వదలినారు.

అయోధ్యయందు నేడు జరిగిన సన్నివేశమొక యపూర్వ సన్నివేశమనక తప్పదు ఇది యొక దేవరహస్యము. రాక్షసుల కెరుకలేని ఘట్టము. విశ్వామిత్రునకు రాముని వప్పచెప్పు సమయమున చల్లని పిల్లగాడ్పులు వీచినవి. అంతే కాదు. రాముని మొట్టమొదటి పయనమిదియే. దేవతలు పుష్పవర్షమును కురిపించినారు. ఆ కుసుమ సహస్రములు రాలుట తడవుగా దేవదుందుభువులు మ్రోగినవి. వాటి ననుసరించియే నగరమున శంఖనినాదములు ప్రతిధ్వనించినవి. ఆ శుభసమయముననే రామలక్ష్మణులతో విశ్వామిత్రులు పయనమును సాగించినారు. మరి వారి ప్రయాణమునకు రధములేమైన ఆయత్తములైనవా? లేదులేదు వారిది రధయాత్ర కాదు. పాదయాత్రయే

మనమిక మన చూపులను వారి పయనముపైపుకు మరలింతము.

ముందు మునీంద్రులు, వారి వెనుక రాకొమరులు. ఆ కొమరుల భుజస్కంధములపై అంబులపొదులలంకృతములు కాగా వారి శిరోభాగములాయంబులపొదులతో కలసి మూడుతలలు గల నాగరాజులను స్మృతికి తెచ్చుచున్నవి. వారిచేతుల యందుంచుకొన్న ధనస్సులును, వారి హస్తతలములలం దలంకృతములై

యున్న నిశితఖడ్గములును, వారి పాణితలముల కప్పియున్న రక్షణ కవచములును వారి యనిర్వక్రపరాక్రమముల ప్రదర్శించగా, వారి దేహకాంతులు వారిని గొని పోవు మునిచంద్రుల దివ్యతేజఃపుంజమున కలిసి దశదిశల వ్యాపించినవి. అప్పుడా మునిపుంగవులు చతుర్ముఖ బ్రహ్మవలె భాసింపగా వారి ననుసరించి పయనించు రామలక్ష్మణులు అశ్వినిదేవతల పోలియుండిరటకూడ. అంతేకాదు. విశ్వామిత్రుడు రుద్రమూర్తియై ముందు నడువగా ఆ రుద్రమూర్తి యంశముౖలై యవతరించిన విశాఖ స్కంధమూర్తులవలె చూపరుల కచ్చెరువు గొలుపుచుండిరట. రామలక్ష్మణులు (ఈశ్వరతేజ మొకప్పుడు నాలుగుమూర్తులై ఆవిర్భవించెనట. అందు కుమారస్వామి, విశాఖుడు, శాకుడు, నైగమేషుడు అనుపేర్లతో యుండిరట. అందలి మూర్తియే విశాఖుడు) వాల్మీకిమహర్షి వారి ప్రయాణ దృశ్యమునిట్లు వర్ణించినారు. ఈ వర్ణనలోని ప్రత్యేకత ఏమి? రామలక్ష్మణులు మూడుతలల సర్పరాజములని వర్ణించుటతో ఆ విషసర్పముల కాటునందుకొనువారు రాక్షసులనియు, వారి నాశము తప్పదనియు వర్ణించినారు. అది యట్లుండ లయకారకుడును ధనుర్వేదమున కధిష్ఠాతయునగు రుద్రమూర్తియే విశ్వామిత్రుడనియు, ఆ రుద్రమూర్తియే రాక్షససంహారమునకు బయలుదేరగా అతని తేజమే రామలక్ష్మణులని తెలిపినారు, కుమారస్వామి; విశాఖుల నిద్దర ఉపమించి, అంతేకాదు. ఆ వర్ణనలో "స్థాణుందేవమివాఽచింత్యం కుమారా వివపావకీ" అనినారు. "అచింత్యంస్థాణుం" అనినారు. మనసా ఊహింపలేని పరబ్రహ్మమేననినారు మహర్షి. కావున ఈ పయనమై పోవు ముగ్గురును ఏకాకారమై యున్న పరమాత్మ తత్వమేనని చక్కగ సమన్వయించినారు.

అట్లా రామలక్ష్మణులు మూడు తలల పాములవలె, అశ్వినీదేవతలవలె కుమార విశాఖమూర్తులవలె వెంటనంట విశ్వామిత్రుని పయనము అయోధ్యాపుర వీధుల కొనసాగినది, వారి పయనము పౌరకాంతలదృష్టులకూడ నతిక్రమించినది. సరయూనదికి దక్షిణతీరమున ఆగినది. అయోధ్య కా నదీతీరము యోజనదూరమున కంటెపైననే యున్నది. యోజనన్నరయున్నది.

ఆ ప్రదేశమున విశ్వామిత్రమహర్షి వారి ప్రసన్నదృష్టులు రామునిపై ప్రసరించినవి. మహర్షి వాగింద్రియము మధురాతి మధురమగు రామనామములోని మాధుర్యమునుగ్రోల నుత్సహించినవి. మునివర్యులు రాముని వంకదిరిగి "రామ"

అను మధురాక్షరములతో రాముని పిలిచినారు. వాల్మీకికి ఇష్టమగు నామము. కావుననే వారి ఘట్టమున

"రామేతి మధురాం వాణీం విశ్వామిత్రోభ్యభాషత"

అనినారు. "రామ" అను రెండక్షరములు మధురవాణియట. ఈ అక్షరద్వయమునందలి మాధుర్యమును గ్రోల విశ్వామిత్రునికి కోరిక కలిగినదట. ఆ రెండక్షరములనుండి తేనెసోనలవలె ధారాపాతమై స్రవించు బ్రహ్మామృతరసమును ఆస్వాదించుచు విశ్వామిత్రు లా నామము నుచ్చరించిరట. అంతతో ఆ యక్షరత్వమునకు లక్ష్యార్థమైవిలసిల్లు బ్రహ్మామృతపానము పరిపూర్ణముకాగా ఆ రామబ్రహ్మము విశ్వామిత్రునకు వత్సరూపమున సాక్షాత్కరించగా కర్తవ్యభాగమునకు వచ్చినారట మహర్షి.

రామలక్ష్మణులిప్పుడు వారికి శిష్యులు. వారు బాలురు. సుకుమారగాత్రులు. ఆ బిడ్డల శరీర మెంత అలసినవో అనుకొనినారు మహర్షి. అంతేకాదు. వారికిక ఆకలిదప్పులు కూడ కలుగకూడదు. జ్వరాదిదోషములు ఆ బాలుర నాక్రమింపరాదు. అందుకై మహర్షివారు "వత్స! అతివేగముగ శుచిర్భూతుడవై రమ్ము. బలాతిబలవిద్యలనుపదేశింతునని ఆ విద్యల ప్రభావమును చెప్పి ఆ మంత్రరాజములను రామలక్ష్మణులకు ఉపదేశించినారు. రాముడు దేముడుగదా! వారికి మంత్రోపదేశము లేమిటి? అనకుడు? విశ్వామిత్రుని దృక్పథమున రాముడు సాక్షాన్నారాయణుడును, శిష్యుడునుకూడ. జ్ఞానుల దృక్పథమున లేక భక్తశేఖరుల దృక్పథమున ఈ జగత్తంతయు నామమాత్రముగ జగద్రూపమున వ్యవహరింపబడుచున్నను వారి అంతరాత్మయందు మాత్ర మీ జగత్తంతయు బ్రహ్మమయమయ్యో, లేక భగవన్మయమయ్యో చూడబడును.

అజ్ఞానులకొరకే మహనీయుల లోకవ్యవహారమంతయు. కావున విశ్వామిత్రునకు మన దశరథరాముడు శిష్యుడును భగవంతుడుకూడ. వాల్మీకి మహర్షివారి కవితావైభవమే రాముని లోకవ్యవహార హేతుభూతునిగను తత్వస్వరూపునిగను కూడ ప్రకటించుచు నడచినది.

కేవల భౌతికవాదుల భౌతిక మనోనేత్రములకు ఆ తపస్వి కవితా వైభవములోని కళాప్రాభవము గోచరముకాదు. నామరూపాత్మక జగత్తునే వారు చూచెదరు ఈ సృష్టికారణమును వారు వారి ఊహాప్రపంచమునం దూహింతురేగాని

వేదములు ప్రమాణములని వారనరు. కొన్ని సూక్ష్మజీవుల క్రమవికాసమే ఆది మానవుడని తలచువారికి రామాయణవైభవమేమి తెలియును? వాల్మీకి కవితావైభమున సూక్ష్మరూపమై భాసించు భగవత్తత్త్వ సౌందర్యమును వారు చూడలేరు, మన చూపు అటు తిరుగకూడదు. మనము నడువదగు బాట వైదిక సరస్వతి చూపు బాట. ఆ బాటనే మన్వాది స్మృతులును అనుసరించినవి. ఒక్కమాట.

ఆబలాతిబల విద్యలు రెండును ప్రజాపతి పుత్రులనినారు వాల్మీకి.

పితామహ సుతే హ్యేతే విద్యే తేజస్సమన్వితే.

ఆ మంత్రరాజముల ధ్యాన శ్లోక మిది.

అమృత కరతలార్ద్రౌ సర్వ సంజీవనాఢ్యా
వఘహరణ సుదక్షౌ వేదసారే మయూఖే
ప్రణవమయ వికారౌ భాస్కరాకార దేహౌ
సతత మనుభవేహం తౌ బలాతీబలేశౌ.

ఈ శ్లోకమును ప్రతినిత్యము చదువుకొనువారికి ఇష్ట ప్రాప్తి అనిష్ట పరిహారములు కలుగును. కథకు వత్తము.

ఆ రాత్రి విశ్వామిత్ర రామలక్ష్మణులు ముగ్గురును ఆ సరయూనదీతీరముననే వసించినారు. రామలక్ష్మణులు గురుశుశ్రూషలు సలుపగా ఆరాత్రి నిద్రాకాల మాసన్నమైనది. మరి ఆ రాజపుత్రుల శయన మెక్కడ? ఆ నదీతటమున నేలపై గడ్డిపరచగా అదియే వారికి శయ్యాతలమైనది.

నిజమున కది రామలక్ష్మణులకు తగిన శయ్యయా? ఒక విధముగ విచారించుచో రాముడు వైకుంఠధాముడు. ఉపనిషద్వనవిహారి. యోగుల హృదయ పుండరీకముల వసించు పరంధాముడు. అయ్యును అతడు తన సోదరునితో తృణశయనమున పరుండి విశ్వామిత్ర మునీంద్రుల వచనముల లాలితుడై నొప్పి లేకయే ఆ రాత్రిని సుఖరాత్రి గావించినాడు. భగవానుని కరుణారసప్రభావమట్టిది. ఈ విషయమునే వాల్మీకి వర్ణించినారు.

దశరథ నృపసూను సత్తమాభ్యాం
తృణశయనేఽనుచితే సహోషితాభ్యాం
కుశిక సుత వచోనులాలితాభ్యాం
సుఖమివ సా విబభౌ విభావరీ చ.

కాని విశ్వామిత్రుడానాడు ఏమి మాటల చెప్పి ఆ రాజపుత్రుల మనసుల మనసుల రంజింపజేసిరో మన మెరుగము. నాటి రాజపుత్రుల కుపాధ్యాయులు మునిపుంగవులు. ఆ రాజపుత్రులు వారి సేవాభాగ్యమున ప్రభావ సంపన్నులు కాగా కఠిన కాంతారముల యందును పాదచారులయ్యే చరించినారు. కాక ఇక్కడ వాల్మీకి కుశిక సుత వచోనులాలితాభ్యాం అనుటయందొక సొగసున్నది.

ఉపాధ్యాయులు కూడ ఆ సుతులతోపాటు చిన్నపిల్లదయ్యే మాటలతో ప్రొద్దుపుచ్చినాడని చమత్కరించినాడు కవి శ్రేష్ఠుడు.

ఆ రాత్రి గడచినది.

సరయూనది దక్షిణతటము వారికి మొదటి మజిలీ అయినది. మరల వారు పయనించవలెను.

అది ఉషఃకాలము. సూర్యభగవానుని దివ్యస్యందనము ఉదయాద్రి పైకి వచ్చుటకు ముందే మానవసమాజము నిద్రమేల్కాంచి శాస్త్రవిధుల నిర్వర్తించ వలెను. ఆ విధులలోనిదే సూర్యోపాసనము. ఉదయభానుని గురించి వేదమిట్లు చెప్పినది.

యోసౌతపన్నుదేతి స సర్వేషా భూతానాం ప్రాణా నాదాయోదేతి.
మామే ప్రజాయా మాపశూనాం, మా మమ ప్రాణానాదాయోనగాః.

యోసావాదిత్యః ప్రాతఃకాలే ప్రాచ్యాముదేతి స ఆదిత్యః సర్వేషాం ప్రాణినాం ప్రాణానాదాయ స్వీకృత్య ఉదేతి ఆయుఃక్ష యాపాదనేన ప్రాణానప హరతి. సూర్యోదయే సతి పూర్వదినస్య. సమాప్తత్వాత్ ఏకదినమాత్రం ఆయుః క్షీణం భవతి. తస్మాదేవం ప్రార్థయామహే ఆదిత్య మదీయానాం ప్రజానాం ప శూనాం చ మమ చ ప్రాణానాదాయ ఉదయం మాగా మా అపన్నహి ప్రాణా పహార హేతుం ఆయుక్షయం మాకుర్విత్యర్థః.

ఏ సూర్యుడు ప్రాతఃకాలమునందు దయించుచుండెనో ఆ ఆదిత్యుడు సమస్త ప్రాణులయొక్క ప్రాణములను తీసికొని ఉదయించునట. అనగానేమి? ఆయుర్దాయమును అపహరించుచునే ఉదయించునట. దీని భావమిది- సూర్యోదయ మగుటతోడనే నిన్నటిరోజు సమాప్తముకాగా అరోజు ఆయుర్దాయము క్షీణమగును. అందువలన హే! భగవాన్ ఆదిత్య! నా సంబంధములగు పశు పుత్రమిత్ర కళత్రా దుల యొక్కయు నా యొక్కయు ప్రాణములను తీసుకొనక అనుగ్రహింపుమని

ఆతనిని ప్రార్థించవలెను. సంధ్యాద్యనుష్ఠానములలోని భాగమంతయు ఇట్లే యుండును. మనమిప్పుడు కథాభాగమున తెల్లవారుజామున సరయూనదీతీరము నందుంటిమి. రామలక్ష్మణులు నిద్రలేవవలెను. లేవలేదు. విశ్వామిత్రమహర్షి మాత్రము కన్నుల దెరచి రామలక్ష్మణుల ముఖమండలముల తిలకించినాడు. ఆ రాజపుత్రుల ముకుళితనేత్రము లింకను విప్పారలేదు. అది మునిచంద్రులకొక శుభ సమయమైనది. నిజమునకు, నా కన్నతండ్రీ! ఇంకను నిద్రించుచుంటివా! నిద్ర లెమ్ము. తెలతెల్లవారినది. అని చుబుకముల పుణుకుచు, బుగ్గల ముద్దిడుకొని తన సుకుమార పాణితలముల బిడ్డను తట్టుచు నిద్రలేపు తల్లియగు కౌసల్య ఇచటలేదు. రాముడు నిన్నటివరకును తల్లి చాటుబిడ్డ. ఇప్పుడాతడు విద్యార్థియై తల్లితండ్రుల గారాబమును వదలి ఋషితో వచ్చినాడు. విశ్వామిత్రుడే ఇప్పుడు కౌసల్యకావలెను. విశ్వామిత్రుడు నిద్రనుండి లేచి రాముని ముఖమండలమును దర్శింపగనే కౌసల్య అతని స్మృతికి వచ్చినది. ఆమె భాగ్యగరిమను తలచుకొనగా మునికి ఆశ్చర్యము కలిగినది. ఆ గరిమ ఏమియట? రాముని కన్నతల్లి యనిపించుకొనుటయే. అంత కన్న ఏమి కావలెను?

తల్లులకు తల్లియై తండ్రులకు తండ్రియై యున్న భగవంతున కామె తల్లి యగుటను తలచి మహర్షి కౌసల్యను పేర్కొని రాముని తాను ముందుగ నిద్ర లేపినాడు. కౌసల్యా సుప్రజారామా అని.

"కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం

రామా! నిన్ను గని కౌసల్య సుప్రజయైనది. అదుగో! పూర్వ సంధ్య వచ్చుచున్నది లెమ్ము! రామా! పురుషోత్తమా! నీకు కర్తవ్యమైయున్న ఆహ్నిక మును నెరవేర్చి దేవతలకు ప్రీతిని గొలుపుము. అని రాముని ప్రబోధించినారు మహర్షి. తాత్పర్యమిది.

ఈ మేల్కొలుపునందు కొన్ని విషయములను చెప్పెదను.

విశ్వామిత్రుడు దాశరథీ యని పిలువలేదు. రామా! అని సంబోధించినాడు. అందుతో ఆ మంగళ విగ్రహములోని సౌందర్య గరిమను అనుభవించి, సర్వదుష్ట

సంహారకుడవగు నిన్ను కౌసల్య ఎట్లు కనెనో అట్లే ప్రాగ్దిశయు తమస్సంహార కరుడగు సూర్యుని కనమున్నది. భవద్దర్శనమున అజ్ఞానాంధకారము నివృత్తి యగును. కావున నీ తల్లియగు కౌసల్య వలె పూర్వ సంధ్యయు గౌరవింపదగినది. కావున రామా లెమ్ము. అని యోగ నిద్రనుండి నాడు దేవతలు మేల్కొలిపి దేవ తల కార్యమును నెరవేర్ప ప్రేరేపించినట్లే మహర్షి మరల దేవకార్యమును స్మరింప జేసినారు. రామ లక్ష్మణులు నిద్రనుండి మేల్కొనినారు. సాంధ్య కృత్యముల నెరవేర్చినారు. తరువాతది గుర్వభివాదనము. గురువర్యుల పవిత్ర పాదములపై శిరముల వాల్చి, అభివాదనను గావించినారు. కాని ఇక్కడ వాల్మీకి మహర్షి రామ లక్ష్మణుల సాంధ్యకృత్యముల వర్ణనలో "జేపతుఃపరమంజపం" అని వాడినారు. సంధ్యాదానమునకు అంగభూతము గాని ప్రత్యేకమగు మంత్ర రాజమేదియో అయి యుండవచ్చును. అంతతో వారా సరయూనదిని వదలినారు. తరువాతి మజిలీ కామాశ్రమము. అనంగాశ్రమమనికూడ దానికి పేరు. ఈశ్వరుని కంటిమంటలకు మన్మధుడు దగ్ధమై శరీరమును కోల్పోయిన దిచ్చటనే. ఈ ప్రదేశమునకు అంగ దేశమని పేరు.

ఆ కామాశ్రమ మొక పుణ్యక్షేత్రము. ఆ కామాశ్రమమున వసించు మహ ర్షుల పుణ్య పరిపాకదివసమది. విశ్వామిత్రులు రామలక్ష్మణులతో అక్కడనే వసించి, సాంధ్యకృత్యము లక్కడనే ముగియగా ఆ రాత్రి కాలము నందక్కడనే నిలిచినారు గురుశిష్యుల సంభాషణలా రాత్రి మధురములై నడవగా ఆయాశ్రమ వాసుల చెవినిబడినవి. అంతతో ఆ తపోమూర్తుల జ్ఞాన నేత్రము తెరువబడినది. రామ లక్ష్మణుల నిజ స్వరూపములు వారికి గోచరించినవి.

"విజ్ఞాయ పరమప్రీతాఃమునయో హర్షమాగమన్"

వెంటనే విశ్వామిత్ర మునీంద్రులకు రామ లక్ష్మణులకును అర్ఘ్యపాద్య ముల వారందించగా వారితో గూడ ఆ రాత్రి సంభాషణల జరిపి, విశ్వామిత్రులా రాత్రి నిద్రను చెందినారు రామ లక్ష్మణులతో. ఇది రెండవ మజిలీ. తెల్లవారినది అరుణ కిరణ సహస్రములు దశదిశల వ్యాపించగా నేడును ఇది రామ లక్ష్మణులకు సుప్రభాతమేయైనది. వారికి సాంధ్యకృత్యములు తీరినవి. హుతహుతాగ్నులై గురు వర్యుల పాదాభివందనమున కృతకృత్యులైరి. వారిప్పుడు గంగానది దాటవలెను. కావున వారికి ఆయాశ్రమవాసులైన మహర్షులే ఒక పడవను ఏర్పాటు చేయించి

దానిని అధిరోహింపజేసినారు. ఆ పవిత్రపాదుల పాదతలములచే పవిత్రమైన ఆ నావ నదీ మధ్యమునకు చేరినది. ఇది కేవలమగు గంగానదియే కాదు. బ్రహ్మ వినిర్మితమగు మానస సరోవరము నుండి బయలుదేరిన ఒక పవిత్ర వాహిని. అయోధ్యను చుట్టి ప్రవహించుచు వచ్చి, ఈ గంగాస్రవంతి యందు కలయును. ఆ ప్రవాహము మానస సరోవరము నుండి కలయుటచే దానికి సరయూనది యని పేరు. ఆ ప్రవాహ వేగములు రెండును ఒక్కచో కలయుటచే ఆ తాకిడికి గొప్ప ధ్వనియై గంగను దాటుచున్న రామ లక్ష్మణులకు ఆశ్చర్యమును గొలుపగా వారా ధ్వనిని గురించి గురువర్యుల నడిగి గంగాసరయూ సంగమ వృత్తాంతమును తెలిసి కొనినారు. ఆ పవిత్ర వాహినికి వందన సమర్పణ గావింప, గురువు లాజ్ఞాపింపగా అట్లే గావించి ఆ గంగను తరించినారు. ఇప్పటికి వారు గంగానది యొక్క ఉత్తర తీరము నుండి దక్షిణ తీరమునకు చేరుకొనినారు. అక్కడ నుండివారి గమనము అతి వేగముగ సాగినది.

## తాటక వధ

కాని వారు పోవు త్రోవ ఒక మహారణ్యమునకు పోవుత్రోవ. ఆవిషయము విశ్వామిత్రు డెరుగనిదికాదు. అతడు కావలెననియే ఆరాజపుత్రులను ఆమార్గము పట్టించినాడు. ఆ భయంకరారణ్యమున ప్రవేశింపజేసినాడు. ఆ మహారణ్యమునకు తాటకావనమని కూడ పేరు. ఆ భయంకరారణ్య వృత్తాంతము రాముని కేమి తెలి యును? ఇప్పుడాత డొక విద్యార్థి. ఆ యరణ్యమున ప్రవేశించుటకు భయపడక ఆ దేశ చరిత్రను అడిగినాడు గురువర్యులను. మహర్షి ఆ యరణ్య వృత్తాంతమును చెప్పి, ఆ వనమునకు ఒక యోజన దూరము నందుగల తాటకియను రాక్షసి నివాసమునకు రామ లక్ష్మణుల గొంపోయి ఆ తాటకిని రామునిచేత చంపించినారు. ఆ తాటకి సంహారమైన తరువాతదే సిద్ధాశ్రమ ప్రవేశమును విశామిత్ర యాగ రక్షణము కూడ.

మన రామాయణ మహా కావ్య నాయకుడగు భగవానుని అవతారమున కిది యొక కళంకమనిపించును విమర్శకులకు. నిజమునకు స్త్రీ వధ యనునది సామాన్యమగు పాపముకాదు. పాప పుణ్యము లనునవి కలవని నిర్ణయించిన భార తీయ ధర్మశాస్త్రములే స్త్రీహత్య బ్రహ్మహత్య గోహత్యల నొక పంక్తిగ వర్ణించి

వవి. ధర్మోద్ధరణకై అవతరించిన ఆవతారమూర్తియే మొదట స్త్రీ హత్యా పాప మును ఒడిగట్టుకొను టేమిటి? ఇదేమి ధర్మము? ఆరాముడుధర్మాత్ముడెట్లయ్యెను? అందును బ్రహ్మర్షి యనిపించుకొన్న అహింసావ్రతు డిందు ప్రేరకుడు. అనునదే నేటి కొందరు పండితమ్మన్యుల వాదము. పిడివాదములు చేయు ఆ పండితమ్మ న్యుల నొప్పించుట నా ప్రయత్నము కాదు. కాని ఆ వాదము కూడ నిజమేనను కొను జిజ్ఞాసువుల హృదయములు కలుషితములు గాకుండుటకు ఆ ప్రశ్నలకు సమాధానము నందించుట నా కర్తవ్యము. జిజ్ఞాసువులు ముందొక నిర్ణయమునకు రావలెను. గుణ దోషముల నిర్ణయించునది మన బుద్ధి కాదు. విధి నిషేధములను నిర్ణయించునవి వేద శాస్త్రములు. గీతా శాస్త్రము వైపుకు మీ దృష్టి నొక్కమారు ప్రసరింపజేయుడు.

"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్య వ్యవస్థితౌ

ఈ కార్యము చేయదగినది. ఈ కార్యము చేయరానిది అని నిర్ణయించునవి వేద శాస్త్రములు అని గీత నిర్ణయించినది.

ఇక తాటక వధను పరిశీలింతము.

విశ్వామిత్ర మహర్షి ఏ విధమగు ధర్మాధర్మ వివేచన చేయకయే తాటకిని రామునిచేత చంపించెనా? రాముడు కూడ మహర్షి చెప్పుట తడవుగా గ్రుడ్డిగ చంపెనా? అను ప్రశ్నలు మన కిక్కడ పుట్టదగిన ప్రశ్నలు. ఆప్రశ్నలకు జవాబు ఎట్లు దొరుకును? జరిగిన కథాఘట్టమును ఆమూలాగ్రముగ తెలుసుకొన్న తేలును. ధర్మ పథము తోడనే ప్రారంభమగు భారతీయ వాఙ్మయమును ధర్మాధర్మ విమ ర్శలు గావింపకయే కార్య నిర్ణయము చేయునా? చేయదు.

రాజు యొక్క లేక పరిపాలకుల యొక్క కర్తవ్యమేమి? దేశ భద్రతను కాపాడుట. అనగా సురక్షితమై వైభవోపేతమైయున్న దేశ సౌభాగ్యమును నాశము చేయు వారిని శిక్షించి, ఆ దేశ వైభవమును కాపాడి అందున్న ప్రజలకు భద్రత కల్పించుట. అట్లే పవిత్రపాదులై నిష్కళంక జీవితముల గడుపుచు హింసాత్మక జీవతమును కాలదన్ని ఆరణ్యక జీవితముల గడుపు మహనీయుల కర్తవ్యమేమి? మూలమూలల పడియున్న పతన ప్రదేశముల నుద్ధరింపజేయుటే వారి కర్తవ్యము. దేశ ప్రజలకు ఎవరి వలన ఇక్కట్లు కలిగెనో వారిని, వారి సంబంధీకులను తుడిచి వేయక ఉద్ధరించుట ఎట్లు? కావున విశ్వామిత్రుడీ ప్రదేశమును నాశము గావించు

తాటకిని సంహరింపజేయుటకై రాముని ఈ దేశమునకు తీసుకొని వచ్చినాడు. ఇప్పుడు తాటకి తిరుగు ప్రదేశమునకు మలద, కరూశ దేశములని పేరు. ఇవి ఒక కాలమున ఇంద్రుడు వృత్రాసురుని చంపగా అతనికి బ్రహ్మహత్యా పాతకము వచ్చినది. ఆ పాప పరిహారమునకై, అనేక పవిత్ర నదుల నుండి ఉదకమును తెచ్చి దేవత లందరును ఇంద్రుని స్నానము చేయించగా అతని మలము(దోషము)పోయి నది. అతని మలము తొలగిన ప్రదేశము మలద దేశము. అతని ఆకలి పోయిన దేశము కరూశము. దేవేంద్రుడీ దేశములకు వరముల నిచ్చి, వీటిని సంపన్న దేశముల గావింపగా ఈ తాటకి ఆ దేశముల పంటల నాశము గావింపుచు ప్రజలను పీడించుచున్నది. ఆ తాటికి కొడుకే మారీచుడు. అతడును ఆమెకు సాయముకాగా ఈ దేశ మంతయు నాశమైనది. రామా! ఈ తాటకిని వేరెవ్వరును చంపజాలరు. కావున నీవు చంపి దేశమును రక్షింపుమని ముని ప్రేరేపించినారు. వెంటనేరాముడు చంపలేదు. తాటకి పూర్వ చరిత్ర నంతను అడిగి తన కర్తవ్యమును గురించి బాగ విమర్శించి తాటకిని సంహరించినాడు.

తాటకి చరిత్ర ఇది.

తాటకి సుకేతువను యక్షుని కూతురు. యక్షుడు సంతానమునకై బ్రహ్మను గూర్చి తపము గావింపగా బ్రహ్మ సంతసించి వేయి ఏనుగుల బలముగల పుత్రి కను ప్రసాదించినాడు. ఆ యక్షియే రాక్షసియగు తాటకి. యక్షులు దేవతాయోని విశేషులు. మరి రాక్షసి ఎట్లయినది? తండ్రి ఆ యక్షిని సుందుడను రాక్షసునకిచ్చి వివాహము చేసినాడు. ఆ సుందుని వలన ఆమెకొక పుత్రుడు పుట్టినాడు. అతడే మారీచుడు. ఒక కాలమున సుందుడు అగస్త్య మునీంద్రుని చంపుటకై ఆయన మీదకు పోగా ఆ మునీంద్రుడు మారీచుని రాక్షసుడవు కమ్మనియు, తాటకిని మను జుల భక్షించు మహాయక్షివై నీకున్న ఈ సుందర రూపమును వీడి భయంకర స్వరూపమును ధరింపుమని శపించినాడు. ఆ శాపము తాటకికి తీవ్ర కోపమును కల్పింపగా ఈ దక్షిణ దిగ్భాగము నంతను నాశము చేయుచున్నది. ఇట్టి స్త్రీని ఏమి చేయవలెను? ఇట్టి స్త్రీని చంపుట దోష మెట్లగును? కావుననే రాముడుతాటకిని చంపుటను గురించి విశ్వామిత్రుడు కొన్ని ఉదాహరణల నిచ్చి రాముని ఒప్పించ వలసి వచ్చినది. తాటకిని చంపుటను గురించి విశ్వామిత్రుడు చెప్పిన మాటలివ్వి.

న హి తే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ
చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా
నృశంసమనృశంసం వా ప్రజారక్షణ కారణాత్
పాతకం వా స దోషం వా కర్తవ్యం రక్షతా సతా
రాజ్యభారనియుక్తానామేషధర్మస్సనాతనః

రామచంద్రా! నీవు స్త్రీ వధను గురించి దయ చూపనక్కరలేదు. నాలుగు వర్ణములను రక్షించుటకై చేసిన హింస హింస కాదు. అది చేసి తీరవలసిన విధి కర్మకాని నిషేధ కర్మకాదు. రాజునకు కర్తవ్యమగు కర్మ. అది ఎంతటి క్రూర కర్మయైనను నిందాపూర్వకమైనదైనను ప్రజా రక్షణ కార్యమును రాజు చేయ వలెను. ఇది సనాతనమగు ధర్మము. దీనికి ఉదాహరణ ఏమందువా? దేవేంద్రు డొకప్పుడు విరోచనుని పుత్రిక మంధర యనునది భూదేవిని చంపబోగా ఆమెను చంపినాడు. అట్లే శ్రీమహావిష్ణువు శుక్రాచార్యుని తల్లిని చంపినాడు. ఆమె ఇంద్రు డను వాడే వుండకూడదని తలపెట్టగా అట్లు చేయవలసి వచ్చినది. కావున అధర్మాత్మురాలగు ఈ తాటకిని చంపుట దుష్ట శిక్షణ యగునుగాని దోషము కాదని చెప్పగా రాముడిట్లు మునికి సమాధాన మిచ్చి ధనుష్టంకారమును చేసినాడు.

సోహం పితుర్వచశ్శ్రుత్వా శాసనాద్బ్రహ్మవాదినః
కరిష్యామి న సందేహ స్తాటకావధముత్తమం
గో బ్రాహ్మణ హితార్థాయ దేశస్యాస్య సుఖాయ చ
తవ చైవాప్రమేయస్య వచనం కర్తుముద్యతః

రాముడు దోసిలి యొగ్గి, నా తండ్రి మహర్షుల మధ్య రామా! నీవు ఈ కౌశికుని మాటను తప్పక పరిపాలింపవలెనని ఆజ్ఞాపించినారు గాన నా తండ్రి వాక్యమును నేను అనుమానింపకుండ బ్రహ్మవాదులగు మీ ఆజ్ఞను పాలింతునని గోబ్రాహ్మణ హితము కొరకును దేశ హితము కొరకును నేనీ తాటకిని చంపుదు ననినారు. ఒక సైనికుడు యుద్ధ రంగమునందెవ్వరు తన కెదురైన విలుతురో వారిని కొట్టుటచే దోషి కానేరడు. అది యుద్ధ శాసనమును పాలించుటయే అగును. అది అధర్మము కాదు. ధర్మమే. అట్లు చేయకపోవుట అధర్మము. కావుననే దుర్మార్గులగు కౌరవుల వధించకున్న పాపమనియు వారిని వధించుట పుణ్యమనియు గీతాచార్యులు చెప్పినారు. ఆ గీతాచార్యు డెవరు? ఈ రాముడే.

ఇక తాటకిని రాముడు ఎట్లు శిక్షించెనో చెప్పెదను.

రాముడా వన మధ్యమున తన వింటి నారిని ప్రయోగించినాడు. ఆ శబ్దము దశ దిశల ప్రతిధ్వనించగా ఆ వన మధ్యము నందున్న వారందరును ఉలికి పడి నారు. తాటకికి ఆ రాముని జ్యానినాదము తీవ్రమగు క్రోధమును కలిగించినది. వెంటనే మూర్ఛబడినది. కొంతవడికి లేచినది. ఆ తాటకి రాముడున్న ప్రదేశము నకు కొంత దూరము నందున్నది. అయ్యును ఆ ధ్వని తరంగముల ననుసరించి రాముడున్న చోటున కేతెంచినది. రాముడు దాని వికృతాకారమును చూచి నవ్వు కొని లక్ష్మణునకు చూపి పిరికి వారికిది భయంకర రూపమని చెప్పి, ఆ రాక్షసిని దయతలచి చంపలేదు. ఆ రాక్షసి ముక్కు చెవుల నరికి ప్రాణము నుంచ దలచి నాడు. అంతతో ఆమె దుండగీడుతనము తొలగునని తలచినాడు. మృత్యువు నెవడు తప్పించగలడు? రాముని పైకి దుమికినది ఆ క్రూరురాలు. అప్పుడు విశ్వామిత్రుని హుంకారము ఆ రాక్షసి బలమును కుంటుపరచినది. అయ్యును ఆ యక్షి మాయా వాది. కామరూపధరురాలు. మాయా యుద్ధమును చాలాసేపు చేసినది. రాముడు ఆ రక్కసికి మాయమగు శక్తిని పోగొట్టినాడు. అయ్యును పైకి వచ్చినది. పర్యవసాన ముగా చంపక తప్పనిసరికాగా తాటకిని వధించి, లోక కళ్యాణమును కల్పించినాడు.

అంతతో పుష్పవర్షములు కురిసినవి. సాధు వాదములు చెలరేగినవి దేవ లోకమున. తరువాత కథ ఏమి ?

దేవతలు రామునకు దివ్యాస్త్రముల నిమ్మని విశ్వామిత్రుని ప్రేరేపింపగా ప్రజాపతియగు భృశాశ్వుని పుత్రులు అస్త్ర రూపమున వెలయగా ఆ అస్త్రము లన్నియు తన దగ్గర ఉండుటచే ఆ యస్త్రములను రామున కివ్వ నిశ్చయించినాడు.

విశ్వామిత్రుని కోర్కె నెరవేరినది. శిష్యుల శిరమును మూర్కొని ఆనం దించి ఆ రాత్రి అక్కడనే రామలక్ష్మణులతో వసించినారు. ఆ వనము నిష్కం టకమైనది. అది ప్రాతఃకాలము. రామునకు విశ్వామిత్రులు అస్త్రములనన్నింటిని ఉపదేశించినారు. యదార్థమునకు ఆ అస్త్రముల అధిష్ఠాన దేవతలు రాముని కింకరులే. అవి ఉపదేశము ఇచ్చుట తడవుగా రామునకు సాక్షాత్కరించినవి. వాటిని హస్తముచే తాకి నేను స్మరించినప్పుడు రమ్మనినారు. అస్త్రములు అంత ర్ధానము నొందినవి.

బాణయుద్ధము బాహుపరాక్రమముపై ఆధారపడగా అస్త్రయుద్ధము మనస్సంయమముపై ఆధారపడినది. అస్త్రవిధానమంతయు ప్రయోగము, ఉపసంహారమనని రెండు భాగములు. శత్రువుపై ప్రయోగించిన ఆ యస్త్రము తన కార్యమును నెరవేర్చులోపల మరల దానిని తన స్వాధీనము గావించుకొనదగు శక్తికి ఉపసంహారమని పేరు. ఇప్పుడు రామునకు ఆ అస్త్రములను ప్రయోగించు విధానమును చెప్పినారు మహర్షి. ఉపసంహారమును తెలుపలేదు. రాముడు కోరినాడు దానినికూడ. మరునాడు మహర్షి ఆ ఉపసంహారమును కూడ రామునకు ప్రసాదించినారు. ఇక వారు వెళ్ళవలసినది సిద్ధాశ్రమమునకే.

వారి పయనము సాగినది.

## యాగరక్షణము

అది సిద్ధాశ్రమము. తపస్సిద్ధికి నిలయము. అదితి తపస్సిద్ధినొంది వామనమూర్తికి తల్లియైనది ఈ యాశ్రమముననే. కావుననే దానికి సిద్ధాశ్రమమని పేరు వచ్చినది. శ్రీమహావిష్ణువు కూడ కొన్నివేల యుగము లిక్కడ తపముగావించెనట. ఈ ఆశ్రమమేమి? అని రాముడు ప్రశ్నించగా ఈ కథను శిష్యునకు సమాధానముగ చెప్పుచు తన సిద్ధాశ్రమమున అడుగిడినారు విశ్వామిత్రులు శిష్యులతో కూడ. ఆ యాశ్రమవాసుల వలన రామలక్ష్మణులకును విశ్వామిత్రునకును అతిధి పూజలందినవి. ఒక్క రెండు ఘడియల కాలము గడిచినది. అతడు దీక్షను గైకొనవలయును. రామలక్ష్మణులు గురువర్యులను మీరు దీక్షితులగుడు. మేము మీ కార్యసిద్ధిని కల్గింతుమని తమ సంసిద్ధతను తెలిపినారు. ఇప్పుడు మహర్షి దీక్షితుడు. ఆయన దీక్షయందు మౌనము ముఖ్యము. ఆయన యజ్ఞదీక్ష నిజమునకు పదిరోజులు. మధ్యేమార్గమున నాలుగు రోజులు గడచినవి. ఇక మిగిలినవి ఆరురోజులు. ఈ ఆరురోజులలో ఈ యజ్ఞవిఘ్నమును కల్పించు రాక్షసులు ఎప్పుడైన రావచ్చును. ఎటునుండియైన రావచ్చును. ఈ విషయమంతయు అచ్చటి ఋషులవలన తెలిసికొనిన రామలక్ష్మణులు ధనుర్ధారులై నిలిచినారు. అహోరాత్రములుకూడ అయిదురోజులు గడచినవి. అరవరోజు మునివర్యులు పూర్ణాహుతి గావింపగా యజ్ఞము పూర్తియగును. రామలక్ష్మణులు రాక్షసు లెటు నుండి వత్తురోయని చూచుచుండిరి. రాక్షసు లెటువైపునను కనబడలేదు. ఇదియే చమత్కారము.

వారు కనబడరు. వారు మాయావులుగదా! వారు ఉత్పాతములు కల్పింతురు. అరవరోజున హోమాగ్ని ఒక్కమారుగ మంట లెగసినది. అంతతో ఆ వేదికయందలి యజ్ఞపాత్రలును, దర్భలును దగ్ధమైనవి. అదియే మారీచ సుబాహువుల రాకకు చిహ్నము. అ క్షణముననే ఆకాశమున భయంకరధ్వని యొకటి వినవచ్చినది. ఆ ధ్వని ననుసరించియే ఆకసము మబ్బులతో ఆవరింపబడినది. అది వర్షాకాలముకాదు. అది రాక్షసమాయయే. మారీచ సుబాహువులు వారి పరివారముతోగూడ వచ్చినారు. నేడే పూర్ణాహుతి దివసము. ఈరోజునేవారు నాశముగావింపవలెను. అంతలో రక్తవర్షము వేదికలయందు పడినది.

రాముడు ఆ ఉత్పాతముల గమనించినాడు. తన విశాలదృష్టులను ఆకసముపైకి బరపినాడు. రాక్షసానీకము అతని కంటబడినది. ఇది బాణ యుద్ధమునకు సమయము కాదనిపించినది రామునకు. ఇట్టి సమయములయందే అస్త్రముల యుపయోగము. మానవాస్త్రమొక అమోఘమగు అస్త్రము. దానిని చేతబట్టినాడు రాముడు. లక్ష్మణునివంక దిరిగి, ఆయస్త్రప్రభావమును వర్ణించి మారీచునిపై వదలినాడు. అప్పుడు మారీచుదేమి కావలెను? చావవలెను. చావలేదు. నూరామడదూరమువకు నెట్టుకొనిపోయి అచ్చట పడినాడు. వెంటనే మరియొక అస్త్రమును తీసినాడు. శ్రీరామచంద్రుడు. అదియు మానవాస్త్రమే. మొదటి అస్త్రములోని భాగము. ఇప్పుడీ భాగముకూడ మారీచునిపై ప్రయోగింపబడినది. ఈ భాగము శత్రువును చంపదు. తెలివిని నాశనము చేయును. రాముని సంకల్పమదియే. మారీచుని చంపదలచలేదు. అతనితో జరుగవలసిన కథాభాగము ముందున్నది. అది రాము డెరుగనిదికాదు రాముడెరుగునని మన మెరుగుట చాల అవసరము.

మిగిలిన వాడు సుబాహువును, అనుచరవర్గమును వారిని యమపురికి పంపవలెను. ఆగ్నేయాస్త్రము వారికి తగిన అస్త్రము. దానినే స్మరించినాడు దాశరధి. సుబాహువు దానికి బలిగాక తప్పలేదు. మిగిలిన రక్కసులును చచ్చినారు. కాని వారిని వాయవ్యాస్త్రముచే దూరమున పడవేయగా వారు చాలదూరమున చచ్చిపడినారు. ఈ రోజుకొరకై మునులు ఎదురుచూడగా నేటికి సిద్ధించినది వారి సంకల్పము.

మహర్షిమండలముయొక్క ముఖమండలములన్నియు ఒక్క మారుగ విక

సించినవి. ఇంతను విశ్వామిత్రులు మౌనమును వీడలేదు. కారణమేమి? యాగము పూర్తికాలేదు. కర్మమధ్యమునందేమైన విఘ్నములు జరుగుచో ఆ కర్మప్రాయశ్చిత్తమున కాని పూర్తికాదు. కావున ప్రాయశ్చిత్త కర్మను పూర్తిగావించుకొని ముని మౌనమును వీడినారు. భగవానుని యాగరక్షణ లీలా వైభవము పూర్తియైనది- గురువర్యుల పరిపూర్ణ కటాక్షము రామునిపై ప్రసరించినది.

కృతార్థోస్మి మహాబాహో కృతం గురు వచస్త్వయా
సిద్ధాశ్రమమిదం సత్యం కృతం రామ మహాయశాః.

విశ్వామిత్రమహర్షి సంతోషస్వాంతమున ఆ రాచబిడ్డను, తన శిష్యునిగ భావించి అతని అద్భుత పరాక్రమమును ప్రశంసించి, ఆ పరిపూర్ణాత్మని రామ! అని సంబోధించి ఈ సిద్ధాశ్రమము సార్థకనామము గలదైన దనినారు. గురువునకు ప్రీతిధనము నొసంగితి వనినారు. అట్లు గురుముఖముగ నందుకొన్న ప్రశంసల కా రాముడు నేను ప్రశంసాపాత్రుడ నైతిననుకొనలేదు. తన కర్తవ్యవిధిని నెరవేర్చితిననియే భావించి, మునివర్యుల పాదములకు తన సోదరునితో కూడ వందనమాచరించి ఇట్లు పలికినారు.

ఇమౌ స్మ మునిశార్దూల కింకరౌ సముపస్థితౌ
ఆజ్ఞాపయ యధేష్టం వై శాసనం కరవామకిం.

ఓ! మునిశార్దూల! ఇదిగో మీ కింకరులు. తమ ఆజ్ఞానుసారముగ వర్తించుటకు సిద్ధముగ నుండిరి. తామింక ఏమేమి శాసనముల శాసింతురో శాసింపుడని పలికి వినయపూర్వకముగ ఆ మునికి ఎదురుగ నిలిచినారు రామలక్ష్మణులు.

భగవంతుడు జీవులకు ప్రభువగుటయే కాదు. అతడు ధర్మమూర్తులగు వారికి కింకరుడుకూడ. భాగవతమున భక్తులకు భగవంతుడిచ్చిన సందేశమిది.

చలమున బుద్ధిమంతులగు సాధులు నా హృదయంబు
లీల దొంగిలికొనిపోవుచుండుదు రకిల్బిషభక్తి
లతాచయంబులన్ నిలువగబట్టి కట్టుదురు నే
రుపుతో మదకుంభి కైవడిన్.

భగవంతునకే కర్తవ్యమును లేదు. అతడు సాక్షిమాత్రుడు. దీపకాంతికి తాను వెలుగుచూపుటయం దేయభిప్రాయమునులేదు. తనకు తానై వెలుగును. తన్నెవ్వరైన వాడుకొనుచో ఉపయోగపడును. అట్టి అర్థము నిచ్చునదే ఇప్పుడు రాముడు పలికిన పలుకు. మునివరులారా! మీ కోరికల నెరవేర్తును కోరు కొనుడు అనినాడు శ్రీమన్నారాయణుడు. అంతతో సిద్ధాశ్రమకృత్యము నెరవేరినది. ముందు భవిష్యత్కాలమున జరుగవలసిన కథాభాగము చాలయున్నది. ఆ రామ లక్ష్మణులను ఇక్కడనుండి ఎక్కడకు నడిపించవలెనో ఆ మహర్షుల హృదయ మున నిర్ణయమయ్యేయున్నది.

వారి మిథిలానగర పయనమును విశ్వామిత్రుని ముఖముగ రామునకు తెలిపి, అక్కడ రాకొమరులకొరకు ఎదురుచూచు ధనుర్యాగమున కాహ్వానించి నారు. రాముడుత్సాహముతో తన ఇష్టమును తెలుపగా విశ్వామిత్రునితోసహా వారందరును మిథిలానగరమునకు పయనమగుటకు నిశ్చయించుకొనినారు.

నిజమునకు విశ్వామిత్ర మహర్షి వారు వసించు ఆశ్రమమిది కాదు. హిమ వత్పర్వత సమీపము నందాయన ఆశ్రమము. తాను తలచిన కార్యసిద్ధి కొరకే ఈ సిద్ధాశ్రమమున కేతెంచినారు. చాల కాలమైనది. కార్యసిద్ధియైనది. కావున ఆత డిక తన స్వస్థానమున కేగుటకే నిశ్చయించుకొనినాడు.

ఈ సిద్ధాశ్రమము నుండి రామలక్ష్మణులతో విశ్వామిత్రునితో కలిసి మరి కొంత మంది మహర్షులు కూడ బయలుదేరు చుండిరి గదా! వారు కొన్ని బండ్లను కట్టుకొనినారు. ఆ బండ్లపై వారి అగ్నిహోత్రములను, ఆజ్యే దర్భలను సమిధలను గూడ వుంచుకొనినారు. అగ్నిహోత్రముల నుంచుటయన వారు నిత్యమును చేసు కొను అగ్నులను అరణులయందు మంత్రములతో ఆరోపించి ఆ అరణులను బండ్లపై నుంచినారు. ఆ శకటములు నూరున్నవి. కాని వారందరును కేవల కర్మ ఠులు కారు. లోక సంగ్రహార్థముగ కర్మల నాచరించు జ్ఞానయోగులు. వాల్మీకి మహర్షి ఈ ఘట్టమును వర్ణించుచు "ప్రాయేణబ్రహ్మవాదినాం" అని వాడినారు. ఇక రామలక్ష్మణులతో ఆ మహర్షి సంఘము యొక్క పయనము సాగవలెను. ఈ యాశ్రమము నుండి విశ్వామిత్రుని చివరి పయనమిది. ఆతడిక ఈ యాశ్రమ మునకు తిరిగిరాడు గదా! ఎంత కాలమునుండియో ఈ యాశ్రమమున వసించు మహర్షి సత్తముడు. ఆ వనదేవతల అనుజ్ఞను గైకొనవలెను. తన కృతజ్ఞతను

వారికి చెప్పుకొనవలెను. మహర్షుల ఆశ్రమములందు వసించు మృగ పక్షి గణ మంతయు వారి ఆప్త బంధువులు. అహింసా సిద్ధాంతమన వైదిక మతములోననే పూర్ణత నొందితిని. వైదిక మత పరిపూర్ణ స్వరూపము నాడు ఋష్యాశ్రమముల రూపొందినది. స్థావరముల వదలి జంగమములలో మాత్రమే చైతన్యమునుచూచుట పరిపూర్ణతత్వము కాదు. స్థావర జంగమాత్మిక ప్రపంచమునంతను ఆత్మబంధువుగ గ్రహించుటయే అహింసా సిద్ధాంతము యొక్క చరమస్థితి. మీరొక్కమారు విశ్వామిత్రుని పయనము వైపుకు తిరుగుడు. ఆతడు వనదేవతల నందర సంబోధించి, మీ కందరకును మంగళమౌగాక నేను వెళ్ళి వత్తునని చెప్పినారు. వన దేవతలన ఎవరు ? వారా వనము నందెక్కడ యుందురు ? అందున్న వృక్షము లతాగుల్మములే వనము. ఆ వనములో ప్రతి ఉపాధియు జీవ చైతన్యము కలిగియే తమను కాపాడు అధిష్ఠాన దేవతల అనుగ్రహ పాత్రములై యుండును. చెట్లకు ప్రాణమున్నదని ఇటీవలి వారు కనిపెట్టి రుజువు చేసినారనుట వెర్రితనము. కాళిదాసు శాకుంతల నాటకమున శకుంతలను అత్త వారింటికి పంపునప్పుడు కణ్వ మహర్షిచే ఆమె పెంచిన చెట్లతో మాట్లాడించినారు, ఆ లతానికుంజములతో మా అమ్మాయి అత్త గారింటికి పోవుచున్నది మీరంద రనుజ్ఞనీయుడని పలికించినాడు. ఇది వాల్మీకి భావమే. విశ్వామిత్రు డిట్లు అడిగినాడు.

"స్వస్తి వోస్తు గమిష్యామి సిద్ధ స్సిద్ధాశ్రమాదహం

అంతేకాదు. ఆయన పయనమును ఆత్మ బంధువుల వలె ఆ సిద్ధాశ్రమము నందలి మృగ పక్షి గణము కొంతదూరము ఆ మహర్షి వెంటనంటి మరల విశ్వామిత్రుడు మీరు నిలువుడని అనుమతి నివ్వగా ఆ యనుమతితో అవి మరలి వెళ్ళినవట. అప్పుడు మునులకును వారి ఆశ్రమములోని జంతులవుకును ఎంత ప్రేమ సంబంధ మున్నదో ఊహించుచో భారతీయ అహింసా సిద్ధాంతము అర్థము కాగలదు. కథకు రండు.

వారి పయనము ముందుకు సాగినది.

అది గిరివ్రజ పట్టణము. అయిదు పర్వతములా నగరమునకు దుర్గములై చుట్టియుండుటచే ఆ నగరమున కాపేరు వచ్చినది. ఆ మహా నగరమునకు భాగ్య దేవతయై ఆ నగర వాసులకు ఆహారధాన్యముల నందించునది శోణానది. ఈ నదీ జలములు ఎర్రనై యుండుటచే ఈ నదికి ఆ పేరు వచ్చినది. నిజమునకు దానికి

మాగధీనది యనియే పేరు ఈ నదీమతల్లి ఆ అయిదు పర్వతముల మధ్య భాగమును చుట్టి మాలవలె శోభిల్లుచుండును. మన మహర్షులు ఆ మగధ దేశమునకు పోవునరికి సూర్యుడస్తాద్రి కేగుచుండగా వారక్కడ నిలిచినారు. సాయంకాలమగునరికి వారు సంధ్యాధ్యనుష్ఠానముల గావించుకొని అగ్నిహోత్రములను చేసుకొనవలెను. అట్లే ఆనాటి సాయంకాలము నడచినది తరువాత వారందరును ఒక్కచో కూడగా శ్రీరామచంద్రుడు ఆ ప్రదేశమును పరిపాలించున దెవ్వరు? ఈ దేశ చరిత్ర ఏమని యడుగగా ఆ దేశ వైభవమును, ఆ వైభవమును ప్రజల కనుభవింపజేయుచున్న మహారాజు చరిత్రను చక్కగ చెప్పినారు. రామునితో పాటు మునులందర శ్రోతల గావించుకొని. దేశ వైభవమును చెప్పినాను గదా? ఆరాజు చరిత్రను వినుడు సృష్టి భాగము రెండు విధములుగ యున్నది. అందొకటి సంకల్ప సృష్టి. రెండవది మిధున సృష్టి. సంకల్ప సృష్టిలోని వారే నారదాది మునీంద్రులు. మొదటి సృష్టికి తల్లిదండ్రులతో పనియుండదు. సత్య సంకల్పుడగు చతుర్ముఖుడు సంకల్పించగనే స్త్రీ గాని పురుషుడు గాని ఎదుట నిలుచును. అవసరమును బట్టి బ్రహ్మ అట్టి సృష్టిని గావించును. ప్రస్తుత మన కథాంశమున చతుర్ముఖుని సంకల్పముచే జ్ఞాన బల సంపన్నుడగు ఒక పురుషుడు సృష్టము కాగా అతనికి కుశుడను పేరు కలిగెను ఆతడు భూలోకమున ప్రజాపాలన కొరకే సృష్టించబడిన మహనీయుడు.

బ్రహ్మయోని ర్మహా నాసీత్కుశో నామ మహాతపాః

ఆతనికి పరిపాలనా విధానమునకై యోగ్యమగు సంతానమునుకూడ కలుగుటకుకూడ తగినస్త్రీని పెండ్లి కావింపగా ఆమెయందు నలుగురు పుత్రులు పుట్టినారు.

కుశాంబుడు, కుశనాభుడు, అధూర్తరజసుడు, వసువు అనువారలు. ఆ నలుగురును నాలుగు పట్టణముల నిర్మించుకొనినారు. కౌశాంబి, మహోదయ, ధర్మారణ్య, గిరివ్రజము లనునవి.

అందు వసువను వానిది ఈ గిరివ్రజము అని ఈ వసువు చరిత్రతో ముగించక ఆ కుశుని సంతతిలోని కుశనాభుని చరిత్ర నొక దానిని కూడ చెప్పినారు.

కుశనాభునికి నూర్గురు పుత్రికలు పుట్టినారు ఘృతాచియను అప్సరస స్త్రీయందు. ఆమెకు ఘృతాచియను పేరెందుకు కలిగినదో తెలియునా? పురుషుని హృదయము ఆమెను చూడగనే నేతివలె కరుగును. ఆమె సౌందర్యమట్టిది. ఆ

కన్యకలు మహా సుందరాంగములు కలిగి లోకైక సౌందర్యమున విలసిల్లుచుండిరి. ఒకనాటి ఘట్టము.

ఆ సుందరీమణులు నూర్వురును ఒక ఉద్యాన వనమున మెరుపు తీగెల వలె మెరయుచు నాట్యకళా కౌశలముల చూపుచు తమ ముక్తకంఠరవముల గానము గావించుచు విహరించుచుండిరి. ఉపాధి కలిగిన ప్రతి వారి యందును కామాది వికారములు కలుగుననియే ఉపనిషత్సిద్ధాంతము. విషయ వాంఛలు సంపూర్ణముగ రూప నామముల కోల్పోవవలెనన్న ఆత్మ దర్శన మబ్బవలెను. అంతవరకును నిర్బీజముగ కామాదులు నాశము నొందవు.

"విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః
రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే

గీత.

ప్రస్తుతమున ఆ సుందరీమణుల రూప యౌవన సౌభాగ్యములు వాయు దేవుని ముగ్ధుని గావింపగా అతడు వచ్చి ఆ కన్యకామణులను కోరినాడు. అనూర్వురును ఒప్పలేదు. ఒప్పుకొనక పోవుటయే కాదు. వారు వాయువును నిన్ను మేము శపింపగ సమర్థులమయ్యును శపించుట లేదని చెప్పి. "పితాహి ప్రభురస్మాకం" అనినారు. మేము స్వయముగ భర్తల గ్రహించము. మా తండ్రి ఎవరి కిచ్చునో అతడే మా భర్త అని జవాబివ్వగా వాయువు కోపించి ఆత దంతర్యామి యగుటచే వారి లోపల ప్రవేశించి వారిని పొట్టివాండ్ర గావించి విరూపలజేసెను. వారు గృహమున కేగి తండ్రికి జరిగిన చరిత్రను విన్నవించినారు. కుశనాభుడు వారి విజ చరిత్రను తన ధ్యానమున గుర్తెరిగి, ఆ కన్యకామణులు దేవతలలోని వాడగు వాయువు యొక్క సంగమును గూడ కోరక నిగ్రహించి, శాప సామర్థ్యము కలిగియు శాపము నిడక వచ్చిన వారి క్షమాగుణ సంపదకు మురిసి, మీ వలన నా వంశము పవిత్రమయ్యెనని ఓరిమియను గుణము నిట్లు ప్రశంసించినాడు.

"అలంకారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా

.... .... .... .... .... .... ....

క్షమా దానం క్షమాయజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితల జగత్

క్షమయే దానము. క్షమమే యజ్ఞము. క్షమయే సర్వమునని క్షమను గురించి చెప్పి, తన పుత్రికల సమాధానపరచి, ఇట్టి కుబ్జా రూపముల నున్న తన పుత్రికలకు భర్త ఎట్లు వచ్చునని మంత్రులతో ఆలోచించినాడు.

వచ్చిన ప్రతిబంధమునకు విచారించుచు కూర్చొనక ఆ ప్రతిబంధక నిర్మూలనకు ప్రయత్నించవలెనుగదా। మంత్రులతో ఆలోచింపసాగినాడు.

ఎవ్వరి భాగ్యరేఖలెక్కడ ఉదయించునో ఎవ్వరెరుగుదురు? కాంపిల్యమను నగరమును బ్రహ్మదత్తుడను మహారాజు పాలించుచుండెను. ఆ రాజుదొక విచిత్రమగు సృష్టి. సోచూళి యను ఒకరాజు బ్రాహ్మీశక్తికలిగి, ఊర్ధ్వరేతస్కుడై తపము గావించుచుండ సోమద అను ఒక గంధర్వస్త్రీ అయనకు చాలాకాలము శుశ్రూషచేయుచుండెడిది. అట్లు కొంతకాలము గడపగా ఆమె శుశ్రూషకు మెచ్చి, ఏమైన వరమును కోరుకొమ్మనినాడా ఋషి. ఆ సోమద మహాత్మా నాకు నీ తపోమహిమచే సంతానము ననుగ్రహింపుమని కోరినది. అప్పుడా చూళి తన సంకల్ప మాత్ర ప్రభవుడగు పుత్రుని ఆ గంధర్వికి ప్రసాదించినాడు. ఆతడే బ్రహ్మదత్తుడు. ఆతడు ఋషికి స్త్రీసంబంధముచే కామసేవనమున పుట్టలేదు. ఆ బ్రహ్మదత్తునకే ఈ కన్యల నందర నిచ్చినాడు కుశనాభుడు. ఆ బ్రహ్మదత్తుడు ఆ కన్యల పాణితలముల తాకగానే వారి వికృతరూపములు పోయినవి. సుందర తనువులు వచ్చినవి. కుశనాభుని సంతోషమునకు మేర ఏమున్నది? తరువాత కుశనాభుడు పుత్రసంతతికై యజ్ఞమును చేయగా కుశనాభుని తండ్రి కుశుడు సాక్షాత్కరించి గాధియను పుత్రుడు నీకు కలుగునని వరమిచ్చి అంతర్ధానమయ్యెను. తరువాత గాధి కలిగినాడు. రామా। ఆ గాధియే నా తండ్రి అనినారు విశ్వామిత్రులు. కుశుని సంతతివాడను గనుక కౌశికుడని పేరు వచ్చినది. నాకు సత్యవతి యను తోబుట్టువు కలదు. ఆమె భర్త ఋచీక మహర్షి. ఆమె తన పాతివ్రత్య ప్రభావముచే సగము శరీరమును భర్తతో స్వర్గమున నిలిపి, సగము శరీరముతో నదియై హిమవత్ప్రాంతమున కౌశికీనని అనుపేర వ్యవహరింపబడుచున్నది. రామచంద్రా। నేను ఆ కౌశికీనదిని ఆశ్రయించియే తపముగావించుకొనుచు సిద్ధాశ్రమమున కేతెంచి నీ అనుగ్రహమున సిద్ధుడనైతినని తన వృత్తాంతమును, శిష్యులగు రామలక్ష్మణులకును ఆ మహర్షులకును వినిపించినాడు. గురువులయొక్క వంశచరిత్ర వినుట చాలముఖ్యము కావున చెప్పినాడు. అప్పటికి ప్రదోషము గడచి కొంచెము రాత్రియైనది. ఋషులందరును కుశిక వంశమును కొనయాడి నిద్రించినారు.

మరునాడు ప్రాతఃకాలమున మరల వారి ప్రయాణము. మధ్యాహ్నకాలమునకు వారి పయనము గంగానదికి దక్షిణ భాగమున నిలిచినది. ఆ పవిత్రనదీ

స్నానమునకు వారక్కడ ప్రాధాన్యతనొసగి ఆ గంగను గురించి రాముడు విశేషముల నడుగగా విశ్వామిత్రుడు గంగావతరణమను కధను చెప్పినారు శ్రీరామ చంద్రునకు.

అనగా గంగ స్వర్గ పాతాళముల కెట్లు వ్యాపించినదో చెప్పినారు. ఆ కథను కూడ మీకు సంగ్రహముగ చెప్పెదను.

రఘువంశీకులలో సగర చక్రవర్తి యొకడు. అతడు అశ్వమేధయాగమునకు సంకల్పించినాడు. ఆ యజ్ఞము హిమవత్పర్వత వింధ్యపర్వతముల మధ్యసాగినది. ఆ యజ్ఞము రెండవరోజున ఆ యజ్ఞాశ్వము మాయమైనది. నీ యజ్ఞము చెడిపోవునని ఋత్విక్కులు రాజునకు తెలుపగా సగరుడు తన పుత్రులను అరువదివేల మందిని ఆ అశ్వమును వెతకి తెమ్మని పంపినాడు. వారు భూమినంతను తిరిగి వెతకి వెతకి గుర్రమును గానక భూమిని వారిగోళ్ళతో త్రవ్వి అన్నిచక్కుల వెతకి తిరిగి తండ్రి దగ్గరకు వచ్చి అశ్వము కనబడలేదని చెప్పినారు. సగరుడు ఏమైనను మీరు అశ్వమును వెతికియేరండని చెప్పగా మరలవారు భూమిని త్రవ్వి, అనేక భూతముల హింసకు వారు కారణులై చివ్వరకు పాతాళమున మహాతపస్వియై కూరుచున్న కపిలమహామునిని దర్శించి, ఈతడే అశ్వహర్త యని అతనిపైకి దుముకగా అతడు తన క్రోధాగ్నిచే వారల దగ్ధము గావించినాడు. అంతతో వారందరును భస్మరాశులై అచ్చటనే యుండగా సగరుని మనుమడు అంశుమంతుడు అతనిని పంపి నీవు నీ పినతండ్రులు పోయిన త్రోవనుబోయి యజ్ఞాశ్వమును సంపాదింపుమని పంపగా అతడేగినాడు. అతడు సగర పుత్రుల త్రోవ ననుసరింపగా పాతాళమును చేరి అచ్చట భస్మరాసులై యున్న పినతండ్రుల జూచి దుఃఖించి వారికేమైన పితృతర్పణల గావింతమని ఆలోచింపగా అక్కడ వారికెక్కడను ఉదకము దొరకలేదు, అంతలో గరుత్మంతుడు కనబడి, వీరు కృతార్థులగుట సామాన్య జలములతో తర్పణ గావించుటకాదు. గంగా ప్రవంతిని వీరి భస్మరాసులపై ప్రవహింపజేయవలెను. ముందుగ మీ తాతగారి యజ్ఞమును పూర్తి చేసి. తరువాత ఆ కార్యమును కొనసాగింపుమనగా అతడట్లే యజ్ఞీయాశ్వమును తాతగారికందించి, గంగను తన పినతండ్రుల భస్మరాసులపై ప్రవహింపజేయ సమర్థుడు కాకపోయెను. తరువాత అంశుమంతుని మనుమడు భగీరధుడా ప్రయత్నముచేసి కృతార్థుడయ్యెను. అతని ప్రయత్నమిది.

భగీరథునకు సంతానములేదు. అయ్యును ఆతడు తన సంతతికొరకై ప్రయత్నింపక తాతల నుద్ధరించుటకై కొన్ని దివ్యసహస్ర వర్షములు తపముగావించినాడు. బ్రహ్మకొరకై పితామహునకు అనుగ్రహము కలిగినది. ప్రత్యక్షము కాగా గంగ నా తాతల భస్మరాసులపై ప్రసవించుటయు, తనకు వంశవర్ధనుడగు పుత్రుడు కలుగుటయు వరమును కోరినాడు.

బ్రహ్మ భగీరథా! గంగ భూలోకమునకు రావలెనన్న ఆమె వేగమును భూమి భరింపజాలదు. గంగ వేగమును భరింపగలవాడు శంకరుడు. ఆయన అనుగ్రహమును పొందుమని అజ్ఞాపించినాడు. భగీరథుడు శంకరుని కొరకై ఒక్క సంవత్సరము తపము గావించి శంకరుని అనుగ్రహమునకు పాత్రుడయ్యెను. శంకరులు గంగను నేను శిరమున ధరింతును భగీరథా అనెను. గంగ ఆకసమునుండి శివుని శిరమునకు రావలెను. వచ్చుటకు సంకల్పించినది. కాని గంగ తన వేగమును శంకరుడు కూడ భరింపలేడను గర్వముతో తన పయనము సాగించినది. ఆగర్వమునకు సీమ ఎక్కడ? శంకరుని కూడ తన వేగముతో పాతాళమునకు గొంపోవుదునని భావించినది. అహంకార మొక మహా రాక్షసి. తన బలమునే తాను చూచుకొని విర్రవీగును. ఎంతటి మహాత్ములనైన చులకనగా చూచును. శంకరుని శక్తిని గంగ కొలవలేక పోయినది. తన ప్రవాహ వేగమున శివుని శిరమున పడజొచ్చినది. శివుని కామె సంకల్పము తెలియక పోలేదు. మహా మహిమాన్వితుడగు శివుడు తన జటా జూటమును విస్తరించగా గంగకు ఆతని జటా జూటమునుండి బయటకు పోవు త్రోవ దొరకలేదు. హిమవత్పర్వత గుహలవలె ఎన్నియో గుహలు ఆతని జటా జూటము నందున్నవి. ఆ గుహాంతర్భాగములనే నిలిచిపోయినది గంగాజలము. చాల సంవత్సరములు గడచినవి. ఆ ఇద్దరి మధ్య నష్టపడిన వాడు భగీరథుడు. భగీరథుడేమి చేయవలెను? ఆతడంతతో విడిచిపోవువాడు కాదు.

శా. ఆరంభింపరు నీచ మానవులు విఘ్నాయాస సంత్రస్తులై
యారంభించి పరిత్యజింతురురు విఘ్నాయత్తులై మధ్యముల్
ధీరుల్ విఘ్ననిహన్యమాను లగుచున్ ధృత్యున్నతోత్సాహులై
ప్రారబ్ధార్థములుజ్జగింపరు సుమీ ప్రజ్ఞానిధుల్ గావునన్

భర్తృహరి మూల శ్లోకమునకు ఏమగు లక్ష్మణకవి అనువాద మీ పద్యము

ఇది ముముక్షువులకు దివ్య సందేశము. ముముక్షువులకే కాదు. ప్రతి వ్యక్తికిని ఇది దివ్యసందేశమే. కార్యదీక్షితుల అవస్థాత్రయము ఇందు వర్ణితమైనది. మొదటి వారు రాబోవు విఘ్నముల నూహించి కార్యమునే ప్రారంభింపరు. వీరిపేరునీచులు. రెండవ వర్గము వారు మధ్యభాగమున వారి దీక్షను విరమింతురు. వీరు మధ్యతర గతివారు. మూడవవారు ఎన్ని విఘ్నములనైన సహించి ఆకార్యమును నెరవేర్తురు. వీరుత్తమ శ్రేణికి చెందినవారు. వారి ప్రజ్ఞకు కొలత లేదు. వారు ప్రజ్ఞానిధులు

భగీరథుని ప్రయత్నమంతతో ఆగలేదు. మరల శంకరుని గూర్చి తపము గావింపగా అతడు హిమవత్పర్వతమునందు బ్రహ్మ నిర్మితమగు బిందు సరోవర మున ఈ గంగను వదలినాడు.

అచ్చటనుండి గంగ ఏడు పాయలై ప్రవహించినది. తూర్పు మొగములై మూడు పాయలును, పడమర మొగములై మూడు పాయలును ప్రవహించి,ఏడవ పాయ భగీరథుని వెంట నంటినది.

భగవానులగు శంకరుని జటాజూటమునుండి భూభాగమును ప్రవేశించుచున్న ఆ గంగా ప్రవంతిని తీవ్ర విజృంభణములోని విలాస విభ్రమ భ్రమణ నటనా చాతుర్యములు చూడముచ్చటలుకాగా విమానారూఢులై చూడవచ్చినవి దేవగంధర్వ సిద్ధచారణ గణములు. ఋషిగణమును ఆమె చతుర గమనమును చూడవచ్చినది. ఆమె శంకరుని జటా జూటమునుండి భూభాగమునకు పరగిడి వచ్చు సమయమున ఆకాశమున మబ్బు లెక్కడికి పోయినవో గాని ఆకాశవీధిని మాత్ర మెక్కడను అవి చరించుట లేదు. కావున ఆకసము శుద్ధమై తన విశాల భాగమున నిలిచియున్న దేవతల దివ్యాభరణ కాంతులు తన నుండి పాయలై వెడలి వచ్చు జలధారలలో ప్రతిబింబించగా సూర్యమండలములు నూరై యుండెనాః అనునట్లున్నది గగన మండలము. అంతియేనా ?

శతాదిత్యమివా భాతి గగనం గత తోయదం

కాదు. ఆకసమున మేఘ మండలములు లేకుండు టెట్లుః ఆ మహాభాగిని లోని విశుద్ధ జలములు వేనకువేలై ఛిన్నాభిన్నములై ప్రవాహములు కాగా ఆ ప్రవాహము లందలి తెల్లని నురుగులు హంసలవలె కన్పట్ట, ఆహంసలతో కూడిన శరన్మేఘ మండలములతో వ్యాప్తమైయున్నదీ యాకాశమని చూపరులకాఆకాశమున చమత్కారమగు దృశ్యమైనది. అంతేకాదు. శింశుమారాది గ్రహమండలములును

మత్స్య కూర్మాది జలచరములును అందందు చంచలములై కన్పట్టగా అవి మెరుపు తీగెలను భ్రమ కలిగి చూచువారలకాకాశము మెరుపు తీగెలతో మెరయుచున్నట్లున్నది.

శింశుమారోరగగణై ర్మీనై రపి చ చంచలైః
విద్యుద్భిరివ విక్షిప్త మాకాశ మభవ త్తదా

అట్లా గంగా స్రవంతిని. ఒక్కచో మందగమనయై మరొక్కచో మహావేగముగ నడవ ఇంకొక్కచో వంకరయై ప్రవహింప, వేరొక్కచో సరాసరి వచ్చినను ఆమె గమనము నలు ముఖములగుటచే ఒకదానికొక ప్రవాహము తగిలి నీరు చెదిరి పైకెగిరి శంకరుని జటా జూటమును తగిలి మరల క్రిందకు వచ్చుచు భూమిపైన పడగా ఆ గంగా ప్రవాహమున కొక ప్రత్యేకత కలిగినది. ఏమది ? ఆమె యందు గ్రుంకులిడి ముక్తులమగుదమనుకొన్న వారికి, ఆమె శంకర జటాజూటమునుండి వచ్చుటచే మరింత పారిశుధ్యముగలదై శాప విముక్తుల గావించునను కుతూహలమున భూభాగము నందెందరో మునకల వేసి మరల స్వర్గ లోకమున తమ తమ స్థానముల నలంకరించినారు. ఇక మనము భగీరధుని దగ్గరకు పోదము.

అట్లు శంకర జటాజూటమునుండి క్రిందకు వచ్చిన గంగాభవాని ఏడు పాయలై ఏడవపాయ భగీరధునివెంట నంటినదని చెప్పితినిగదా।

భగీరధుని రథము ముందు నడవగా భాగీరధి అతని దివ్య స్యందనమును అనుసరించినది. దేవదానవ కిన్నర కింపురుష రాక్షస నాగగణములు ఆమెను వెంటనంటినవి. భగీరధుడట్లు పితృదేవతల నుద్ధరింప భాగ్యదేవతను వెంటనిడుకొని పోవుచుండెను. తనకెదురై నిలిచిన భాగ్యగరిమను గూడ అనుభవింపవలెనన్న ఆ భాగ్యవంతునికికూడ ఎన్నియో ప్రతిబంధకములు ఎదురుకావచ్చును.

భగీరధుని ప్రయాణము యధా తథముగ సాగుచున్నది. అయ్యును మధ్యనొక యవాంతరము రాకపోలేదు. అంతలో గంగ అంతర్ధానమైనది. అదేమి ? అదియొక చిత్రము. జహ్నుమహర్షివారి యజ్ఞవాటముగుండ వారుపోవుట జరిగినది. గంగ ఆ జహ్నుమహర్షి వారి యజ్ఞవాటమును ముంచివైచినది. అప్పుడా మహర్షి యజ్ఞమునకు విఘ్నము కలిగినది. అతడు గంగను సహించలేదు. దేవతలకన్నను భూఖండమున మహర్షుల తాపస తేజములు గొప్పవి. వారే షనిన్ని చేయదలచినను

ఉపకరణములను వెతుక్కొనవలసిన అక్కరలేదు." క్రియాసిద్ధిస్సత్వే భవతి మహతాం నోపకరణే" అనినాడొక మహాకవి. ఆ జహ్నుమహర్షి వారా గంగను ఆచమనము చేయగా గంగ జహ్నుమహర్షివారి గర్భమున నిలచినది. అప్పుడు భగీరధుడేమి చేయవలెను? జహ్నుమహర్షివారి అనుగ్రహమునకు పాత్రుడుకాగా వారాగంగను తన చెవినుండి వదిలినారు. అంతలో ఆమె జాహ్నవియను పేరునొంది భగీరధుని వెంటవెళ్లి సముద్రమున కలసి, పాతాళమునకేగి సగరపుత్రుల పవిత్రులగావించినది. వెంటనే బ్రహ్మ ప్రత్యక్షమై సగర పుత్రుల కృతార్ధతను భగీరధునకు తెలిపి భగీరధుని ప్రశంసించినాడు. రామా! మీ వంశములోని భగీరధు డింతటివాడని తాతల చరిత్రలను చెప్పినారు విశ్వామిత్రులు.

ఈ ఉపాఖ్యానమును వినుచో సర్వేపాపాః ప్రణశ్యంతి, ఆయుఃకీర్తిశ్చవర్ధతే సమస్త పాపములును తొలగును. కీర్తి, ఆయుర్దాయము వృద్ధియగునట. ఇది శ్రవణ ఫలము. ఆరాత్రి రామలక్ష్మణులకు గంగానది ఒడ్డుననే గడచినది. తెల్లవారినది. మరల వారి పయనము సాగినది.

భౌతికవాదులీ గంగను సామాన్య జలములకంటె ఎక్కువయని ఒప్పుకొన్నను ఆ గంగాజలములే స్థూలములై వారి దృష్టియందున్నవిగాని ఆమెయందలి అంతరాత్మను వారు చూడరు కాదు. చూడలేరు. మన కథకు పోదము.

అది గంగానదికి అవ్వలిఒడ్డు. ఆ ఒడ్డుననే విశాలానగరము. అది ఇక్ష్వాకుని పుత్రుడగు విశాలుడను రాజు నిర్మించిన నగరము. కావున దానికి విశాలా నగరమను పేరు సార్ధకనామమైనది. ప్రస్తుతమున ఆ నగరిని పాలించు రాజు సుమతి. అతడు చాల ధర్మాత్ముడు. ఆ వంశీకులందరును ధర్మాత్ములయ్యే దీర్ఘకాలముగ రాజ్యపాలన గావించుచుండిరి. రామున కిప్పుడా సుమతిని దర్శింప చేయవలెననుకొనినారు మహర్షి. విశాలానగరమున అడుగిడినారు. సుమతికి తెలిసినది మహనీయుల రాక. పాద్యార్ఘ్యములతో మునుల పూజించుటకై సుమతి రాగా లోకోత్తర సౌందర్యమున మెరమెరలాడు రఘువీరుల దివ్యమంగళ విగ్రహములు సుమతి కన్నుల బడినవి. విశ్వామిత్రుని వలన వారెవ్వరో తెలుసుకొనినాడు సుమతి. ఆ మహారాజు పుణ్యము ఫలించగా రామలక్ష్మణుల నర్చించి కృతార్థుడయ్యెను. ఆ రాత్రి భగవానునివాసముచే సుమతి రాజ్యము పావనముగాగా ఆ రాత్రి సుఖరాత్రియై రామునకు గడచినది.

ఒక విధముగ ఆ విశాలానగర ప్రదేశము దేవేంద్రుడు తన్ను జయించు శత్రువును జయించి సిద్ధి పొందినచోటుకూడ. ఈ కథనుకూడ రాత్రికాలమున రామునకు చెప్పినారు మహర్షి కశ్యప ప్రజాపతి రెండవ భార్య దితి. ఆమె రాక్షసుల తల్లి. ఒకప్పుడామె దేవేంద్రుని జయించు పుత్రుని కోరగా కశ్యప ప్రజాపతి వేయి సంవత్సరములు నీవు వ్రతదీక్ష యందుంటివేని అట్టి పుత్రుని పొందుదువనినాడు. అందుకే ఆమె వేయి సంవత్సరముల దీక్షను ప్రారంభించగా ఇంద్రుడు దాని నెరిగి, ఆమె ఆ దీక్షా సమయమున పగలు నిద్రించగా ఆ సమయమును గుర్తెరిగి ఆమె గర్భమునందు ప్రవేశించి పిండమును ఏడు భాగములుగ ఛేదించి శత్రువు పుట్టకుండ చేసికొనినాడు. కాని దితి గర్భమును ఛేదించగా వారిని చావకుండ తల్లికోరుటచే బ్రతికించి వారిని సప్తమరుత్తులుగ నియమించినాడు. వారు లోకోపకారములగు వాయువులై చరించినారు. ఈ కథలోని విశేషమేమనగా రాజు తన శత్రువును ఇంత జాగరూకుడై కనిపెట్టి శత్రువుమ జయించవలెనను నడియే నీతి.

ఒక్కమాట.

ఈ దితి కథా ప్రసంగమున చెప్పినది సప్తమ రుదుపాఖ్యానము. ఈ ఉపాఖ్యానమున ఇంద్రుడు సవతి తల్లి గర్భమును ధరించగా తనకంటె అధికుడగువాడు పుట్టకుండ అమె గర్భమును ఛేదించినాడు. ఇది చాల దోషకార్యము. ఈ దోషమును చేసినవాడు త్రిలోకాధిపతి. దేవతలకు పూజ్యుడు. ఈ కథను రామున కెందుకు చెప్పెను? ఇది ఏమి ఘనకార్యమని చెప్పెను? పరిశీలింతము.

ధర్మము రెండు విధములు. సామాన్య ధర్మము, విశేష ధర్మమునని. అబద్ధ మాడకుము అనునది సామాన్య ధర్మము. ధర్మమును అచరించుము. ఇదియు సామాన్య ధర్మమే. ఇక విశేష ధర్మమేమి?

"వృద్ధౌ చ మాతా పితరౌ భార్యా సాధ్వీ సుతశ్శిశుః
అప్యకార్యశతం కృత్వా భర్తవ్యా మనురబ్రవీత్.

వృద్ధులైన తల్లిదండ్రులు – సత్ప్రవర్తనగల భార్య – బాల్యావస్థయందున్న కుమారుడు. వీరిని నూరు తప్పులొనర్చియైనను పోషింపవలయునని మనుస్మృతి తెలిపినది. ఇది విశేష ధర్మము. సామాన్య ధర్మము సర్వులకును ఆచరణీయమైనను విశేష ధర్మము వారి వారి అధికార తారతమ్యమునుబట్టి ప్రవర్తింప జేయ

వలసియుండును. వ్యక్తి ధర్మము వేరు సంఘ ధర్మమువేరు. క్షత్రియ జాతి ధర్మము వేరు. అందును రాజ్యమేలు రాజధర్మము వేరు. చక్రవర్తి ధర్మము వేరు. ఇట్లే వారి వారి వృత్తాంతముల ననుసరించి ధర్మాచరణలు విలక్షణములై యున్నవి. ఈ విశేష ధర్మముల ప్రజలు స్థూల దృష్టితో చూచు తరి అధర్మముగా కానుపించి నను సూక్ష్మబుద్ధితో అనగా విశేషశాస్త్ర దృష్టితో విచారించినచో లోకోపకారము కొరకేర్పడినవని స్పష్టమగును. ఇంద్రుడు చేసిన గర్భచ్ఛేదము స్థూలముగా విచారించుచో దోషమువలె కాన్పించును. ఇంద్రుడు త్రిలోకాధిపతి, గావున హింస కూడదనునది సామాన్య ధర్మమైనను లోకోపకార మందున్నది. రాక్షసుడు ప్రబల శక్తి కలవాడగుచో లోకకంటకుడు కాగలడు. అట్టి వానిని సంహరించి, వానినే లోకోపకారకములగు ఏడు వాయువులుగా మార్చినాడు.

1) ఆవహుడు, 2) ప్రవహుడు, 3) సంవహుడు, 4) ఉద్వహుడు, 5) వివహుడు, 6) పరివహుడు, 7) పరావహుడు నని ఇవి ఏడు వాయువులు. ఆవహవాయువు ఆకాశమునుండి పడు కొరవులు, వర్షము, పిడుగులు వీనియందు వర్తించును. ప్రవహ వాయువు సూర్యమండలము నందుండును. సంవహ వాయువు చంద్రమండల మందుండును. ఉద్వహ వాయువు నక్షత్ర మండలమునందు వర్తించును. వివహ వాయువు గ్రహ మండలమున వర్తించును. పరివహ వాయువు సప్తర్షి మండలమునందును స్వర్గ మర్త్యలోకములందుండును. పరావహ వాయువు ధ్రువమండలమున వర్తించును.

విశేష ధర్మము నాదర్శముగా గొని ఇంద్రుడు పై నుదహరించిన లోకోపకారము నొనర్చి యున్నాడు. ఈ విశేష ధర్మమునే రాజై రాజ్యపాలన జేసి, కష్ట సుఖముల ననుభవించి, త్యాగియై, యోగియై బ్రహ్మర్షిగా మారిన విశ్వామిత్రుడు మను వంశజుడైన రామునకు రాజపుత్రుడను భావమున బోధించినాడు. రామునకీ కాండమున చెప్పిన కథ లన్నియు విశేష ధర్మ బోధకములే. సామాన్య ధర్మముల కన్న విశేష ధర్మ ప్రబోధమునకై శాస్త్రము పెరిగినది. అసలు శాస్త్ర మెందుకు? జీవుని స్వభావమును అరికట్టి మంచి మార్గమున నడిపించుటకు. అన్నము తినవలె నని ప్రతి వానికిని తెలియును. ఆరవ నెల వచ్చుసరికి అన్నమునకై శిశువు తహ తహ లాడును. కాని పాసిన అన్నము తిన్న రోగము అను సంగతిని శాస్త్రము బోధించును. అన్నము తిన్న బలమని తెలియును. ఆ అన్నమునే జ్వరము వచ్చి నప్పుడు తిన్నచో చత్తువని శాస్త్రము చెప్పును. ముందు కథకు పోదము.

ప్రస్తుత మన కథాభాగము మిథిలానగర పయనము. మనము సిద్ధాశ్రమము నుండి బయలుదేరినాము శ్రీరామచంద్రునితో. ఇక విశాలా నగరమునుండి పయనము సాగింతము. సూర్యోదయ మగుటతోడనే సంధ్యాదికముల నిర్వర్తించుకొని విశాలా నగరము నుండి విశ్వామిత్రుడును, రామలక్ష్మణులును, మహర్షి గణమును మిధిలా పురమునకు బయలుదేరినారు. మిధిలా నగర సమీప ప్రాంతమునకు విచ్చేసినారు. న్యాయముగ వారు మిధిలా నగరమునకే పోవలయును. కాని వారికి మిధిలకు కొలది దూరముననే నిర్జనమై వనమువలె నుండి కడు రమ్యమై పురాతన మగు ఆశ్రమ మొకటి కానవచ్చెను. ఒక విధముగ మును అందరి దృష్టులను మిథిలా నగరముపైకి ప్రసరించగా రాముని దృష్టి ఆశ్రమమువలెనున్న ఈ స్థలముపై బడినది. ఈ యాశ్రమమిట్లు నిర్జనమై యుండుటకు హేతువేమియనిపించినది.

భగవంతుని దృక్పథమున తానుద్ధరించదగువారు మరుగున పడియుండరు. ఆతని చూపు లతి విశాలములు.

గురువర్యులను అడిగినాడు.

"శ్రీమదాశ్రమసంకాశం కిన్విదం మునివర్జితం
శ్రోతు మిచ్ఛామి భగవన్ కస్యాయం పూర్వఆశ్రమః

హే! భగవన్! సుశోభితమై అతి రమణీయమగు నీ యాశ్రమము నేడు మునివర్జితమై యుండుట కేమి హేతవు ? ఈ యాశ్రమవాసుని పూర్వ చరిత్ర ఏమి ? అని.

రామచంద్రుడు ప్రశ్నించుట తడవుగా విశ్వామిత్రుని యందొక మహదాశ్చర్య ముదయించినది. ఆహా! ఈ కాల చక్రభ్రమణమునందెట్టి వారైనను ముక్తులగుదురు. ఎంతటి మహనీయులును పతితులగుదురు. కాల మెంత గొప్పది ? ఈ యాశ్రమమునకు మరల ఈనాటికి మహత్వము కలిగినది. అను ఆశ్చర్యము కలుగగా ఆ యాశ్చర్యమును ప్రకటించుచు ఈ చరిత్రను చెప్పెదను వినుమని చెప్పినారు శ్రీరామునకు.

"హంత తే కథయిష్యామి శృణుతత్వేన రాఘవ
యస్యైతదాశ్రమపదం శప్తం కోపాన్మహాత్మనా

ఈ శ్లోకమును వింటిరా? ఎంత చక్కగా నాటకీయతను ప్రదర్శించినదో. హంత! ఆశ్చర్య! మాశ్చర్యము అని విశ్వామిత్రుని విస్మయమును జరుగబోవు

విశేషమునందా మునికి గల అత్యాదరమును ఎంత చక్కని సమయమునందు రాము నకీ ప్రశ్న ఉదయించినది? అను చెప్పలేని సంతోషమును, వ్యక్తపరచినారు వాల్మీకి మహర్షి. అంతేకాదు. ఈ గాథ చాలా చిత్రమైనది. రామచంద్రా! జాగ రూకుడవై వినుమని "శృణుతత్త్వేన" అనినారు. మహనీయుడైన వాని కోపము నకీ యాశ్రమము గురి కావలసి వచ్చినదని కాల ప్రభావము గాని జరుగదగినది కాదని ముందుగనే తాను చెప్పబోవు పాత్రల ఔచిత్యమును చక్కగా ప్రదర్శించి నారు.

ఈ చెప్పబోవు చరిత్ర పరమపావనియు, ఋషి పత్నియునగు అహల్యా చరిత్ర. రాముడే జాగరూకుడై వినుటకాదు. మనమును జాగరూకులమై గ్రహించ వలెను. ఏలనన ?

భారతీయ మహర్షుల చరిత్రలను వినునప్పుడు మన జీవితములను కొలత పాత్రల గావింపకూడదను మాటను మాత్రము మీరు మరువకూడదు.

సృష్టి భాగమున మహర్షుల సృష్టికిని మానవ సృష్టికిని చాల అంతర మున్నది. ఒక చిన్న పాత్రలోని నీటి వంటిది మానవ జీవితము కాగా కృష్ణా గోదావరి మొదలగు మహానదీ ప్రవాహముల వంటివి మహర్షుల జీవితములు.

మనము త్రాగుటకై పెట్టుకొన్న చిన్న రాగి పాత్రలోని నీరు చీమలు పట్టుచో గావి లేక ఆ నీటియందేమైన దోష పదార్థము పడుచోగాని ఆ నీరు మనకు త్రాగుటకు పనికిరాదు, ఆ నీటిని పారవోయుదుము. నిజమునకు ఆ పాత్రలోని నీరు ఎట్టిదో నూతిలోని నీరు కూడ అట్టిదే. కాని ఆ నూతిలోనున్న జల జంతు వుల మూత్ర పురీషముల లెక్కగొనకయే మనము త్రాగుదుము. ఆ నూతి నీరు మనకును అపాయమును కల్పించుటలేదు. కాని ఆనూతి యందేదైన పెద్దజంతువు పడిచచ్చినచో ఆకూపోదకము మనకు వర్జనీయమగుచున్నది. కారణమేమి? తన కాపాదించిన దోషమును పాత్రయందలి ఉదకము హరించుకొనలేదు. అంతకంటె నూతి నీటికి శక్తి ఎక్కువగుటచే ఆ నూతి నీరు మనకు త్రాగుటకు పనికి వచ్చి నది. ఇంకను మీ చూపును విస్తరింపజేయుడు. నూతికంటె అధికశక్తి గలది చెరువు. ఆ చెరువునందే మూలనైన చిన్న జంతువు చచ్చిపడినను ఆ శవదోషము ఆ తటాక జలముల కలుషితము చేయరాదు. అట్లే ప్రవాహ వేగము కూడ. నిజమునకు అన్నియు ఉదకములే. కాని ఒక్కొక్క ప్రదేశమునందున్న జలములు

న్యూనాధిక శక్తులు కల వెట్లయ్యెనో మనుష్యు లందరు ఒక్కటే అయ్యును వారి వారి జన్మల ననుసరించి వారికి కొన్ని ప్రత్యేకములగు పవిత్రత లున్నవని భారతీయ శాస్త్రములు చెప్పినవి.

ఇప్పుడు మీ రహల్యా చరిత్రను పరికింపుడు.

ముందు చరిత్రను చెప్పెదను. ఆ చరిత్రలోని అంశములను తరువాత తెలిపెదను. అహల్య బ్రహ్మదేవునిచే సంకల్ప మాత్రముగ నిర్మింపబడిన దివ్యాంగన. గౌతముడు మహాముని. అతడు దివ్యతపః ప్రభావ సంపన్నుడు. అహల్య అతనికి ధర్మపత్నియైనది. వారిద్దరును ఈ యాశ్రమమున వసించినారు, ఊరక వసించుటకాదు, చాలాకాలము తపము గావించినారు గౌతమమహర్షి అహల్యా సహితుడై.

"సచేహ తప ఆతిష్ఠ దహల్యా సహితః పురా
వర్షపూగా ననేకాంశ్చ రాజపుత్ర మహాయశః.

దేవతలచేత గూడ పూజింపబడు నీ యాశ్రమము చాల కాలమట్లు వర్ధిల్లినది. కాని ఒకకాలమున స్వర్గ సామ్రాజ్యాధి నేతయగు దేవేంద్రునకే గౌతమముని తపః ప్రభావ సంపన్నత్వము భయంకరమై తోచినది. అప్పుడాతడు చేయదగినపని గౌతమముని తపస్సును భగ్నముగావించుటకంటె వేరు కార్యము లేకపోయినది. తపస్సు భగ్నము కావలెనన్న ఎవ్వరినైన అతడు శపించవలెను. కావున గౌతమునిచే శాపవాక్యము పలుకయత్నించినాడు దేవేంద్రుడు. ఈ కార్యమునకు తానే పాత్ర కావలసి వచ్చినది. గౌతమముని ఇంటలేని సమయమును పరికించినాడా సహస్రాక్షుడు. దేవతలు కామరూప ధరులు గదా? దేవేంద్రుడు గౌతముని స్వరూపము దాల్చినాడు. గౌతముని పర్ణశాలలో అతడు ప్రవేశించుట కద్దేమున్నది? సరాసరి ఒంటరిగనున్న అహల్య చగ్గరకే తెంచినాడు.

భారతీయ ధర్మములలో ఇంద్రియనిగ్రహమునకు ప్రత్యేక స్థానమున్నది. కామమును ధర్మము కొరకే వాడుకొనవలెను. కావున స్త్రీ తోటి కామసుఖానుభవమునకు ఋతుకాల మొక్కటి నిర్ణయమై యుండును. ఋతుకాలమన స్త్రీలకు రజోదర్శనమైనది మొదలు పదహారు రోజులు. కావున తను భర్తృవేషమున రాగా ఆమె ఇది ఋతుకాలముకాదని అడ్డుపెట్టునేమోయని ఇంద్రుడు కామార్థులకు

ఋతుకాల నియమములేదని ముందుగనే తానుచెప్పి, నీతోటి సంగమమును కోరుచుంటిననినాడు.

ఋతుకాలం ప్రతీక్షంతే నార్థిన స్సుసమాహితే
సంగమం త్వహమిచ్ఛామి త్వయా సహ సుమధ్యమే.

ఆ మాటలతో అహల్య ఈతడు ఇంద్రుడని తెలుసుకొన్నది. గౌతము దేవ్వరును ఇట్లురారు. మరియొకరికీ ఆశ్రమమున ప్రవేశింప సామర్థ్యములేదు. కొంతకాలమునుండి తనను కోరుచుండుట ఆమెకు తెలియును. కావున ఈతడు దేవేంద్రుడని నిశ్చయించుకొన్నది. అయ్యును ఆమె కుతూహలము కలిగియే ఇష్టపడినది.

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన
మతించకార దుర్మేధా దేవరాజ కుతూహలాత్
స్త్రీల చిత్తము నెవ్వ రెరుగుదురు ?

"అశ్వప్లుతం వాసవగర్జనంచ స్త్రీణాం చ చిత్తం
పురుషస్యభాగ్యం అవర్షణంచాప్యతివర్షణం చ
దేవో నజానాతి కుతో మనుష్యః

గుఱ్ఱ మెప్పుడు సకిలించునో, మేఘ మెప్పుడురుమునో స్త్రీల చిత్త మెప్పు డెట్లుండునో దేవు డెరుగడు. మనుష్యులే మెరుగుదురు ?

గౌతమపత్ని ఇంద్రుని సౌభాగ్య గరిమకు సంతసపడి ఆతనితోడి భోగించి నది. అంతటితో ఇంద్రుని కోర్కె తీరినది. కాని అహల్య ఆ క్షణము గడవగనే చాల భయపడినది. దేవేంద్రుని తొందరపెట్టి తన రహస్యమును బయటపెట్టవద్దని ప్రార్థించి పంపినది.

"కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్ర మితః ప్రభో
ఆత్మానం మాం చ దేవేశ సర్వదా రక్ష మానద

సురేంద్రా! నేను ధన్యురాలనైతిని. నిన్నును నన్నును కూడ సర్వ కాలముల రక్షణ గావింపుమని వెళ్ళుటకు తొందరపెట్టినది.

అదృష్ట దివసములు తొలగగా ఎట్టి రహస్యములైనను బహిర్గతములు కాక తప్పదు. ఇంద్రుడు నవ్వుకొనుచు అట్లేనని సమాధానమిచ్చి కుటీరము నుండి బయటకు వచ్చు లోపలనే గౌతములు వచ్చినారు. దివ్య తపః ప్రభావ సంపన్నులై

చేత కుశల నిడుకొని, స్నానము గావించి వచ్చు ఆ మునిని చూడగనే ఇంద్రునికి ఒళ్ళు వణికినది. వెలవెల బోయినాడు. వెంటనే ముని ఈతనిని ఇంద్రునిగా ఎరిగి నా రూపముతో నీవు గావించిన ఈ అకర్తవ్యమునకు ఫలము ననుభవింపుమని దేవేంద్రుని వృషణములు తెగిపడునట్లు శపించినాడు.

అకర్తవ్యమిదం తస్మాద్విఫలస్త్వం భవిష్యసి

ఇంద్రుని వృషణములు వెంటనే తెగి నేలపై బడినవి. ఆ రోషముతోడనే లోపలికేగి అహల్యను శపించినాడు ముని. ఏమని ?

"ఇహ వర్ష సహస్రాణి బహూనిత్వం నివత్స్యసి
వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ
అదృశ్యా సర్వభూతానామాశ్రమేస్మి న్నివత్స్యసి

నీవీ యాశ్రమముననే ఏ భూతములకును కనబడక వాయు భక్షణము చేయుచు ఆహారమును వర్జించి బూడిదయందు పరుండి కొన్ని వేల సంవత్సరములు తపింతువు గాక అని. అంతియే శిలవై పడియుండుమని కాదు. వాల్మీకమున్నం దిట్లే యున్నది. శిల మారినదను కథకు గతి ఏమి? అందురా, అది కల్పాంతర కథ కావచ్చును. మరి ఈ శాపమునకు విముక్తి ఎప్పుడు ? గౌతముడే చెప్పినాడు.

యదా చైతద్వనం ఘోరం రామో దశరథాత్మజః
ఆగమిష్యతి దుర్ధర్షస్తదా పూతా భవిష్యసి
తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభ మోహ వివర్జితా
మత్సకాశే ముదా యుక్తా స్వం వపుర్ధారయిష్యతి

దశరథపుత్రు డెప్పుడీ ఘోరారణ్యమున కేతెంచునో అప్పుడు నీవు పవిత్రురాల వయ్యెదవు. దుష్ట స్వభావురాలా! ఆ రామునికి ఆతిథ్యమిచ్చి లోభ మోహముల వదలి నా సన్నిధానమున నీ నిజ శరీరము అనగా ఇంతకు ముందున్న పవిత్ర శరీరమును పొంది సంతసించగలవు అని. తరువాత ఆతడెక్కడి కేగెను ?

ఆ మహాముని ఈయాశ్రమమును వదలి హిమవంతమున కేగెను. ఇంద్రు డేమయ్యెను ? అతడు ప్రభువు గదా! నేను దేవరాజ్య స్థాపనకయ్యే గౌతముని తపస్సును భంగము గావింప అహల్యతోటి వ్యభిచరించగా నాకీ దురవస్థ వచ్చినదని దేవతలకు చెప్పి, దేవతల వలన మేష వృషణములను సంపాదించుకుని సఫలుడయ్యెను.

రాముడీ కథను విని విశ్వామిత్ర మహర్షితో ఆ యాశ్రమమున కేగగా ఇంతకు పూర్వ మెవ్వరి కంటనుబడకయున్న ఆ తపస్విని, దేవ దానవులకు కూడ దుర్నిరీక్ష్యయగు ఆ తేజస్విని జలాంతర్భాగమున ప్రజ్వరిల్లుచు కన్పట్టు సూర్య బింబమువలె మేఘముచేతను మంచు చేతను కప్పబడిన చంద్రబింబము వలె రామునకు కనబడినది. శ్రీరామచంద్రుడా మునిపత్నిని దర్శించగనే లక్ష్మణ సమేతముగ ఆమె పాదములకు అభివాదనము గావించినాడు.

"రాఘవౌతు తత స్తస్యాః పాదౌ జగృహతు స్తదా

అహల్యకు రాము డెవ్వరని పించినది? తన శాపాంతమును గావించు మహనీయుడనియే అనిపించినది. గౌతముని వాక్య మామెకు స్మృతికి వచ్చినది. కావున వెంటనే రామపాదార విందముల కామె నమస్కరించినది.

స్మరంతీ గౌతమవచః ప్రతిజగ్రాహ సా చ తౌ

నమస్కార మాత్రము కాదు. అమె పాద్యార్ఘ్యముల నిచ్చి యథావిధిగ పూజించినది. ఆ సమయమున దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షములతో దేవ తలు ఆమెను ప్రశంసించినారు. దేవతల సాధువాదములు చెలరేగగా గౌతమమహ ర్షియు తాపసాగ్నితో వెలుగొందు అహల్యను స్వీకరించి రాముని అర్చించినాడు. తరువాత రాముని పయనము మిథిలకు సాగినది. ఇది కథ.

శ్రోత లిప్పుడే మందురు? అహల్య పతివ్రత ఎట్లైనదందురు? ప్రాతఃకాల మున పఠించదగిన సీతాద్రౌపదీతారామండోదరీలలోని అహల్యకీ పూజ్యత ఎట్లు వచ్చిన దందురు? మునిపత్నికి ఇట్టి దుష్ట సంకల్ప మెందుకు కలిగినదందురు. ఏమైన అందురు. ఎన్నియో అందురు. కొందరు నిందకు అందురు. కొందరు సందేహముతో అందురు.

సందేహములకు నా సమాధానములు. నిందయే దృష్టియందు కలవారలకు శాస్త్రమునందు సమాధానములు లేవు. బాగుపడదలచినవారికి శాస్త్రము.

భారతీయ చరిత్ర గ్రంథములు బోధించు బోధామృతము నాలుగు భాగములై యున్నది. అవి ధర్మార్థ కామమోక్ష పురుషార్థములు. ఏ చరిత్రాంశమైనను ఈ పురుషార్థములకు సంబంధించనిదై యుండదు. ఏ చరిత్రయైనను మొదట ధర్మ ప్రబోధమును చేయును. తరువాత ఆ ధర్మమునననుబంధము కావించుకొని అర్థ కామములను చెప్పును. ఆ త్రివర్గముల వ్యాఖ్యానించు ఆదర్శ చరిత్రల నందిం

చును. దేవ తిర్యజ్ఞ మనుష్యపశు పక్ష్యాది ఉపాధులన్నియు త్రిగుణాత్మిక సృష్టిలోని వని సిద్ధాంతము. జన్మ సిద్ధములై ఉపాధులకొక ప్రత్యేకత యున్నదనును. అట్లు ప్రత్యేకత కలిగినదియే మహర్షుల సృష్టి. కాని సృష్టి భాగము నందెప్పుడైనను దోషరహితమగు ఉపాధి యుండదనుట పరమ సిద్ధాంతము. నిర్దోషమగునది పరబ్రహ్మ వస్తువు ఒక్కటే. "నిర్దోషం హి సమం బ్రహ్మ" అనినది గీతా శాస్త్రము. ఒక ఉత్కృష్ట జీవితము అంతకంటె తక్కువ జీవితమున కాదర్శ మగుట శాస్త్ర సమ్మతము. ఋషి జీవితము మానవ జీవితమునకంటె ఉత్కృష్టము. కావున వారు మానవునకు పూజ్యులు. ఇప్పుడు అహల్య దగ్గరకురండు. ఆమె బ్రహ్మమానస పుత్రిక. అయోనిజ. అట్టివారు కొందరే. యోని జన్మలకంటె అయోని జన్మలు ఉత్కృష్టులు. కావున సీతా, ద్రౌపతి మొదలగు పుణ్య కన్యకా మణుల స్మరించుచో పుణ్యము ప్రాప్తమగును. అందులోనిదే అహల్య.

తరువాతి విషయము ఆమె ధర్మ పతనమును గురించిన విషయము. త్రిగుణములలోనిదే రజోగుణము. రజోగుణము రాగాత్మికము. రజోగుణమునకు భోగలాలసత యుండును. భోగాసక్తత ధర్మమునుండి పతనము గావించును. సుఖ దుఃఖములు రెండును ఆ రజోగుణములోనివే "దుఃఖే సుఖే చ రజ ఏవ బభూవ హేతుః" రజోగుణము కర్మయందు ప్రవృత్తిని కలిగించును కర్మ సుఖ దుఃఖ ఫలముల నొసంగును. కావున అహల్య రజోగుణ ప్రధానయై తప్పటడుగు వైచినది. అంతమాత్రమున ఆ జీవితము వ్యర్థమని భారతీయ ధర్మ శాస్త్రములు చెప్పవు. మానవుడు లేక ఋషి దేవతలు కూడ ప్రమాదముచేతగాని, కోరికచేత గాని దోషము చేయగా అందుకు ధర్మశాస్త్రములు ప్రాయశ్చిత్త కాండను విధించి నవి. ఆ ప్రాయశ్చిత్తములు ఆయా కర్తల అయుః ప్రమాణాదికముల ననుసరించి యుండును. ఇప్పుడు అహల్య కొన్నివేల సంవత్సరములు తానొక్కమారు గావించిన దోషమునకు ప్రాయశ్చిత్తముగ తపము గావించి, భగవద్దర్శనము నొందినది పునీతయై. కావున ఆమె నిష్కల్మష నిష్కల్మషయయ్యె ఆమె ఆదర్శ జీవియైనది. గౌతముడును ప్రమాదముచేత వచ్చిన దోషమునకు ప్రాయశ్చిత్తము గావించి, ఆ పత్నిని గ్రహించి స్త్రీ జీవితము క్షమార్హమని చెప్పినారు. స్త్రీ ప్రకృతి యందు భోగాసక్తి ఎక్కువ పాలై యుండును. కావున స్త్రీ సంరక్షణము చాల అవ సరమని గృహస్థులకు కామశాస్త్ర ధర్మశాస్త్రములు రెండును బోధించినవి. కావున సృష్టియందలి పదార్థమునకు ఆగంతుకములై వచ్చిన దోషములను గాని నైజ

దోషములను గాని నివర్తింప జేయు సంస్కారములకే ప్రాయశ్చిత్త కాండయని పేరు.

తరువాత ఈ అహల్యా చరిత్రను గురించి మనమింక కొంచెము ముందుకు పోదము. మనకంటె తేజోవంతులలోని ప్రత్యేకములగు విషయములు మనకు విందార్హములు కావు. దేవతల చరిత్రలు పరోక్షములై బహిర్గతములుగాని కొన్ని విశేషములతోకూడి యుండును. అవి కేవల శాస్త్ర గమ్యములు. మనకు వేదార్థమును వివరించునది మీమాంసాశాస్త్రము దుశ్శీలయగు అహల్యయు అహల్యాజారుడగు ఇంద్రుని వేదమేల స్తుతించెను? అను ప్రశ్నకు పూర్వమీమాంసకులిట్లు సమాధానము నిచ్చినారు.

"శ్రుతిసామాన్యమాత్రాద్వా న దోషోఽత్ర భవిష్యతి
మనుష్య ప్రతిషేధాద్వా తేజో బలవశేన వా
యథా వా న విరుద్ధత్వం తథా తద్గమయిష్యతి.

1) వేదములలో విధులను బలపరచుచు అర్థవాద విధులుండును. అర్థవాదములు విధిని స్తుతించుచు, నిషేధమును నిందించుచు, మానవుని విధియందు ప్రవర్తింపజేసి, నిషేధము నుండి తొలగించును అందలి కథలకు కథాభాగము ప్రధానము కాదు. కావున వేదమునందు వర్ణితమైన అహల్యాజారుడను ఇంద్రుని కథ అర్థవాదము. (అర్థవాద విధులందు భూతార్థవాద విధి యిది) అనగా చరిత్రాత్మకము.

2) శాస్త్ర నిషేధము–శాస్త్రోదిధి కృతులగు మనుష్యులకు మాత్రమే యగుట వలన పరదారగమన నిషేధము మనుష్యులకు మాత్రమే వర్తించునని రెండవ సమాధానము.

3) సర్వంబలవతః పథ్యమ్. బలవంతుడు దేనిని తిన్నను అరుగును. ఆరోగ్యము నిచ్చును ఆపదార్థము. గరుత్మంతునకు విషము జీర్ణమై ఆహారమగును. దుర్బలులకు అది నిషేధము. తేజోబల సంపన్నులగుటవలన దేవతలు చేసినది నిజమునకు తప్పే అయినను వారి తేజస్సువలన వారిని బాధింపదు అని మూడవ ప్రత్యుత్తరము. ఇవిగాక అహల్యా శబ్దమునకును గౌతమ ఇంద్ర శబ్దములకును వేరుగ అర్థాంతరములనుగూడ చెప్పి వేదమునందలి గౌరావస్కందిన్నహల్యాయైజారా! అను ఇంద్రస్తుతిని సమర్థించినారు. ఇంద్ర శబ్దమునకు సూర్యుడర్థమనినారు. "ఇది పరమైశ్వర్యే" అను ధాతువు

నుండి ఇంద్ర శబ్దము వచ్చుటచే తేజోరూపమగు పరమైశ్వర్యము సూర్యుని యందుండుటవలన ఇంద్రుడన సూర్యుడని అర్థమును చెప్పినారు. అహల్య యన రాత్రియని సమన్వయించి, జారుదన రాత్రియను అహల్యను శిథిలము చేయు సూర్యుని స్తుతించినదీ మంత్రమనికూడ తెలిపినారు. ఏది ఏమైనను అహల్య చరిత్ర అయోనిజయై ముని పత్నియై, కొన్ని వేల సంవత్సరముల తపస్సును గావించి, రామచంద్రునిచేత నమస్కరింపబడు అర్హత కలదై నందున మనకు ఆరాధ్యయైనదని సమన్వయించుకొనవలెను. ముందు కథకు పోదము.

మన కథాభాగమునకు స్థానమిక మిథిలానగరము. అయోధ్యా నగరము నుండి బయలుదేరిన సాక్షాన్నారాయణుడు విదేహ సామ్రాజ్యమున వెలసిన మహా లక్ష్మిని చేత బట్టవలెను. ఆ లక్ష్మీనారాయణుల కలయిక సీతాకళ్యాణమను కథా భాగమున నడవవలెను.

ఇంతవరకు మనము మిథిలానగర ఉపకంఠమున గౌతమాశ్రమమునందుంటిమి. భగవానులు అహల్యకు శాపవిమోక్షమును గావించినారు. ఇకవారు మహర్షి బృందముతో మిథిలానగర ప్రవేశము గావింపవలెను.

గౌతమాశ్రమము నుండి శ్రీరామచంద్రులు లక్ష్మణ సమేతుడై విశ్వామిత్ర మునీంద్రుని ముందిడుకొని జనకచక్రవర్తిగారి యజ్ఞవాటమున ప్రవేశించిరి. నిజ మునకిప్పుడు జనకచక్రవర్తి యజ్ఞవాటమున ప్రవేశించినది దశరథనందనుడుకాదు. ఆ విదేహుని పుణ్యపుంజము సచ్చిదానంద బ్రహ్మము నేడు ధనుర్ధారియై మోక్ష లక్ష్మియే ఆ రాజవరుని యింట సీతాకాంతయై యుండగా బ్రహ్మర్షిసత్తముడగు విశ్వామిత్రుని ముందిడుకొని, యజుర్వేద ఋగ్వేద సామవేదముల ప్రతిధ్వనించు చుండగా ఆ యజ్ఞమూర్తియే రాముడై విచ్చేసినాడు. ఇది నాటి విదేహుని పుణ్య పుంజము. ఇది నాటి విదేహుని పుణ్య పుంజమే కాదు. సదేహులమైయున్న నేటి మన పుణ్య పుంజము. మీరిప్పుడు వినుచున్నది లేక నేను ప్రవచించుచున్నది పుట్టుక లేనివాని పుట్టుకకు సంబంధించిన కథాభాగము.

రాఘవేశ్వరులా యజ్ఞవాటమున ప్రవేశించగనే వేనకువేలై యున్న బ్రాహ్మణ బృంద మాతని కంటబడినది. అగ్నిహోత్రాదికముల శకటములపై నుంచుకొని వచ్చిన ఋషి బృందముల శకట సమూహములను వారు వసించిన ప్రదేశముల

నాతడు తిలకించి విశ్వామిత్రునితో మునివర్యా! మన నివాసమెక్కడ? అనిప్రశ్నించి నాడు. మహర్షి తాముండుటకొక ప్రత్యేక ప్రదేశమును నిర్ణయించుకొని ఆ ప్రదేశమున రామలక్ష్మణులతో నిలిచినారు. జనక చక్రవర్తికి తెలిసినది. జనకచక్రవర్తికి పురోహితులు శతానందులు. అతడహల్యా నందనుడే. విశ్వామిత్రుని రాక తెలిసిన తడవుగా శతానందుని వెంట నిడుకొని, వినయావనతుడై విశ్వామిత్ర మునీంద్రు లున్న ప్రదేశమున కేతెంచినారు జనక చక్రవర్తిగారు. ఆచక్రవర్తిని వెంటనంటియే విశ్వామిత్రున కివ్వదగు పాద్యార్ఘ్యముల గైకొని ఋత్విజులును ఏతెంచిరి. వెంటనే సమంత్రకముగ విశ్వామిత్రుని అర్చించుట జరిగినది. మధుపర్కము నందుకొన్న మునీంద్రులు రాజు యోగక్షేమముల నరసినారు వారిద్దరి కుశల ప్రశ్నలు ముగియగా తరువాత మహర్షికి ఋషిగణమధ్యమునందాసనమిడి, ఆ మహర్షి గణమునుకూడ యథాన్యాయముగ పూజించి వారాసనముల నలంకరింపగా తన ధన్యవాదములను వారికి తెలిపినాడు. నాటికి తన యజ్ఞము సఫలమైనదని భావించినాడు. విశ్వామిత్రునిరాక తనయజ్ఞము ఫలించినదని గుర్తెరుగుటకు ప్రతీక యని భావించినాడు ఇక యజ్ఞము పండ్రెండు రోజులు జరుగవలసి యున్నది అంతదనుక తమరుండి నన్ను కృతార్థుని గావింపుడని ప్రార్థించి, ఈ యజ్ఞమున భాగముల నందుకొనుటకై వచ్చు దేవతల దర్శించి ఆనందింపుడని కోరినాడు దోసిలియొగ్గి.

కాని ఆ విదేహుడు మునులనట్లు పూజించి తవదృష్టులా విశ్వామిత్రుని యందే నిలుపలేకపోవుట నాటి అతిథిపూజలోని విశేషము. జనకచక్రవర్తి చూపులు ఒక్క క్షణకాలముననే రామలక్ష్మణుల వైపుకు మరలినవి. ఆ ముగ్ధమోహన మూర్తుల రూపలావణ్యములకు ముగ్ధములైనవి. అతని అంతఃకరణము ఆయప్రాకృతుల పరాక్రమముల నూహించినది. ఇది మానవాతీతమని గుర్తెరిగినది. వీరి పరాక్రమము దేవతలకు పోలియున్నదని నిర్ణయించుకొన్నది. అంతలో ఒక్క క్షణకాలము ఆజనకుని చూపులు ఆకొమరుల నడకలపై నిలిచినవి. నాలుగు నడకలొక్కచో గుమిగూడియుండుట కచ్చెరువు నందినది.

గజగమనము మందగమనమై ఒయ్యారమును చూపగా, మృగరాజునుపోలిన నడక వారి పరాక్రమమును ప్రకటించుచున్నది. అట్లే శార్దూల గమనము వారి దర్పమును తెలుపగా, ఋషభగమనము వారి సహజ గర్వమును ప్రదర్శించినది. వీరెక్కడి మానవులు? అను ఆశ్చర్యము విదేహ రాజుయొక్క అంతఃకరణము

నుండి తొలగుటలేదు. ఇంకను వారి దివ్యత్వమును పరికింప నారంభించినవి ఆ రాజుయొక్క ఇంద్రియ వర్గము.

జనకుని నేత్రేంద్రియములు ఆరాకొమరుల ముఖమండలము వైపు తిరిగి పైకి ప్రసరించినవి. ఆమోహనమూర్తుల నేత్ర ద్వంద్వముల పరిశీలించినవి. పద్మ పత్రములవలె విశాలములై కన్పట్టు ఆదివ్య సౌందర్యమునకు ముగ్ధములై ఒక్క క్షణకాల మా పుండరీకాక్షులవద్ద నిలచి, అక్కడనుండి ఆ సోదరుల చేతులయం దున్న ఖడ్గతూణీరములపైకి ప్రాలినవి. ఇంతకుపూర్వ మట్టి ఖడ్గ తూణీరములే రాకొమరుల చేతియందును చూచినవికావు ఇవియును అపూర్వములే. అంతతో ఆ రాజుయొక్క నేత్రద్వంద్వము తృప్తి నొందలేదు. ఆ రాచబిడ్డల దేహకాంతులకు మోహపోయి పాదాది శిరఃపర్యంతముగ ప్రాకి నిలచి నిలచి చూచి, అంతఃకరణ కేగి వీరు అశ్వినీదేవతలు కారుగదా! అని తలచి, వారిక్కడి కెందుకేతెంతురని సంశ యించి, భూలోకమున వినోద విహారముల సలుపుటకేమైన వచ్చిరేమో ననుకొన్న అంతఃకరణ సమాధానముతో నిలచిపోయినది.

జనకచక్రవర్తి ఆ సుకుమార పాదతలముల తలచినప్పుడాతని అంతఃకర ణము చాల నొచ్చుకొన్నది. కఠినకాంతారక్లేశముల నీపాదారవిందము లెట్లు సహిం చినవని. మునివర్యులెందుకు వీరిని నడిపించుకొని వచ్చిరో। జనకుని మనస్సు నిర్ణ యించుకొనలేకపోయినది. వారిద్దరి పోలికలకు భేదములేదు. పొడవొక్కటే. చేష్టలు వేరైలేవు. మరల కొంతసేపు ఆ మనోహరమూర్తులెవ్వరై యుందురని జనకుని మనస్సు చర్చించినది. సూర్యచంద్రులనుకొన్నది. కాదు కాదు. వారాకస మందుందురు గదా। అనుకొన్నది. అది నిశ్చయము కాలేదు. ఒకవేళ ఈ భూమం డలమున కలంకారముమ గూర్ప వచ్చిరేమో ననుకొన్నది. పర్యవసానమున మన మనస్సు వీరిని నిశ్చయింప సమర్థము కాలేకపోయినది.

అట్లు తన ఇంద్రియ వర్గమును తానును నిశ్చయించుకొనలేని జనక చక్ర వర్తి విశ్వామిత్ర మునీంద్రులనే వీరెవ్వరిని సూటిగ ప్రశ్నించినారు.

మునిచంద్రా! మీకు మంగళమౌగాక. ఈ బాలకు లెవ్వరో ఎవ్వరిపుత్రులో చెప్పుడనినాడు. "శ్రోతుమిచ్ఛామితత్వః" అని చాల ఆదరముగ అడిగినాడు. విశ్వామిత్రులు వారెవ్వరి పుత్రులో వారేమేమి కృత్యముల నొనర్చిరో చెప్పినారు జనక చక్రవర్తికి. ఇక్కడ రాముని పరబ్రహ్మ తత్వమును ఎంత నిగూఢముగ వాల్మీకి వాక్రుచ్చిరో చెప్పెదను.

"తస్యతద్వచనం శ్రుత్వాజనకస్యమహాత్మనః
న్యవేదయన్మహాత్మానౌ పుత్రౌదశరథస్యతౌ
సిద్ధాశ్రమనివా సంచరాక్షసానాంవధంతథా
తచ్చాగమనమవ్యగ్రం విశాలాయాశ్చదర్శనం
అహల్యాదర్శనంచైవ గౌతమేన సమాగమం
మహాధనుషిజిజ్ఞాసాంకర్తుమాగమనంతథా
ఏతత్సర్వం మహాతేజా జనకాయ మహాత్మనే
నివేద్యవిరరామాథ విశ్వామిత్రో మహామునిః

మహాత్ముడగు జనకుని వర్ణనను వినినారట. జనకునకు "మహాత్మానః" అను విశేషణమును వాడినారు కవి. తరువాత "మహాత్మనౌ" అని రామలక్ష్మణులకుకూడ విశేషణమును వాడి దశరథ పుత్రులని నుడివినారు. అంతతో కాక సిద్ధాశ్రమములోవి తన యాగరక్షణ సందర్భముగా గావించిన రాక్షస వినాశ మును మధ్యే మార్గమునందలి అహల్యా శాప విమోచనమును గూడ మహాత్ముడగు జనకునకు చెప్పెనట. ఎవరు? మహా మునియగు విశ్వామిత్రులు. అందులోనే ధనుర్దర్శన జిజ్ఞాసను కూడ కలిపి చెప్పినారు విశ్వామిత్రులు. రాముడు సాక్షాన్నారా యణుడేనా? అన్న అనిర్వచనీయ ప్రశ్నలను గావించిన జనకుని మహాను భావత్వ మును జనకుని విశేషణముతో చెప్పి, అట్టి జిజ్ఞాసువుల కొరకు వచ్చిన తత్వమే ఇది యని, రామలక్ష్మణులకు వాడిన "మహాత్మనౌ" అన్న విశేషణముతో రహస్య మును రహస్యముగనే బోధించినారు వాల్మీకి. తరువాత ఆ పరమాత్మ చరిత్రను వర్ణించుచు రాక్షస వినాశమునే గాక అహల్యా శాప విమోచనముతో ఆ పరబ్రహ్మ యొక్క పావనత్వమును ప్రకటించినారు జనకునకు విశ్వామిత్రులు. ఈ ఘట్టమున మహా తేజోపంతుడగు విశ్వామిత్రుడు మహాత్ముడగు జనకునకు చెప్పెనని వాల్మీకి

వర్ణించినారు చూచితిరా? రామ తత్వమును వినదగువారు జనకుని వంటివారు. చెప్పదగిన వారు విశ్వామిత్రుని వంటి వారని వక్తను పుచ్చుకుని వర్ణించి రామ తత్వమును ప్రకటించినది ఈ ఘట్టమున వాల్మీకి వాణి-

భారతీయ గ్రంథముల యందు మహనీయుల నిగూఢతత్వ ప్రబోధము లిట్లే యుండును.

జనకునకు విశ్వామిత్రులు తెలిపిన రాముని ప్రయాణ కార్యక్రమములోని అహల్యా శాప విమోచన కథా వృత్తాంతము శతానందునికి అపరిమితానందమును కూర్చినది. ఆతడు పులకిత గాత్రుడయ్యెను. తన తల్లి శాప విమోక్షము వింతకు ముందాతడు ఊహించినది కాదు. ఆమె దురదృష్టము మరల అదృష్టమునకు తావిచ్చునా? యన్న ఆ మహనీయుని ఊహా ప్రపంచము ఈనాడు ఆయన అంతకరణము నుండి తిరోధానమగుటకు ఆతడాశ్చర్య చకితుడయ్యెను.

నిజమునకు విశ్వామిత్రుని వంటి మహనీయు లుండిన గదా। అటువంటి దురదృష్టవంతులు అదృష్టవంతులగుట.

శతానందుని ఆశ్చర్య చకితత్వము సామాన్యమైనది కాదని వాల్మీకి వర్ణించినారు. "పరం విస్మయ మాగతః అని. తన తల్లి కృత కృత్యురాలైనదన్న ఆనందాతిరేకమున రామచంద్రుని మహా మహిమ అంతర్లీనమై యుండుటనే వాల్మీకి ''పరం విస్మయమను పదమున ప్రకటించినారు. శతానందులు తన తల్లికి విముక్తురాలను గావించిన విశ్వామిత్ర మునీంద్రునివంక జూచి పునఃపునః (మాటి మాటికి) ఆఘట్టమును తలచికొని పొంగిపోవుట జరిగినది. విశ్వామిత్రుని ప్రశంసా పూర్వకముగ నాటి తన తల్లి దైవ దుర్విదగ్ధత్వమును తలచుకొని, ఆదైవ కల్పిత ప్రతిబంధకమును తొలగించిన విశ్వామిత్రుని తలచి రాముని పరతత్వమును ప్రకటించుచు, నేడు తన తల్లి భాగ్యవంతురాలగుటను ప్రశంసించుకొని, తన మాతా పితరులు ఆ యాశ్రమమున నేడు పత్ర పుష్ప ఫలాదులతో పిపీలికాది చతుర్ముఖాంత దేవతాతతికిని పూజార్హుడగు రామున కర్పించుటను తలచి . అనిర్వచనీయానందాతిరేకమున విశ్వామిత్రుని ప్రశంసించినాడు. శతానందుడు విశ్వామిత్రుని ప్రశంసించు కొన్న రెండు శ్లోకముల వినిపించెదను.

అపిమే గురుణారామః పూజితః కుశికాత్మజ
ఇహాగతో మహాతేజాః పూజాం ప్రాప్తోమహాత్మనః

"అపిశాంతేన మనసా గురుర్మే కుశికాత్మజ
ఇహా గతే నరామేణ ప్రయతే నాభివాదితః

ముఖ్యముగ శతానందుని ఆనందము నందొక ప్రత్యేకత యున్నది. ఏమది? కోప పూరితుడై వెళ్ళిన తన తండ్రి శాంత మనస్కుడై తిరిగి వచ్చుటయు, అట్టి ప్రశాంత మనస్కుడై తన తల్లితో కూడి రామబ్రహ్మమును పూజించుటయు, ఆ మూర్తిచే అభివాదితుడగుటయు శతానందుని ఆనందమునకు ప్రత్యేక కారణము లైనవి. అట్లు విశ్వామిత్రుని ప్రశంసించగా ఆతడును తన గొప్పను ఒప్పుకొనక నా కర్తవ్యమును నెరవేర్చితిని. అంతమాత్రమేనని నీ తల్లి రేణుకవలె పవిత్రు రాలైనదనినారు. అంతతో శతానందుడు ఆగలేదు. రాముని వంకకు తిరిగి విశ్వామిత్రుని తపః ప్రభావమునంతను విశదీకరించినారు.

అది యొక విచిత్రమగు ఘట్టము. విశ్వామిత్రుని చరిత్రము సాధకుల జీవితమునకు పరమాదర్శమగు ఘట్టము. జాగరూకులై వినుడు. రామాయణ మంతయు ఒక ఎత్తు. విశ్వామిత్రుని చరిత యొక ఎత్తు. నిజమున కిది చరిత్ర కాదు. ఇదియొక అద్భుత మహా మహిమల పోరాటము. ఒక విధముగ చరిత్ర రూపమున వెలసినదనుట యుక్తము కాకపోదు.

విశ్వామిత్రుని మొదటి జీవితము రాజవంశములోనిది. ముని జీవితము రెండవది. విశ్వామిత్రుని తండ్రి గాధి. తండ్రి తన చేత నుంచిన సామ్రాజ్య లక్ష్మిని కొన్ని వేల సంవత్సరములు ధర్మాత్ముడై నాలుగు వర్ణములను వారు వారి వారి ధర్మముల నుండి పతనము గాకుండునట్లు వారికే విధములగు బాధలు లేకుం డగను రక్షించినాడు. అతని సామ్రాజ్యము సర్వభూత సుఖావహమై నడచినది.

ఒకనాటి ఘట్టము.

అక్షౌహిణీ సైన్యము తన్ను వెంట నంటగా చతురంగ బలముతో తన సామ్రాజ్య పర్యవేక్షణకై బయలుదేరినాడు విశ్వామిత్రుడు.

నదీనదములతో సస్యశ్యామలమై నగరోపవనములతో విరాజిల్లు భూభాగము నంతను పర్యటించి, ఆ సైన్యముతోడనే వశిష్ఠ మహాముని ఆశ్రమమునకు గూడ ఏతెంచినాడు. ఆ మునీంద్రుని ఆశ్రమ ప్రవేశమే గాధినందనుని మొదటి జీవితమును మళ్ళించి నూతన జీవితా రంభమునకు ప్రారంభోత్సవము గావించినది. మానవ

జీవితము మలుపు తిరుగుటకు కొన్ని సంఘటనలు అనూహ్యములై వచ్చుట సృష్టిలోని చమత్కారము.

వశిష్ఠ మునీంద్రులు విశ్వామిత్రుని పాద్యార్ఘ్యములతో గౌరవించి కంద మూల ఫలములతో ఆతిథ్యము నొసంగినారు. ఒకరి నొకరు కుశల ప్రశ్నల గావించుకొనినారు. అంతవరకును వారిద్దరికిని పరస్పర మైత్రి తోడనే సంభాషణ నడచినది. వశిష్ఠ మునీంద్రులకు విశ్వామిత్రునికిని ఆతని సైన్యమునకు రాజ మర్యాదలతో ఆతిథ్యమునివ్వ కుతూహలము కలిగినది. తన హృదయమును తెలిపినారు విశ్వామిత్రునకు. విశ్వామిత్రుడు మునీంద్రు లిచ్చిన కందమూల ఫలములకే తృప్తుడై తన కరుణారసపూరిత కటాక్షపాతములే మాకు పరిపూర్ణాతిథ్యమని సవినయముగ మనవి చేసికొని బయలుదేరినాడు. వశిష్ఠు డందుకు ఒప్పుకోలేదు. చివరకు విశ్వామిత్రుని నాటి ఆతిథ్యమునకు ఒప్పించినారు బ్రహ్మర్షి. విశ్వామిత్రుడును ఆ మహర్షి ఆదరమును అంగీకరించగా వశిష్ఠాశ్రమముననే చతురంగ బలములకును ఆతిథ్యము నొసంగుటకు మునీంద్రులు తన హోమధేనువు నాహ్వానించి అతి వేగముగ ఈ మహా సైన్యమునకును, పురంధ్రీమణులకును, బ్రాహ్మణ బృందమునకును ఎవరెవరికి ఏమేమి కోర్కె లుండునో ఆయా కోర్కెలు తీర్చుచు భక్ష్య భోజ్య లేహ్యములతో మృదు మధురసరసాన్నముల కల్పించి తృప్తుల గావింపుమని ఆజ్ఞాపించినారు

"క్రియాసిద్ధి స్సత్వే భవతి మహతాం నోపకరణే"

ఆ హోమధేనువునకు వంటపాత్రల నెవ్వరైన ఇవ్వవలెనా? పదార్థముల నెవ్వ రివ్వవలెను? సంకల్ప మాత్రముననే వంట లన్నియు తయారైనవి. వశిష్ఠ మహా ముని మహిమాన్విత తాపస తేజమే ఆ హోమధేనువు.

అన్నపురాసులు సృష్టములైనవి. సూపములును అట్లే. పాయసము నదీ రూపమున పారినది. మధుర పదార్థములు రాసులై నిండినవి. దధిక్షీరములకు కొరతలేదు. మద్య విశేషము లన్నియు ఆ యతిథులకు కన్నుల పండుగలై నోరూరించు నిర్మింపబడినవి. పుష్పాసవములొక వంక మధ్వాసవము లొకవంక, గుడాసవము లొకవైపు సృష్టింపబడి వేలకొలది పాత్రలలో నిండియున్నవి.

పంక్తులు తీరిన మంత్రి పురోహిత అమాత్య వర్గములకును, రాజాంతఃపురమున వసించు పురంధ్రీమణులకును గూడ ఆ యతిథి సత్కారమర్హమై నడ

వగా బ్రాహ్మణ బృంద మంతయు ఆదర వాక్యములతో భుజింపగా విశ్వామిత్రున కాయాతిథ్యము ఆశ్చర్యమును గొలిపినది. ఆ ధేనువు యొక్క ప్రభావమా రాజర్షిని విస్మితుని గావించినది. వశిష్ఠ మునీంద్రున కిది యొక ఆశ్చర్యకరమగు కార్యము కాదు. ఆతడు బ్రహ్మర్షి. సంకల్ప ప్రభవములగు కామముల నన్నిటిని త్యజించి ఆత్మానందానుభవము కలిగిన మహనీయులు. విశ్వామిత్రుడు రాజర్షి. ఆతనిని కామధేనువు యొక్క కార్యము ఆశ్చర్యచకితుని గావించుట యందాశ్చర్యములేదు. కాని ఆశ చాల చిత్రమైనది. ఇనుప సంకెలలు మానవుని ఒక్కచో బంధించి కూర్చొనబెట్టగా, ఆశా శృంఖలములు మానవుని పరుగెత్తించును. ఇది యొక చిత్రము. విశ్వామిత్రునకు ఈ కామధేనువు కావలెననిపించినది. తనకున్న సంపద వశిష్ఠ మునీంద్రుని పర్ణ కుటీరమునందలి హోమధేనువునకు తూగదనిపించినది. తన సామ్రాజ్యమునందీ హోమధేను వున్నచో తనకు కొరత లేదనిపించినది. ఈ ధేను రత్నమును సంపాదించి నేను రాజశ్రేష్ఠుడ నగుదునని భావించినాడు. సామాన్యముగ భావించుట కాదు. నిర్ణయించుకొనినాడు. కాని ఆ హోమధేనువు మన కెట్లు లభించును? వశిష్ఠుని అడిగినాడు ఏమని? మునీంద్రా! మీకు నేను ఈ హోమధేనువునకు బదులుగ లక్ష ధేనువుల నిత్తును. నాకీ ధేను రత్నము నిమ్మని. నిజమునకు విశ్వామిత్రు డట్లగుట ఏమి ధర్మము? అది యొక రాజ ధర్మమట. శ్రేష్ఠములగు వస్తువు లేమైనా యున్నచో ఆ వస్తువు రాజు దగ్గర యుండవలెనట.

"రత్నం హి భగవ న్నేత ద్రత్నహారీచ పార్థివః
తస్మాన్మే శబలాం దేహి మమైషా ధర్మతో ద్విజ

దీనికి వశిష్ఠుడేమి సమాధానము నిచ్చెనో తెలియునా? నీవెన్ని కోట్ల గోవు లిచ్చినను దీనిని నేనివ్వ ననినాడు. మరల విశ్వామిత్రు డెంతయో రత్నాది పదార్థ ముల నాశ గొలిపినను వశిష్ఠులు లొంగలేదు. నా సర్వస్వ మిదియే ననినారు. అంతియే కాదు. ఇది నా ఆత్మ ధనమని సమాధానమిచ్చినారు.

"శాశ్వతీ శబళా మహ్యం కీర్తి రాత్మవతో యథా

నా యాత్మను నీ కెట్లు ఇత్తును? అని తేల్చినారు. అయ్యును విశ్వామిత్రుని ప్రయత్నము విరమణము కాలేదు. విశ్వామిత్రుడు వశిష్ఠుని తన క్షాత్ర తేజముతో తొడనే కొలచినాడు. మీరేమి కోరిన దాని నిత్తునని మరింత ఆశను గొలిపినాడు వశిష్ఠులు చివ్వరి సమాధాన మిట్లు చెప్పవలసి వచ్చినది.

"బహునా కిం ప్రలాపేన నదాస్యే కామదోహినీం"

విశ్వామిత్రా! ఎందుకు ప్రలాపముల పల్కెదవు? నా కామధేనువును నీ కివ్వను. అని సమాధాన మిచ్చినారు. ఘాటుగ చెప్పిన ఆ బ్రహ్మర్షి సమాధానము విశ్వామిత్రునికి తీవ్రమగు కోప కారణము కాగా బలాత్కారముగ వశిష్ఠుని హోమ ధేనువును స్వాధీనము కావించుకొనినాడు. వశిష్ఠులు మాట్లాడలేదు. ఆయన మౌన మునే వహించినాడు. ధేనువునకు దుఃఖ మాగలేదు. తానేమియైన ఋషికి తప్పు చేసితినేమో! యని భావించినది. బాగుగ ఆలోచించినది. తన తప్పేమియు లేదని ధేనువునకు నిర్ణయమైనది. వశిష్ఠుని దగ్గరకు రాదలచినది. కాని అది రాజభటుల స్వాధీనము నందున్నది. అయ్యును దాని ప్రభావము రాజభటులకన్న గొప్పదైనది. అది సైన్య మధ్యము నుండి వాయు వేగమున ఒక్క దుముకు దుమికినది వశిష్ఠుని సన్నిధానమునకు. మునీంద్రున కభిముఖమైనది కన్నీరు గార్చుచు. తనను రాజ భటులకేల ఈ మహర్షి వప్పచెప్పెనో తెలుసుకొనవలెను. కన్నీరును గార్చుచునే మునీంద్రుని అడిగినది సోదరివలె.

ధేనువు=మునీంద్రా! నేను మీకేమైన అపరాధము నొనర్చితినా? నన్నేల ఈ రాజభటుల చేత బెట్టితిరి?

ముని=నీవు అపరాధివి కావు. అతడు నాకంటె బలవంతుడగు రాజు.

ధేను=మునీంద్రా! క్షత్ర బలము కంటె బ్రహ్మ బలము గొప్పది.

వశి=కావచ్చును నన్నేమి చేయమందువు?

ధేను=మీరాజ్ఞ ఇడుచో నేనే సమాధానము నిత్తును. మరేమి చేయవలెను?

వశి=ఆటులైన బలవంతులగు సైనికుల సృష్టింపుము.

ధేను=చిత్తము.

వశిష్ఠ మునీంద్రుని ఆజ్ఞయైనది తడవుగా ఆ హోమధేనువు ఒక్క హుంకారమును గావించినది. భయంకరమగు ఆ నాదము నుండి కొంత సైన్యము పుట్టినది. వారికి పప్లవులని పేరు. ఆ సైన్యము విశ్వామిత్రుని సైన్యముపై విరుచుకు పడినారు. ధేనువు సృష్టించిన సైన్యము విశ్వామిత్రుని సైన్యముచేత నాశమైనది. అంతతో కామధేనువు ఆగలేదు. వేరొక సైన్యమును సృష్టించినది. వారికి శకులు యవనులు అని పేరు. అందును కొంత సైన్యము నాశమైనది విశ్వామిత్రుని సైన్యమువలన. కాని విశ్వామిత్రునకు జయము కలుగలేదు. వశిష్ఠుని అనుగ్రహము ధేనువుపై కలిగినది. అంతతో ధేనువునకు బలము హెచ్చినది.

ఆమె రోమ కూపములనుండి కొంత సైన్యము. యోని దేశమునుండి కొంత సైన్యము మరల మరలచేయుహుంకారవములనుండి కొంత సైన్యము సృష్టము కాగా ఒకరికంటె నొకరు బలవత్తరులై సూర్యకిరణములవలె సైనిక గణముత్ప న్నముకాగా వశిష్ఠాశ్రమము రణరంగమైనది. విశ్వామిత్రునకు ఓటమి తప్పలేదు. సైనికులు ఓడుట మాత్రమే కాదు. అతని నూర్వురు పుత్రులు వశిష్ఠ మునీంద్రుని పైకి దుమికి ఆయన హుంకారముచే ఆ మహనీయుని కోపాగ్నికి దగ్ధమగుట జరిగినది. అంతతో విశ్వామిత్రుని యుద్ధము ముగిసినది. ఆయన ముఖమండలము చిన్నబోయినది. రాజునన్న గర్వము అస్తమించినది. లోపల క్రోధాగ్ని జ్వలించి నది. కోరల కోల్పోయిన సర్పరాజై నిలిచినాడా రాజు. రాహుగ్రస్త సూర్య మండలమువలె అతని ముఖకాంతి మాయగా తన రాజ్యమున కేగినాడు. కాని విశ్వామిత్రుడు హతాశుడు కాలేదు. పుత్రునిపై రాజ్యమునుంచి వనమున కేగినాడు.

అది హిమవంతము. ఆ హిమవంతముననే విశ్వామిత్రుని దీర్ఘ తపము అది మోక్షమునకు కాదు. శత్రు జయమునకే. ఎవ్వరా శత్రువు? వశిష్ఠులే. ఆతని జయించి హోమధేనువును తేవలెను. కొంతకాలము గడచినది. ధనుర్వేదమున కధికారి ఈశ్వరుడు. శంకరుడు సాక్షాత్కరించినాడు. ఆయన అనుగ్రహము కలిగినది విశ్వామిత్రునకు. ఉపనిషత్సారస్వతముతో కూడిన ధనుర్వేదము నంతను సరహస్యముగ భగవానులే ఆయన కందించినాడు. అస్త్ర సంపదంతయు విశ్వా మిత్రుని చేతికి చిక్కినది. అతని క్షాత్రతేజమున కొక ప్రత్యేకత కలిగినది. అస్త్ర ప్రభావమంతయు తనయందు తొణికసలాడగా పరమోత్సాహమున అతడుప్పొంగి నాడు. ఆక్షణముననే వశిష్ఠాశ్రమమున కాలిడినాడు. ఇక వశిష్ఠునకీ భూమండ లముపైన తావుండకూడదనియే విశ్వామిత్రుని సంకల్పము. విశ్వామిత్రుడు వశిష్ఠాశ్రమముపై ఆగ్నేయాస్త్రమును ప్రయోగించినాడు. ఆశ్రమము అగ్నిమండలి కాజొచ్చినది. కాని వశిష్ఠుని చిత్తము చలించలేదు. మరి ఆ వశిష్ఠాశ్రమమున వశిష్ఠు లొక్కరే లేరుగదా? ఆ యాశ్రమ మెన్నియో భూతములకు నిలయము. సామాన్యములగు భూతములకే కాదు. ముని పుంగవు లెందరో అందుకలరు. శిష్య గణమును అందే కలదు. విశ్వామిత్రుని అస్త్ర ప్రభావము జ్వాలా భీలమైరాగా ఆ ప్రభావము వారిపై ఏల ప్రభావితము కాకుండును? ఆ యాశ్రమమందలి మునిగణమును, శిష్యగణమును, పశుపక్ష్యాది సంఘాతమును గుంపులు గుంపులై పరుగు లెత్త నారంభించారు. ఆశ్రమము శూన్య నిలయమైనది. అప్పుడు వశిష్ఠుని

హృదయము కదలినది. స్వార్థము లేకపోవుట యన ఈ వశిష్ఠుని స్థితియే. జ్ఞానులకు దుఃఖశోకములు లేవు. కాని ఇతరుల దుఃఖశోకముల వారు సహింపరు. లోక కళ్యాణమునకే వారి శరీర ధారణము. మునిచంద్రుని అంతఃకరణము విశ్వామిత్రున కొక విధముగ సమాధాన మివ్వదలచినది.

సూర్యుని చుట్టియున్న మంచు సూర్యకిరణములకు లోబడకయుండునా? వశిష్ఠ మునీంద్రులు తన ఆశ్రమము నందున్న భూతముల కన్నిటికిని అభయ ప్రదానమిచ్చినారు ఆక్షణముననే. ఏమని? గాధి నందనుని నాశము గావింతునని.

నాశయామ్యద్య గాధేయం నీహారమివ భాస్కరః

వశిష్ఠ మునీంద్రుని హస్తమునందొక దండము వెలసినది. అది యమ దండమునకు సరియగు దండము. దానికి బ్రహ్మదండమని పేరు. ఆ దండమును చేతనిడుకొన్న వశిష్ఠ మునీంద్రులు విశ్వామిత్రుని వంక దిరిగి క్షత్రబంధో! అని సంబోధించి, దివ్యమగు నా బ్రహ్మబలమును చూపదలచినాను నిలుమని గర్జించి పలికినాడు. ఆశాంతమూర్తి ఇప్పుడు శాంతమూర్తి కాదు అతడు పొగలెగయని అగ్నిమండలము. ఆయనచేత నున్నది యమదండము. ప్రళయ కాలాగ్నిపలె వెలుగు నాతని బ్రహ్మదండము నక్కడ నిలిపి, రే! గాధి నంధనా! రానిమ్ము! రానిమ్ము! నీ యస్త్రములనని పలికినాడు. విశ్వామిత్రుని వద్దనున్న అస్త్రములన్నియు జయులు దేరినవి. ఆ బ్రహ్మదండమున లీనమైనవి. ఇక విశ్వామిత్రుని దగ్గర మిగిలినది బ్రహ్మాస్త్ర మొక్కటే. అది మహాస్త్రము. దానిని తీసినాడు గాధి నందనుడు. అది మూడులోకముల నొక్కమారుగ భస్మీపటలము గావింపదగు అస్త్రము. దేవతలు విశ్వామిత్రుడాయస్త్రమును తీయగనే గజగజలాడినారు. ముల్లోకములును ఇంతతో సమాప్తమనుకొనినారు. దేవర్షి బ్రహ్మర్షు లందరును యక్షకిన్నర గంధర్వ గణమంతయు భయభ్రాంతమైనది. కాని ఆ మహాస్త్రమును వశిష్ఠుని బ్రహ్మదండముననే లీనమైనది. వశిష్ఠుని దివ్యదేహము అప్పుడు రుద్రరూపము నొందినది. ఆ బ్రహ్మణ్యుని శరీరము నందున్న రోమకూపములనుండి అగ్నిజ్వాలలు చెలరేగినవి. వశిష్ఠ మునీంద్రుని చేతనున్న బ్రహ్మదండముకూడ లోకభయంకరమై వెలుగొందినది. ఆ తేజము నెవ్వరు చూడగలరు? ఏ లోకము భరింపగలదు? ఆ బ్రహ్మదండమునుండి విజృం

ళించి వచ్చు మహోగ్ర తేజమును భరించగల వ్యక్తి వశిష్ఠ మునీంద్రులే. కావున అందరును మునీంద్రుని బ్రాహ్మీతేజమును స్తుతింప మొదలిడినారు. అనుగ్రహింపుమని వశిష్ఠుని కోరినారు. అందరి ప్రార్థనలను వశిష్ఠుని శాంతచిత్తుని గావింపగా ఆ రౌద్రతేజమంతయు శమించినది. విశ్వామిత్రునకొక నిశ్చయము కలిగినది.

"ధిగ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజో బలం బలం,

బ్రహ్మబలము ముందు క్షత్రబలము వ్యర్థమని. మరి ఇప్పుడు అతడేమి చేయదలచినాడు ? అతడిప్పుడు బ్రహ్మత్వమును సంపాదింపదలచినాడు.

శ్రోతలారా! ఇంతవరకు జరిగిన వశిష్ఠ విశ్వామిత్రుల బలాబలప్రదర్శనలను మీరేమని అర్థముచేసి కొంటిరి?

అఖండాత్మను ఆధారముగాగొనియే ప్రకృతి విస్తారమంతయు నడచుచున్నది. ఆ ప్రకృతి పరబ్రహ్మ వస్తువునకంటె వేరుకాదనునదే పరమ సిద్ధాంతము. సముద్రమున కంటె అలలు వేరుగానట్లు బ్రహ్మచైతన్యమునకంటె వేరుగ జగత్తులేదను ఆత్మనిష్ఠుడు వశిష్ఠుడుకాగా విశ్వామిత్రుడు దానికంటె భిన్నుడై జరామరణ వర్జితమును అజమునగు ఆయఖండ బ్రహ్మచైతన్యమును అస్తమింపజేయ చూచినాడు. అలలు సముద్రునితో పోరాడి ఏమగును? సూర్యకాంతితో పోరాడిన దీపకాంతులు సూర్యకాంతిని జయించునా?

ప్రకృతి బద్ధుడై ప్రకృతి జనించు మనః కల్పిత భోగములతో ఆనందించుచు ప్రకృతిలోని కొన్ని యంశముల విజృంభణలనమ్ముకొనుట క్షాత్రము. సహజానందమును కోల్పోక ప్రకృతి తనకంటె వేరులేదని సార్వాత్మ్యభావమున స్థిరుడై త్రిగుణముల కతీతుడై యుండుట బ్రాహ్మ్యము. అ తేజము ఆవరణ రహితమగు బ్రాహ్మ్యతేజము. అది ఒకదానిచే బాధింపబడునదికాదు. అదిత్రైకాలిక సత్యము. ఈ రెంటికి జరిగిన సంఘర్షణము విశ్వామిత్ర వశిష్ఠుల వీర విహారము. ముందు కథకు పోదము.

బ్రహ్మభావము క్షత్రభావమునకంటె మహామహిమాన్వితమని విశ్వామిత్రుడు నిర్ధయించుకొనినాడు. తానిప్పుడు బ్రహ్మర్షి కావలెను. బ్రహ్మర్షిత్వమునకు ప్రధాన చిహ్నము జితేంద్రియత్వము ఈ దేహ సంబంధము కలిగియుండియు మనో బుద్ధి చిత్తాహంకారము లెవ్వని కదిలింపవో అతడు బ్రహ్మర్షి.

ఆత్మనిష్ఠుల దృష్టియందు పోవునదిలేదు. వచ్చునది లేదు వేరుగ ఉన్నదియు కూడలేదు.

విశ్వామిత్రుడు జితేంద్రియత్వమునకై తపమొనర్ప తన పట్టమహిషితో దక్షిణదిశ కేగెను. ఇంద్రియ జయమునకు కంకణము కట్టుకొనెను. ఇంద్రియములను కంకణము కట్టుకొన్నవి. తపము సాగినది. ఇంద్రియములా విశ్వామిత్రునకు వశము కాలేదు. పట్టమహిషియందు హవిష్యంద మధుష్యంద దృఢనేత్రులను ముగ్గురు పుత్రులుదయించినారు. అయ్యును అతడు నిస్పృహుడు కాలేదు. తపమును కొనసాగించినాడు విశ్వామిత్రుని జయించవలెనని ఇంద్రియములు కట్టుకొన్న కంకణమును అవ్వియు ఊడదీయలేదు. విశ్వామిత్రుని తపము ఒక వేయి సంవత్సరములు సాగినది. చతుర్ముఖుడు రాజర్షి బిరుదము నిచ్చినాడు. రాజర్షులకు అర్హములగు లోకములన్నియు విశ్వామిత్రునకు స్వాధీనము గావించినాడు. విశ్వామిత్రుడు కోరినది బ్రహ్మర్షిత్వము. వచ్చినది రాజర్షి పదవి. విశ్వామిత్రుడు సిగ్గునొందినాడు. మరల తపస్సును ప్రారంభించినాడు "శ్రేయాంసి బహువిఘ్నాని" ఈ వేయి సంవత్సరముల తపమును వ్యర్థమై బ్రహ్మర్షిత్వమును సంపాదింపలేకపోయినది. కాని బ్రహ్మదేవుని సృష్టికి ప్రతిసృష్టి చేయగల మహాశక్తి యుదయించినది. అశక్తి అహంకారమునకు కారణమైనది. కామక్రోధములను అహంకారమును అభేద్యకవచములతో విశ్వామిత్రునిపై దండెత్తి అవియే. విజయమును సాధించినవి.

దక్షిణ దిశయందు ప్రారంభించిన ఆ దీర్ఘ తపము బ్రహ్మర్షిత్వమును కల్పింపలేదు. ఆ దిశయందా తపస్వి మహా ప్రయత్నమంతయు ఒక విపరీత సంఘటనకు గురియైనది. బ్రహ్మర్షిత్వమును సంపాదించుటయన మాయను దాటుట యనియర్థము. విచిత్ర చిత్ర సంఘటనల కల్పించునదే మాయ. ఆ మాయ రెండు విధములు. సామాన్యము దైవికమునని. భగవానులు దైవీ మాయను దాటుట చాల దుర్ఘటమనినారు. "దైవీ హ్యేషాగుణమయీ మమమాయా దురత్యయా" అనినారు. నా మాయను దాటుట చాల కష్టమనినారు.

విశ్వామిత్ర మహర్షి గారి తపము మహా ఘోరమై సాగుచున్నది. అతడొక వినూత్న జీవితమును సంపాదించుకొనుట కొరకై చేయు ప్రయత్నమును త్రిగుణాత్మకయగు మాయ చూచి సహించలేక పోయినది. ఆ తపస్వియందు రజోగుణము ప్రధానముగ చోటు చేసుకొని స్థావర మేర్పరచుకొనుటయే అందుకు కారణము.

వారు విశ్వామిత్రుని సత్వగుణము తొంగి చూచుచున్నదే గాని ఆయన అంతః కరణమున స్థానము నేర్పరచుకొనలేదు. అనాటి సంఘటన ఇది.

త్రిశంకుడను మహారాజు యజ్ఞమును చేసి ఆ యజ్ఞ ఫలముగ ఈ శరీరము తోడనే స్వర్గమున కేగవలెనని తలచినాడు.

ఇక్ష్వాకు వంశమునకు పురోహితుడు వశిష్ఠ మునీంద్రులు. ఆ మునీంద్రుల దగ్గర కేగినాడు. మునివర్యా! నాకు ఈ శరీరము తోడనే స్వర్గమునకు బోవు యజ్ఞమును చేయింపుడని కోరినాడు. అది సాధ్యముగాని పనియని వారు సమాధాన మివ్వగా ఆయన పుత్రులగు మహోదయుడు మొదలగు వారి కడ కేగినాడు. వశిష్ఠుని పుత్రులు నూర్గురు. అందరును దక్షిణ దిశయందు తపము గావించుకొనుచుండగా అక్కడికేగి తన కోర్కెను తెలిపినాడు. త్రిశంకుని వారెట్లు మన్నింతురు? తమ తండ్రి సాధ్యము కాదనిన కార్యమును వారు కొనసాగింతురా? త్రిశంకువి నీ సంకల్పమును మార్చుకొని నగరమున కేగుమని కఠినముగ మందలించి వారు. త్రిశంకున కది యవమానమైనది. రాజునగు నన్ను వీరిట్లవమానించుటయా? అను రాజ స్వభావమాత్రిశంకుని ఒక్కమారు ఉద్రేకింపజేసినది ఆతని దృక్పథమున వేదమునందలి ప్రామాణ్యబుద్ధి తొలగినది. ఆతని చిత్తము వేద విదుడును బ్రహ్మ పుత్రుడునగు వశిష్ఠ మునీంద్రునిపై గల పూజ్య భావమును కోల్పోయినది. అది త్రిశంకుని పుణ్య జీవితము పతనమగు కాలము. వెంటనే ఆతడు నా కోర్కెను మీరు తీర్చలేదు. కావున మీ పురోహి తత్వమును వదలుకొనుచుంటి ననియు వేరొకరిని గ్రహించుచుంటిననియు నిర్ణయముగ చెప్పి మీకు మంగళమౌగాక యను మధుర వాక్యముల తోడనే తన కోపమును ప్రకటించుచు పలికినాడు.

వశిష్ఠ పుత్రులకు కోపము వచ్చినది. నీవు క్షత్రియత్వమును కోల్పోయి చండాల ధర్మములకు ఆశ్రయభూతుడవగుదువు గాకయని శపించినారు.

మహనీయుల శాప వాక్యములు నామమాత్రములు కావు అవి వాగ్వజ్రములు వారి యమోఘ సంకల్పములు సృష్టి స్థితి లయ హేతు భూతములు.

త్రిశంకుడు వాశిష్ఠుల దగ్గరనుండి శాపగ్రస్తుడై మరలి వచ్చినాడు. త్రిశంకువునకు ఆ రాత్రి గడచినది ఆతడు నిద్ర లేచినాడు. ఇంతకు పూర్వము ధరించిన పట్టు వస్త్రము ఆతని మొలపైన లేదు. చండాలుడు ధరించదగు మలిన వస్త్ర మాత

నికి కట్టబడి యున్నది. ఆతడు కట్టుకొనెనా? లేదు. అది శాప ఫలితము. శిరము నందలి దీర్ఘ శిరోజములు పొట్టివై మొలచియున్నవి. శరీరముపై ధరించిన సువర్ణాభరణము లన్నియు మారి ఇనప వస్తువులై కన్పట్టినవి. రాగ రంజితమగు మేని చాయ తొలగినది. సుకుమార గాత్ర మంతరించినది. కాటి కాపరి ఒంటియందు స్మశాన వాటికలోని బూడిద ఆతని శరీరము నందలముకొని యున్నది. ఆతడిప్పు డేమి చేయగలడు? ఆ వేషము తొలగించుకొనుటకు సాధ్యము కాదు. జీవుల భోగ భాగ్యము లన్నియు పురాకృత కర్మ ఫలములే యయ్యెను అత్యుత్కృష్టములగు పుణ్య పాపములకు ఫలములు సద్యస్కాలముననే అనుభవయోగ్యములు కాగలవని కర్మశాస్త్రము చెప్పును.

త్రిశంకుని కథయే మనకు ఆదర్శము. ప్రకృతమునకు వర్తము.

మంత్రు లందరును త్రిశంకుని వదలినారు. ప్రజలు అతని దరిజేరలేదు. ఆతడిప్పుడు వంటరి వాడయ్యెను. ఈనాటి తన జీవిత సమస్యకు పరిష్కార మెక్కడ? స్వర్గము సిద్ధించలేదు సరిగదా ఈయాపద నన్నెదుర్కొన్నది. ఈ ఆపద నెవ్వరు తీర్చగలరు? ఇంతటి శాపానుగ్రహ సమర్థు లెవ్వరు? త్రిశంకుని చింతకు మేరలేక పోయినది. కాని అతనికి విశ్వామిత్రుడు స్మృతికి వచ్చినాడు. ఆతడొక్కడే వశిష్ఠుని ధిక్కరింపగలడని నిశ్చయించుకొనినాడు. సరాసరి విశ్వామిత్రుని ఆశ్రమమున కేగినాడు.

అది విశ్వామిత్రుని తపః ఫలము వ్యర్థము కాదగిన కాలము కావచ్చును. త్రిశంకుడు విశ్వామిత్రు డెరుగని రాజుకాడు. త్రిశంకుడు విశ్వామిత్రుని ఆశ్రమమున ప్రవేశించుట తడవుగా అతని పాదములపై వ్రాలినాడు. రజోగుణ మొక విచిత్రమగు శక్తి కలది. అది దయాదాక్షిణ్యములులేని గుణముకాదు. విశ్వామిత్రుని హృదయము ఆర్ద్ర హృదయము. త్రిశంకుని చూడగనే అతని హృదయము కరిగినది. ఈ మహారాజునకీ ఘోర స్వరూప మెక్కడిది? ఇక్ష్వాకు వంశీయునకీ విపత్తు వచ్చుటయా? ఇది యొక శాపగ్రస్తమగు అవస్థాంతరమయి యుండవచ్చు నను కొనినాడు. త్రిశంకుని సగౌరవముగ పలకరించినాడు. ఈశాప మెవ్వరిచ్చిరని అడుగలేదు. శాపకారణ మేమని ఆదరములగు పలుకులతో అడిగినాడు. త్రిశంకున కొక విధమగు మనశ్శాంతి కలిగినది. త్రిశంకుడును మాటలాడుటయందు నేర్పరి. ముందు తన కోర్కెను సవినయముగ విన్నవించుకొనినాడు. ఈ శరీరముతో స్వర్గమున కేగవలెనను కోర్కెను, తరువాత తన కుల గురువగు వశిష్ఠుడు తన

యందు ఆదరమును చూపకపోవుటను తెలిపినాడు. ఆ క్షణముననే దైవోపహతుడ నగు నాకు మీరే దిక్కని శరణాగతుడై పాదములకు ప్రణమిల్లినాడు.

నాన్యాం గతిం గమిష్యామి నాన్యశ్శరణమస్తి మే
దైవం పురుషకారేణ నివర్తయితు మర్హసి

దైవము వ్యతిరేకమైనను పురుష ప్రయత్నముచే ఆ దైవము నెదుర్కొన గల సమర్థులు మీరని విశ్వామిత్రుని ప్రతిభా విశేషమును ప్రకటించినాడు. విశ్వామిత్రునకు శరణాగత రక్షణము ప్రధానమనిపించినది. ఆ రాజునకు అభయ ప్రధానమిచ్చి, ఈ చండాల శరీరము తోడనే నీవు స్వర్గమునకు బోవు యజ్ఞమును నీ చేత చేయింతునని కూడ కంకణము కట్టుకొనినాడు మునిచంద్రుడు.

విశ్వామిత్రుని జీవితము నందిది యొక విచిత్రమగు రణరంగము. ఇది భూమిపైన తన తోటి రాజులతో గావించు యుద్ధము కాదు. దేవతల తోటి పోరాటము. వేదములు చెప్పిన మార్గముగాక దేవ లోకమునకు పోవదగు ఒక నూతన మార్గమును నిర్మింపదలచు కొనినాడు తాను స్వయముగ. అతని తపశ్శక్తి అట్టి అహంకారము నిచ్చినదనుట యుక్తము. కాకున్న గురుశాప దగ్ధుని, చండాల ధర్మోపేతుని తానెట్లు స్వర్గమునకు పంపును? యజ్ఞ నిర్వహణ మెట్లు గావించును? తన కంటె వేరగు ఋత్విక్కులు లేక యజ్ఞము సాగదు. ఇందెందరో బ్రహ్మర్షు లుండ వలెను. కావున తన పుత్రులను శిష్యులను పిలిచి ఆశ్రమవాసుల నందర పిలచిరండని వారి కాజ్ఞ ఇడినాడు. ఆహ్వానము చేయుడని చెప్పుట మాత్ర మేకాదు. ఎవ్వరేమైన ఈ యజ్ఞ విషయములు నాక్షేపించుచో ఆ విషయమును సంపూర్ణముగ నాకు తెలుపుడని గూడ నొక్కి వక్కాణించి పంపినాడు. రాజసాహంకారమన ఇదియే. మూడు గుణముల యందును అహంకారము మూడు రూపముల నొంది యుండును. అహంకారమును పాధిగాగొనియే గుణములు ప్రవర్తించును. అహము నశించుచో గుణములకు తావులేదు.

ఋషుల కందరకును ఆహ్వానము లందినవి. ఎవ్వరును ఏమియు మాటాడ లేదు. వశిష్ఠ పుత్రులకు కూడ సందేశ మందినది. వశిష్ఠుని పుత్రుల యందలి మహోదయుడు పెద్దవాడు. అత డూరుకొనలేదు. ఇట్లు మాట్లాడినాడు.

క్షత్రియో యాజకో యస్య చండాలస్య విశేషతః
కథం సదసి భోక్తారో హవిస్తస్య సురర్షయః

బ్రాహ్మణా వా మహాత్మానో భుక్త్వా చండాలభోజనం
కథం స్వర్గం గమిష్యంతి విశ్వామిత్రేణ పాలితాః

భారతీయ శాస్త్రములు వర్ణ ధర్మములను, వేద విధుల ననుసరించి విధించినవి. అందు యజ్ఞములను చేయించు అధికారము క్షత్రియునకు లేదు. అట్టి అనధికారియగు క్షత్రియుడు అధ్వర్యుడగుట మొదటి దోషము కాగా చండాలత్వము నొందిన యజమాని దేవతలకు హవిర్భాగము నివ్వగా దేవతలెట్లు ఆ హవిర్భాగముల నందుకొందురో మేము చూతుము గాకయని కన్నులెఱ్ఱ జేసుకొని పలికినారు. అంతేకాదు. చండాల భోజనమును భుజించిన బ్రాహ్మణుల కెట్లు స్వర్గము లభించునుః అని బ్రాహ్మణులపైన గూడ ప్రతిజ్ఞను గావించినారు.

అది త్రిశంకుని స్వర్గమునకు పంపుటకై ఏర్పరచిన యజ్ఞవాటము. విశ్వామిత్రుని ఆజ్ఞానుసారముగ ఆహ్వానితులగు మహర్షు లందరును వచ్చినారు. బ్రాహ్మణులును వచ్చినారు. పిలుచుటకు పోయిన శిష్యులు వచ్చినారు. వశిష్ఠుని పుత్రులు మాత్రము రాలేదు. శిష్యులకు ఆ మహోదయాదులన్న మాటను చెప్పక ఎట్లు తప్పునుః చెప్పినారు.

విశ్వామిత్రుని అంతఃకరణమున క్రోధాగ్ని ప్రజ్వరిల్లినది. కమండలములోని ఉదకములను చేత నిడుకొనినాడు.

తపోరాశినై నిర్దోషినైన నన్ను దూషించిన వశిష్ఠుని పుత్రు లందరును ఇప్పుడే భస్మీపటలము లగుదురు గాకయని శాపోదకమును వదలినాడు. అంతతో విశ్వామిత్రుని కోపము చల్లారలేదు. వారందరును యమపాశమున బద్ధులై యమలోకమున కేగవలెననినాడు. ఇంకను అతని క్రోధాగ్ని వెలుగొందుచునేయున్నది. ఏడు వందల జన్మల వరకును వారు పీనుగులను పీక్కొని తినువారై పుట్టి ఆ తరువాత జన్మలో కేవలముగ కుక్కమాంసమునే తిని కఠినములగు పలుకులనే పలుకుచు దయాదాక్షిణ్య రహితమగు జాతియందే పుట్టి దేశ ద్రిమ్మరులై పోవుదురు గాక యని శపించినాడు. ఈ శాపము వశిష్ఠ పుత్రుల నందర కలిపి శపించిన శాపము. కాని మహోదయుని ప్రత్యేకత ఇందులేదు. దూషించిన దాతడే. కావున అతనిని కూడ ప్రత్యేకించి శపించినగాని విశ్వామిత్రుని కోపము చల్లారునట్లు లేదు. అతని నిట్లు ప్రత్యేకించినాడు. అతడు బోయజాతి యందే పుట్టి దయారహితుడై ప్రాణి హింసజేయుచు దానియందే ఆసక్తుడై చిరకాలము దుర్గతిపాలు కావలెనని శపించినాడు.

శ్రోతలు ఈ శాపములోని ప్రత్యేకత నేమి గ్రహించితిరి? ఇందొక ప్రత్యేకత యున్నది. ఏ జాతి యందు పుట్టినను దయాదాక్షిణ్యములను గుణములు గలిగి హింసా జీవనము లేకున్నచో రాబోవు జీవితములలో వారు మహోన్నత జీవితములను సంపాదించవచ్చును. అట్టి గుణ సముదాయముకూడ వీరి గుణమయ దేహమునకు సంక్రమించకుండునట్లు శపించినాడు. అంతతో విశ్వామిత్రుని కోపాగ్ని చల్లారినది ఇదియే ఆతని కోప వచనములలోని ప్రత్యేకత. కథకు వత్తము.

విశ్వామిత్రుని దృష్టి ప్రకృత కార్యము వైపుకు తిరిగినది. మహర్షి గణమునకు త్రిశంకుని పరిచయము చేసి, ఈతడీ శరీరము తోడనే స్వర్గమున కేగదగు యజ్ఞమును నిర్వర్తించవలెననినాడు.

మహర్షులు మారు పలుకలేదు. వారు ధర్మజ్ఞులు. ఇప్పుడీతని ఆజ్ఞను పాలించుట ధర్మమని వారిలో వారు చెప్పుకొని శాపభీతులు కూడనై విశ్వామిత్రునే యనుసరించినారు.

విశ్వామిత్రుడీ యజ్ఞమునందు అధ్వర్యుడు. మిగిలిన వారు మిగిలిన కార్యక్రమములందు ఋత్విక్కులు.

యజ్ఞము ప్రారంభమైనది విశ్వామిత్రుడు దేవతల నాహ్వానించినాడు. దేవతలెవ్వరును రాలేదు భాగముల నందుకొనుటకు. దేవతలు హవిర్భాగముల నందుకొనకున్న యజ్ఞ ఫలము పుట్టదు. విశ్వామిత్రునకు భరింపరాని కోపము వచ్చినది దేవతలు రాకున్న నేను త్రిశంకుని స్వర్గలోకమునకు పంప సమర్థుడనుకానా? అన్న ధీరత్వము కూడ కలిగినది. తన తపోధనమును వెచ్చించుట కాతడు వెనుదీయలేదు స్రువమును చేతపట్టుకొనినాడు. (హోమము చేయు ఉపకరణము) త్రిశంకుని వైపు తిరిగినాడు. త్రిశంకా! నా తపో వీర్యమును చూపుచున్నాను. చూడుము. నా తపః ప్రభావ సంపన్నత్వముచే ఈ శరీరము తోడనే నీవు స్వర్గ లోకమును చేరుకొందువు గాకయని తన తపోధనమును పణముగ పెట్టినాడు.

త్రిశంకునకు స్వర్గప్రవేశము కలిగినది. అంతతో విశ్వామిత్రుని కర్తవ్యము నెరవేరినది. ఆ ఘట్టము మును లందరికిని దృశ్యమైనది. కాని స్వర్గమున కేగిన త్రిశంకు దేమయ్యె ననునది ప్రశ్న.

స్వర్గసీమ దేవేంద్రుని సామ్రాజ్యము. దేవేంద్రుని ఒప్పుదల లేక ఆతడు స్వర్గము నందెట్లు వసించును? దేవేంద్రుడు నీవు గురుశాప దగ్ధుడవు కావున తల

క్రిందుగ భూమిపై పడుదువుగాక యని ఆ లోకమునుండి భ్రష్టుని గావించినాడు. త్రిశంకునకు అధః పతనము తప్పలేదు. నిజమునకు త్రిశంకుని స్వర్గసీమకు గొని పోయినది విశ్వామిత్రుని తపఃఫలము గాని త్రిశంకుని పుణ్య ఫలము కాదు. అనగా యాగ ఫలము కాదు యాగ ఫలముగాని స్వర్గ భోగముల చేకూర్చదు. త్రిశంకుడు స్వర్గమున కేగుట ఉత్తర దిశనుండి కాగా ఆతడు స్వర్గమునుండి పతనమైనది దక్షిణ దిశనుండి. త్రిశంకుడు తలక్రిందులుగా పడజొచ్చినాడు. కాని ఆతనికి విశ్వామిత్రునిపై గల విశ్వాసము మాత్రము అంతరించలేదు. క్రిందకు పడుచునే విశ్వామిత్రా! రక్షింపుము! రక్షింపుము! అని ఆక్రోశించినాడు. త్రిశంకుని దీన స్వరము విశ్వామిత్రుని చెవినిబడినది. త్రిశంకా! క్రింద పడకుము. అక్లే నిలు వుము. నిలువుము. అని తన తపః ప్రభావముచే ఆ త్రిశంకుని నిలిపినాడు. త్రిశంకుడు క్రింద పడలేదు కాని ఆతడు నిలిచినది అంతరాళము. అయ్యెను విశ్వామిత్రుడు ఆతనికొక ప్రత్యేక స్థానమును కల్పింపదలచినాడు. త్రిశంకుని చుట్టును వేరొక సప్తర్షి మండలమును కొన్ని నక్షత్ర మండలములకూడ సృష్టించి నాడు. ఇక స్వర్గమును సృష్టింపవలెను. దాని పరిపాలకుడగు ఇంద్రుని సృష్టింప వలెను. సృష్టింపదలచినాడు. కాకున్న వున్న స్వర్గమున దేవేంద్రుడు లేకుండనైన చేయదలచినాడు.

"అన్యమింద్రం కరిష్యామి లోకో వా స్యాదనింద్రకః

విశ్వామిత్రుని మహోగ్ర తాపసతేజము ఏమిచేయజాలదు? ఋషిగణమంతయు గజగజ లాడినది. దేవతలును భ్రాంతి నొందినారు. ఇప్పుడు విశ్వామిత్రుని కోప మును చల్లార్చుటచే మన కర్తవ్యమను కొనినారు. ఋషు లందరును కలసి గురు శాపహతునకు స్వర్గము సిద్ధింపజాలదను ధర్మము నీ వెరుగనిది కాదని బ్రతిమాలి నారు. విశ్వామిత్రుని కోపము చల్లారినది. కాని తాను త్రిశంకున కిత్తునన్న స్వర్గ మేది? ఆ మాట వ్యర్థమగుటకు ఆతడు ఒప్పలేదు. అప్పుడు దేవతలతో తనమాట అబద్ధము కాకుండుటకై త్రిశంకునికూడ స్వర్గమునందున్నవానివలె అనుగ్రహింపు డనగా వారును ఒప్పుకొనినారు. నాటినుండియు విశ్వామిత్రుడు సృష్టించిన నక్షత్ర మండలము ఆకాశమున ప్రసిద్ధమై జ్యోతిశ్చక్ర మార్గమునకు వెలుపలగా ప్రకాశింప జొచ్చినది.

త్రిశంకుడు కూడ తలక్రిందై ఆ జ్యోతిర్మండల మధ్యభాగమున తేజో వంతుడై దేశముతో పోలియే గురు ధిక్కారమునకు ఆదర్శమూర్తియై ప్రకాశించు చుండెను. అదియే ఆతని స్వర్గము. ఇక విశ్వామిత్రుని పరికింతము.

విశ్వామిత్రుని తప మంతయు వ్యర్థమైనది. దక్షిణ దిశ ఎవ్వరికిని కార్య సిద్ధిని కల్పింపదు. ఇప్పుడీ కథను ఎవరికి ఎవరు చెప్పుచుండిరో శ్రోతలు మరచి చిరాః మరువకుడు. రామునకు శతానందుడు చెప్పుచుండెను.

విశ్వామిత్ర మహర్షి ఆ దిశను వదలినాడు. పడమర దిశకు వెళ్ళినాడు. అక్కడ పుష్కర తీర్థ మాయనకు స్మృతికి వచ్చినది. అక్కడ నిలచినాడు. తపో వనమును నిర్మించుకొనినాడు. ఆతని తపస్సు ప్రారంభమైనది

దైవ పౌరుషేయములు రెండును ఒకదాని నొకటి జయింప యత్నించుచు మానవ జీవితమునే రంగ స్థలముగా గొని తమ యుద్ధమును సాగించుచుండునని శాస్త్రములు వక్కాణించును. ఆ రెంటి యందును దేనికి బలమెక్కువ? అని మనమా శాస్త్రముల ప్రశ్నించుచో ఒక శాస్త్రము దైవము వంకములు సూపగా వేరొక శాస్త్రము పౌరుషమునకే స్థానము నిచ్చును. ఇక్కడ దైవమన ప్రాక్త కర్మ. పౌరుషమన ఇప్పటి యత్నము.

విశ్వామిత్రు డిప్పుడీ రెండు శాస్త్రముల నడుమను చిక్కినాడు. అందు పురుష ప్రయత్నమే బ్రహ్మర్షిత్వమును సాధించునను శాస్త్ర మాతనిని తరుముచు ముందుకు పొమ్మనుచుండగా దైవము నాకే అగ్రస్థానమని ఆతనిని పరీక్షించు చున్నది.

అది ఒకనాటి మధ్యాహ్న కాలము. ఒక బ్రాహ్మణుడాతని పాదములపై బడినాడు నాకు నీవే దిక్కని. విశ్వామిత్రు డాతనికి అభయ ప్రదాన మిచ్చినాడు నీ కోర్కెను తీర్చుదునని.

ఆ బ్రాహ్మణుడు శునశ్శేపుడు. అతడు ఋచీకుని పుత్రుడు. కావున విశ్వా మిత్రుని మేనల్లుడు. ఆతడిప్పు డెందుకు శరణాగతుడయ్యెను?

అంబరీషుడను రాజు చేయు ఒకానొక యజ్ఞమునందు ఆ శునశ్శేపుడు పశువుగా నిర్ణయించుకొనబడి ఆ యజ్ఞమునందు తాను బలి కాకుండ రక్షింపుమని విశ్వామిత్రుని వేడికొనినాడు. ఆ రాజు యజ్ఞము చెడకూడదు. నేను బ్రతకవలె

ననినాడు. ఇది యొక విషమ సమస్య. ఇదియే దైవ సంఘటనము. ఇప్పుడు అంబరీషుని యజ్ఞము చెడకుండ యుండవలెనన్న శునశ్శేపుని స్థానమున వేరొక నరుని పశువును గావింపవలెను. అప్పుడే ఈ శునశ్శేపుని మృత్యు ముఖమునుండి తప్పించినవాడు కాగలడు. విశ్వామిత్రుడు అందుకై తన పుత్రులను పశువుగా వెళ్ళమనినాడు. మీ నూర్గురిలో ఒకని పొమ్మనినాడు. ఇదేటి న్యాయము ?

"యత్కృతే పితరః పుత్రాన్ జనయంతి శుభార్థినః
పరలోక హితార్థాయ తస్యకాలోయమాగతః

తండ్రి పుత్రులను కనుట పరలోకము కొరకు. కావున నాకు పరలోకమును కల్పించుటకై నే నిచ్చిన శరణాగతి సఫలము గావింపుడని పుత్రులను కోరినాడు. అందెవ్వరును ఒప్పుకొనలేదు.

విశ్వామిత్రుని కోరిక పరలోక దృష్టియందు మన్నింపదగినదే యయ్యును ఏ ప్రాణి తన ప్రాణములను రాబోవు పరలోకములకై లేక ధర్మ రక్షణకై వదలు కొనగలడు? అది యొక అసామాన్యమగు కార్యము. విశ్వామిత్రుని పుత్రులందుకు ఒప్పుకొనక పోవుట యటుండ పరిహసించినారు. నీవు చేయునది అకార్యమనినారు. ఎవని కొరకో మమ్ముల బలి యిత్తువా? కుక్క మాంసమును భుజించుట వంటిదని నారు. అంతతో విశ్వామిత్రునకు పుత్రవాత్సల్యము తొలగిపోయినది. విశ్వామిత్రుని దృష్టి యందున్నది పరలోక మొక్కటే. వశిష్ఠ పుత్రులకు పట్టించిన గతినే తన పుత్రులకు పట్టించినాడు. కుక్క మాంసమును తినుచుండు జాతియందు పుట్టి వేయి సంవత్సరములు భూమియందు జీవింపుడనినాడు శునశ్శేపుని గతి ఏమైనది ?

విశ్వామిత్రునకు ప్రాణ రక్షణ మంత్రములు స్ఫురించగా అవి శునశ్శేపునకు చెప్పి, నిన్ను యూప స్తంభము వద్దకు గొంపోవు నప్పుడీ మంత్రములు పఠించుచో ఇంద్రుడు తృప్తుడై అంబరీషుని యజ్ఞమును పూర్తిగావించి నిన్ను బ్రతికించు ననినాడు. విశ్వామిత్రుని తపము ఈ ఘట్టమున భగ్నమైనది. శునశ్శేపునకు ఇంద్రుని వలన దీర్ఘాయుర్దాయము ప్రాప్తించినది.

విశ్వామిత్రుని దీక్ష ఆ పుష్కర తీర్థముననే మరల ప్రారంభమైనది. అది మహా దీక్ష. వేయి సంవత్సరముల దీక్ష. ఆ దీక్ష నిర్విఘ్నముగనే గడచినది. వ్రతస్నాతుడయ్యెను. దేవతలకు అనుగ్రహము కలిగినది. విశ్వామిత్రా! నీవిప్పుడు

ఋషివైతివని చతుర్ముఖుడు వరమిచ్చినాడు. విశ్వామిత్రుని దీక్ష ఆగలేదు బ్రహ్మర్షియగు వరకును ఆతడు విరమించుట యనునదిలేదు.

తే॥ తనిసిరే వేల్పు లుదధి రత్నములచేత
వెరచిరే ఘోర కాకోల విషముచేత
విడిచిరే యత్న మమృతంబు వొడముదనుక
నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు

విశ్వామిత్రుని తపము సాగుచున్నది. ఆ పుష్కర తీర్థముననే. "బలవానింద్రియ గ్రామో విద్వాంసమపికర్షతి" ఇంద్రియములు నిజమునకు జడములే. అయ్యును అవి మాయా ప్రభావమున చేతనములై ప్రవర్తించుచు జీవుని బంధించును.

వాటికి గర్భ శత్రువు లనిపేరు. అవి శత్రువులవలె కన్పట్టని శత్రువులు. కావున వాటిని మిత్రరూప శత్రువులని శాస్త్రము వర్ణించినది. ఆ ఇంద్రియ వర్గమునకు సహాయకారి మనస్సు ఆ మనస్సు సంకల్ప వికల్ప రూపము. ఆ మనస్సు కంటికి కనబడదు. చేతి కెట్లందును? చేతికిని అందదు. ప్రాణవాయువును ఆధారముగా గొని బాహ్య ప్రపంచము నందెక్కడికైన పయనించును. నభో భాగమున చరించును. చంద్రగోళ సూర్యగోళముల పరికించును. నక్షత్ర మండలమున విహరించును. లేనిదానిని కూడ వున్నదానివలె చూచును. ఆ మనస్సు నిజమును గుర్తెరుగుట కది ప్రయత్నించదు. నిద్రలోని ప్రపంచమునంతను సృష్టించు చతుర్ముఖుడా మనస్సే. భౌతిక దేహము దానికి నిమిత్తమాత్రము. వాసనామయ దేహము దాని నిజ స్వరూపము. తపో నిష్ఠాగరిష్ఠు లందరును దాని ఆటను కట్టించుటకే తమ తమ జీవితముల నర్పించియు విఫలు లయ్యేదరు. మనస్సునకు మనస్సను పేరు నాశమగుటకే మోక్షమని పేరు. ప్రస్తుత మన కథాంశమున విశ్వామిత్రుని ప్రయత్నమదియే. ఆ మనస్సు తోడనే ఆతడు పోరాడుచుండెను. ఆయన కింత వరకు బ్రహ్మర్షిత్వము రాకుండ అడ్డు పడునదదియే. త్రిశంకుని ముందు బెట్టి వశిష్ఠ పుత్రులతోటి కయ్యమునకు దించినది. సృష్టికి ప్రతి సృష్టి చేయించినది. ఆతని దివ్య శక్తినంతను త్రిశంకునకు ధార పోయించినది. అంతతో రజోగుణము బలసియున్న ఆ మనసునకు విశ్వామిత్రునిపై కసి తీరలేదు. పుష్కర తీర్థమున కేతెంచిన విశ్వామిత్రుని నే నెక్కడికి పోతినని శునశ్శేపుని సృష్టించినది. శరణాగత రక్షణమను పేరుబెట్టి, కన్నబిడ్డలనే తన పొట్టన పెట్టుకొన్నది. దానిని వశము

గావించుకొన దలచిన వారి నెవ్వరినైన ఇట్లే చేయును. వాసనా బీజములతి సూక్ష్మములై అనాదిసిద్ధములై మూలా జ్ఞానము నందెక్కడనో దాగియుండి, జీవుని అంతఃకరణ క్షేత్రమున కాల పక్వములై మొలక లెత్తుచుండునని తత్వవిదుల నిర్ణయము. కాకున్న యోగనిరూఢులై సంప్రజ్ఞాత అసంప్రజ్ఞాత సమాధులలో వేల సంవత్సరములు గడిపి మరల వారేల ఈ ప్రపంచ వాసనల కరుదెంతురు? భగవంతుని మాయాశక్తి ఆ మనస్సునకు సహాయము. సహాయము కాదు. ఆ మనస్సును సృష్టించిన దదియే. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములను గుణ సముదాయమంతయు ఆ మాయా శక్తియొక్క ప్రతిభా ప్రభావముల విజృంభింప జేయు సేవకులు కాగా బ్రహ్మాది దేవతలను కూడ ప్రకృతి తన కైవశము గావించుకొని ఆట లాడించుచుండును. ఆ మాయా శక్తికి దగ్గర చుట్టము చుట్టము కాదు, అత్యంత ఆప్తమిత్రుడు కాముడు. ఆతని గర్వము వర్ణింపరానిది. ఇంతవర కాతడు విశ్వామిత్రునిపై కటాక్షముల వేసెను గాని విజృంభింపలేదు. ఈనాడతడు విశ్వామిత్రునిపై కన్నుల తెరచినాడు.

పుష్కర తీర్థమున విశ్వామిత్రుడు తపమును సాగించుచుండెను గదా। ఋషివి కావచ్చును. నన్ను జయింపక నీవెట్లు బ్రహ్మర్షి వయ్యెదవు? అని మన్మథుడు విశ్వామిత్రుని పైకి కాలు దువ్వినాడు.

ఒకనాటి ఘట్టము.

జితేంద్రియుడై మహోగ్ర తపము గావించు విశ్వామిత్రుని చూపులలో ఆ పుష్కర తీర్థమున జలకమాడు అచ్చరమిన్న మేనక మెరుపు తీగవలె తళుక్కున మెరసినది. ఆక్షణ మాత్రముననే మహర్షి అంతఃకరణము నందెక్కడనో దాగియున్న కామ వాసనా బీజము మొలకెత్తినది. అప్పటికప్పుడే చిగిర్చినది. విశ్వామిత్రుని నేమ తపస్విని అనుభావము నుండి మరలించినది. ఏనాటి నుండియో దాగియున్న ఆ కామవాసనా బీజము

కాముడా సమయమును గుర్తెరిగియే తన పూవుటమ్ములను పుంఖాను పుంఖములై పడునట్లు విశ్వామిత్రునిపై వదలినాడు. ఆ ముని పరాక్రమము కుంఠీభూతమైనది. ఆయన దగ్గరయున్న అస్త్రజాలమేదియు కామునిపై పని చేయలేక పోయినది కాముని అస్త్రజాలమన స్త్రీల క్రీగంటి ప్రసారములే.

"ముగ్ధే ధానుష్కతా కేయమపూర్వా త్వయి దృశ్యతే అని నాడొక కవి.

ఆడు వారి కనుబొమలోక యపూర్వమగు ధనస్సట. స్త్రీయొక్క అవయవ నిర్మాణము మాంస పేశలమేనని పాటల పాడవచ్చును. అది అనుభవమునకు రావలెను గదా? విశ్వామిత్రునకు అ కుసుమాస్త్రుని అస్త్రమునకు ప్రత్యస్త్రము స్ఫురించలేదు. అంతలోనే మన్మధుని వెంటనంటి యుండు సుగంధశీతల పవనములు ఆ మేనక పైటకొంగును తరలించగా వస్త్రమువలె బలసియున్న కఠిన కుచ మండలములు విశ్వామిత్రుని ముగ్ధుని గావించినవి. ఆ బాల నిమ్నోదరమును ఆ ఉదరమున పసిడిరేఖల వలెనున్న వళిత్రయమును విశ్వామిత్రుని చూపుల నటునిటు తిరగ నివ్వలేదు. ఆయన చిత్తము ఆ మేనక దివ్య సౌందర్య సరసున మునిగి లేవలేక పోయినది.

అప్పుడా కౌశికుడిట్లనుకొని యుండవచ్చును.

"ముని ధర్మంబుల కెల్ల దవ్వని జనంబుల్ నవ్వినన్ నవ్వనీ
ఘనమైనట్టి తపోధనంబు నెరయంగా బోయినం బోవనీ
మును ముట్టంగ ప్రబోధ వాసనల పెంపుల్మాసినన్ మాయనీ
వనితా రత్నము గూడ కెట్లును తమిన్ వారింప లేనియ్యెడన్

ఇక్కడనే యున్నది చమత్కారము. మాయా ప్రభావమిదియే. అవిద్యావరణమును వాక్యార్థ విచారమున చించకయే స్త్రీ పుంభావములు నిర్బీజములై బ్రహ్మ చైతన్య మొక్కటే ఈ దృశ్య ప్రపంచమున కన్పట్టునా? వాక్యార్థ విచారము ఈశ్వరానుగ్రహము లేక కలుగునా? ఈశ్వరానుగ్రహము, వైదికమగు నిష్కామ కర్మయోగము లేక జీవునిపై ప్రసరించునా? కావుననే పూజ్యపాదులగు శంకరులు కర్మయోగ భక్తి యోగములు సాధనలు కాగా ఆత్మ విచారము వాసనా బీజముల దగ్ధము కావింపగా జాగ్రద్దృశ్యము స్వప్న దృశ్యమగుననినారు. గౌడపాదులును,

"స్వప్నమ్నమాయే యథాదృష్టే గంధర్వనగరం యథా
తథా విశ్వమిదం దృష్టం వేదాంతేషు విచక్షణైః

వైతథ్య ప్రకరణము

వివేకులగు వారిచే ఈ మిథ్యా ప్రపంచము గంధర్వ నగరమై, చూడబడు ననినారు.

"అనాది మాయయాసుప్తో యదా జీవః ప్రబుధ్యతే
అజమనిద్రమ స్వప్నమద్వైతం బుధ్యతే తదా

మాండూక్య కారిక

అనాది మాయ యందుపడి నిద్రించు జీవుడు జ్ఞానప్రబోధమున మేల్కొన్న గాని తానద్వైతాత్మయై మాయను ధిక్కరింపలేడు. మన్మథుని జయింపలేడు. ఇప్పుడు విశ్వామిత్రుడెక్కడుండెను? నిద్రయందే యుండెను. నిద్ర యననేమి? అన్యథాగ్రహణ అగ్రహణములు. అన్యథాగ్రహణమన ఒకదానిని మరియొక దానినిగ చూచుట. అగ్రణమన యదార్థమును తెలుసుకొనకపోవుట. త్రాడును త్రాడుగా గ్రహించక సర్పమని ఊహించుట అన్యథాగ్రహణము.

త్రాడును త్రాడని తెలియక యుండుట అగ్రహణము. అన్యథాగ్రహణ అగ్రహణములే ఈ దుఃఖ ప్రపంచ ప్రదర్శకములు.

విశ్వామిత్రునకు విచారణాంశము రూఢము కాలేదు. పరోక్షజ్ఞానము శాస్త్రాధారమున కలుగును. ఆ పరోక్ష జ్ఞానము అభ్యాసదార్ఢ్యమున గాని కలుగదు. "ఆత్మైవేదం సర్వం" అను వాక్య ప్రకారము ఇదంతయు ఆత్మయే. నాకంటె అన్యములేదను చూపు కలుగుటకే బహు జన్మల కాల విళంబనము నిచ్చినారు శ్రీకృష్ణులు.

"బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాంప్రపద్యతే"

కథలోనికి వత్తము.

విశ్వామిత్రుడు మేనక దగ్గరకేగి మేనకతో పది సంవత్సరముల కాలము కామ సుఖము ననుభవించినాడు. శకుంతల పుట్టినది అప్పుడే. ఆ పది సంవత్సరముల కాలము చెల్లగా విశ్వామిత్రుని చూపు వెనుకకు తిరిగినది. సిగ్గు గొన్నది. ఇది దేవతలు తన్ను వంచించిన వంచనయని విశ్వామిత్రునకు తెలిసినది. ఆ పడమర దిక్కును వదలినాడు. మేనకను శపించలేదు. ఉత్తర దిక్కున కేగినాడు. ఇదియే సాధకునిలోని ప్రత్యేకత. బురదలోపడి లేచుటను ప్రజ్ఞయనక తప్పదు. అది కౌశికీనదీ తీరము. అంటే మన విశ్వామిత్రుని ఆశ్రమము. కాముని మాత్రము ఒక కంట కనిపెట్టి వ్రత దీక్షకు సంకల్పించినాడు. అ దీక్షాకాలము వేయి సంవత్సరములు. విఘ్నములేకయే ఆ వేయి సంవత్సరములును గడచినవి. బ్రహ్మర్షిత్వము మాత్రము సిద్ధించలేదు. దేవత లందరును మహర్షియని మాత్రము పొగడినారు. పితామహుడును మహర్షివైతివనియే స్వాగతము పలికినాడు. మహర్షే స్వాగతం వత్స" అని

విశ్వామిత్రుడు ఆ మాట తోడనే తాను జితేంద్రియుడ నైతిననుకొనినాడు. అనుకొనుట కాదు, అనినాడు బ్రహ్మగారితో.

బ్రహ్మ ఒప్పలేదు. విశ్వామిత్రుడు విసుగు చెందలేదు. మరల తపమును ప్రారంభించినాడు. ఇది వేయి సంవత్సరముల దీక్ష. ఆతడు నిరాలంబుడు. కాళ్ళను భూమిపై మోపడు. భూమ్యాకాశముల మధ్య వ్రేలాడి తపము గావింపవలెను. చలి కాలమున నీట నిలిచి, వర్ష కాలమున బయట నిలచి, ఎండ కాలమున నలు దిక్కుల అగ్నుల నునిచి ఆ వేడిని సహించుచు, ఆహారము లేక తపమును సాగించి నాడు. దేవతలకు వేడి ఎక్కినది. దేవేంద్రునకు భయము కలిగినది. ఆతని తపము నకు భంగము కలిగించిన గాని దేవతలు నిలుచునట్లు లేదు. దేవేంద్రుడు విశ్వా మిత్రుని తపమును విఘ్నము గావింప రంభను పంపినాడు. రంభ ప్రయత్నము ఆ ఋషిపై సాగలేదు. సరిగదా ఆ రంభ ముని క్రోధమునకు గురియై నీవు రాయి వయి పడుమని ఆతడు శపింపగా రాయియైనది. దేవేంద్రుని కార్యము నెరవేరినది. కామ క్రోధములు రెండును తపమును భంగము చేయునవియే గావున మునితపము వ్యర్థమైనది. బ్రహ్మర్షిత్వము రాలేదు. బ్రహ్మర్షిత్వము వచ్చుట యననేమి? బ్రహ్మర్షి కావలెనన్న భయము తొలగవలెను. బ్రాహ్మణత్వమను మృత్యువునకు మృత్యువు కావలెను. విశ్వామిత్రుడా ప్రయత్నమును మానలేదు. ఈతడవ ఆత డొక నియమమును గావించుకొనినాడు ఎవ్వరి పైనను కోపింపడు. ఎవ్వరితోను మాటాడడు. ప్రధానమగు నియమము మౌనము ఆహారమును వర్జింప దలచినాడు. శరీరమునకు గల గర్వమును అణచి వేయుటకు ఆహారమును వర్జించుట ఆతని హృదయము. శరీరమెట్లు నిలుచును? తపః ప్రభావము చేతనే. ఇదియు వేయి సంవత్సరముల దీక్ష. ఉత్తర దిశను వదలినాడు. తూర్పు దిక్కున కేగినాడు. తపము ప్రారంభమైనది. అయ్యును ఆతడు క్రోధమునకు స్థానము నివ్వలేదు. క్రోధము జయింపబడినది. కావున భోజనమున కుద్యమించినాడు.

ఒకనాటి ఘట్టము.

ఆది విశ్వామిత్రుడు భుజించు కాలము పక్వాన్నము సిద్ధమైనది. ఒక బ్రాహ్మ ణుడు వచ్చి ఆ అన్నమును కోరినాడు. ఆతడు నిజమునకు బ్రాహ్మణుడు కాడు. ఆతడు ఇంద్రుడు. విశ్వామిత్రుని మాటాడించుటకై వచ్చినాడు. విశ్వామిత్రుడు మౌనమును మరచిలేదు. మౌనమును వదలకయే ఆ బ్రాహ్మణున కన్న మిడినాడు. మరల తపస్సు ప్రారంభమైనది. విశ్వామిత్రుని ప్రాణవాయువు నిరోధింపబడినది. వేయి సంవత్సరములు గడచినవి. విశ్వామిత్రుని మూర్ధ స్థానము నుండి పొగ లెగయ నారంభించినవి. లోకములు దద్దరిల్లినవి. దేవతలు నిలువలేక బ్రహ్మ

దగ్గర కేగి విశ్వామిత్రుని బ్రహ్మర్షియని పిలువమనినారు. అక్కడికి దేవతల పరీక్షలు పూర్తియైనవి. దేవతలతో కలసి బ్రహ్మ విశ్వామిత్రుని వద్దకు వచ్చి బ్రహ్మర్షే స్వాగతం వత్స" అని పలికినాడు. మానవుడు సాధించరానిదే మున్నది? విశ్వామిత్రుడు దేవత లందరకును ప్రణామముల నందించి బ్రహ్మర్షిత్వము వచ్చిన వారికి ఏయే అధికారములు శాస్త్ర సిద్ధములై యున్నవో ఆ అధికారము లన్నియు తనకు వచ్చినగాని నేను తపముకొ విరమించననినాడు. నామమాత్రమగు అధికారము కాదనినాడు. ఒకవేళ దేవతలు ఈ అధికారము నిచ్చినను అది చాల దనినాడు. బ్రహ్మణ్యుడై యున్న వశిష్ఠ మునీంద్రులు ఒప్పుకొనవలెననినాడు.

దేవతా బృందము బ్రహ్మర్షి ముఖ్యుడగు వశిష్ఠుని దగ్గర కేగినది. ఆ మహర్షిని ప్రార్థించగా దేవతల ప్రార్థనను అంగీకరించి బ్రహ్మ పీఠమునకు అధ్యక్షుడై యున్న వశిష్ఠులు కదలినారు. దేవతలును చతుర్ముఖుడును వశిష్ఠునితో కలిసి విశ్వామిత్రుని వద్దకు వచ్చి చతుర్ముఖుడు బ్రహ్మర్షియగు వానికి గల అధికారముల నన్నిటిని విశ్వామిత్రున కివ్వగా వశిష్ఠ మునీంద్రులు "ఏవమస్తు'' అనినారు. ఆ అధికారము లెవ్వి? దీర్ఘాయుర్దాయము. ఓంకారమునుండి వెడలి వచ్చిన చతుర్వేదములును అనగా క్షత్రియులకు పఠనార్హములగు వేదములే కాక బ్రాహ్మణులకు మాత్రమే నిర్ణీతములగు వేదములును, యజ్ఞముల చేయు అధికారమే కాక యాజకత్వము చేయు అధికారమును వచ్చుట బ్రహ్మర్షిత్వము వచ్చుట. ఈ యధికారములను దేవతలును బ్రహ్మర్షియు ఒప్పగా విశ్వామిత్ర మహర్షి నాడు బ్రహ్మర్షియై తపమును చాలించినాడు.

రామచంద్రా! మీ గురువర్యుల ప్రభావమింతటిదియని శతానందులు రామునకు జనక చక్రవర్తి గారి యజ్ఞ వాటమున తెలిపి, రామచంద్రా!

"ఏష రామ మునిశ్రేష్ఠః ఏషవిగ్రహవాం స్తపః
ఏష ధర్మపరో నిత్యం వీర్యస్యైష పరాయణం"

ఇతడు మునిశ్రేష్ఠుడు. ఈతడే తపస్సునకు విగ్రహ రూపము. ఇతడు ధర్మమూర్తి అని చెప్పి శతానందుడు విశ్వామిత్రుని చరిత్రను విరమించినాడు. ఈ చరిత్ర ఎవ్వరిని రమింపచేయదు? జనకాదుల కందరికి శ్రోత్రపేయముకాగా వారందరును విశ్వామిత్రుని కీర్తించినారు. జనక చక్రవర్తి మీ చరిత్ర నన్ను పవిత్రుని

గావించినదని విశ్వామిత్రునకు విన్నవించుకొని, మహర్షే! రవి అస్తాద్రి కేగు చుండెను. గాన ఈనాటికి నన్ను గ్రహించి పంపుడని సవినయముగ కోరి రేపు ప్రాతః కాలమున తమ దర్శనము గావించుకొందునని దోసిలి యొగ్గినాడు విశ్వామిత్రుని యనుమతియైనది. సభ్యు లందరును సంధ్యాద్యనుష్ఠానములకు లేచినారు. నాటి సన్నివేశము మిథిలయందు ముగిసినది. తరువాత కార్యక్రమమునకు తెల్లవారవలెను. నేటికి మన ఉపన్యాసమును ముగిసినది. రేపు ధనుర్భంగమును సీతా కళ్యాణ కథయు నడచును. బాలకాండము ముగియును.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః
ధర్మ స్యజయోస్తు
అధర్మ నాశోస్తు
విశ్వస్య కళ్యాణమస్తు

# ఆరవ రోజు

"వైదేహస్య పురే వివాహ సమయే కళ్యాణ వేద్యంతరే
సామోదే విమలేందురత్నఖచితే పీఠే వసంతౌ సుఖే
శృణ్వంతౌ నిగమాంత తత్వవిదుషామాశీర్గిరస్సాదరం
పాయాస్తాం సువధూవరౌ రఘుపతి శ్రీ జానకీచానిశం

## కళ్యాణ లీలా వైభవము

(హర ధనుర్భంగము)

ఆర్య మహాశయులారా !

మన రామాయణ ప్రవచము నందిది ఆరవ రోజు. ఆ మహా కావ్య సారస్వతములోని భగవల్లీలా వైభవ వర్ణనము అయిదు పన్యాసములతో నడచినది. నేటి యుపన్యాసము ఆ యప్రాకృత దివ్యమంగళ విగ్రహుని కళ్యాణలీలా వైభవము. సాక్షాన్నారాయణుడగు శ్రీరామచంద్రు లిప్పు డెక్కడ యుండెను? అతడీనాడు విదేహ సామ్రాజ్యమున జనక చక్రవర్తి గారి యజ్ఞ వాటమున, బ్రహ్మర్షియై తన్ను వెంట నిడుకొని వచ్చిన విశ్వామిత్ర మునీంద్రునితో కూడి తన కళ్యాణ లీలా వైభవమును భక్తులకు ప్రదర్శింప సిద్ధమై యుండెను.

అవి జనక చక్రవర్తి గారి యజ్ఞవాటము నందున్న బ్రహ్మర్షులు వసించు కుటీరములు. అందొక శాలయందు రామ లక్ష్మణులతో కూడియున్న విశ్వామిత్ర మునీంద్రుని పర్ణశాల. అది ప్రాతఃకాలము. మునిపుంగవు లందరి సాంధ్యకృత్యము లన్నియు నెరవేరినవి. జనక చక్రవర్తి గారును తన నిత్య కృత్యముల తీర్చుకొని రామ లక్ష్మణులతో కూడియున్న విశ్వామిత్ర మహర్షి వారి నివాస స్థానమున కేతెంచినారు పాదార్ఘ్యములతో వారి నర్చించుటకై. రఘు వీరులతో కూడిన విశ్వామిత్రునకు జనక చక్రవర్తిగారి సపర్య లందినవి తరువాత ఆ విదేహుని కర్తవ్యమేమి ? తన కర్తవ్యమును గురించియే హే భగవన్! అని విశ్వామిత్ర మునివర్యుల సంబోధించి, తన పూజానంతర కర్తవ్యమును తెలుపుమని విశ్వామిత్రుని ఆజ్ఞను కోరినారు.

నీ దగ్గరయున్న ధనస్సును చూడ కుతూహలురై రామలక్ష్మణులు నీ నగరమున కేతెంచిరని గదా? నిన్న జనకునకు తెలిపినారు? ఆ విషయమునే "ధనుర్దర్శయ రామాయ" అని జనకునకు తెలిపినారు మునీంద్రుడు. జనకుడు ఆ ధనస్సును గురించి ఒక చరిత్రను చెప్పినారు. మునీంద్రా! నేనిప్పుడు రామ లక్ష్మణులకు చూపవలసిన ధనస్సున కొక చరిత్ర యున్నది. అది సామాన్యమగు ధనస్సు కాదు. అది ఒకప్పుడు ఈశ్వరుడు దక్షయజ్ఞ ధ్వంసమునకై నిర్మించు కొన్నది. కావున దానికి హరధనస్సని పేరు. ఆ ధనస్సు ఈనాడు విదేహ సామ్రా జ్యము నందెందు కున్నది? అందురా? అది ఈనాటిది కాదు. మా జనక వంశమునకు నిమి యనువాడు మూల పురుషుడు. ఆ నిమి నుండి ఆరవ వాడు దేవరాతుడను రాజు. దేవత లందరును ఈశ్వరుని బ్రతిమాలి ఆ ధనస్సును దేవరాతుని దగ్గర యుంచినారు. కావున ఆ ధనస్సు నాటి నుండియు మా మందిరముననే యున్నది. నేడు రామునకు చూపదగిన ధనస్సిదియే. దీని నెందరో వీర శిఖామణులు వెక్కు పెట్టుటకై ప్రయత్నించి విఫలులగుట జరిగినది. కారణమేమి? వారందరును ఈ ధనస్సు నేల వెక్కుపెట్టు ప్రయత్నమును చేసినారు? అందురా?

నేను యజ్ఞ భూమిని దున్నుచుండగా ఒక కన్యకామణి నాకు దొరికినది. ఆ కన్యక లాంగలము నుండి ఉద్భవించుటచే సీత యని పేరిడితిని. ఆమె సౌంద ర్యము దివ్యము. కావున ఆమెకు తగిన భర్తను నిర్ణయించుటకు ఈ శివ ధనస్సును. వెక్కు పెట్టినవారి కిత్తునని ప్రతిన చేసినాను. ఆ కారణముగ ఎందరో రాజులు వీర్యశుల్కయగు సీతను గ్రహించుటకై వచ్చి ఆ విల్లును వెక్కుబెట్ట అసమర్థులై నా పైకి యుద్ధమునకు రాగా, నేను ఆ రాజులతో ఒక సంవత్సరము పోరాడి అసమర్థుడనై, దేవతల నారాధించగా వారు నన్ను గ్రహించినారు. అంతతో ఆ రాజుల తరిమివేయుట జరిగినది. ఆ ధనస్సునే తమరు చూపమన్నచో రామ లక్ష్మణులకు చూపెదను. దానివెక్కుపెట్టుచో అయోనిజయగు సీతనిచ్చి వివాహము చేతుననినాడు.

"సుతా మయోనిజాం సీతాం దద్యాం దాశరథేరహం"

ఈ చరిత్రను విన్న మహర్షి ఆ ధనస్సును రామునకు చూపుమనగా జనక చక్రవర్తి సమర్థులగు వారిని ఆ ధనస్సును తెచ్చుట కాజ్ఞాపించినారు. అది నిత్య

మును గంధ పుష్ప ధూప దీపాదులచే బర్చించబడుచుండును. దానిని అయిదువేల్ మంది ఎనిమిది చక్రములు గల ఒక పెట్టె యందిడుకొని ప్రయత్న పూర్వకముగ తెచ్చి జనకునకు చూపినారు ఇదిగో ధనస్సని.

మహారాజు దోసిలి యొగ్గి ముని చంద్రుబవైపు తిరిగి, రామ లక్ష్మణుల కూడ దర్శించి ఆధనస్సును గురించిన ప్రతిభావిశేషమును మగల ప్రశంసించినాడు

మునిచంద్రా! ఈ ధనస్సును యక్ష రాక్షస దేవ గంధర్వుల సైతము ఆరోపింప యత్నించి విఫలులుగాగా ఇక మానవుల సంగతి చెప్పేది దేమున్నది? అని రామలక్ష్మణులకు తాము చూపమంటిరి గాన తెప్పించితినని మౌనమును దాల్చినాడు.

తరువాత జరుగవలసిన కార్యక్రమమేమి ?

విశ్వామిత్ర మహర్షి రామునివంక దిరిగి "వత్స! రామధనుఃపశ్య" అనినారు. వత్సా! ఈ ధనస్సును చూడుమనినారు. అనగా నేమి? నీవీ ధనస్సును వెక్కుపెట్టగలవు. దేవ దానవులు సమర్థులు కాలేదని చెప్పిన జనకుని మాటలు నీ కేల? నీవు ప్రయత్నింపుమని తన భావములు శిష్యునకు తెలిపినారు మహర్షి వర్యులు.

రాముడు దేవదానవకిన్నర కింపురుషాదులకంటె మిన్నయని వేరుగ చెప్పెడిదే మున్నది? రాముడు భగవంతుడని చెప్పక చెప్పుటయే వాల్మీకి రామాయణములోని సొగసు. బలాఢ్యులగు వారందరును వెక్కుపెట్టలేని అయిదువేలమంది మహాబలులు ఎత్తి తెచ్చుటకాక త్రోసుకొని వచ్చిన పేటికలోని ఆ ధనస్సును పదియారు వత్సరముల ప్రాయములేని బాలునకు చూపుమనుటయు, ఆ బాలుని నీవీ ధనస్సును గురించి వెక్కుపెట్ట ప్రయత్నింపుమనుటయు ఏమని చెప్పుచున్నది? విచారింపుడు. ఈ యువతామూర్తి నీ దగ్గరయున్న అయోనిజ సీతాసాధ్విని పరిగ్రహించుట కేతెంచెనని చెప్పక చెప్పుచుండ, రాము దవతార మూర్తియా? అనుటకు తావెక్కడ? వాల్మీకి రాముని ఉత్తమ పురుషుడనియే వర్ణించెననుకొనుట అజ్ఞత.

గురువర్యుని ఆజ్ఞను గైకొని శ్రీరామచంద్రుడు లేచి ఆ పేటిక దగ్గరకు వచ్చినారు. ధనస్సును కప్పియున్న ఆ పేటికయొక్క మూతను తెరచినారు. నేనీ ధనస్సును చేతితో తాకుదుననియు, దీనిని వెక్కుపెట్ట ప్రయత్నింతుననియు ముని

వర, రాజవరుల యనుజ్ఞను తీసికొనినాడు. వారనుజ్ఞ ఇవ్వగా ఆ ధనస్సును ఆ లీలావైభవోపేతుడగు రాముడు లీలగనే ఆ ధనస్సును గ్రహించి ఆరోపణకై యత్నించగా ఆ ధనస్సు ఒక్కమారుగ విరిగినది. ఆ ధ్వని భూనభోంతరాళముల వ్యాపించినది. అనేకమంది మహాజనుల మధ్యమునందీ హరధనుర్భంగము జరుగగా అందరి హృదయములను భయాక్రాంతములైనవి. కన్నులు మూతబడినవి. జనక చక్రవర్తియు విశ్వామిత్రుడును రామలక్ష్మణులు దక్క మిగిలిన అందరి కన్నులును మూతపడినవి. భూమి అదరినది. అది ఒక పిడుగని అందరును తలచినారు. నిజమునకది రాఘవేశ్వరుని వీరలక్ష్మి పాణిగ్రహణము గావించినసమయము. జనక చక్రవర్తి ఆశ్చర్యచకితుడై విశ్వామిత్రుని వంక తిరిగి నేనూహించిన కార్యము గాదిదియని రాఘవేశ్వరుని అచింత్య పరాక్రమమును కొనియాడి, తన ప్రతిజ్ఞ సత్యమైనదని హృష్టవదనుడై జనక వంశము నేడు సుసంపన్నమైనది. నా పుత్రిక ఈ క్షణమున సంపాదించి ఇచ్చిన కీర్తి మాకని రాముని అల్లుని గావించుటకు మురిసి, నా పుత్రిక నిత్తునని వాక్రుచ్చి, అయోధ్యకు దూతల నంపుదునని విశ్వామిత్రుని అనుజ్ఞను కోరి దూతల నంపినాడు.

ఇక్కడ మీకొక్క మాటను చెప్పెదను. అదిముఖ్యముగ చెప్పవలసినమాట. ఈ మాటను.

"దీయ మానాంనతు తదా ప్రతిజగ్రాహ రాఘవః
అవిజ్ఞాయ పితుశ్ఛందం అయోధ్యాధి పతేః ప్రభోః

మన మిప్పుడు చెప్పుకొనుచున్నది సీతారామ కళ్యాణము. ఇది రామాయణ కావ్య సారస్వతమున గాక భారతీయ వాఙ్మయమునందిది యొక మహోత్కృష్టమగు ఘట్టము. భారతీయుల దివ్య జీవన విధానమున కిది తలమానికము భారతీయ వాఙ్మయము చెప్పు మోక్ష పురుషార్థ సౌధాధిరోహణమునకు ప్రధాన సోపానము గార్హస్థ్యము. భారతీయ గార్హస్థ్యము యొక్క పరమ పవిత్రతను తెలియజేయునదే సీతా కళ్యాణఘట్టము. ఈ ఘట్టము నెందరో కవులు తమ తమ విచిత్ర చిత్ర వాగ్వైఖరి ననుసరించి వర్ణించిన వర్ణనా భాగము లెన్నియో యున్నవి. హరికథ లున్నవి కావ్యము లున్నవి. ఈనాడు సినీమా ప్రపంచ మున్నది. కాని వాల్మీకికి భిన్నమగు ఏ సారస్వతమైనను భారతీయ వైవాహిక లక్ష్యమును దృష్టి యందుంచుకొనకయే సీతాకళ్యాణ ఘట్టమును వర్ణించినవి. భక్తికి కొందరు స్థానము

నిచ్చి యుండవచ్చును. వర్ణనకు కొందరు స్థానము నిచ్చి యుండవచ్చును. కాని భారతీయులు గావించుకొను వివాహము ఆత్మ సంస్కారమను మాటను అవి మరచినవి. వాల్మీకి వాఙ్మయము భారతీయ వైదిక సనాతన సిద్ధాంతమును మరచి కావ్య నిర్మాణమును గావింపలేదు. రాముడు క్రొత్త సృష్టిని గావించి సంఘ సంస్కరణమను పేర ధర్మమును స్థాపింప అవతరించెనని వాల్మీకి తలచలేదు. సనాతన ధర్మమును తుడుచుటకై అతడు కావ్యమును వ్రాయలేదు. కావున వాల్మీకి ముని విరచిత రామాయణ కావ్యమునందలి సీతాకళ్యాణ ఘట్టము వేరు. మీరిప్పుడు దృశ్యములుగ చూచు కళ్యాణఘట్టము వేరు.

మీరు సామాన్యముగ తిలకించు సీతా కళ్యాణములలో రాముడు హరధను ర్భంగము గావించగనే సీత ఆ సభాస్థలియందే పూలమాలను తెచ్చి రాముని కంఠ సీమ నలంకరింపజేయుట గలదు. అది వాల్మీకి మహాశయుని ఆశయము కాదు అనగా రామావతారమున సీతాకళ్యాణ మట్లు జరుగలేదు. జరిగినదే మహర్షి వ్రాసినారు. మరి ఎట్లు జరిగినది. రాముడు సీతను ప్రేమించి పెండ్లియాడిదశరథున కెరుక పరచలేదు. రాముడు తండ్రి యాజ్ఞకే ప్రధాన స్థానము నిచ్చినాడు. సీతయే చెప్పినది అనసూయతో. కావున హరధనుర్భంగ మగుటతోడనే రాముని మెడలో పూలమాలను సీత వేయలేదు. హరధనుర్భంగము జరుగుట తడవుగా సీత నిత్తునని జనకుడు సీతను తెచ్చి రామునిచేత బెట్టలేదు. దశరథేశ్వరుని ఒప్పుదలకై విశ్వామిత్రుని ఒప్పుదలను కూడ ఆధారముగా గొని అయోధ్యకు కబురు పంపినాడు. ఇదియే ముఖ్యముగ చెప్పవలసిన మాట.

జనక చక్రవర్తి సందేశము అయోధ్యకు వెళ్ళినది ముఖ్యులగు వారి ముఖ ముగ. మూడు రోజులు వారు మధ్య మార్గమున పయనము గావించి, వేగముగ పోవుటకై చాల ప్రయత్నించి మూడు రాత్రులకే అయోధ్యకు చేరినారు. జనక చక్రవర్తి మాటలుగ వారు నేర్పరులై దశరథునకు రామ లక్ష్మణుల క్షేమ వార్త తెలిపి, దశరథుని కుశల వార్తల నడిగి రాముని లోకైక పరాక్రమమును వర్ణించి నారు హరధనుర్భంగ చరిత్ర ముఖముగ.

ఇక సీతను ఎట్లైన కోడలుగ పరిగ్రహింపుమని దశరథునకు జనక చక్ర వర్తి చెప్పిన మాటను విన్నవించవలెను. విన్నవించినారు. రాజేంద్రా! రాముని అల్లుడుగ పరిగ్రహింప మా రాజేంద్రుడు ప్రియంపడుచు మీ అనుజ్ఞకై ఎదురు చూచుచుండిరని.

"అస్మై దేయా మయా సీతా వీర్యశుల్కా మహాత్మనే
ప్రతిజ్ఞాం కర్తుమిచ్ఛామి తదనుజ్ఞాతు మర్హసి

ఇట్లా దూతలు దశరథుని అనుజ్ఞనుకోరి ఆహ్వానమునుకూడ అందించినారు.

"సోపాధ్యాయో మహారాజ పురోహిత పురస్సరః
శీఘ్రమాగచ్ఛ భద్రం తే ద్రష్టుమర్హసి రాఘవౌ

దశరథేశ్వరా! తాము మిథిలాపురమునకు శీఘ్రముగ విచ్చేయుడు. ఆలసింప వలదు. మీ పుత్రుల శీఘ్రముగ దర్శింపగలరు. మా మహారాజు శతానంద విశ్వామిత్రుల యనుమతితో మీకు విన్నపింపు మాటలివ్వి అని దూతలు మృదుమధుర సూక్తులతో జనక వాక్యములు తెలుపగా దశరథ చక్రవర్తియు వారి మాటలను మంత్రి పురోహితులకు తెలిపి మీరును అనుమతించి ఉత్సహించుచో ఆలస్యము చేయక రేపే ప్రయాణ మగుదమనిరి. అందరును తమ సంతోషములను తెలిపినారు ఆ రాత్రి గడచినది.

అది ప్రాతఃకాలము. సుమంత్రుని కోశాధ్యక్షునికి పుష్కలములగు ధనముల కూర్చుటకు ఆజ్ఞ యిమ్మనినారు. చతురంగ బలములను వాహన విశేషములను సమకూర్ప చేయుమని కూడ ఆజ్ఞాపించినారు దశరథేశ్వరులు. అట్లే జరిగినది.

వశిష్ఠ, వామదేవ, జాబాలి, కాశ్యపాది మహర్షుల రథములు ముందు సాగినవి. ఆ మహర్షుల ననుసరించినవి రాజస్యందనము. వారి వెనుక చతురంగ బలము. కళ్యాణాభిముఖమై అట్లు రఘువరుల పయనము సాగినది అది పెండ్లి వారి పయనము. మార్గ మధ్యమున నాలుగు రోజులు గడచినవి. అయిదవ రోజుకు మిథిలకు చేరినారు. ఋత్విక్పురోహిత మంత్రి సామంతాది మిత్ర బృందముతో దశరథేశ్వరులు.

దశరథేశ్వరుని రాక జనకునకు తెలిసినది. జనకుడు ఎదురేతెంచి దశరథునకు స్వాగతము పలికి తాను రఘు వంశీకులతో వియ్యమొందుటకు కృతార్థతను తెలిపి, వశిష్ఠాది ఋషివర్యుల పూజించి, వారికిని స్వాగతముల బలికి, రేపటి దినమున మనము కలుసుకొందముగాక యనినారు. దశరథుడును మందస్మిత వదనారవిందుడై, "ప్రతి గ్రహో దాతృవశః" ప్రతి గృహము దాత వశమని పెద్దల మాటముగా సమాధాన మిచ్చినారు. ఆ పలుకులు జనకునకు ప్రీతిని గొలుపగా గృహమున కేగినారు. ఆ రాత్రి యజ్ఞ క్రియల తోడను వివాహము కాదగిన పుత్రికలు చేయదగు క్రియా రూపములతో సుఖమయమై గడచినది. రాఘవేశ్వరులును

దశరథేశ్వరుల రాకకు హృష్టుడై ఆ రాత్రి సుఖ నిద్రను చెందినారు.

అది ప్రాతఃకాలము. జనకుని ప్రాతస్సవన యజ్ఞము సమాప్తమైనది. అత డిక నిర్వర్తించదగినది తన పుత్రికల కళ్యాణ మహోత్సవము.

జనక చక్రవర్తి గారి ఆత్మ సోదరుడు కుశధ్వజ మహారాజు. ఆతడు సాంకాశ్య పట్టణమునకు ప్రభువు. సాంకాశ్య పట్టణము ఇక్షుమతీనదీ జలములచే సంరక్షకము. ఆ నగరము స్వర్గసీమకు తులదూగు రాజధాని యనుట యుక్తముకాక పోదు. ప్రకృతమున జనక చక్రవర్తి తన సోదరుని కొరకై సందేశము పంపినాడు ఆయన రాకకై ఎదురుచూచు చుండగనే కుశధ్వజ మహారాజును వచ్చినాడు. జనకుని గృహము ఆత్మ బంధువులతో మహర్షి గణముతోడను అలరారగా సామ్రాజ్య లక్ష్మి కొక వినూత్న సౌందర్య ముజ్జ్వలమై కన్పట్టగా నాడొక సభాస్థలి ఏర్పాటైనది. దశరథేశ్వరునకు మంత్రి పురోహితులతో ఆ సభ నలంకరించుటకు ఆహ్వానమందినది. వశిష్ఠాది ముని గణముతో తన నలుగురు పుత్రులతో వృద్ధ భూపతి యగు దశరథేశ్వరులును ఆ సభ నలంకరించినారు. ఒకరి నొకరు కుశల ప్రశ్నల గా వించుకొనుటతో సుస్వాగతముల నందుకొనుటతో కొంత కాలము గడచినది. ఇక రాజనందనుల వివాహ సంబంధముగ సంభాషణలు నడపవలెను. ఆ సమయమున జరుగనున్న కార్యక్రమమును నడుపదగు వారు విశ్వామిత్రుని యనుమతితో భగవాన్ వశిష్ఠ మునీంద్రులని తన పురోహితునిపై కార్యభారము నుంచి మౌనమును వహించినారు దశరథ చక్రవర్తిగారు.

భారతీయ వైవాహిక ఘట్టమునకు ప్రారంభ మెక్కడ? ఒకరి వంశము మరి యొకరికి తెలుపుకొనుటతో ప్రారంభము కావలెను. సూర్యవంశము రఘువులది కాగా చంద్ర వంశము విదేహులది. కాని ఆ రెండు వంశములకును మూల పురుషు డెవ్వడు? అనునది ప్రశ్న. మొట్టమొదట వశిష్ఠ మునీంద్రులు పెండ్లికొమరుని వంశ క్రమమును శతానంద జనక చక్రవర్తులకు తెలుపగా తరువాత దాత యగు జనకుడును తన పురోహితుడగు శతానందుని యనుమతితో చంద్రవంశ ప్రారంభమును తెలిపినారు జనకులు వశిష్ఠ మునీంద్రునకు ఇక్కడ జనక చక్రవర్తి ఒక్క మాట అని వంశమును చెప్పినారు.

"ప్రదానే హి మునిశ్రేష్ఠకులం నిరవశేషతః
కర్తవ్యం కులజాతేన తన్నిబోధ మహామునే

దాత యగువాడు తన వంశ విస్తారమును సంపూర్ణముగ తెలుపుట కర్తవ్య మనినారు. ఇప్పుడేమి తేలినది? వివాహ సంస్కారము వంశముల అనుపూర్వి కపై ఆధారపడి యున్నది గాని మోహముపై ఆధారపడలేదని తేలినది. నేడు భారత దేశము తన స్వీయ సంపదను కోల్పోయినదీ ఘట్టముననే. రాబోవు దౌర్భాగ్య మును అనుభవించునది గూడ ఈ ఘట్టమును నిమిత్తముగా గోవియే కులాంతర వివాహములతో దేశము సంఘైకమత్యము కలుగునను వారి వాదము నిరాధారము. కుల తత్వము నశించవలెనను నినాదముతో కులతత్వము కరుడుగట్టి ప్రచ్ఛన్న యుద్ధములతో దేశము ముందుకునడచుట బుద్ధిమంతులగు అనుభవజ్ఞులకు తెలియని విషయము కాదు. ముందు కథకు పోదము.

సూర్య వంశమునకు మొదలిక్కడ.

ఆది నారాయణుని నుండి చతుర్ముఖుడు. ఆతనినుండి మరీచి. ఆ మరీచికి కాశ్యపుడు. ఆ కాశ్యపునకు వివస్వంతుడు, వివస్వంతునకు మనువు. ఆ మనువు నకు ఇక్ష్వాకువు. ఈ ఇక్ష్వాకులే అయోధ్యకు మొదటి పరిపాలకుడు. అక్కడ నుండి ఎందరో మహారాజులీ అయోధ్యా రాజ్యమును పరిపాలించుచునే వచ్చు చుండిరి. ప్రస్తుతమున వారి పేర్ల నన్నిటిని వాల్మీకి చెప్పినారు. అయ్యును నేను మీకు రామ లక్ష్మణుల తాత ముత్తాతల వంకు పేర్ల నిచ్చుచున్నాను. దశరథ మహా రాజు తండ్రి అజ మహారాజు. అజమహారాజు తండ్రి నాభాగుడు. వశిష్ఠ మునీం ద్రులు పై వారి చరిత్రలతో కూడ వారి వారి పరాక్రమాది విశేషముల వర్ణించి రామ లక్ష్మణుల విశుద్ధత్వమును ప్రకటించినారు. ఇక్కడ వాల్మీకి రామాయణము భారత జాతి యొక్క ప్రత్యేకతను చక్కగా చాటినది. ఈ శ్లోకములను వినుడు.

''ఆదివంశవిశుద్ధానాం రాజ్ఞాం పరమధర్మిణాం
ఇక్ష్వాకులజాతానాం వీరాణాం సత్యవాదినాం
"రామలక్ష్మణయోరర్థే త్వత్సుతే వరయేన్నృప
సదృశాభ్యాం నరశ్రేష్ఠ సదృశే దాతుమర్హసి

ఈ శ్లోకములలోని విశేష మేమియో తెలియునా? వివాహమునకు వంశ పారిశుధ్యము మొదటిది. రెండవది వరుని గుణగణము. తరువాతది వియ్యమునకు

సమాన ధర్మము. ఇవి లేని వివాహములకు విడాకు లిచ్చుకొను న్యాయస్థానము లవసరములు.

భారతీయత మానవుడు ఈదదగు సంసారార్ణవమునకు నావ వంటిది భార్యా మణి యన్నది. సముద్రమును తరించు నావకు ఎట్టి లక్షణము లుండవలెనో చెప్పి నది. దర్మార్థ కామములు అట్టి లక్షణవతియగు స్త్రీ వలననే సంప్రాప్తములగు నన్నది. అన్ని వర్ణములకును ఈ నియమమును విధించినది. వధూవరుల హృద యములు పరస్పర భిన్న సంస్కారములు కలవి కాకుండుటలోని దాంపత్య సుఖ మును తెలిపినది. జాతి రత్నమున కొక ప్రత్యేకత యున్నదన్నది. వివాహ విషయమున జాతి సాంకర్యమగుచో స్త్రీ పురుషుల విభిన్న సంస్కారములతో వారి హృదయములు కలవక పోవుటయేగాక రాబోవు సంతానము కూడ జాతి రత్న ములు గాక కృత్రిమ రత్నముల వలెయుండి దేశ సౌభాగ్యమును కొల్లగొట్టుదురని రామాయణ మహా కావ్యము భంగ్యంతరముగ స్పష్టపరచినది సీతా కళ్యాణ ఘట్టమున. ముందు కథకు పోదము.

జనకవంశ మిట్లు చెప్పబడినది.

జనక వంశమునకు కూటస్థ పురుషుడు నిమి. ఆతని పుత్రుడు మిధి.

ఆ మిధియను రాజు పేరు తోడనే మిథిలా నగరము నిర్మింపబడినది. ఆ మిధి నుండియే జనకుడను పేరు ఈ వంశమున కేర్పడినది. నాటి నుండియు జనక వంశమైనది. ఆ జనకుని పుత్రుడు ఉదావసువు. ఆతని పుత్రుడు నందివర్ధనుడు. అట్లు రాగా నా తండ్రి పేరు హ్రస్వరోముడు. మా తాతగారు స్వర్ణరోముడు. మాతండ్రికి మేమిద్దరము పుత్రులము. నా తమ్ముని పేరు కుశధ్వజుడు. మునీంద్రా! మా తండ్రి నా పైన రాజ్య భారమునుంచి తమ్ముని నాకు వప్పచెప్పి నా తండ్రి వనమున కేగినారు. మేమిద్దరము అన్యోన్య స్నేహమున జీవితము నొక్క విధము గనే నడుపుకొనుచుంటిమి.

ఆ కాలమున సాంకాశ్య పట్టణము నేలువాడు సుధన్వుడను రాజు. ఆతడు ఈ సీతను నాకిమ్మని యుద్ధమునకు రాగా మేమాతని జయించి ఆ సాంకాశ్య పట్టణ మున కీకుశధ్వజుని పట్టాభిషిక్తుని కావించినాను. ఇది మా వంశచరిత్ర మునీంద్రా! అని వంశ చరిత్రను ముగించి వీర్యశుల్కయగు సీతను రామునకు ఊర్మిళయను నా కన్యకను లక్ష్మణునకు ఇచ్చి వివాహము చేతునని చెప్పి, రామ లక్ష్మణులకు

గోదాన వ్రతమును పితృ కార్యమును జరుపుడని కూడ చెప్పినాడు. ఆ తరువాతది వివాహ కార్యము గదా! ఆ వివాహ దినమును కూడ నిశ్చయించినారు.

"రామ లక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వహ
పితృ కార్యంచ భద్రంతే తతో వైవాహికంకురు

ఈ సందర్భముగ కూడ కొన్ని వివాహ విశేషములను చెప్పవలసియున్నది చెప్పెదను. వాల్మీకి మహర్షి ఎంత వైదిక సంప్రదాయమును ఈ మహా కావ్యమున వ్యాఖ్యానించెనో మీకు తెలియును.

వివాహమునకు ముందు గోదాన వ్రతమను నది ఒక సంస్కారము. పితృ కార్యమన వృద్ధులగు పితృ దేవతలను శుభ కార్యములం దర్చింతురు. (దీనికినాందీ శ్రాద్ధమని కూడ పేరు) వీటిని చేసి వైవాహిక స్నాతకమును గావింతురు. (ఈకర్మకాండను చక్కగ జరిపినారు) ఈకర్మ కాండయందు గో,భూ,తిల, హిరణ్య దానముల చేయుదురు. తరువాతది వివాహము. ఈ విషయముల జనక చక్రవర్తి గారు చెప్పిన తరువాత విశ్వామిత్రులు మాట్లాడినారు. వారు జనక చక్రవర్తిని, దశరధుని, వశిష్ఠుని ఈ ముగ్గుర నుద్దేశించి మాట్లాడినారు ఏమని?

"అచింత్యాన్యప్రమేయానికులాని నరపుంగవ
ఇక్ష్వాకూణాం విదేహానాం నైషాంతుల్యోస్తికశ్చన
రామ లక్ష్మణయో రాజన్ సీతాచోర్మిళయానహ

ఈ వంశములకు సరితూగు వంశములిక లేవు. సీతారాములకును, ఊర్మిళా లక్ష్మణులకును సరియగు దాంపత్యము. అందు సందియము లేదు. ధర్మ సంబంధము గొప్పది. రూప సంపదయు అట్టిదే కాని నేనొక్క మాటను చెప్పెదను. కుశధ్వజుని పుత్రిక లిద్దరును భరత శత్రుఘ్నులకు తగినవారు గాన వారి వివాహములున్ను ఉత్తరా నక్షత్రమున చేయుటను ప్రశంసించినారు. చాల బాగున్నది. జనక చక్రవర్తి గారు వెంటనే లేచి దోసిలియొగ్గి భరత శత్రుఘ్నుల విషయమును కూడ స్థిరపరచినారు ఇంతతో చేయదగు కార్యములు నిర్ణయమైనవి. అంతతో దశరధుడు తన స్వకీయశాలకు వెళ్ళినారు పుత్రులతో. గోదాన వ్రతము నలుగురు పుత్రులకును జరిపించినారు. ఇందొక్క విశేషము. ఏ రోజున దశరధేశ్వరుడు గోదాన వ్రతములను పుత్రులకు కావించెనో ఆ రోజుననే కైకేయి సోదరుడు

యుధాజిత్తు ఏతెంచినాడు కేకయ రాజ్యమునుంచి. అతనిని చూచి దశరథుడు చాల సంతోషించినాడు.

వేదోక్తములగు గోదానాది వ్రతములు పూర్తియైనవి. ఇక జరుగవలసినది కళ్యాణోత్సవమే. దానికై వశిష్ఠ మునీంద్రులు జనక చక్రవర్తి దగ్గరకేగి జనక చక్రవర్తీ! దశరథేశ్వరుడు తన పుత్రుల కందరకును వ్రతాదికముల నిర్వర్తించి నీ దాతృత్వము కొరకై ఎదురు చూచుచుండెనని చెప్పినారు. ఇక జరుగదగినది సీతా కళ్యాణ మహోత్సవము.

## సీతా కళ్యాణము

మహారాజ వైభవముతో కళ్యాణ మంటపము నిర్మితమైనది. అది రత్న మందిరము. వశిష్ఠ మునీంద్రులు ఆ మంటపమున అగ్నిని ప్రతిష్ఠించినారు. హోమ ద్రవ్యములందు చేకూర్చబడినవి. లాజలు, నేయి,దర్భలు, స్రుక్కు,స్రువము, అక్షతలు, మొలకెత్తిన పాలకులను, గంధ పుష్పాది సుగంధ ద్రవ్యములను చేకూర్చబడినవి. ఇవన్నియు వైదిక విధానమున పెండ్లి యగుటకు సంబంధించిన ద్రవ్యములు. ఆ అగ్నియందు వశిష్ఠులు కొన్ని హోమములు గావించినారు. ఆ తరువాత అగ్నికి అభిముఖముగ రాముని కూర్చుండబెట్టి దివ్యాభరణ భూషితయగు సీతాకాంతనుకూడ ఆయగ్నిసన్నిధానమునందే రామునకభిముఖముగ కూర్చుండబెట్టి శ్రీరామచంద్రుని నాపుత్రికను పాణిగ్రహణము గావింపుమని జనక చక్రవర్తిగారు సీతను రామునకు వప్పచెప్పినారు మంత్రోపదేశములతో. నిజమునకా సమయము దేవతలకాక మహోత్సవ సమయము. రాముడు సీతను పాణిగ్రహణమును చేయు సమయమున, దేవతలు పుష్ప వర్షములు కురిపించినారు. దేవదుందుభులు మ్రోగినవి. ఋషి పుంగవు లందరును జయధ్వానముల గావించినారు. ఆశీర్వాదపురస్సర మంత్ర పాఠములతో.

ఇక్కడ రామునికి మంత్రోదక పురస్కృతముగ సీతను ఇచ్చునప్పుడు వాల్మీకి మహర్షి వారొక శ్లోకమును పఠించినారు. జనక చక్రవర్తిగారు రామునకు చెప్పిన మాటలుగా.

ఈ శ్లోకమీమహా కావ్యము నందొక యనర్ఘ రత్నము. ఈ శ్లోకము భారతీయ మహోత్కృష్ట పరమ ధర్మ స్వరూపము. ఇదిగో శ్లోకము.

''ఇయం సీతా మమసుతా సహధర్మచరీ తవ
ప్రతీచ్ఛచైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా
పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా

భారతీయ వాఙ్మయము నందెంతయో పదజాలమున్నను ఆ పదజాలమున కంతకును ప్రాముఖ్యత నొసంగు పద మొకటున్నది. అది"పవిత్రత"అను పదము. కాని ఆ పదముచే చెప్పబడునది ఒక ప్రత్యేక పదార్థము కాదు ఆ పదము చెప్పు అర్థము కంటి కగపడునది కాదు. ఆ పవిత్రతను నిరూపించునది కూడ భౌతిక విజ్ఞానము కాదు. పవిత్రత యను పదమునకు సరితూగు పదములు శుభ్రత, స్వచ్ఛత అను పదములు కావు. కొన్ని పదార్థములు జన్మ సిద్ధములుగ పవిత్రత గలిగియుండ మరికొన్ని వస్తువులుశాస్త్రీయ సంస్కారములచే పవిత్రత నొందును. ఆ పవిత్రతను ప్రధానముగా గొన్నదియే భారతీయత. భారతీయత ఇట్లు చెప్పును.

ఓ! మానవుడా! నీవు పవిత్రుడవు కావలెనన్న పవిత్రమగు అన్నమును భుజింపుము. పవిత్రమగు ధనమును సంపాదింపుము. పవిత్రమగు కామము ననుభవింపుము. నీమనస్సును పవిత్రముగా నుంచుకొనుము ఆ పవిత్రమగు మనస్సునే భగవంతునకు సమర్పింపుము అనును.

ప్రస్తుతమున మన మిప్పుడు చెప్పుకొనునదేమి? సీతారాముల కళ్యాణము భారతీయుల కిది యొక మహా పవిత్రమగు కథాఘట్టము కారణమేమి? ఈ కథా వస్తువు రెండు పవిత్ర వస్తువుల సంయోగమును చెప్పి, మీరును ఈ సీతారాముల వంటి పవిత్ర వ్యక్తులు కండు అని బోధించుచున్నదీ కథా ఘట్టము. పారమార్థికముగ విచారించుచో ఈ కళ్యాణ కథా వస్తువునందు సహజముగనే తాను పవిత్రమై తన్నాశ్రయించు వారిని పవిత్రము గావించు వస్తు వొకటి యున్నది. తాను జన్మచే అపవిత్రమయ్యును ఆశ్రయముచే పవిత్రము కాదగిన వస్తు వొకటున్నది. సహజ పవిత్రమగు వస్తువు భగవంతుడు. ఆశ్రయముచే పవిత్రము కాదగిన వస్తువు జీవుడు. భగవంతుని జీవుడు ఆశ్రయించుట కళ్యాణము. లేక భగవంతుడను పేర వెలుగొందు ధర్మమును జీవు డాశ్రయించుట కళ్యాణము. పెండ్లి అను పదము కంటె కళ్యాణమను పదమున కొక ప్రత్యేకత యున్నది. కళ్యాణమన మంగళము. మంగళమన దుఃఖ నివృత్తి పూర్వక సుఖప్రాప్తి. భారతీయత చెప్పు వివాహము దుఃఖనివృత్తిపూర్వక సుఖప్రాప్తి సాధనము.

జీవుడు భగవంతుని అంశ. లేక భగవంతుని ప్రతిబింబము. బింబ ప్రతిబింబ న్యాయమనునే భారతీయ దాంపత్యమును భారతీయ శాస్త్రములు వర్ణించినవి.

మన కథా ఘట్టమున రాముడు భగవంతుడు. సీత జీవుడు లేక రాముడు ధర్మము. సీత ధర్మము నాశ్రయించు జీవుడు. ఇది యొక విధము. మరియొక విధమేమియన రాముడు కేవలము పరబ్రహ్మము. సీత మోక్షలక్ష్మి సీతారాముల కళ్యాణము పరమ పురుషార్థ వర్ణనము. కావున సనాతన వైవాహికపద్ధతి ననుసరించు చో అది కర్మయోగ, భక్తియోగ, జ్ఞానయోగముల సంపుటి యనుటకు సందియములేదు. గార్హస్థ్యమునందలి అతిథి పూజాదికము కర్మయోగము కాగా, భార్యాభర్తల సేవ్యసేవక భావము దాంపత్యములోని భక్తి యోగమును చెప్పును. వారు ఆ రెండు యోగముల సేవించుటతో కలిగిన పవిత్రాంతఃకరణమున విషయ సుఖ దోషముల గుర్తెరిగి ద్వైతభావమును వదలి ఆత్మాన్వేషణమునకు పరస్పర సహకారులుకాగా జ్ఞాన యోగము భాసించును. రెండైకన్పట్టు ఆ మిధునము ఒకే ఒక ఆత్మ చైతన్యములోని భాగములని గుర్తెరిగి ఉపాధి విశేషముల తొలగించుకొనగా ఆశ్రయాశ్రయీ భావము శక్తి శక్తివంతులవంటిదై ఎడబాటును తొలగించును.

ఇప్పుడు సీతను రామునిచేత బెట్టి, ఇరువురచే పాణిగ్రహణమును చేయించు జనకుని నిర్ణయమును వినుడు.

ప్రప్రథమముగా "ఇయం సీతా" అనినారు. రామా! నీవు పరిగ్రహించబోవు లేక నిన్ను పరిగ్రహింపుమని నేచు చెప్పు సీత "ఇయం" ఈమె అని రాముని ముందున్న సీతను చూపినారు. సీత అను పదముచేతనే తని పుత్రిక యొక్క ప్రత్యేకతను పవిత్రతను నిర్దేశించినారు. సీత అను పదముచేత ఈమె మాతృగర్భ సంజనిత కాదు అయోనిజ. ఈ సీత సామాన్య స్త్రీలవలెగాక అసామాన్య ప్రభావ సంపత్సమన్వితయని సార్థకమగు నామమునే చెప్పి ఆ పదమును సార్థకముగావించినారు. మరి ఈమె జనన మెక్కడ? ఈ కన్యక మాతృమూర్తి ఎవరు? ఈమెకు జన్మస్థానము యజ్ఞభూమి. ఆ యజ్ఞ భూమిని దున్నుచుండగా నాగలి చాలునకు తగిలినది గాన సీతయైనది ఈమె భూ పుత్రిక. అన్ని గుణములకును భూమి ఎట్లు ఆధారమో సకల సంపదలను తనను ఆశ్రయించిన వారికెల్లు భూమి యెవంగునో అట్లే ఈమెయు రత్నగర్భయై, పుత్ర రత్నములను ప్రసాదించు కన్యకామణి యని ధ్వనించినారు. అంతియేకాదు. ఈ కన్యక ఓరిమియను గుణము నెరువు తెచ్చుకొనక తల్లి ఆస్తికే హక్కుదారాలై పుట్టినదని భార్యకుండదగు ఓరిమిని

స్పష్టపరచినారు. ఇది ఒక అర్థము. మరియుక విధముగ చూతము. "సీతా ఇయం" అనగా నీవు వీర్య శుల్కమున సంపాదించుకొన్న "సీత ఇయం" ఈమె అని నారు. ఆ రత్న మంటపమునందున్న స్ఫటిక శిలాతలముల ప్రతిబింబించు సీతా ప్రతిబింబములపై నీ చూపునుంతువేమో బింబస్థానీయమగు వీర్యశుల్క ఇదిగో నీ ముందే యున్నది. అని ఒక ధ్వని. అంతేకాదు. "మమసుతా సీతా ఇయం" అవి ప్రతిబింబములే. నా పుత్రికయగు సీత ఇదిగో ఇయం. లేక ఇయం సీతా మమసుతా. ఈ సీత నా పుత్రిక. ఆ సీతలు జడ ప్రతిబింబములు. ఈ సీత వంక చూడుము అని కూడ ఒక భావము.

లేక రామా! "ఇయం సీతా మమ సుతా" అనుట యందొక ఆశ్చర్యమును ఆనందానుభవమును కూడ ద్యోతక మగుచున్నదనుట కేవల కల్పిత భావముకాదు. రాఘవత్వే భవేత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని. అను భగవదవతార ప్రాభవమును ప్రకటించు సూక్తి ననుసరించి సచ్చిదానంద బ్రహ్మవు నీవు అవతారమూర్తివై రాముడవు కాగా రఘు వంశము నందావిర్భవించగా నీ యందంతర్భూతమైయున్న ఈ చిచ్ఛక్తి నా పుత్రికయైనది. నేనెంతటి మహాభాగ్యవంతుడను? అను జనకుని ఆత్మానందానుభవము నీ పదము సూచించినది. లేక ఇయం సీతా మమసుతా కిం? అను పదము ప్రశ్నార్థకమగుచో దానికి సమాధానము కాదు. కాదు, నా సుతయను పదము నామమాత్రము. తవ సహ ధర్మ చరీ సీతా మమ సుతా. నీకు సహ ధర్మ చారిణి యగుటకు వచ్చిన ఈ సీత నామమాత్రముగ నా పుత్రికయైనది. కాక, ఇంతవరకీ సీత నాకు సుతయై నా యింట నున్నది. ఇక్కడనుండి నీకుసహధర్మ చారిణియై ప్రవర్తించగలదు రామా! కారణ మేమనగా మేము కర్మయోగులము. కేవల భోగములకై కామ్యకర్మల నాచరింపలేదు. కావున మా వంశము నుండి వచ్చు మా కన్యకయు నీ వాచరింపబోవు పితృ వాక్య పరిపాలన యందు సహధర్మ చారిణియై యుండగలదని భావికాల చరితము కూడ ఇందు సూచితమైనదన వచ్చును. లేక నీ ధర్మ సంస్థాపనయను క్రియకు ఈమె తోడ్పడక నీకు ధర్మ స్థాపనము నెరవేరదు గావున "తవ సహ ధర్మ చరీ సీతా ఇయం" అని పాణిం గృహ్ణీష్వ పాణినా" అనినారు. కాక ఈ యవతారము కేవలమగు వైదిక కర్మ కాండను ప్రచారము చేయుట ప్రధానముగా గ్రహించితివి కావున గాంధర్వ వివాహమున గాక నేను దాతనైతినని ఏనాం "ప్రతీచ్ఛ" అను పదమును వాడినారు. ఇట్లెన్నియైన భావముల గ్రహింపవచ్చును. ముందుకు పోదము.

ఆ తరువాత జనక చక్రవర్తిగారు ''తే భద్రం స్యాత్'' అనినారు. ఈమెను పరిగ్రహించుటతో నీకు మంగళము కలుగు ననినారు. నీకు రామున్న రావణ సంహారాదికమగు యశము ఈమె వలననే కలుగునని భావము. సీత రావణుని శపింపక యున్నది గావున రావణ సంహారమను యశము రామునకు దక్కినది. ఆమె నిమిత్తముగ రావణ సంహారమైనది. దుష్ట శిక్షణ అంతయు ఆమెను నిమిత్తముగా గొనియే జరిగినది. ఇది ఒక భావము. లేక దంపతులకు మంగళా శాసనము కూడ కావచ్చును. పాణిగ్రహణ మెందుకు? వంశ ప్రతిష్ఠకై స్త్రీని గ్రహించుట గావున. సంతానవంతుడగుటకు వివాహమున ''గృహ్ణామితే''అను మంత్రమున్నది. ఆ మంత్రము నాధారము గొనియే వివాహమునకు పాణిగ్రహణమను పేరు వచ్చినది. తరువాత పదము పతివ్రతా అను పదము. అట్లే మహాభాగా అను పదమును ఉన్నవి. మరియొక పదము కూడ యున్నది. ఛాయేవాను గతా సదా'' ఈ మూడు పదములును సీతకు విశేషములే.

పతివ్రతా, మహాభాగా, ఛాయేవ సదా అనుగతా మమసుతా సీతా ఇయం అని అన్వయము. మీకు నేను సీతా, సహధర్మచరీ, మమసుతా అను పదముల యందలి భావములను నిర్వచించినాను. పతివ్రతాది పదములకు చెప్పెదను.

పతిని అనుసరించుటయే వ్రతముగా గలది పతివ్రత.

"ఆర్తా ర్తే ముదితే హృష్టా ప్రోషితే మలినాకృశా
మృతే మ్రియేత యానారీసాస్త్రీ జ్ఞేయా పతివ్రతా

భర్తతో పాటుగ సుఖ దుఃఖముల ననుభవించుచు భర్త సన్నిధానమున లేనియప్పుడు ఆ విరహమున కృశించుచు బ్రహ్మ చర్యాది నియమముల పాలించుచు విశేషములగు అలంకారముల వర్జించి సుమంగళీత్వమునకు అర్హములగు అలంకారములను మాత్రమే అలంకరించుకొనుచు, భర్తృ శరీరము గళితముగా తాను తన సంకల్పమాత్రము చేతనే శరీర త్యాగము చేయదగు స్త్రీకి పతివ్రత యనిపేరు. అట్టి పాతివ్రత్యమును సూచించుచు పతివ్రతా పదమును వాడి, ''మహాభాగా'' అను పదముచే పతివ్రతల యందగ్రగణ్యయని చెప్పి, ఛాయా సాదృశ్యమును నెప్పినాడు.

ఇది యొక గొప్ప సాదృశ్యము. ఛాయయున నీడ. చెట్టును వదలి, చెట్టు

నీడ ఎట్లుండును? చెట్టు లేకున్న నీడయే లేదు. ఇక్కడ వృక్ష స్థానమునందున్న వాడు రాముడు. ఛాయా స్థానమునందున్నది సీత. నీడకొరకై చెట్టుక్రిందకు వచ్చును పాంథుడు. గృహస్థునకు ఇల్లాలు నీడ వంటిది. యజమాని కొరకై వచ్చు అతిథులకు చల్లదనము నిచ్చునది స్త్రీయే. స్త్రీ లేని ఇంటి కెవ్వరు వత్తురు? అంతేకాదు. జీవులు శిశువుల వంటి వారు. శిశువులను కనికరించునది తల్లి. తల్లి క్షమించినన్ని తప్పులను తండ్రి క్షమించజాలడు. శరణాగతులను తండ్రి రక్షించినను అతడు తల్లి వంటి వాడు కాడు. రాక్షస స్త్రీలను చంపుదునన్న హనుమంతుని నివారించి వారేమి తప్పు చేసిరి? అన్నది సీత. తండ్రితో చెప్పి ఒప్పించునది తల్లి. కావున చల్లదనమునకును పురుషునితో అవినాభావ సంబంధమునకు ఇది చక్కని ఉపమానము. అంతియే కాదు. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" స్త్రీకి ప్రత్యేకమగు స్వాతంత్ర్యము లేదనుచో నేడు పోట్లాడుదురు. లేదను మాటకు అర్హత లేదని అర్థము. నిజమునకు చెట్టులేక నీడకు అర్హత ఏమున్నది? లేదు. కావున స్త్రీపురుషులకు ఉపాధి భేదమును చెప్పినది శాస్త్రము. ఉపాధిభేదమే ఈశ్వరునకు జీవునకుగల భేదము. ఇది ఇట్లుండ భారతీయులకు స్త్రీల యందెంత ఆదరమున్నదో తెలియని మూర్ఖులు కొందరు స్త్రీలను విడిగ అణగత్రొక్కి రందురు. మన వివాహమున సప్తపదుల యందు స్త్రీ, పురుషునకు స్నేహితురాలని శ్రుతి వాడినది. స్త్రీ పురుష భేదమును ఇట్లు చెప్పినది.

ఓ స్నేహితులారా! నీ నా స్నేహము విడిపోవునది కాదు. ఉపాధి భేదముచే మన కార్యములు వేరు వేరుగ నున్నవి. నా నీ స్వరూపమును చెప్పెద వినుమని నేను ఆకాశమును, నీవు భూమివి. నేను మనస్సును. నీవు వాక్కువు. నేను సామవేదమును నీవు ఋగ్వేదమవు అని వర్ణింపబడినది. అనగా నేమి? వేదము లన్నియు ఒక్క రూపమే. అయినను పేర్లు భేదములున్నవి. ఆభేదమెట్లో అట్లేమన ఇద్దరి భేదము కూడనని అర్థము. రామచంద్రుని సీత ఎప్పుడును వదలలేదు. ఆమె లంక యందుండియు నిరంతర రామ నామమునే ఉచ్చరించినది. మననము గావించినది. ఇట్లు చెప్పి శ్రీరామచంద్రుని చేతిలో మంత్రములతో పవిత్రములైన ఉదకముల ధారతో సీతను రామున కిచ్చినాడు. అప్పుడు దేవతలు పుష్ప వర్షముల కురిపించినారు. దేవదుందుభులు మ్రోగినవి.

"ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మంత్రపూతం జలం తదా
సాధు సాధ్వితి దేవానాం ఋషీణాం వదతాం తదా
దేవదుందుభినిర్ఘోషః పుష్పవర్షో మహానభూత్

మహర్షులును దేవతలును సాధువాదముల నలికినారు. జనకుడు ఆనంద సంద్ర తరంగముల నోలలాడి సీతను రామునికిచ్చి సీత భగవంతున కిష్టమగు ద్రవ్యము. అతని ద్రవ్యమును జాగ్రత్తపరచి సగౌరవముగ అతని చేతబెట్టి కృత కృత్యుడనైతినని ఆనందించినాడు. తరువాత లక్ష్మణునకు ఊర్మిళ నిచ్చినాడు ఇట్లే. భరత శత్రుఘ్నులకు మాండవి,విశ్రుత కీర్తులను కుశధ్వజుడును ఇట్లే మంత్ర పూతములగు ఉదకములతో ధారపోసి ధన్యులయ్యెను.

శ్రోతలారా! మన సీతా కళ్యాణమున కొన్ని సందేహములు మీకున్నవి. నాకు తెలుసును. వాటిని కూడ తెలిపెదను. సీతారాములకు వారి కళ్యాణము నాటికి వయస్సెంత? రామునకంటె సీత ముందుగనే రావణునకు దొరికినది గదా? అదెట్లు?

రామునకు వివాహము నాటికి పండ్రెండు సంవత్సరముల వయస్సు. సీతకు ఆరుసంవత్సరముల వయస్సు. ఎట్లనగా దశరథుడు విశ్వామిత్రునితో చెప్పునపుడు "ఊనషోడశ వర్షః" అనినాడు. మారీచుడు రావణునితో రామునకు దండకారణ్య మునకు వచ్చునప్పటికి "ద్వాదశ వర్షోయం" అని వర్ణించినాడు. సీత, రావణునితో మేము ఆరణ్యమునకు వచ్చునప్పటికి నాకు పదునెనిమిది సంవత్సరములని చెప్పినది. అప్పుడే రావణునితో పండ్రెండు సంవత్సరములు అయోధ్య యందుంటి నన్నది. నా భర్తకు ఇరువదియైదు వత్సరములు ఆరణ్యమునకు వచ్చునప్పటికన్నది. వీటిని సమన్వయించుచో నే చెప్పినదే వయస్సు కుదురును. రామునకంటె సీత ముందెట్లు పుట్టును? జనకునకు దొరికినది సీతయైనది. కావున సీత వయస్సు అప్పటి నుండియే లెక్కకు రావలెను. ముందుకు పోదము.

ఇప్పటికి సీతా కళ్యాణ కథా ఘట్టము ముగిసినది. ఆ తరువాతది విధి పూర్వకములగు హోమముల కావించి వశిష్ఠులు వివాహ సంస్కారమును ముగించి నారు. ఈ మాటను వాల్మీకి ఇట్లు చెప్పినాడు.

అగ్నిం ప్రదక్షిణీకృత్య వేదిం రాజానమేవచ
ఋషీంశ్చైవ మహాత్మానస్సభార్యా రఘునత్తమాః

ఆ నలుగురు రాజ కుమారులును భార్యలతో కూడ అగ్నికిని ఆ ప్రదేశము నందున్న మహర్షులకును వందనముల నాచరించినారట.

యథోక్తేన తదాచక్రుర్వివాహం విధి పూర్వకం

వేదోక్త మంత్రములచే కళ్యాణమైన తరువాత కొన్ని హోమము లున్నవి. వాటిని ప్రధాన హోమము లందురు. ఆ మంత్ర ప్రభావములు చాల గొప్పవి. అవన్నియు చేయబడినవని చెప్పినారు వాల్మీకి. అంతియేగాని వారి బువ్వంబంతు లను వర్ణించుట ఆయన హృదయము కాదు. కావున సీతా కళ్యాణము భారతీయ వైవాహిక ధర్మము. తరువాత కథ ఏమి? ఆ రాత్రి గడవగా విశ్వామిత్ర మహర్షి వారు ఉత్తర దిక్కున హిమవంతమున కేగినారు. దశరథుడు తనపుత్రుల వివాహ మహోత్సవము దేవతలు కురిపించిన పుష్ప వర్షములతో, దేవతలు మ్రోగించిన దేవదుందుభుల మంగళ ఘోషలతో, అచ్చరమిన్నలు గావించిన మహోత్సా నాట్య సంరంభములతో, గంధర్వులు గావించిన గానములతో, అపూర్వమై లోకమునందు అసామాన్యమై వెలయగా, కొత్త కోడండ్రను వెంట నిడుకొని భార్యలతో చతురంగ బలములతో జనకుని అనుమతితో అయోధ్యకు పయనమయ్యెను. జనక చక్రవర్తి గారును ఆయనను వెంటనంటి కన్యాధనమును గూడ వారి కొసంగినారు. ఎంత? ఎంతయని చెప్పెను?

“గవాం శతసహస్రాణి బహూని మిథిలేశ్వరః
కంబళానాం చ ముఖ్యానాం క్షౌమకోట్యంబరాణి చ
హస్త్యశ్వరథపాదాతం దివ్యరూపం స్వలంకృతం
దదౌకన్యాపితాతాసాం దాసీ దాసమనుత్తమం
హిరణ్యస్య సువర్ణస్య ముక్తానాం విద్రుమస్య చ

నాటి ధనములు కాగితములు కాదు. గాలి కెగురునవి కావు. నాడు మొదటి ధనము గోధనము. అవి లక్షను ఇచ్చినాడు. తరువాత విచిత్ర కంబళులు, పట్టు పుట్టములు. ఆ తరువాతవి ఏనుగులు గుర్రములు రథములు. ఇవన్నియు సాలం కృతములు. ఆ తరువాతది దాసదాసీ జనము. చివరిది హిరణ్య సువర్ణమణి ముక్తా ప్రవాళములు. ఇవన్నియు బహుళములుగ ఇచ్చి పంపినారు.

నూత్న వధూవరులతో వినూత్న రథ గజాశ్వ బృందములతో ఋషిగణముతో దశరథుని పయనము సాగినది.

ఆ ప్రయాణమున ఆకాశమున చరించు పక్షులు భయమును గొలుపుచు అపశకునములు గాగా, భూమిపై చరించు మృగములు ఏమియు భయము లేదని

సుశకునములై కన్పట్టినవి. దశరథునకా విషయమును వశిష్ఠులు తెలుపుచుండగనే ఒక అద్భుత దృశ్యమును దశరథుడు చూచినాడు.

ఆకాశ మంతయు చీకటి ఆవరించినది. పెద్ద పెట్టున గాలి వీచినది. సైన్య మంతయు బూడిదతో ఆవరించబడినట్లున్నది. వశిష్ఠాది మహర్షులకు కూడ సంజ్ఞలు తొలగినట్లున్నవి. ఆ విధమగు విచిత్ర దృశ్య మధ్య యందొక వ్యక్తి వినూత్న రూపమున సాక్షాత్కరించినాడు.

అతడు జడదారి. ఆ శరీరధారి నొక తేజోమయమూర్తి యనుటకు సందేహము లేదు. చూచువారలకా వ్యక్తి యొక్క దేహకాంతి కన్నులకు మిరిమిట్లు గొలుపగా ఆతని భుజ స్కంధమునందొక గొడ్డలి తళతళలాడుటచే ఆతడు పరశురాముడని మహర్షులకు స్పష్టమైనది. ఇంతకు పూర్వ మాతడు ఇరువదియొక్క మారు భూభుజుల నరికి పితృ ఋణమును తీర్చుకొన్న క్రోధమూర్తి అయ్యును అతడంతతో శాంత తేజమున వెలుగొందుటను మహర్షు లెరుగుదురు. ఈనాడా శాంత తేజము మరల ఉగ్ర రూపమున మారుటకు మాత్రము వశిష్ఠాది ప్రముఖ మహర్షులకు సైత మర్థము కాలేదు అట్లొక్క ముహూర్త కాలము మహర్షుల ఆలోచనలతో గడవగా ఆ వీర శృంగార రౌద్ర రసము లొక్కటై వెడలివచ్చు పరశురాముడు దశరథ పుత్రుడగు రఘురాముని సమీపింప వేవేగ వచ్చుచునే యుండెను. ఆ పరశురాముని దశరథు డెరుగును. తన తండ్రిని అవమానపరచి చంపిన నక్షత్ర మండలముపై ఆతడు రుద్రమూర్తియైన ఆతని ఉగ్రరూపము గూడ దశరథునకు పరిచితమగు రూపమే అగుటచే దశరథుని హృదయ మొకింత కంపింపక తప్పలేదు. మహర్షి సంఘము మాత్రము ఆ జామదగ్నికి అర్ఘ్య పాదముల నొసంగి మధుర వాక్య సరణితో పలకరించినది. ఆతడు ఋషి సంఘ మందించిన పూజల గ్రహించి దశరథుని పలకరింపకుండగనే రాముని సమీపించినాడు.

రఘువీరుడు గావించిన శివ ధనుర్భంగము ఆ దాశరథికి యశమును గూర్పగా పరశురామున కది సహింపరానిదైనది. కావున ద్వంద్వ యుద్ధమును కోరినాడు. "ద్వంద్వ యుద్ధం ప్రదాస్యామి వీర్య శ్లాఘ్య స్వరాఘవ" అనినాడు. అది దశరథుడు భరింపరాని మాటయైనది, నూత్న వధూపాణిగ్రహణము గావించి పెండ్లికొడుకైన తన పుత్రుడు పసివాడు. ఉగ్రమూర్తియగు ఆ రుద్రమూర్తి తోటి ద్వంద్వ యుద్ధమా? దశరథేశ్వరుని చిత్తము తల్లడిల్లినది. ఆ జమదగ్ని పుత్రునకు దోసిలి యొగ్గినాడు. క్షత్ర జాతిపై పూనిన మీ రోషము శాంతించినది గదా? జామ

దగ్ని! బాలురగు నా పుత్రులతో నీకేల నేడీ ద్వంద్వ యుద్ధము? అని దీనుడై పలికినాడు. తన పుత్రులకు అభయము నిమ్మని అడిగినాడు, "బాలానాం మమ పుత్రాణాం అభయందాతుమర్హసి అనినాడు ఒక విధముగ ఆ బ్రాహ్మణుని కొని యాడి తన పుత్రుని దగ్గరకు రాకుండ మరలింప ప్రయత్నించినాడు. ఉగ్ర తేజమున అహంకరించి వచ్చిన ఆ ప్రతాపశాలి పరశురాముడు దశరథుని మాటలను లెక్కపెట్టకయే రాఘవేశ్వరుని సమీపించినాడు

పరశురాము డుగ్రమూర్తి. మన రాముడు మధురమూర్తి. ఆత డుగ్ర మూర్తియై పితృ వాక్య పరిపాలకుడు కాగా ఈ రాముడు మధురమూర్తియై పితృ వాక్య పరిపాలకుడగుట ఈ యవతారములోని ప్రత్యేకత. దశరథ రాముని శాంత తేజము పరశురాముని రాకకు జంకు గొనలేదు. పితృసాన్నిధ్యము గావున రాముడు తన వీరత్వమును ముందుగనే ప్రదర్శించి పరశురామునితో సంభాషింపలేదు. పరశురాముడే ఒకప్పు డాతడు క్షత్ర జాతిని తన గండ్రగొడ్డలిచే నరికితిననుకొన్న యహంకారమును ప్రదర్శించుచు శివ ధనస్సుయొక్క బలహీనతను ప్రకటించి, తన చేతనున్న వైష్ణవ తేజమున వెలుగొందు ధనస్సును రాముని ముందుంచి దీనిని వెక్కుపెట్టి నీ పరాక్రమమును ప్రకటించుచో నీ తోటి ద్వంద్వ యుద్ధమును చేతునని గంభీరముగ పలికినాడు.

పరశురామావతారము ఆవేశావతారము "ఆవేశాభార్గవాదయః" ఆ యవ తారము నందుండదగు లేక అవసరమగు తేజమునకు కాలము తీరినది. రాముని యవతారము పూర్ణావతారము. పరశురామునిలోని తేజమును తన లోనికి గైకొను టయే రాముని సంకల్పము. పరశురాము డుగ్రమూర్తియై మాటాడినను రాముడిట్లు సమాధానము నొసంగి తన కర్తవ్యమును నెరవేర్చినాడు.

పరశురామా! నీ చరిత్ర నాకు క్రొత్త కాదు. నీవు నీ తండ్రి ఋణమును తీర్చుటకై పితృపాదుల గౌరవమునకై నాడు క్షత్రియుల వధించితివి. కాని క్షాత్ర తేజము నీనాడు నీవు అవమానించుచుంటివి. అది క్షంతవ్యము కాదు. నేను సహిం పను. నీచేత నున్న బాణమును వెక్కుపెట్టి నా పరాక్రమమును చూపుదునని పరశురాముని చేతనున్న విల్లు నందుకొనినాడు. అందుకొనుట కాదు. ఆ విల్లును వెక్కుపెట్టినాడు. ఆ క్షణముననే పరశురామునిలోని రౌద్ర తేజము రాముని పరి పూర్ణ పరాక్రమమున విలీనమైనది. పరశురాముని చేతనున్న ఆ వైష్ణవ ధనువు

రామునిచే వెక్కుపెట్టబడి అమోఘ పరాక్రమము గలదైనది. రాముని ముఖమండలము ఎఱ్ఱబడినది. క్రోధమూర్తి యయ్యెను. వెక్కుపెట్టిన బాణమును రాముడు ఉంచలేదు. పరశురామునిపై వదలలేదు. అతడు బ్రాహ్మణుడు. పూజ్యుడు క్షత్రియునకు అంతేకాదు. రామునకు గురువర్యుడైన విశ్వామిత్రునకు బంధువు కూడ. కావున తన క్షాత్ర తేజమును అవమానించి తన పూజ్య భావమునకు కారణము నాతనకి తెలిపి, నా వెక్కుపెట్టిన బాణమునకు గురి కావలసిన దెవ్వరు? ఇది వ్యర్థమగు శరాసనము కాదు అని గద్దించి, ఈ బాణమునకు గురి కాదగిన వాటిని రెంటిని రాముడే నిర్ణయించినాడు. ఒకటి పరశురాముని పాదద్వంద్వము. రెండు పరశురాముడు ఇంతవరకు గావించిన తపస్సు యొక్క పుణ్యరాశి. నీ భౌతిక కాయము యొక్క పాదద్వంద్వమును నరికి ఈ బాణముయొక్క అమోఘత్వమును నిలబెట్టమందువా? లేక పుణ్య లోకముల కేగదగు నీ పుణ్య పుంజమును భగ్నం కావింపమందువా? అని ప్రశ్నించినాడు రాముడు. ఇప్పుడు పరశురాము నొక్కమారు పరిశీలింపుడు. ఆతనిలోని పరాక్రమము జడత నొందినది. ఆయన నావరించిన అహంకారము పరశురాముని వదలి అవ్వల కేగినది.

అంతతో ఈ రాము డెవ్వడో పరశురామునకు ద్యోతకమైనది. ఆతడు మధుసూదనుడని జామదగ్ని తెలుసుకొనినాడు. తాను భంగపడుటకు సిగ్గు నొందలేదు. తానిప్పుడు ఈ భూమిపై నిలువరాదు. కారణమేమి? ఈ భూమి నంతను రాజులనుండి జయించి కశ్యప ప్రజాపతికి దాన మిచ్చినాడు. కావున తన పాద గతిని రాముడు తప్పించుకొనుట కాతడు కోరక, తన పుణ్య పుంజమును భగ్నము కావింపుమని కోరినాడు.

మోక్షగతికి పాపమెట్లు ప్రతిబంధకమో పుణ్యమును అట్లు ప్రతిబంధకమను నది ఉపనిషత్సిద్ధాంతము. కావున శ్రీరామచంద్రుని తన పుణ్య సంచయమును భగ్నము కావింపుమని కోరినాడు. రాముడట్లే ప్రసాదించినాడు. పరశురాముడు పలికిన శ్లోకము లివ్వి. రాముడు సాక్షాన్నారాయణుడని చెప్పుటను గమనింపుడు.

అక్షయం మధుహంతారం జానామి త్వాం సురేశ్వర
నచేయం మమ కాకుత్స్థ వ్రీడా భవితు మర్హతి
త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీకృతః

అవతార రహస్యము లిట్లే యుండును. భగవల్లీలలు మందబుద్ధులకు గోచరములు కావు. అంతతో ఆ ఘట్టము ముగిసినది. పరశురాముడు గావించిన

తపస్సుచే వచ్చు అప్రతిమ ప్రభావ సంపన్నములగు లోకములకు పోకుండ రాముడా లోక గమనమును త్రెంచినాడు తాను వెక్కుపెట్టిన బాణముతో. పరశురాముడు రాముని కొనియాడి మహేంద్రాద్రికి వెళ్ళగా పరశురాము డిచ్చిన శరాసనము రాముడు వరుణున కిచ్చి, తండ్రికి పరశురాముని పయనమును చెప్పి, సంతోషముతో సైన్యమును అయోధ్యాభిముఖము గా వింపుడని తెలిపినాడు. దశరథుని సంతోషమునకు మేర ఏమున్నది? పుత్రుని గాఢాలింగనముచేసికొని, మరల పుత్రులిప్పుడు పుట్టిరన్నంత సంతోషము నొందినాడు. పుత్రులు పుట్టుట కాదు. తానును జన్మించిలిననియే తలచినాడు. వారి పయనము అయోధ్యాభిముఖమైనది. సంతోష పూర్వకముగ ఋషి గణముతోడను మంత్రి పురోహితాదుల తోడను అది అయోధ్యా నగరము. దశరథేశ్వరుని రాజ మందిరము. ధ్వజపతాకాది తోరణాలంకృతమైయుండ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నూత్న వధువులతో అంతఃపురముల ప్రవేశించినారు. మంగళ పూర్వకముల ఆశీస్సుల నందుకొనగా దేవతా యతనముల పూజలు సలుపుట జరిగినవి. కౌసల్యా సుమిత్ర కైకేయీలు తమ కోడండ్రను పరిగ్రహించగా అందరును నాటి కళ్యాణ దివసములు సుఖమయములైనవి. దశరథేశ్వరుని భాగ్యము పండినది. ఆతని గార్హస్థ్యము సఫలమైనది.

కొంత కాలము గడచినది. యుధాజిత్తు ఇక్కడనే యుండెను భరత శత్రుఘ్నులను పిలచి దశరథేశ్వరుడు తనను మిథిలా పురముననే భరత శత్రుఘ్నులను కేకయ రాజ్యమునకు పంపమనుటచే దశరథు డందుకు అనుమతించగా భరత శత్రుఘ్నులు కేకయ రాజ్యమున కేగినారు.

మనమిక సీతారాముల దగ్గరకు వత్తము. భరతుడు తాతగారి మందిరమున కేగగా రామ లక్ష్మణులు అయోధ్య యందే యుండిరి.

రాముడు పితృమూర్తికి పితృ కార్యముల నెరవేర్చును. మాతృమూర్తులకు మాతృ కార్యముల నెరవేర్చును. ఆతనికి కౌసల్యా సుమిత్ర కైకేయీల మధ్య భేదములేదు. లక్ష్మణు డాతని ననుసరించియే యుండెను.

భారతీయ సారస్వతము ధర్మమున కెంత స్థానము నిచ్చినదో అర్థకామములకును అంతటి విజ్ఞాన సంపద నందుకొను స్థానము నిచ్చిన శాస్త్రముల యందు భోగమును పరిపూర్ణ రూపము నందనుభవించుటకును వ్యసనార్థితులు కాకుండుటకును స్త్రీ పురుషుల పరస్పరానురాగము వృద్ధి యగుటకును కామశాస్త్రము ప్రవృత్తమైనది. ఏయే ఋతువుల యందెట్లు స్త్రీ సుఖముల ననుభవించవలెనో ఒకరి మన

స్సులనొకరు రంజింపచేయుట ఎట్లో కామము అయుర్దాయము నెట్లు పెంచునో వాత్స్యాయన కూచిమార తంత్రములు నిరూపించినవి.

వాల్మీకి మహర్షి వారు సీతారాముల దాంపత్యమును వర్ణించుచు ఇట్లనినారు.

"రామస్తు సీతయా సార్థం విజహార బహూన్ ఋతూన్

రాముడు సీతతో కూడ చాల ఋతువులను గడిపినారట.

జితేంద్రియులై వన విహారాదికముల సల్పుచు తమ ప్రేమాంబుధుల విరియు తత్కాలోచిత కేళీవిలాసముల దేలియాడుచు ఆయా ఋతు కాలములకు లక్ష్మీనారాయణులు శోభల గూర్చుచుండిరని వాల్మీకి తెలియజేసినారు.

ఆదర్శమూర్తులగు నా దంపతుల యపార ప్రేమామృత మాధురీ శోభలనే కవి శేఖరుని లేఖిని చిత్రింపగలదు? ఏ గాయకుడు ముక్త కంఠమున గానము చేయగలడు? సీతారాముల దాంపత్యము సకల ప్రపంచమున కాదర్శప్రాయమగు దాంపత్యము తన వివాహము తన తండ్రిచే నిర్వర్తింపబడినదనియు సకల సద్గుణ నిధానము తన యిల్లాలనియు సీతను మనసారా ప్రేమించి ఆ కాంతామణిని తన హృదయ ఫలకమున నిడుకొనెను. సీతా మహాసాధ్వియు పురుషోత్తముడగు శ్రీరాముని తన హృదయము సంబంధింపకొనెను. వారి ప్రేమ పాశముల ఖండింపన దెద్దియు నీ సృష్టి ఖండమున కానరాదు. తన ఇల్లాలు పలుకకయే ఆ సుందరి మనోభావముల రాముడు గుర్తెరుగును. తన మనోనాధుడు వచింపకయే, ఆ మోహనాంగుని హృదయ గీతికల సీత యాలకించును. ఇట్లొకరి హృదయము లొకరిలో ఏకమై అద్వైతసిద్ధిని పొందినవి. ఒక్క మాట. ఆరు సంవత్సరముల వయసు కలిగిన సీతతో రాముని విహారయాత్ర ఎట్లు జరిగినది? సీత యొక్క వయస్సునకును ఈ మాటకును సంబంధము కలదా? అని శ్రోతలు ప్రశ్నింప వచ్చును.

సీతారాముల శరీరములు ప్రాకృతములు కాదనుమాటను మరువక వారు అప్రాకృత శరీరధారులనుటయే మీ ప్రశ్నకు సమాధానము.

సీతారాముల అన్యోన్య దాంపత్య వైభవ వర్ణనయందుంటిమి గదా? భారతీ వైవాహిక మహా ఫలము స్త్రీ పురుషుల చిత్తము లేకమై అద్వైత మగుటయేనట.

శ్లో॥ అద్వైతం సుఖ దుఃఖయోరనుగతం సర్వాస్వవస్థాసు య
ద్విశ్రామో హృదయస్య యత్ర జరసా యస్మిన్నహార్యోరసః
కావేనావరణాత్యయాత్పరిణతే యత్ప్రేమసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమప్యేకం హి తత్ప్రార్థ్యే మే

బాల్య యౌవన కౌమార వార్థక్యము లనెడు అన్ని అవస్థలయందును ప్రాప్తించుచుండు సుఖ దుఖములు రెండును ఎచట నొకటియై (ఆనందమై) పోవునో మనస్సు ఎచ్చట విశ్రాంతిని పొందునో ముదిమిగూడ ఎచ్చట ప్రేమను హరింపజాలదో మంగళసూత్రము కట్టినది మొదట మరణించువరకును కేవలము ప్రేమ రూపముననే ఏది నిలుచునో అట్టి దాంపత్యమునకే ఎట్టులైనను క్షేమము కావలెనని కోరుచున్నాము అనినాడు భవభూతి మహాకవి.

నిజమునకు మానవు డార్జింపదగినది ప్రేమ. వర్జింపదగినది మోహము. ప్రేమ అమలము. అఖిలము. అఖండము. అద్వితీయము. పవిత్రము నిత్యమునై యున్నది. మితమును అగుణమును మాయాదంభకల్మష అనిత్యతాదాక్షిణ్య రాహిత్యములతో కూడియున్నది మోహము.

పురుష పశువు స్త్రీ పశువును వెంట నంటునట్లు ఇంద్రియ కాల్యముచే పెండ్లియాడి ఆకలిదప్పుల తీర్చుకొని దేహపోషణ గావించుకొనుటకై జీవితమును వ్యర్థము చేయు మానవునందు ప్రేమకు తావులేదు. మోహమునకు మాత్రమే స్థానమున్నది

భారతీయుల పవిత్రమగు దాంపత్య ప్రేమయు ప్రేమ శబ్దము యొక్క భావము సీతారాముల రూపమున యవతరించిరనుట యందతిశయోక్తి లేదు. ఇదియే కళ్యాణ వైభవములోని అంతరార్థము.

స్త్రీ పురుషుల పరస్పరానురాగమే దేశ సౌభాగ్యమునకు కారణమనియు స్త్రీ పురుషుల హృదయ క్షేత్రములందట్టి పవిత్ర ప్రేమానురాగలత పెంపొందిన నాడే సత్సంతాన ఫలముల బడయగలరనియు రామాయణ కావ్యము పాఠము చెప్పినది.

"అంతఃకరణ తత్వస్య దంపత్యోస్నేహసంశ్రయాత్
ఆనంద గ్రంధిరేకోయమపత్యమితి కథ్యతే"

దంపతుల ఆనంద గ్రంధి సంతానమట

వేయేల? ఆ పవిత్రమగు దాంపత్య ప్రేమయే భారతీయ జీవనము. ఆ పవిత్ర ప్రేమయే హైందవజ్యోతి. నేడా జీవనజ్యోతి పశ్చిమ వాతాడంబరమున నన్నగిల్లినది. పడమటి గాడ్పులు భారతీయుల భారతీయతను శుష్కింప జేసినవి. పాశ్చాత్య నాగరికతా గ్రహగ్రస్తులైన భారతీయులు మోహ పారవశ్య మొనంగు శృంగార రసాస్వాదనమే తమ జీవిత లక్ష్యమని యెంచి ధర్మ సాహిత్యమునకు దూరులై వివాహ విచ్ఛేదాది శాసనములకును సగోత్ర వివాహాది చట్టములకును, జాత్యంతర వైవాహిక విధులకును ప్రయత్నించుచుండిరి. కామ సుఖమునకే స్త్రీని పరిగ్రహించు పక్షమున ఆ చట్టములు న్యాయములు కావచ్చునేమో, ధర్మపత్ని, జాయా అను భారతీయ పదములకు స్థాన మిచ్చుచో ఆ చట్టములు దురంతములు కాక తప్పదు.

కామ దృష్టిని మాత్రమే స్త్రీ పురుష సంబంధమున ప్రవర్తింపజేసినపుడు మాతృ సోదరీ నియమములను ఏల పాటింపవలయును?

దాంపత్య మున్నంత కాలము ప్రేమ వాహిని జీవనదియై పారుట పురాణ కాలము నాటి పరమ సిద్ధాంతము. లోకాంతరమున గూడ నీ దాంపత్యము విడి వడదు ఇది భారతీయ సిద్ధాంతము.

మన మొక్కమారు సీతారాముల దాంపత్య జీవితము నెట్లు 'మహర్షి' వర్ణించిరో పరిశీలింతము.

> "ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి
> గుణాద్రూపగుణాచ్చాపి ప్రీతిర్భూయోఽభ్యవర్ధత

సీతపై రాముని ప్రేమ క్రమముగా వృద్ధి పొందినదట. తండ్రి చేసిన పెండ్లి యనియట సీత గుణ సంపద ముందుదట సౌందర్యము తరువాత దట. ఈ రెండును ఒక్కపై రాముని ప్రేమను పెంచినవట.

ఈ శ్లోక తాత్పర్యమును మీరు వింటిరి గదా? ఒక్కమారీ శ్లోకమునకు పై శ్లోకము దగ్గర కేగుదము. ఆ శ్లోకము రాముడు సీతతో విహరించిన విహార వర్ణనము. ఆ శ్లోకమున ధర్మార్థ కామములను త్రివర్గములలో మూడవదగు కామమును రాముడు సేవించుట వర్ణింపబడినది. అందొక్క రహస్యమున్నది. సీతతో రాముడు చాల ఋతువులు విహరించెనని యున్నది. అనేక సంవత్సరములని లేదు. ఏ యే ఋతువు లందెట్లు విహారముల సలుపవలెనో కామశాస్త్రము చెప్పినది. అంతేకాదు తద్గత మనస్వియై అనుభవించెనట. ఆ విశేషణమున కర్థమేమి? సీత యందాతనికి గల ప్రత్యేకమగు ప్రేమను ఆ విశేషణము ప్రకటించినది. ప్రస్తుతమగు మన

శ్లోకము సీత రాముని కంత ప్రియమగు వస్తు వగుటకు కారణములను తెలిపినది. ఆ కారణము లేమిటి?

మొదటి కారణము తండ్రి చేసిన పెండ్లియని రాముడు సీతను ప్రేమించె నట. తరువాత కారణము సీతలోని గుణ సంపద యట. ఆ తరువాతది సీతయొక్క సౌందర్య గరిమయట. ఈ కారణములలో తండ్రి చేసిన పెండ్లి కూడ ఒక కారణమై యుండెనా? లేక అదియే కారణమై యుండెనా? అది కూడ ఒక కారణము కాదట. అదియే కారణమట. ఈ శ్లోకమున "ప్రియాతు" అని వాడబడినది "తు" అనునది అవధారణార్థకమగు అవ్యయము. "తురవధారణే" ఈ ప్రత్యేకత ఏమి? ఈ ప్రత్యేకత అర్థము కావలెనన్న అసలు నాయకుడు నాయకి యందత్యంత ప్రేమాస్పదుడై యుండదగు కారణములను వాత్స్యాయనుడు కామశాస్త్రమున వర్ణించినాడు. ఒక్కమారు మనము కామ శాస్త్రములోనికి పోదము. మనము పోవుట కాదు. వాల్మీకి మహర్షి అంతర్గర్భితముగ పంపినారు. కాని ఒక్క ప్రశ్న. మానవ జాతికి కామశాస్త్రముయొక్క అవసరమేమి? పశుపక్ష్యాదులు కామశాస్త్రమును అధ్యయనము గావించియే సంతతిని బడసినవా? లేదు. మరి మనుజుల కెందుకు ?

మానవుడు కామము ననుభవించుటయందు స్వతంత్రుడు. అనుభవించకుండ కూడ వుండగలడు. పశువులకా శక్తి లేదు. ప్రకృతికి అవి వశమై యుండును మానవుడు ప్రకృతిని జయించగలడు. మానవుడు ధర్మమును కూడ కలుపుకొని కామము ననుభవించుట యుక్తమని శాస్త్ర హృదయము. కావున కామశాస్త్రము కూడ అనాదిసిద్ధమై ప్రజాపతిచేతనే సృష్టించబడినది. ధర్మార్థకామములు మూడును ప్రజాపతి సృష్టిలోనివే.

సూ. ప్రజాపతిర్హి ప్రజా స్సృష్ట్వాతాసాం స్థితి నిబంధనం త్రివర్గస్య
సాధన మధ్యాయానాం శతసహస్రేణాగ్రే ప్రోవాచ. వాత్స్య=సూ

ప్రజాపతి ప్రజల రక్షణ కొరకై లక్ష అధ్యాయముల గ్రంథమునుసృష్టించి నాడు. ఆ గ్రంథము నుండి ధర్మ భాగమును మనువు తీసికొని విస్తరించగా అర్థ మును బృహస్పతి వివరించినాడు. కామమును నందీశ్వరుడు విస్తరించుటజరిగినది.

సూ. తస్యైకదేశం స్వాయంభువో మనుర్ధర్మాధికారికం పృథక్చకార

సూ. బృహస్పతి రర్థాధికారికం॥

సూ. మహాదేవా నుచరశ్చనందీ సహస్రేణాధ్యాయానాం
పృథక్కామ సూత్రం ప్రోవాచ

నందీశ్వరుని తరువాత ఎందరో విజ్ఞానవేత్తలీ కామశాస్త్రమును సంగ్రహించి వ్యాఖ్యానించినారు. ఆవ్యాఖ్యాతల యందొకరు వాత్స్యాయనులు. ఈసూత్రములకు జయమంగళ పండితుని వ్యాఖ్యాన మున్నది. వాత్స్యాయనుని కంటె పై వారు కొన్ని ప్రకరణములను వ్యాఖ్యానించినాడు.

శ్లో॥ వాత్స్యాయనీ సంకిల కామసూత్రం ప్రస్తావితం కైశ్చిదిహాన్యథైవ
తస్మాద్విధాస్యేజయ మంగళాఖ్యాం టీకామహం సర్వవిదం ప్రణమ్య.

ప్రస్తుతమున కామశాస్త్రమును చెప్పుట నా ఆశయము కాదు. ఈ వాత్స్యాయనము కొన్ని అధికరణములతోడను అధ్యాయముల తోడను కూడియున్నది. అధికరణ ధర్మముల ననుసరించి పూర్వపక్ష సిద్ధాంతాదులతో కూడ సూత్ర రచన సాగినది. మన కిక్కడ ప్రస్తుతములగు ప్రకరణములను మాత్రమే మీ కిక్కడ వివరించదలచినాను. ఇందు విద్యా సముద్దేశాధ్యాయమున ధర్మశాస్త్రి అర్థశాస్త్రములవలెనే కామశాస్త్రము కూడ వేద శాస్త్రములతో కలిపి అనధ్యయనాది కాలములయందు అభ్యసించవలసినదని వాత్స్యాయనులు చెప్పినారు.

సూ. ధర్మార్థాంగ విద్యా కాలానాను పరోధయన్ కామసూత్రం
తదంగ విద్యాశ్చ పురుషోధీయాత

ధర్మ విద్యయన శ్రుతిస్మృతులు. ఆయ వ్యయముల చెప్పునది అర్థ విద్య. ఈ రెంటికిని అంగ విద్య దండనీతి. ఇదియే యోగక్షేమముల కూర్చును.

సూ॥ తత్ర ధర్మ విద్యా శ్రుతి స్మృతిశ్చ అర్థవిద్యా వార్తాశాస్త్రం
తయోరంగ విద్యాదండ నీతిఃయోగక్షేమ సాధనాత్_వ్యాఖ్య

ఈ శాస్త్రములు పురుషులకు మాత్రమే పరిమితములా? అనునది ప్రశ్నయే. కాదు. స్త్రీలకు కూడ పాఠములయ్యే యున్నవి. నేడు ఇతర దేశములు పెక్కు విద్యను హాత్యాంశములు కావింపనలె ననుచున్నవి గదా?

ప్రాగ్యౌవనాత్ స్త్రీ 141 సూ.

ఈ సూత్రము దగ్గర జయమంగళుడు ఇట్లు వాఖ్యానించినాడు.

ప్రాగ్యౌవనాత్ స్త్రీ కామసూత్రం తదంగవిద్యాశ్చాధీయాత పితుర్గృహా పః
ఛరుణ్యాః పరిణీతత్వాత్ అస్వతంత్రాయాః కుతోధ్యయనం

స్త్రీ మాత్రము తన పుట్టినింట నున్న కాలముననే ఈ శాస్త్రమును పఠింప వలెననినాడు. తరుణియగుచో పరాధీన కావున కూడదనినాడు. కాని భర్త అనుజ్ఞ యగుచో శాస్త్రములను శాస్త్రాంగములను అధ్యయనము చేయవచ్చుననినాడు వాత్స్యాయనుడు "ప్రత్తా చ పత్యురభిప్రాయాత్" ఈ విషయము చాల పూర్వ పక్షములతో నిర్ణయించబడినది. మనమీ విషయము నెందుకు ఎత్తుకొంటిమి?

రాముడు కామశాస్త్ర ప్రసిద్ధములగు ఉపకరణముల తోడనే సీతతో విహరించి నాడనుటకు చెప్పినాను. ఇక్కడ నాయకుడు ఆచరించదగు ఆచరణలేవియో కూడ ఈ శాస్త్రమున నిర్ణీతములైనవి. ఈ శాస్త్రమున స్త్రీని పరిగ్రహించు నప్పుడే ఎట్టి స్త్రీని పరిగ్రహించిన కామ పురుషార్థము సిద్ధించును? అను ప్రశ్నకు సమాధానముగ, కన్యా సంప్రయుక్తాధికరణ మొకటి యున్నది. ఆ అధికరణమున వరణ విధానాధ్యాయము మొదటిది. ఈ అధ్యాయము నందలి మొదటి సూత్రమిది.

సూ. సవర్ణాయాం అనన్య పూర్వాయాం శాస్త్రతోధిగతాయాం
ధర్మోర్థః పుత్రాః సంబంధః పక్షవృద్ధిః అనుపస్కృతా రతిశ్చ

ఈ సూత్రార్థమును మీకు వివరించి చెప్పుట ఈనాడు అత్యవసరము కాక పోదు. చాల అవసరము.

తాననుభవించవలసిన స్త్రీని పరీక్షించియే పరిగ్రహించుట ఈ శాస్త్ర లక్ష్యము కూడ. సవర్ణ స్త్రీని పరిగ్రహించుటయే రతి సౌఖ్యమునకు కూడ మూలము అని నిర్ణయించినదీ శాస్త్రము. ఎనిమిది విధములగు వివాహములను ధర్మశాస్త్రాచార్యులు నిర్ణయించినారు. అందు బ్రాహ్మణ వివాహము గొప్పది. సవర్ణ స్త్రీయన నాయకుడు తానే. కులమునకు ఏ జాతికి చెందినవాడో నాయిక కూడ ఆ కులము నకును ఆ జాతికే చెందియుండవలెనట. కేవలముగ బ్రాహ్మణాది జాతులే కాక స్త్రీ పురుషులకు కామశాస్త్రము ప్రత్యేక జాతి విభాగమును గావించినది కూడ.

అంతియే కాదట. అనన్యపూర్వ కావలెనట. అనగానేమి? మనో వాక్కాయ కర్మల చేత గూడ ఇతరులకు వినియోగముకాని కన్య అని అర్థము. అంతతో సూత్రకారు డాగలేదు. "శాస్త్రతః అధిగతాయాం" అనినాడు. శాస్త్రమున చెప్ప బడిన వరణ విధానము ననుసరించవలెనట కూడ. పెండ్లి కార్యములయందు మీరు చూచియే యుందురు. కన్యకావరణములని ఇచ్చెదరు. ఆపస్తంబుడు వీరిని పంపు నప్పుడు ఒక మంత్ర వినియోగమును కూడ చెప్పినాడు. అతడు చెప్పు సూత్రమున "సుహృదయః" అను విశేషణమును వాడినాడు.

సూ. సుహృదన్నమ వేతాన్ మంత్రవతో వరాన్ ప్రహిణుయాత్-ఆవ.సూ.

ఇట్టి కన్యక వల్లనే ధర్మార్థ కామములు సిద్ధించుననినాడు వాత్స్యాయనుడు. అందు కామము యొక్క ప్రయోజనమును చెప్పుచు, "అనుపస్కృతారతిశ్చ" అనినాడు. జయమంగళుడీ వాక్యమునకు అ కృత్రిమారతిః విశ్వాసాతిశయ యోగాదిత్యర్థః" కృత్రిమరతి కాక నిజమగు రతిసుఖము కలుగుననినాడు. విశ్వాసయోగ్యము కాని స్త్రీ తోటి పొత్తునందు సహజమగు రతి సుఖము కలుగదని స్పష్టపరచినాడు. రెండవ సూత్రమున ఆ స్త్రీ ఎట్లుండవలెనో కూడ చెప్పినాడు ఇటువంటి స్త్రీని పెండ్లి చేసికొనవలెనని ఆమెకు ఉండదగు లక్షణముల నిచ్చినాడు.

సూ. తస్మాత్కన్యాం అభిజనోపేతాం మాతా పితృమతీం
త్రివర్షాత్ప్రభృతి న్యూన వయసం శ్లాఘ్యాచారే ధనవతి పక్షవతి
కులే సంబంధిప్రియే సంబంధిభిరాకులే ప్రసూతాం ప్రభూత మాతా
పితృ పక్షాం రూప శీల లక్షణ సంపన్నాం అన్యూనాధికావినష్ట
నఖదంతకర్ణకేశాక్షి స్తనీం అరోగప్రకృతిశరీరాం తథావిధ ఏవ
శ్రుతవాన్ శీలయేత్॥

మొదటిది వంశము. సద్వంశము కానిచో ఆ కన్యక పనికిరాదు. తల్లి దండ్రులుండి యుండుట రెండవదట. తన కంటె రెండు మూడేండ్ల వయస్సు తక్కువ కలిగియుండవలెనట. ఆచార వ్యవహారములు కూడ అవసరమట. అంతే కాదు. ధనధాన్యములును బంధుమిత్ర పక్షములును కలిగియున్న వంశము కావలెనట.

అన్నదమ్ములుండుటను కూడ గమనింపవలెను "అభ్రాతృఘ్నీం" అను మంత్ర మున్నది. ఈ మంత్రమును పఠించుచు కన్యకను చూచుట సుమూహూర్తమని ఆపస్తంబులు చెప్పినారు. ఆ మంత్రమున మొదటి మాట సోదరులు కలిగి యుండవలెనని యున్నది. ప్రకృతమునకు వత్తము. తరువాతవి శరీర లక్షణములు. ఆ లక్షణములను కొన్నిటిని చెప్పి, న్యూనాధిక్యములు గాని లక్షణములను వర్ణించి నాడు వాత్స్యాయనుడు.

గోళ్లు, దంతములు, చెవులు, వెంట్రుకలు, నేత్రములు, స్తనములు. ఇవి ఆస్త్రీయొక్క మనస్తత్వమును తెలియజేయు చిహ్నములు. దీనినే అంగసాముద్రిక మందురు. ఇవి ఇట్లుండ రోగ ప్రకృతి కాకపోవుట చాల ముఖ్యమనినాడు, ఇట్టి స్త్రీని విద్యావంతుడై, ఆ కన్యకతో సమానమగు లక్షణములు కలవాడై వివాహ

మాడవలెను. తాను రోగ ప్రకృతి కలవాడై ఆరోగ్యవతియగు స్త్రీని పెండ్లియాడగా వచ్చు అనర్థక మేమియో చెప్పినాడు. "అన్యథాహి ఆగమ్య ఏవస్యాత్" అని జయమంగళ వ్యాఖ్య. ఈ అధికరణము కాక కన్యా సంప్రయుక్తా కాధికరణమను దానిని కూడ వాత్స్యాయను డిచ్చినాడు. ఇన్ని లక్షణములతో కూడియున్నను ఆ నాయిక విశ్వాసపాత్రు రాలగునా? కాదా? అని పరిశీలించి గానీ ఆ స్త్రీ తోటి సంగమింపరాదనినాడు. రాజు చేయదగు మంత్రిపురోహిత సేవకాది వరణముకూడ ఇట్టిదే ఈ విషయములను చాణక్యుడు చెప్పినాడు. వాటిని అయోధ్యకాండయందు చెప్పెదను ఈపరిశీలనము బ్రాహ్మణాది సర్వవర్ణములకును చెప్పబడినది. "సార్వ వర్ణికం". ఈ పరీక్ష కేవలముగ పురుషులను గురించియే చెప్పెనను కొనకుడు. స్త్రీకి లేక నాయికకు తనయందు అయిష్టము కలుగకుండునట్లు ప్రవర్తింపవలసిన పురుష ప్రవర్తనను కూడ కామశాస్త్రము నిర్వచించినది. నాయికకు తనపై అసహ్యము కలుగుచో అక్కడ రతి సుఖము లుప్తమగుటయే గాక సత్సంతానము కలుగనేరదనునది కూడ ఈ శాస్త్ర హృదయము.

ఇప్పుడు మీరొక్క మారు రాముడు సీతను ప్రేమించుటకు కారణము తండ్రి చేసిన పెండ్లి యనుటను భావించుడు. తల్లిదండ్రులు కన్యకకు ఉండదగు వంశాభిజాత్యాది ధర్మముల పరిశీలించియే చేయుదురు. లేక సుహృత్తులైనను అనేక ధర్మములను ఎరిగిన వారగుట చాల అవసరము.

"ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి" అన్న పాదమున ఈ అర్థ మంతయు అంతర్గర్భితమై యున్నదనుటకు సందేహ మేమున్నది?

తరువాత కారణమేమి? సీతలోని గుణ సముదాయము. "గుణాత్" అని యున్నది. నాయకుని రంజింప చేయుటకు ఏమేమి గుణముల కలిగియుండవలెనో కామశాస్త్రము చెప్పినది. భార్యాధికారికమను పేర వాత్స్యాయనుడు నాయిక ప్రవర్తించదగు విశేషములను వివరించినాడు. ఇది రెండధ్యాయముల అధికరణము. దీనిని కూడ మీకీ నాటి యుపన్యాసమున వినిపించెదను. నేనీ నాడు మీకు చెప్పు విశేషములను తెలిసికొను అవసర మెంతైన కలదు. చక్కలిగిలి పెట్టి నవ్వించు నట్లు అసభ్య ప్రసంగములతో శాస్త్రాధారములు లేని కుతర్క ప్రసంగములతో జనుల నాకర్షించుట నా లక్ష్యము కాదు. రోహిణీయుక్త చంద్రునివలె వెలుగొందు రామచంద్రుని ఇతివృత్తము నాధారముగాగొని నిష్కలంకమగు సనాతన భారతీయ

సిద్ధాంతమును మీ హృదయ క్షేత్రముల ముద్ర వేయుటయే నా యుపన్యాసములకు లక్ష్యము.

వాత్స్యాయనుడీ యధికరణమునకు భార్యాధికరణమని ఎందుకు పేరిడెను ?

కన్యా పురుషేణసంయుక్తా భార్యా సంవృత్తా_తయా పుంసి కథంవర్తితవ్యం ఇత్యతః భార్యాధికారికముచ్యతే" అని వ్యాఖ్య.

కన్యక వివాహమాడి పురుషునితో కూడగా భార్యయగు చున్నది. భార్యయైన ఆ స్త్రీ పురుషుని విషయమున ఎట్లు ప్రవర్తింపవలసియున్నదో తెలుపదగియున్నది గాన ఈ అధికరణము పుట్టినది. సూత్రమిది.

సూ॥ భార్యా ఏకచారిణీ గూఢ విశ్రంభా దేవవత్పతి మానుకూల్యేనవర్తేత.

భార్య రెండు విధములుగ నున్నది. ఏకచారిణి యనియు, సపత్నికయనియు. తానొక్కతయే తన పురుషునకు భార్యయై యున్న స్త్రీకి ఏకచారిణి యనిపేరు. తాను గాక తన పురుషునకు తన వలెనే ఇతరులు గూడ భార్యలుగానుండు నట్టివనిత సపత్నిక. ఈ రెండు విధములగు భార్యల యందును ఏకచారిణి ప్రధాన నాయిక యగును. కావున ఆ ప్రాధాన్యము ననుసరించి ఈ అధ్యాయమునందు ఏకచారిణీ వృత్తము చెప్పబడినది. భార్యయగు స్త్రీ జాతి రత్నమువలె నుండవలెను అననేమి? తక్కిన నాయికల వలె కపట వ్యవహారములేక గూఢమగు విశ్వాసము కలదియై భర్తను దేవునివలె నెంచి ఆతనికి అనుకూలవతియై ప్రవర్తించవలెను "భర్తాతు దేవతా స్త్రీ ణాం" అను న్యాయమును ప్రవర్తింపజేయుటే భార్యకు కర్తవ్యము. ఆతని శరీర పోషణాదికమును గురించి చెప్పిన విషయము

తరువాతది ఆమె ప్రవర్తించవలసిన వృత్తము. అనగా నడవడిక. భారత నారీమణి కిది యొక అమూల్యమును, అపూర్వమునగు దివ్యాభరణము. నా భ యొక్క శరీరగతిని పోషణను మాత్రము నేను చూచుకొనుచుంటినని తృప్తి ప టతో ఆమె కర్తవ్యము నెరవేరదు.

సూ. (2) తన్మతేన కుటుంబ చింతామాత్మని సంనివేశయేత్

భర్తచేత అనుజ్ఞాతయై కుటుంబ సంబంధములగు వస్తువులను గురిం కూడ విచారించుట చాల ముఖ్యమగు కర్తవ్యము. అనగా గృహము నందుండ

వస్తువులను సంగ్రహించుకొనవలెను. అవి తన స్వాధీనము నందుంచుకొనవలెను. ఆ యా దేశ కాలముల ననుసరించి చేయవలెను. తరువాతది గృహము నెట్లుంచవలె ననునది ప్రశ్న. నేడీ విషయములను బోధించుట కొాక డిపార్టుమెంటును ఏర్పరచినది మన గవర్నమెంటు. నాడు స్త్రీలకు కొన్ని శతకములు పాఠ్య గ్రంథములుగ యుండెడివి. శతక సాహిత్యమున కుమారీ శతకమొక అమూల్యమగు శతకరత్నము. ప్రకృతమునకు వ_త్తము. గృహము నిట్లుంచవలెనట.

సూ. వేశ్మ చ శుచి సుసంమృష్టస్థానం విరచిత వివిధ కుసుమం
సుసంశ్లక్ష్ణభూమితలం హృద్యదర్శనం త్రిషవణాచరిత బలికర్మ
పూజిత దేవతాయతనం కుర్యాత్

గృహిణి యని స్త్రీకి పేరు. గృహపతియని పురుషునకు పేరు. కావున స్త్రీ గృహము నెట్లుంచవలెనో చెప్పినారు సూత్రకారులు

చూచు వారలకు చూడముచ్చటయై యుండునట్లుంచవలెనట. ఎట్లుంచిన ఇల్లు చూడముచ్చటయై యుండును? ఇల్లును సమతలముగ నుంచవలెనట. మిట్ట పల్లములతో చూచువారలకు ఏహ్యముగ నుండకూడదట. చక్కగ చిమ్మి అలికి ముగ్గుల పెట్టవలెనట. ముగ్గులు పెట్టుట అది యొక కళ. మూడు పూటల యందును ఆ గృహమున దేవతా పూజల నలుపుచుండవలెనట. అగరు ధూపములతో దేవతల పూజించగా గృహమున దుర్వాసన లెట్లుండును? గృహ దేవతల లోని వారే అతిధులు కూడ. దేవతాధి పూజల నల్పుట గృహిణికి కర్తవ్యము. అందు ప్రత్యేకముగ దేవతా గృహము అలంకరణోపేతమగుట ఇందు చెప్పబడినది.

ఈ విషయమును మహా భారత అరణ్య పర్వమున ద్రౌపది సత్యభామకు హిత బోధను చేయు ఘట్టమున వర్ణింపబడినది. ద్రౌపదిని సత్యభామ నీ భర్తలైదుగురను నీ గుప్పెట యందుంచుకొంటివి. మంత్ర మహిమయా? ఓషధీ ప్రభావమా? అని అడిగినది. అవి హేతువులు కావని చెప్పి భర్త మనస్సును రంజింప జేయు పద్ధతులను బోధించినది ద్రౌపది. ఆమె మొదటి మాట ఇది.

క. పతి మనసు నాచికొని యెడు,
చతురోపాయంబు నీకు జలజాక్షి సుని
శ్చితమతి జెప్పెద వినుమూ
ర్జితమును ధర్మాన్వితము సుశీలంబును గాన్

అని తన నిత్య విధులను వర్ణించి చెప్పినది. అందొక పద్యమిది.

చ. తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన భోజనక్రియల్
దగనొడ గూర్చు భర్తలకు ధాన్య ధనింబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వ నెప్పుడు గృహ స్థల భాండ విశోధనంబు
లిమ్ముగ నొకనాడు నేమర బ్రమోదము సల్పుదుబంధుకోటికిన్

మనసూత్రకారుల సూత్రమిది.

సూ. గురుషు భృత్యవర్గేషు
నాయక భగినీషు తత్పతిషు చ యథార్హం ప్రతిపత్తిః

గృహమును చిత్తాకర్షణగ చేసికొన్న తరువాత గృహ కార్యములందు పాలు పంచుకొనువారగు అత్తమామలును, బావమరదులును, ఆడుబిడ్డలును తనకు వ్యతిరేకము కాకుండునట్లు వారికి చూపుపూజ్య భావములచూపి, తన వైపుకు వారిని మళ్ళించుకొనుటకు ప్రయత్నించుట చాల అవసరము.

నాయకుని మనస్తత్వమును తెలుసుకొని చరించుట తెలియని స్త్రీలకు కుటుంబ కలహములు తప్పవు. ఈ సూత్రములను అధునాతన సిద్ధాంతములనే దృష్టి యందుంచుకొని వినుచో నేటి యువతుల కివి చాద స్తములై కన్పట్టవచ్చును. ప్రస్తుతము నందలి యువతీ మణులకే వరుల మనస్తత్వమును తెలుసుకొనలేని స్థితిగతులు అనుభవమున కన్పించుచున్నది. ఒకరి మనసుల నొకరు గుర్తించలేక స్త్రీలు ఈనాడు పడుచున్న బాధలను రాజ్యాంగ చట్టములు తొలగించలే వనుమాట త్రికాల సత్యము. ఏనాటికైనను భారతీయ సిద్ధాంత సూక్తులే మీకు శాంతి భిక్షను పెట్టును. ప్రకృతమునకు వత్తును.

తరువాత గృహావరణమునందు పెంచదగు వృక్ష జాతిని గురించి వాత్స్యాయనుడు చెప్పినాడు.

సూ. పరిపూతేషు చ హరిత శాక వప్రాన్ ఇక్షు స్తంభాన్
జీరక సర్షపాజమోద శతపుష్పా తమాలగుల్మాంశ్చ కారయేత్

గృహిణి తన పవిత్ర గృహావరణమున కొత్తిమెర, అల్లము మున్నగు హరిత వర్గము యొక్కయు, పాలంకి మున్నగు శాకవర్గము యొక్కయును మడులను ఏర్పరచుకొనవలయునట. చెరుకుగడలను నాటవలయునట. జీలకర్ర ఆవాలు,

ఆజామోదము, శతపుష్ప, తమాల మున్నగు వాటిని పెంచుకొనవలెనట. ఆజా మోదమనియే ఆ ఓషధికి పేరు. అంతేకాదట.

సూ. కుబ్జ కామలక మల్లికా జాతీ కురంటక నవమాలికా తగర
నంద్యావర్తక జపాగుల్మాన్, అన్యాంశ్చ బహుపుష్పాన్ బాలకోశీరక
పాతాళికాంశ్చ వృక్షవాటికాయాం చ స్థండిలాని మనోజ్ఞాని కారయేత్

ఉశీరిక చెట్లు, మల్లెపొదలు, విరజాజులు, మందారలు మొదలగు పుష్ప జాతులను వృక్ష వాటికల యందు నాటవలెనట. నిర్గంధ కుసుమములను నాటుట కాదు. గడ్డిపూలను పూయించుట నేటి విధానమైనది.

వాస్తు శాస్త్ర విజ్ఞానము కూడ స్త్రీలకు అవసరమట. ఆవరణ మధ్యమున దిగుడు బావిని, గుంటల త్రవ్వించి సరస్సులను, నూతులను గూడ ఏర్పరచుట స్త్రీ కర్తవ్యమట. వీట్లయందు దేనినైన ఏర్పరచుకొనవచ్చును.

సూ. మధ్యే కూపం వాపీం దీర్ఘికాం వా కారయేత్

నలు పలకలుగ ఉండునది పుష్కరిణి దీర్ఘ చతురస్రముగ నుండునది దీర్ఘిక. తరువాత కుల స్త్రీలు ఎవరితో స్నేహము చేయరాదో చెప్పినాడు. ఇది చాల అవసరమగు మాట.

సూ. భిక్షుకీ శ్రమణా క్షపణా కులటా కుహ కేక్షణికా మూలకారికాభి
ర్నసం సృజ్యేత

ఇంటింటను భిక్షము నెత్తుకొను స్త్రీ భిక్షుకి. బౌద్ధమత ప్రచారము చేయుచు బిచ్చ మెత్తుకొను ఆడుది శ్రమణ, కావిరంగు గుడ్డల కట్టుకొని తిరిగెడిది క్షపణ. వ్యభిచార స్త్రీ కులట. హాస్యపు మాటల చెప్పి నవ్వించునది కుహక. సోది చెప్పునది విప్రశ్నిక. వశీకరణమునకై వేరులు యిచ్చుచు తిరుగువారు మూలకారికలు. ఇట్టి స్త్రీలతో కులసతి ఎన్నడును స్నేహము చేయరాదట. కారణమేమి? "భర్తు ర్వికల్ప హేతుత్వాత్" భర్తకు అనుమానము కలుగును కావున.

మరియొక ప్రధానమగు బాధ్యత కూడ స్త్రీకి యున్నది.

సూ. భోజనే.చ రుచితమిదమస్మై ద్వేష్యమిదమపథ్యమిద
మితి చ విద్యాత్ త్యాగోపాదానార్థమ్

భర్త భోజనము చేయుటను గుర్తెరిగి ఆతనికేపదార్థములు హితములు? ఏ పదార్థములు ఇష్టము లేనివి? ఏ పదార్థములు ఆతని శరీరతత్వమునకు బలవర్ధక

ములు॥ అను విషయమును కనుగొనవలెను. "భోజ్యేతు మాతా" అను మాటకు అర్థ మిదియే. ఇది ఇట్లుండ ఎన్నడును అలంకారములు లేక భర్త దగ్గరకు పోగూడదు కూడ. అనగా భర్తకు విరక్తి కలుగు వేషముతో భర్త ఎదుట నిలువ రాదని అర్థము. ముక్కులకు చెవులకు ఆభరణములను తీసి ఉండకూడదు.

"నాయకస్య న విముక్తభూషణం విజనే సందర్శనే తిష్ఠేత్

కాని మరి భర్త నడవడిక సరిలేకున్న ఏమి చేయవలెనట ?

సూ. అతి వ్యయం ఆసద్వ్యయం వాకుర్వాణం రహసి బోధయేత్

ఎక్కువ ఖర్చు దారగుచో గాని, దుర్వ్యయమును చేయుచో గాని రహస్యముగా బోధించుట చాల అవసరమట.

మరి స్త్రీ తానెక్కడికైన విలాసముగ వెళ్ళవచ్చునా॥ నట్టింటనే కట్టుబడి యుండవలెనా ?

"ఆవాహే వరగృహె వివాహె కన్యాగృహే గోష్ఠిం సంభూయ

పాన భోజనం దేవతాభిగమనం ద్రష్టుమనుజ్ఞాతా కురానత్

వివాహాది కార్యములకు గాని, దేవతా ఉత్సవాదులకు గాని వెళ్ళునప్పుడు భర్త అనుజ్ఞను తీసికొనుట అవసరము.

నాయకుని అనురాగము తొలగకుండుటకై చెప్పిన విధానము లివ్వి. సేవ్య సేవక భావమే ఇందు ప్రధానము. ఉద్యోగముల యందైనను ఇంతియే గదా ? భక్తి శాస్త్రమును ఇదియే. ఇక్కడ భర్తను రంజింపచేయు విధానమే అచ్చట భగవంతుని రంజింపచేయు పద్ధతి.

వంట యింటి నెట్లుంచవలెనో వాత్స్యాయనుడు చెప్పినాడు ఏకచారిణికి.

"మహానసం చ సుగుప్తం స్యాద్దర్శనీయం చ"

వంట యిల్లు గుప్తముగ యుండవలెనట. చూడ ముచ్చటైె యుండవలెనట.

ఒకవేళ భర్తను గట్టిగ మందలించవలసి వచ్చుచో ఏకాంతముగానైనను లేక ఆతని స్నేహితుల మధ్య యందైనను మృదు పూర్వకముగా భాషింపవలయును గాని కటువుగ మాట్లాడరాదట. అనగా నేమి? మూలచ్ఛేదముగ మాట్లాడ రాదని భావము.

"సాధిక్షేపవచనంత్వేనం మిత్రజనమధ్యస్థం ఏకాకినం వా

ప్యుపాలభేత న చ మూలకారికా స్యాత్

చూచితిరా, భారత నారీమణుల కిచ్చిన క్రమశిక్షణ ఎట్టిదో? ఈ క్రమశిక్షణకు వేరొక రంగును పులిమి స్త్రీల కుండవగు స్వేచ్ఛను అరికట్టిరని నుడువుచు భారతీయ పవిత్ర సంసారముల మంట కలుపు ప్రయత్నము నేడు కొనసాగుచున్నది. మరికొన్ని విషయములను చెప్పి ముగింతును. విసుగు పడకుడు.

ఎవ్వరికైన వేషభాషలు చాల ముఖ్యములు. అట్టివే సంచరించదగు ప్రదేశములు కూడ. ఎవ్వరేయే ప్రదేశము లందెక్కువగ తిరుగాద కూడదో నిలువ కూడదోకూడ నియమించుట క్రమశిక్షణలోనిది కాకపోదు. ప్రస్తుతమున ఏకచారిణి ఎక్కడెక్కడ నిలువకూడదో ఏయే వేళల ఏయే దుస్తుల ధరించవలెనో కూడ ఈ అధ్యాయము బోధించినది.

దుర్వ్యాహృతం దుర్నిరీక్షితమన్యతోమంత్రణం ద్వారదేశావస్థానం
నిరీక్షణం వా నిష్కుటేషు మంత్రణం వివిక్తేషు చిరమవస్థానం
మితివర్జయేత్

ఏకచారిణియగు గృహిణి దురాలోచనలకు తావివ్వకూడదు. దుష్టులతో ఆలోచించరాదు. కన్నుల నురిమి భర్తను చూడరాదు. చూపులయందు ప్రసన్నత, మాటలయందుతీపి, మనసునందు నిర్మలత అనునవి గృహలక్ష్మికి లక్ష్మిస్థానములు. నాయకుడు ప్రేమతో పల్కరింపగా పెడమొగము పెట్టుట అతనికి విరక్తి కారణమని గుర్తెరుగుట అవసరము. వాకిలి గుమ్మము వద్ద నిలుచుట కూడ మంచిది కాదు. అవసరాపసరముల గుర్తెరిగి నిలువవలెను వీధిలోనికి మాటి మాటికి తొంగి చూచుట, ఇంటికి వెనుకప్రక్క నుండెడి తోటలో ఎక్కువ కాలమును గడుపుట, శూన్యాగారముల నిలుచుట పనికి రాదనినారు. ఇక స్త్రీ అలంకరణ విషయమును చెప్పెదను. అలంకరణకే వేషమను మరియొక నామము. భర్తను రంజింపచేయు అలంకరణమునకు ఆభిగామిక వేషమని పేరు. మిగిలినది వైహారిక వేషము. అనగా బయటకు పోవునప్పు డలంకరించుకొను అలంకారము. ఈ అలంకరణములు రెండును ఇందు వర్ణించబడినవి,

సూ. బహుభూషణం వివిధకుసుమానులేపనం
వివిధాంగరాగసముజ్జ్వలం నానావర్ణం వాస
ఇత్యాభిగామికో వేషః॥

"ప్రతనుశ్లక్ష్ణాల్పదుకూలతా పరిమితమాభరణం
సుగంధితా నాత్యుల్బణమనులేపనం తథా శుక్లా
న్యన్యాని పుష్పాణీతి వైహారికో వేషః

భర్తను గవయునప్పుడు మనోరంజకములగునట్టి విచిత్రచిత్రా భరణముల ధరించుటయు, చిత్రవిచిత్ర కుసుమధారణయు, చందనాది సుగంధద్రవ్య వినియోగమును మైపూతతో శరీరమును రంజకమగునట్లు చేసుకొనుటయు, ఆయా దేశ కాలములను బట్టిన రంగు రంగుల వస్త్రముల ధరించుటయు చేయుట యుక్తము. ఇది ఆభిగామిక వేషము. ఇక వైహారిక వేషమును వినుడు.

ఆకృతి యందంత గొప్పది గాని పట్టు పుట్టము కట్టి, కొద్ది ఆభరణముల ధరించి, చూచువారికి దృగ్గోచరముగాని అనులేపనమును ధరించి (అనులేపనమన నేడు రాచుకొను స్నో మొదలగు అంగరాగ ద్రవ్య విశేషము) అత్యావశ్యకము లగు రంగు రంగుల పూవుల ధరించుట వైహారిక వేషము. అనగా నేమి? చూచు వారికి మనో వికారమును కల్పించని దుస్తులను ధరించుట ఈ అలంకరణలోని విశేషము. భర్త మనసును రంజింపచేయుట మొదటి వేషములోని విశేషము. వస్త్ర ధారణము కాలానుగుణ్యమనినాడు వ్యాఖ్యాత.

"కాలవశా ద్యద్య ద్విరాజతే వర్ణత స్తత్తదుపాదేయం"

ద్రవ్య సంచయమెట్లు చేయవలెనో కూడ గృహ చర్యగా చెప్పినాడు. ఆ ద్రవ్యములను రక్షించదగు పాత్రలను చెప్పినాడు.

"మృద్విదల కాష్ఠ చర్మ లోహ భాండానాం చ
కాలే సమర్ఘ గ్రహణం
"తథా లవణ స్నేహయోశ్చ గంధ ద్రవ్య కీటక భాండాగ
ధానాం చ దుర్లభానాం భవనేషు ప్రచ్ఛన్న విధానం

గృహిణియగు స్త్రీ దాచదగు పదార్థములకు అర్హములగు పాత్రలను ముందు సంపాదించుకొనవలెను. అందు కొన్ని మట్టిపాత్రలు అనగా బానలు మొదలైనవి. వెదురుతో అల్లబడిన బుట్టలు, తట్టలు, మంచములు, పీటలు, నేతిసిద్దెలు మొదలగు చర్మ నిర్మిత పాత్రలు. రాగి, వెండి, సీసము, తగరము, ఇనుము మొదలగు పాత్రలు. ఇవన్నియు పదార్థ రక్షకములకై సంపాదింపవలెను.

అట్లే పదార్థములను కూడ కూడబెట్టవలెను. ఆ పదార్థము లివ్వి. లవణ ములు. లవణమన ఉప్పు. మనము కూరలలో వాడుకొనునది మాత్రమే కాదు. ఔషధములకు పనికివచ్చు నట్టి లవణము లున్నవి. సౌవర్చల, సైంధవ, బిడాల, లవణములును, అట్లే స్నేహ ద్రవ్యములు అనగా నేయి, నూనె, వస, మజ్జ మున్నగునవి. సుగంధ ద్రవ్యములు. చందనము, అగరు, కస్తూరి మొదలగునవి. కొన్ని ఓషధీ ద్రవ్యములను కూడ దాచవలెను. ఈ ఓషధులను కటుకములనినాడు సూత్రకారుడు. ఈ ఓషధులను ఎవ్వరికిని కనబడకుండ గృహావరణమున పెంచ వలెనట. ఆ ఓషధుల పేర్లను కూడ ఇచ్చినాడు.

"మూలకాలుక పాలకీ దమనకామ్రాతకై ర్వారుక త్రపుస
వార్తాక కూష్మాండాలాబు శూరణ శుకనాసా స్వయంగుప్తా
తిలపర్ణికాగ్నిమంథ లశున పలాండు ప్రభృతీనాం సర్వౌషధీనాం చ
బీజ గ్రహణం కాలేవాపశ్చ

ముల్లంగి, సొరచెట్టు, అందుగుచెట్టు, దవనము, అంబాలపుచెట్టు, ములు దోస, వంగచెట్లు, కంద, తెల్లఅవిశె, దూలగొండి, గుమ్మడి, బూడిదగుమ్మడి, వెల్లుల్లి, నీరుల్లి మొదలగు ఓషధులను చెప్పినాడు. ఇవి తిను బండారములు కూడ. గృహిణులు చేయదగు ఒక ప్రత్యేక ఆచరణను చెప్పినాడు చూడుడు.

"సాంవత్సరికమాయం సంఖ్యాయ తదనురూపం వ్యయం కుర్యాత్

సంవత్సరమున కెంత ద్రవ్యము కావలెనో లెక్కించుకొని దానిని సంగ్ర హించి, దానికి తగినట్లు నిత్య వ్యయమును చేయవలెనట.

నేను చెప్పు ఈ ప్రాచీన సంప్రదాయములను వినుటకు మీరు విసుగు చెందు చుండిరని నేను భావించుట లేదు.

సారతరములగు విషయములనే నేను ఏరి చెప్పుచుంటినే గాని పాటవలె వరుసగ చెప్పుటలేదు.

ప్రస్తుతము నేనొక విషయమును మీరు దృష్టి యందుంచుకొనుచో స్త్రీలకు భారతదేశ మెంత ప్రత్యేకత నొసంగినదో మీకు తెలియును. నేనీ చెప్పబోవు సూత్రములోని విషయము లన్నియు స్త్రీ కర్తవ్యములే నట.

"భోజనావశిష్టాద్గోరసాత్ సారగ్రహణం తథా తైలగుడయోః

కార్పాసస్య చ సూత్రకర్తనం సూత్రవ్యవాసం శిక్య రజ్జు పాశ వల్కల సంగ్రహణం కుట్టన కండనావేక్షణం అచామమండ తుష కణగుహ్యాంగా

రాణాముపయోజనం భృత్యవేతన భరణ జ్ఞానం కృషి పశుపాలనచింతా వాహనవిధానయోగాః మేష కుక్కుట లావక శారికా పరభృత మయూర వానర మృగాణామవేక్షణం దైవసికాయవ్యయ పిండీకరణ మితి చ విద్యాత్

ఏవియైన కొన్ని సమారాధనలు జరుగగా మిగిలిన పాలనుండి నేయివి తీయుట. అవాలు, నువ్వులు, మున్నగు చమురు వస్తువులనుండి చమురులను సిద్ధముచేసి నిల్వ చేసికొనుట, చెరుకు పానకము నుండి తయారు చేయదగు చక్కెరను తయారు చేసికొనుట, ప్రత్తిని పండించుకొని, దాని వలన వస్త్రముల తయారు చేయించుకొనుట, ఉట్లు తయారుచేసికొని, భాండము లను రక్షించుకొనుట, మార్జాలాది బాధలు గలుగకుండ చేసికొనుట, పలుపులు, పగ్గములు తయారు చేయించుకొనుట (పశువులకు) వడ్లదంపునందు వచ్చు పూక మొదలగు వాటిని వాడుకొనుట, భృత్యులు మొదలగు వారి జీతములను లెక్కించి పంచుట, వ్యవసాయశాఖ నంతను భరించుట, వాటి విధానములను తెలిసికొనుట, పశువులకు వచ్చు వ్యాధులను కనుగొని చికిత్స చేయించుట, అశ్వపాలన, దంతి పాలనములనే గాక, పక్షిజాతులను పెంచుట, క్రీడా మృగములను అన్న పానాది కము చేత రక్షించుట ఇదంతయు ఏకచారిణి కృత్యమేనని నిర్ణయించినారు వాత్స్యాయనులు.

భారతదేశము స్త్రీకి ఇవ్వని అధికార మేమియో మీరే గ్రహించుకొనుడు. నేడు ఓట్ల కొరకై రాజకీయ నాయకులు చెప్పు మాటలు మీకు కర్ణరసాయనములు కావచ్చును. ఈనా ప్రాచీనాచారముల ప్రబోధము కర్ణ కఠోరమగుట కూడ కావ చ్చును. కాని మీరు మెరుపు తీగెలకు చోటివ్వక సూర్య తేజమునకు స్థానమిచ్చిన దేశము ముందుకు నడచును.

మరొక్క ముఖ్యమగు విషయము.

నాయకమిత్రాణాంచ స్రగనులేపన తాంబూల దానైః పూజనం

న్యాయతః" శ్వశ్రూ శ్వశుర పరిచర్యా తత్పారతంత్ర్యమనుత్తరవాదితా పరిమితా ప్రచండాలాపకరణమనుచ్చైర్హాసః" తత్ప్రియాప్రియేషు స్వప్రియాప్రియేష్వవృత్తిః భోగేష్వనుత్సేకః పరిజనేదాక్షిణ్యం నాయకస్యానివేద్య న కస్మైచిద్దానం, స్వకర్మసు భృత్య జన నియమనం ఉత్సవేషు చ అస్య పూజనం ఇత్యేకచారిణీవృత్తమ్

గుణమును శీలమునుచూచి, వయస్సును కనిపెట్టి అత్యాచారములకు వశము గాక తన భర్త యొక్క మిత్రుల యెడల న్యాయము ననుసరించి పూవులు మొదలగు వాటిని ఒసంగి పరిచయము గావించుకొనుట, మర్యాదనుచేయుట, అత్తమామలకు పరిచర్యల నొనర్చుట, వారి అనుమతితోడనే సమస్త కార్యముల నెరవేర్చుట. వారి ఎదుట పరిమితముగను మాటాడుట, నవ్వు మొగముతోడ పలుకుట, భర్తకు ఇష్టులైన వారి తోడనే తానును ఇష్టురాలై యుండుట, భర్తకు ద్వేష్యులగు వారితోటి తానును అయిష్టతతో నుండుట, భోగముల యందత్యంతానక్తి లేకుండుట, ఏయే భృత్యులు ఎట్టి పనుల కర్హులో విమర్శించుకొని వారి వారి కటువంటి పనులనే పనులనే వప్పచెప్పుట, పండుగలు మొదలగు ఉత్సవములలో వారి వారికి తగినట్లు తిన ఈపిని చూపుట తన యింటనున్న చినిగిన వస్త్రములను గాని, కట్టి వదలిన వస్త్రములను గాని శుభ్రపరచి సేవకులకు ఇచ్చుట మొదలగు కృత్యము లన్నియు ఏకచారిణీ కృత్యములేనట. భారతమున ద్రౌపది మాటలను మీకు వినిపింతును. ఈ సూత్రముల కనుగుణ్యములయ్యే ఆ పద్యములున్నవి. ఆంధ్ర భాషా ప్రవేశము గల యువతులకు పనికి వచ్చునని ఆ పద్యములను కూడ మీరు వినిపించుచుంటిని.

క. పతి మనసు నాచికొని యెడు
చతురోపాయంబు నీకు జలజాక్షి సుని
శ్చితమతి జెప్పెద వినుమూ,
ర్జితమును ధర్మాన్వితము సుశీలంబుగాన్

క..............నిత్యము సన్మ
గ్భావము ప్రేమంబు వెరవు భక్తియు బ్రియముం
గావింపుము నీ ప్రియునెడ
భావము దానెరిగి భర్త బాగుగ మరగున్

భర్త మనస్సును రంజింపజేయదగు విధానమట ద్రౌపది చెప్పినది. ఇంతంటె మన శాస్త్రకారు మెక్కుడున్నది ?

చ. పతికి ననుంగులైన తగుబంధుల మిత్రుల భోజనాది స
త్కృతముల నాదరించుచు నకృత్రిమ భక్తిని యుక్తి సంతతో
త్థితమతి మైచరింపుము తదీయ హితేతర వృత్తులైన వా
రతివ భవత్సుహృజ్జనంబులైనను గైకొనకుండు మెప్పుడున్

ఇంతవరకిది ధర్మప్రబోధము. ఆమె సత్యభామకు తన గృహ నిర్వహణను గురించి కూడ చెప్పిన దానిని చెప్పెదను. అందుండియు కొన్ని పద్యముల విని పించి, ఈనాటి ఉపన్యాసములోని ఈ విషయము నెక్కడ నుండి ఎందుకు విస్త రించితినో చెప్పెదను.

చ. తగియెడు వేళలందు నియతంబుగ మజ్జన భోజన క్రియల్
దగనొడగూర్తు భర్తలకు ధాన్య ధనంబులు రిత్తమై వ్యయం
బగుటకు నోర్వనెప్పుడు గృహ స్థల భాండ విశోధనంబులి
మ్ముగ నొకనాడు నేమర ప్రమోదము నల్పుదు బంధుకోటికిన్

ఆ. వేగజాము గలుగవెడ నిద్రబొందుదు
గాని రాజ్యభారకార్యయుక్తి
నబ్బయన నాకు నాహార నిద్రల
కెడయులేదు సువ్వె యెల్లప్రొద్దు

వ. మరియు ధర్మరాజు నగరియందు కనకమణిమయ భూషణాలంకృతు లయిన పరిచారకులు నూరువేలు రేయును పగలును పాత్రహస్తులై అభ్యాగత భోజనంబు లొడగూర్చువారు కలరు. వీరెల్ల ఇట్టిట్టి మెలకువ మెలంగుదురని తత్కృతాకృతంబులు నేన ఎరుంగుదు.

ప్రతి దిన విహితంబులైన ఆయ వ్యయంబులు నా యెరుంగని యవియు లేవు. గోపాల జనంబులు తుదిగా గల సకల భృత్య జనంబుల జీవితంబుల నరసియేన నడుపుదు అనినది.

ప్రకృతమునకు వత్తము.

సీతను రాముడు ప్రేమించుట సీతలోని గుణ సంపదయని వాల్మీకి రెండః కారణమును తెలుపగా ఏకచారిణుల కర్తవ్యములను నెరవేర్చి సీతారాముని మన స్సును కైవశము గావించుకొని స్వాధీనపతికయైనదని చెప్పుటకీ విషయములను చెప్పినాను.

రూప గుణము తరువాతది సౌందర్యము, గుణా ద్రూప గుణాచ్చాపి, అని నారు మహర్షి. సీత సౌందర్యమును గురించి చెప్పెడి·దేమున్నది ?

కావున రాముని ప్రీతి సీతయందు దిన దిన ప్రవర్ధమానమైనది రాముడే సీతయై సీతయే రాముడై వర్ధిల్లినారు దాంపత్య ప్రేమకు ఆదర్శముగ.

ఇప్పుడు మన మయోధ్య నేమనుకొందము? అయోధ్య వైకుంఠము. సీతా రాములు లక్ష్మీనారాయణులు. మన శరీరము అయోధ్య. వైదిక సంస్కారము గల మన విశుద్ధ బుద్ధి సీత. మాయా వచ్ఛిన్న జీవచైతన్య రాముడు.

తయా సరాజర్షి సుతోఽభిరామయా
సమేయివా ను త్తమరాజకన్యయా
అతీవ రామశ్శుశు భేతికామయా
విభుశ్శ్రియా విష్ణురివామరేశ్వరః

వాల్మీకి మహాశయులు నాటి సీతారాములను నేడు మన కన్నుల ఎదుటబెట్టి, అయోధ్యను చూపి, ఆయోధ్యయె వైకుంఠమనినారు.

భారతదేశము నందలి మానవుల దాంపత్యము కేవల భౌతిక దృక్పథము ననే లేదు. ఇంటింట నున్న భార్యాభర్తలు పార్వతీ పరమేశ్వరుల ప్రతిబింబములు లేక సీతారాముల ప్రతిబింబములు. కాక లక్ష్మీనారాయణుల ప్రతిబింబములు భగవంతుని ప్రతిబింబ భూతమీ జగత్తని భారతీయ పురాణేతిహాస కావ్య ప్రపంచము ప్రవచించును. చావు పుట్టుకలతో కొట్టుమిట్టాడుచు ఈదరాని సంసారమును ఈది బయట పడదలచిన జీవుల నుద్ధరించదలచినదే రామ కథా నౌకయని వాల్మీకి చాటినారు. ఇంతటితో మన బాలకాండ ఉపన్యాసములు ముగిసినవి. కాని నాకీ నాడొక ప్రత్యేక సంకల్పము కలిగినది.

ఆపదోద్ధారక స్తోత్రము సర్వానర్థ నివృత్తి మూలకము. అది ఆపదామ పహర్తారం అను శ్లోకములోని ఆద్యక్షరములతో రామచరిత్రంతయు కలసి వచ్చునట్లు నిర్మితమైన స్తోత్రరాజము. ఆ స్తోత్ర పఠనముతో ఈనాటి ఉపన్యాసమును ముగింతును. ప్రతి వారును ఈ స్తోత్ర పారాయణము నిట్లు చేసుకొనవచ్చును.

అస్యశ్రీ ఆపదుద్ధారక స్తోత్రస్య। వసిష్ఠోభగవాన్ ఋషిః। అనుష్టుప్ఛందః శ్రీరామచంద్రోదేవతా। శ్రీంబీజం। రాంశక్తిః మం కీలకం శ్రీరామచంద్ర ప్రసాద సిధ్యర్థేవినియోగః

ధ్యానం

"ఆర్తానా మార్తి హంతారం భీతానాం భయనాశనం
ద్విషతాం కాలదండంచ రామచంద్రం నమామ్యహం

"ఆపదామపహర్తారం దాతారం సర్వ సంపదామ్
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహం

[1] ఆ. పన్న జనరక్షైక దీక్షయామిత తేజసే
నమోస్తు విష్ణవే తుభ్యం రామాయా పన్నివారిణే॥

ఇది మొదటి శ్లోకము. ప్రతి శ్లోకముయొక్క చివర, ఆపదామపహర్తారం అను శ్లోకమును చదువవలెను.

[2] ప దాం భోజరజస్స్పర్శ పవిత్రముని యోషితే
నమోస్తు సీతాపతయే రామాయా పన్నివారిణే॥ ఆపదా

[3] దా నవేంద్ర మహామత్త గజపంచా స్యరూపిణే
నమోస్తు రఘునాధాయ రామాయాపన్నివారిణే॥

(4) మ హిజా కుచనం లగ్న కుంకుమారుణ వక్షసే
నమః కళ్యాణ రూపాయ రామాయపన్నివారిణే॥ ఆపదా

[5] ప ద్మ సంభవ భూతేశముని సంస్తుత కీర్తయే
నమో మార్తాండ వంశాయ రామాయపన్నివారిణే॥ ఆపదా

[6] హ త్యార్తించ లోకానాం యోవా మధునిషూదనః
నమోస్తుహరయే తుభ్యం రామాయాపన్నివారిణే॥ ఆపదా

[7] తా పకారణ సంసార గజసింహ స్వరూపిణే
నమో వేదాంత వేద్యాయ రామాయాపన్నివారిణే॥ ఆపదా

[8] రం గత్తరంగ జలధి గర్వహృచ్ఛర ధారిణే
నమః ప్రతాప రామాయ రామాయాపన్నివారిణే॥ ఆపదా

[9] దా రాసహిత చంద్రావ, తంసధ్యాత స్వమూర్తయే
నమ స్సత్య స్వరూపాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[10] తా రానాయక సంకాశ ఛదనాయ మహౌజసే
నమోస్తు తాటకా హంత్రే రామాయాపన్నివారిణే॥ ఆపదా

[11] ర మ్యసానుల సచ్చిత్ర కూటాశ్రమ విహారిణే
నమస్సౌమిత్ర సేవ్యాయ రామాయాపన్నివారిణే॥ ఆపదా

[12] స ర్వ దేవహితా సక్తదశానన వినాశినే
నమః కలుష సంహర్త్రే రామాయా పన్నివారిణే॥ ఆపదా

[13] ర త్నసానునివాసైక వంద్యపాదాంబుజాయచ
నమస్త్రైలోక్యనాథాయ రామాయాపన్నివారిణే॥ ఆపదా

[14] సం సారబంధ మోక్షైక హేతునామ ప్రకాశినే
నమః కలుషసంహర్త్రే రామాయా పన్నివారిణే॥ ఆపదా

[15] ప పనాళుగ సంక్షిప్త మారీచాది సురారయే
నమో మఖ పరిత్రాత్రే రామాయా పన్నివారిణే॥ ఆపదా

[16] దాం బికేతర భక్తౌఘ మహదానందదాయినే
నమః కమలనేత్రాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[ 7] లో కత్రయో ద్వేగకర కుంభకర్ణ శిరశ్ఛిదే
నమోభీషణ రూపాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[18] కా కాసురైక నయన హరల్లీలాస్త్ర ధారిణే
నమో భక్తైక వంద్యాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[19] భి క్షు రూప సమాక్రాంత బలివర్యైక సంపదే
నమో వామన రూపాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[20] రా జీవనేత్ర సుస్పంద రుచిరాంగ సురోచిషే
నమః కైవల్య నిధయే రామాయా పన్నివారిణే॥ ఆచదా

[21] మం దమారుత సంవీత మందార మృదు వాసినే
నమః పల్లవ హస్తాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[22] శ్రీ కంఠచాపదళనధురీణ బల బాహవే
నమస్సీతాను షక్తాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[23] రా జరాజ సుహృద్యోషార్చిత మంగళ మూర్తయే
నమ ఇక్ష్వాకు వంశాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[24] మం జులా ధర్మ వి ప్రేక్షణోత్సుకైక విలాసినే
నమః పోషిత భక్తాయ రామాయా పన్నివారిణే।। ఆపదా

[25] భూ రిభూ ధర కోదండ మూ ర్తిజ్ఞేయ స్వరూపిణే
నమః ప్రతాప రూపాయ రామాయా పన్నివారిణే।। ఆపదా

[26] యో గీంద్ర హృత్సరోజాత మధుపాయ మహాత్మనే
నమో రాజాధిరాజాయ రామాయా పన్నివారిణే॥ ఆపదా

[27] భూ వరాహ స్వరూపాయ నమోభూతి ప్రదాయినే
నమః కోమలదేహాయ రామాయా పన్నివారిణే।। ఆపదా

[28] యో షాంజలి వినిర్ము క్తలాజాంచితవపుష్మతే
నమస్సౌందర్య నిధయే రామాయా పన్నివారిణే।। ఆపదా

[29] న ఖకోటి వినిర్భిన్న దైత్యాధిపతి వక్షసే
నమో నృసింహ రూపాయ రామాయా పన్నివారిణే।। ఆపదా

[30] మా యామానుషదేహాయ వేదోద్ధరణ హేతవే
నమోస్తు మత్స్య రూపాయ రామాయా పన్నివారిణే॥

[31] మి తశూన్య మహాదివ్య మహిమ్నేమానితాత్మనే
నమోబ్రహ్మ స్వరూపాయ రామాయా పన్నివారిణే॥ అపదా

[32] అహం కారేతర జనస్వాంత సౌధ విహారిణే
నమోస్తు చిత్స్వ రూపాయ రామాయా పన్నివారిణే॥ ఆసదా

[33] "సీతా లక్ష్మణసం శోభి పార్శ్వాయ పరమాత్మనే
నమః పట్టాభిషిక్తాయ రామాయా పన్నివారిణే"।। ఆపదా

[34] "ఇమం స్తవం భగవతః పఠేద్యః ప్రీతమానసః
ప్రభాతేవా ప్రదోషేవా రామస్య పరమాత్మనః।।

[35] "సతు తీర్త్వా భవాంబోధి మాపదస్సకలాఅపి
రామసా యుజ్యమాప్నోతి దేవదేవ ప్రసాదితః।।

[36] "కారా గృహాది బాధా సుసంప్రాప్తే బహు సంకటే
ఆ పన్ని వారకం స్తోత్రం పఠేద్యస్తు యథా విధి।।

[37] సంయోజ్యానుష్టుభం మంత్ర మనుశ్లోకం స్మరన్విభుః
సప్తాహం సర్వబాధేభ్యో ముచ్యతే నాత్ర సంశయః॥

[38] "ద్వాత్రింశద్వారజపతః ప్రత్యహం సుదృఢ వ్రతః
వైశాఖేభాను మాలోక్య ప్రత్యహం శత సంఖ్యయా॥

[39] "ధనేన ధనద ప్రఖ్యాం లభతేనాత్ర సంశయః
బహూనాత్రకి ముక్తేన యం యం కామయతే నరః॥

[40] "తంతం కామమవాప్నోతి స్తోత్రేణానేన మానవః
యంత్ర పూజా విధానేన జపహోమాది తర్పణైః॥

[41] "యస్తుకుర్వీత సహసా సర్వాన్ కామాన వాప్నుయాత్
ఇహ లోకే సుఖీభూత్వాపరే ముక్తో భవిష్యతి॥ ఆపద

ఇది అగస్త్యసం హితాయాం ఉమామహేశ్వర సంవాదే
ఆపదుద్దారక స్తోత్ర పఠనం నామ ఏకత్రింశోధ్యాయః

ఇది స్తోత్రము దీనిని జపమువలె చేయక బయటకు బిగ్గరగా చేయవలెను స్తోత్రము లన్నియు అంతియే.

మనకీ నాటి యుపన్యాసము ముగిసినది. అయోధ్యకాండ రేపు ప్రారంభింప బడును.

ధర్మస్యజయోస్తు
అధర్మస్యనాశోస్తు
విశ్వస్య కళ్యాణమస్తు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

www.mohanpublications.com

# మోహన్ పబ్లికేషన్స్‌లో లభించు

# పుస్తకముల పట్టిక

(Book List)

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద, మంత్రశాస్త్రాది
అనేక విషయాలు తెలుసుకోండి...

ఫేస్‌బుక్ **మోహన్ పబ్లికేషన్స్** పేజ్ లైక్ చేయండి.

Like us to follow :

**MOHAN PUBLICATIONS**

Rajamahendravaram




0883 - 246 2565
903 246 2565

MOHAN PUBLICATIONS

# మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదుట, కోటగుమ్మం, రాజమహేంద్రవరం - 533101.

WWW.MOHANPUBLICATIONS.COM

## మావద్ద లభించు గ్రంథములు

### 1. వ్రతకథలు - పూజలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ వినాయక వ్రతం | వెల రూ.10-00 |
| 2. | శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం | 30-00 |
| 3. | శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో) | 10-00 |
| 4. | సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం | 30-00 |
| 5. | వరలక్ష్మీ వ్రతం | 10-00 |
| 6. | కేదారేశ్వర వ్రతం | 10-00 |
| 7. | త్రినాధ వ్రతం(కలర్) | 10-00 |
| 8. | త్రినాధవ్రతం(సాదా) | 5-00 |
| 9. | క్షీరాబ్ది వ్రతం | 12-00 |
| 10. | మంగళ గౌరీవ్రతం | 10-00 |
| 11. | వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో | 25-00 |
| 12. | శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో) | 25-00 |
| 13. | కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో) | 25-00 |
| 14. | సంతోషీమాతా వ్రతం | 25-00 |
| 15. | ఏడు శనివారాల వ్రతం | 25-00 |
| 16. | సత్యనారాయణవ్రతం | 25-00 |
| 17. | శ్రీ సువర్చలాహనుమద్దీక్ష | 30-00 |
| 18. | శివదీక్ష | 10-00 |
| 19. | కాత్యాయనీ వ్రతం | 20-00 |
| 20. | సౌభాగ్య గౌరీవ్రతం | 20-00 |
| 21. | తిరుప్పావై (ధనుర్మాసవ్రతం) | 36-00 |
| 22. | స్త్రీల వ్రతకథలు | 36-00 |
| 23. | స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి (నేదునూరిగంగాధరరావుగారి) | 54-00 |
| 24. | పెళ్ళి పాటలు - స్త్రీలపాటలు (కామేశ్వరిపాటతో) | 36-00 |
| 25. | సర్వదేవతా పూజావిధానం | 25-00 |
| 26. | ఆరువ్రతాలు | 30-00 |
| 27. | రాహుకాలంలోదుర్గాదేవీపూజా | 10-00 |

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

| | | |
|---|---|---|
| 28. | తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు | 10-00 |
| 29. | శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్ | 36-00 |
| 30. | శ్రీచక్ర పూజావిధానం(పెద్దది) | 36-00 |
| 31. | లక్ష్మీ - గౌరీ నిత్యపూజ | 10-00 |
| 32. | శ్రీ సరస్వతీ నిత్యపూజ | 10-00 |
| 33. | శ్రీ దుర్గానిత్యపూజ | 10-00 |
| 34. | కాలభైరవ నిత్యపూజ | 10-00 |
| 35. | శివపూజ | 10-00 |
| 36. | వీరభద్ర పూజ | 10-00 |
| 37. | ఆంజనేయ నిత్యపూజ | 10-00 |
| 38. | నాగేంద్ర స్వామి పూజ | 10-00 |
| 39. | సుబ్రహ్మణ్య నిత్యపూజ | 10-00 |
| 40. | రామదేవుని కథ | 10-00 |
| 41. | శివదేవుని కథ | 10-00 |
| 42. | లక్ష్మీనరసింహపూజ | 10-00 |
| 43. | వేంకటేశ్వరపూజ | 10-00 |
| 44. | బ్రహ్మంగారి నిత్యపూజ | 10-00 |
| 45. | సూర్య నిత్యపూజ | 10-00 |
| 46. | నవగ్రహ నిత్యపూజ | 10-00 |
| 47. | రుక్మిణీ కల్యాణం | 25-00 |
| 48. | ఉమామహేశ్వర వ్రతం | 36-00 |
| 49. | శ్రీ కామేశ్వరీ వ్రతం | 36-00 |
| 50. | 16 సోమవారముల వ్రతము | 25-00 |
| 51. | పార్వతీకల్యాణం | 25-00 |
| 52. | సహస్రకమలవర్తి వ్రతము | 25-00 |
| 53. | పంచముఖ ఆంజనేయ పూజావిధానము | 36-00 |
| 54. | అష్టనాగపూజ | 36-00 |
| 55. | పూజలు ఎందుకుచేయాలి ? | 36-00 |
| 56. | ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి? | 36-00 |
| 57. | ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి? | 36-00 |
| 58. | ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి? | 36-00 |
| 59. | ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ? | 36-00 |
| 60. | హనుమద్ వ్రతం | 36-00 |
| 61. | పంచాయతన పూజ | 63-00 |
| 62. | 28 వ్రతములు | 120-00 |

| | | |
|---|---|---|
| 63. | కలశపూజలు (9ఒకేసారి) | 150-00 |
| 64. | కలశపూజలు (విడివిడిగా) (ప్రింటులో) | .... |
| 65. | హ్రీంకార మహాయజ్ఞం (ప్రింటులో) | .... |
| 66. | గోమాత | 40-00 |

## 2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు<br>పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం | 45-00 |
| 2. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,, | 50-00 |
| 3. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,, | 50-00 |
| 4. | స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్) | 99-00 |
| 5. | లలితావిష్ణు (కేస్ బైండ్) 1/8 డెమ్మి | 63-00 |
| 6. | స్థూలాక్షరీ లలితావిష్ణు (క్రౌన్‌సైజు)కేస్‌బైండ్ | 108-00 |
| 7. | సర్వదేవతా స్తోత్రమంజరి | 120-00 |
| 8. | సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63) | 24-00 |
| 9. | విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్) | 25-00 |
| 10. | లలితా సహస్రనామ స్తోత్రమ్ (క్రౌన్) | 36-00 |
| 11. | లలితా సహస్రనామములు | 24-00 |
| 12. | లక్ష్మీ సహస్రనామములు | 24-00 |
| 13. | దుర్గా సహస్రనామములు | 24-00 |
| 14. | ఆంజనేయ సహస్రనామములు | 24-00 |
| 15. | శివ సహస్రనామములు | 24-00 |
| 16. | విష్ణు సహస్రనామములు | 24-00 |
| 17. | గణపతి సహస్రనామములు | 24-00 |
| 18. | సుబ్రహ్మణ్య సహస్రనామములు | 24-00 |
| 19. | గాయత్రి సహస్రనామములు | 24-00 |
| 20. | లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు | 24-00 |
| 21. | శ్రీరామా సహస్రనామములు | 24-00 |
| 22. | సరస్వతి సహస్రనామములు | 24-00 |
| 23. | సూర్యసహస్రనామములు & ఆదిత్యహృదయం | 24-00 |
| 24. | శ్రీవేంకటేశ్వరసహస్రనామములు | 24-00 |
| 25. | మణిద్వీపవర్ణన (పెద్దది) | 24-00 |
| 26. | సంధ్యావందనం | 24-00 |
| 27. | మంత్రపుష్పమ్ | .... |
| 28. | త్రిభాషా హనుమాన్‌చాలీసా | 15-00 |
| 29. | హనుమాన్ చాలీసా | 10-00 |

| | | |
|---|---|---|
| 30. | మణిద్వీపవర్ణన (పాకెట్) | 10-00 |
| 31. | ఆరు చాలీసాలు | 10-00 |
| 32. | శివారాధన (శివస్తోత్రాలు) | 10-00 |
| 33. | వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్) | 10-00 |
| 34. | ఆరుదండకాలు | 5-00 |
| 35. | వేంకటేశ్వర గోవిందనామములు | 5-00 |
| 36. | అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్ | 10-00 |
| 37. | దేవీఖడ్గమాలాస్తోత్రమ్ (మహిషాసురమర్దనీస్తోత్రంతో) | 10-00 |
| 38. | సుందరకాండ (పాకెట్) | 10-00 |
| 39. | భగవద్గీత మూలం | 27-00 |
| 40. | రామరక్షాస్తోత్రమ్ | 15-00 |
| 41. | స్తోత్ర రత్నావళి | 36-00 |
| 42. | పురాణపండ లలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 43. | పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్(మినీ) | 10-00 |
| 44. | పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్ | 10-00 |
| 45. | పురాణపండ ఆదిత్య హృదయం | 10-00 |
| 46. | మంత్రపుష్పం (మినీ) | 10-00 |
| 47. | శివానందలహరి-సౌందర్యలహరి | 36-00 |
| 48. | కుజదోషం | 10-00 |
| 49. | కాలసర్ప దోషం | 10-00 |
| 50. | మీ అప్పులు తీరాలా? | 10-00 |
| 51. | దృష్టిదోషాలు నివారణ | 10-00 |
| 52. | పంచసూక్తములు | 10-00 |
| 53. | సంధ్యావందనం | 10-00 |
| 54. | రుద్రనమకమ్-చమకమ్ | 10-00 |
| 55. | గాయత్రీమంత్రాలు | 10-00 |
| 56. | హయగ్రీవ స్తోత్రమాల | 10-00 |
| 57. | దక్షిణామూర్తి స్తోత్రమాల | 10-00 |
| 58. | ద్వాదశ జ్యోతిర్లింగాలు - పంచారామాలతో | 10-00 |
| 59. | శ్రీసూక్తం పురుష సూక్తం | 10-00 |
| 60. | నవగ్రహస్తోత్రమాల | 36-00 |
| 61. | మహాన్యాసమ్ | 36-00 |
| 62. | సుందరకాండ గానామృతం | 36-00 |
| 63. | గోమాతపూజావిధానము | 10-00 |
| 64. | ఆనందసిద్ధి - 1 శ్రీదేవీ స్తోత్రమాల | 108-00 |

| | | |
|---|---|---|
| 65. | ఆనందసిద్ధి - 2 ఏ సమస్యకు ఏ స్తోత్రమ్ పారాయణచేయాలి | 108-00 |
| 66. | ఆనందసిద్ధి-3 మానసదేవీ స్తోత్రమాల | 108-00 |
| 67. | శ్రీ కాలభైరవ రక్షా కవచమ్ | 63-00 |
| 68. | అర్చన | 40-00 |
| 69. | నిత్యదేవతార్చన | 40-00 |
| 70. | సర్వదేవతా స్తోత్ర నిధి | 99-00 |
| 71. | శ్రీచక్ర నవవరణార్చన | 63-00 |
| 72. | చండీ సప్తశతి పారాయణ క్రమం | 99-00 |
| 73. | శ్రీదేవి స్తోత్ర రత్నావళి 32 దేవి స్తోత్రాలకు తాత్పర్యంతో | 99-00 |
| 74. | వనదుర్గా మంత్రానుష్ఠాన క్రమమ్ | 63-00 |
| 75. | శ్రీ కాలభైరవ వ్రతము | 63-00 |

## 3. శ్రీ సాయి దత్త గ్రంథములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ సాయిబాబా సచ్ఛరిత్ర | 120-00 |
| 2. | సంపూర్ణ శ్రీ గురు చరిత్ర | 120-00 |
| 3. | శ్రీ సాయిఆరాధన-షిర్డివైభవం | 120-00 |
| 4. | శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్) | 63-00 |
| 5. | శ్రీ గురుచరిత్ర (క్రౌన్) | 63-00 |
| 6. | నవనాధ చరిత్ర | 99-00 |
| 7. | శ్రీసాయిచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 8. | శ్రీగురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం | 63-00 |
| 9. | సత్యదత్తవ్రతం దత్తాత్రేయపూజాకల్పం,సహస్రంతో | 30-00 |
| 10. | అనఘాదేవీ వ్రతం | 30-00 |
| 11. | భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు | 30-00 |
| 12. | శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో) | 25-00 |
| 13. | శ్రీ సాయిభజనమాల | 20-00 |
| 14. | శ్రీ సాయి భజన్స్ | 20-00 |
| 15. | శ్రీ సాయిభక్తి గీతాలు | 20-00 |
| 16. | శిరిడిహారతులు (భావంతో) | 20-00 |
| 17. | "శ్రీసాయి"కోటి | 27-00 |
| 18. | "శ్రీసాయిరామ్"కోటి | 20-00 |
| 19. | శ్రీ సాయినాథ స్తోత్రమంజరి | 10-00 |
| 20. | శ్రీ సాయివేయినామాలు | 8-00 |
| 21. | శ్రీ సాయి హారతులు (పాకెట్) | 15-00 |
| 22. | శ్రీ సాయి స్తవనమంజరి | 10-00 |
| 23. | హిందీ శ్రీ సాయి హారతులు | 15-00 |

| | | |
|---|---|---|
| 24. | శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం | 63-00 |
| 25. | ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు | 15-00 |
| 26. | షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం | 99-00 |
| 27. | సాయిసత్యవ్రతం | 30-00 |
| 28. | సాయి అనుగ్రహమ్ | 120-00 |
| 29. | నవగురువారాల వ్రతకల్పము | 15-00 |
| 30. | శ్రీదత్తలీలామృతము | 99-00 |
| 31. | హృదయంలో సాయి | 15-00 |
| 32. | శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్ఛరిత్ర) | 120-00 |
| 33. | గజాననమహరాజ్ చరిత్ర | 99-00 |

## 4. జ్యోతిషాలు

| | | |
|---|---|---|
| 1. | 'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ) | 72-00 |
| 2. | గ్రహభూమి పంచాంగము (గార్గేయ) | 108.00 |
| 3. | ఆనందసిద్ధి పంచాంగం (వై.వి.శాస్త్రి) | 63.00 |
| 4. | ములుగు వారి రాశిఫలితాలు (12రాశులువారికి) | 50.00 |
| 5. | ములుగు వారి రాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి | 12.00 |
| 6. | కాలచక్రంజ్యోతిషక్యాలండర్ | 25.00 |
| 7. | గ్రహబలం క్యాలండర్ (శ్రీనివాసగార్గేయ-భక్తిటివి) | 25.00 |
| 8. | శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్ | 25.00 |
| 9. | సాదా క్యాలండర్ | 5.00 |
| 10. | పాకెట్ క్యాలండర్ | 15.00 |
| 11. | తాజకనీలకంఠీయమ్ | 100-00 |
| 12. | కేరళ జ్యోతిష రహస్యాలు | 180-00 |
| 13. | జ్యోతిష బ్రహ్మ రహస్యాలు | 180-00 |
| 14. | మానసాగరి జాతకపద్ధతి | 180-00 |
| 15. | వరాహమిహిర జాతకపద్ధతి | 180-00 |
| 16. | వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు | 99-00 |
| 17. | సింపుల్ రెమిడీస్ | 180-00 |
| 18. | శంభు హోరప్రకాశిక | 250-00 |
| 19. | పూర్వ పరాశరి | 100-00 |
| 20. | పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం | 200-00 |
| 21. | ప్రశ్న సింధు | 99-00 |
| 22. | నక్షత్ర విశేష ఫలితాలు | 63-00 |
| 23. | సూర్యసిద్ధాంతపంచాంగగణితంచేయడంఎలా? | 180-00 |
| 24. | దృక్సిద్ధాంతపంచాంగగణితం చేయడంఎలా? | 180-00 |

| | | |
|---|---|---|
| 25. | ఆయుర్దాయ నిర్ణయం | 63-00 |
| 26. | జాతక గణిత ప్రవేశిక | 63-00 |
| 27. | జ్యోతిషమర్మబోధిని | 63-00 |
| 28. | జ్యోతిష ప్రశ్నోత్తరమాల | 63-00 |
| 29. | ముహూర్తం నిర్ణయించడంఎలా? | 63-00 |
| 30. | జాతక మకరందం | 63-00 |
| 31. | జ్యోతిష సరస్వతి | 63-00 |
| 32. | మీజననకాల విశేషాలు | 63-00 |
| 33. | ముహూర్త విజ్ఞాన భాస్కరం | 63-00 |
| 34. | జ్యోతిష స్వయంబోధిని | 63-00 |
| 35. | శుభముహూర్త శిరోమణి | 63-00 |
| 36. | నక్షత్ర ఫలమంజరి | 36-00 |
| 37. | పంచాంగం చూసే విధానం | 36-00 |
| 38. | సర్వార్థ జ్యోతిషం | 36-00 |
| 39. | ప్రాథమిక జ్యోతిషం | 36-00 |
| 40. | నవరత్నములు శుభయోగములు | 36-00 |
| 41. | శుభశకునాలు | 30-00 |
| 42. | హస్తరేఖాఫలితాలు | 36-00 |
| 43. | సంఖ్యల్లో భవిష్యత్ | 36-00 |
| 44. | ముహూర్త దీపిక | 99-00 |
| 45. | పుట్టుమచ్చలు ఫలితాలు | 30-00 |
| 46. | కలలు ఫలితాలు | 30-00 |
| 47. | జాతక చక్రం వేయడం ఎలా? | 36-00 |
| 48. | మానసాగరి (ప్రాచీనజ్యోతిషగ్రంథం) -పుచ్చాశ్రీనివాసరావు | 250-00 |
| 49. | జ్యోతిషశాస్త్ర చిట్కాలు | 120-00 |
| 50. | గుప్తా శతాబ్ధి పంచాంగం (1940-2050) | 999-00 |
| 51. | ప్రశ్నచండేశ్వరమ్ | 63-00 |
| 52. | ద్వాదశభావ ఫలచంద్రిక | 250-00 |
| 53. | జ్యోతిష శతయోగరత్నావళి (నూరుయోగాలఫలితాలు) | 120-00 |
| 54. | అంగసాముద్రికం | 36-00 |
| 55. | హస్త సాముద్రికం | 63-00 |
| 56. | లాల్ కితాబ్ | 99-00 |
| 57. | శకునశాస్త్రం | 63-00 |
| 58. | ఆధునికప్రశ్నశాస్త్రం | 120-00 |
| 59. | పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం | 180-00 |

| | | |
|---|---|---|
| 60. | అష్టకవర్గు (కొండపల్లి) | 63-00 |
| 61. | బృహత్‌జాతకం (ప్రాచీనప్రతికిపునర్ముద్రణ) | 250-00 |
| 62. | లగ్నరత్నాకరం | 63-00 |
| 63. | షట్పంచాశిక | 120-00 |
| 64. | 40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి | 270-00 |
| 65. | 40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి | 180-00 |
| 66. | 40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం | 180-00 |
| 67. | 40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు | 270-00 |
| 68. | 40 రోజుల్లో వైద్యజ్యోతిషం నేర్చుకోండి | 250-00 |
| 69. | మీ పుట్టినతేదీ అద్భుతరహస్యాలు (సాయిగణపతిరెడ్డి) | 270-00 |
| 70. | కె.పి.జ్యోతిషం (పరిచయం) | 63-00 |
| 71. | ముహూర్తచింతామణి | 99-00 |
| 72. | సూర్యచంద్ర గ్రహణములు | 63-00 |
| 73. | ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప) | 180-00 |
| 74. | అదృష్టరెమెడీస్ | 144-00 |
| 75. | గ్రహసంచార ఫలనిర్ణయదీపిక | 63-00 |
| 76. | జ్యోతిష రెమిడీస్ | 300-00 |
| 77. | జాతకమార్తాండం పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 78. | జ్యోతిషవిద్యాప్రకాశిక పాతప్రతికి యథాతథం (కొండపల్లి) | 250-00 |
| 79. | నాడీజ్యోతిషం | 63-00 |
| 80. | నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| 81. | లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య) | 63-00 |
| 82. | గౌతమసంహిత | 63-00 |
| 83. | హోరరత్నమాల | 63-00 |
| 84. | జాతకఫల మణిమంజరి | 200-00 |
| 85. | పుష్కర పంచాంగం (2013-14నుండి 2024-25) | 560-00 |
| 86. | దశాభుక్తిఫల నిర్ణయం | 250-00 |
| 87. | వింత జోష్యములు | 63-00 |
| 88. | షోడశవర్గులు | 200-00 |
| 89. | రవిగ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 90. | చంద్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 91. | కుజ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 92. | బుధ గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 93. | గురు గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 94. | శుక్ర గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |

| | |
|---|---|
| 95. శని గ్రహ సమస్త ప్రభావములు | 99-00 |
| 96. రాహు & కేతు గ్రహముల సమస్త ప్రభావములు | 99-00 |
| 97. ఆధునిక గ్రహములు-ఉపగ్రహములు సమస్త ప్రభావములు | 99-00 |
| 98. ముహూర్తమార్తాండం | 63-00 |
| 99. లఘుజాతకం | 63-00 |
| 100. జాతకాలంకారము | 63-00 |
| 101. మేషలగ్న ఫలితములు | 99-00 |
| 102. వృషభ లగ్న ఫలితములు | 99-00 |
| 103. మిధున లగ్న ఫలితములు | 99-00 |
| 104. కర్కాటక లగ్న ఫలితములు | 99-00 |
| 105. సింహలగ్న ఫలితములు | 99-00 |
| 106. కన్యలగ్న ఫలితములు | 99-00 |
| 107. తుల లగ్న ఫలితములు | 99-00 |
| 108. వృశ్చిక లగ్న ఫలితములు | 99-00 |
| 109. ధనుస్సు లగ్న ఫలితములు | 99-00 |
| 110. మకర లగ్న ఫలితములు | 99-00 |
| 111. కుంభ లగ్న ఫలితములు | 99-00 |
| 112. మీన లగ్న ఫలితములు | 99-00 |
| 113. నారద సంహిత | 200-00 |
| 114. పంచాంగపీఠికలేఖికాగణితం | 250-00 |
| 115. తారాబలం - చంద్రబలం (వేరే కొండప్ప) | 99-00 |
| 116. సులభలగ్న సాధన (చిత్రాలగురుమూర్తిగుప్తా) | 200-00 |
| 117. రాహు కేతువుల యోగము | 99-00 |
| 118. ఛాయాగ్రహములు | 99-00 |
| 119. జ్యోతిషవిజ్ఞాన దీపిక | 63-00 |

## బి.వి.రామన్ గారి గ్రంథములు

| | |
|---|---|
| 120. జ్యోతిష విద్యారంభం | 50-00 |
| 121 గ్రహభావ బలములు | 50-00 |
| 122. కాలచక్రదశ | 50-00 |
| 123. అనుభవ ప్రశ్నాజ్యోతిషం | 50-00 |
| 124. జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు | 50-00 |
| 125. పురోగామి జాతకం | 50-00 |
| 126. భావార్థరత్నాకరం | 75-00 |
| 127. భారతీయజ్యోతిష సర్వస్వం | 75-00 |
| 128. అష్టకవర్గ పద్ధతిః | 75-00 |

| | |
|---|---|
| 129. జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు | 75-00 |
| 130. ప్రశ్నతంత్ర | 75-00 |
| 131. ముహూర్తం | 75-00 |
| 132. విశిష్ట జాతకములు | 125-00 |
| 133. భారతీయఫలితజ్యోతిషం | 125-00 |
| 134. 300 ముఖ్యమైన యోగములు | 125-00 |
| 135. జాతకంపరిశీలించడంఎలా ? | 300-00 |

**రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి**
**శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు**

| | |
|---|---|
| 136. బృహత్పరాశరహోరాశాస్త్రము-1 | 200-00 |
| 137. బృహత్పరాశరహోరాశాస్త్రము-2 | 200-00 |
| 138. బృహత్పరాశరహోరాశాస్త్రము-3 | 200-00 |
| 139. బృహత్పరాశరహోరాశాస్త్రము-4 | 200-00 |
| 140. భావార్థరత్నాకరము | 100-00 |
| 141. ముహూర్త చింతామణి | 100-00 |
| 142. ముహుర్త చింతామణి-పార్టు2 | 200-00 |
| 143. స్వప్న శాస్త్రము | 36-00 |
| 144. శతయోగమంజరి | 50-00 |
| 145. వ్రతనిర్ణయకల్పవల్లి | 250-00 |
| 146. దైవజ్ఞవల్లభం | 75-00 |
| 147. వసంతరాజశకునమ్ (బృహత్శకునశాస్త్రం) | 250-00 |
| 148. వాస్తుశాస్త్రవివేకము-1 | 100-00 |
| 149. వాస్తుశాస్త్రవివేకము-2 | 200-00 |
| 150. వాస్తుశాస్త్రవివేకము-3 | 100-00 |
| 151. వాస్తుశాస్త్రవివేకము-4 | 200-00 |
| 152. అనుభవసులభవాస్తు - 1 | 50-00 |
| 153. అనుభవసులభవాస్తు - 2 | 100-00 |
| 154. పంచాంగ వివేకము | 99-00 |
| 155. వశిష్ఠ సంహిత | 360-00 |
| 156. పంచపక్షి శాస్త్రం (కేస్బైండ్) | 200-00 |

## 5. వాస్తులు

| | |
|---|---|
| 1. 40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి | 180-00 |
| 2. వాస్తుశాస్త్ర రహస్యములు | 200-00 |
| 3. వాస్తునుబట్టి మీ ఇల్లు | 63-00 |
| 4. మీరూ మీ వాస్తు | 63-00 |

| | | |
|---|---|---|
| 5. | గృహవాస్తు చిట్కాలు | 63-00 |
| 6. | వాస్తు పూజ | 63-00 |
| 7. | వాస్తు సూత్రములు | 63-00 |
| 8. | వాస్తుశాస్త్ర రహస్యాలు | 63-00 |
| 9. | గృహవాస్తు వర్గులు | 99-00 |
| 10. | విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు | 63-00 |
| 11. | విశ్వకర్మ వాస్తుశాస్త్రరీత్యా మీఇండ్లఆయములు | 99-00 |
| 12. | విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాలగురుమూర్తిగుప్తా) | 180-00 |
| 13. | ఆధునిక గృహవాస్తు | 99-00 |
| 14. | శుభవాస్తు | 270-00 |
| 15. | వాస్తుయంత్ర రత్నావళి | 120-00 |
| 16. | వాస్తుశాస్త్రం | 120-00 |
| 17. | హౌస్ ప్లాన్స్ | 63-00 |
| 18. | గృహనిర్మాణ వాస్తు | 63-00 |
| 19. | వాస్తు రెమెడీస్ | 63-00 |
| 20. | గృహవాస్తు దర్పణం | 63-00 |
| 21. | జ్యోతిష-గృహవాస్తుచంద్రిక | 200-00 |
| 22. | వాస్తురత్నాకరం (కొండపల్లి) | 63-00 |
| 23. | వాస్తుశిరోమణి ,, | 120-00 |
| 24. | వాస్తుసంగ్రహమ్ ,, | 63-00 |
| 25. | పంచవాస్తు పారిజాతం ,, | 120-00 |
| 26. | వాస్తుడిండిమమ్ ,, | 63-00 |
| 27. | వాస్తుదుందిభి ,, | 120-00 |
| 28. | విశ్వకర్మవాస్తుప్రకాశిక (కేస్‌బైండ్) | 250-00 |
| 29. | కృష్ణవాస్తుశాస్త్రము | 63-00 |
| 30. | జలవాస్తు,శల్యవాస్తు (దంతూరిపండరీనాథ్) | 99-00 |
| 31. | మయవాస్తు (గోరసవీరభద్రాచార్య) | 120-00 |
| 32. | వాస్తు జ్యోతి | 63-00 |
| 33. | మన ఇల్లు-మనవాస్తు | 99-00 |
| 34. | వాస్తవ వాస్తుపూజావిధానము | 108-00 |
| 35. | వాస్తు దర్పణం | 120-00 |

## 6. మంత్రశాస్త్రాలు

| | | |
|---|---|---|
| 1. | మంత్రసాధన | 63-00 |
| 2. | తంత్రజాలం | 63-00 |
| 3. | మంత్రశక్తి | 63-00 |

| | | |
|---|---|---|
| 4. | దత్తాత్రేయ తంత్రవిద్య | 63-00 |
| 5. | దత్తాత్రేయ మూలికాతంత్రమ్ | 63-00 |
| 6. | తాంత్రిక పంచాంగం | 63-00 |
| 7. | యక్షిణీ తంత్రం | 63-00 |
| 8. | మంత్రానుష్ఠాన చంద్రిక | 63-00 |
| 9. | సర్వదేవతా మంత్రకవచములు | 63-00 |
| 10. | మంత్రాక్షరాలరహస్యం (బీజాక్షరనిఘంటువు) | 63-00 |
| 11. | సర్వదేవతా మంత్రరత్నావళి | 63-00 |
| 12. | సదాచార దీపిక | 63-00 |
| 13. | యోగినీ-వామకేశ్వరతంత్రం | 63-00 |
| 14. | ప్రపంచసారతంత్రం | 63-00 |
| 15. | బదనిక తంత్రమ్ | 63-00 |
| 16. | ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్ | 63-00 |
| 17. | గుప్త సాధన తంత్రం | 63-00 |
| 18. | గంధర్వ తంత్రమ్ | 63-00 |
| 19. | సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి) | 63-00 |
| 20. | యంత్ర మంత్ర తంత్ర | 63-00 |
| 21. | పాశుపత తంత్రం | 99-00 |
| 22. | పంచదశ మహాఖడ్గ తంత్రం | 99-00 |
| 23. | రుద్రాష్టాధ్యాయః | 99-00 |
| 24. | మంత్రసిద్ధి | 120-00 |
| 25. | పరశురామతంత్రమ్ | 108-00 |
| 26. | శ్రీలలితావిలోమ పంచదశీ | 108-00 |
| 27. | శ్రీ గురు తంత్రం | 108-00 |
| 28. | గాయత్రీ తంత్రమ్ | 108-00 |
| 29. | మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు | 150-00 |
| 30. | శ్రీ దుర్గ తంత్రమ్ | 200-00 |
| 31. | మహామృత్యుంజయఅమృతపాశుపతమ్ | 200-00 |
| 32. | సర్ప (నాగ)తంత్రం | 250-00 |
| 33. | హవన తంత్రం | 250-00 |
| 34. | షోడశనిత్యతంత్రం | 250-00 |
| 35. | శాక్తేయతంత్రం | 250-00 |
| 36. | రుద్రయామళతంత్రం | 250-00 |
| 37. | లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 38. | హిరణ్యశూలినీ తంత్రమ్ | 250-00 |

| | | |
|---|---|---|
| 39. | మాయాప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 40. | శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్ | 250-00 |
| 41. | స్వర్ణాకర్షణభైరవతంత్రం | 250-00 |
| 42. | కాశీవిశాలాక్షి తంత్రం | 250-00 |
| 43. | శాంతితంత్రమ్ | 250-00 |
| 44. | యంత్రసిద్ధి | 360-00 |
| 45. | శ్రీ లక్ష్మీతంత్రమ్ | 360-00 |
| 46. | మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్) | 360-00 |
| 47. | మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్) | 360-00 |
| 48. | మంత్రశాస్త్రం (గ్రంథము) | 360-00 |
| 49. | ప్రత్యంగిరాకృత్యాతంత్రం | 360-00 |
| 50. | కామధేనువు తంత్రం | 360-00 |
| 51. | శూలినీదుర్గాతంత్రం | 360-00 |
| 52. | శ్రీవిద్య రహస్యం | 290-00 |
| 53. | కులార్ణవ తంత్రమ్ | 150-00 |
| 54. | ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం (ఒరిజనల్) | 390-00 |
| 55. | సిద్ధమూలిక రహస్యం (మంత్ర,యంత్రసహితం) | 63-00 |

## 7. గ్రంథాలు - ఆరాధనలు

| | | |
|---|---|---|
| 1. | భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం | 54-00 |
| 2. | భగవద్గీత (వచనం) | 99-00 |
| 3. | భగవద్గీత శ్లోకతాత్పర్యం-కేసుబైండింగ్ | 72-00 |
| 2. | గణేశ ఆరాధన 1 | 99-00 |
| 3. | గణేశోపాసన 2 | 99-00 |
| 4. | నవగ్రహావైభవం | 99-00 |
| 5. | నవగ్రహ రెమెడీస్ | 99-00 |
| 6. | నవగ్రహ వేదం | 99-00 |
| 7. | శనిగ్రహారాధన | 99-00 |
| 8. | ఆదిత్యారాధన | 99-00 |
| 9. | సుబ్రహ్మణ్యారాధన | 99-00 |
| 10. | శ్రీ శివ ఆరాధన | 99-00 |
| 11. | లక్ష్మీ ఆరాధన | 99-00 |
| 12. | హనుమదారాధన | 99-00 |
| 13. | లలితారాధన | 99-00 |
| 14. | శ్రీ చక్రారాధన | 99-00 |
| 15. | గాయత్రీ ఆరాధన | 99-00 |

| | | |
|---|---|---|
| 16. | వీరభద్రారాధన | 99-00 |
| 17. | కుజగ్రహారాధన | 99-00 |
| 18. | భైరవారాధన | 99-00 |
| 19. | దైవారాధన | 99-00 |
| 20. | గీతారాధన (భగవద్గీత శ్లోకతాత్పర్యసహిత) | 99-00 |
| 21. | శ్రీవేంకటేశ్వరాధన | 99-00 |
| 22. | హయగ్రీవారాధన | 99-00 |
| 23. | లక్ష్మీనరసింహారాధన | 99-00 |
| 24. | శ్రీ బాలాత్రిపురసుందరీ స్తోత్ర కదంబం | 99-00 |
| 25. | దేవీ లీలామృతం | 99-00 |
| 26. | పురాణపండ సుందరకాండ వచనం | 99-00 |
| 27. | పురాణపండ రామాయణం | 99-00 |
| 28. | పురాణపండ భారతం | 99-00 |
| 29. | పురాణపండ భాగవతం | 99-00 |
| 30. | (సూరి) వాల్మీకి రామాయణం | 99-00 |
| 31. | కాలసర్ప యోగం | 99-00 |
| 32. | నిత్య జీవితములో రుద్రాక్షలు | 99-00 |
| 33. | నిత్య జీవితములో నవరత్నాలు | 99-00 |
| 34. | వేదసూక్తములు | 99-00 |
| 35. | వేమన పద్యసారామృతం | 99-00 |
| 36. | పండగలు పర్వదినాలు | 99-00 |
| 37. | సూక్తిరత్నాలు | 99-00 |
| 38. | హనుమచ్చరిత్ర | 99-00 |
| 39. | నవగ్రహ దర్శనమ్ | 99-00 |
| 40. | నిత్యజీవితంలో నవగ్రహాలు | 99-00 |
| 41. | సాలగ్రామములు | 99-00 |
| 42. | గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ | 99-00 |
| 43. | శనిగ్రహరెమిడీస్ | 99-00 |
| 44. | జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని | 99-00 |
| 45. | వివాహజ్యోతిషమంజరి-మ్యారేజ్‌మ్యాచింగ్‌గైడ్ (సాయిగణపతిరెడ్డి) | 99-00 |
| 46. | మీపుట్టినతేదీనిబట్టి మీజీవితరహస్యాలు (న్యూమరాలజీ లైఫ్‌గైడ్) ,, | 99-00 |
| 47. | మీఅదృష్టానికి (పేరు) నేమ్‌కరక్షన్ ,, | 99-00 |
| 48. | న్యూమరాలజీ రెమిడీస్ | 99-00 |
| 49. | మూకపంచశతీ | 99-00 |
| 50. | శ్రీరామకర్ణామృతం | 99-00 |

| | | |
|---|---|---|
| 51. | రహస్యకుక్కుటశాస్త్రం | 300-00 |
| 52. | ఉపాసన విధానం | 99-00 |
| 53. | పంచమవేదం మహాభారతం | 99-00 |
| 54. | దేవుళ్ళు డాట్ కామ్ | 99-00 |
| 55. | గణపతిభాష్యం | 99-00 |
| 56. | యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి | 99-00 |
| 57. | నవయోగులు | 99-00 |
| 58. | ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు | 99-00 |
| 59. | సకలదేవతాఅష్టోత్తరాలు(పెద్దది)-(180అష్టోత్తరశతనామావళులతో) | 99-00 |
| 60. | సకలదేవతా అష్టోత్తరశతనామావళులు (కేస్‌బైండింగ్) | 216-00 |
| 61. | సకలదేవతా సహస్రనామములు | 99-00 |
| 62. | ఆధ్యాత్మిక సూక్తి నిధి | 99-00 |
| 63. | బ్రాహ్మణులు గోత్రాలు,ప్రవరలు | 99-00 |
| 64. | సర్వదేవతాస్వరూపుడు శ్రీ వేంకటేశ్వరుడు | 99-00 |
| 65. | శ్రీ లక్ష్మీసన్నిధి | 99-00 |
| 66. | శ్రీలక్ష్మీగణపతి హోమకల్పం | 99-00 |
| 67. | మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి) | 99-00 |
| 68. | మ్యాజిక్‌గైడ్ | 99-00 |
| 69. | చదరంగం | 99-00 |
| 70. | పంచముఖ హనుమత్ వైభవం | 63-00 |
| 71. | గరుడపురాణం | 40-00 |
| 72. | మాఘపురాణం | 36-00 |
| 73. | శివపురాణం | 36-00 |
| 74. | వైశాఖపురాణం | 36-00 |
| 75. | కార్తీక పురాణం | 36-00 |
| 76. | కార్తీక పురాణం (చిన్నది) | 25-00 |
| 77. | సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ | 63-00 |
| 78. | పెద్దబాలశిక్ష | 50-00 |
| 79. | గాయత్రీ మహిమ | 36-00 |
| 80. | వృక్షదేవతలు | 63-00 |
| 81. | యాజుష స్మార్త సంస్కార చంద్రిక | 200-00 |
| 82. | సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్ | 150-00 |
| 83. | చతుర్వేదములు | 120-00 |
| 84. | నవగ్రహారాధన | 120-00 |
| 85. | తాళపత్ర సమాహార గోపురం | 120-00 |
| 86. | మనుధర్మ శాస్త్రం (వచనంలో...) (కేస్‌బైండు) | 250-00 |

| | | |
|---|---|---|
| 87. మానవధర్మములు | | 120-00 |
| 88. వేదమంత్ర సంహిత | | 120-00 |
| 89. సహస్రలింగార్చన | | 120-00 |
| 90. శ్రీ శివగీత | | 120-00 |
| 91. ద్వాదశఉపనిషత్తులు | | 120-00 |
| 92. పురాణపండవారి సౌందర్యలహరి | (కేస్‌బైండ్) | 250-00 |
| (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో) | సాదా | 120-00 |
| 93. బృహత్ శివ స్తోత్ర రత్నాకరము | | 200-00 |
| 94. బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము | | 200-00 |
| 95. బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము | | 200-00 |
| 96. కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు | | 63-00 |
| 97. దక్షిణావృత శంఖములు | | 63-00 |
| 98. 108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని | | 36-00 |
| 99. ధర్మసింధువు(కేస్‌బైండింగ్) | | 270-00 |
| 100. భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని | | 99-00 |
| 101. చిలుకూరి బాలాజీచరిత్ర | | 36-00 |
| 102. భగవత్‌స్తుతి | | 63-00 |
| 103. సూర్యోపాసన | | 36-00 |
| 104. కాశీఖండం | | 250-00 |
| 105. దేవీభాగవతం | | 360-00 |
| 106. శ్రీ ఆంజనేయం | | 216-00 |
| 107. ధర్మసందేహాలు | | 216-00 |
| 108. ఆధ్యాత్మిక దైవిక వస్తువులు | | 250-00 |
| 109. రామాయణం | | 600-00 |
| 110. పోతన భాగవతం | | 900-00 |
| 111. శివమంత్రములు | | 63-00 |

## 8. వైద్య గ్రంథాలు

| | |
|---|---|
| 1. ఆహారం ఆరోగ్యం | 36-00 |
| 2. మూలికావైద్య చిట్కాలు | 36-00 |
| 3. ఆయుర్వేద వైద్య చిట్కాలు | 30-00 |
| 4. గృహవైద్య రహస్యాలు | 36-00 |
| 5. గృహవైద్యసారం | 36-00 |
| 6. హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స) | 63-00 |
| 7. ప్రకృతివైద్యం | 36-00 |
| 8. ఆహారం-వైద్యం | 99-00 |

| | | |
|---|---|---|
| 9. | సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం | 99-00 |
| 10. | ఆయుర్వేదమ్ | 36-00 |
| 11. | ఆయుర్వేద మూలికావైద్యదీపిక | 99-00 |
| 12. | దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు (వాడకం - ఉపయోగాలు) | 99-00 |
| 13. | ఏకమూలికావైద్యం | 99-00 |
| 14. | అష్టాంగ హృదయం (4భాగాలు) | 1200-00 |
| 15. | రహస్యసిద్ధయోగవైద్యసారమ్ | 99-00 |
| 16. | ప్రాథమిక హోమియోవైద్యం | 99-00 |
| 17. | ఒబెసిటి | 99-00 |
| 18. | హెల్త్‌గైడ్ | 99-00 |
| 19. | ఆయుర్వేదం-జీవనవేదం | 99-00 |
| 20. | ఫుడ్‌థెరపి | 63-00 |
| 21. | న్యాచురల్‌థెరపి | 99-00 |
| 22. | సంపూర్ణఆరోగ్యానికి 20ని॥ | 63-00 |
| 23. | కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే... | 99-00 |
| 24. | యోగామంత్ర | 63-00 |
| 25. | యోగా మండే టు సండే | 63-00 |
| 26. | హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే | 99-00 |
| 27. | హెల్త్‌ఫైల్ | 108-00 |
| 28. | వస్తుగుణపాఠం | 250-00 |
| 29. | రసాయన వాజీకరణ తంత్రం | 150-00 |
| 30. | వస్తుగుణ మకరందం | 400-00 |
| 31. | నాటువైద్యం -(కేస్‌బైండ్) | 360-00 |
| 32. | నాటువైద్యం (చిన్నది) | 99-00 |
| 33. | ప్రాణాయామము-యోగ | 63-00 |

## 9. అయ్యప్ప - భవానీ రకాలు

| | | |
|---|---|---|
| 1. | శ్రీ అయ్యప్ప లీలామృతం | 30-00 |
| 2. | శ్రీ అయ్యప్ప భజనపాటలు | 63-00 |
| 3. | శ్రీ అయ్యప్ప పూజాకల్పం | 20-00 |
| 4. | శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు | 20-00 |
| 5. | హారతిగైకొనుమా | 40-00 |
| 6. | శ్రీ అయ్యప్ప దీక్ష F | 10-00 |
| 7. | శ్రీ అయ్యప్ప భజనమాల F | 10-00 |
| 8. | శ్రీ అయ్యప్ప నిత్యపూజ P | 10-00 |

| | | |
|---|---|---|
| 9. | శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P | 10-00 |
| 10. | భవానీదీక్ష (శ్రీ భవానీ లీలామృతం) | 36-00 |
| 11. | దేవీలీలామృతం | 99-00 |
| 12. | శ్రీ దేవీ పూజాకల్పం | 20-00 |
| 13. | దేవీ భక్తిగీతాలు | 20-00 |
| 14. | భవానీదీక్ష P | 10-00 |
| 15. | దేవీ భక్తిమాల F | 10-00 |
| 16. | శ్రీ అయ్యప్ప భజనావళి | 120-00 |
| 17. | అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో) | 24-00 |

## 10. భజనలు - కీర్తనలు

| | | |
|---|---|---|
| 1. | అన్నమయ్య కీర్తనలు | 20-00 |
| 2. | శ్రీరామదాసు కీర్తనలు | 20-00 |
| 3. | సర్వదేవతా మంగళహారతులు | 20-00 |
| 4. | వసుంధర మంగళ హారతులు | 25-00 |
| 5. | సౌభాగ్య దేవతా మంగళహారతులు | 36-00 |
| 6. | సర్వదేవతా భజనలు | 36-00 |
| 7. | చిట్టి పొట్టి పాటలు | 10-00 |
| 8. | జాతీయ గీతాలు | 10-00 |
| 9. | దేశభక్తి గీతాలు | 36-00 |
| 10. | పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు | 36-00 |
| 11. | గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు | 36-00 |
| 12. | అన్నమయ్య సంకీర్తనలు | 99-00 |
| 13. | పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు | 36-00 |
| 14. | భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్) | 36-00 |
| 15. | సర్వదేవతాభక్తిమణిమాల | 36-00 |
| 16. | బతుకమ్మ ఉయ్యాల పాటలు | 36-00 |
| 17. | అన్నమయ్య సంకీర్తనానిధి(1000కీర్తనలు) | 270-00 |

## 11. హిట్స్ సాంగ్స్

| | | |
|---|---|---|
| 1. | ఘంటసాల భక్తిగీతాలు-భగవద్గీత | 36-00 |
| 2. | ఎస్.పి.బాలు భక్తిగీతాలు | 36-00 |
| 3. | ఘంటసాల సుమధురగీతాలు | 99-00 |
| 4. | పి. సుశీల సుమధురగీతాలు | 99-00 |

| | | |
|---|---|---|
| 5. | ఎస్.పి. బాలు సుమధురగీతాలు | 99-00 |
| 6. | ఎస్.జానకి సుమధురగీతాలు | 99-00 |
| 7. | వేటూరి సుందరరామమూర్తిహిట్స్ | 99-00 |
| 8. | సర్వదేవతా సినీభక్తిగీతాలు | 99-00 |

## 12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు

| | | |
|---|---|---|
| 1. | శ్రీకాంతామణి వంటలు (వెజ్) | 63-00 |
| 2. | శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్) | 63-00 |
| 3. | శాకాహార వంటలు | 30-00 |
| 4. | మాంసాహారవంటలు | 30-00 |
| 5. | చిట్టిచిట్కాలు | 30-00 |
| 6. | అందానికి చిట్కాలు | 30-00 |
| 7. | పిల్లల పేర్లు (పెద్దది) | 30-00 |
| 8. | పిల్లల పేర్లు (చిన్నది) | 10-00 |
| 9. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శాలీబోర్డర్స్ | 36-00 |
| 10. | లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్ | 36-00 |
| 11. | చిన్నారులకు చిరుతిళ్ళు | 30-00 |
| 12. | పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు | 30-00 |
| 13. | పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు | 30-00 |
| 14. | వేపుళ్ళు-ఇగుర్లు | 30-00 |
| 15. | బ్రేక్‌ఫాస్ట్ వంటలు | 30-00 |
| 16. | పండుగలలో చేసుకొనే పిండివంటలు | 30-00 |
| 17. | మైక్రోవేవెన్ వంటలు | 99-00 |
| 18. | సర్వదేవతాభక్తిమాల | 36-00 |
| 19. | పిల్లలపేర్లు (బాబు) | 36-00 |
| 20. | పిల్లలపేర్లు (పాప) | 36-00 |
| 21. | మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్) | 36-00 |
| 22. | మోడ్రన్ పిల్లలపేర్లు | 99-00 |
| 23. | నోరూరించే నాన్‌వెజ్‌వంటలు | 99-00 |
| 24. | మోడ్రన్ టైలరింగ్ (లేడీస్ & జంట్స్) | 99-00 |

## వివిధ రకాలు

| | |
|---|---|
| ఎందరోమహానుభావులు | 270-00 |
| యోగాసనాలు | 36-00 |
| సూర్యనమస్కారములు | 36-00 |
| పొడుపు కథలు (చిన్నవి) | 10-00 |

| | |
|---|---|
| హిందీ-తెలుగు-స్వబోధిని | 20-00 |
| ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని | 20-00 |
| జనరల్ నాలెడ్జ్ | 20-00 |
| నూరు ఎక్కాలు | 10-00 |
| 1-100 టేబుల్ బుక్ | 10-00 |
| 1-100 టేబుల్‌బుక్ (క్రౌన్‌సైజు) | 4-50 |
| శ్రీరామకోటి | 27-00 |
| శ్రీశివకోటి | 27-00 |
| మేజిక్ | 30-00 |
| అంకెలతో గారడీ | 30-00 |
| హృదయస్పందన (కవితలు) | 30-00 |
| వాత్స్యయన కామసూత్రాలు | 36-00 |
| ఎ.పి.టూరిస్ట్ గైడు | 36-00 |
| ఇంద్రజాల రహస్యాలు | 30-00 |
| మహేంద్రజాల రహస్యాలు | 30-00 |
| శరీరభాష (బాడీ లాంగ్వేజ్) | 99-00 |
| క్రియాయోగం | 36-00 |
| ఆనందంగా జీవిద్దాం | 99-00 |
| హరిశ్చంద్ర నాటకం | 50-00 |
| వాత్స్యాయనకామసూత్రాలు | 99-00 |
| పంచసాయకం | 99-00 |
| రతిరహస్యాలు | 99-00 |
| అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్) | 99-00 |
| గాయత్రీవిజ్ఞాన్ | 99-00 |
| చింతామణి (నాటకం) | 50-00 |
| బాలనాగమ్మ | 50-00 |
| కాళహస్తి స్త్రీల వ్రతకథలు | 36-00 |
| కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి) | 50-00 |
| కాళహస్తి గోవింద నామాల భగవద్గీత | 36-00 |
| కాళహస్తి గృహవాస్తు చింతామణి | 99-00 |
| కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు) | 63-00 |
| రామరాయవాస్తుశాస్త్రం(ముద్రగడరామారావు) | 90-00 |
| ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా | 10-00 |
| ఎం.ఎస్.ఆర్.సుందరకాండ | 80-00 |
| బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల) | 125-00 |
| శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం | 40-00 |

| | | |
|---|---|---|
| కాశీరామేశ్వర మజిలీ కథలు | | 63-00 |
| శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం) | | 600-00 |
| ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము-ఫలితజాతక సూత్రములు | | 595-00 |
| ముదుండి విశ్వనాథరాజుగారి గ్రంథములు | | |
| విశ్వకర్మ ప్రకాశము | | 80-00 |
| ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన | ,, | 250-00 |
| నారద సంహిత | ,, | 150-00 |
| వాస్తురాజవల్లభము-మూలానువాదము | ,, | 60-00 |
| మయమతము - వచనము | ,, | 80-00 |
| బృహత్సంహిత - వచనము | ,, | 160-00 |
| వాస్తువిజ్ఞానజ్యోతి | | ...... |
| పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య) | | .... |
| విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు | ,, | .... |
| వాస్తు విజ్ఞాన చంద్రిక | ,, | .... |
| మహాదశా పారిజాతం | ,, | .... |
| వాస్తు నారాయణీయం | ,, | 120-00 |
| యోగావళీఖండం | ,, | 120-00 |
| ముహూర్తసింధువు | | 150-00 |
| సర్వార్థచంద్రిక (4భాగాలు) | | 1208-00 |
| మీరే న్యూమరాలజిస్ట్ (దావూద్) | | 370-00 |
| నిర్ణయసింధు (2భాగాలు) | | 590-00 |
| సాయి... | ,, | 45-00 |
| శ్రీ దుర్గానందలహరి | ,, | 200-00 |
| ఆరతిసాయిబాబా | ,, | 11-00 |
| ప్రతిష్ఠకల్పః(సాగి నరసింహమూర్తి) | | 500-00 |
| తాజుద్దీన్‌బాబా సచ్చరిత్ర | | 100-00 |

**సుమారు 100 సం॥రాలునాటి ప్రాచీన ప్రతులు తిరిగి**
**ఈ క్రింది గ్రంథములు ప్రచురించబడినవి.**

| | |
|---|---|
| శ్రీరామ మంత్రానుష్ఠానము | 300-00 |
| శ్రీరామనవరాత్రోత్సవకల్పః | 300-00 |
| సీతారామ కథా సుధ అయోధ్యకాండ | 200-00 |
| సీతారామ కథా సుధ బాలకాండ | 150-00 |
| అరణ్యకాండ | 100-00 |
| శ్రాద్ధము ఎందుకు పెట్టాలి ? షోడశ సంస్కారములు | 200-00 |
| స్మార్త కాపర్ది కారికలు | 200-00 |
| నపుంసక సంజీవనము, వైద్య శిరోమణి | 200-00 |
| విషవైద్య చింతామణి | 200-00 |

| | |
|---|---|
| హేమాద్రి సూరిణా ప్రాయశ్చిత్తాధ్యాయః | 300-00 |
| సర్వమూలికా గుణరత్నాకరం | 300-00 |
| ఆపస్థంబీయ ధర్మసూత్రాలు | 300-00 |
| సర్వశాంతి దర్పణం - అపర ప్రయోగ దర్పణం | 200-00 |
| గణకరంజని | 200-00 |
| సంతాన దీపిక | 200-00 |
| తిధినిర్ణయ కాణ్డః | 250-00 |
| ముహూర్త దర్పణం | 200-00 |
| జ్యోతిష శాస్త్ర రత్నము (శ్రీపతిజాతక పద్ధతి) | 250-00 |
| లఘుతాచకము | 200-00 |
| శ్రీ వైఖనస పైతృమేధిక ప్రయోగః | 300-00 |
| స్మృతి రత్నాకరము (ధర్మశాస్త్రం) | 400-00 |
| జాతకామృతతసారం | 300-00 |
| జాతక బోధిని | 300-00 |
| సంగీత విద్యాదర్పణం | 300-00 |
| సంగీత సర్వార్థసారసంగ్రహం | 300-00 |
| ముహూర్త మార్తాండం(టీకతాత్పర్యం) | 450-00 |
| జాతకరహస్యం | 200-00 |
| రాజమార్తాండం | 200-00 |
| ఆయుర్దాయదీపిక | 200-00 |
| వైద్యామృతం | 200-00 |
| అనుపానమంజరీ | 200-00 |
| నవగ్రహశాంతి విధానం-ఉదకశాంతి విధిః | 200-00 |
| చికిత్సరత్నము | 200-00 |
| స్వరచింతామణి | 200-00 |
| ద్వాదశలోహ భస్మవిధానం | 200-00 |
| దైవజ్ఞయశో విభూషణం | 200-00 |
| అనుపాన రత్నకరము | 200-00 |
| కాలామృతము | 250-00 |
| దైవజ్ఞకర్ణామృతము | 300-00 |
| రసేంద్ర చింతామణి | 300-00 |
| రసరత్న సముచ్ఛయం | 300-00 |
| వస్తుగుణరత్నాకరము | 300-00 |
| హోరానుభవదర్పణము | 360-00 |
| విశ్వకర్మ ప్రకాశిక వాస్తుశాస్త్రము | 250-00 |
| స్త్రీజన కల్పవల్లి | 450-00 |
| సంగీత సర్వార్థ సంగ్రహం | 300-00 |
| సంగీత సుధాసంగ్రహము | 250-00 |
| అర్క ప్రకాశము | 200-00 |
| సంగీత మార్తాండము | 200-00 |
| సంగీత ప్రధమబోధిని | 200-00 |

| | |
|---|---|
| వైద్యకల్పతరువు | 200-00 |
| రసప్రదీపిక | 250-00 |
| గణకానందము | 250-00 |
| శ్రీ లలితాసహస్రనామావళిః-వివరణాత్మక భావంతో | 200-00 |
| నవచండీ వేదోక్త శ్రీ దేవీ పూజాకల్పం | 200-00 |
| శ్రీ గాయత్రీ అనుష్ఠాన తత్త్వప్రకాశిక | 360-00 |
| సంగీతమార్తాండము | 250-00 |
| సారావళి | 360-00 |
| భేషజకల్పము | 200-00 |
| గురుశిష్య ఆయుర్వేద వైద్యచింతామణి | 360-00 |
| జాతకమణి | 200-00 |
| సర్వశకున ప్రకాశిక | 200-00 |
| యాజుష ప్రయోగ చంద్రిక | 250-00 |
| శిక్షావల్లీ-ఆనందవల్లీ-భృగువల్లీ | 300-00 |
| వసంతరాజ శకునము | 250-00 |
| తొట్టి వైద్యం | 450-00 |
| జ్యోతిష సిద్ధాంత సంగ్రహము (పంచాంగ గణితం) | 300-00 |
| సహస్ర యోగప్రకాశిక | 300-00 |
| శ్రీవిద్యారహస్యం | 290-00 |
| మహర్షుల చరిత్ర 1,3 300+300 | |
| వేంకట సోమయాజీయం అను ధర్మశాస్త్రకాండము | 250-00 |
| శ్రీఆంజనేయం | 216-00 |
| రాశితుల్యవత్సర ఫలితం | 200-00 |
| నాడి జ్యోతిష విశ్లేషణ | 400-00 |
| రహస్యకుక్కుటశస్త్రం | 300-00 |
| స్త్రీ ధర్మరత్న బాండాగారము | 200-00 |
| శైవోత్సవరత్నాకరం | 300-00 |
| యాజుషప్రయోగ చిన్తామణి | 300-00 |
| సుస్వర ఋగ్వేద ప్రయోగదర్శిని | 300-00 |
| ఆయుర్వేద వైద్య సంగ్రహం | 300-00 |
| వశిష్ఠ సంహిత | 360-00 |
| హోమియోపతి గృహవైద్యం | 200-00 |
| వ్రతచూడామణి | 300-00 |
| వైశ్యధర్మప్రకాశిక | 300-00 |
| ఆలయ నిత్యార్చన పద్ధతి | 200-00 |
| స్మృతిముక్తాఫలం | 300-00 |
| ఆపస్థంబయల్లాజీయమ్ | 300-00 |
| జ్యోతిషశాస్త్రసంగ్రహము | 200-00 |
| కర్మవిపాకాఖ్యయం | 360-00 |
| ముహుర్త రత్నావళి | 250-00 |
| సుదివిలోచనం | 300-00 |
| ఉత్తర కాలామృతం | 200-00 |
| సర్వవిషయ సర్వస్వసంగ్రహం | 200-00 |

అరుదైన పాత పంచాంగములు, వ్రతకథలు,
పురాణములు,ఆరాధన గ్రంథములు,
సుప్రభాతములు,మహాత్మ్యములు, సహస్రనామములు,
పూజావిధానములు, స్తోత్రాలు, ప్రామాణిక గ్రంథములు,
కథలు, జ్యోతిష, వాస్తు, వైద్య, మంత్రశాస్త్రాది ఆధ్యాత్మిక
గ్రంథములకు

# మోహన్ పబ్లికేషన్స్

ఆధ్యాత్మిక గ్రంథనిలయం

**కోటగుమ్మం, అజంతా హోటల్ ఎదుట,**
**రాజమహేంద్రవరం.**

**www.mohanpublications.com**

**From :** ☎ : 0883-246 25 65

# MOHAN PUBLICATIONS

**Fort Gate, Opp : Ajanta Hotel**
**Rajahmundry-533 101 (a.p.)**

mohan
PUBLICATIONS
ఆధ్యాత్మిక గ్రంథనిలయం

ఉచిత Pdf బుక్స్ కై : - www.granthanidhi.blogspot.in

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, ఆయుర్వేద,
మంత్రశాస్త్రాది అనేక విషయాలు
తెలుసుకోండి... ఫేస్‌బుక్
**MOHAN PUBLICATIONS**
పేజ్ లైక్ చేయండి.

grantha nidhi
THE TREASURE OF PAGES
FIRSTEVER TELUGU FREE E-BOOKS DOWNLOADING WEB PORTAL
www.granthanidhi.com

Kinige.com
మా ఇ-బుక్స్ కినిగె ద్వారా కొనుగోలు
చేసుకొన వచ్చును.

dailyhunt
మా ఇ-బుక్స్ డైలీహంట్ ద్వారా
అత్యధిక డిస్కౌంట్ ఆఫర్‌లో లభించును.